జె.యం.జె. మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), తెనాలి.

గుంటూరు జిల్లా - 522 201. ఆంధ్రప్రదేశ్.

Recredited by NAAC with $B^{++}$ (2.90)

## భావవీణ ప్రత్యేక సంచిక

# జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా॥ రావూరి భరద్వాజ సాహిత్యం - సామాజిక స్పృహ

## జాతీయ సదస్సు

(4-5 జనవరి 2019)

International Journal of Telugu Literary, Culture & Language Studies

Vol. 17 - Issue. 01 - Spl. Edition - Monthly - Jan 2019 - ISSN No. : 2456-4702



నిర్వహణ :

తెలుగు విభాగం

జె.యం.జె. మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), తెనాలి.

&

తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం,

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

**International Journal of Telugu Literary, Culture & Language Study**

(అంతర్జాతీయ తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 17 - Issue. 01 - Spl. Edition - Monthly - Jan 2019 - ISSN No. : 2456-4702**



**EDITORIAL BOARD**

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.
7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.
8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Dr. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

**LEGAL ADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**COVER PAGE & PAGE SETTING**

**TENALI PRAKASH**, G.L.S. ENTERPRISES, Guntur. 9494 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar,
Guntur - 522 002. Ph. 9703301698.

# జె.యం.జె. మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి)
# తెనాలి.



## జాతీయ సదస్సు

అంశం :

**జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా॥ రావూరి భరద్వాజ సాహిత్యం – సామాజిక స్పృహ**

**తేది : 4 – 5 జనవరి 2019**

నిర్వహణ :

తెలుగు విభాగం

**జె.యం.జె. మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), తెనాలి.**

**&**

తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం,

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

# జ్ఞానపీఠ పురస్కార గ్రహీత
# డా॥ రావూరి భరద్వాజ సాహిత్యం – సామాజిక స్పృహ


**భావవీణ** ప్రత్యేక సంచిక

**ISSN No. : 2456-4702**

**RNI No. APTEL/2003/12253**

**UGC Approved Journal No. 42500**

| | | |
|---|---|---|
| ప్రథమ ముద్రణ | : | **04 జనవరి 2019** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 300/– (మూడు వందల రూపాయలు)** |
| కాపీలకు | : | **ప్రిన్సిపాల్, జె.యం.జె. మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), తెనాలి.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు – సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **హోలీ హౌస్ అపార్ట్‌మెంట్స్<br>పోస్టల్ కాలనీ, 4వ లైను,<br>గుంటూరు – 522 002.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్<br>జి.యల్.ఎస్. ఎంటర్‌ప్రైజస్, గుంటూరు.**<br>సెల్ : 9494 660 509. |

# జ్ఞానపీఠ పురస్కార గ్రహీత

# డా॥ రావూరి భరద్వాజ సాహిత్యం - సామాజిక స్పృహ

## జాతీయ సదస్సు - ప్రత్యేక సంచిక

### సంపాదక మండలి

| | | |
|---|---|---|
| ప్రధాన పోషకులు | : | **డా॥ సిస్టర్ థెరిసా**<br>కండ్లకుంట ప్రొవెన్షియల్ సుపీరియర్ - గుంటూరు ప్రొవెన్షియలేట్ |
| ప్రధాన కార్య నిర్వాహకులు | : | **డా॥ సిస్టర్ థెరిసమ్మ గాదె**<br>కరస్పాండెంట్, జె.యం.జె. మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), తెనాలి. |
| కళాశాల ప్రాచార్యులు | : | **డా॥ సిస్టర్ షైనీ కె.పి.**<br>జె.యం.జె. మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), తెనాలి. |
| కళాశాల ఉప ప్రాచార్యులు | : | **సిస్టర్ అమూల్ మేరి**<br>జె.యం.జె. మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), తెనాలి. |
| గౌరవ సలహాదారు | : | **ఆచార్య యన్. వి. కృష్ణారావు**<br>తెలుగు మరియు ప్రాచ్య విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు. |
| సదస్సు సంచాలకులు | : | **బి. మేరి కుమారి**<br>తెలుగు శాఖాధ్యక్షులు, జె.యం.జె. మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), తెనాలి. |
| సదస్సు కార్యదర్శి | : | **శ్రీమతి దాసరి విజయలక్ష్మి**<br>ఆంధ్రోపన్యాసకులు, జె.యం.జె. మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), తెనాలి. |
| సదస్సు కోశాధికారి | : | **యస్. సరళాదేవి** |
| నిర్వహణ కమిటి | : | **1. డి. ధనలక్ష్మి**<br>**2. ఎ. శిరీష** |

# ముందుమాట

సాహిత్యం అనే పదానికి 'సహితస్య భావం సాహిత్యమ్' హితేన సహిత్యం సాహిత్యమ్ అనే నిర్వచనాలున్నాయి. హితముతో కూడుకున్నది సాహిత్యమని అర్థం. సాహిత్యము సమాజానికి మేలు చేసేది, మనుష్యులను సన్మార్గంలో నడిపించేది. మానవీయ విలువలను నేర్పించేది సాహిత్యము. ఆయా కాలాల్లో పుట్టిన సాహిత్యం నాటి సంఘంలోని పరిస్థితుల కనుగుణంగా వెలువడినది.

తెలుగురచనా ప్రపంచంలో వినూత్న సాహిత్య ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనుడు భరద్వాజ. ఆయన స్పృశించని సాహిత్యం లేదు. సాహిత్యములోని విశిష్ట పురస్కారమైన జ్ఞానపీఠపురస్కారాన్ని అందుకున్న తెలుగు త్రిమూర్తులలో ఒకరు రావూరి. ఆడంబరాలు లేని సాధారణ జీవితం ఆయనిది. భరద్వాజకు దిగువ మధ్య తరగతి మరియు పేద ప్రజల భాషపై గట్టి పట్టు ఉంది. ఆ అనుభవాలను తన రచనలో ఉపయోగించి నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించాడు. భరద్వాజ సాహిత్యాన్ని కూలంకషంగా విశ్లేషించి సవివరణాత్మకంగదా విద్యార్థులకు తెలియజేయాలనేది సదస్సు లక్ష్యం. ఈ సదస్సు విజయ వంతం కావటానికి తమ అమూల్యమైన వ్యాసాలను పంపిన ఆచార్యులకు, అధ్యాపకులకు పరిశోధక విద్యార్థులకు పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

**సంచాలకులు**

# సందేశాలు




ప్రొఫెసర్ ఎ. రాజేంద్ర ప్రసాద్

**వైస్ ఛాన్స్‌లర్**

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,**

**గుంటూరు.**



NAAC 'A' GRADE

**ACHARYA NAGARJUNA UNIVERSITY**

PROF. A RAJENDRA PRASAD
M.Sc., Ph.D.
VICE-CHANCELLOR

Nagarjuna Nagar
Guntur - 522 510, A.P., India


తెనాలి జె.యం.జె. మహిళా కళాశాలలో 2019 జనవరి 4, 5 తేదీలలో **'జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా॥ రావూరి భరద్వాజ సాహిత్యం – సామాజిక స్పృహ"** అనే అంశంపై జాతీయ సదస్సు జరుగుచున్నందుకు చాలా సంతోషం. ప్రస్తుతం విద్యా సంస్థలలో ఇటువంటి జాతీయ సదస్సుల అవసరం ఎంతైనా ఉంది. ఈ ప్రయత్నం ద్వారా విద్యార్థులకు సామాజిక స్పృహ పట్ల చక్కని అవగాహన కల్పించవచ్చు. ఈ సదస్సు వల్ల అధ్యాపకులు ఒకరి అభిప్రాయాలను, మరొకరు పంచుకోవటంతో పాటు విద్యార్థులకు వివిధ విషయాల పైన ఆసక్తి పెరిగే అవకాశం ఉంది. జె.యం.జె. మహిళా కళాశాల వారి రెండు రోజుల జాతీయ సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ సందర్భములో కళాశాల యాజమాన్యం వారిని, ప్రత్యేకించి తెలుగు శాఖను అభినందిస్తున్నాను.

(ఆచార్య ఎ. రాజేంద్ర ప్రసాద్)



డా॥ సిస్టర్ థెరిసమ్మ గాదె
**కరస్పాండెంట్**
**జె.యం.జె. మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి),**
**తెనాలి.**

## శుభ సందేశం

ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగం ఎంతగా అభివృద్ధి చెందుతుందో మానవ జీవితం అంతగా అదఃపాతాళానికి దిగజారిపోయిందని చెప్పవచ్చు. గమ్యం లేని పరుగులతో, హృదయం లేని ఉరుకులతో మానవ సంబంధాలు వదిలి, ఆర్థిక సంబంధాల చీకటి కుహరంలో కొట్టుమిట్టాడుతున్న మనిషి యొక్క జీవనంలో సాహిత్యపు చిరుదీపం ద్వారా వెలుగు రేఖలు అందించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ రావూరి భరద్వాజ గారు.

"చిన్నతనంలో లేమికారణంగానే నేను చదువుకోలేక పోయాననే భావం, నా ప్రతీ రక్త కణాన్ని ఎంత సంక్షోభానికి గురిచేసిందో నాకు తెలుసు. లేమి కారణంగా ఎవ్వరూ చదువుకోకుండా వుండరాదనేది నా నిశ్చితాభిప్రాయం, అదే నా జీవితేచ్ఛ". అని తన వ్యక్తిత్వాన్ని ప్రకటించుకున్న రావూరి భరధ్వాజ, అట్టడుగు మనుష్యుల ఇతి బాధల్ని కథలుగా అల్లి ఒక ఉద్యమంలా తీసుకువచ్చారు. తన రచనల ద్వారా పుట్టెడు దుఃఖములో మునిగిపోయిన వారి జీవితాలలో ఒక్కింత సంతోషాన్ని నింపచడానికి పూనుకున్నారు. అందుకే సాహిత్యరంగంలో ఏదిరాసినా.... ఏదిచేసినా 'రావూరి వారిది-రతనాల వారధి,' అంటూ సాహిత్య విమర్శకులు పేర్కొంటారు. అటువంటి వారధిని నిర్మించారు కాబట్టే రావూరికి జ్ఞానపీఠ్ అవార్డు వెతుక్కుంటూ వచ్చింది.

తెలుగు సాహిత్యంలో విభిన్న ప్రక్రియలతో, భిన్న రచనలు చేసిన మహా రచయిత రావూరి భరద్వాజ. వీరి సాహిత్యంపై మన జె.యం.జె మహిళా కళాశాల తెలుగు విభాగం వారు, జాతీయ సదస్సును నిర్వహించ డానికి పూనుకోవటమనేది సంతోషదాయకం. ఒక మహోన్నత వ్యక్తిత్వంగల, వ్యక్తిపై, వారి కథలు, నవలలు, బాలస్మృతి, బాలవిజ్ఞానసాహిత్యాలు, తదితర అంశాలపై సదస్సును నిర్వహించటమనేది నేటి యువతకు, సాహిత్యాభిలాషులకు, విద్యావేత్తలకు,స్ఫూర్తిదాయకం. ఇంతటి మహత్తర అవకాశాన్ని అందిపుచ్చుకుని ఈ సదస్సును నిర్వహిస్తున్న, మన జె.యం.జె మహిళా కళాశాల ప్రధానాచార్యులకు, అలాగే తెలుగు విభాగం అధ్యాపకులకు నా హృదయపూర్వక శుభాభినందనలు... శుభాశిస్సులు...

Sr. G. Theresamma
**CORRESPONDENT**
**J.M.J. COLLEGE FOR WOMEN**
**TENALI**



డా॥ సిస్టర్ షైని కె.పి.
**కళాశాల ప్రాచార్యులు**
**జె.యం.జె. మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి),**
**తెనాలి.**

## శుభాభినందనలు

మన జె.యం.జె. మహిళా కళాశాల, తెనాలి తెలుగుశాఖ వారు,భారతీయ సాహిత్య రంగంలోనే అత్యున్నత పురస్కారమైన జ్ఞానపీఠ అవార్డును సొంతం చేసుకున్న తెలుగు సాహితీ మూర్తులలో ఒకరైన **"డా॥ రావూరి భరద్వాజ గారి సాహిత్యం - సామాజిక స్పృహ"** అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు చాలా అభినందనీయమైనది. రావూరి భరద్వాజ గారు సామాజిక పరిస్థితులకు వాస్తవ రూపాన్నిస్తూ, మానవ వ్యక్తిత్వాలను సమున్నతంగా తీర్చిదిద్దే ప్రయత్నాన్ని బలంగా చేసిన అక్షర సేద్యగాడు.

పేదరికంలో పుట్టి చిన్నతనం నుండే ఎన్నో అష్టకష్టాలకోర్చిన భరద్వాజ నిజాయతీతో కూడిన అభ్యుదయవాది. చిన్న వయసునుండే రచనా వ్యాసాంగ మార్గాన పయనిస్తూ, మానవీయ బంధాలను, సంబంధాలను అనునిత్యం పరిశీలించిన స్వీయ అభ్యాసకుడు. తన జీవితంలో అనునిత్యం యెదురైన అనేకానేక పరిస్థితులను, అనుభవాలను, పుస్తకాల కళ్ళజోడుతోగాక అనుభవ నేపథ్యంతో గ్రహించి, లోకమనే విశ్వవిద్యాలయంలో తాను గ్రహించిన విషయాలనే సాహిత్య వస్తువుగా స్వీకరించి వాటికి అద్భుతమైన మానవీయ కోణాన్ని జోడించి రచనలు చేసిన సహజ కవి రావూరి భరద్వాజ. వీరి సాహితీ సేద్యానికి లభించిన విశిష్ఠ పురస్కారమే ఈ జ్ఞానపీఠ.

రావూరి భరద్వాజ రచనల్లో మానవత్వం, సామాజిక చైతన్యం వెల్లివిరుస్తుంది. ఈయన 1927 జూలై 5 వ తేదీన హైదరాబాద్ సంస్థానంలోని పరిటాల జాగీరుకి చెందిన మొగలూరు

అనే అతి చిన్న పల్లెటూరులో జన్మించి, తల్లిదండ్రుల వద్ద వుండి కేవలం 7,8 తరగతుల వరకే చదువుకొని, అక్కడనుండి చదువుకు స్వస్తిచెప్పి, ఈ జీవన సమరంలో రోజువారీ కూలీగా, కుమ్మరిగా, వడ్రంగిగా, రంపం లాగే కుర్రోడిలా, హోటల్ సర్వర్‌లా, పేపర్ బాయ్‌లా, అనేక ఆటుపోట్లను చవిచూసిన అపర అనుభవజ్ఞుడు రావూరి. సకల కళలకు నెలవైన మన తెనాలిలోనే తన బాల్యాన్నంతా గడపడం, ఈ ప్రాంతంనుండే తన సాహిత్య వ్యాసాంగాన్ని ప్రారంభించి, తెలుగు సాహిత్యకీర్తిని దశదిశలా ప్రసరింపజేయటమనేది యెంతో ముదావహం. ఈ అద్భుతమైన ఘట్టం మన ప్రాంత వాసులకే కాక యావత్ తెలుగు నేలకు గర్వకారణం. అంతటి ఘన కీర్తిని సాధించించిన సాహితీసూర్యుడే ఈ భరద్వాజుడు.

అటువంటి మహోన్నత సాహితీ శిఖరమైన రావూరి భరద్వాజ యొక్క సాహిత్యాన్ని, అందులోని సామాజిక స్పృహను, పండితులు మొదలు పామరుల వరకూ చేరువ చేసేందుకు ఈ రెండురోజుల జాతీయ సదస్సు చక్కగా ఉపకరిస్తుందని నా ప్రగాఢ విశ్వాసం. జాతీయ సదస్సు నిర్వహణకు ఇంతటి మహోన్నత వ్యక్తిత్వమున్న సాహిత్యకారుని జీవితాన్ని స్వీకరించి, వారి రచనల్లోని సామాజిక మానవీయ కోణాల విశ్లేషణల ద్వారా,మరియు విస్తృతమైన చర్చ ద్వారా సామాజిక ప్రయోజనం మరింత చేకూరగలదని భావిస్తూ, ఈ అంశాన్ని సదస్సుకు స్వీకరించటమే కాక, చక్కగా నిర్వహించిన మా కళాశాల తెలుగు విభాగపు అధ్యాపక బృందానికి నా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను.......

Principal
J.M.J. COLLEGE FOR WOMEN (Autonomous)
TENALI - 522 202




సిస్టర్ అమూల్ మేరి

**కళాశాల ఉప ప్రాచార్యులు**

**జె.యం.జె. మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి),**

**తెనాలి.**


## అభినందనలు

గత చరిత్ర, వర్తమానానికే కాక భవిష్యత్తుకూ ఒక ప్రేరణ. అలాంటి ప్రేరణను అనునిత్యం కలిగిస్తూ ఈ సమాజాన్ని ఉన్నచోటునుండి ఉన్నతమైన చోటుకి నడిపించే ఒక అద్భుతమైన ప్రక్రియ సాహిత్య ప్రక్రియ. మంచి సాహిత్యం సమాజాన్ని నిరంతరం ప్రేరేపిస్తుంది. అలాంటి ప్రేరణను కలిగించే సాహిత్యాన్ని, సాహిత్య కారులను స్మరించుకోవటమనేది నేటి సమాజానికి చాలా అవసరం. అటువంటి సాహిత్యకారుల్లో డాక్టర్ రావూరి భరద్వాజ ఒకరు. వీరి రచనల్లోని కలానికున్న బలం, బీడువారిన మానవ మెదళ్ళను దున్నే బలమైన నాగలి కర్రుకున్నట్టి పదునైనతత్వం, అదే మానవత్వం.

రావూరి భరద్వాజ రచనలు అధిక భాగం సామాన్య మానవుని, సాంఘీక జీవన చిత్రాన్ని పెనవేసుకుని కొనసాగేవిగానే కనిపిస్తాయి. అందుకు కారణం భరద్వాజ బాల్యం నుండి పెరిగిన నేపథ్యమే. యే రచయితకైనా ఒక రచన ప్రారంభించేటప్పుడు, సమాజంలో అతనికి వుండే సంబంధం, సగటు వ్యక్తిగానే తప్ప ప్రత్యేకంగా ఏమీ వుండదు. కాకపోతే అతనిచే సృష్టించబడే సాహిత్యం ద్వారానే ఆ రచయితకు ఈ సమాజంలో ప్రత్యేక మైన విశిష్టత అనేది లభిస్తుంది. అటువంటి విశిష్టత సాధించిన అతికొద్దిమంది (ముగ్గురిలో) తెలుగు సాహిత్యకారులలో రావూరి భరద్వాజ ఒకరు.

రావూరి భరద్వాజ తన సాహిత్యంలో సహజత్వం ఉట్టిపడేట్టు రచనలు చేసే ఒక సహజకవి. “రచనల్లో కేవలం వాస్తవాన్ని అందించడం వేరు, సామాజిక దృక్పథంతో కూడిన వాస్తవ చిత్రీకరణ చేయడడం వేరు. అయితే నవలలో సామాజిక దృక్పథంతో కూడిన వాస్తవ చిత్రీకరణ జరగాలంటే ఆ రచయితకు భౌతికవాదం, వర్గ చైతన్యం, వర్గదృక్పధాలతో పాటు,వాటితో పరిచయం కూడా అవసరం. వీటన్నిటితో పరిచయమున్న రచయిత రచనల్లో సామాజిక చైతన్యం మరింత స్పష్టంగా, మరింత బలంగా వుంటుంది.” అని సొదుం రామ్మోహన్ గారు అన్నట్లు రావూరి భరధ్వాజ రచనలలో వర్గదృక్పధం, వర్గచైతన్యం, భౌతికవాద ధోరణి కూడిన లక్షణాలు చాలా స్పష్టంగా కనిపిస్తాయి. సామాన్య జీవితాలకు పట్టంకడుతూ అధ్భుతమైన సాహిత్యాన్ని సృజించిన రావూరి అనేకానేక రచనల్లో ఒకటైన పాకుడురాళ్ళు కు జ్ఞానపీఠ్ పురస్కారం లభించటమనేది, ‘సహితస్యభావం సాహిత్యం’ అనే ఆర్యోక్తికి పట్టాభిషేకం జరగటమే. ఇంతటి మహోన్నత విలువలున్న సాహితీ సృజన చేసిన డాక్టర్ రావూరి భరధ్వాజ గారి సమగ్ర సాహిత్యం పై మన కళాశాలలో రెండు రోజుల జాతీయ సదుస్సు నిర్వహించటమనేది చాలా ఆనందదాయకం, అభినందనీయం. మన కళాశాల తెలుగు విభాగపు అధ్యాపక బృందానికి నా ప్రత్యేక అభినందనలు ..... ఆశీస్సులు.......

## Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | అనంత భావాల లోగిలి భరద్వాజ సాహిత్యం | – రావెల సాంబశివరావు | 15 |
| 2. | ఖగోళ శాస్త్ర వాస్తవాలు – వినువీధిలో వింతలు | – ఆచార్య ఎన్.వి. కృష్ణారావు | 20 |
| 3. | రావూరి భరద్వాజ ఒక చీమ కథ – సామాజిక చైతన్యం | – వేముల హర్షిత | 21 |
| 4. | పాకుడురాళ్లు నవల్లోని స్త్రీ పాత్రలు దోపిడీకి ప్రతిరూపాలు | – బి. మేరికుమారి | 27 |
| 5. | "కరుణ రస ప్లావితం జీవన సమరం" | – ఆచార్య గోగినేని యోగ ప్రభావతీ దేవి | 29 |
| 6. | రావూరి భరద్వాజ సాహిత్యము – సామాజిక స్పృహ | – పి. యామినీ అమ్మాజీ | 31 |
| 7. | జీవన సమరం | – డా॥ చిలక అనిత | 35 |
| 8. | కాదంబరి నవల – సామాజిక స్పృహ | – ఆవుల బాలస్వామి | 38 |
| 9. | పాకుడు రాళ్లు నవల ఒక విశ్లేషణ | – బండారి ప్రేమ్‌కుమార్ | 41 |
| 10. | పాకుడు రాళ్ళు–సామాజిక స్పృహ | – డా॥ వాసిరెడ్డి భవాని | 45 |
| 11. | భరద్వాజ స్మృతి సాహిత్యం | – డా॥ బూసి వెంకటస్వామి | 49 |
| 12. | రావూరి భరద్వాజ్ గారి కథా సాహిత్యం – సామాజిక స్పృహ | – మాధవి బొల్లు | 53 |
| 13. | చీమ తల్లి విశ్వాసం | – వై. బుజ్జి | 56 |
| 14. | రంగుల వలయంలో – నింగికెగిరిన "మంజరి" | – డా॥ సి.హెచ్. విజయకుమార్ | 60 |
| 15. | బడుగుజీవుల బ్రతుకుపోరు – సామాజిక స్పృహ | – డా॥. డి. సత్యలత | 63 |
| 16. | రావూరి భరద్వాజ 'ధన్యవాదాలు' – సామాజికాంశాల పరిశీలన | – డా॥ గోనిపాటి ధర్మారావు | 67 |
| 17. | అక్షరాన్ని నమ్ముకొని బ్రతికానన్న 'రావూరి భరద్వాజ' గారి రెండు నవలల పరిచయం | – డాక్టర్ గుంటుపల్లి గౌరి | 71 |
| 18. | జీవన సమరం –సామాజిక దర్పణం పరిశోధనా దక్షత | – డా॥ మన్నెమోని కృష్ణయ్య | 77 |
| 19. | డా॥ రావూరి వారి "జీవన సమరం"లో వ్యధార్త జీవుల యధార్థ గాధలు | – డా॥ చుక్కా యశోద | 80 |
| 20. | రావూరి భరద్వాజ రచనా శిల్పం – పరిశీలన | – ఇ. అనిల్ కుమార్ | 83 |
| 21. | రావూరి భరద్వాజ కథా సాహిత్యం – పరిశీలన | – డా॥ ఇ. వాసు | 86 |
| 22. | వాస్తవ పరిస్థితుల చిత్రీకరణ – "కాదంబరి" | – డా॥ ఇరపని మాధవి | 89 |
| 23. | డా ॥ రావూరి భరద్వాజ 'జీవన సమరం'–ఒక పరిశీలన | – డా॥ కసుకుర్తి ఈశ్వరమ్మ | 93 |
| 24. | రావూరి భరధ్వాజ గారి "తారతమ్యం" లో స్త్రీ సామాజిక స్పృహ | – జి.యం. మల్లీశ్వరి | 96 |
| 25. | చిరువృత్తుల జీవనగాథల సమాహారం 'జీవనసమరం' | – డా. ప్రకాశరావు జి | 98 |
| 26. | పలుపార్శ్వాల అంతరంగ విశ్లేషణ– 'కాదంబరి' | – డా॥ గొట్టిముక్కల స్వర్ణలత | 101 |
| 27. | రావూరి భరద్వాజ నవలా సాహిత్యం – "పాకుడురాళ్ళు" | – పి. హంసమ్మ | 105 |
| 28. | 'రావూరి' అంతరంగ మథనం – 'ప్రాస' కథ | – రమేష్ దాసరి & – కె. బలరామ్ | 106 |

**29.** డా॥ రావూరి భరద్వాజ గారి కాదంబరి నవలలో రామకృష్ణ గారి కార్యదీక్ష – కడియం అజుబా మమతకుమారి **108**
**30.** రావూరి భరద్వాజ నవలలు – పరిశీలన – కడకుంట్ల లత **111**
**31.** పాకుడురాళ్ళు నవల – స్త్రీ పాత్రచిత్రణ – కత్తి శ్రావణి **113**
**32.** రావూరి భరద్వాజ స్త్రీ పాత్ర చిత్రణ – పరిశీలన – కోలూరి నాగరాజు **116**
**33.** రావూరి వారి కథల్లో పాత్ర చిత్రణ – బి.శ్రీ.లవ. పద్మశ్రీ **119**
**34.** కథానిక సాహిత్యం వాస్తవికత డా॥ రావూరి భరద్వాజ – డా॥ బి.వి. లీలారాణి **123**
**35.** జిలుగు వెలుగుల మాటున దాగిన నీడలు – పాకుడురాళ్ళు – డా॥ నల్లపనేని విజయలక్ష్మి **126**
**36.** రావూరి భరధ్వాజ సాహిత్యం – వ్యాసాలు – ఒక పరిశీలన – డా॥ అల్లంశెట్టి నాగజ్యోతి **130**
**37.** మరుగు పడిన మానవత – డా॥ పి. నీరజ **133**
**38.** రావూరి భరద్వాజ సౌందర్యనందం – రచన వైశిష్ట్యం – పేరం అమృతరావు **134**
**39.** కాదంబరి – డా॥ శ్రీపాద సీతామహాలక్ష్మి సత్యవతీ పేరమాంబ **137**
**40.** డా॥ రావూరి భరద్వాజ – కథా సాహిత్యం – జీవన సమరం – సామాజిక స్పృహ – పోతురాజు దుర్గాదేవి **142**
**41.** రావూరి భరధ్వాజ గారి "పాకుడురాళ్ళు" – మహిళా సామాజిక స్పృహ – కె. పుణ్యవతి **146**
**42.** సాహితీ ఋషీవలుడు భరద్వాజ – డా॥ రెంటపల్లి. రవీంద్రభాస్ **149**
**43.** డా॥ రావూరి భరద్వాజ పాకుడురాళ్ళు నవలలోని – స్త్రీ పాత్ర చిత్రణ – రావి శ్రీనివాసులు రెడ్డి **153**
**44.** జీవన పోరాట జీవితాల్ని చిత్రించిన రావూరి 'జీవన సమరం' – డా. జడా సుబ్బారావు **158**
**45.** రావూరి కాదంబరి – సామాజిక కోణం – డా. కె. సుజాత **162**
**46.** వ్యథార్థ జీవుల యధార్ధ గాధలు – జీవన సమరం – సుంకర గోపాలయ్య **166**
**47.** కాదేది శిల్పికనర్హం – సువ్వాద ఝాన్సీలక్ష్మి బాయి **168**
**48.** రావూరి భరద్వాజ సాహిత్య కథలు – పరిశీలన – జె. తిరుపతి **171**
**49.** పాకుడు రాళ్ళు (నవల) – పరిశీలన – డా. వి. శ్రీదేవి **174**
**50.** రావూరి భరద్వాజ గారు – రచన సాహిత్యం – యం. ఆరోగ్యమేరి **178**
**51.** పిరికివాడు కథానిక – ఇతివృత్త పరిశీలనం – డా॥ జి.బి.ఆనంద కుమార్ **180**
**52.** "బీడువారిన మెదళ్ళను దున్నే నాగలి – రావూరి భరద్వాజ సాహిత్యం" – దాసరి విజయలక్ష్మి **183**
**53.** రావూరి 'జీవన సమరం' X 'పాకుడు రాళ్ళు' = స్థిర వ్యక్తిత్వం – డా. జె. సీతాపతి రావు **190**
**54.** నేలమీద ఎదురీత – సురేంద్ర సాడి **195**
**55.** డా॥ రావూరి భరధ్వాజ – జీవన సమరం – సోనబోయిన సతీష్ **198**
**56.** రావూరి భరధ్వాజ గారి "జీవనసమరం" – శ్రామిక జీవన స్పృహ – డా॥ యం. విజయశ్రీ **201**
**57.** "సామాజిక చైతన్య ప్రబోదం–రావూరి భరద్వాజ సాహిత్యం" – దాసరి శారద **204**
**58.** సమున్నత సాహితీ శిఖరం–జ్ఞానపీఠ్ రావూరి భరద్వాజ – డా॥ పెందుర్తి మేరిపద్మలత **208**
**59.** 'లోకం కోసం' సాహితీ సేద్యం చేసిన – 'జ్ఞానపీఠ్' రావూరి భరద్వాజ – పిల్లి వాసు **212**
**60.** రావూరి భరద్వాజగారి చిన్నకథలలో – పేదరికం – తూమాటి ఇస్మాయేల్ **217**

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# అనంత భావాల లోగిలి భరద్వాజ సాహిత్యం

- రావెల సాంబశివరావు
పూర్వ రిజిస్ట్రారు,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

కవులతో, పండితులతో, ఉత్తమ ఉపాధ్యాయులతో, జిజ్ఞాసాపరులతో, సాహితీ ప్రియులతో నిండిన ఈ సభకు ముందుగా నమస్కారం.

తెలుగు లెంకతుమ్మల అంటారు –

**"కృతి రచియించు లోక హితమెంచి కవి మౌళి;**
**తెచ్చి బుధుడు చాటు దాని సొగసు;**
**మాను విరిని గాంచు, మారుత మద్దాని**
**వలపునెల్ల దెసల నలము కొల్పు"**

అయితే నేను బుధుణ్ణి అని చెప్పుకునేంత విరగబాటు నావద్ద లేదు. ఇక్కడ బుధులు మీరని చెప్పటమే నా ఉద్దేశం.

కవికంటే విమర్శకుని పాత్ర రసపూరితం. ఇక్కడికి దగ్గర్లోనే తుమ్మపూడి అనే గ్రామం వుంది. ఆ గ్రామాన్ని సంస్కృతీ పరంగా విశ్వపటానికి అతికించిన మహానుభావుడు – సంజీవదేవ్ ఉండేవారు. ఆయన ఏమన్నారంటే కవితండ్రి వంటివాడు; విమర్శకుడు అతనికి అల్లుని వంటివాడు అని అష్టకష్టాలు పడి తల్లిదండ్రులు కనిపెంచి పెద్ద జేస్తే అనుభవ మంతదా అల్లునిది. ఈ చమత్కారాకేమీగాని కవిప్రతిభ కలదే. అయితే సద్విమర్శకుని పాత్రను తక్కువగా అంచానా వేసేందుకు లేదు అని చెప్పటమే వారి ఉద్దేశ్యమైనా, నా ఉద్దేశ్యమైనా ఇక్కడ పత్ర సమర్పకులు వక్తల రూపంలో పలువురు ఉన్నారు. ఎవరిపేరిట అయితే మన విశ్వవిద్యాలయం నెలకొల్పబడిందో ఆ ఆచార్య నాగార్జునుడు వక్తల్ని మూడు రకాలుగా వర్గీకరించారు:

**"మధురముగ మంచి బోధించు మాన్యుడొకరు**
**నిజము సూటిగ పల్కు పునీతుడొకరు**
**కల్లలను బెల్లమనిపించు కపటి ఒకరు**
**కలరు వక్తలు మూడు వర్గాలవారు"**

అంటూ ఆచార్య నాగార్జునుని పలుకులను ఆంధ్రీకరించారు గజ్జెల మల్లారెడ్డి గారు. కనుక మనలోని ఎవ్వరం మూడో వర్గం కాపు కాయకుండ మొదటి రెండు వర్గాకే పరిమితమవుదాం. అందులో డా॥ రావూరి భరద్వాజ వంటి నిష్కపటి విషయంలో కాపట్యానిక తావెక్కడిది? డా॥ సంజీవ దేవ్ ఒక సందర్భంలో ఇలా చెప్పారు:

"Man is not what he appears to be ......... no saint is completely free from sin while no sinner is stripped of all virtues.... The entire creation itself is a harmoneous blend of contrasts and conflicts, confirmations and contradictions dawns and dusks, living and dying .... This is a psychological variety not merely in fiction but in real life as well".

"మనకు కనిపించే మనిషి మాత్రమే మనిషికాదు... ఎంతటి మౌని అయినా అసలు ఏ పాపము ఎరుగని వాడని చెప్పజాలము. అలాగే పాపి అనే వానిలో ఇసుమంత సుగుణం ఉండదని చెప్పజాలం... అసలు ఈ సృష్టి అంతా తేడాల, ఘర్షణల, సమ్మతుల, అసమ్మతుల; సూర్యోదయాల, అస్తమయాల; జీవన్మరణాల సుందర సమన్వయం. ఈ రకపు మనో వైజ్ఞానిక వైవిధ్యాన్ని రచనల్లోనే కాదు నిజజీవితంలో కూడ చూడవచ్చు.

ఈ నిత్య జీవిత సత్యం భరద్వాజ జీవితానికి ఎంతగా అతికినట్లుగ ఉంటుందో మీరు మీ పత్రాలతో నిగ్గుదేల్చ గలరనే ఆశ నాకున్నది.

"..... నూతనాంశమేదో యొకతేనియున్ దెలుపనోపని గ్రంథ సమూహమేటికో" అంటారు తమ కవితా వ్యవసాయాంతో గట్టి గింజలు పండించి నూతనాంశములు రాశులు పోసిన ఈ పట్టణపు ఒకనాటి పురపాలక సంఘాధ్యక్షులు, కవిరాజు బిరుదాంకితులు త్రిపురనేని రామస్వామి గారు. భరద్వాజ ఎంతగా నూతనాంశముల రాశులు పోయకపోతే దాదాపు ఒక 190 పుస్తకాలు వెలు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

వరించగలిగేవారు? 500లకు పైగా కథలను సృజియించ గలిగేవారు? 19 నవలలో రచించ గలిగేవారు? 10 నాట కాలు వ్రాయగలిగేవారు? ఐదు డిటెక్టివ్ నవలలు, విజ్ఞాన శాస్త్ర అంశాలపై ఓ పది పుస్తకాలు, స్మృతి సాహిత్యంలో పంచమహా కావ్యాలు మనకు అందించగలిగే వారు? ఇలా ఆయన తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియల్ని చేపట్టి రాణించారు. మనం ఇవ్వాళ మాట్లాడుతున్నాం. చెత్త నుండి విత్తం అని, వ్యర్థం నుంచి అర్థం అని, ఆయన గత శతాబ్దం లోనే వాటిమీద పుస్తకాలు ప్రచురింపజేశారు. ఆయన తరంవేరు. చదువు ఎనిమిదవ తరగతివద్దే ఆగిపోయినా జ్ఞానపీఠం అధిరోహించాడు మాటలా మరి. ఏ మాటకా మాటే చెప్పుకోవాలి. మనకు నిత్యం ఎందరో దంభకవుల తారస పడతదారు.

**రసము నేనెరుగనా, ప్రారబ్దమిదియేమి**
**ద్రవిడ దేశాన్ని సత్రములు నిడరె?**
**సముచితాలంకార సమితినే నెఱుగనా**
**మగువలు ధరియించు నగలు గావె?**
**యతిని నేనెఱుగనా? క్షితిలోన గాషాయ**
**వస్త్రధారుడైన వాడు గాడె?**
**గురువు నే నెఱుగనా? సరిసరి యక్షరాభ్య**
**సనంబు సలిపిన యతడు గాడె?**

శబ్దమన నే నెఱుగనా? చప్పుడు గదె " అంటూ తదంభకవి మనకు ఎదురు పడతారు అనంతపంతుల రామ లింగస్వామి గారి శుక్లపక్షంలో. మరి ప్రతిభ యిలా పడి పోతున్న తరుణంలో మీవంటి సాహితీమూర్తులకు డా॥ రావూరి భరద్వాజ వంటివారు స్ఫూర్తిగా. నిలవవలసి వుంది. ఇలా ఎందుకంటున్నానంటే ఆయన ఎంత జటిల మైన విషయాన్నయినా అరటిపండు ఒలిచి అరచేతిలో పెట్టి నట్లుగ అందరికి అర్థమయ్యే భాషలో విడమర్చి చెబుతారు. అటువంటి ప్రతిభ నేడు సాహితీజగత్తు నందు, విద్యాబోధన యందు అత్యవసరం.

సినీరంగంలో సంబంధం పెట్టుకునే వారందరికీ పాకు దురాళ్లు నవల గొప్ప కనువిప్పే ఓనాటి రేడియో శ్రోతల్ని కవ్వించి నవ్వించింది ఈ బావగారే! రేడియో అన్నయ్య ఏడిదవారంతగా పిల్లలకు ముద్దుముద్దుగా ఆకాశవాణిలో సుద్దులు నేర్పిన పెద్దాయన భరద్వాజే. రెక్కాడితే గాని డొక్కా డని వాళ్ళ జీవితాలను ప్రప్రథమంగా పత్రికల్లోకి ఎక్కించిన ఖ్యాతి ఈ జీవన సమరవీరునికే దక్కింది. శ్రమజీవన సౌందర్యం ఆయన చేతాళంలో అద్భుత శిల్పంగా రూపుదిద్దు కుంది. చిన్నతనంలో కైపు తెప్పించే కథలు రాసే రోజుల్లో ఈయన వ్రాసిన కథకు చలం వ్రాసిన కథకు తేడా పసి కట్టటం అంత తేలికయినపనికాదు. అందుకే అన్నాడు చలం. "భరద్వాజ రచనలకు పొగడటం అంటే నన్ను నేను పొగడుకోవటమే" అని. భరద్వాజతో పరిచయం గల ఎవరి కైనా ఆయన జీవన వైవిధ్యం పరిచయం అవుతుంది. "పెద్ద జుట్టుముడి, రవ్వల దుద్దులు, నడుముకు బంగారు గోవ తాడు, మెళ్ళో బంగారు గొలుసు వీటితో మెరిసిపోతూ మొదట్లో బడికెళ్ళిన భరద్వాజకు కుటుంబపు పేదరికం ఏడవ తరగతి నాటికే చిరిగిన గుడ్డలు, చింపిరి జుట్టును అప్ప గించింది. ఈ జీవన రంగస్థలం మీదికి అల్లారుముద్దుగా అడుగుపెట్టిన భరద్వాజకు జీవితం కష్టాల కొలిమిగా మారింది; అయినా నిరాశ చెందలేదు. ఆ కష్టాల కొలిమి నుండే, వారి తండ్రి గారి నష్టాల ఊబి నుండే ఆ తండ్రి గారి నిక్కచ్చితనం నుండే, తన గజమొండితనాన్నుండే ఒక సుందర జీవన శిల్పాన్ని తనకై తాను పోతపోసుకున్నాడు భరద్వాజ.

ఏడవ తరగతిలో ఉండగా మంచి బట్టలు వేసుకు రాలేదని వాళ్ళ పంతులుగారు అవమానించి అమానుషంగా శిక్షించటంతో చదువంటే ఎంతో ఆపేక్షగల భరద్వాజలో బడిచదువుల పట్ల విహుఖత్వం ఏర్పడింది. అంతే ఇక మళ్ళీ బడిగడపతొక్కలేదు. అయినా ఆయన విశ్వవిద్యాలయాల మెట్లెక్కక పోలేదు. అలా మెట్లెక్కింది –

**చదువుకునేందుకు కాదు... పురస్కారాలు అందుకునేందుకే**
**పాఠాలు వినేందుకు కాదు ... ప్రసంగాలు చేసేందుకే**

మెలమెల్లగా భరద్వాజలోని బాధ బోధగా మారి పోయింది.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

దరిద్రం పోసిన పిరికిపాటలు తాగినా భరద్వాజ బాగా రాటుతేలాడు. నీచుల్ని చూచి ఏం చేయకూడదో నేర్చుకునే తెగువను మూటగట్టుకొన్నాడు. విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లు ప్రధానం చేసినా తానింకా నిరక్షరాస్యుణ్ణి అని పలికే వినయసంపన్నత ప్రోది చేసుకున్న డాక్టర్ భరద్వాజ ఏమంటాడో తెలుసా –

"ఊపిరి క్షణకాలం ఆపేందుకూ, ఆత్మను అలా స్పర్శిం చేందుకూ ఒక్క వాక్యమయినా చాలు. కానీ, అలాంటి ఓ వాక్యం రాయడానికి నాకింకా చాలా కాలం పడుతుంది" అని చెప్తూన తన సమాధి మీద రాయవలసిన ఓ వాక్యాన్ని ఠక్కున చెప్పేస్తా "సామాన్యుని సంక్షేమవే సమాజ సంక్షేమమని నమ్మిన ఒక సామాన్యుడు".

భరద్వాజ తాను పరువుగా బ్రతకటమే గాకుండా ఇతరు లను కూడ పరువుగా బ్రతకనివ్వాలి అనుకుంటాడు. అది చూచిన నాకు కవిరాజు త్రిపురనేని పద్యం గుర్తుకు వచ్చేది:

**ఇతరుల బర్వుతో బ్రతుకునిచ్చుట నెన్నడు నేర్చికొందు వా**
**యతమగు నీ ప్రపంచసుఖమన్నది యొక్కటె నీ సుఖంబుగా**
**బ్రతి దినమున్ స్మరించు సమభావము నెన్నడు నెన్నడు నేర్చి కొందువు**
**న్నతి గనుచుండి నీ ప్రజలనారతమున్ నిను మెచ్చుమానవా!**

అలా ప్రజలు మెచ్చే భరద్వాజ వంటి మానవుల సంఖ్య తగ్గుముఖం పడుతున్నది. మహా కవి జాషువ వంటి విశ్వ నరుల సంఖ్య తరిగి పోతున్నది. సంజీవదేవ్ వంటి సంస్కృతీ పరుల సంఖ్య సన్నగిల్లుతున్నది. ఈ సంఖ్యను పెంచవలసిన బాధ్యత ఉపాధ్యాయవర్గంపై అధికంగా వుంది. నదీ జలాల్లో వాటాలకోసం రెండు రాష్ట్రాలు ఎందుకు తగాదద పడ తాయో, శైలక్షేత్రాలమీద ఆధిపత్యం కోసం రెండు దేశాలు ఎందుకు తగాదా పడతాయో భరద్వాజకు అంతబాగా తెలియకపోవచ్చును గాని "చెత్త డబ్బాలోని ఎంగిలాకు కోసం ఓ కుర్రాడికి, ఓ కుక్కపిల్లకు ఎందుకు తగాదా వస్తుందో నాకు తెలుసు" అంటూ చెమ్మగిల్లిన కళ్ళొత్తుకుంటూ చెప్ప గలిగిన సత్తా భరద్వాజది. ఆ సత్తాకు మూలం ఆయనలోని ఆలోచించే స్వేచ్ఛ; పరిశీలించే స్వేచ్ఛ, ప్రశ్నించే స్వేచ్ఛ. అటువంటి స్వేచ్ఛను నేటితరం అందిపుచ్చుకునే మార్గమే దానికి మనం సాహితీ సేవద్వారా సరికొత్త మార్గాలను అన్వేషించాల్సి ఉంది. అందుకు ఇటువంటి వేదికల్ని మరింత ప్రయోజనకరంగా మలుచుకోవచ్చు.

భరద్వాజ జీవితం ఒక వేదనామయ కావ్యాన్ని మించి నదిగా ఉంటుంది. అది కావ్యం మాదిరిగా కల్పనామయంగా కన్పిస్తుంది. అందులోని వాస్తవం మన కళ్ళకు కట్టినట్లుగా ఉంటుంది. ఇప్పుడు పత్తిపంట రైతుల్ని మత్తికి దగ్గర చేయటం మన అవగాహనలోని అంశమే. అలాగే ఓనాడు తాడికొండ ప్రాంతంలో పొగాకు పంట రైతుల్నీ, వ్యాపారుల్నీ అతలా కుతలం గావిచేంది. పొగాకు వ్యాపారిగా ఉన్న భరద్వాజ తండ్రి నష్టాల పాలయ్యాడు. తమకు గత పొలాన్ని తెగనమ్మి రైతులకు చెల్లించవలసిన డబ్బు చెల్లించటంతో భరద్వాజ కుటుంబం ఆదర్శ శిఖరాలు అధిరోహించింది గాని కుటుంబ సభ్యులకు మాత్రం క్షుద్బాధను మిగిల్చింది. అప్పటి పరిస్థితులు ఈయన జీవితాన్ని ఊహించని మలు పులు తిప్పాయి. అవును, కొన్ని జీవిత సత్యాలు కల్పనలను మించి పోతాయిగా! సినిమా జీవితాల పాకుడురాళ్ళ దేముందిగాని భరద్వాజ నిజజీవితంలో ఆయనను జారి పడేట్లు చేసిన పాకుడు రాళ్ళు ఎన్నో...ఎన్నెన్నో... అయినా ఆయన నిలదొక్కుకోగలిగాడు.

అనంత భావాల లోగిలి భరద్వాజ అంతరంగం. "ఈ సువిశాల భూమండలంలోని మారుమూలల్లో ఉన్న పీడితుల, తాడితుల, దళితుల, నిరాశ్రయుల, నిర్భగ్యుల, నిత్య దరి ద్రుల, నిత్య దు:ఖితుల బాహువుల్లో వజ్రాయుధంగా నిలిచి ఆకలినీ, దారిద్ర్యాన్నీ, నిరుద్యోగాన్నీ, అవినీతినీ, అరాజ కాన్నీ, అసత్యాన్నీ కనుచూపు మేరలో లేకుండా" పారద్రోలా లంటాడు... "వంచనను, దగాను, మోసాన్ని, కుట్రను అరి కట్టాలని" భావిస్తాడు.

ఈ దేశంలో చాలామంది అమ్మాయిల కలలు మోసా లకు, దగాలకు, వంచనలకు, మాయలకు, దారిద్ర్యాలకు, శుష్కమైన ఆచారాలకు, నిరర్ధకమైన కట్టుబాట్లుకు లోనై వాడి, ఎండి, రాలిపోతున్నాయని ఎంతగానో ఆవేదన చెందేవాడు :

వాళ్ళ నూరేళ్ళ పంట మంటగా మారకూడదన్నాడు.

- స్త్రీ శరీరం మీద శృంగారం చూచే రోజులుపోయి ఆమె మనసులోని బంగారం తూచే రోజులకోసం పరితపించాడు.
- ఆమె వంటిమీద ఒయ్యారం కాదు చూడాల్సింది, ఆమె గుండె గూటిలోని చీకటి గుయ్యారాన్ని ఛేదించ మని హితవు పలుకుతాడు.
- సంసారంలో ఒండొరులు చిరునవ్వుకోసం, దర్శనం కోసం, స్పర్శకోసం, కన్నుల మెరుపు కోసం కలవ రించి, కలవరించి, తపించి, తపించిపోయే దాం పత్య సుఖాన్ని కోరుకోమని హితవు పలికాడు. పతనమవుతున్న విలువల్ని చూచి –
- రూపాయి కోసం, పదవి కోసం, హోదా కోసం, కామోపశమనం కోసం, కీర్తి కోసం, సమస్త నైతిక విలువల్నీ చేజారనివ్వవద్దంటాడు.
- ఇప్పుడు ఒక బుద్ధుడు, ఒక క్రీస్తు, ఒక మహాత్ముడు ఒకేసారి అవతరించవలసిన అవసరం ఉందన్నాడు.
- అయితే ఈ పర్యాయం వాళ్లు దయార్ద్ర హృదయా లతోగాక డైనమైట్స్‌తోనూ, అహింసాత్మక బోధన లకు బదులుగా ఆయుధాలతోనూ అవతరించవల సిందిగా ఆహ్వానిస్తాడు.

మానవ జీవితం సరళమైన సుందరమైన వాక్యంలా ఉండాలని ఉవ్విళ్ళూరుతాడు భరద్వాజ అది జానపద గీతంలా హాయిగా ఉండాలిగాని నాల్గు అర్థాల పద్యంలా గొట్టుగా ఉండకూడదు. భరద్వాజ రచనల్లో భావాలు గిరి జనుని చేతిలో బాణాల్లా వుంటాయి; కొండమీద దుమికే సెలయేరులా పరుగులు పెడతాయి అవి మబ్బుల్ని చీల్చు కొచ్చే సూర్య కిరణాలు; మాతృ గర్భంలోని శిశువు కదలికలు; ప్రియురాలి చెక్కిలి మీది ముద్దు అవి మృదువుగా ఉంటాయి, సూటిగా ఉంటాయి, స్పష్టంగా ఉంటాయి, శక్తిమంతం ఉంటాయి, ఒక్కోసారి చురుక్కుమంటాయి కూడ.

పగిలిపోయిన కలల పెంకుల్ని ఏరుకొని, కరుణా తప్తమైన కన్నీరద్ది స్వప్నాక్షరాలని మాటలుగా మలిచి, హరివిల్లులా తయారించే అద్భుత అక్షర శిల్పి భరద్వాజ. మచ్చుకు ఈ వాక్యం చూడండి.

**"నేనెప్పుడూ యాచకుణ్ణే; చిన్నప్పుడు పిడికెడు మెతుకులు బిచ్చమెత్తాను,**

**ఇప్పుడు గుప్పెడు జ్ఞానం బిచ్చమెత్తుతున్నాను"**

బిచ్చమెత్తటాన్ని యింతకుమించి ఉన్నతీకరించటం ఎవరికీ కుదరదుగాక కుదరదు. నూటికి పైగా రచనలు చేసిన డాక్టరు భరద్వాజ చివరకు అన్నదేమిటో తెలుసా?

"నేనో నిజం చెప్పనా ... రచయితగా నేనింకా జన్మించ వలసి వుంది". అందువల్లనే ఆయన "ప్రతి వాక్యంలోంచీ కనీసం ఒక్క బొమ్మయినా తొంగి చూడకవపోతే ఆ వాక్యం రాయడం శుద్ధ దండగచి అంటూ విజృంభించి జీవన సమ రాన్ని సాక్షాత్కరింపజేస్తారు; స్మృతి పంచకాన్ని పంచుతారు.

తనకు సాయం అందించిన వారిని మరచిపోయే రకం కాదు భరద్వాజ. అటువంటివారికి కొందరికి తమ రచనల్ని అంకితం యిచ్చి గౌరవించారు. ఇంకొందరి విషయంలో వాళ్లపేర్లను తమ బిడ్డలకు పెట్టుకున్నారు. వెలయాళ్ళుగా సమాజం ముద్ర వేసిన ముగ్గురు బంగారు తల్లులు తెనాలిలో ఈయనకు కొనిచ్చిన కళ్లజోడు కొన్నాళ్ళకు వాడేందుకు వీలుకాకుండా పోయినా వానిని భద్రపరిచి వాళ్ళకు విశిష్ఠ గౌరవాన్ని కల్పించారు.

భరద్వాజ భావనలో "ఒక బీజం మొలకరించాలన్నా, ఒక భావంపొటమరించాలన్నా ఆ బీజాన్నీ, ఆ భావాన్నీ ఓ నీటి చినుకో, ఓ కన్నీటి చినుకో తడిపి తీరాలి. అలా జరగ నంత కాలం ఆరెండూ జీవంతం కావు. ఆయన తన భావ ప్రకటనకోసం, కదిలే అక్షరాలను, నడిచే అక్షరాలను, పరు గెత్తే అక్షరాలను, మెరిసే అక్షరాలను, మండే అక్షరాలను, సందర్భానికి తగినట్లుగదా ఎంచుకునే కౌశల్యం మెండు. అటువంటి అక్షరాలు కదులుతూ కదిలిస్తూ.... మనిషి గుండె ల్లోకి, ఆ గుండెల్లోని బాధల్లోకీ, ఆ బాధల్లోంచి పొర్లుకొచ్చే అశ్రువుల్లోకి,ఆ అశ్రవుల నుండి చిమ్ముకొచ్చే మంటల్లోకీ దూకగలిగిన వయితే, చెప్పటానికయినా వ్రాయటానికయిన బాగా పనికి వస్తాయంటాడు. అటువంటి అక్షరాలతో

భరద్వాజ తనకు అద్భుతంగా తట్టిన విషయాలను భావ చిత్రాలుగా, పదచిత్రాలుగా మన ముందుంచటం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య.

మేము వ్రాసుకునే ఉత్తరాలలో నేను ఆయన్ని "భరద్వాజ మహర్షీ! అని సంబోధిస్తే ఆయన నన్ను 'సాంబయ్య తంద్రీ!' అని సంబోధించేవాడు. ఒక పర్యాయం ఆయన తన ఒకింత వేకువకోసం' అనే రచనను పంపి ముందుమాట వ్రాయమన్నాక అదేమిటి మీ పుస్తకానికి నేను ముందుమాట వ్రాయుటమేమిటి? అంటే వినలేదు. నాకు ముందు మాట వ్రాయక తప్పిందికాదు. ముందుమాట 'వేకువ అంచున' అనే శీర్షికతో ముగించి పంపుతూ ఇలా వ్రాసాను:

"ముందుమాట పంపుతున్నాను. గుడ్డమీది చొక్కా కుట్టాను. కుదిరితే వేసుకోండి. లేకుంటే పక్కన పడెయ్యండి".

దానికి వెంటనే 16.09.1991న ఆయన సమాధానం ఇలా పంపారు:

"నీ వేకువ అంచు ...." నాకు 13న తగిలింది. అసలే అది వేకువ. పైగా, ఓ సాంబయ్య దానికో అంచును తీర్చి, మెరిపించాడు. నన్నా – అంచుమీద కూచో బెట్టాడు. నేనీ గుడ్డల తయారీమాని, దర్జీపని నేర్చుకొందామనుకొంటున్నాను – నీ పనివాడితనం చూశాక ! అందరం క్షేమం. ఉంటాను.

మీ
భరద్వాజ

నేనంటే ఆయనకు అంతటి అభిమానం. నా ముందిగాని నాకంటే పెద్ద పెద్ద వాళ్ళు ఆయన్ని గురించి ఏమన్నారో విందామా ? –

- శ్రీశ్రీ దృష్టిలో భరద్వాజ "ఒొంటి నిండా కన్నులున్న వేణువులాంటివాడు."
- సి.నా.రె. భరద్వాజ వెలువరించినవి "స్మృతులు కావు; ఆకాశమంత జీవితాన్ని పిండిపోసిన అమృత ధారలు" అని మెచ్చుకుంటాడు.
- "భరద్వాజకు రచన ఒక కళావాహిక; దానికి ప్రయోజనమనే స్పృహ ఎరుకను కలిగిస్తుంది. ప్రొ॥ జీ.వి. సుబ్రహ్మణ్యం
- "భరద్వాజ డైరీల రూపంలో సమర్పించిన ఎలిజీలు తెలుగు పలుకుబడులకు, నుడులకు, నానుడులకు వెలుగు దివ్వెలుగా తెలుగు భారతికి సమర్పించిన అక్షరాంజలిగా ఒక తెలుగు గీతాంజలిగా ప్రకాశిస్తాయి" అని చాటుతారు ప్రముఖ పాత్రికేయులు శ్రీ ఎ.బి.కె. ప్రసాద్.

జ్ఞానపీఠ్ అవార్డు ఆయన "పాకుడురాళ్ళకు" వచ్చిందని ఆయన చెప్పినా అది అబద్ధమే. ఆపద్ధం మారి చాలా కాలమయ్యింది. ఆయన సమగ్ర సారస్వతానికీ, సాఫల్యానికీ అది దక్కుతుంది. అది ప్రజల హృదయాల్లో పదిలంగా పదికాలాలపాటు ఉండాలంటే ఆయన రచలన్నీ పునర్ముద్రించటం జరగాలి.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# ఖగోళ శాస్త్ర వాస్తవాలు – వినువీధిలో వింతలు

- ఆచార్య ఎన్.వి. కృష్ణారావు
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

తెలుగు సాహిత్య లోకంలో కవిగా, రచయితగా ప్రయాణించినవారు, ప్రయాణిస్తూ వున్నవారు; ప్రసిద్ధి పొందినవారు, ప్రసిద్ధి పొందుతూ వున్న వారు సాధారణంగా తెలుగు సాహిత్యంలోని పద్యం, గద్యం, కథ, నవల, నాటకం, వ్యాసం మొదలగునవి అనేక ప్రక్రియలలో కలాన్ని కిందకి, మీదకి, పైకి, పక్కకి తిప్పి, తిప్పుతూ ఒక ఒరవడిని సృష్టించారు, సృష్టిస్తూ వున్నారు. ప్రత్యేకించి విజ్ఞాన శాస్త్రాంశాలు వైపు కలాన్ని కదిలించిన వారు బహు అరుదు. వేదాలలో, పురాణాలలో, కావ్యాలలో, ఆధునిక రచనల్లో అవసరార్ధమో, సందర్భానుసారమో వైజ్ఞానిక శాస్త్రాంశాల ప్రస్తావన వుండటం కనిపిస్తుంది. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జ్యోతిష్యం, ఖగోళ శాస్త్రం వంటి ప్రత్యేకమైన విజ్ఞాన శాస్త్రాంశాలను గురించి ఆయా శాస్త్రాల్లో నిష్ణాతులైన వారే రచనలు చేయడం పరిపాటి. అయితే ఆయా అంశాలను పిల్లలకు, ఔత్సాహికులకు పరిచయం చేయటం కోసం తెలుగులో రచనలు చేసినవారు చాలా కొద్ది మంది కనిపిస్తున్నారు. కొడవటిగంటి కుటుంబరావు, మహీధర నళినీ మోహన్, రెడ్డి రాఘవయ్య, చందు సుబ్బారావు గార్ల వంటి వారు కొన్ని వైజ్ఞానిక శాస్త్ర రచనలు చేశారు. ఈ కోవలోకి వచ్చేవారే రావూరి భరద్వాజ గారు. తెలుగు సాహితీ వ్యాసంగంపై పూర్తి దృష్టి నిలిపినా, ఒకపార్శ్వపు దృష్టిని శాస్త్ర విజ్ఞానంపై వుంచి ఆ శాస్త్రాంశాలతో పిల్లలకు, వయోజనులకు అర్థమయ్యే రీతిలో 'సుగమయ విజ్ఞాన శాస్త్రం' పేరుతో 35 పుస్తకాలు రాసిన ఘనులు రావూరి భరద్వాజ. అందులో ఖగోళ శాస్త్రాంశాలతో వెలువడిన రచన 'వినువీధిలో వింతలు' అనే గ్రంథం.

రచనా ప్రారంభంలోనే రచయిత పలికిన 'తొలిపలుకు'లో రచయిత ఎన్నో విజ్ఞాన శాస్త్ర గ్రంథాలు చదివి, అర్థం చేసుకొని ఈ రచన చేసినట్లు తెలుస్తుంది. "నేనైతే శాస్త్రజ్ఞుల్ని కాదు గాని, నా వంటి సామాన్యుల కోసం హేమాహేమీల్లాంటి వారు రాసిన సుగమ విజ్ఞాన శాస్త్ర గ్రంథాలు అందినవి అందినట్లుగా చదవాను. చదివాక, ఇలాంటి పుస్తకాలు తెలుగులో కూడా వుంటే బావుండునని తోచింది. తోచాక, రాయడం ప్రారంభించాను.

'వినువీధిలో వింతలు' ముందుగా కృష్ణాపత్రికలో ధారావాహికంగా వచ్చింది. 1964లో పుస్తక రూపంగా వెలువడింది. ఆ పుస్తకాన్ని మళ్ళీ వేద్దామని మా నరసింహారావు గారు సరదా పడ్డప్పుడు, ఆ పుస్తకాన్ని ఒకసారి సవరించడం మంచిదనిపించింది. 1964 కూ, 1982 కూ మధ్యన ఖగోళ పరిశోధనల్లో అనూహ్యమైన మార్పులు చాలా వచ్చాయి. విశ్వపరిధి విస్తృతమైంది. గ్రహాలను గురించి, ఉప గ్రహాలను గురించి ఈ చాలా కొత్త విషయాలు బయట పడ్డాయి. దూర దూరాలలోని గ్రహాలకు వ్యోమ నౌకలు ప్రయాణాలు సాగిస్తున్నాయి. కొత్త నక్షత్ర మేఘాల ఉనికిని శాస్త్రవేత్తలు కనుగొంటున్నారు.

అయితే ఎప్పటికప్పుడు వచ్చిపడుతున్న ఈ సమాచారాన్నంతా పుస్తకంలోకి చేర్చడం నాకు సాధ్యం కాదు. అందువల్ల ఒక తేదీని నిర్ణయించుకొని నా అందుబాటులో వున్న సమాచారాన్నంతా ఈ పుస్తకంలోకి చేర్చాను. ఇందులోనైనా ఖగోళ శాస్త్రం సాధించిన వాటి నన్నింటినీ పొందుపరిచానని కాదు గానీ, స్థూలంగానైనా చెప్పడానికి ప్రయత్నించానని మాత్రం మనవి చేస్తున్నాను".

ఈ గ్రంథంలో గ్రహజననం, సూర్యుడు, బుధుడు – శుక్రుడు, భూమి జీవ పరిణామం, చంద్రుడు, అంగారకుడు, అల్ప గ్రహాలు, బృహస్పతి, శని, ఆఖరి గ్రహాలు, ఉల్కలు, తోక చుక్కలు, నక్షత్ర ప్రపంచం అనే అంశాల ప్రస్తావన, పరిచయ, వివరణలతో తనకు సాధ్యమైనంత వరకు ఖగోళ విజ్ఞానాన్ని అందించే ప్రయత్నం జరిగింది. సాధారణంగా

కథలు, నవలలు, నాటకాలను పాఠకులు చదవటానికి ఆసక్తిని చూపుతారు. విజ్ఞాన శాస్త్రాల పఠనానికి అంతగా ఆసక్తి చూపరు. ఆ అంశాన్నే దృష్టిలో పెట్టుకునే భరద్వాజ పాఠకులకు ఆసక్తిని కలిగించే విధంగా రచనకు శ్రీకారం చుట్టారు. ఒక చక్కని వేదికను, సమయాన్ని, సందర్భాన్ని ఏర్పాటు చేశారు. తల్లి, తండ్రి, ముగ్గురు పిల్లలు, ఇద్దరు మేనమామలు గల ఒక కుటుంబమంతా కబుర్లు చెప్పుకొం టున్నట్లుగా సంభాషణలతో ఖగోళ శాస్త్రాంశాలన్ని చర్చించాడు రచయిత. ఈ చర్చలో అందరూ భాగస్వాము లైనా రవి అనే జిజ్ఞాస కలిగిన మేనల్లుడు, అతడికి సమాధానాలు చెప్పే మేనమామ కోటి అనేవారు ప్రధాన పాత్రలుగా కనిపిస్తాయి. రవి, అతని తల్లిదండ్రులు, చెల్లి పద్దు, తమ్ముడు గోపి, మరో మేనమామ రంగాచార్యులు – ఇదీ వారి కుటుంబం.

కోటి మామయ్య పట్నం నుండి వచ్చిన రోజు రాత్రే డాబా మీదకు చేరి పిల్లలకు కథలు చెబుతున్నాడు. ఆ ఆ సందర్భంలోనే కోటికి బావ, రవికి తండ్రి అయిన వ్యక్తి – అతడే నాన్న, రష్యా వాళ్ళు ఎక్కడికో మనిషిని పంపించారు? ఏవూరు? అని అడిగిన ప్రశ్నకు ప్రారంభమైన సమాధానమే ఈ రచన మొత్తంగా సాగింది.

గ్రహజననం గూర్చి జరిగిన చర్చలో – 'గ్రహాలు ఎట్లా ఏర్పడ్డాయన్న దాన్ని గురించి ఒక్కోతరంలో ఒక్కో అభి ప్రాయం ప్రచారంలో వుంది. అనాది యుగంలో – మానవు డింకా వ్యవసాయం కూడా సరిగ్గా చేసుకోలేని దశలో ఈ గ్రహాల నిర్మాణం అదృశ్యరూపమైన శక్తికి అంటగట్టాడు. మతాలు కూడా ఈ అభిప్రాయాన్ని బలపరుస్తూ వచ్చాయి. అయితే కాలం గడచిన కొలదీ ఈ అభిప్రాయాలను మార్చు కోవలసి వచ్చింది. ఈ మార్పులను ప్రవేశపెట్టినవారు ఎన్నో బాధలు పడ్డారు. కొంతమంది చాలా హీనమైన స్థితిలో చచ్చిపోయారు కూడాను. ఇంతకూ చెప్పవచ్చిందేమంటే గ్రహాల నిర్మాణాన్ని గురించి ఒకప్పుడున్న సిద్ధాంతం మరొ కప్పుడు చలామణి కాకుండా వుండటం." చంద్రుడు భూమికి ఉపగ్రహంగా వున్నట్లే అనేక మంది చంద్రులు ఇతర గ్రహాల చుట్టూ తిరుగుతున్నారని కోటి మామయ్యి అంటే, అసలు ఈ గ్రహాలు ఎలా పుట్టుకొచ్చాయి? అన్ని రవి ప్రశ్నకు కోటి మామయ్య చాలా సిద్ధాంతాలు చెప్పాడు.

క్రీ.శ. 1745వ సం॥లో 'చీఫో' అనే శాస్త్రవేత్త ఓ గొప్ప తోకచుక్క సూర్యుణ్ణి రాసుకొంటూ వెళ్ళడం వలన, ఆ సంఘ ర్షణకు సూర్యుడు లోపలి వున్న పదార్థం చెల్లాచెదరై దూరంగా పడిపోయింది. అలా విసరివేయబడిన పదార్థమే గ్రహాలుగా ఏర్పడింది అన్నాడు. 1755లో జర్మనీకి చెందిన 'కాంట్' అనే శాస్త్రవేత్త చాలా పలుచగా వుండే ఒక పదార్థం నుండి సూర్యకుటుంబం యావత్తూ పుట్టుకొచ్చిందన్నాడు. ఆ తర్వాత 1790లో లావ్‌వేస్, అనంతరం ప్రొఫెసర్ జేమ్సు జాన్స్, స్మిత్ అనే శాస్త్రవేత్తలు ఆకర్షణ శక్తుల గురించి చెప్పారు.

సూర్యుడు, సూర్య కుటుంబాన్ని గూర్చి చెబుతూ – సూర్యుడు, సూర్యకుటుంబానికి పెద్ద. కానీ, అసంఖ్యాకంగా ఆకాశంలో వుండే నక్షత్రంతో పోలిస్తే సూర్యుడు కూడా ఒక నక్షత్రం లాంటి వాడేనని శాస్త్రజ్ఞులు రుజువు చేశారు. సూర్యడు, మిగిలిన గ్రహాలకు తేడా అక్కడ వుండే ద్రవ్యం లోని తేడాల వల్లనేనంటూ, ఈ సూర్య కుటుంబాన్ని చూడా లంటే – అమెరికాలోని పాలోమార్ పర్వతం మీద వున్న గొప్ప దూరదర్శిని ద్వారా వెయ్యి కాంతి సంవత్సరాల దూరం వరకు చూడవచ్చని తెలిపాడు కోటి మామయ్య. అలా చూస్తే సూర్య గర్భం నుండి వెలువడే కిరణాలు అంతా ప్రసారం కాకుండా సూర్యగోళంలోని పైపొరలు అడ్డుకొంటున్నాయి. అక్కడ కొన్ని మచ్చలు కనిపిస్తాయి. వాటిని సూర్యాంకాలు అంటారు. అంతేకాకుండా సూర్యగోళంలో పెద్ద పెద్ద కొండలు కూడా వుంటాయి. ఇంత కాంతిని వెదజల్లే సూర్యు డులో కూడా చీకటి గుయ్యారాలున్నాయిన్నప్పుడు రవికి ఉత్సాహం పెరిగి పోయింది.

సూర్యుడికి అతి దగ్గరగా వుండే గ్రహం – బుధ గ్రహం. బుధునికి ఉపగ్రహాలు లేవు. అందుక్కారణం బుధుని ఆకర్షణ శక్తి చాలా తక్కువ. సూర్యకాంతి పడకపోతే బుదుణ్ణి కనుక్కో వడం కష్టం. బుధగ్రహం మీద పరిశోధనలు చేయడం కూడా కష్టమే.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

శుక్ర గ్రహం మీద ఎవరెస్టుకంటే ఎత్తైన పర్వతం వుంది. దాని ఎత్తు 11,200 మీటర్లు. దానికి 'మాక్స్‌వెల్' అని పేరు పెట్టారు. ఏ గ్రహంలో లేని అనంతమైన లోయ, బ్రహ్మాండమైన మైదానం కూడా శుక్రగ్రహంలో కనిపిస్తు న్నాయి.

భూమిని గురించి జరిగిన చర్చలో – భూమి గుండ్రంగా వుందని మొట్టమొదట సిద్ధాంతీకరించినవాడు గణిత మేధావి అయిన పైథాగరస్. భూమి స్థిరంగా వుండి, దాని చుట్టూ సూర్యచంద్రులు, ఇతర గ్రహాలు, నక్షత్రాలు తిరుగుతూ వుంటాయనే సిద్ధాంతాన్ని ఖండించిన మొదటి విజ్ఞాని పైథా గరస్ శిష్యుడైన పైలోలస్. భూమి విశ్వానికి కేంద్రం కాదు, అది తనచుట్టూ తాను తిరగడమే కాకుండా మరో అగ్నిగోళం చుట్టూ కూడా ప్రదక్షిణం చేస్తూ వుంది. ఆ ప్రదక్షిణా కాలం ఒక సంవత్సరమన్నాడు పైలోలస్. సూర్యుడు కేంద్రంగా సమస్త గ్రహాలు, నక్షత్రాలు పరిభ్రమిస్తూ వుంటాయని సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు కోపర్నికస్ అనే శాస్త్రవేత్త.

జీవ పరిణామ క్రమం కొన్ని కోట్ల సంవత్సరాలపాటు జరిగిన పరిణామం. జీవమంటే రసాయనిక సంశ్లిష్ట సంయోగ ఫలితం, పదార్థం ఒక దశలో వెలువరించే గుణమనీ తేల్చి చెప్పాడు కోటి మామయ్య. ఈ విధంగా ప్రతిగ్రహం, దాని పుట్టు పూర్వోత్తరాలు, నక్షత్ర మండ లంలోని అనేకాంశాలు గురించిన పూర్తి వివరాలను తెలియ జేశాడు కోటి మామయ్య.

అయితే, ఇక్కడ గమనించాల్సింది – కాస్త చదువుకున్న పెద్దవారికి కూడా అర్థంకాని, ఆసక్తి అంతగా కలిగించని ఖగోళశాస్త్ర వాస్తవాలను చాలా సులభంగా, పాఠశాల విద్యా ర్థులు, ఒక కుటుంబంలోని సాధారణ వ్యక్తులు సైతం ఆసక్తితో, అర్థం చేసుకొనే విధంగా ప్రశ్నలు, సమాధానాలు, సంభాషణల ద్వారా తెలియజెప్పుటకు భరద్వాజ ప్రత్యేకత.

కథలు, నవలలు, నాటికలు, ప్రయోగాత్మక రచనలు, బాల సాహిత్యం, స్మృతి సాహిత్యం వంటి ప్రక్రియలలో రచనలు చేసిన భరద్వాజ విజ్ఞాన శాస్త్రాంశాలను కూడా భావితరాలైన బాలతరాలకు అర్థమయ్యే రీతిలో దీనిని రచించి తనదైన బాలసాహిత్యముద్రణ దీనిలోనూ చూపిం చారు. 'వినువీధిలో వింతలు' రచన ఖగోళశాస్త్రంలోనికి వాస్తవాలను మన కళ్ళముందు వుంచుతుంది. నిజానికి భరద్వాజ గారి సుగమ విజ్ఞాన శాస్త్ర రచనలన్నీ కేవలం బాలలకే కాదు, సమాజంలోని అన్ని వర్గాల వారు చదివి తెలుసకోవలసిన రచనలు మరీ ముఖ్యంగా ఉపాధ్యాయ, అధ్యాపక వృత్తిలో వున్నవారు తప్పని సరిగా చదవ వలసిన అవసరం వుంది. వైజ్ఞానిక శాస్త్ర రచనలలోనూ భరద్వాజ గారి దృష్టిని, ప్రత్యేకతలను, సామాజికావగాహన కోసం వారు తపిస్తున్న తీరు ఈ రచనలలో కనిపిస్తాయి. ఖగోళ శాస్త్రంలోని ఈ వాస్తవాలు వినువీధిలో వింతలుగానే గాక పులకింతలు కూడా కలిగిస్తాయి.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# రావూరి భరద్వాజ ఒక చీమ కథ – సామాజిక చైతన్యం

- వేముల హర్షిత
**పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం,**
**యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్.**

## పరిచయం :

ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో కథా రచయితగా, నవలా రచయితగా, వ్యాస కర్తగా ఎంతో పేరు ప్రఖ్యాతలు పొందిన డా. రావూరి భరద్వాజ సామాజిక చైతన్యాన్ని కలిగించే అనేక రచనలు చేసారు. రావూరి భరద్వాజ పూర్తిగా ప్రజల మనిషి. సమాజంలోని ఒక సంఘటన, తానూ చూసిన ఒక దృశ్యం, విన్న ఒక వార్తా ఇలా ప్రతీది ఆయన చేతుల్లో కథలుగా రూపొందాయి. కష్టపడి పనిచేసిన వారికి రెండుపూటలా తినడానికి సరైన తిండి కూడా లభించని రోజుల్లో సంపదను ఉత్పత్తి చేయడంలో పాలుపంచుకోనివారి వద్ద మాత్రం కోటానుకోట్ల సంపదలు పోగవుతున్నాయని ఆనాటి సామాజిక పరిస్థితులను తెలియజేస్తూ భరద్వాజ రాసిన కథ "ఒక చీమ కథ". పెట్టుబడిదారి వ్యవస్థ కింద బానిసలుగా బ్రతుకుతున్న మానవులను ఒక సామాజిక చైతన్యం గల చీమ పాత్ర ద్వారా ఏవిధంగా చైతన్యాన్ని కలిగించారో తెలియజేయడమే ఈ పత్ర ప్రధానోద్దేశ్యం.

## నేపథ్యం :

రావూరి భరద్వాజ రచనలకు ప్రధాన కారణం ఆయన తన జీవితంలో అనుభవించిన దారిద్ర్యం, ఆకలి బాధలు. "దారిద్ర్యం చాలామందికి పిరికిపాలు పోస్తుంది. నాకూ పోసింది కానీ ఆ పాలు తాగి నేను రాటుదేలాను. నా చిన్న తనంలో అన్ని బాధలు, కష్టాలు, అవమానాలు, ఈసడిం పులు అనుభవించకపోతే నేనసలు రచయితనై ఉండేవాడినే కాదు" అంటాడు భరద్వాజ.("సగం దారిలో..." అన్న ప్రత్యేక సంచికలో వాడ్రేవు పురుషోత్తం గారి "ఏరిన ముత్యాలు" పుట –3). అదేవిధంగా తన చుట్టూ ఉన్న సమాజంలోని ప్రజలు అనుభవిస్తున్న అనేక రకాల కష్టాలు కూడా తన రచనలకు కారణమయ్యాయని చెప్పవచ్చు. భరద్వాజ ఎప్పుడు సమాజాన్ని వదిలి రచనలు చేయలేదు. "నా కథల్లోని చాలా వాటికి కథావస్తువు, నా చుట్టూ ఉన్నవారి జీవితాల నుండే ఏరుకున్నాను" అంటాడు. సమాజంలో అట్టడుగున పడినవారు, పడిలేవనివారు అతని కథల్లో పాత్రలుగా మనకు కనిపిస్తాయి. వారి పాత్రల్లో రకరకాల వృత్తులు, ప్రవృత్తుల వాళ్ళున్నారు. తన జీవితంలో రకరకాల మనుషుల్ని కలుసు కోవడం, వారివారి అంతర్బహిర్జీవితాలను అవగాహన చేసు కోవడం వల్ల భరద్వాజ మనసులో ఎన్నో ప్రశ్నలు తలె త్తాయి."నా మిత్రులలో చాలామంది కడుపునిండా భోజనం చేస్తున్న సమయానికే నాకు పిడికెడు మెతుకులు లేకపోవ డానికి కారణమేమిటి? నా మిత్రుల్లో చాలామంది మల్లెపూవు ల్లాంటి దుస్తులను వేసుకుంటున్న సమయానికే, నా వొంటి మీద మురికి పీలికలు వెళ్ళాడటానికి కారణమేమిటి? ఆకలి అందరికి ఉండటానికి, అన్నం కొందరికే ఉండటానికి కారణమేమిటి?... ఆ రోజుల్లో ఎవరెవరు ఏయే వస్తువులు ఉత్పత్తి చేస్తున్నారో, అవి వారికే ఎందుకు లేకుండా పోతు న్నాయో నాకు అర్థమయ్యేది కాదు. మా ఇంటికెదురుగా ఉన్న రైతు రామయ్య వడ్లు, జొన్నలు, పప్పులు, కూరగాయలు పండించేవాడు. మంచివన్నీ మందికి అమ్మేసుకొని చచ్చులు, పుచ్చులు తాను తినే వాడు. ఒకోసారి పాపం అది కూడా లేక పస్తులు పడుకునేవాడు... వీటన్నిటికన్నా విచిత్రమైన దేమిటంటే ఊరందరికి చెప్పులు కుట్టిచ్చే నిబద్ధాయ కాళ్ళకు ఎప్పుడూ చెప్పులుండేవి కావు. ఎందుకని? తెలియదు. ఇలాంటి ప్రశ్నలన్నీ తన కళ్ళముందు దయ్యాల్లాగా తిరుగు తుండేవి. వీటి సమాధానాల కోసం అన్వేషించాడు. చివరకు ఒక నిర్ణయానికి వచ్చాడు. ఆకలి, దారిద్ర్యం పాపం వల్లనే వచ్చాయని నేననుకోను అంతకు మించిన కారణాలేవో ఉండి ఉండాలని అనుకున్నాను" అని చెప్తాడు. ('ఇనుప తెర వెనుక' అన్న పుస్తకానికి 'లోగుట్టు' పేరుతో భరద్వాజ

రాసిన పరిచయం పుట 6, 7). ఈ విధంగా తన చుట్టూ ఉన్న వారు పడుతున్న బాధలను చూసి చలించిపోయిన భరద్వాజ వారి బాధలను అక్షర రూపాలుగా తీర్చిదిద్దారు. సమాజంలో ఉన్న సమస్యలకు సమజంలోనే పరిష్కారా లుంటాయని మనుషుల్లోనే మార్పు రావాలని తన రచనల ద్వారా ప్రజలను చైతన్య పరచాలనుకున్నాడు. ఆవిధంగా తన కలంనుండి పుట్టినదే ఈ ఒక చీమ కథ.

## ఒక చీమ కథ – సామాజిక చైతన్యం :

రావూరి భరద్వాజ రచించిన ఒక చీమ కథ "శ్రీరస్తు" అనే కథా సంపుటిలోనిది. ఈ సంపుటి 1987 లో వెలువడింది. 'వసుంధర' కథాసంపుటిలో వసుంధర పేరుగల కథలేనట్టే ఇందులోనూ "శ్రీరస్తూ" అన్న పేరుగల కథలేదు. ఈ సంపుటిలో పేద నిజం కథ, ఒక చీమ కథ, ఒక దోమ కథ, ఒక ఎలుక కథ, ఒక చిలుక కథ అనే కథలున్నాయి. ఈ కథల్లోని రకరకాల పాత్రలకు, ఆ పాత్రలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజలకు 'శ్రీరస్తు' పలుకుతూ ఈ కథలను రాసారు. ఈ సంపుటిని తన స్నేహితుడైన డా. ఉండేల మాలకొండా రెడ్డికి అంకితమిచ్చారు. ఒక చీమ కథ 6 –1 – 1985 లో ఆంధ్రప్రభ దినపత్రికలో వెలువడింది. తర్వాత 11 – 11 – 1985 లో కొన్ని మార్పులు చేర్పులతో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ఈ కథను ప్రసారం చేసాయి.

## కథాసారాంశం :

ఒక చీమ కథ అనేది ప్రధానంగా సామజిక చైతన్యాన్ని ఉద్దేశించి రాసింది. అందరు చెప్పుకునే ఓ పాత కథను కొత్తగా చెప్తున్నప్పుడు నాకో కొత్తసత్యం తెలిసిందని ఏడు చేపల కథను మనకు గుర్తుచేస్తాడు రచయిత. కథలో ప్రధాన పాత్రలు రెండు ఒకటి చీమ, రెండు కథకుడు అనగనగా ఒక రాజు ఆ రాజుకు ఏడుగురు కొడుకులు. ఆ ఏడుగురు కొడుకులు ఏటికి వెళ్లి ఏడు చేపలు తెచ్చి ఎండ వేసారు. అందులో ఒక చేప ఎండలేదు. చేప చేప ఎందుకు ఎండలేవు? అంటే గడ్డి మోపు అడ్డం వచ్చింది అంటుంది. గడ్డి మోపు గడ్డిమోపు ఎందుకు అడ్డం వచ్చావంటే? ఆవు నన్ను మేయలేదు అంటుంది. ఆవు ఆవు ఎందుకు మేయలేవంటే? నన్ను కాపరి కట్టేశాడు అంటుంది. కాపరి కాపరి ఎందుకు కట్టావు? అంటే అవ్వ బువ్వ పెట్టలేదు అంటాడు. అవ్వ అవ్వ బువ్వెందుకు పెట్టలేదు? అంటే పిల్లవాడు ఏడ్చాడు అంటుంది. పిల్లవాడు పిల్లవాడు ఎందుకేడ్చావు? అంటే చీమ నన్ను కుట్టింది అంటాడు. చీమ చీమ ఎందుకు కుట్టావు? అంటే "నా బంగారు పుట్టలో వేలుపెడితే కుట్టన" అంటుంది. ఇది కథ. ఈ కథలో కథకుడికి అర్థంకాని విషయం చీమకు బంగారు పుట్ట ఎలా ఉంది అనేది. ఎంతో కష్టపడి నిజాయితీగా శ్రమించిన నిలువ నీడలేని మానవ లోకంలో చీమకు బంగారు పుట్టేమిటని కథకుడి సందేహం ఒకవేళ అదే నిజమయితే అది చీమ అక్రమార్జనే అవుతుందని కథకుడు అంటాడు. అందుకు చీమ నేను మానవులంతా నీచమైనదాన్ని కాదని పరుల సొమ్ముకు ఆశపడనని ఇది తన కష్టార్జితమని చెప్తుంది. తన కష్టార్జీతం ఏదైనా తనకు బంగారంతో సమానం అని అంటుంది. తన సంపదను ఎవరైనా దోచుకోవాలని చూస్తే వాళ్ళు తనకంటే ఎంత బలవంతులైన సరే ప్రాణాలకు తెగించి వారితో పోరాడు తానని అందుకే ఆపిల్లవాడిని కుట్టానని చెప్తూ ఈ కనీస తెలివి మానవులకు లేదని ఇకనైన చైతన్యంగా జీవించమని చెప్తుంది. మనందరికీ తెలిసిన రాజుగారి ఏడుచేపల పాత కథను ఒక కొత్తకోణంలో మనకు రచయిత చూపిస్తాడు. ఇందులోని మనమందరం చెప్పుకునే ఒక మామూలు చీమని సామాజిక చైతన్యానికి ప్రతీకగా చూపిస్తాడు.

## సామజిక చైతన్యం :

పెట్టుబడిదారి వ్యవస్థ శ్రామికుల శ్రమ ఫలితాన్ని దోచుకుంటుంటే నోరు మెదపకుండా ఉన్న శ్రామికులకు చీమ కథ ద్వారా అది చేసిన తిరుగుబాటు ద్వారా సామజిక చైతన్యాన్ని కలిగించారు రచయిత. ఒక చీమ తన కష్టార్జీతాన్ని కాపాడుకోవడానికి తనకంటే కొన్ని వందలరెట్లు బలవంతుడిపైన కూడా తిరగబడింది. ఆ యుద్ధంలో తన ప్రాణాలను సైతం లెక్కించలేదు. తన శ్రమ ఫలితాన్ని కాపాడుకోవడంలో తన ప్రాణాలు కోల్పోయిన లెక్కచేయనని తన ప్రాణం కన్న తన కష్టానికే అధిక విలువనిస్తుంది.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

కథకుడు చీమది బంగారు పుట్ట ఏవిధంగా అయిందో తెలుసుకోవాలని చీమని అడుగుతూ నీది బంగారు పుట్ట కావడానికి వీల్లేదు ఒకవేళా బంగారమే అయితే అది నీ అక్రమార్జనే అవుతుంది అని అంటాడు. ఎందుకంటే కథ కుడు ఒక మానవుడు అతను మానవ సమాజాన్ని బాగా ఆకళింపు చేసుకున్నవాడు. కనుకనే తన సందేహానికి గల కారణాన్ని వివరిస్తూ ప్రస్తుత మానవ సామజిక స్థితిగతులను తెలుపుతూ పెట్టుబడిదారి వ్యవస్థలో శ్రామికులు ఏవిధంగా బలౌతున్నారో తెలుపుతాడు. "రాత్రిబవాళ్ళు శరీరం హూనం చేసుకున్నా పొట్టనిండని వాళ్ళు మనవ సమాజంలో చాలామంది ఉన్నారు. మాలో కొంతమంది కోటానుకోట్ల సంపదలను పాతేసుకున్న మాట నిజం. ఆ సంపదను కాపాడుకోవడంకోసము, దాన్ని పెట్టుబడిగాపెట్టి ఇంకా కోటానుకోట్లు సంపాదించడంకోసం వాళ్ళు అడ్డమైన పనులు చేస్తున్న మాటకూడా నిజం... అదే సమయాన తిండిలేక. తాగడానికి నీరు లేక, ఉండటానికి ఇంత నీడలేక, పురుగుల కన్నా హీనంగా బతుకుతున్న మనుషులు ప్రపంచం మొత్తం మీద అధిక సంఖ్యలోనే ఉన్నారు. ఈ దరిద్రులంతా సోమరు లనుకోకు రోజుకు 18 గంటలు పని చేసినా వారికి బువ్వ దొరకడం లేదు. కానీ వారి పాలకులు మాత్రం సమస్త భోగాలను అనుభవిస్తున్నారు. సంపదను సృష్టిస్తున్న వారి కేమో తిండి లేదు" (ఒక చీమ కథ – పుట 46) కనుక నీది కూడా అక్రమార్జనే అవుతుంది అని అంటాడు. కానీ ఆ మాటలు విన్న చీమ తానూ నీచమైన మానవునిలాంటి దాన్ని కాదని మానవ సమాజం ఎంత క్రూరమైనదో, నీచ మైనదో మనుషుల మధ్య మానవతా విలువలు ఏవిధంగా అంతరించాయో మానవ జన్మ పురుగులకన్నా ఎంత హీనమో మనకు చీమ మాటల ద్వారా రచయిత తెలియ జేస్తాడు.

"మీరెలా బతుకుతున్నది నేను చూస్తూనే ఉన్నాను. మీ చుట్టూ ఉన్న వాళ్ళు తిండిలేక మలమలా మాడి చస్తుంటే మీరు విందులు చేసుకుంటారు. మీ చుట్టూ ఉన్నవారు జానెడు గుడ్డతో మానం దాచుకోలేక సిగ్గు పడుతుంటే, కొనే దిక్కులేక మీ గుడ్డల తానులు మగ్గిపోతుంటాయి. మీలో నూరింట 80 వంతులమంది పశువుల కన్నా హీనంగా బతుకుతుంటే మీరు సిగ్గుపడటం కూడా మరచి పోయారు. మీ అంత నీచ ప్రాణుల్ని నేనెక్కడా చూడలేదు. మొత్తం విశ్వాన్ని మీ ముందుంచినా, మీరింకా ఇంకా కోరుకుంటూనే ఉంటారు. ఆకోర్కెలను తీర్చుకోవడంకోసం మిమల్ని మీరే దోచుకుంటారు. మిమల్ని మీరే దగా చేసుకుంటారు. మీమీద మీరే యుద్ధం చేసుకుంటారు. చేసుకోవడమే కాదు మీ చేతుల్లో మీరే నాశనం అవతారు. అలా నాశనం కావడానికైనా మీరొప్పుకుంటారు కానీ మరొకరి సొత్తుకు ఆశపడకుండా మాత్రం బతకలేరు"(ఒక చీమ కథ– పుట 47) అని మానవ లోకంలోగల కుళ్ళుని కుతంత్రాన్ని చీమ పాత్ర ద్వారా మనకళ్ళముందుంచారు భరద్వాజ. అందుకే ఆ బాలుడు సైతం మానవుడే కనుక తన పుట్టలో వేలుపెట్టాడని దాన్ని కూడా వదలలేదని పరాయి సొమ్ముపై మానవుని మమకారం ఎంతటి బలమైనదో మనకు తెలుపుతాడు.

ఇంకా తనది బంగారు పుట్ట ఏవిధంగా అయిందో తెలుపుతూ 'అది నా స్వార్జితం నేను కష్టపడి సంపాదించు కున్నాను. నా శ్రమ ఫలితం నాకు బంగారమే, మానవులు మరొకరి శ్రమ ఫలితాన్ని బంగారంగా మార్చుకుంటారు. నేను చీమను కనుక నా శ్రమ ఫలితాన్నే నేను బంగారంగా మార్చుకుంటానంటుంది. తన శ్రమ ఫలితాన్ని ఎవరు దోచు కోవడానికి ప్రయత్నించిన తను తిరుగుబాటు చేస్తానని ఆ తిరుగుబాటులో తన ప్రాణాలను కోల్పోవడానికైన సిద్ధమేగాని శ్రమ ఫలితాన్ని వదులుకోనంటుంది ఎంతో ధైర్యంగా. బానిసగా బతకడంకంటే స్వేచ్ఛకోసం ప్రయత్నించి చావడం మేలని అందుకే తనకన్నా బలవంతులైనవారు తనను నలి పెస్తారని తెలిసిన తన స్వేచ్ఛకై పోరాడంలో తృప్తి ఉందని చెప్తూ ఈ పాటి తెలివి మనిషికి లేదని అంటుంది. చైతన్యానికి ప్రతీకైన చీమ చివరకు మానవులలో కూడా మార్పు రావా లని కాంక్షిస్తూ మానవ లోకానికి సందేశాన్ని ఇస్తుంది. "నేను ఈ కుర్రాన్ని ఎందుకు కుట్టానో నీకిప్పటికైన తెలిసి ఉం

డాలి. నాకతనిమీద కోపంలేదు, ద్వేషం లేదు. నా శ్రమను కాపాడుకోవడం కోసం నేను చేసిన ప్రయత్నమిది. మీ వాళ్ళను కూడా ఇలానే చేయమని చెప్పండి" అని చీమ పాత్ర మనలో సామాజిక చైతన్యాన్ని కలగజేస్తుంది. ఈ కథలోని చీమ ఒక మామూలు చీమ కాదు సామజిక చైతన్యానికి ప్రతీక.

**ముగింపు :**

ఈవిధంగా రావూరి భరద్వాజ మనందరికీ తెలిసిన ఒక పాత కథను ఆధారంగా చేసుకొని దానిని ఒక కొత్త కోణంలో విశ్లేషించి మమెంతో అల్ప జీవి అనుకునే చీమను చైతన్యానికి ప్రతీకగా నిలిపారు. బానిసత్వ నిర్మూలన జరిగి పెట్టుబడి దారి వ్యవస్థ తొలగి సమ సమాజ స్థాపన జరగాలని కాంక్షిస్తూ చీమ ద్వారా లోకానికి సందేశమిచ్చారు. నాటి సామాజిక స్థితిగతులను కథావస్తువులుగా స్వీకరించి ప్రజలల్లో చైతన్యం కలిగించారు. సాహిత్యమంటే కేవల ఆనందాన్ని కలిగించేదే కాదని ఒక సామాజిక స్ఫూర్తిని చైతన్యాన్ని కలిగించేదని తన రచనల ద్వారా మనకు తెలియ జేసారు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# పాకుడురాళ్లు నవల్లోని స్త్రీ పాత్రలు దోపిడీకి ప్రతిరూపాలు

- బి. మేరికుమారి
తెలుగు శాఖాధ్యక్షులు,
జె.యం.జె. మహిళా కళాశాల, తెనాలి.

సమాజంలో నీతిని, ధర్మాన్ని అందించాల్సిన సినిమాలలో స్త్రీలు ఎన్ని విధాలుగా దోపిడికి గురౌతున్నారో తెలియజేసే నవల పాకురాళ్ళు. సినిమారంగంలోని రాక్షసులపై భరద్వాజ విసిరిన రాళ్ళ ఈ పాకుడురాళ్ళ సినిమారంగంలో పైకి కన్పిస్తున్న అందమైన రంగుల రాట్నం వెనుక నిజ జీవితంలోని ఎత్తుపల్లాలను, ఎగుడుదిగుడులను గుర్తించి, సునిశితంగా పరిశీలించి అక్షర సత్యంగా రాసిన నవల అత్యున్నతమైన, ఉత్తమోత్తమైన జ్ఞానపీఠ పురస్కారాన్ని సంపాదించింది.

ఎన్నో ఆశలతో, విపత్కర పరిస్థితులలో జానెడి పొట్ట కోసం, ప్రఖ్యాతి కోసం తెలిసో తెలియకో సినీరంగంలో ప్రవేశిస్తున్నారు. వచ్చిన తర్వాత నిలబడటం, నిలదొక్కుకోవటం విప్పుతో చెలంగాటం లాంటిది. స్త్రీ శరీరాన్ని అంగడి సరుకుగా భావించిన వారిలో పురుషులతోపాటు స్త్రీలు కూడ ఉన్నారు. సినిమాలు రంగులు వెదజల్లుతూ బాగుంటాయి. కానీ దానిలోని జీవితం చీకటి మయంగా ఉంటుంది స్థూలంగా చెప్పాలంటే మంగమ్మ అన్ని నటి జీవన ప్రస్థానమే ఈ నవల.

ఈ నవలలో మంగమ్మను నాటకాలలో తీసుకొస్తాడు, మాధవరావు. నాటక సమాజంలో తలలో నాలుకగా ఉంటున్న సమయంలో చలపతి కలిశాడు. మద్రాసు సినిమాలో హీరోయిన్‌గా రమ్మన్నాడు. అతనికి లొంగింది. సినీరంగ ప్రవేశం చేసిన తర్వాత మంగమ్మ పేరును మంజరిగా మార్చుకుంది. ఈ రంగుల ప్రపంచంలో ప్రవేశించిన తాయారమ్మ అనే బాధిత మహిళ మంగమ్మతో ఇలా అంటుంది.

“ఆ మాయ సచ్చినోడి మాటల్లో పడ్డాను. అరచేతిలో వైకుంఠం చూపించేసినాడండీ! నన్ను స్టార్ చేస్తానన్నాడు. సొంతంగా సినిమా తీస్తానన్నాడు. దొంగ సచ్చినదాన్ని అన్ని నమ్మాను. ఇంట్లో వున్న నగ, నట్ర బొర్లించేసుకొని వాడితో పట్నం వచ్చాను. వారంరోజుల కల్లా మా అయ్య, అమ్మ వచ్చారు నాలుగురోజులపాటు నన్ను బతిమాలారు. నేను రానంటే రానన్నాను. మా అమ్మ మరీ మరీ ఏడిచిందండీ! వెళ్ళబుద్ది కాలేదు. వాళ్ళెళ్ళిపోయారు. నాలుగైదు మాసాలు ఇదిగో అదిగో అంటూ నన్ను బులిపించాడు వాడు. ఉన్న సొమ్మంతా ఖర్చుయి పోయింది. తిండికి కూడ కటకట పడ్డాను. వాడు చెప్పకుండా వెళ్ళిపోయాడు. కడుపు నాయ గట్టుకొని అన్ని కంపెనీల చుట్టూ తిరిగాను. ఇదిగో అదిగో ననటమేగాని ఏమీ లాభం లేకపోయింది. ఆఖరికి ఎక్స్‌ట్రా వేషాలు కూడా సిద్ధపడ్డాను. అది అంతంత మాత్రంగానే ఉంది. రోజల్లా స్టూడియో లోపల పడిగాపులు కాస్తే అయిదారు రూపాయిల కన్నా దొరకవమ్మా! అవన్నా వెంటనే చేతుల్లో పడవు. ఆ ముష్టి అయిదు రూపాయల కోసం కాంట్రాక్టరు చుట్టూ తిరగాలి. వాడు రేపురా, మాపురా అంటూ మాసాలు కొద్ది తిప్పుతాడు. పాటికి పదిసార్లు అడిగితే ట్రబుల్ సమ్ ఆర్టిస్టు అని టాంటాం కొట్టి ఇంకోసారి పిలవడు అడక్కపోతే అసలు వసూలు కాదు. ఎప్పటికోప్పటికి వస్తుంది గదా అని సరిపెట్టుకోవడానికి వీలులేదు. సంవత్సరానికి అయిదు చిన్న వేషాలు దొరికితే అక్కడికి అదృష్టమే అనుకోవాలి. ఆ డబ్బులోను రూపాయికి పావలాలు కమీషను పోను మిగతావి చేతికి వస్తాయి. ఈ వేషాలుకయినా వొళ్ళప్పగించాల్సిందేనమ్మా నాకు రోత పుట్టింది ఫీల్డును వొగ్గేసినా, పనిచేసుకుని బతుకుతున్నాను. నా ప్రాణానికి హాయిగా ఉంది (ప్రాకుడురాళ్ళు పుట-55) అంటుంది తాయారు. ఆమె మాటలు ఎన్ని మంగమ్మ చాలసేపటికిగాని మామూలు స్థితిలోకి వచ్చింది. స్త్రీలను వంచించిన మగవారు కొందరు ఎన్నిఎత్తులైనా వేస్తారు వారిని నమ్మించి వారి పేర్లు మార్చుతారు. స్త్రీలను లొంగదీసుకొనుటకు స్త్రీలనే పావులుగా వాడుకుంటారు. కళ్యాణి అనే స్త్రీ మంజరితో ఇలా అంటుంది.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

మంజురాజన్ అని నాకు తెలిసిన కోటీశ్వరుడొకా యనున్నాడు ట్రిచ్‌లో ఆయనకు చాలా వ్యాపారాలున్నాయి. ఆయన నాకు బాగా తెలుసు నన్ను కూడా ట్రిచ్‌కు తీసు కెళ్ళాడు. ఇందాకనే వచ్చి ఫోన్ చేశాడు. నా ఆరోగ్యం బావుంటే ఏ గొడవ లేకుండా నేనే వెళ్ళేదాన్ని నా బ్లూ మెర్క్యూరీ కారు అతను ప్రజెంట్ చేసినదే. నీవు నా చెల్లివని చెబుతున్నాను. నువ్వు కూడ అదే చెప్పు. మనిషి బంగారంలో మునిగి తేలుతుంటాడు. నీవు నచ్చితే నీకు ఒక కారు ప్రజెంట్ చేస్తాడు. కింద కారు రెడీగా ఉంది. నిజంగా నిన్ను అక్కడికి పంపడం నాకిష్టంలేదు. నిన్ను చూచిన కళ్ళతో నన్ను చూస్తే భూతకిలా కనపడతాను నాకిక అతను దక్కుతాడన్న నమ్మకం కూడ లేదు అని అంటుంది. మంజరి వెళ్ళడంతో తన మెడలో ఉన్న డైమండ్ నక్లెస్ చూసుకొని మురిసిపోతుంది. సాటిస్త్రీ అని చూడక మంజరిని వాడుకుం టుంది. తాను చెడిపోయింది కాక ఇతరులను కూడ చెడ గొడుతుంది కళ్యాణి. ఇలాంటి సంఘటనలు సినీరంగంలో ఉన్న వారి విషయంలో కన్పిస్తాయి.

మంజరిస్థాయి పెరగడంతో ఆమె లోబడి ఉండదని ఆమె తనవద్దనే కట్టుబడి ఉండాలని ఏవో ప్రయత్నాలు చేస్తాడు చలపతిరావు. ఉత్తర భారతదేశంలో కాలుమోపి కలలను నిజం చేసుకోవటానికి చెందులాల్‌ని వాడుకుం టుంది. విదేశాలలో పర్యటించింది. ఆమె ఇంకా సాధిం చాలని అనుకున్న సమయంలో ఆమె దశ వెనుకకు తిరుగు తుంది, ఆరోగ్యం దెబ్బతిన్నది. జీవితంలో విషాదం డబ్బు లేకపోవడం కాదు మనల్ని ప్రేమించే వాళ్ళు లేకపోవడం. మనం ప్రేమించడానికి ఎవ్వరూ దొరక్కపోవటం మీరు లైటుగా తీసుకోండి నేనిది అక్షరాల అనుభవించి చెబుతు న్నాను అని మంజరి అంటుంది. చివరిదశలో ఆకుపచ్చని కాశ్మీరపు తివాచి మీద అసువులు బాస్తుంది.

వందలకొద్ది కళాకారులు, వేలకొద్ది శ్రామికులు, లక్షల ప్రేక్షకులు, కోటానుకోట్ల వ్యాపారులు గల సినీపరిశ్రమను శాసించే అతికొద్ది మంది శక్తులకు కనువిప్పు కలిగించాలనే తపన ప్రధానంగా స్త్రీ అత్యంత జాగ్రదావస్థలో నుండి తనను తాను సంస్కరించుకుంటూ సమాజాన్ని సంస్కరించాలనే మేలుకొలుపు ఈ నవలలో అడుగడుగునా అక్షరసాక్షమై సాక్షాత్కరిస్తుంది.

చలనచిత్ర సీమలోని వాస్తవ సంఘటనల్ని లోకానికి విప్పి చూపాలనే ఉద్దేశంతో చేసిన ప్రయత్నమే ఈ నవల. దీనిని చదివితే మనిషి అనే పదానికి అర్థమేమిటో? మానవతా విలువలు ఏమైనాయో అనే భయభ్రాంతులు, అలాగే లోకం ఇలా కూడ ఉంటుందా అనే ఆవేదన కన్పి స్తుంది. ఈ విషయాల్ని చూసి కలవరపడి కలతచెంది, కార్చిన కన్నీరే ఈ పాకుడు. రాళ్ళు నేడు ఈ రాళ్ళే జ్ఞాన పీఠాన్ని వరించించాయి.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# "కరుణ రస ప్లావితం జీవన సమరం"

- ఆచార్య గోగినేని యోగ ప్రభావతి దేవి
**తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం,**
**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.**

రావూరి భరద్వాజ లేఖిని నుండి వెలువడిన 'జీవన సమరం' సామాన్యుల జీవిత చిత్రణా సంపుటం. వ్యధార్త జీవుల యధార్థ గాథలను రస గుళికలుగా, పఠిత కళ్ళల్లో కన్నీటి బిందువులు రాలేట్లుగా రూపొందించిన భరద్వాజ జీవన సమరంతో రచయితగా విజయపరంపర నందుకున్నారు.

ఈ గాథలన్నీ అథోజగత్సహోదరుల బతుకుల్లోకి తొంగి చూడగలిగిన భరద్వాజ, రామోజీరావు గారి ప్రేరణతో ఈనాడు దినపత్రికలో 'జీవన సమరం' శీర్షికా ముఖంగా పాఠకుల కందించారు. సామాజిక జీవన ప్రతిబింబాలైన ఈ రచనల్లోని వ్యక్తులందరూ మన మధ్యన జీవిస్తున్నవారే. వారి అట్టడుగు బతుకుల్లోకి తొంగిచూసి, స్పందించి, మనల్ని స్పందింప చేయగలిగిన ఘనత భరద్వాజకే లభించింది. ఈ బాధామయ గాథా పరంపరకు జ్ఞానపీఠ అవార్డు వచ్చి వుంటే బాగుండేదని భరద్వాజ భావించారు.

పేద రైతదు కుటుంబంలో పుట్టి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న కలం కార్మికుడు భరద్వాజ. తొలిదశలో ఆయన చలం శైలిలో రచనలు చేశారు. పిల్లలకు, పెద్దలకు పాపులర్ సైన్సు పుస్తకాలు, అనేక కథలూ, నవలలూ రాశారు. స్మృతి సాహిత్యాన్ని అందించారు. ఆలిండియా రేడియోలో చేరి ప్రముఖులతో ఇంటర్వ్యూలు చేశారు. వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

అన్నింటినీ మించి ఈనాడులో ఏడాదిపాటు కొనసాగిన "జీవన సమరం" ఫీచర్ ఎంతో ప్రజాదరణ పొందింది. 'అన్నమో రామచంద్రా'లో అన్నం బండిని తోసుకుంటూ కేరేజీలు అందిస్తూ పిల్లల్ని బతికించుకుంటున్న అంజమ్మ, 'తప్పెట్లోయ్ ... తాళాలోయ్' లో తాళాలు బాగుచేస్తూ బతికే జహంగీరు, 'మరుగున పడిన మానవత' లో బజ్జీలమ్ముకునే సావిత్రి, 'రెక్కాడినా డొక్కాడదు' లో కొడవలి, గొడ్డలి సానపట్టే శ్రీరాములు, 'ఖరీదు కట్టే షరాబు లేదు!' లో సుందర శిల్పాలు మలిచే ఆగమయ్య, కంకర కొడుతూన్న వైనం, 'ఛత్రపాణి' లో గొడుగులు రిపేరు చేసే శంకరయ్య, 'కేశోపనిషత్తు'లో సవరాలు కట్టే రాములు, 'పప్పులోన ఉప్పు కలిపి కుప్పలు పోస్తాడు' లో బఠానీ, పల్లీల పచ్చడితో బతికే శేషగిరి, 'భ్రమణం – పరిభ్రమణం'లో రంగులరాట్నం తిప్పుతూ బతికే జాఫర్, 'వెలుగుల జడి విరిసేదెప్పుడు' లో చేనేత కార్మికుడు వీరాస్వామి, 'గాజు పెంకుల నడుమ బూజు బతుకును చూడు'లో సీసా పెంకుల బిజినెస్‌తో బతుకీడుస్తున్న ముత్యాలు, 'ఇంతేలే పేదల బతుకులు'లో ఇటుకలు కాల్చే రాములు, 'ఒకటికి 15 లక్షలు' లో లాటరీ టిక్కెట్లమ్మే శంకరన్ నాయర్, 'భయం .... భయం... బతుకు భయం!'లో ఎద్దులకు, గుర్రాలకు, దున్నపోతులకు నాడాలు వేసే వృత్తితో జీవించే కాశయ్య, రూపాయిస్తే మెరుపు మెరిస్తే'లో బియ్యే చదివి గడియారాల మెరుగు పనిని బతుకుతెరువుగా చేసుకున్న శామ్యూలు ఆనందరావుల కష్టమయ జీవన చిత్రాలు దర్శనమిస్తాయి.

'బోడిపెత్తనం బొమ్మలాట' లో పాత బట్టకు స్టీలు గిన్నెలమ్మే కేశవులు, 'ఆర్చేదెవరు? తీర్చేదెవరు?' లో కథా కాలక్షేపాలతో బతికే రాంకిష్టయ్య, బలరాముడు, గంగిగోవుపాలు సీసాలు సేకరించి, ఆ కమీషన్‌తో బతికే చలపతిరావు, 'తాజమహలు నిర్మాణానికి .....' లో తాపీ పనితో బతికే కూలి శేషయ్య బతుకు పూలబాట కాదులో నాటకాల పిచ్చి, సినిమాల పిచ్చి వదిలాక, పూలు, పూలదండలు అమ్ముకుంటూ పొట్ట బోసుకునే నాగరాజు, 'ముందుగతి కానవే చిలకీ!'లో సర్కస్ కంపెనీల్లో ఫీట్లు చేసి, కాలు చితికిపోయాక చిలకజోస్యం ప్రారంభించిన యశ్వంతరావు, 'మిలమిల మెరిసే గాజుల గలగల'లో రాళ్ళు పొదిగిన గాజుల తయారీతో బతికే భిక్షపతి, 'చచ్చులూ, పుచ్చులూ ... 'లో వెట్టిచాకిరి

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

నుండి బయటపడి కూరగాయలమ్మి బతికే యాదగిరి, 'పదివేళ్ళూ పనిచేస్తాయి' లో లారీ డ్రైవర్‌గా ఉండి కాలు విరిగాక, ప్లాస్టిక్ కేన్‌తో కుర్చీలూ, మంచాలూ అల్లుతూ జీవించే బాలయ్య, 'కాయకల్పచికిత్స'లో పాత్రలకు మాటు వేసే రజాక్, 'చేదు విషం ........ జీవఫలం!' లో సైకిల్ రిపేరు చేసి బతికే మస్తాను, 'బతుకు కోసం బహుకృత వేషాలు'లో బొగ్గు, సుద్దముక్క, చాక్‌పీసులతో దేవతా విగ్రహాలుగీసే నటరాజన్‌ల జీవిత రేఖా చిత్రణ కళ్ళకు కదుతుంది.

'తలకుండు విషము ఫణికిని........' లో పాముల్నాడించే ఖాజామియా, 'సారెసారెకున్.......'లో మట్టితో రకరకాల పాత్రలు చేసే గురవయ్య, 'మనిషి కన్న మృగనయం'లో ఎలుగుబంటి సాయంతో బతికే రామస్వామి, కంతి తలగడ కాదు, కలనిజం కాదు!'లో పీచుమిఠాయి అమ్మే మునికన్నయ్య, 'మాయ తివాచి'లో సున్నం కొట్టే సత్తెయ్య, 'ఎరుకోయమ్మ ఎరుక'లో సోది చెప్పే నరసమ్మ, 'అంగిలో పోచ అటూ పోదు – ఇటు రాదు'లో చేపలు పట్టే గంగయ్య, 'కేసరి జీర్ణతృణంబు మేయునే' లో పరుపులు కుట్టే మీరాసాహెబు, 'గడయెక్కినా, గడప గడపెక్కినా ......'లో గడకర్ర మీద ఆడే రాములమ్మ, 'గొడ్డుచాకిరి – గుడ్డక్కరువు'.... లో నేతపనితో బతికే రామస్వామి, 'కుడి ఎడమల దగా దగా'లో వడ్రంగంతో బతికిన బ్రహ్మానందం, 'నేను సైతం ఇంటి పొయ్యికి ....' పేరుతో పిడకలు చేసి అమ్ముకునే పోశమ్మ, 'ఒకసారి, రెండుసార్లు ..'లో వేలం పద్ధతిలో చీరలు, రవికల గుడ్డలమ్మే ఏకాంబరప్ప, 'లేదురా ఇటువంటి భూమి ఇంకెందు ........'లో గానుగ సున్నంతో బతుకు భారాన్ని మోసే సింహాచలం, 'వెదురుతో వేయి రకాలు' తో బుట్టలల్లే తిరుపతయ్య, 'అందరికీ వేడి (తే) నీరు'లో చాయ్ సప్లై చేసే జహంగీరు, 'ఎదుగూ బొదుగూ లేదు నారాయణా ...'లో కలాలూ, కళ్ళజోళ్ళూ అమ్మే నూకరాజు, 'ఏమున్నది గర్వకారణం'లో పూసల దండలు, పట్టుదారాలు, జడపిన్నులు వగైరాలమ్మే ఖాదరు, 'హాళ్ళికి హాళ్ళి' ....లో, మాలిష్ చేసే రామదాసు, 'డూడూ బసవన్న'లో గంగిరెద్దుల నాడించే బసవయ్య, 'ఆడే రెక్క మాడే డొక్క'లో దేవతా విగ్రహాలు శాస్త్ర ప్రకారంగా మలచగలిగిన నాగలింగం, 'కాదేదీ శిల్పి కనర్హం' లో కొమ్ముతో దువ్వెనలు చేసే కాశిం, 'చెమ్మగిలు నయనమ్ము లేదు'లో చెట్లు కొట్టే పాపయ్య, 'ఊరు ఉండమంటుంది.....'లో గుర్రాల మాలిష్ మాని తేగలమ్ముకునే మొయినుద్దీన్, 'బండబారిన మొండి బతుకులు'లో కత్తెరలు సానబట్టే పండరిల విషాద జీవిత చిత్రణ సాక్షాత్కరిస్తుంది.

ఈనాడులో ఒక్కో జీవిత చిత్రం ప్రచురితమైనప్పుడల్లా ఆ దురదృష్టవంతులకు ధన సహాయం చేసినవారూ, వారి బ్రతుకుల్ని మెరుగు పరచిన సందర్భాలూ, ఉద్యోగ సదుపాయాలు కలుగజేసిన ఉదారులు, దయాపరులెందరో ఉన్నారట. తెలుగు పత్రికా ప్రపంచంలో ఇటువంటి సంఘటన అపూర్వమని సంపాదకుల భావన. 'జీవన సమరం' వంటి శీర్షిక నిర్వహించగలిగిన దక్షత భరద్వాజకే సాధ్యం.

భరద్వాజ రచనలో సహజత్వం వెల్లివిరియడానికి, ఆయన పాత్రలు జీవచైతన్యంతో స్పందించడానికి, విస్తృతమైన ఆయన జీవితానుభవాలే ముఖ్య కారణాలయ్యాయి.

# రావూరి భరద్వాజ సాహిత్యము – సామాజిక స్పృహ

**"కష్టాల కడలిని ఎదురీది**
**కడగండ్లే విరిచెండ్లుగా చేబూని తేలి,**
**పేదరికము వీపు బాదితే**
**సర్టిఫికెట్లకు అందనంత చదివి, ఎదిగి,**
**వ్యధను చిదిమి, సుధలలికిస్తూ**
**సాహితీ సేద్యం చేసిన కర్షక వీరుడు**
**అక్షర శ్రామికుడు, అక్షయ సాహితీ ప్రేమికుడు"**
**- రావూరి భరద్వాజ**

**ఏడు పదుల సాహితీ వ్యాసాంగం**
**ఎల్లలు లేని సాగర మథనం**
**చలించి, ఛరించి,తరించి, ధరించి,**
**జ్వలించి, జ్వాజ్వలామానంగా వెలిగించి,**
**వెలుగిచ్చి, చెప్పి, చెప్పించి, వేదన వినిపించి,**
**ముద్దుగారే బాలల ముచ్చటదీర్చి,**
**వింతలు విప్పి, పుంతలు తీర్చి**
**ఇంతింతని చెప్పజాలని అనంత రచనలు చేసి**
**ఇక చాలని – తన చాన**
**కాంతమ్మతో ఏకాంతమిమ్మని**
**ఎవరూ అందుకోలేని అనంత ఎత్తుకు**
**ఎదిగి నిలిచారు రావూరి భరద్వాజ**
**ఎగురవేసాడు అనంత సాహితీ ధ్వజ**
**అవార్డు రివార్డు తారల మధ్య జ్ఞానపీఠమై నిలిచాడు**
**వెన్నెల కురిపించి మిన్నును కరిగించి వెలిగాడు**

2012వ సం॥ చాలా పుణ్యం చేసుకుంది. సాహిత్యాన్ని సామాన్యుని జీవితాన్ని తిరగలిలో వేసి తిప్పి వేదన, రోదనల నుండి పుట్టిన వాదనతో సాధన చేస్తూ, సాహితీ పిపాసల ఆకలిదప్పులు తీర్చిన భరద్వాజకు జ్ఞానపీఠమిచ్చి గౌరవించి, తన గౌరవాన్ని నిలబెట్టుకుంది. మనమొక విషయాన్ని గమనించాలి. భరద్వాజకు పూర్వము జ్ఞానపీఠ అవార్డు పొందిన తెలుగువారిద్దరూ తెలుగు పండితులు.

- పి. యామినీ అమ్మాజీ
**తెలుగు అధ్యాపకురాలు,**
**డి. ఎస్. గవర్నమెంట్ మహిళా కళాశాల,**
**ఒంగోలు, ప్రకాశం జిల్లా.**

శ్రీ విశ్వనాథ్‌గారు, తెలుగు అధ్యాపకులు, ప్రిన్సిపల్ కూడా. శ్రీ సినారే గారు కూడా తెలుగు అధ్యాపకులే, కాని మొదటిసారి తెలుగు పాండిత్యం లేని తెలుగు బోధించని ఒక నిఖార్సైన సాహిత్యకారునికి వచ్చింది. మొదటి రెండు తెలుగు కవిత్వానికి వస్తే, ఈ సారి తెలుగు వచనానికి గౌరవం దక్కింది.

విశ్వం అనే విద్యాలయంలో ప్రకృతి ఒడిలో మురుస్తూ, సమాజ చట్రంలో నలుగుతూ,పేదరికపుసమ్మెట దెబ్బలు తింటూ, ఆకలి, అవమానాల నుండి అనుభవాలను నేర్చుతూ, సమాజాన్ని చిత్రిక పట్టి,సాహిత్యాన్ని వెలయించిన స్రష్ఠ డా॥రావూరి భరద్వాజ."జీవితంలో అనుభవాన్ని మించిన జ్ఞానం లేదు."అనే రావూరిగారు తనకు ఆకలి, అవసరాలు చాలా నేర్పాయన్నారు. సమాజంలో అన్యాయాలకు, అధర్మాలకు బలైపోయిన వారి జీవితాలను చూసి చాలా నేర్చుకున్నానన్నారు. కనుకనే భావంలోని చిక్కదనాన్ని, బరువును వరుసగా పేర్చి, పదాలకెత్తారు. సాదా, సీదా భావాలకు అందమైన దుస్తులు తొడిగి అపురూపమనిపించారు.

భరద్వాజగారు ఆధునిక సాహితీ జగత్తులో ఒక మాటల ముని. కథానికల సృష్టికర్త. "వినువీధిలో వింతలు" అంటూ ఖగోళ శాస్త్ర భవిష్యత్తు చెప్పిన కాల్పనిక బ్రహ్మ, శశూన్ ఉపరిగ్రహ సృష్టికర్త.

ఇనుప తెర లోగుట్టు విప్పిన గొప్ప మానవతా వాది. సాంప్రదాయాలు, ఆచారాలు, నీతి సూత్రాలు, కట్టుబాట్లతో పాటు చదువు, డబ్బు కూడా కలిసి స్త్రీని గిరసబారిన చెట్టు లాగా మార్చాయని బాధపడేవారు. కడు పేదరికం నుండి

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

జ్ఞానపీఠం మెట్లు అధిరోహించేవరకు తన జీవితం నేర్పిన పాఠాలను సాహిత్యంగా మలిచారు రావూరి. ఒక సాహితీ వేత్తగా, కథారచయితగా, బాల సాహితీ వేత్తగా, నవలా కారునిగా, బాల విజ్ఞాన శాస్త్ర రచయితగా, నాటక కర్తగా, రేడియో ప్రయోక్తగా, సహస్ర ముఖాల సరస్వతీ కటాక్ష మందించారు.

భరద్వాజగారి సమకాలీకులైన చలం, గోపిచంద్, ధని కొండ హనుమంతరావు మొదలగువారు మధ్యతరగతి, సంపన్న వర్గంలోని జీవితాలను చిత్రికబడితే, రావూరి భర ద్వాజగారు అథోజగత్ సహోదరుల కన్నీళ్ళను, కడగండ్లను అక్షరబద్ధం చేసారు. దిగువ, మధ్యతరగతి జీవితాల్లోని సంఘ ర్షణలను, సవాళ్లను, ఈర్ష్య, అసూయలను, పట్టింపు లను, పంతాలను, చిన్నచిన్న సుఖాలను,పెద్ద పెద్ద దు:ఖా లనుతన రచనల్లో చిత్రిక పట్టారు.

1944 నుండి 2012 వరకు 70 ఏళ్ల సుదీర్ఘ సాహితీ వ్యాసాంగంలో 150 వరకు గ్రంథాలు రచించారు. 50 కథా సంపుటాలు, 17 నవలలు, నాటకాలు, రేడియో నాట కాలు, పిల్లల రచనలు, వైజ్ఞానిక రచనలు మొదలైనవి ఆయన కలం నుండి పుంఖానుపుంఖాలుగా పుట్టుకొచ్చాయి.

**కథలు :**

**1. విమల :** 1945 నాటికే వారు సుప్రసిద్ధ కథకులు. మొదట ప్రజామిత్రలో అచ్చు అయిన కథ విమల. కందు కూరి గారి వితంతు పునర్వివాహాన్ని సమర్థిస్తూ వ్రాసిన కథ. సీతారామయ్యగారు, తన వితంతు కూతురైన విమలకు పునర్వివాహం చేయడం, దానికి దారి తీసిన పరిస్థితుల గురించిన కథ.

**2. కడుపు తీపి :** దారి తప్పిన కూతురి తప్పును తనపై వేసుకొని, కళంకితగా చనిపోయిన కన్నతల్లి పార్వతమ్మ కడుపుతీపి కథ.

**3. నర(క) లోకం :** నారద మహర్షి మాటలో మానవ రూపంతో మానవలోకానికి వెళ్లిన సింహం, మను ష్యుల్లో వున్న కులాలు, మతాలు, ఈర్ష్య, ద్వేషాలు, వర్గాలు, ఘోర కృత్యాలు, రాక్షసత్వం, ఆత్మవంచన, మోసం, దగా, కుళ్లు, కుతంత్రాలు మొదలగు వాటిని ఏవగించుకొని, జబ్బు పడి, తిరిగి అడవికి వస్తుంది.

**4. వీరగాథ :** దీనికి మూలం తండ్రి కోటయ్యగారే అన్నారు భరద్వాజగారు. రాచబిడ్డ తప్పిపోయి కోయిలతో పెరిగి తిరిగి రాజ్యం వశపరచుకోవడం కథ. డిగ్రీలో ఉప వాచకంగా పెట్టారు.

**5. నాకు దేవుడిని చూడాలని వుంది :** అంటూనే నాస్తి కత్వాన్ని చూపారు. కష్టాల్లో వున్న వ్యక్తిని ఆదుకున్న ప్పుడు ఆ వ్యక్తి చూపించిన కృతజ్ఞతలోనే భగవంతుడు కనిపిస్తాడు అన్నది ఈ కథ.

**6. సశేషం :** జీవితానికి, మరణానికి మధ్య గల సరిహద్దు గురించిన రచన సశేషం. ఆంధ్రప్రభలో 4,5 వారాల పాటు ధారావాహికగా వచ్చింది.

**7. వర్గదృష్టి :** సరభయ్య శ్రామికునిగా వున్నప్పుడు, యజమానిగా మారాక, ఆ ఆలోచనల్లో వచ్చిన మార్పే వర్గదృష్టి.

**8. నువ్వేం చేస్తున్నావ్? :** రమణిపై ఆశ పడి మరలా మనస్సు దిద్దుకున్న మాధవరావు కథ.

**9. ఆహుతి :** ఆత్మాభిమానం, ఆత్మగౌరవం కల్గిన ముగ్గురు అమ్మాయిల కథ ఆహుతి.(జానకి, లలిత, నీలవేణి)

**10. డాక్టర్స్ డైలమా :** అగ్నిప్రమాదంలో భర్త, పిల్లలనే కాక కళ్లు, కాళ్లను కూడా పోగొట్టుకున్న ముసలామె కథ. (ఇంగ్లీషులోకి అనువాదమైంది)

**11. పాలపుంత :** నిజానికి పాకుడు రాళ్లు పూర్వ రంగం పాలపుంత. నాటకాలు వేసే మంగాయమ్మను మంజ రిగా దిద్దిన సారథి, చివరకు ఆమెనే చేరడం సుఖాంతం. పాకుడు రాళ్లలో చలపతి దుర్మార్గుడు, అది దు:ఖాంతం.

**12. సౌందరనందనం :** సాంప్రదాయం, ఆధు నికతల మధ్య నలిగిన సుందరి కథ.

**13. చీమ కథ :** అధికారమున్నవారి మనస్తత్వాన్ని తెలియజేప్పే కథ.

**14. ఎలుక కథ :** మనిషి నయవంచనను తెలిపే కథ.

**15. ఇనుప తెర వెనుక :** రష్యా విధానాన్ని గురించిన కథ

**16. జీవన సమరం :** వృదార్త జీవుల యధార్ధ గాథలు, జ్ఞానపీఠమెక్కాల్సిన పోరం బతుకులు ఈనాడులో ఏడాది పాటు సాగిన ఫీచర్‌లో 52 యధార్ధ గాథలున్నాయి. టిఫిన్ క్యారియర్ మోసే అంజమ్మ నుండి సానబెట్టే పండరి వరకు పిడికెడు మెతుకుల కోసం జీవన సమరం సాగించే నిరుపేద యోధుల కథలు, గాథలు – వ్యథలు.

**17. ఇతర కథా సంపుటాలు :**

1. రాగిణి, 2. జాలిగుండె, 3. కొత్త చిగుర్లు, 4.పాపం, 5.కథాసాగరం, 6. కథా వాహిని, 7. అపస్వృతులు, 8.భాగే శ్వరి, 9. గాలిపటం, 10. జయంతి, 11.అర్థాంగి, 12.కల్పన, 13.లోకంకోసం, 14.మమకారం, 15.పద్మ వ్యూహం, 16.వశుచరిత్ర, 17.అన్యధా శరణం నాస్తి, 18. కిన్నెర మిథునం, 19. మంజూష, 20. మళ్లీ తెల్ల వారింది. 21.మానవుడు మరణిస్తున్నాడు. 22. దావానలం, 23. మూఢనిద్ర, 24. సౌదామిని, 25.త్రినేత్రుడు, 26. ఉన్నది ఊహించి, 27. పాలపుంత, 28.మనోరమ, 29.మానవుడు–దానవుడు, 30.మొనలేని శిఖరం,31.నిన్ను గురించిన నిజం, 32.పుత్రకామేష్టి, 33.మచ్చుకోచచ్చు కథ, 34.భరద్వాజ కథలు (2,3,4 సంపుటాలు), 35.విజయ విలాసం, 36.సిరికింజెప్పడు, 37.వసుంధర, 38.పాద్యమి, 39.శ్రీరస్తు, 40.అపరిచితుడు, 41.విన దగును మొదల గునవి.

## నవలలు :

**1. పాకుడురాళ్లు :** మాయాజలతారు అని పేరు పెట్టారు కానీ మిత్రుడు శీల వీర్రాజు గారి సలహాపై పాకుడు రాళ్లుగా మార్చారు. మంజరిగా మారిన మంగమ్మ నటిగా వెలగడానికి దిగజారుతూ, చివరకు ఆత్మక్షోభ భరించలేక ఆత్మహత్య చేసుకుంటుంది. ఎందరో సినీనటుల జీవితాల్లోని నగ్నసత్యాలను వెలికితీసిన నవల పాకుడురాళ్లు. జ్ఞానపీఠ్ అవార్డు పొంది, తెలుగు కథను మురిపించింది.

**2. కరి మింగిన వెలగపండు :** హాస్యనవల. మనస్తత్వాలు మారక, శరీరాలు తారుమారైన సత్యవతి, శంకరంల చేష్టలు నవ్వించినా సమాజ ప్రతీకలుగా నిలుస్తాయి. చివరకు మరలా యథాస్థితి వచ్చి, కథసుఖాంత మౌతుంది. 1962లో కృష్ణా పత్రికలో సీరియల్‌గా వచ్చింది.

**ఇతర నవలలు :**

కాదంబరి, అసావేరి, ఇథం జగత్, చిత్రగ్రహం, జల ప్రళయం, శిథిల సంధ్య మొదలగునవి.

**నాటికలు :**

ఆత్మగతం, భానుమతి, జీవనది, దూరపుకొండలు మొదలగునవి.

**స్మృతి సాహిత్యం :**

భరద్వాజగారు తనతో 36 ఏళ్లు కాపురం చేసిన ప్రాణ సఖి కాంతమ్మగారి స్మృహలతో మమేకమయ్యారు. "ఈ అపజయం నన్ను అంధుణ్ణి, బధిరుణ్ణి, వికలాంగుణ్ణి, జీవచ్ఛ వాన్ని చేసింది." (నాలోని నీవు) "ఎందరెందరున్నా అందరి మధ్య ఒంటరివాడిని"అని కుమిలిపోయారు."మళ్ళీ మళ్ళీ నిన్నెప్పుడైనాచూస్తానా? నా పిలుపు, నా రోదన నీ దాకా రావడం లేదా కాంతం" "నువ్వే, నువ్వే జ్ఞాపకం వచ్చి అణువణువుని చిదిమి పారేస్తున్నావ్" అంటూ పలవరిం చారు. 1. నాలోని నీవు, 2.అంతరంగిణి, 3.అయినా ఒక ఏకాంతం, 4.ఒకింత వేకువ కోసం. చివరికి కాంతంతో ఈశ్వరునికి అబేధం చూసాడు.

**బాల సాహిత్యం :**

50కి పైగా బాలసాహితి గ్రంథాలు గలయించారు. విజ్ఞా నాన్ని, వినోదాన్ని అందించే కథలు, శాస్త్రీయ విజ్ఞానం అందించే ఆసక్తి కలిగించే రచనలు చేసారు. అనేక పత్రిక లలో బాలల కోసం శీర్షికలు నిర్వహించారు. ఆకాశవాణిలో బాలానందం వంటి బాలల కార్యక్రమాలకు అపూర్వ రూప కల్పన చేసారు. బాలల కోసంకథ, విజ్ఞానం, సైన్స్ పిక్షన్ మొదలగు రచనలు చేసారు. ఉదా : 1.మణిమందిరం, 2.కీలుగుర్రం, 3.మాయాలోకం, 4.పరకాయప్రవేశం, 5.రతనాల లోయ, 6.సముద్రవీరుడు, 7.వనరాణి.

**నవలలు :**

ఆకతాయి, అనగా అనగా, బంగారు లేడి, పద్దు తెచ్చిన

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

ముద్దు తమ్ముడు, పంజరంలో చిలుక, తెలివైన దొంగ, పసిడి పలుకులు, చిలుక తీర్పు, ఉడుతమ్మ ఉపదేశం, బంగారు కుందేలు ఇవి కాక సుగమ విజ్ఞానం పేరిట 35 గ్రంథాలు, ఒకటి ద్రవ్య ప్రపంచం నుండి వ్యర్థం నుండి అర్థం వరకు.

**ఇతరములు :**

ఇవీ కాక ప్రయోగాత్మక రచనలు చేసారు. శూన్యం గురించి సృష్టి. నా గురించి నాలుగు మాటలు, వెలుతురు చినుకులు, రవ్వలు, ఏదీ నాది కాదు, శిరసా నమామి ఇవీ కాక కొన్ని జీవిత చరిత్రలు, వైజ్ఞానిక వ్యాసాలు, వ్యాస సంపుటాలు వ్రాసారు.

**జగమెరుగని కవి**

సర్వోదయ పత్రికలో అభయం, చేదు పాట, గడియారం, శపథం, అలజడి మొదలగు కవితలు ప్రచు రించారు.

**ఈ వేదనలో రోదనలు**
**కష్టాలు, నష్టాలు**
**ఈ అస్తవ్యస్త సమాజం**
**భగభగ మండే రోజులు**
**ఫెళ ఫెళ ఫెళ పగిలే రోజులు**
**ఎంతో సామీప్యం నేస్తం**
**దిగులందకు కందకు నేస్తం**

అంటూ అభయమిచ్చి అక్షర లక్షలిచ్చి సాహిత్యా కాశాన్ని అమృతమయం చేసి జ్ఞానపీఠుడై వెలిగాడు. సుజ్ఞాన మూర్తి మన రావూరి భరద్వాజగారు.

# జీవన సమరం

**- డా॥ చిలక అనిత**
**తెలుగు అధ్యాపకురాలు,**
**ప్రభుత్వ మహిళా కళాశాల(స్వయం ప్రతిపత్తి), గుంటూరు.**

కలం కార్మికుడిగా అత్యంత పేదకుటుంబంలో జన్మించి, జీనవ మనుగడ కోసం ఆయన ఎదుర్కొన్న వాస్తవ పరిస్థితులు తనను రచయిగా మార్చి ఆయా పాత్రలలో పరకాయ ప్రవేశం చేశారు. ఈయన జీవితం వడ్డించిన విస్తరి కాదు. దరిద్రం, నిరుద్యోగం, ఆకలి, మొదలైన వాటి సారాన్ని పిండి ఆయన రచయితగా మారారు. వృత్తులు వృత్తిదారుల పట్ల భరద్వాజగారికి సానుభూతి, అనుకంప, ఆత్మీయతా దక్షతలను చర్విత చరణము విషయాన్ని ఎన్నుకొనే విషయంలో కూడా విలక్షణమైన శైలిని అనుసరిస్తారు. చదువరులకు భారమైన నిట్టూర్పు వెలువడి అమానుష, అమానన వీయ  చర్యలపై అసహ్యం కలిగి వాటిని మార్చాలి అన్న ఆలోచన అంతరంగంలో మొదలవుతుంది.

'అన్నమోరామచంద్ర' కుటికిజరగపోయినా నీతి నిజాయితీగా భర్త చనిపోయినా 3 బిడ్డల్ని దగ్గరపెట్టుకొని తోపుడుబండిమీద 5, 10 రూపాయలకు టిఫెన్ క్యారియర్‌లు అందిస్తూ పిల్లల్ని బతికించుకుంటూ బతుకు వెళ్ళతీసిన అంజమ్మకథ బ్రతుకుకోసం పాటుపడడం చూస్తాము.

'తప్పెట్లోయ్ – తాళాలోయ్'లో శీర్షికలో కలవారి ఇళ్ళకు భద్రత కల్పించే తాళం తయారీ దారైన జహంగీర్ ఇంటికి తాళం లేకపోవడం శోచనీయం తమ ఇంటికి తాళం ఎందుకు ఎవరొచ్చి తన దరిద్రాన్ని వెంట తీసుకుపోతారు అనడంలో అతని దగ్గర దరిద్రం తప్ప ఏమిలేదని స్పష్టమవుతుంది.

ఖరీదు కట్టే షరాబులేడు  – భారతీయ ప్రతిభా పాఠవాలకు శిల్ప సంపద చక్కని ప్రతీక ఆ ప్రతీకకు వారసుడు ఆగమయ్య. అమ్మవారి విగ్రహాన్ని తయారు చేయడంలో నిమగ్నమై ఉండగా ఏ దోషం తగిలిందో ఏ దిష్టితగిలిందో తెలియదు అంటూ రెండు రోజుల వరకు పచ్చి గంగ కూడా ముట్టకుండా పట్టుదలతో అమ్మవారి విగ్రహాన్ని తయారు చేశాడు. శిల్పాలు చెక్కేవారికి గిరాకీలేకుండా పోయిందని ఆవృత్తి మానేసిన ఆగమయ్య సన్నెకల్లు, పాత్రాలు తయారు చేస్తూ రాళ్ళకు కుందులకు కక్కుకొడుతూ తన బతుకు కూడా బండ బారి పోయిందని బాధపడడం చూస్తాము. తన ఉలితో రాళ్ళలో నిద్రించే రమణీయతను మేల్కొలిపి జనుల ముందుంచిన ఆగమయ్య నేడు బ్రతుకు భారమై పిడికెడు మెతుకుల కోసం రోడ్డుప్రక్కనున్న చింతచెట్టు కింద రాళ్ళను కంకరగా కొట్టే సన్నివేశం చూసిన రాతి మనస్సుగల ఎవరికైనా ద్రవించక తప్పదు.

'చక్రపాణి'లో తండ్రి సంపాదించి పెడుతుంటే లోకం పోకడ తెలీకుండా కాలం గడిచిపోయింది. తండ్రి మరణానంతరము కొంతకాలము ఇంట్లో ఉన్న పాతసామాను అమ్ముకొని పొట్టపోసుకున్న శంకరయ్య ఇటు చదువులేక అటు పనీరాక పస్తులుండాల్సిన పరిస్థితి రావడం చివరకు హోటల్లో క్లీనర్‌గా చేరి సమ్మెలో చేరడంతో ఉద్యోగం ఊడడం చివరకు గొడుగులు బాగుచేస్తూ బ్రతకడం ఎంతో మమందికి ఎండా వానల బాధలేకుండా చేసిన శంకరయ్యను ఏచూరు చాటునో తలదాచు కోవడం చూస్తాము.

'బతుకు కోసం బహుకృత వేషాలు' ఇక్కడ మనకు సంచారదశను దాటి స్థిర నివాసం ఏర్పరచుకునే నేపద్యంలో ఎండావానలకు కౄరమృగాల నుండి తప్పించుకోవడానికి గుహలే అనువైనవని భావించిన తరుణంలో మానవుడు నాగరికత నేర్చుకునే సమయంలో చిత్రాలను గీయడం ప్రారంభమైంది. తంజావూర్‌కు చెందిన నటరాజన్ ఒక చిత్రకారుడికి సహాయ కుడిగా చేరి చిత్రాలను నేర్చుకుని దిక్కు మొక్కు లేని పాట్నా పిల్లని వివాహమాడి దేవాలయాల ముందు దేవుళ్ళబొమ్మలను సినిమా హాలు ముందు ప్రముఖ హీరోల బొమ్మలను గీచి చిల్లర డబ్బులు సంపాదించుకునే వాడు. వర్షాకాలంలో బొత్తిగా గిరాకీ లేక పస్తువులుండాల్సిన

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

సమయాలున్నాయని అనేక సంవత్సరాల నుండి బొమ్మల్ని గీస్తూ జనాన్ని ఆకర్షిస్తున్న నటరాజన్ జీవితంలో స్థిరపడలేక పోవడం అతనికి ఆదరించే వారు లేకపోవడంతో రోడ్డుపాల య్యాడు. కళను ఆదరించలేని సమాజంలో చిత్రకారులు బతుకులీడుస్తున్నారు. 'మనిషికన్నా మృగం నయం'లో రామ స్వామి ఎలుగుబంటుతో బాగా దోస్తీ ఏర్పడి తనకు తెలియని కిటుకుల్ని తన బాబాయి వద్ద నేర్చుకుని సింగన్న అనే ఎలుగు బంటుతో పల్లెలకి పట్నాలకు వెళ్ళి చిల్లర పైసలతో జేబులు నింపుకునేవాడు. అది ఎలా చెబితే అలా వింటుంది. అంటూ మనిషి చెప్పేదొకటి చేసేదొకటి అదే సింగడు ఏది చెబితే అది చేస్తుంది విశ్వాసంగా ఉంటుంది అంటాడు. విశ్వాస ఘాతకులు, నమ్మించి మోసం చేసే నమ్మక ద్రోహులు క్షణ క్షణానికి ఈ సమాజంలో పెరుగుతున్నారు అని రామస్వామి అన్నమాటతో ఏకీభవించక తప్పదు.

'కంతి తలగడా కాదు కలనిజం కాదు' లో ముని కన్నయ్య స్కూలు ముందు బొంబాయ్ మిఠాయి అమ్ముతాడు. తనకు నాలుగు ఎకరాలున్నప్పటి అది పంటలు పండించ డానికి వర్షాలు లేక అమ్ముకుని చెల్లిపెళ్లి చేసి మిగిలిన డబ్బుతో తిరుపతి వచ్చిన ముని కన్నయ్య తన చిన్నప్పటి కల గుర్తుకు తెచ్చుకుంటూ తన చిన్నతనం నుండి సిల్కు చొక్కా తొడుక్కోవాలని జులపాలు పెంచుకోవాలని మెడలో బంగారు గొలుసు వేసుకోవాలని తెల్లలాగు వేసుకోవాలన్న కల కల్లగానే మిగిలిపోయింది. మిఠాయి అమ్మే ముని కన్నయ్య తనబ్రతుకు చూస్తే మిఠాయిలా ఉంటుందని నొక్కితే చింతగింజంత సరుకు ఉండదు అంటాడు. ఈ మాట ప్రస్తుతం మనం జీవిస్తున్న సమాజానికి వర్తిస్తుందేమో.

'బ్రతుకు పూలబాట కాదు' కథలో అనుకున్నవన్నీ జరగవని జరుగుతున్న వాటిని స్వాగతించాలని నాగరాజు స్వీయ అనుభవం చెబుతుంది. సినిమా హీరోకి కావలసిన అన్నీ అర్హతలున్నప్పటికి తాను నటుణ్ని కాలేకపోయానని చిన్నప్పటి నుండి నటించాలనే తృష్ణ తనకు ఉండేదని తన తృష్ణ తీర్చుకోవడానికి తండ్రితో గొడవపడి తనవాటా ఆస్తిని అమ్ముకొని చెన్నై వెళ్ళి భంగపడిన నాగరాజు చివరకు అవకాశాలు రాక తిరుగు ప్రయాణానికి డబ్బులేక దొంగ రైలెక్కి వచ్చి తండ్రికి ఎదురుపడలేక తన మేనమామ వద్ద పూల కొట్లో కుదిరిన వైనం కుర్రకారుకు ఒక కనువిప్పు. సినిమా మోజులో కొట్టుకు పోయే యువతకు నాగరాజు జీవితం ఒక సందేశం.

చచ్చులూ, పుచ్చులూ... కథలో తనతండ్రి పోశయ్య వెట్టిచాకిరి చేస్తూ చనిపోతే తమ బాకీ ఇన్నాళ్ళు చెల్లించినా ఎందుకు తీరలేదు అని అడిగే దమ్ము యాదగిరికి లేక పోవడంతో తన తల్లి కూరగాయల బండి కొనిపించడంతో అసలు వ్యాపారం అంటే తెలియని యాదగిరి అందులో మాయాతూకాలు రాళ్ళ గురించి దగా చెయ్యడం రాని యాదయ్య తూచి తట్టలో పోస్తే తన భార్య సత్తెమ్మ ఇళ్ళ దగ్గరకు వచ్చి ఇచ్చి పోతుంది మంచి వన్ని మందికమ్మి చచ్చులు పుచ్చులు తమకు ఉంటాయని యాదగిరి చెప్పడం విశేషం. అంటే మంచివి అందరికి అమ్మి మిగిలినవి తాముంచుకుంటూ తన బాధలను చెప్పుకుంటున్న యాదగిరి వెట్టిచాకిరి విముక్తి కోసం ప్రభుత్వ పథకాలు ఉండడం వల్ల యాదయ్య ఆయన భార్య సత్తెమ్మ బంధ విముక్తు లయ్యారు.

'గాజు పెంకుల నడుమ బూజు బతుకును చూడు'లో గుంటూరు జిల్లా గురజాలకు చెందిన నాగయ్య నాగార్జున సాగర్ ప్రాజెక్టు కట్టేటప్పుడు రాళ్ళ కూలలీగా పనిచేశాడు. ఆయనతో ఆయన భార్య ఆదెమ్మ కూడా సున్నంగానుగల వద్ద పనిచేస్తూ ఇద్దరు అన్యోన్యంగా ఉండేవారు. నిర్మాణ పనుల్లో ఇనుప కడ్డీ విరిగి క్రిందపడి చనిపోయిన ఆరుగుర్లో నాగయ్య ఒకడు. పైసా పైసా ఎక్స్ట్రా అని ఆశకు పోయి సామాన్యుల బ్రతుకులు డబ్బుల ఆశకు లొంగుతారని మేస్త్రీ డబ్బు ఆశచూపిస్తే వెళ్ళి నాగయ్య తిరిగి రాలేదు. దాంతో ఆదెమ్మ చిన్న బిడ్డ ముత్యాలను తన అత్తను వెంట తీసుకొని వస్తే ముత్యాలుది చిన్న తనము కావడం వల్ల తన కొంగు పట్టుకు తిరిగేవాడు. వయస్సుతోపాటు గాలి సహవాసాలు ఎక్కువై గాజు పెంకులు ఏరుకోవడం అలవాటు పట్టాడు. దాంతో పాతసీసాలు, సీసా మూతలు, దువ్వెనలు, మూతుల,

నాలుక బద్దలు, డబ్బాలు ఉదయం నుండి సాయంత్రం వగ్గె తీసుకొని తిరిగి దొరికిన వాటన్నింటిని అమ్మితే రూపాయి వస్తే దాన్ని తన తల్లికిస్తే ఆమె ఇచ్చే పదిపైసలతో తిమ్మిరి బిళ్ళలను కొనుక్కొని తినే ముత్యాలుకు ఐక్యరాజ్య సమితి బాలలకు ప్రసాదించిన హక్కులు ఇంకా చేరలేదని చెప్పవచ్చు.

'ఊరు ఉండమంటుంది' కథలో బనగానపల్లి నవాబులు విలాసవంతమైన జీవితం గడిపేవారు. ఒకరోజు హైదరాబాద్ నవాబును దర్శనం చేసుకొని అతని సంపద చూడక పోయినా అశ్వసంపదను చూసి ఆశ్చర్యపోయాడు. నవాబు తన కొడుకును సంతోష పరచడానికి హసీనా అనే గుర్రాన్ని కొని దానికోసం బొంబాయి నుండి కర్నూలుకు ఒక ప్రత్యేకమైన బోగీని వేయించారు. దాని కొరకు మొయిద్దీన్ అనే నౌకర్‌ను నియమించాడు. అతనికి అతని కుటుంబానికి ఒక ఇల్లు ఇచ్చి గుర్రం కొన్నట్లు అందరికి తెలియడానికి విందు ఏర్పాటు చేసి వినోదాలతో ఐదు, ఆరు సంవత్సరాలు నిరాటంకంగా సాగింది. తర్వాత పరిస్థితులు తారుమారై హసీనాకు మునుపటి వైభవం తగ్గింది. మొయిద్దీన్ పరిస్థితి కూడా అదే. చివరకు కట్టుబట్టలతో బయటపడడం వస్త్ర మిల్లులో పనిచెయ్యడం అదీ పోవడం చివరకు మారు బేరానికి తేగలు అమ్మడం ప్రారంభించాడు. చివరకు తనకు చావు కూడా రాలేదని బాధపడడం చూస్తాము.

భరద్వాజ కథలను రచనలను గమనించినట్లయితే క్రమానుగతమైన పరిణామం కన్పిస్తుంది. ఆయన కథల్లో ఆ సంఘటనల వెనుక ఉన్న ఆర్థిక, సాంఘిక రాజకీయ కోణాలు కన్పిస్తుంది. ఇదంతా వ్యధార్త జీవులయిధార్ధ గాధల సమూహారంలో ఇన్ని విషయాలను స్పృశించడం సామాన్యమైన విషయం కాదు. ఈ శీర్షికలన్నీ చదివిన పాఠకులు ఆ పాత్రలను జీవిత చిత్రాన్ని ప్రచురించబడినప్పుడల్లా ఆ దురదృష్టవంతులకు ఆర్థిక సహాయం చేసిన పాఠకులు ఉన్నారట. ఆ అక్షర గౌరవం దొరకటం ఆయన అదృష్టం. ఆయన రచనలతోపాటూ తెలుగు వారికి జ్ఞాన పీఠాన్ని కానుకగా ఇవ్వటం మన అదృష్టంగా భావించాలి.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# కాదంబరి నవల - సామాజిక స్పృహ

- ఆవుల బాలస్వామి
స్నాతకోత్తర విద్యార్థి, తెలుగు విభాగం,
పాలమూరు విశ్వవిదాలయం, పాలమూరు, తెలంగాణ.

డా॥ రావూరి భరద్వాజ గారి రచనా వ్యాసంగం అంతా సామాజిక పరిస్థితులపైనే సాగింది. రావూరి గారి కాదంబరి నవలపై సామాజిక అంశాలను విశ్లేషించటం ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

కాదంబరి నవలలో ఒక నిరుపేద కుటుంబం యొక్క జీవన విధానం ఇతివృత్తంగా తీసుకోబడింది. ఈ నవలలో ఒక వ్యక్తి ఆగర్భ దరిద్రం నుండి తన జీవన పోరాటంతో శ్రీమంతుడుగా తయారయి సమాజంలో ఉన్నత స్థానాన్ని చేరుకున్న విధానాన్ని ప్రత్యేకించి చూపించాడు రచయిత. ఈ నవలలో రామకృష్ణయ్య, కౌముది జగన్నాథం, శంకరం అనేవి ప్రధాన పాత్రలు, ఈ పాత్రలను ఆధారంగా చేసుకొని ఇతి వృత్తం సాగుతుంది.

ఈ నవలలో రామకృష్ణయ్య ఒక నిరుపేద కుటుంబంలో పుట్టి దరిద్రాన్ని ప్రత్యక్షంగా అనుభవించాడు. తన తండ్రి పడుతున్న శ్రమను కళ్ళారా చూసిన పిల్లవాడుగా ఉండి చదువుకోవడానికి వెళ్ళిన చదువు అబ్బని విద్యార్థి. తన చిన్నతనంలో తల్లి మరణాన్ని, చెల్లి మరణాన్ని చూసి ఇంటి నుండి పారిపోయిన పిల్లవాణ్ణి చూపించాడు రచయిత.

అందరిలాగా హోటళ్ళలో భోజనం చేసి సినిమా చూడాలని కోరిక గల పిల్లవాడు ఇంటి నుండి పట్నం పారిపోయి తను పడిన ఇబ్బందులను కనుల ముందుంచాడు రచయిత. తినడానికి తిండిలేని పిల్లవాడు ఏ పనైన చేయడానికి సిద్ధపడటం దానిలోనే భాగంగా హోటల్‌లో పని చేయడం అక్కడ తనకు జరిగిన ఇబ్బందికర పరిస్థితుల వల్ల అక్కడి నుండి పారిపోయి సినిమా హాల్‌కు చేరుకొని అక్కడి పరిస్థితులకు తాను త్వరగా సర్దుబాటు అయ్యి అతను పని చేసుకున్న విధానాన్ని రచయిత సహజ సిద్ధంగా తీర్చిదిద్దాడు.

రామకృష్ణయ్య, సినిమా హాలులో టిక్కెట్లు అమ్మే విధానం అతను కట్టుబడి ఉండే విధానం. అతను ఒకరి దగ్గర పని చేస్తున్న వారికి నమ్మకంగా ఉండే పనితనాన్ని కలిగి ఉండటం చూసిన ఒక పెద్ద మనిషి అతనిని చేరదీయటం, రామకృష్ణయ్యకు వ్యాపారంలో ఉండే మెలుకువలు తెలపడం వలన సమాజంలోని ఏ స్థాయివారితో ఎలా ప్రవర్తించాలో నేర్పిన తర్వాత చంద్రశేఖరం అనే పెద్ద మనిషి రామకృష్ణయ్యను తన అవిటి కూతురును వివాహమాడమని అడగటం, అవసరం మనిషిని ఎంతటి పని అయిన చేయిస్తుందని రచయిత గారు చంద్రశేఖరం పాత్రలో చూపించారు. మామ గారితో గొడవ పడిన రామకృష్ణయ్య కాళ్ళులేని తన భార్య సరస్వతిని తీసుకొని ఇంటి నుండి బయటకు వచ్చి ఎంత చిన్న పనైన చేయవచ్చని చేస్తూ ఇంటి ఇంటికి ఇడ్లీలు అమ్ముతూ తన జీవనం మొదలు పెట్టినాడు.

అతను మొదట పని చేసిన సినిమా హాలు క్యాంటిన్ లీజ్‌కు తీసుకొని అక్కడ పని చేసే వారిని మాన్పించకుండా వారితోనే పని చేయిస్తూ క్యాంటిన్ రూపు రేకలను మార్చి దానిని లాభాల బాటలో నడిపించడం రామకృష్ణయ్య గారి పని తీరును అక్కడ పని చేసే వారి పట్ల అతను చూపుతున్న ప్రేమను రచయిత పని గౌరవాన్ని పెంచుతూ చూపించాడు.

క్యాంటిన్‌లో వచ్చిన లాభాలతో మరొక వ్యాపారాన్ని ప్రారంభించి అది రైతులను ఎన్నుకోవడం వారిని ఎటువంటి మోసాలకు గురి చేయకుండా రైతుల పట్ల రామకృష్ణయ్య చూపిన నిజమైన ప్రేమను రచయిత తాను బాగుపడుతూ ఇతరులకు సహాయం చేయడాన్ని చూపించాడు. రామకృష్ణయ్య తాను చేస్తున్న వ్యాపారంలో తనకు నష్టం వచ్చిన రైతులకు అనుకున్న ధరను కట్టించి వ్యాపారంలో నిజాయితీ చూపించాడు. ఈ విధమైన నిజాయితీ వల్ల అతను ఎదిగిన తీరును రచయిత ప్రపంచానికి చూపించాడు.

పంటలు పండించే రైతులకు నీరు పుష్కలంగా ఉంటే వారికి చేతినిండా పని ఉంటుందని రైతుల మేలు కోరిన

రామకృష్ణయ్య మయూరనది పై ప్రాజెక్టు నిర్మాణానికి ప్రయత్నాలను మొదలు పెట్టినాడు. ఈ ప్రాజెక్టు వివరాలను తన కూతురు ద్వారా తెలుసుకున్న రామకృష్ణయ్య దాని సాధనకై స్థానిక రాజకీయ నాయకుల నుండి రాష్ట్ర ముఖ్య మంత్రి వరకు అందరినీ ఒప్పించడం జరిగింది. కాని ఈ ప్రాజెక్టు సాధనలో రాజకీయంగా పై స్థాయిలో కూడ ఏ విధమైన మోసం జరుగుతుంది అని రచయిత ఆనాటి రాజకీయంలో ఉన్న దౌర్భాగ్య స్థితిని చూపించారు. ఈ విధమైన రాజకీయ మోసం వల్ల స్థానిక రైతులు తమ పొలా లను కోల్పోయిన తీరును రాజకీయ స్థితిగతులను చూపిం చాడు.

కటిక దరిద్రం నుండి శ్రీమంతుడుగా మారిన రామ కృష్ణయ్య తన జీవితాన్ని అనుభవిస్తూ డబ్బులో పుట్టి పెరిగిన తన సంతానానికి పూర్తి స్వేచ్ఛనిచ్చాడు. సమాజ సేవలో భాగంగా తన మామగారు చనిపోవటం వల్ల వచ్చిన ఇంటిని ప్రభుత్వ పాఠశాలకు ఇచ్చి మిగతా ఆస్తిని అమ్మడం వల్ల వచ్చిన డబ్బుతో అనాథ ఆశ్రమాలను కట్టించడం సమాజం లోని నిరుపేదలకు చేసే సేవా దృకృథాన్ని చూపించాడు రచయిత.

కాదంబరి నవల రచనలో రచయిత ఏ ఒక్క అంశం లోనో పరిజ్ఞానం ఉంటే సరిపోరూ. సమాజంలోని ప్రతి విషయంపైన సరి అయిన పరిజ్ఞానం ఉండాలని చూపిం చాడు. ప్రాజెక్టు నిర్మాణంలో ఉండే మెలుకువలు ప్రాజెక్టును నదిపై ఎక్కడ నిర్మించాలి. ఎలానిర్మించాలి. కాలువలు ఏ విధంగా ఉండాలి అని ఒక ఇంజనీరుకు ఉండవలసిన ఆలోచనలను కూడా రచయిత ఇక్కడ చూపించడం జరి గింది.

ఈ నవలలో రెండవ ప్రధాన పాత్రలో కౌముదిని చూపిం చాడు. ఒక సంపన్న కుటుంబంలో జన్మించిన స్త్రీ అయి ఉండి తన భర్త సగటువారీ మనిషయి ఉండాలని కోరుకుం టుంది. చాలా విచిత్రమైన స్త్రీ, పురుషుడి సాహసం, తెగువ ఉన్న స్త్రీ కాని స్త్రీత్వం సంపూర్ణంగా ఉన్న మహిళ. ఇదొక అపూర్వ సృష్టి. ఒక రబ్బరు బొమ్మలాంటి భర్తతో కాపురం చేయడంలో ఉన్న అమానుషత్వాన్ని గ్రహించిన మహిళ ఆమె. తన భర్తలో కోపం, చిరాకు, ఈర్ష్య, ద్వేషం, విసుగు, అసూయ, అనుమానం ఇలాంటి లక్షణాలన్ని ఉండాలని కోరుకుంటుంది. అప్పుడప్పుడు అతను తిట్టాలి, ఆ తిట్లు పడలేక ఆమె ఎదురు తిరగాలి అలా ఎదురు తిరిగినందుకు అతడు చేయి చేసుకోవాలి, చేయి చేసుకున్నందుకు ఆమె ఏడ్వాలి. అతను ఓదార్చాలి, వీటిలో ఏ ఒక్క ముచ్చట తనకు తీరలేదని అన్న కౌముది నిజంగా సంపూర్ణ స్త్రీత్వం గల మహిళ. విషాదానికి తావే లేని కుటుంబంలో పుట్టిన కౌమాదిలో ఇంత విషాదం చూపించాడు రచయిత.

ఇక ఈ నవలలో మరొక పాత్ర శంకరం. ఇతను ఇంజనీరింగ్ విద్యార్థిగా ఉండి సర్ ఆర్థర్ కాటన్ చేసిన కృషిని చదివి అది తన ప్రాంతంలో అమలు జరుగాలని కోరుకునే వ్యక్తి. మయూరారక్షి నదిపై ప్రాజెక్టు నిర్మాణం జరగటానికి ఎటువంటి మార్గాలను అనుసరించాలని ఆలో చిస్తూ తన ప్రియురాలు ద్వారా ఒక పెద్ద మనిషికి ఆ ప్రాజెక్టు గురించి తెలిపి వారి ద్వారా ప్రాజెక్టు సాధనకు సరైన మార్గం ఎంచుకున్నాడు. తన ప్రాంతంలోని రైతులు ఆరుగాలము పంటలు పండించాలంటే ప్రాజెక్టు నిర్మాణం జరగాలని తలం చిన సగటు వ్యక్తి, ప్రాజెక్టు సాధనకు రాజకీయ పలుకుబడి అవసరం అని గ్రహించి కౌముది ద్వారా రామకృష్ణయ్యకు తెలిపి, రామకృష్ణయ్య ద్వారా రాజకీయ నాయకులను ఏకం చేసి వారి నుంచి తన ప్రాంతానికి ప్రాజెక్టును సాధించిన తెర వెనుక వ్యక్తి శంకరం పాత్ర.

ప్రాజెక్టు నిర్మాణంలో తాను ఒక ఉద్యోగిగా ఉండి అక్కడ నిరుపేదలపైన జరుగుతున్న అన్యాయాలను చూసి చలించిన అక్కడి మేస్త్రీలను ఎదిరించలేని స్థితిలో ఉంటూ, ప్రాజెక్టు నిర్మాణ పనులను చూసే ఒక ఇంజనీరు శంకరం. తాను ప్రేమించిన అమ్మాయి ఒక అమాయకురాలని తెలుసుకున్న శంకరం ఆమెను సుఖంగా చూసుకోవడమే తన లక్ష్యంగా ఉంచుకున్నాడు.

శంకరం ప్రేమించిన అమ్మాయి సంపన్న కుటుంబంలో జన్మించిన ఎంతటి అమాయకత్వం గల వ్యక్తి అంటే అతను

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

చదువుతున్న రోజులలో తన వెంటబడే వారి అందరికి తాము ఉత్తరాలు రాశానని తనకు కాబోయే భర్తతో చెప్పిన అమాయకురాలు. ఈ ఉత్తరాలు సరదా కోసం రాసినట్లు తెలుపుతుంది. ఈ అమాయకురాలిని తాను తప్పా ఎవరు వివాహం చేసుకున్న ఇబ్బందుల పాలవుతుందని నమ్మిన పాత్ర శంకరానిది.

కాదంబరి నవలలో మరొక పాత్ర జగన్నాథం. ఎక్కడో అడవిలో జరిగిన ఒక సంఘటనను పేపర్లో చదివి దానిని స్వయంగా సందర్శించి తెలుసుకొనుటకు అడవికి బయలు దేరి ఎన్నో విషయాలు తెలుసుకున్న మహాపాత్ర జగన్నాథం గారిది. అడవికి బయలుదేరిన జగన్నాథం అడవిలో దారి తెలియని పరిస్థితులలో ఉండి మరొకరి సహాయంతో అడవి విషయాలను తెలుసుకుంటూ నవల కొనసాగింపులో ఉన్న ప్రధానమైన పాత్రలలో జగన్నాథం పాత్ర ఒకటి. ఈ విధంగా నవలను ఆగర్భ దరిద్రం నుండి శ్రీమం తుడిగా ఎదిగిన విధానాన్ని చూపించాడు రచయిత రావూరి భరద్వాజ గారు.

**ఆధార గ్రంథాలు :**

1) రావూరి భరద్వాజ – కాదంబరి 2013 విశాలాంధ్ర పబ్లిషింగ్ హైద్రాబాద్.
2) గోరేటి వెంకన్న – రేలపూతలు 2002 సాయిస్పందన ప్రింటర్స్, హైద్రాబాద్.
3) బి.యస్. రాములు – బతుకుపోరు – 2008 విశాల సాహిత్య అకాదమి హైద్రాబాద్.
4) మన్నెమోని కృష్ణయ్య – మన ప్రస్థానం – 2010 రాఘవేంద్ర ప్రింటింగ్ ప్రెస్, హైద్రాబాద్.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# పాకుడు రాళ్లు నవల ఒక విశ్లేషణ

- బండారి ప్రేమ్ కుమార్
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ
తెలంగాణ సారస్వత పరిషత్ ప్రాచ్య కళాశాల,
తిలక్ రోడ్, హైదరాబాద్.

నవల పరిచయం :

క్రీ.శ.19వ శతాబ్ది ఉత్తరార్థంలో ఆంగ్లం నుండి తెలుగు లోకి ప్రవేశించిన ఎక్కువ పాటక జనాదరణ పొందిన సాహిత్య ప్రక్రియ నవల.

✠ "వ్యక్తుల జీవితాన్ని ప్రధానంగా చిత్రిస్తూ, సామాజిక జీవితాన్ని, సంస్కృతీ పోకడల్ని స్ఫురింపజేసే సాహిత్య ప్రక్రియ నవల".

- ఆర్.ఎస్.సుదర్శనం

✠ "యదార్థ జీవితాన్ని యదార్ధ దృష్టితో అధ్యయనం చేసి గద్యరూపంలో వ్యక్తం చేసేది నవల"

-రిచర్డ్ క్రాస్

ఈ పాకుడు రాళ్ళు నవల చిత్రసీమలోని పలు కోణాలను ఆవిష్కరిస్తూ తెరవెనుక సినీ తారల జీవితాన్ని ఆవిష్క రించింది. మనకు తెర ముందు అందంగా చిరునవ్వుతో కనిపించే తారల వెనుక వారి జీవితాల్లో ఎన్ని కన్నీటి అగాధాలు ఉన్నాయో? ఎన్ని అగ్నిపర్వతాలు బద్దలవుతే వాళ్లు ఆ విధంగా సినీ వినీలాకాశంలో విహరిస్తారు. అటు వంటి పలు అంశాలను ఈ నవలలో రచయిత డాక్టర్ రావూరి భరద్వాజ గారు వివరించే ప్రయత్నం చేశారు. ఈ నవలకు మొదట డాక్టర్ రావూరి భరద్వాజ గారు మాయ జలతారు అనే పేరును సూచించారు కాని తర్వాత డాక్టర్ శీలా వీర్రాజు గారు ఈ మాయ జలతారు అనే నవలకు పాకుడురాళ్లు అనే పేరును సూచించారు. రచయిత డాక్టర్ శీలా వీర్రాజు గారు ఈ నవలకు పాకుడురాళ్లు అనే పేరు పెట్టడంలో నవలా నేపథ్యం కూడా స్ఫురిస్తుందని నా అభిప్రాయం.

పాకుడురాళ్ళు అంటే మానవ జీవితంలో మనుషులు అందరూ కీర్తి పేరు ప్రతిష్టలు డబ్బు కోసం తన దైనందిన జీవితంలో పోరాడుతూనే ఉంటారు. కానీ ఆ పోరాటంలో తామేం కోల్పోతున్నామనే స్పృహ వారికి ఉండదు. నైతిక విలువల పట్ల స్పృహ కూడా ఉండదు మంచి చెడుల విచక్షణ జ్ఞానం కూడా వారికి అవసరం లేదు ఏదో విధంగా డబ్బు, పేరు ప్రతిష్టలు వస్తే చాలు అనుకునే తత్వం అటువంటి వాళ్ళకు డబ్బు, పలుకుబడి ఉండవచ్చు కానీ ప్రేమ, ఆప్యా యత, కరుణ, జాలి అనే లక్షణాలు ఏ కోశానా ఉండవు. ఒక శిలలాంటి మానవులు. రాయికి ఏ విధంగా ప్రాణం ఉండొచ్చు అదేవిధంగా ఈ తరహా మానవులకు మానవీయ విలువల పట్ల బాధ్యత ఉండదు. డబ్బు సంపాదించడమే ధ్యేయం అనుకుంటారు. దానికోసం ఎన్ని అడ్డదారులు తొక్క డానికి సిద్ధంగా ఉంటారు. కనీసం వారిని ఆప్యాయంగా పలకరించేవారు, నేనున్నానని భరోసా ఇచ్చేవారుగాని వారి జీవితంలో ఎవరు తారసపడరు. ఒకవేళ అటువంటి వారు తారసపడ్డ వాళ్లను గుర్తించే స్థితిలో వీరు ఉండరు అటువంటి జీవితాలనే రచయిత పాకుడురాళ్ళ తో సూచించాడని నా అభిప్రాయం.

చిత్ర సీమ నేపథ్యంలో ఎన్నో కథలు వచ్చినప్పటికీ ఇంత సుదీర్ఘమైన రూపంలో వచ్చిన మొట్టమొదటి పెద్ద నవల పాకుడు రాళ్ళు. పాకుడు రాళ్ళు నవలలోని కొన్ని సంఘ టనలు, సన్నివేశాలు గమనిస్తే సామాన్య పాఠక లోకానికి అవి చాలా కొత్తగా వింతగా వాస్తవంగా జరిగి ఉంటాయా? అనే విధంగా పాఠకులలో ఆలోచనల్ని రేకెత్తిస్తాయి మరో విధంగా చెప్పాలంటే సినీ ప్రపంచం అంటేనే ఒక రకమైన జుగుప్స పాఠకుల్లో చోటు చేసుకుంటుంది. ఒక అభద్రతా భావం అనేది సినీ రంగం పట్ల ఏర్పడుతుంది. అయినప్పటికీ చిత్రపరిశ్రమలోని వాస్తవాన్ని నిర్భయంగా చెప్పిన గొప్ప రచయిత డాక్టర్ రావూరి భరద్వాజ గారు. ఒక రచయితకు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

ఇంతకన్నా ఏం కావాలి. తను చెప్పదలచుకుంది నిజాయితీగా వాస్తవికంగా పాఠకులకు చెప్పగలగటం చిత్ర పరిశ్రమలోని ఆయా వ్యక్తుల సమాజాన్ని వాళ్ల మధ్య జరిగిన సంఘటనల నేపథ్యాన్ని నిర్భయంగా చెప్పినప్పుడు ఆయా చిత్ర పరిశ్రమకు సంబంధించిన వ్యక్తుల నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సివస్తుంది. అయినప్పటికీ డాక్టర్ భరద్వాజగారు వాటన్నింటిని ఎదుర్కొని, ఒక సవాలుగా తీసుకొని చిత్ర పరిశ్రమ వెనక జరిగే పలు కోణాల్ని ఈ నవలలో ఆవిష్కరించడం అనేది గొప్ప సాహసంగా చెప్పవచ్చు. డాక్టర్ భరద్వాజగారు చేసిన ఈ సాహసానికి గొప్ప నిదర్శనమే ఈ పాకుడు రాళ్ళు నవల. చిత్రసీమలోని వ్యక్తుల అంతరంగాలను అద్భుతంగా ఆవిష్కరించిన ఈ పాకుడు రాళ్ళు అనే నవలకు 2012లో ప్రతిష్ఠాత్మక జ్ఞానపీఠ పురస్కారం లభించింది. ఈ జ్ఞానపీఠ అవార్డు లభించిన తెలుగు వారిలో డాక్టర్ రావూరి భరద్వాజ గారు మూడో వ్యక్తిగా చెప్పుకోవచ్చు.

## రచయిత పరిచయం :

రావూరి భరద్వాజగారు కృష్ణా జిల్లాలోని నందిగామ తాలూకా కంచికచర్ల సమీపంలోని మొగులూరు గ్రామంలో తండ్రి రావూరి కోటయ్య తల్లి మల్లికాంబ దంపతులకు జన్మించారు. 1946 నెల్లూరులోని జమీన్ రైతు వారపత్రిక సంపాదకవర్గంలో పనిచేశారు. 1948లో దీనబంధు, జ్యోతి, సమీక్ష, అభిసారిక, చిత్రసీమ సినిమా యువ పత్రికలలో పనిచేశారు. 1959లో హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో ప్రూఫ్ రీడింగ్ కళాకారునిగా చేరి చివరకు 1987లో ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా పదవీ విరమణ చేశాడు. 1948 మే28 తేదీన శ్రీమతి.కాంతం గారితో వివాహం జరిగింది. తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనుడితడు. ఆడంబరాలులేని సాధారణ జీవితం ఆయనది. పేద కుటుంబంలో జన్మించిన ఆయన కేవలం ఎనిమిదో తరగతి వరకు చదువుకున్నాడు.వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితులను ఎదుర్కొన్నాడు పల్లె ప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలు, తాపాలు గమనించిన ఆయన తన అనుభవాలను రచనలలో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి కృషి చేశాడు.

## అవార్డులు :

రావూరి భరద్వాజ గారికి 1980 ఆంధ్ర విశ్వవిద్యాలయం, 1987లో జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం, 1991లో నాగార్జున విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్లు ప్రదానంచేసి గౌరవించాయి.

✠ 1980 కళాప్రపూర్ణ పురస్కారం విశ్వవిద్యాలయం.

✠ 1983 కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం.

✠ 2012 జ్ఞానపీఠ అవార్డు తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన బహుముఖీయమైన కృషికి దక్కింది. భరద్వాజగారు అనేక పురస్కారాలను పొందడమే గాకుండా సుమారు 187 పైగా పుస్తకాలు ఐదు వందలకు పైగా కథలను, 37 సంకలనాలను,19 నవలలు,10 నాటకాలు రాశారు. భరద్వాజ గారి పై చలం ప్రభావం ఎక్కువగా ఉండేది. సాహిత్య వ్యాసాలు, స్మృతి సాహిత్యం, విజ్ఞాన సాహిత్యం వంటి అనేక ప్రక్రియలలో రచనలు చేశారు.

పాకుడురాళ్ళు అంటే మరో ధ్వని స్ఫురిస్తుంది. పాకుడు రాళ్ళు అంటే పాకురు (అంటే నాచు)తో కూడుకున్న రాళ్ళు అని అర్థం. వీటిపై జాగ్రత్తగా అడుగులు వేయకుంటే జారి పడిపోయే ప్రమాదం ఉంటుంది. పాకురు రాళ్ళతో ఏ ప్రమాదం అయితే ఉందో అదేవిధంగా సినీ వినీలాకాశంలో జాగ్రత్తగా అడుగులు వేయకుండా అజాగ్రత్తగా ఉన్నామంటే అధ:పాతాళానికి వెళ్లిపోవాల్సిందే అనే స్థూలార్థాన్ని కూడా ఈ పాకుడురాళ్ళు అనే నవల సూచిస్తుందని నా అభిప్రాయం.

నేపథ్యం గనక చూస్తే "సినీ ప్రపంచాన్ని" రచయిత ఇతివృత్తంగా తీసుకున్నాడు. అంటే సినీ ప్రపంచంలో వ్యక్తులు,ఆ వాతావరణం, ఆ సమాజాన్ని రచయిత చిత్రించారు. ఆ కాలంలో చిత్ర పరిశ్రమ ఏ విధంగా ఉంది? ఆనాటి చిత్ర పరిశ్రమకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం ఏ విధంగా ఉంది? అనే అంశాలు రచయిత వివరించాడు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

**ఇతివృత్తం :**

ఇది ఒక సామాన్య మహిళ సినీ ప్రస్థానం. ఆమె గొప్ప తారగా వెలుగొందే క్రమంలో ఆమె ఎదుర్కొన్న అనుభవాలు, ఆమె జీవితంలో కలిగిన పెనుమార్పులను రచయిత అద్భుతంగా వర్ణించాడు. ఆమె జీవిత పతనాన్ని రచయిత కళ్ళకు కట్టినట్లు చూపించిన తీరు అద్భుతంగా ఉంది.

ఈ నవలలో "నాగమణి" అనే ఆవిడ అనాథ ఆడపిల్లల్ని చేరదీస్తూ... వారిని వేశ్య వృత్తిలో దింపి వారిద్వారా డబ్బులు సంపాదిస్తూ ఉంటుంది. అటువంటి నాగమణి చేరదీసిన ఆడపిల్లల్లో మంగమ్మ ఒకరు. మట్టిలో మాణిక్యం లాంటిది మంగమ్మ. అందచందాలలో అప్సరసని మించిపోయే అందం మంగమ్మ సొంతం. దాంతోపాటు మంగమ్మకు అభినయం కూడా వెన్నతో పెట్టిన విద్య. నాగమణి శిక్షణలో కొంత అభినయం, జాణతనం నేర్చుకుని పడుపువృత్తిలో ఆరితేరింది మంగమ్మ. నాగమణి మంగమ్మ ద్వారా ఇంకా ఎక్కువ డబ్బు సంపాదించాలనే యావతో నాటక రంగంలో దింపాలనుకుంటుంది.

ఆ రోజుల్లో గుంటూరులో ఉన్న నవ్యాంధ్ర కళా మండలిలో మంగమ్మ చేర్పిస్తుంది. అక్కడ రామచంద్రంగారి ప్రోద్భలంతో మంగమ్మ తక్కువ కాలంలోనే మంచి రంగస్థల నటిగా పేరు తెచ్చుకుంటుంది. రోజులంతా ఒకలా సాగవు కదా! కొన్ని రోజులు నాటకాలు బాగానే ఆడాయి. కానీ కాలక్రమేనా సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నాటకాలు చూసే ప్రేక్షకుల సంఖ్య తగ్గిపోయింది. నాటకాలు వేసే వారు కూడా మెల్లిమెల్లిగా సినీ రంగంలో ప్రవేశించ సాగారు. అటువంటి పరిస్థితిలో నవ్యాంధ్ర కళామండలి కూడా మూతపడిపోయింది. అప్పుడు రామచంద్రం మంగమ్మను కూడా సినిమాల్లో అవకాశం కోసం ప్రయత్నించి, బతుకుతెరువు వెతుక్కో అని చెప్పలేక చెబుతాడు. మంగమ్మ ఆ నాటకరంగాన్ని అక్కడి మనుషుల్ని వదల్లేక వదిలిపోతూ అక్కడి నుంచి మళ్లీ తన చీకటి జీవితం ఎక్కడైతే ప్రారంభమైందో అక్కడికి చేరుకుంటుంది. కానీ అనుకోకుండా తలుపు తట్టిన అదృష్టం లాగా "చలపతి" మంగమ్మ జీవితంలోకి ప్రవేశిస్తాడు. తాను ఒక ప్రొడ్యూసర్‌ని అని హీరోయిన్ కోసం వెతుకుతున్నాను అని ఆమెకు చెప్పి ఆమెలో సినిమాలపట్ల, ఆ జీవితం పట్ల లేనిపోని ఆశలు కల్పిస్తాడు. మంగమ్మ కూడా తనను తాను తెరపై చూసుకోవాలని ఉత్సుకతతో మంచి పేరు ప్రఖ్యాతులు, అంతకు మించి విలాసవంతమైన జీవితం గడపాలని ఉవ్విళ్ళూరుతుంది. కాబట్టి సినిమాల్లో నటించడం కోసం చలపతితో మద్రాసుకు ప్రయాణం అవుతుంది. అక్కడికి వెళ్ళాక మంగమ్మ పేరు సినిమాల్లో మారుమోగాలంటే పేరు మార్చుకోమని పంతులైన పరబ్రహ్మశాస్త్రి సలహా ఇస్తాడు. అతని సలహాతో మంగమ్మ తన పేరును మంజరి గా మార్చుకుంటుంది. కానీ అక్కడికి వెళ్ళాక గాని మంజరికి అసలు విషయం అర్థం కాదు. నిర్మాత, దర్శకుడు, స్టోరీ రైటర్ నుంచి మొత్తం సినీ పరిశ్రమలోని వ్యక్తులంతా మంజరిని అనుభవించాలనే చూస్తారు. తాము చెప్పినట్లు వ్యవహరించాలని, అలా అయితేనే సినిమాల్లో అవకాశాలు ఇప్పిస్తామని చెప్పకనే చెబుతారు. తాను నమ్మి వచ్చిన "చలపతి" కూడా తనపై వ్యామోహం ఉందని మంజరి తెలుసుకుంటుంది. మంజరికి ఒక్కసారిగా తాను ఇదివరకు అనుభవించిన జీవితం గుర్తుకువస్తుంది. కానీ అంతకంటే ఎక్కువగా సినిమా పిచ్చి, డబ్బు వ్యామోహం ఉండటం వల్ల తనని తాను అందరికీ అర్పించుకోవడానికి సిద్ధ పడుతుంది. ఈ రంగంలో నెగ్గుకురావాలంటే తననితాను అర్పించుకోక తప్పదనే వాస్తవాన్ని ఆనతి కాలములోనే మంజరి గుర్తిస్తుంది. అదే విధంగా చిత్ర పరిశ్రమలోని వ్యక్తులను ఎలా లొంగదీసుకోవాలో? ఎలా అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలో? మంజరికి అవగతమవుతుంది. దాంతో ఆనతి కాలములోనే మంజరి మంచి నటిగా గుర్తింపు తెచ్చుకుంటుంది. తన జీవితంలో తారసపడిన తొటి నటి నటులైన కళ్యాణి,సరస వంటివారు కూడా తనలాగే దుర్భర జీవితాన్ని అనుభవిస్తూ, దుర్వ్యసనాలకు లోనైన వారే అని తెలుసుకుంటుంది. తన జీవితంలో పరిచయమైన సిని ప్రముఖులైన ప్రసాద్, వెంకటేశ్వర్లు, మెహత, పత్రికా సంపాదకులు శర్మ,రాజన్ లాంటి వ్యక్తులంతా ఆడవాళ్ళ జీవితంతో ఆడుకునే స్వభావం గలవారని తెలుసుకొని వారితో ఏవిధంగా ప్రవర్తించాలో ఆవిధంగానే ప్రవర్తిస్తుంటుంది.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

మంజరి మంచి నటిగా పేరు తెచ్చుకొని విదేశాలకు వెళ్ళి అక్కడి చలనచిత్ర రంగాన్ని కూడా పరిశీలించి మర్లిన్ మన్రో వంటి నటి జీవితాన్ని కూడా తెలుసుకుంటుంది. మంజరి తన పేరు మీద ఎన్నో విద్యాసంస్థలు అనాథ శరణాలయాలు నడుపుతుంది. ఎంతో మంది వృద్ధులకు సాయం చేస్తూ, మంచి సామాజికవేత్తగా పేరు తెచ్చు కుంటుంది. అంత గొప్ప స్థాయిలో ఉన్న మంజరికి అప్పుడు జీవితంలో ఏదో అసంతృప్తి చెలరేగుతుంది. ఈ రంగుల ప్రపంచంలో ఎన్నాళ్ళు ఈ జీవితం గడపడం? ఇంకా ఎంత డబ్బు సంపాదిస్తే నా మనసు తృప్తి పడుతుంది? అనుకొని ఇక ఈ సినీ జీవితానికి స్వస్తి పలికి జీవితాన్ని ప్రశాంతంగా గడపాలనుకుంటుంది. తన ఆప్తులైన రామచంద్రం మాధవ రావులను కలుసుకొని వారితో తన అనుభవాల్ని పంచు కుంటుంది. జీవితంలో ఎంత డబ్బు,కీర్తి ప్రతిష్ఠలు సంపా దించుకున్నా అవి అనుభవించే సమయం,అనుభవించే వాళ్ళు లేని జీవితం వృధా అని చెబుతుంది. మనల్ని ప్రేమించేవాళ్ళు కష్ట సమయాల్లో నేనున్నాన్న భరోసా లేని జీవితం వ్యర్థం అని చెబుతుంది.

జీవితంలో విషాదం మంటే డబ్బు లేకపోవడం కాదని చెబుతూ.. ఒక తల్లి ఎన్నో పురిటి నొప్పులు అనుభవించి బిడ్డను కంటుంది. ఆ బిడ్డ భూమిమీద పడగానే తను పడ్డ ఆవేదన అంతా మరిచిపోతుంది. తన బిడ్డ తన లాగే కూలీలా బ్రతకవలసి వస్తుందని ఆ తల్లికి తెలుసు అయినా భవిష్యత్తులో వచ్చే కష్టాల గురించి ఆలోచించకుండా.. ఆ బిడ్డను తన్మయత్వంతో ముద్దాడుతుంది కదా? ఆనందం అసంతృప్తి విలాసవంతమైన జీవితం ఎంత పేరు ప్రతిష్ఠలు వచ్చిన ఆ మాతృత్వానికి సాటి రావు కదా! అని మంజరి అనటంతో ఈ నవల ముగుస్తుంది.

ఈ నవల ముగింపులో రచయిత మంజరి చేత మాతృ త్వం గురించి చెప్పించాడంటే మంజరి తన జీవితంలో ఏం కోల్పోయిందో తెలిసి వచ్చింది. అంటే మంజరి ఇప్పుడు "వైవాహిక" జీవితాన్ని కోరుకుంటుందని, అదే ఆడదాని జీవితంలో వెలకట్టలేని సంపద అని రచయిత మంజరి పాత్ర ద్వారా చెప్పించే ప్రయత్నం చేశారు.

**శిల్పం :** ఈ నవల అంతా ఉత్తమపురుష దృష్టికోణంలో నడిచిందని చెప్పవచ్చు. రచయిత ఈ కథలో అంతర్భాగంగా ఉండి పాత్రల చేత కథని చెప్పించారు.

**పాత్రలు :** మంజరి పాత్ర కనుక గమనిస్తే (=శీబఅం జప్రుఘతీఫ్‌వతీ) మార్పు చెందే పాత్రలుగా చెప్పవచ్చు. మొదట్లో మంజరి పాత్ర డబ్బే ప్రధానం అనే విధంగా కని పిస్తుంది. కాని నవల ముగింపుకు వచ్చేసరికి మంజరిని డబ్బు కంటే ప్రధానమైనవి లోకంలో ఉన్నాయని, అవే జీవితానికి ఎనలేని సంపదలు కీర్తి ప్రతిష్టలు అని తెలుసు కుంది. అవి వివాహబంధం,మాతృత్వం అనే వాస్తవాన్ని తెలుసుకొని వాటి వైపు పయనించాలని అనుకుంటుంది.

## ముగింపు :

ఈ పాకుడురాళ్లు అనే నవలలో చిత్రసీమలోని పరి స్థితుల్ని వివరిస్తూ ముఖ్యంగా డబ్బుతో మనుషుల్ని, కళల్ని కొని వ్యాపారం చేసే వారు తమ ధోరణి మార్చుకొని కళల పట్ల ఆరాధనా భావం, అంకిత భావం కలిగి పని చేసినప్పుడే ఆ కళలపట్ల, ఆ రంగం పట్ల ప్రజలకు గౌరవం ఆరాధనా భావం కలుగుతాయని లేకపోతే చిత్ర పరిశ్రమ అంటే చుల కన భావం ఏహ్యాభావం ప్రజలలో కలుగుతుందని రచయిత చెప్పే ప్రయత్నం చేశారు.

## ఆధార గ్రంథాలు :

1) రావూరి భరద్వాజ – పాకుడు రాళ్ళు (2012)
2) వెంకటసుబ్బయ్య వల్లంపాటి – "నవలా శిల్పం" (1996)హైద్రాబాద్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
3) పింగళి లక్ష్మికాంతం – సాహిత్య శిల్ప సమీక్ష
4) వెంకటసుబ్బయ్య వల్లంపాటి – "కథాశిల్పం" ప్రథమ ముద్రణ (జనవరి,1995) హైద్రాబాద్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

# పాకుడు రాళ్ళు - సామాజిక స్పృహ

- డా॥ వాసిరెడ్డి భవాని
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేబ్రోలు, గుంటూరు జిల్లా.

సినిమా జగత్తును కళ్ళకు కట్టినట్టుగా వర్ణించిన అతి పెద్దనవల ఈ పాకుడురాళ్ళు 2012వ సంవత్సరానికి జ్ఞాన పీఠ్ పురస్కారాన్ని సంపాదించి పెట్టినది. ఈ నవలా రచయిత గుంటూరు జిల్లావాసి అవ్వడం మనందరికీ గర్వకారణం పేదరికపు టంచులను చవిచూసిన భరద్వాజగారు పొట్ట కూటికోసం వ్యవసాయకూలీగా పశువులకాపరిగా, రంపం లాగుతూ, పేపరుబాయ్‌గా పనిచేస్తూ తన చిన్నతంనంలోనే సమాజాన్ని చదివారు.

ఈయన 1927వ సం॥లో గుంటూరు జిల్లాలోని తాడికొండ గ్రామంలో కోటయ్య, మల్లికాంబ నోముల పంటగా జన్మించారు. చదివింది ఏడవ తరగతి యైనప్పటికీ తన 17వ యేటనే రచనలతో పాఠకులను మైమరపింప చేశారు. అంతే కాదు మూడు విశ్వ విద్యాలయాలు ఈయనకు గౌరవడాక్టరేట్ యిచ్చి సత్కరించాయి. ఎన్నో విశ్వ విద్యాలయాలు ఈయన రచనలమీద పరిశోధనలు చేశాయి. ఈ నవల మొదట కృష్ణా పత్రికలో సీరియల్‌గా పాఠకులకు పరిచయమయినది. 1978లో దీనిని నవలగా ముద్రించారు.

"పాకుడురాళ్ళు" నవలలోని సంఘటనలు సన్నివేశాలు, పాత్రలు, వర్ణనలు సామాన్య పాఠకునికి వింత అనుభూతిని కలుగజేస్తాయి. వాటిని అభివ్యక్తీకరించడంలో రచయిత చూపించిన చొరవ, తెగువ అత్యద్భుతమయినవి. తాను చెప్పదలచిన విషయాన్ని చాలా బలంగా చెప్పగల రచ యితలలో భరద్వాజగారొకరు.

తెలుగు సాహితీ ప్రక్రియలలో నవలలు, కథలు వ్రాయ డమేకాక బాలసాహిత్య రంగాలలో కూడా ఈయన విశేషకృషి చేశారు. అత్యున్నత పురస్కారాలను పొందినప్పటికీ తానొక సామాన్యమానవునివలె నిరాడంబరమైన జీవితాన్ని గడిపారు. మానవ భావోద్వేగాలను ప్రధానాంశాలుగా తీసు కొని సరళమైన భాషాశైలిలో మధ్యతరగతి పేదప్రజల జీవితా లను తనరచనలలో కళ్ళకు కట్టినట్లుగా చిత్రీకరించడం ఈయన నైపుణ్యం.

'పాకుడురాళ్ళు' అనే నవలను సమాజానికి ఒక దర్పణం లాగా చిత్రీకరించారు. ముందుగా నాటకాల కంపెనీతో మొదలుపెట్టి దానిని సినీ వినీలాకాశం వరకు నడిపించి ప్రజలలో సినిమా జీవితంపై వున్న అపోహలను కళ్ళకు కట్టినట్లుగా వర్ణించి. పాఠకునికి పాత్రలను కళ్ళెదట నిలబెట్టి తన రచనను చేశారు. ఈ రచన గురించి భరద్వాజగారి మాటల్లో " సినీ పత్రికల్లో ఉద్యోగంచేస్తున్న రోజుల్లో చలన చిత్రరంగంలోని వెలుగు నీడలనూ, కష్టసుఖాలను వడి దుడుకులను మొత్తానికి సినిమా వెనుకగల సినిమాచరిత్రను చాలా దగ్గరగా చూశాను. అందుకే ఈ ఇతి వృత్తాన్ని ఎన్ను కుని మీకందించాను."

ఒకప్పుడు ఆంధ్రదేశంలో నాటకాలంటే పౌరాణిక నాటకాలుండేవి శ్రీకృష్ణరాయబారం, పాండవోద్యో విజ యాలు, గయోపాఖ్యానం సారంగధర నాటకాలాడేవారు. ప్రాచీన కవిత్వం నుండి సాహిత్యం ఆధునిక కవిత్వ బాట పట్టిన తరువాత వ్యవహారిక భాషలో సాంఘిక నాటకాలకు ప్రాధాన్యత పెరిగినది. మొదట్లో సాంఘిక నాటకాలలో ఆడ వేషం కూడా మగవాళ్ళే వేసేవారు. కాలక్రమేణా స్త్రీలు నాటకరంగంలోకి అడుగుపెట్టారు. ఈ కథకు అదే పునాది అయ్యింది. నాటకరంగంలోకి అడుగిడిన ఒక స్త్రీ (మంగమ్మ) జీవితకథయే ఈ పాకుడురాళ్ళు నవల. సమాజంలో నటికున్న విలువ ఏ పాటిదో ఆ రోజులలో నటిని ఎలా చూసేవారో కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారు. " రవి గాంచ నిచో కవిగాంచును" అన్నట్లుగా కవియైనవాడు సమాజాన్ని మనోనేత్రంతో చూస్తాడు. నన్నయ నుంచి ఈ నాటివరకూ కూడా సమాజంలోని సమ కాలీన పరిస్థితులను తన కలంలో నింపని కవి వుండడనడం అతిశయోక్తికాదేమో.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

మాధవరావు రామచంద్రరావు నాటకాల కంపెనీ నడుపుతున్నారు. అక్కడికి నాగమణి అనే నలభై సంవత్సరాలు వయసున్న ఆమె మంగమ్మ అనే పిల్లను తెచ్చి పరిచయం చేసింది. అక్కడి నుంచి మన కథ ప్రారంభమైనది. అప్పట్లో సినిమాలు అందరికీ అందుబాటులో వుండేవికావు పల్లెటూర్లలో నాటక సమాజాలే వినోదసాధనాలుగా వుండేవి. మంగమ్మను కాంట్రాక్టు వ్రాసుకోవడం కావలసిన అవసరాలను తీర్చడంలాంటివి చేస్తుండేవారు. మంగమ్మకు యిచ్చిన ధనాన్ని నాగమణి తీసుకుంటూవుండేది. ఈ విధంగా ఆమెను చిన్నతనంనుంచి కష్టపెట్టింది.

పేదరికంలోని స్త్రీలు జీవనశైలిని ఏ విధంగా మార్చుకుంటారో ప్రతి విషయంలోనూ సమాజానికి లోబడి తమ జీవితాలను గడిపే విధానం ఈ నవలలో మనకు కన్పిస్తుంది. ఆకలి మనిషిని ఎన్ని విధాలుగా పరుగులెత్తిస్తుందో భరద్వాజ గారు తెలియచేశారు. ధనంమీది వ్యామోహంతో మనిషి ఎన్ని తప్పటడుగులు వేస్తాడో ఈ పాకుడు రాళ్ళు నవల వలన మనం తెలుసుకోవచ్చును. సినిమాని మనం మూడు గంటలలో చూసి మానసిక సంతృప్తితో వెనక్కివస్తాము. కానీ ఆసినీ ప్రపంచంలో బ్రతుకుతున్న నటీనటులు ప్రొడ్యూసర్లు, డైరక్టర్లు పడే నానా అవస్థలు మానసిక వ్యథలు, అసమానతలు అన్నింటినీ మన కళ్ళెదుట చూపించారు భరద్వాజగారు.

మంగమ్మ నాటకాలాడే కంపెనీ మూసివేయడంతో ఎటువెళ్ళాలో తెలియక మళ్ళీ నాగమణి పంచన చేరుదామని నాగమణి యింటికి వెళుతుంది. అక్కడి పరిస్థితులు చూచి ఆమె ఆశ్చర్యపోయింది. ఆయిల్లు నాగమణి నుంచి రాజామణి అనే తన సోదరి చేజిక్కించుకోవడం ఆమె దగ్గర వసంత అనే పిల్లను పరిచయం చేసుకుంటుంది. వసంత పాటలు బాగా పాడుతుందని రాజామణి చెబుతుంది. అక్కడి పరిస్థితులన్నింటిని చూచి బాధపడుతుంది మంగమ్మ. తానొక నిస్సహాయ పరిస్థితిలో వున్నానని రాజామణికి చెబుతుంది. అదే సమయంలో ఆమెకు చలపతి అనే పాతమిత్రుడు కలుస్తాడు. అతను సినిమాలలో చేరడానికి మద్రాసువెళ్ళాడు. అక్కడ అతనికి చాలామందితో పరిచయాలున్నాయి. చలపతి మంగమ్మను మద్రాసు తీసుకువెళతానంటాడు. ఆమె రాజామణి సలహాతీసుకొని చలపతి వెంట మద్రాసు బయలు దేరుతుంది.

చలపతితో పాటుగా మంగమ్మ మద్రాసులోని ఒకచిన్న యింట్లో మకాంపెట్టింది. అక్కడ చలపతికి అనుకూలంగా నడుచుకునే తాయారు అనేపనిమనిషి వుంటుంది. ఆమెను మంగమ్మను చాలా బాగాచూసుకుంటుంది. కొన్నిరోజుల పాటు సినిమాలలో చిన్నచిన్న పాత్రలకోసం చలపతి అడుగు జాడలలో ప్రయత్నంచేసింది కానీ ఫలితం లేకపోయింది. పరబ్రహ్మశాస్త్రిగారిని తీసికొని వచ్చి ఆమె సినీ ఆరంగేట్రం జరగడానికి సూచనలు చేయమని చలపతి అడుగుతాడు. ఆయన ఆలోచించి మంగమ్మపేరును మంజరిగా మారుస్తాడు. ఆవిధంగా మంగమ్మ మంజరి అవుతుంది. విజయవాడ నుంచి వచ్చిన రామబ్రహ్మం, వెంకటేశ్వరరావు 'నవకళచిత్రాలయ ' అనేకంపెనీని పెడతారు. వారితో పరిచయం పెంచుకున్న చలపతి మంజరిని వారికి పరిచయం చేస్తాడు. వెంకటేశ్వరరావు తో పరిచయాన్ని పెంచుకున్న మంజరి ఆయన వద్దనుండి డబ్బును బాగానే లాగుతుంది కొన్ని అనుకోని పరిస్థితులలో ఆ కంపెనీలోని రామబ్రహ్మానికి వెంకటేశ్వరరావుకు మధ్య గొడవలు వచ్చి రైలెక్కి బెజవాడ వెళ్ళిపోతారు. ఈ విధంగా సినిమాలు తియ్యడానికి వచ్చి ఎంతో మంది అక్కడి వాతావరణంలో యిమడలేక ఆస్థులను పోగొట్టుకొని స్వస్థలాలకు చేరుకున్న వారిని చూసిన అనుభవం భరధ్వాజగారి రచనలో మనకు కన్పిస్తుంది.

ఆ తరువాత మంజరిని సినిమాలలో ఎలా చేర్పించాలా అని చలపతి ప్రయత్నంచేస్తూనే వున్నాడు. పత్రికలవాళ్ళను పిలిచి మంజరి ఫోటోలు పత్రికలలో వచ్చేవిధంగా పబ్లిసిటీ యిచ్చాడు. ఈ విధంగా చలపతి మంజరి అందంతో సొమ్ము చేసుకోవాలని తన ప్రయత్నాలు కొనసాగిస్తూనే వున్నాడు. మంజరి కూడా చలపతికి అనుకూలంగా వున్నట్లే నటిస్తూ తనపని తను చేసుకుపోతూవుండేది. ఈ ప్రయత్నాలన్నీ ఓ

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

కొలిక్కిచేరి చివరకు జయాఫిలింస్ ద్వారా మంజరిని పరిచయం చేయవలసినదిగా ప్రముఖ కథానాయకుడు రావు గారిని మంజరి కలిసేఏర్పాట్లు చేశాడు చలపతి రావుగారి సిఫారుసుతో మంజరి జయా ఫిలింస్ బ్యానర్ నుండి తొలిపరిచయం ఖరారైనది. మంజరికి వారిచ్చిన పాత్ర నచ్చకపోవడంతో వారిఫైనాన్షియర్ అయిన మెహతాను కలిసి తనకొక ప్రముఖ పాత్రను సంపాదిస్తుంది. ఆ మెహతా దగ్గర కళ్యాణి అనే ప్రముఖ తార యీమెకు పరిచయమవుతుంది. ఆపరిచయం మరింత బలపడి స్నేహంగా మారుతుంది. తొలిసినిమా విజయ వంతమవుతుంది. మంజరి కొకగుర్తింపువస్తుంది.

కళ్యాణితో ఆమెస్నేహం దృఢమవుతుంది. కళ్యాణి కూడా మంజరి ఎదగడానికి కొంతసహాయపడుతుంది. ఇక్కడ మనం గమనించాల్సిందిఏమిటంటే ఒకతార నిలద్రొక్కుకోవడానికి అనేకసార్లు తప్పటడుగులవేయ వలసి వస్తుంది. ఆ తప్పడుగులకు సహకారం యిచ్చింది కళ్యాణి. స్త్రీలు తమ స్వశక్తితో ఎదగడాన్ని ఈ నవలలో సృష్టించారు. సమాజంలో తమకంటూ ఒక ప్రముఖస్థానాన్ని కల్పించుకోవడం కోసం మంజరి ఎన్నోపాట్లు పడినది. ఎంతో మానసికవేదనకు గురైనది. తన మనసుకు సంబంధంలేని పనులలో పాల్గొన వలసి వచ్చింది. కళాకారిణిగా సమాజానికి సేవచేస్తూనే ధనవంతుల నుండి డబ్బువసూలు చేసేది “ధనమూల మిదం జగత్ ” అనే సిద్ధాంతాన్ని బాగానమ్మిన మనిషిగా మనకు మంజరికన్పిస్తుంది.

చలపతి ఒక అవకాశవాది తాను సినిమాలోకంలో రాణించలేకపోయాడు. మంజరిని ఆయుధంగా మలచాడు. వేరువేరు రంగాలలోని వ్యక్తులను పరిచయం చేసుకొని మంజరిని కథానాయికగా తీర్చిదిద్దడానికి తనవంతు ప్రయత్నం చేసేవాడు. పత్రికావిలేఖరులతో సత్సంబంధాలు పెట్టుకొనేవాడు. పత్రికలద్వారా మంజరి ఫోటోలను పబ్లిసిటి యిప్పించేవాడు. పత్రికల వాళ్ళకు పార్టీలు యిచ్చేవాడు. మంజరికి సంబంధించిన కార్యక్రమాలన్నింటిని స్వయంగా పర్యవేక్షించేవాడు. మంజరి తనమాట జవదాటకుండా చూసుకునేవాడు తాయారు అనే పనిమనిషిని పెట్టి మంజరికి కాపలా వుంచేవాడు. మంజరికి కళ్యాణితో పరిచయం పెరిగి తనను లెక్కచేయనప్పుడు కూడా మంజరిని అంటిపెట్టుకునే వున్నాడుకానీ ఆమెను వదలి వెళ్ళలేదు. తన జీవితమంతా మంజరి చుట్టూ పెనవేసుకున్నాడు. కళ్యాణి చనిపోయినపుడు (హత్యచేయబడి నపుడు) కూడా మంజరికి ఎంతో అండగా నిలబడ్డాడు. పోలీసుల బారినుండి మంజరిని కాపాడాడు. కళ్యాణి గత చరిత్రలోని మంజరికి తెలియని విషయాలనెన్నింటినో చెప్పి ఆమెను ఆశ్చర్యపరిచాడు. మంజరి విదేశీ ప్రయాణానికి కూడా తనవంతు సహాయం చేశాడు. సమాజంలో తనగురించి ఏమనుకున్నాపట్టించుకోలేదు. తన సుఖం కోసం తనేం చేసినా తప్పులేదని నమ్మిన అవకాశ వాదిగా ఈ కథలో మనకు చలపతి కన్పిస్తాడు. చివరి వరకూ మంజరికి కవచంలాగా అంటిపెట్టుకున్నాడు.

ఈ నవలలో వసంత, రాజామణి, శర్మమున్నగు పాత్రలున్నా ఇవన్నీ మంజరి చుట్టూనే తిరుగుతుంటాయి. రాజామణి అంటే మంజరికి చాలాయిష్టం. వసంతను కూడా స్వంత చెల్లెలులాగానే చూసుకుంటుంది. వీరిద్దరిని తను స్థిరపడగానే మద్రాసు పిలిపించుకొని తనయింట్లోనే వుంచుకొంటుంది. రాజామణికూడా మంజరి బాగోగులు చూసుకుంటూ యింటిపట్టునే వుండేది. వసంత పాటలు బాగా పాడుతుంది. మంజరి సిఫారుసుతో వసంతకు సినిమాలలో పాటలు పాడే అవకాశం వచ్చింది. ఆమె పాత్రికేయుడైన శర్మను ప్రేమించి చివరలో పెళ్ళి చేసుకుంటుంది. మంజరి తన ఆస్థిలో కొంతభాగాన్ని వసంత కిస్తుంది. తాయారు పాత్ర ఈ నవలలో ప్రత్యేకమైనది. ఎవరికి ఏంకావాలో తెలుసుకుని మరీయిస్తుంది. మంజరిని కనిపెట్టుకుని వుంటుంది. ఈ విధంగా ఈ నవలలోని పాత్రలన్నీ నిత్యం మనకళ్ళముందు కదలాడేవే కాకపోతే బయటపడని మనుషుల స్వభావాలను తనరచన ద్వారా బహిర్గతం చేసినవారు భరద్వాజగారు.

ఈ నవలకు జ్ఞానపీఠ్ బహుమతి ప్రకటించిన కొద్దిరోజులకే భరద్వాజగారు కన్ను మూశారు. అందరికీ తెలుసుకునే అవకాశం లేని సినిమాప్రపంచాన్ని అందులోని

లోటుపాట్లను ఎంతో ధైర్యంగా చెప్పారు. సినిమా లోకంలో ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు, కథానాయకులు ఏవిధంగా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారో వివరంగా తెలియచేశారు. ఆరోజులలో సినిమత్తులో చాలా మంది మద్రాసువెళ్ళి తమ సర్వస్వాలనుకోల్పోయిన వైనాన్ని తెలియ చేశారు ముందుగా దీనిపేరు "మాయజలతారు" అనిపెట్టారు. కానీమిత్రులు శీలావీర్రాజు గారి సలహామేరకు "పాకుడు రాళ్ళు" గా మార్చారు. సమకాలీన సమజానికి ఈ నవల గొద్దలిపెట్టు అని తెలిసినా నిస్సంకోచంగా రచయితగా తన బాధ్యతను నిర్వర్తించారు. సినిమా జగత్తులో స్వర్గసుఖాలు వుంటాయనే సామాన్య మానవునికి ఈ పాకుడురాళ్ళు నవలాపఠనం ఒక కనువిప్పును కలిగిస్తుంది.

# భరద్వాజ స్మృతి సాహిత్యం

- డా॥ బూసి వెంకటస్వామి
శాఖాధిపతి, తెలుగు విభాగం,
పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల,
పెదనందిపాడు, గుంటూరు జిల్లా.

మానవ జీవితం సుఖ దుఃఖాల సంగమం లోకానికి రాత్రి, పగలు ఎటువంటివో మానవ జీవితంలో సుఖ దుఃఖాలు అటువంటివి. ఈ రెండూ లేకపోతే మనిషి జీవితం నిస్సారమౌతుంది. సుఖ ప్రదమైన జీవితానికి పరాకాష్ట శృంగారమైతే, దుఃఖభాజితమైన జీవితానికి కరుణ రసాత్మకత ఊతకర్రై నిలస్తుంది. మానవ జీవితంలో అత్యంత విషాద మైనది మృత్యువు. ఆ మృత్యు బారినపడ్డ ఆప్తులను, వారి స్మృతులను జ్ఞప్తి చేసుకుంటూ వెలువడిన కవిత్వమే స్మృతి కవిత్వం.

స్మృతి కవిత్వం ఈనాటిదికాదు. భారతీయ సాహిత్యం ఏర్పడ్డప్పుడే స్మృతి సాహిత్యం ఏర్పడ్డప్పటికీ పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో విస్తృత వ్యాప్తిలోకి వచ్చిందని చెప్పవచ్చు. ముఖ్యంగా స్వాంతత్ర్యోద్యమంలో దేశ స్వాతం త్ర్యం కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన మహానీయు లను స్మరిస్తూ అనేక స్మృతి గీతాలు వెలువడ్డాయి. ఆ తర్వాత తమకు ఇష్టమైన వ్యక్తులు మరణించినప్పుడు వారి స్మృతులను నెమరువేసుకుంటూ కవిత్వంతో తమ భావాలు వ్యక్తీకరించి బాధాతప్త హృదయ బరువులను దించేసుకునే వారు. అలా తెలుగు సాహిత్యంలో స్మృతి కవిత్వాన్ని అందించిన కవులలో అగ్రగణ్యులుగా పేరొందినవారు డా॥ రావూరి భరద్వాజ.

డా॥ రావూరి పేరు వినగానే మనకు వెంటనే స్ఫురించేది ఆకలి, దారిద్ర్యం, అవమానం. వాటిని జయించడం కోసం ఆయన చేసిన జీవన పోరాటం. ఆ పోరాటంలో పొందిన అనుభవాలను కథా వస్తువులుగా మలుచుకొని రచనలు చేయటం ఆయనకే చెల్లింది. పశువుల కాపరిగా, వ్యవసాయ కూలీగా, వడ్రంగిగా, కమ్మరిగా, పొగాకు గ్రేడింగ్ కూలీగా పనిచేస్తూ రాత్రిళ్ళు చదువుకొని రచనా వ్యాసాంగాన్ని చేపట్టి ఈ శతాబ్దపు రచయితలో ఒక నూతన ఒరవడిని సృష్టించి అందరికీ ఆదర్శప్రాయుడై నిలిచిన మహోన్నత వ్యక్తి డా॥ రావూరి భరద్వాజ. అరకొర చదువుల్లో అక్షర జ్ఞానాన్ని పునాదిగా చేసుకొని శ్రమించిన కలం యోధుడు. ఏడో తరగతి వరకే చదివినా జీవతపు అట్టడుగు పొరల్ని తడిమిచూసి దానినే చిత్రిక పట్టిన మహాశిల్పి.

తెలుగు సాహిత్యంలో రావూరి వారు చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదంటే అతిశయోక్తి కాదు. కథ, నవల, నాటకం, బాల సాహిత్యం, స్మృతి సాహిత్యం, జీవిత చరిత్ర, విజ్ఞాన శాస్త్ర రచన ఇలా అనేక ప్రక్రియలలో ఉత్తమ రచనలు చేశారు. దాదాపు 150 గ్రంధాలు వెలువరించారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఆయన సతీ వియోగంతో వ్రాసిన స్మృతి కావ్యాలన్నీ మరొక ఎత్తని చెప్పవచ్చు. ఎంతటి కఠినాత్ములైనా తన అర్ధ తమ జీవిత భాగస్వామిని కోల్పోతే ఆ బాధ దుర్భరంగా ఉంటుంది. సరిగ్గా అలాంటి స్థితినే భరద్వాజ అనుభవించారు. 1986 ఆగస్టు 1వ తేదీన నా జీవిత భాగస్వామిని నా వెలుగును, నా మార్గదర్శిని నేను పోగొట్టు కున్నాను. కాంతమ్మ గారి నిర్గమనం నా జీవిత గమనాన్నే మార్చివేసింది. ఆమె జ్ఞాపకాలను 5 పుస్తకాలుగా ముద్రించా నని భరద్వాజ తెలియజేస్తారు.

భరద్వాజ దుఃఖ ప్రస్తావన అయిదు పుస్తకాలుగా వెలువడింది. అవి.

1. నాలోని నీవు
2. అంతరంగిణి
3. ఐతరేయం
4. అయినా ఒక ఏకాంతం
5. ఒకింత వేకువకోసం

భరద్వాజ జీవితాన్ని, సాహిత్యాన్ని భార్య కాంతమ్మ ఎంతో ప్రభావితం చేసింది. ఆయన మనుగడకు మూలంగా, ప్రాణశక్తికి ఆధారంగా, వెదుర లాంటి భౌతిక జీవితంలో

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

ప్రాణాలూది, అనంత సాహితీ వాసులను ఆయనలో ప్రవహింపజేసిన మహాసాధ్వి ఆమె. ఆమె మరణించిన రోజు నుండి భరద్వాజ హృదయంలో దుఃఖ పూరిత వాక్యాలు ప్రవాహోల్లా పెల్లుబికాయి. ఆమె మరణం గూర్చి తపిస్తూ

**నేనెంత మందభాగ్యుణ్ని**
**నేనెంత దురదృష్టవంతుణ్ని**
**కాంతమ్మ**
**నానించి వెళ్ళిపోయింది**
**..................**
**..................**
**తన ఆనందానంతా కన్నుల్లోనే చూపే**
**కాంతమ్మ**
**నానించి వెళ్ళిపోయాక**
**నేనిప్పుడు**
**సీతలేని రాముణ్ని, పార్వతిలేని పరమశివుణ్ని**
**ఎందరెందరున్నా అందరి మధ్యా ఒంటరి వాణ్ని"**

అంటూ వాపోతారు. భరద్వాజ రచనల్లో అంతర్నిగూఢ భావాలు కోకొల్లలుగా కన్పిస్తాయి. భౌతిక స్పర్శకు, బహుబంధాలకు అందని అందమైన భావాలు కూర్చటంలో భరద్వాజకే చెల్లుతుంది. కాంతమ్మ నన్ను కలంగా మలుచు కోకన్నా ఎప్పుడూ నీతోనే ఉంటానంటే అలా ఎందుకు నా గుండెగానే మార్చుకుంటాను. ఎప్పుడూ నాతోనే కాకుండా నాలోనే ఉండిపోవచ్చు అంటూ

**శిశువులా నా వక్షస్తల మీద**
**నిదురించిన నీవు లేవు**
**నీ జ్ఞాపకాల పుస్తకాలు తప్ప"**

అంటూనే అప్పుడేమో నిన్ను చూడలేక కనురెప్పలు మూసుకున్నాను. ఇప్పుడేమో నిన్ను చూసేందుకు ఎదరెక్కలు విప్పుకుంటున్నాను అని తన భార్యను జ్ఞప్తిచేసుకుంటూ ఉన్న నిత్య సత్యాన్వేషి భరద్వాజ. దుఃఖ తీవ్రత తగ్గి వైరాగ్యం, నైరాశ్యం జీవితాన్ని ఆక్రమించినప్పుడు కాంతమ్మ గారిని తల్చుకుంటూ

**"కాంతమ్మను మర్చిపోదామనుకుంటున్నాను గానీ ఎంత భ్రమ**
**నాలోంచి నా అణువణువులోంచి**
**నా కాంతమ్మను విడదీయటమెలా**
**ఎలా... ఎలా... అని విలపిస్తారు భరద్వాజ**
**"శబ్దంలోనూ, నిశ్శబ్దంలోనూ నీవే**
**నైరూప్యంలోనూ, సారూప్యంలోనూ నీవే**
**కాలంలోనూ, కాలం వెలుపలా నీవే**
**ఇక్కడ, అక్కడ ఎక్కడెక్కడైనా నీవే**
**అవును గానీ - మనలో మాట - ఇంకెక్కడా అనను గాని**
**నీవు లేని దెక్కడ? ఎప్పుడు? చెప్పరాదా?**
**ఏ నిముషానికి ఆ నిముషం, కొత్తగా మెరిసే నీ కళ్ళను**
**ఎన్నిసార్లు చూపులతో అద్దుకున్నానో నీకు తెలుసు**
**నా అంతరంగంలోనికి మెత్తగా నడిచి వచ్చిన నీ సుతిమెత్తని చరణాలకు**
**మనసులోనే పారాణి నద్దానని నీకు తెలుసు**
**అలవిమాలిన నీ ముగ్ధత్వం నన్ను వివశుణ్ణి చేసిందని నీకు తెలుసు**
**నా గురించి నీకు చాలా చాలా తెలుసు**
**నీ గురించి నాకు ఏమీ తెలియదు"...**
**"జ్ఞాపకాల తెరల్లోంచి మెత్తగా మేలుకొంటున్న ఆనంద రేఖవు నీవు**
**అవనీతలం నుండి ఆకాశానికి ఎగసిన గాలి కెరటానివి**
**నా నిండా చిక్కగా పరుచుకొన్న ఆకుపచ్చని నీడవు**
**మబ్బుల్లోంచి మనస్సులోనికి ప్రవహించిన స్వప్నానివి**
**అందమైన ఆవేదనవు".**
**"అవనీ తలం నిండా నీ స్మృతి బీజాలను చల్లుతున్నాను**
**నేనున్నా లేకున్నా, నీవన్నా శాశ్వతంగా ఉండాలని**
**వాయు మండలం నిండా నీ గురించిన సంగీతాలను నింపుతున్నాను**
**నేనున్నా లేకున్నా నీవన్నా శాశ్వతంగా ఉండాలని**
**ఆకాశ ఫలకం మీద నక్షత్రాక్షరాలతో నీ గురించిన**

**పాటలు రాస్తున్నాను**
**నేనున్నా లేకున్నా, నీవన్నా శాశ్వతంగా ఉండాలని..."**

రానున్న తరాల వారికి –

**"ధరా మండలం నిండా, వాయు మండలం నిండా,**
**వియన్మండలం నిండా**
**నీవే, నీవే, నీవై కనపడతావు; ఆహ్లాదమైన ఆకుపచ్చని**
**అరణ్యంలాగా, అతిలోక**
**మోహనమైన సంగీతంలాగా, అపురూపమైన అచ్చపు**
**కావ్యంలాగా..."**

రావూరి భరద్వాజ ఒక సంవత్సర కాలంపాటు వ్రాసుకున్న అనురాగ భరిత హృదయ ఆవేదనా స్రవంతే అంతరంగిణి అన్న స్మృతి కావ్యం. భార్య ఎడబాటు నుండి కాస్త తేరుకున్న భరద్వాజ దైవచింతనలో పడటం ఇందులో కన్పిస్తుంది. కాంతమ్మలో దివ్యత్వాన్ని దర్శించడం అనేది అంతరంగిణిలో ప్రధానంగా కన్పిస్తుంది. శ్రీరాముడు సీతమ్మకు దూరమయిన సందర్భాన్ని కాంతమ్మ తన నుండి దూరమైన సంఘటనతో బేరీజు వేసుకుంటారు.

"నానిండా ఆక్రమించుకున్న నిన్ను, నాకు దూరం చేసిన ఈశ్వరుడు నీస్థానంలోనికి ప్రవేశిస్తున్నాడు నెమ్మదిగా... అసలందుకే దూరం చేశాడని ఇప్పడనుకొంటున్నాను". అంటూ కాంతమ్మ స్థానంలో దైతాద్వైత స్థితిని ఆపాదిస్తారు.

ఐతిరేయంలో భరద్వాజ ఒక వేదాంతిలా, దార్శికునిగా రూపుదిద్దుకున్నట్లు కన్పిస్తుంది. నిత్య దుఃఖ భాదిత మనస్సు నుండి కాస్త తేరుకొని తన దుఃఖాన్ని ఇతర ప్రవృత్తులకు వినిమయం చేయటం కన్పిస్తుంది. కాంతమ్మ స్థితిని వదలి దైవంగా కన్పించడం. దైవమే కాంతమ్మగా దర్శనమివ్వటం ఈ స్థితిలో దర్శనీయమవుతుంది. ముఖ్యంగా ఈ స్థితిలో కాంతమమ – దైవం అభేదంగా చూడటం.

"మనిషెప్పుడూ ఒంటరివాడే ఒంటరిగా వచ్చాడు మధ్యలో చాలామంది కలుస్తారు. కొందరు అభినందిస్తారు. మరికొందరు అభిశంసిస్తారు. కొసకు అందరూ వెడతారు. మళ్లా ఒంటరి వాడవుతాడతను. ఒంటరిగానే వెళ్ళిపోతాడు. అతనితో బాటు ఎవరూ రానట్లే ఎవరు పోరుకూడ" అంటూ తన అర్ధాంగిని గుర్తుచేసుకుంటూ "మరోసారి ఆమె నాకళ్ళ ముందు నిలిచింది. జ్యోత్నాపాతంలో తనివితీరా స్నానమాడి ఒంటినిండా మెత్తగా అంటుకుపోయినా ఆ వెన్నల తడిని, మబ్బుల తువ్వాలుతో అంటుకుంటున్న కిన్నెరసాని లాగ ఉన్నదామె. నేనిప్పుడు ఆమె బాహువుల్లో, ఈశ్వరుని ఆలింగనాల ఖైదీని అంటూనే భగవంతుడన్నా కోపంతో శపించాడు గానీ, నువ్వెప్పుడు నీ సంతానాన్ని శపించలేదు. నువ్వు నా ఈశ్వరునికన్నా గొప్పదానివని" కాంతమ్మ ఈశ్వరుల అభేదాన్ని దర్శించడమే గాకుండా ఆమెలో ఓ మాతృమూర్తిని దర్శిస్తాడు. ఆమె ఈశ్వరునికన్నా గొప్పదని శ్లాఘిస్తాడు.

భరద్వాజలో తాత్త్వికుడైన కవి కన్పిస్తున్నట్లు చెప్పదగిన రచన అయినా ఒక ఏకాంతం అన్న స్మృతి కావ్యం. భరద్వాజ స్థితికాంతం లేఇ ఏకాంతం అందుకేనేమో ఈ స్మృతి కావ్యానికి అయినా ఒక ఏకాంతం అని పేరు పెట్టారేమో! కాంతమ్మ దుఃఖ సముద్రం నుండి ఒడ్డుకు వస్తున్న భరద్వాజకు లౌకిక ప్రపంచంలోని సకల చరాచరములు రకరకాలుగా దర్శనమిచ్చాయి. ప్రతి దృశ్యమూ, ప్రతి కదలికా నూతన అనుభూతులను కల్గించాయి. ఆ క్రమంలో

నాకు తెలీని ఏ దూర ప్రాంతాలనుంచో ఒక దివ్య ప్రపంచం నాలోకి ప్రవేశించింది. అది మంచు ముసుగులోంచి కనుపించే అద్భుతకాంతి పుంజంలాగా ఉంది. తరుణ గాయనీ గాయక బృంద మెక్కడా కనిపించదు. కానీ గాలి కూడా కందిపోయేటంతటి సున్నితమైన గానం వినబడుతూనే ఉంది. ఆ ప్రపంచం వక్తల ఇంద్రచాప పరివేష్టితమైన సుందర స్వప్న రాశిలా ఉంది. అక్కడున్నవన్నీ చిన్న చిన్న కలల తునకుల రంగుల సీతాకోక చిలుకలాగా, నిశ్శబ్దంగా కదులుతూ, దూకుతూ, ఎగురుతూ ఎన్నెన్నో రూపాలను సంతరించుకుంటూ తిరిగి తిరిగి కరిగిపోతూ ఉన్నాయి. ఆ రూపాలు ఒకే క్షణాన నాకు తెలిసినట్లుగానూ, తెలియనట్లుగానూ ఉన్నాయి. అవి ఎప్పుడో ఒకప్పుడు నీరూపం సంతరించుకున్నప్పుడు నిన్నభినందిస్తూ పూలమాలలతో అలంకరించుకుందామనుకుంటున్నాను. కానీ నావి రిక్త హస్తాలు. తోటనుండి పూలు తెచ్చేలోగానే నీ రూపం వెలసి మెరిసి మాయమవుతుందేమోనని నా భయం. అందుకే నన్ను నేను పుష్పహారంగా మార్చుకున్నాను. నీ మెడ నుండీ

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

పాదాల దాకా వాలిపోయే మహత్తర క్షణం కోసం ఎదురు చూస్తున్నాను" అంటూ కాంతంకోసం నిరీక్షణ, జ్ఞాపకాలు కన్పిస్తాయి. ప్రకృతిలో ఆమెను దర్శిస్తున్నాడా! అనే సందేహం కలగక మానదు.

భరద్వాజ తన అర్ధాంగి కాంతం చనిపోగా మొదట దుఃఖ భాదను అనుభవించినప్పటికీ క్రమంగా పరిణామాన్ని సంతరించుకొని వ్యక్తిగత దుఃఖం నుండి కోలుకొని సామాజిక మానవీయ విలువలు కలిగిన మహోన్నత వ్యక్తిగా దర్శన మిచ్చేలా కన్పిస్తారు. "ఒకింత వేకువ కోసం" స్మృతి కవిత్వాన్ని ఆవిష్కరించే ఆమె గుణగణాలను బహుముఖంగా వర్ణిస్తారు.

"మినీ కవితా మింటి మెరుస్తుంది నెలవంక పద్యంలాగా సూర్యుడు హస్తమిస్తూ అస్తమిస్తూండగానే... నీటి మీద నున్నగా జారిపోతున్న అలలాగా ఉంటుందామె. నిలువెత్తు నీలగోరింట పూవులాగా, నిటారుగా నిలిచిన ఇంద్రచాపం లాగా, నవమి నాటి చందమామ లాగా ఉంటుందని ఆమె వ్యక్తిత్వాన్ని ఉన్నతీకరిస్తారు.

"ఆమె నా అక్షరం, ఆమె నా మాట, ఆమె నా పాట, నా కవిత్వాన్ని మీరు చెరిపేయలేరు. నా మాటను మీరు మాయం చేయలేరు. నా పాటను మీరు ఉరి తీయ్యలేరు పంచేంద్రియాలతోను ఆమెను ప్రేమించకుండా మీరు నన్ను ఆపలేరని కాంతమ్మ గారి జ్ఞాపకాలతో అనుభవ తోరణాలతో అలంకరించిన ప్రేమాలయాలే భరద్వాజ స్మృతి కావ్యాలు.

**ముగింపు :**

భరద్వాజ వైయుక్తిక జీవితాన్ని స్పృశించకుండా ఆయన సాహితీ జీవితాన్ని మదింపువేయటం ఎంత అసాధ్యమో కాంతమ్మ గారి ప్రస్తావన లేకుండా భరద్వాజ వైయుక్తిక జీవితాన్ని చిత్రించ ప్రయత్నిచండం అంతకుమించిన అసాధ్యం అంటారు జస్టిస్ రామస్వామి. వారి మాటలు అక్షర సత్యాలు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# రావూరి భరద్వాజ్ గారి కథా సాహిత్యం – సామాజిక స్పృహ

- మాధవి బొల్లు
పరిశోధక విద్యార్థిని, తెలుగు శాఖ
రాజధాని కళాశాల, చెన్నై, తమిళనాడు.

**ఉపోద్ఘాతము :**

ఆధునిక తెలుగు సాహిత్యంలో తక్కిన అన్ని ప్రక్రియల కన్నా ఎక్కువ అభివృద్ధి చెందినదీ, సుసంపన్నమైనదీ, తెలుగు వారు సగర్వంగా చెప్పుకోదగిందీ, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు తెచ్చింది, కథానిక మాత్రమే. గురజాడ అప్పారావు కథ 'దిద్దుబాటు' 1910 లో అచ్చయ్యి కథకి అంకురార్పణ జరిగినా 20 వ శాతాబ్దం లో సమకాలీన జీవన స్థితి గతులకు బాటలు వేసినది తెలుగు కథానిక. శ్రీపాద తెలుగు దనం ఉట్టిపడేలా కథలు రాస్తే, విశాఖ మాండలికం లో రావి శాస్త్రీ, ఉత్తరాంధ్ర యాసలో చాసో కథలు రాశారు. వీళ్ళ కథాశిల్పం లోని వాడి వేడి పాఠకులను అక్షరాల వెంట పరుగులు పెట్టిస్తాయి. రెండో ప్రపంచ కథానిక పోటీల్లో పాలగుమ్మి వారి గాలి వాన కథకు రెండో బహుమతి రావటం తెలుగు కథానిక స్థాయిని పెంచింది. ఆ తరువాత వచ్చిన వారిలో మధురాంతకం, ముని మాణిక్యం, అడవి బాపిరాజు, మొక్కపాటి, గోపీచంద్, తిలక్, పెద్దిభోట్ల తదితరులెందరో కథానికలను రచించారు. కథానిక చిన్నదే కావచ్చు కాని అది సువిశాల ప్రపంచంలో సమైక్య జీవన విధానాన్ని ప్రోత్సహిస్తున్నది. మానవత్వాన్ని వెలిగిస్తూ ఈ చిన్న కథ కాలానికి తగినట్లు తన రూపాన్ని మాధ్యమాలను మార్చుకుంటూ అంతర్జాల కథగా కూడా సాగి పోతుంది. కథానిక లక్షణాలే వుండి విపులంగా చెప్పబడేదే కథ. మనిషి తన భావనా ప్రపంచం లోని ఊహలకు, కల్పనలకు, అనుభవాలన్నిటికి ప్రాణం పోసి, సాహిత్యరూపం కల్పిస్తే ఆ కథకు గౌరవస్థానం దక్కుతుంది.

ప్రతివ్యక్తికి తనదైన కుటుంబం వివాహం తరువాత ఏర్పడుతుంది. నాకు నువ్వు నీకు నేను అన్నట్లుగా మమేకం అయిన దంపతులకు మధురమైన వసంతం గడిచే సరికి కుటుంబం లో కొత్త మొలకలు మొలుస్తాయి. బిడ్డల పెంపకం, వారి ఆలనా పాలన చూస్తూ జీవితం గడిపినట్లే క్రిమి కీటకాదుల జీవితాలకు ఆనాటి పరిస్థితులను ఆ పాత్రల ద్వారా కళ్ళకు కట్టే విధంగా మేళవించిన రావూరి భరద్వాజ్ గారి కథ 'చీమ తల్లి విశ్వాసం'. ఈ కథలో రెండే పాత్రలు. ఆ పాత్రల ద్వారా వారి కష్ట సుఖాలు, మంచి చెడ్డలు, అనుభవాలను గురించి రచయిత చిత్రీకరించారు. కథ, కథలోని పాత్రల, పరిసరాల వాతావరణం యొక్క అవసరం మేరకు చెప్పబడిన వైనం ఈ కథలోని ప్రత్యేకత. వీరు తన చూట్టూ వున్న పరిస్థితులను ఆకళింపు చేసుకొని వాటికీ అనుగుణంగా స్పందిస్తూ సమాజములోని సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నారు.

**రచయిత గురించి :**

డాక్టర్ రావూరి భరద్వాజ 1927 సంవత్సరంలో గుంటూరు జిల్లాలో జులై 5వ తేదిన రావూరి కోటయ్య, మల్లికాంబ దంపతులకు జన్మించారు. కేవలం ఉన్నత పాఠశాల స్థాయి వరకే చదువు సాగింది. వీరికి కాంతం గారితో 1948 లో వివాహం జరిగింది. వీరికి ఐదుగురు సంతానం. 500 పైగా కథలను, 37 కథా సంకలనాలుగా 19 నవలలు, 10 నాటకాలు, వ్యాసాలు, మరెన్నో ఇతర పుస్తకాలను రచించారు. వీరు మంచి కథకులు. ఆధునిక కథాసాహిత్యానికి కొత్త బాటలు వేసిన రచయిత, ఆడంబరాలు లేని సాధారణ జీవితం వీరిది. ఆకాశవాణిలో కార్యనిర్వాహణాధికారిగా పదవీ విరమణ చేసి పూర్తి కాలాన్ని సాహిత్య కళా రంగాలకు వినియోగించి ఎన్నో పురస్కారాలు, గౌరవ డాక్టరేట్లు, కళాప్రపూర్ణ, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు రాజాలక్ష్మి పురస్కారం, కళారత్న పురస్కారాలతో పాటు 2012 లో జ్ఞానపీఠ్ అవార్డు ఆయనకు దక్కాయి. ఆయన తెలుగు సాహిత్యానికి చేసిన కృషి బహుముఖం.

వీరి శైలి సరళంగానూ, అందరికి అర్థమయ్యే రీతి లో ఉం టుంది. 2013 లో హైదరాబాద్ లో వీరు తన తుదిశ్వాస విడిచారు.

"చీమ తల్లి విశ్వాసం' కథ రావూరి భరద్వాజ 'ఉడు తమ్మ ఉపదేశం' అనే కథా సంపుటి లోనిది. ఇద్దరు అపరిచితుల మధ్య మర్యాద పూర్వకమైన సంభాషణ ఎలా సాగుతుందో అలా రెండు కీటకాల మధ్య జరిగిన సంభా షణలో తన భావాలను పొందు పరిచి రచయిత ఎంతో చక్కగా పాఠకుడి కి పఠనా శక్తిని పెంచారు. పాత్ర చిత్రీ కరణలో ఒక సన్నివేశాన్ని పరిచయం చెయ్యటంలో రావూరి భరద్వాజ్ గారికి ఉన్న ఒడుపు అద్భుతమైనది.

**కథా ఇతివృత్తము :**

ఎండాకాలంలో తన కుటుంబ పోషణ కోసం మండు టెండలో దూర ప్రయాణం సాగించి అలసి సొలసిన చీమ, తన రెక్కల అలసట తీర్చుకోటానికి ఆగిన సీతాకోక చిలుక, ఈ రెండు, ఒకే సమయానికి పెద్ద మర్రి చెట్టు దగ్గిర చేరాయి. వారి ఇద్దరి మధ్య జరిగిన సంభాషణే ఈ కథ, సీతాకోక చిలుక చీమని చూసి మిమ్మలిని చూస్తే జాలి వేస్తుంది, ఇంత ఎండలో మన సన్నకారు ప్రాణులు బ్రతకటమే కష్టం, ఉదయం, సాయంకాలం మాత్రమే బయటకు రావాలి, అలాంటిది మిమ్మలను చూస్తే చాలా దూరం నుంచి వస్తున్నట్లున్నారు, బాగా ఆలసిపోయారు, అని తన రెక్కలను ఆడిస్తూ అంటుంది. చీమ కళ్ళల్లో నీరు చూసి అయ్యో అడగరాని ప్రశ్నలు అడుగుతున్నానా? ఏదైనా సాయం చెయ్యాలనే ఉద్దేశ్యమే కానీ మరొక అభిప్రాయం లేదు, క్షమించండి అన్న సీతాకోక చిలుక మాటలకు మరోసారి కన్నీరు తుడుచుకొని గొంతు సరిచేసుకుని మీరు మంచి వారు కాబట్టి నా యోగక్షేమాలు అడిగారు, నేను చెరువుకు అటువైపు నుంచి వస్తున్నాను, తెలిసిన వారు ఎంతో మంది చూసారు కానీ పలకరించలేదు, నన్ను మొదటిగా పలకరిం చింది మీరే – అన్న చీమ మాటలకు అలా ఎందుకు జరిగిందండి, మాట వారసకన్నా అడగవచ్చు కాదా ఆ పాటి మర్యాద కూడా వాళ్ళకి తెలియదా అని చిలకమ్మా అంటుంది. నా రోజులు బాగున్నప్పుడు అందరు పలకరిం చారు కష్టకాలం రావటంతో పలకరిస్తే ఎక్కడ సాయం చేయవలసివస్తుందో అని మొఖం దాటేస్తున్నారు అని గద్గద స్వరంతో చెరువు అటు పక్క తిండి గింజలు దొరుకుతాయని ఎవరో చెపితే వెళ్ళాను అన్న చీమ మాటలకు చిలకమ్మ కొంతమందికి ఒక చెడ్డ లక్షణము ఉంటుంది, ఎదుటి వారికి లేని పోని ఆశలు కలుగ చేసి ఆ ఆశల వైపు పరిగెత్తే వారిని చూసి వెనుక నుంచి నవ్వుకుంటూ వుంటారు, వారిది ఒక రాక్షస ఆనందం అంటూ మీకు ఈ కబురు చెప్పిన వాళ్ళు ఆ కోవకు చెందుతారు అని అంటుంది. దానికి చీమ వారు చెప్పనది నిజమే, అక్కడ చాలా తిండి గింజలు వున్నాయి, నాకన్నా ముందుగా ఆ సంగతి పసిగట్టిన గుండా చీమలు, రౌడీ చీమలు నే వెళ్లేసరికి గింజలేకుండా తీసుకువెళ్లాయి, కనీసం పొట్టు కూడా మిగల్చలేదు అని ఏడుస్తూ చెప్పింది.

కష్టాలు అందరికి రావు, భరించ గలిగే వారికే వస్తాయి అంటూ చిలకమ్మా ఈ పనులన్నీ మీ వారు కదా చెయ్యాలి? ఆయన మంచి వారు కాదా? మిమ్మలిని పట్టించుకోరా? పిల్లల ఆలనా పాలన చూడరా? అని అంటున్న చిలకమ్మా తో మా వారు చాలా మంచి వారు ఏ చెడు అలవాటు లేదు మేమంటే చాలా ఇష్టం ఆయనకు ఈ మధ్య సుస్తీ చేసింది అందుచేత కదల్లేక పోతున్నారు. దాచుకున్న గింజలు కూడా అయిపోయాయి అందుకే నేను రావలసి వచ్చినది. అయ్యో మా వారు పిల్లలు ఎదురు చూస్తారు. ఈ పాడు మొఖం ఎలా చూపించాలి అని చీమ బాధ పడుతుంది. కన్న బిడ్డల కోసం పడే బాధ నాకు తెలుసు మీరేమి అనుకోనంటే నా దగ్గర వున్నా పుప్పొడి మీకు ఇస్తాను ఇలా సాయం చెయ్యటం వలన నాకు పుణ్యమైన దక్కుతుంది అన్న చిలకమ్మా తో మీకు చాలా కృతజ్ఞతలు ఎప్పటికీ మా కుటుంబమంతా మీకు రుణపడి ఉంటుంది అని చీమ తన ఆనందాన్ని వ్యక్తపరుస్తుంది. ఇంతలో వారిద్దురూ ముంచు కొచ్చే సంఘటనను గమనించ లేదు, జరగకూడని సంఘటన జరిగేపోయింది. అమ్మ తెచ్చే అన్నం మూట కోసం ఎదురు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

చూస్తున్న పశువుల కాపరి చెట్టు దగ్గరికి వచ్చి రెప రెప లాడిస్తున్న సీతాకోకచిలుక రెక్కలను వెనక నుంచి పట్టుకున్నాడు. ఉల్లిక్కి పడిన చిలకమ్మతో నాకు సాయం చేద్దామని మీరు నా దగ్గర ఉండిపోయారు నా దురదృష్టం మిమ్మలిని పట్టుకుంది, దోషం నాది .. శిక్ష మీదా ? అని బాధతో మొలికలు తిరుగుతున్నా చీమతో చిలకమ్మా నాకు వచ్చిన అపద గురించి నాకు బెంగ లేదు, మీకు సహాయం చెయ్యకుండానే ఈ ఘోరం జరిగింది అని నా బాధ. దానికి చీమ, నా ప్రాణాలు అడ్డు వేసైనా నేను కాపాడుతాను, నాకు వచ్చిన ఉపాయం వినండి, నేను అతనిని కండలు ఊడేలా కుడతాను, కుట్టగానే ఆ బాధతో అతను మిమ్మల్ని వొదులుతాడు, అప్పుడు మీరు ఎగిరిపోండి అని అంటుంది, దానికి చిలకమ్మా, మీరు కుట్టగానే అతడు మిమ్మలను చంపుతాడు, ఊరుకోడు, సుస్తీగా వున్న మీ వారు, నోరు వాయ లేని పిల్లలు అన్యాయం అయిపోతారు, దయ చేసి నా ఒక్క ప్రాణం కోసం ఇంత మందిని ఉసురు పెట్టకండి, ఆ మాట అనటమే నా భాగ్యం అంటున్న చిలకకు చీమ సాష్టాంగ నమస్కారం చేసి వూరు పేరు తెలియని నేను నిజం చెప్పానా అబద్ధం చెప్పానా అని ఆలోచించ కుండా నా బాధ చెప్పిన వెంటనే మీరు కరిగిపోయి నా బిడ్డలకు ఆహారం దానం చేసిన దయా హృదయం మీది, మీ వంటి ఉత్తముల కోసం ఒక సారి కాదు ఎన్ని సార్లు మరణించ టానికైనా అభ్యంతరం లేదు అని స్థిర నిర్ణయం తో పశు వుల కాపరిని కుట్టటం కోసం ముందుకు కదులుతుంది చీమ తల్లి ఎంతో విశ్వాసంతో........ ఇలా కథ ముగుస్తుంది.

## పాత్ర చిత్రణ :

చీమ, సీతాకోక చిలుక పాత్రల సంభాషణ ద్వారా నేటి సమాజ స్థితిగతులను రచయిత ముందుగానే చెప్పనట్ల యింది కుటుంబ పెద్దకు జబ్బు చేస్తే కానీ పరిస్థితులు వచ్చి కుటుంబ భారం మోయవలసి వస్తే స్త్రీలు వారి కుటుంబం కోసం పిల్లల కోసం ఎన్ని కష్టాలు పడటానికైనా సిద్ధమే అని ఈ కథ లోని చీమ పాత్ర ద్వారా తెలియ చేశారు రచయిత. ఎంత కష్ట పడ్డా ఒక్కొక్కసారి ఫలితం ఉండకపోవటం, సమాజంలో గుండాలు, రౌడీలు ఎలా దోచుకు తింటున్నారో – అందరికి సమాన ఆర్థిక జీవన విధానం లేదని చూపించారు రచయిత, కష్టాలలో ఆదుకున్న వాడే నిజమైన ఆత్మ బంధువని సీతాకోక చిలుక పాత్ర ద్వారా చీమ కన్నీరు తుడిచి, ఓదార్చి సహాయం చేసిన తీరును, సమాజం లో గొప్ప వారు, మంచి వారు ఇంకా వున్నారని ఎంతో మందికి వెలుగు నిచ్చే అభ్యుదయ భావాలు గల వ్యక్తులు పుడుతూనే ఉంటారని రచయిత హెచ్చ రించారు.

చీమ తల్లి విశ్వాసం కథ నీతి బోధ కావొచ్చు, లోక రీతి కావొచ్చు. సహజంగా కళ్ళకు కట్టినట్లు వున్న సంభాషణ లను మనుషుల మధ్య కనుమరుగు అవుతున్న సంబంధ బాంధవ్యాలను తట్టి లేపారు రచయిత.

చీమ సీతాకోక చిలుకతో మీరు మంచివారు అందుచేతనే నా యోగక్షేమాలు అడిగారు. నేను వస్తున్న సమయములో చాలా మంది నన్ను ఎరిగినవారు నేను ఎరిగినవారు తారస పడ్డారు. కాని కాలం వచ్చి పడింది. పలకరిస్తే నేను ఏమన్న సహాయము అడుగుతానని భయం తో ముఖం దాటేస్తు న్నారు. విధిలేక ఎదురుపడితే నేను ఎవరో తెలియనట్లు ప్రవర్తిస్తున్నారు అన్న చీమ సమాధానము ద్వారా రావూరి వారు సమాజ స్థితిగతులను మనుష్యుల మనోభావాలను ఎంత చక్కని శైలిలో చూపించారో మనము గమనించ వచ్చు.

## ఉపసంహారం :

సమాజాన్ని సంస్కరింప చేసే దిశగా సాహిత్యం తన దైన శైలిలో పాత్ర పోషిస్తుంది ఆ క్రమంలోనే కథా సాహిత్యంలో జంతువులు, పక్షులు మరియు క్రిమి కీటకాలను పాత్రలుగా తీసుకున్న పంచతంత్రము, హితోప దేశం మరియు భోజరాజీయం వంటి ప్రసిద్ద కథలు సాహితీ లోకాన్ని అలరింపగా ఆ కోవలోనే రావురి భరద్వాజ గారి 'ఉడతమ్మ ఉపదేశం' కథాసంపుటి లోని చీమ, సీతాకోక చిలుక, పాత్రలతో సమాజములోని పాత్రలను దర్శింప చేసిన తీరు అద్భుతం. రావూరి భరద్వాజ " చీమ తల్లి విశ్వాసం" కథ లోని పాత్రలద్వారా సామాజికస్పృహను పాఠకులకు కల్గించిన తీరు ప్రశంసనీయం, అభినందదాయకము.

# చీమ తల్లి విశ్వాసం

- వై. బుజ్జి
సంస్కృతోపన్యాసకురాలు,
జి.బి.ఆర్. డిగ్రీ కాలేజి, అనపర్తి, తూ॥గో॥ జిల్లా.

డాక్టర్ రావూరి భరద్వాజగారు 1927లో జన్మించినారు. వీరు మంచి కథకులు ఆధునిక కథాసాహిత్య వికాసానికి కొత్తబాటలు వేసిన రచయిత. వీరు 500లకు పైగా కథలను, 150కి పైగా వివిధ పుస్తకాలను వ్రాసెను. 1959లో ఆల్ ఇండియా రేడియోలో చేరి కార్యనిర్వాహణాధికారిగా ఉద్యోగ విరమణ చేసిరి తాను పూర్తికాలం సాహిత్య కళా రంగాలకు వినియోగించిరి. వీరు అకాడమీ అవార్డులు, సోవియట్ లాండ్ అవార్డు రాజ్యలక్ష్మి పురస్కారంతోపాటు ఎన్నోఅవార్డులు అందుకున్నారు. వివిధ విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌లతో వీరిని సత్కరించిరి. వీరి శైలి సరళంగా ఉండి అన్నివర్గాలవారినీ ఆకర్షింపచేస్తుంది. ఇతను రచించిన పాకుడు రాళ్ళు నవలకు జ్ఞాన పీఠ అవార్డు వచ్చింది.

అయో! గడచిన సంవత్సరాలకన్నా ఈ సంవత్సరం ఎండలు అతి భయంకరంగా ఉన్నవి. ఉగాది వెళ్ళి ఎన్నో రోజులు కాలేదు. అప్పుడే సూర్యుడు తన వేడిమితో అందరినీ గడగడలాడించుచున్నాడు. చెరువులుకూడా ఎండిపోవుచున్నవి. బయట కాలుపెడదామన్నా భయంగానే ఉంది. పచ్చికమీదనుంచి వచ్చుచున్న గాలులుకూడా వెచ్చగానే ఉన్నవి. కానీ ఇటువంటి బాధలు "డబ్బున్నవారికి తెలియవు." తెలిసే అవకాశమూ లేదు. ఎందుకంటే వారికి కావలసిన ప్రతీ వస్తువూ వారిచుట్టూతా ఉంటుంది కనుక. ఒకవేల ఏవైనావారిదగ్గర లేనిచో అవి పనివారు తెచ్చి పెడతారు. "ఎండలు భయంకరంగా కాస్తున్నా, గాలి కాలిపోతుందన్నా" వారికి అర్ధంకాక ఆశ్చర్యపోతుంటారు. భగవంతుడు అందరినీ "భాగ్యవంతులుగా పుట్టించడం" ఆయనకు ఇష్టం లేదు. ఎందుకనగా భగవంతుడు గొప్పవాడు కనుక. ఈ భూమిమీద "కొంతమందైనా పేదవారు లేకపోతే సంపన్నులకు తాము సంపన్నులమని గుర్తుండదు." ఇచ్చట చిత్రమైన విషయం ఏమనగా భగవంతుని సృష్టిలో సంపన్నులకన్నా పేదవారే ఎక్కువగా ఉండటం. దీనికారణంగా భగవంతునికి "పేదవారంటే చాలా ఇష్టం".

ఆ విధంగా భగవంతునికి ఇష్టమైనవాటిల్లో సీతాకోక చిలుక ఒకటి. అప్పటికే మిట్టమధ్యాహ్నమయింది. ఎండలు నిప్పులు చెరగడం ప్రారంభించినవి. ఆ వేడిని భరించలేని నీడలు కూడా చెట్లకిందకు వచ్చుచున్నవి. విశ్రాంతి కాసేపయినా తీసుకుందామని నిన్న మొన్నటిదాకా పచ్చగాఉన్న మైదానంకూడా ఎండదెబ్బకు వెండిలాగ తెల్లబడిపోయింది. గలగల్లాడుతూ ఉండే చెరువుకూడా వెలవెలబోతోంది. పదేళ్ళు నిండని కుర్రాడు పశువులు కాయుచూ ఆకలిబాధతో ఊరివైపు తన అమ్మకోసం ఎదురుచూస్తున్నాడు ఆమె తనకు అన్నం తీసుకువస్తుందని. ఆసమయమున ఒక సీతాకోక చిలుక అతనిని, అతడు కాస్తున్న పశువులను చూస్తూ అతని చుట్టూ, పశువుల చూట్టూ తిరిగీ తిరిగీ అలసిపోయి ఆ చెట్టుక్రిందకు వస్తూనే నీడ పరచుకున్న ఓమర్రిచెట్టుమీద మెల్లగావాలింది. ఈ ఏడాదికి పోయిన ఏడాదికి పోలికేలేదు ఎందుకనగా కాలం మారిపోయింది. ఇంకా వైశాఖమాసం మొదటివారమన్నారాలేదు. అప్పుడే ఎండలు చంపేస్తున్నాయి. ఈ ఎండలను తట్టుకోవడం చాలా కష్టంగా ఉంది. ఎండలో తిరిగీ తిరిగీ అలసిపోయి ఒక్కసారే నీడకు రావడంవల్ల దాని కళ్ళు బయర్లుకమ్మినవి. ఒకసారి కళ్ళు మూసుకొని తెరిచాకగానీ తనకు, తన చుట్టూ ఏమిజరుగుతుందో అర్ధంకాలేదు. ఆ సమయమున ఒక చీమ ఆపసోపాలు పడుచూ నెర్రెలిచ్చిపోయిన సన్నని బాటమీద నడవలేక నడుస్తూ అచటకు వచ్చుటను ఆచిలుక చూచి దానిమీద జాలిపడింది. ఆ చీమకూడా ఆ మర్రిచెట్టుదగ్గరకు వచ్చి దానిని ఆనుకొని అలసటతీర్చుకొనుచున్నది. అప్పుడు సీతాకోకచిలుక తనమీద జాలితో తన రెక్కలను ఊపుతూ చీమకుదగ్గరగా జరిగింది.

ఆ రామచిలుక చీమతో ఎండలు భగ్గుమనుచున్నవికదా అని అడిగింది. మనలాంటి చిన్న ప్రాణులు బ్రతకడకష్టంగా వున్నది. ఇంత భయంకరమైన ఎండలో ఎక్కడినుండి వచ్చుచున్నావు? అని అడిగింది. చీమ తన చెమటను తుడుచుకొని నీవన్నది నిజమేనని తలపూపినది. మిట్ట మధ్యాహ్నం అడుగు తీసి అడుగు బయటపెట్టలేకపోతు న్నాము. నీవు ఎండలో చాలా దూరంనుండి వస్తున్నావా అని అడిగింది చిలుక. అది విని చిలుక అవునండీ నేను చాలా దూరంనుండి వస్తున్నానని చెమర్చిన కళ్ళతో సీతాకోక చిలుకకు చెప్పగానే చిలుక అయో! నేను మిమ్మల్ని పిచ్చి ప్రశ్నలు అడిగి మీ మనస్సు నొప్పించినట్లున్నాను క్షమిం చండి, నేను నాకు చేతనైన సాయం చేద్దామన్న సదుద్దేశ్యంతో అడిగాను అంది చిలుక. చీమ కన్నీరు తుడుచుకొనుచూ గొంతును సవరించుకొని మీరు చాలా మంచివారండీ, నా యోగక్షేమాలను గూర్చి అడిగారు. నేను చెరువు అవతలి గట్టునుంచి వచ్చుచున్నాప్పుడు. నాకు దారిలో చాలామంది ఎదురయ్యారు. ఏ ఒక్కరు కూడా నన్ను పట్టించుకోలేదు. నన్ను పట్టించుకొన్నవారిలో మీరు ఒక్కరు మాత్రమే అనెను. చీమగారు ఇంత ఎండలో మీరు ఎక్కడనుండి వస్తున్నారని మాటవరుసకైనా అడగొచ్చుకదా! ఆ మర్యాదకూడా వారికి తెలియదా అంది సీతాకోక చిలుక. వెంటనే చీమ నేను బాగున్నప్పుడు వీరికి నా మర్యాదలన్నీ తెలుసు. నాకు ఇప్పుడు కాలం వచ్చేసింది. కనుక నన్ను పలుకరిస్తే వారిని ఏమైనా నేను సహాయం అడుగుతానని వారి భయం. అందు వలన ముఖం చాటేస్తున్నారేమో! అంది. మీరు ఆ పొలందాకా ఎందుకెళ్ళారని నేను అడుగలేదు అంది సీతాకోకచిలుక. చీమ ఒక్కక్షణం ఆగి మరలా అచట తిండిగింజలు బాగా దొరుకుతాయిని ఎవరోచెబితే అది విని అంతదూరం వెళ్ళాను అని... ఆగిపోయింది. చీమగారు మీరు విన్నది ఆబద్ధమా! కొందరికి ఈ పాడుబుద్ధి ఉంటుంది. "ఎదుటి వారికి లేనిపోయిన ఆశను రేపి, వారు ఆశల వెంట పరు గులు తీస్తుంటే వెనుకనుండి నవ్వుతారు." అదిచూచి వారు రాక్షసానందం పొదుతారు అంది సీతాకోకచిలుక. అబ్బే అక్కడ చాలాగింజలున్నాయి. నేను వెళ్ళేసరికి నాకంటే ముందు రౌడీచీమలు దొచుకుపోయాయి. చివరకు అచ్చట నాకు ఏమీ దొరకలేదు అని ఏడ్చినది. వెంటనే సీతాకోక చిలుక చీమను ఆలింగనం చేసుకొని ఓదార్చి "కష్టాలందరికీ రావు, అవి భరించేవారికే వస్తాయి."అంది. చీమ ఆ రామచిలుకతో నాగురించి నాకు బాధలేదు, నేను ఏదో తెస్తానని, అవి తిందామని నా పిల్లలు ఎదురు చూస్తారు. ఉత్తి చేతులతో వెళ్ళి వారికి నాముఖం ఎలా చూపించను. చాలారోజులనుండి వాళ్ళకు మాయమాటలు చెప్పి రొజులు గడుపుచున్నాను. ఆకలి నా మాట నమ్మనివ్వదు అని చెప్పి బాధపడినది.

సీతాకోక చిలుక ఈ గొడవలన్నీ పడవలసింది మగవారు కదా మీవారు మిమ్మల్ని పట్టించుకోరా అని చీమను అడిగింది. చీమ మా వారు చాలా మంచివారు. కానీ అతనికి సుస్తీచేసింది. ఆరోగ్యంగా అతనే ఉంటే నాకీబాధలు ఉం డేవికావు అంది చీమ. అది విని సీతాకోకచిలుక "కన్నబిడ్డల కోసం తల్లిపడే బాధేమిటో నాకు తెలుసు". నేను కొంత పుప్పొడిని నా పిల్లలకోసం దాచాను. అది కొంత తీసుకెళ్ళి మీరు, పిల్లలు అందరూ తినండి. నాకు పుణ్యం కొంత దక్కుతుందని చెప్పి తన దగ్గర ఎన్న పుప్పొడినంతా చీమకు ఇచ్చేసింది. చీమ దానిని అందుకొనుచూ మీ కు కృతజ్ఞతలు, మేము మీకు రుణపడి ఉంటాం అంటూ... వారు మాట్లాడు కొనుచూ తమ ప్రక్కన ఏమి జరుగుతుందో గ్రహించలేదు. తల్లి అన్నం మూటకోసం ఎదురు చూస్తున్న పిల్లాడు అలసి పోయి పశువులను బీట్లోకి త్రోలి విశ్రాంతికోసం చెట్టు క్రిందకు వచ్చి సీతాకోకచిలుకను చూచి వెంటనే తన రెండు రెక్కలనూ పట్టుకొనెను. ఊహించని సంఘటన జరిగేసరికి సీతాకోక చిలుక ఉలిక్కిపడింది. అది చూచి చీమ నీవు నాకు సాయం చేద్దామన్న మంచి మనస్సుతో నాదగ్గర ఉ ండిపోయారు. ఈ కుర్రవెధవ మీ ప్రాణాలమీధకు తెచ్చాడు. మీరునాకు సాయంచెయ్యాలన్న ఆలోచన చేయకపోయినచో ఈ అపద కలిగేదికాదు అని బాధతో చీమ అనెను. సీతాకోక చిలుక నేను బాధపడినది నాకోసంకాదు నీ వంటిమీద

చెమట ఆరేదాకయినా నేను రెక్కలు విసరలేకపోతినని. "బాధపడిన తప్పునిదానిగురించి ఆలోచించుట వ్యర్థము" కదా! అంది.

అప్పుడు చీమ చిలుకతో మీరు కదలకుండా అతని వేళ్ళమధ్యలో ఉండండి. నేను అచ్చటికి వచ్చి అతనిని కుడాతను. ఆ నొప్పికి భరించలేక అతడు అమ్మాఅని అరచి మిమ్మల్ని వెంటనే వదిలివేయును, అనప్పుడు మీరు వెంటనే ఎగిరిపోవచ్చు అని చెప్పెను. అది విని సీతాకోకచిలుక మీరు నన్ను కాపాడదామని అతనిని కుడతారు. అది బాగానే ఉంది కానీ అతడు అది మరచి నన్ను వదిలివేసి వెంటనే నిన్ను నలిపి చంపివేసినచో మీవారు, పిల్లలు అన్యాయమవు తారుకదా! అనెను. చీమ నా ఒక్కదానికోసం మీరు అలా చేయవద్దు. మీరు ఆ మాట అనడమే నా భాగ్యం అని చీమ తన చేతిలో ఉన్న పుప్పొడిని మట్టి బిడ్డకు పెట్టి సీతాకోకచిలుకకు సాష్టాంగ నమస్కారం చేసి చిలుకగారు నేను మీకు నిజమే చెప్పానో అబద్దమే చెప్పానో మీకు తెలియదు. నేను నా బాధలు మీకు చెప్పగానే మీరు కరిగి పోయి మీకోసం, పిల్లలకోసం తెచ్చుకున్న పుప్పొడిని నాకు దానం చేసిన "దయార్ద్రహృదయంమీది". మీలాంటి ఆప్తుల కోసం ఎన్నిసార్లు మరణించినా నాకభ్యంతరం లేదు అని ఆపశువుల కాపరిని కుట్టకుండా చీమ ముందుకు వెళ్ళుతూ...

ఇటువంటి స్ఫూర్తిని కలిగించే అనేక నవలలు, కథా సంపుటులు వ్రాసి ప్రజలకు మంచి సందేశంతో ఉత్ప్రేరకాన్ని నింపిన మహానుబావుడు. ఎంతో దారిద్ర్యాన్ని అనుభవించు చున్నను నిజాయితీ లేని చోట ఉద్యోగాన్ని కూడా మానివేసి నారు. తాను చూచిన, వినిన ప్రతి అంశంను తన డైరీలో వ్రాసుకొని వాటి ఆధారంగా రచనలు చేసిన వ్యక్తి. తనకు సహాయం చేసిన వారిని, తనకు అన్నం పెట్టిన వారిని, పుస్తకాలు కొనిచ్చిన వారిని మరచిపోకుండా వారి పేర్లను తమ పిల్లలు పెట్టుకొనిన మహోన్నత వ్యక్తి. తన భార్యను ఎంతో గొప్పగా "దయామయి" అని చెప్పుకొనెడివారు. భార్యను దృష్టిలో ఉంచుకొని "నాలోకి నీవు", "అంతరందిణీ" అను రచనలు చేసిరి. ఎన్నో సేవాకార్యాక్రమాలు చేయుచూ, భార్యపేరుమీద పేదవారికి ఆర్థిక సహాయం చేయుచు ముందుకు వెళ్ళుచున్నారు. "అపకీర్తితో బ్రతకడం కన్నా నిజాయితీతో చావవచ్చు" అని నమ్మిన వ్యక్తి. ప్రతి పేదవానిలో, కూలి పని చేసే వారిలో, ఆకలిలో అలమటించే వారిలో, పేపర్ బాయ్‌లో ఇలా కష్టపడి పనిచేసే ప్రతి వ్యక్తిలో నన్ను నేను చూసుకుంటాను అని తన నిజాయితీని ప్రపంచా నికి చాటిచెప్పిన ఆదర్శవంతులు. జ్ఞానపీఠ గ్రహీత ఐన రావూరి భరద్వాజగారు మనందరకు స్ఫూర్తిదాయకులు.

# రంగుల వలయంలో – నింగికెగిరిన "మంజరి"

- డా॥ సి.హెచ్. విజయకుమార్
ప్రధాన ఆచార్యులు, తెలుగువిభాగం
సి.ఆర్. కళాశాల, చిలకలూరిపేట, గుంటూరు.

తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనుడు. ఆడంబరాలు లేని సాధారణ జీవి. 1927 జూలై 5వ తేదీన కృష్ణాజిల్లాలోని నందిగామ అప్పటి తాలూకా కంచిన చర్ల సమీపంలోని మోగులూరు (నాటి హైదరాబాదు సంస్థానంలోని) గ్రామంలో రావూరి కోటయ్య మరియు మల్లికాంబ దంపతులకు జన్మించారు. విద్యాభ్యాసం 8వ తరగతి వరకే సాగింది. పేదకుటుంబం అయినందువల్ల జీవితమంతా మిట్టపల్లాలే. జీవన యానానికి అనేక మార్గాలు ఎంచుకోవాల్సి వచ్చింది. యుక్త వయస్సులో ఆంధ్రాపారిస్ పేరు గడించిన తెనాలిలో ప్రింటింగ్ ప్రెస్‌లో చేరాడు. ఆ తరువాత 1946లో నెల్లూరులోని 'జమీన్ రైతు' వారపత్రిక సంపాద వర్గంలో చేరారు. తనకున్న అనుబ'ంతో అచరకాలంలోనే ఆ పత్రిక బాధ్యతలు తీసుకున్నాడు. తదనంతర కాలంలో జ్యోతి, సమీక్ష అభిసారిక, చిత్రసీమ, సినిమా, 'యువ' పత్రికల్లో పనిచేశారు. ఆ తరువాత కొన్నాళ్ళు 'ఫౌంటిన్' పెన్ను కంపెనీలో సేల్స్‌మెన్‌గా కూడా పనిచేశారు. అక్కడ యజమాని అమానుషత్వాన్ని భరించలేక రాజీనామా చేసి ఖాళీగా ఉన్నాడు.

రావూరి భరద్వాజ రచనా ప్రస్థానం 16 ఏళ్ళ వయసు నుండే ప్రారంభించారు. తెలుగు లఘు కథా రచయితగా, నవలా రచయితగా, రేడియో రచయితగా పేరు ప్రఖ్యాతలు పొందారు. రావూరి భరద్వాజ పై సమగ్రమైన పరిశోధన చేసిన బొగ్గుల శ్రీనివాస్ పరిశీలన ప్రకారం 187కు పైగా పుస్తకాలు వెలువరించారు. 500పైగా కథలను 37 సంకల రూపంలో వచ్చాయి. 19 నవలలు, 6 బాలల మినీ నవలలు, 10 నాటకాలు రాశాడు. 3 వ్యాస మరియు 'కథా' సంపుటాలు రాశాడు. తొలి నాళ్ళలో రావూరి భరద్వాజపై 'చలం' ప్రబావం ఎక్కువగా వుండేది. చలాన్ని అనుసరిస్తూ అనేక సెక్సు కథలు రాశాడు. వీటిని రాసేప్పుడు ఏమాత్రం సంకోచంగానీ, జంకుగానీ లేకుండానే రాశాడు. తన రచనలోని యితివృత్తాలు అధికంగా స్వీయానుభవాలే. చిన్నతనం నుండి కాయికష్టం చేసిన అనుభవంతో పాటు, పొలాల్లో తనతో పాటు వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితులను గమనించాడు. అప్పుడే పల్లెప్రజల భాషా, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలు, తాపాలు గమనించిన భరద్వాజ ఆ అనుభవాలను తర్వాత కాలంలో తన రచనల్లో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి ఉపయోగించుకున్నాడు. అలాగే విచిత్రమైన మానవ భావోద్వేగాలు రచనల నిండా అమలుకుని ఉంటాయి. పాత్ర చిత్రణలో, సన్నివేశాన్ని పరిచయం చెయ్యటంలో రావూరి భరద్వాజకు ఉన్న ఒడుపు అద్భుతమైంది. అంతకు మించి శైలి కూడా చాలా సరళమైనందువల్ల రావూరి భరద్వాజ రచనలు తెలుగు వారి గుండెల్లో చిరస్మరణీయమైన స్థానాన్ని పొందాయి. వెరసి యిలాంటి జాతీయ సదస్సులు వారి రచనలకు ఊపిరి పోస్తున్నాయి.

రావూరికి తెలుగు సాహితీక్షేత్రంలో గుర్తింపును, గౌరవాన్ని ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ్ అవార్డు మార్గాన్ని సుగమం చేసింది "పాకుడురాళ్ళు" నవల. సినీ పరిశ్రమలో తెరవెనుక జీవితాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించిన మొట్టమొదటి నవల. భరద్వాజ ఈ నవలకు మొదట 'మాయజలతారు' అని పేరుపెట్టారు. అయితే శీలా వీర్రాజు దీనికి 'పాకుడు రాళ్ళు' అనే పేరు పెట్టారు. 'మల్లంపల్లి సోమశేఖర శర్మ, ముదిగొండ సుబ్రహ్మణ్యశర్మ'ల ప్రోత్సాహంతో రావూరి భరద్వాజ తాను అంతకు మునిపే రాసిన 'పాలపుంత' అనే ఓ పెద్ద కథని పాకుడురాళ్ళ నవలగా రాశారు. ఇది మూడు సంవత్సరాల పాటు కృష్ణా పత్రికలో ధారావాహికగా వచ్చింది. దీనిపై శ్రీకృష్ణదేవరాయ, వెంకటేశ్వర విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరిగాయి.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

రంగుల ప్రపంచ జీవితానికి ప్రతిబింబం పాకుడు రాళ్ళు నవల గొప్పగా జన్మించిన జీవితాలను ప్రక్కనపెడితే చాలా మంది జీవితాలు నిచ్చెనమెట్ల లాంటివే. అందులో సినిమా ప్రపంచం ఒకటి. ఇది ఎండమావిలాంటిది. కులం, పలుకుబడి, డబ్బు, చీకటి, వ్యాపారం యింకా అనేక రకాల చీకటి శక్తులు కలిస్తేనే ఆ ప్రంపంచంలో నిలబడిగలిగేది. వీటిల్లో ఏది లేకపోయినా జీవితమే ప్రశ్నార్థకం అవుతుంది. ఇందులో పురుషుల కంటే స్త్రీల పరిస్థితి మరీ అధ్వాన్నం. తమ ఉనికి కోసం ఎదుటి వారిని నిర్ధయగా బలిచేస్తూ ఉంటారు. ఇందులో ఆడ, మగా తారతమ్యం లేదు. అందుకు నిలువెత్తు దర్పణం పాకుడురాళ్ళు నవల.

వెండితెర వెనుక సాగే నిజ జీవన పోరాటగమనానికి నిలువుటద్దం పాకుడురాళ్ళు నవల, సంపదల శంపా వల్లరులతో తళ తళ మెరిసే తారాగణం నిజ జీవిత వృత్తిలో పైకెదగడానికి వేసుకొనే సోపానాల పై అడుగడుగున పేర్చ బడ్డ పాకుడురాళ్ళు ఈ నవలలో ప్రతిబింబిస్తాయి. సినిమా రంగంలో పైకి కన్పిస్తున్న రంగుల రాట్నం వెనుకున్న జీవన గమనంలోని ఎగుడు, దిగుడు, ఎత్తుపల్లాలను, నవలీకరించి అత్యున్నత జ్ఞానపీఠానికి అర్హత సాధించిన భరద్వాజ సర్వత్రా అభినందనీయులు. సినీ పత్రికలో ఉద్యోగం చేస్తూ సినిమా రంగంలోని ఒడిదొడుకులు, కష్టసుఖాలు కళ్ళారగాంచిన భరద్వాజ సినీ నిజజీవిత చరిత్ర చిత్రాన్ని చక్కగా చెక్కిన సాహితీ శిల్పకారుడు. మొట్టమొదట 1978లో ప్రచురింప బడి ఇప్పటివరకు ఐదు ముద్రణలకు నోచుకొన్న ఈ నవల సామాన్య సినీప్రేక్షకునికి సినిమా జీవితం వెనుకనున్న విస్తృత విభిన్నవిచిత్ర గాథలు కళ్ళముందు ప్రత్యక్షమయ్యే విధంగా చూపిస్తుంది. నవరసాలొలికించే నటనా జీవితం వెనుక రసహీన హృదయ విదారక ఘట్టాలు, కామోన్మాద మత్తులో మతి భ్రమించి పోయే సంఘటనలు రస వత్తరంగా తీర్చి దిద్దబడ్డాయి. తెర ముందుకు రావడానికి తెర వెనుక ఆడా ల్సిన జీవన్మరణ నటనా కౌశలాన్ని చూసి వ్యథ చెందిన రచయత వారిలో పరివర్తన తీసుకురావాలనే తపనతో తహ తహలాడిపోతున్న తాపత్రయమే ఈ నవల.

వందలకొద్ది కళాకారులు, వేలకొద్ది శ్రామికులు, లక్షల ప్రేక్షకులు, కోటాను కోట్ల వ్యాపారులు గల సినీ పరిశ్రమను శాసించే అతికొద్దిమంది శక్తులకు కనువిప్పు కలిగించాలనే తపన ఈ నవలలో అడుగడుగునా అక్షరసాక్షమై సాక్షాత్కరి స్తుంది. తెరమీద కురింపించే చిరుదరహాసం వెనుక వెక్క రించే రాక్షస హాహాకారం, హొయలొలికించే పాలరాతి శరీరాలనను పాన్పుగాచేసే పడుపుకత్తెరాక్షస లీలలు, తళతళ మెరిసే చూపుల వెనుక దాగున్న దు:ఖసరోవరాలు సంఘ టనలై ఈ నవలను ఉద్వేగభరితంగా నడిపించాయి. అవాస్త విక సంఘటనా చాతుర్యంగల చిత్రమైన సినీచిత్ర చరిత్ర గమనంలోని వాస్తవికాంశాలెన్నో మింగలేని కాలకూట విషంలా బుసలు గొట్టిన సెగలను కళంలో పోసి ఓ మహా కళాఖండాన్ని సృష్టించాడు రచయిత. మనసారా బ్రతుకలేని సినీ నిజ జీవిత ఒడిదొడుకుల వాస్తవికాంశాలను కథా వస్తువుగా స్వీకరించడం సామాజిక అభ్యుదయం పట్ల రచ యితకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుంది. అంతేగాక తన బాల్య మిత్రుడు శ్రీ కోల్లూరి వెంకటేశ్వర్లుకు ఈ నవల అంకితమిచ్చి స్నేహానికున్న విలువను వేయిరెట్లు ఇనుమడింప జేసాడు.

పుట్టుకెక్కడో, ఎలా జీవితం మొదలైందో తెలియక పూరి గుడిసెలో పెరిగి పొట్టకూటి కోసం తనువు తాకట్టు పెట్ట బడిన మంగమ్మ క్రమక్రమంగా ఎదిగి కాల పరిణామ క్రమంలో ముంబాయి చలవరాతి మేడల నీడను చేరింది. మంజరి గా తన సుదీర్ఘ జీవనప్రయాణ సోపానాల్లో అడొచ్చిన పాకుడురాళ్ళను తెలివితో దాటినా ముందు కాళ్ళు జారి, తరువాత తనువు జారి చివరికి జీవితమే చేజారిపోయింది. తనువు తాకట్టు పెట్టి దేన్నైనా సాధించ గలనన్న విశ్వాసం ఆత్మవంచనేనని తెలుసుకోనే లోగానే సమస్యల ఊబిలో కూరుకుపోయిన హృదయ విదారక ఇతివృత్తం తెలుగు సాహిత్యానికి మరో జ్ఞాన పీఠ పుర స్కారాన్ని సంపాదించి పెట్టింది.

సాహిత్య ప్రయోజనాలైన ఆనందోపదేశాలు నాడు నాటకాల ద్వారా అద్భుతంగా ప్రేక్షకులకందించబడ్డాయి. చలనచిత్ర రంగం అంతగా అభివృద్ధి చెందని కాలంలో

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

నాటకరంగం మూడుపూలు ఆరుకాయలుగా విలసిల్లింది. జీవితంలో జరిగే అనేక సజీవసంఘటనలు ఇతివృత్తంగా తీసుకొని రాయబడ్డ నాటకాలు నాటి సామాజిక రుగ్మతలను రూపుమాపి సంఘసంస్కరణకు దోహదపడ్డాయి క్రమంగా చలనచిత్ర పరిశ్రమ వేళ్ళూనుకోవడంతో నాటకాలకు ఆదరణ కరువై నాటక సమాజాలు మూతబడ్డాయి. అప్పుడు నాటకాల్లో వేశాలేసే నటీనటులు సినిమారంగంవైపు ఆసక్తి చూపడంతో నాటకాలు నామరూపాల్లేకుండా మటు మాయమై పోయాయి. ఇలా నాటక రంగం నుండి బుడి బుడి అడుగులతో సినిమా రంగంలోకి ప్రవేశించిన మంగమ్మ తన నటనా కౌశలం, సంభాషణా చాతుర్యంతో అనతికాలంలోనే మంజరిగా మారి సినీరంగ శిఖరా గ్రేసరాలు అధిరోహించింది. మానాలు, అవమానాలలు, అబినందనమందార మాలలు, అణచివేతలు, అవార్డులు, రివార్డులు ఎన్నో ఎన్నెన్నో తన జీవన గమన అలలపై డోలలాడిస్తూ జీవితాన్ని అతలాకుతలం చేసాయి. జీవన సంద్రంలోని భావోద్వేగపు ఆటుపోటుల అలజడుల తాకిడిని అలవోకగా దాటుతూ వెళ్ళినా చివరికి పాకుడురాళ్ళ తాకిడి తట్టుకోలేక దరిచేరనని నావలా నడి సముద్రంలో చుక్కాని లేని నావలా నిలిచిపోయింది.

మానవ జీవితంలో ఎన్నో అవకాశాలు వస్తూ పోతుం టాయి అలాంటి వాటినెలా సద్వినియోగం చేసుకోవాలో తెలుసుకోవడంలోనే వారి విజయం ఆధారపడివుందన్న సత్యం ఈ నవలలో అడుగడుగునా కన్పిస్తుంది. రంగు రంగుల చిత్ర ప్రపంచం వెనుక రసహీనమై వెలవెలబోతున్న నిజ జీవితంలోని సంఘర్షణాంశాలు ఇందులో ప్రస్ఫుటం చేయబడ్డాయి. మాధవరావు మాటల్లోనే మంజరి వ్యక్తిత్వం చక్కగా చెప్పబడింది. అట్టడుగు నుండి ఆకాశానికెదిగిన మనుషులు తమ గతాన్ని మర్చిపోవడమో అసహ్యించు కోవడమో చేసినట్టు మంజరి చేయలేదు. గతంలో తనకు పరిచయమున్న వారందరిని తన ఆత్మీయ బంధువులుగా ఆదరించి తగిన సహాయ సహాకారాలందించింది. గత జీవితం లోని విషాద గాధలను మధురస్మృతులగానే భావించి భవిష్యత్తులో ఎత్తుకుపైయెత్తు ఎదుగడంలో అడ్డు వచ్చే పాకుడురాళ్ళపై జాగ్రత్తగా అడుగులేసుకుంటూ వర్త మానంలో సంపూర్ణంగా జీవించింది.

మంజరి ఆత్మీయులనెంత ఆదరించిందో శత్రువులనంత ద్వేషించింది. తన జీవన గమనానికి అడ్డు తగిలిన వైరి వర్గాన్ని చీల్చి చెండాడింది. ఎన్నో సుత్తె పోటులతో బండ రాయి శిల్పంగా రూపొద్దినట్టు జీవితంలో అడుగడుగునా ఆమెకు తగిలన దెబ్బలని తనివితీరా అనుభవించి, ఆస్వా దించి తన జీవితాన్ని తీర్చిదిద్దుకుంది. ఆమె అనుభవించిన నరకయాతనల నుండే చక్కని పూలపాన్పులు సృష్టించు కోగలిగింది. సమాజం తననెంత ద్వేషించినా సమాజం లోని శక్తులు తననెంత వాడుకొని వదిలేసినా తను మాత్రం మానవసంబంధాలను గౌరవించి చివరివరకూ కొన సాగింది. అప్పుడప్పుడూ ఆప్తులకోసం తన ఆత్మ దశదిశలా అన్వేషిస్తున్నదని ఘోషించింది. భువినుండి దివికి తానెంతో ఎత్తుకు ఎదిగింది, అందుకే కాబోలు భూమ్మీద కాళ్ళు నిల్వలేక పోతున్నానని, ఒక్కొ తరంగం మహెూద్ధృతంగా వచ్చి కాళ్ళకింద మట్టిని తవ్వి లాగి పారేస్తున్నాయని వాపోయింది. తనువులోని అనువణువులో అసంతృప్తి జ్వాలలు రగిలి, రక్తాన్ని మరిగించి దు:ఖం ఉప్పొంగి కన్నీళ్ళు జలపాతాలుగా దూకెట్టూ ఏడ్చినా ఓదార్చేవారొక్కరు కూడా లేని ఒంటరినైపోయానని దు:ఖించింది. చిన్న అవకాశం దొరికితే తన ముఖబింబాన్ని వెండితెరపై చూడ గల్గితే చాలనే కోర్కెల బీజాలనుండి వెండి తెరనే శాసించే వటవృక్షంలా ఎదిగినా అందులో ఏదో అసంతృప్తి ఎప్పుడూ వెంటాడుతూనే వుండేది. చివరికి ఈ మహాసంక్షోభం నుంచి రవంత బయట పడేందుకు, కాస్త చల్లని వాతావరణంలో ప్రశాంతంగా బతికేందుకొక్క అవకాశముంటే చాలని తహా తహా లాడింది. కాని అప్పటికే తాను పీకల్లోతు ఊబిలో కూరుకుపోయేలా చేసుకున్న స్వయంకృతాపరాదానికెంతో పశ్చాత్తాపడింది.

జీవన గమనంలో మంజరి వందలు కాదు వేల మైళ్ళు ప్రయాణించింది. ఏదో మారుమూల గ్రామంలో

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

పుట్టిన మంగమ్మ పేరు మంజరిగా రూపాంతరం చెంది దశదిశలా వ్యాపించింది. నిజ జీవితంలో వయస్సుపెరిగే కొద్ది సినీ జీవితంలో వయస్సు తగ్గి పోతుందా అనే విధంగా మారిపోయింది. ఎంత ఎత్తుకెదిగినా ఇదంతా దిక్కుమాలిన గోడులాకన్పించింది. ఈ దిక్కుమాలిన గొడవలకన్న ఏ మారుమూల కుగ్రామంలోనో ఊరి బయట పూరిపాకలో గోనెపట్టా పరచుకొని ఆదమరచి నిద్రపోవాలనిపించింది.

ఒకప్పుడు తనను తానెంతో ప్రేమించుకున్న మంజరి జీవితపుస్తకంలోని పేజీలను వెనక్కి తిరగేసి చూసుకుంటే తన జీవితమే తనకెంతో అసహ్యమేసింది, తనపై తనకే ద్వేషం కలిగింది. ఎప్పుడో జీవితంలో పొందిన అవమానాలు, తిన్న దెబ్బలు, ఈసడింపులు, రూపాయి కాసు చేతిలో పెట్టి తన్ననుభవించిన మనుషుల జ్ఞాపకాల గర్తులు తనకెన్నో రాత్రులు కంటి మీద కనుకు లేకుండా చేసాయి. ఈ సినిమా లైనులోనూ అంతే ఓ అవకాశం కోసం ఎన్ని బాధలు, ఎన్ని ఆశ్రయింపులు, ఎంత మందికి ఎన్నెన్ని ఆశలు చూపిచండం తలుచుకుంటే బ్రతుకుంటేనే పెద్ద మోసమని తెలిసింది. తనకు సౌందర్యం దేవుడిచ్చిన గొప్ప వరం కాని ఆ వరాన్ని క్షుద్ర ప్రయోజనాలకోసం ఉపయోగించాల్సి రావడం తన దురదృష్టంగా భావించింది. నాగజెముడు లాంటి తన జీవితాన్ని మంజరి ఆశల పల్లకిలో ఊగుతూ ఇంత వరకు లాక్కొచ్చింది.

మంజరి సంపాదనలోనూ ఎంతో ముందుకెళ్ళింది, తన సంపాదన లక్షల్లో నుండి కోట్లవైపుకు పడగలెత్తింది. ఎందరో అనాధలకు, విద్యార్థులకు ఆసరాగా నిలిచింది. రాజకీయ పార్టీలకు, పత్రికలకు చందాలు ముట్టచెప్పుకుంది. ఇవన్నీ చూసి ఒక్కొక్కసారి సంపాదించడం మానెద్దామనిపించింది కాని అది తన చేతిలో లేదు. జీవిత తొలిదశలో డబ్బులేక తపించిపోయిన మంజరి మలిదశలో ప్రేమించే మానవత్వమున్న మనుషులులేక తపించింది. తాను లంకలాంటి లోకంలో రాక్షసుల మధ్య క్షణమొక యుగంగా గడిపింది. వారు వేసిన ఉచ్చులో చిక్కి ఉక్కిరిబిక్కిరై అసంతృప్త జీవిత నిట్టూర్పుల సెగలకు తాలలేక అర్ధాయుష్షుతో అర్థాంతరంగా తనవు చాలించింది.

వర్తమాన చలచిత్ర రంగంలో యిలాంటి జీవితాలు జీవించిన తారలు కన్పిస్తారు. సిల్క్‌స్మిత, దివ్యభారతి, ఆర్తి అగర్‌వాల్ లాంటి తారలు సినిమా జీవితాలకు అలవాటుపడి అవకాశాలు దొరక్క దిక్కుతోచని స్థితిలో అర్థాంతరంగా అశువులు బాస్తున్నారు. పురుషులు ఇందుకు అతీతులుకారు. ఉదయ్ కిరణ్ లాంటి వారు కూడా ఇలాంటి కోవకు చెందినవారే. అందువలన యువతీ యువకులు సినిమాల మీద పిచ్చితో స్వంత నిర్ణయాలు తీసుకొని బంగారం లాంటి జీవితాలను పాడుచేసుకోవద్దని ఈ నవల సందేశమిస్తుంది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. పాకుడురాళ్ళు నవల – రావూరి భరద్వాజ
2. నా గొడవ – రావూరి భరద్వాజ
3. రావూరి భరద్వాజ జీవితం, సాహిత్యం – బొగ్గుల శ్రీనివాస్

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# బడుగుజీవుల బ్రతుకుపోరు – సామాజిక స్పృహ

- డా॥. ఓ. సత్యలత
తెలుగు శాఖాధ్యక్షులు, హిందూ కళాశాల,
మచిలీపట్నం, కృష్ణాజిల్లా.

**"కొందరు గొప్పవారుగా జన్మిస్తారు**
**అదృష్టవంతులు!**
**ఇంకొందరికి గొప్పతనం ఆపాధించబడుతుంది**
**వీరూ అదృష్టవంతులే!**
**మరికొందరు గొప్పతనాన్ని సాధిస్తారు"**

అటువంటి వారిలో కళాప్రపూర్ణ భరద్వాజ ఒకరు. భరద్వాజగారు పుట్టక ముందే ఆయన తండ్రి రావూరి కోటయ్య గారు 20 ఎకరాల భూమిని సంఘసేవ, భజనలు, నాటకాలు అంటూ 17 ఎకరాలు, ఇతరత్రా కారణాల వల్ల 3 ఎకరాలు పోగొట్టుకున్నారు. కుటుంబం గడవని స్థితిలో 7వ తరగతిలోనే చదువు ముగించారు భరద్వాజ. ఇలా బాల్యం నుండి పిడికెడు మెతుకుల కోసం అలమటించి పోరాడి సాధించి ముందుకు సాగడం అలవాటుగా మారింది. తన జీవితంలో పొగాకు బ్యార్నిలో బొగ్గు వేసే కూలీగా, కలప అడితీలో కూలీగా, కమ్మరి కొలిమిలో సమ్మెట వేసే కూలీగా, వ్యవసాయ కూలీగా, పశువుల కాపరిగా, రంపంలాగే కూలీగా, మిల్లులో అయిల్‌మెన్‌గా, పేపర్ బోయ్‌గా, జర్నలిస్టుగా, రెండవ ప్రపంచయుద్ధంలో టెక్నిషియన్‌గా, అనువాదకుడిగా, రేడియో ప్రవక్తగా విజ్ఞాన శాస్త్ర రచయితగా, తత్వవేత్తగా, వినూత్న సాహితీ ప్రక్రియ నిర్మాతగా, కవిగా, కథకుడిగా, నవలాకారునిగా, నాటక రచయితగా, బాలసాహితీ వేత్తగా, నిరాడంబరజీవిగా, స్నేహశీలిగా, మహామనిషిగా, మానవతామూర్తిగా ఇలా తన జీవితంలో బ్రతుకు పోరాటంలో అనేక వైవిధ్యమైన పాత్రలను పోషించాడు.

"జీవితం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నా గురువులు ఇద్దరు. "1. పేదరికం, 2. కులమత భేదం. ఒకటి నాకు సహనం నేర్పితే, రెండవది నాలో ఎదిరించే శక్తిని నేర్పింది" అన్నారు **– జాషువా.**

అలాగే "దారిద్ర్యం చాలా మందికి పిరికిపాలు పోస్తుంది, నాకు పోసింది. కానీ ఆ పాలు త్రాగి నేను రాటు దేరాను" అన్నారు **భరద్వాజ.**

భరద్వాజ కలం కార్మికుడు. ఎన్నో కష్టాలు అనుభవించి పొట్ట నింపుకోవడం కోసం కలం పట్టి రచయితగా మారాడు. ఆయన రచయితగా అడుగులు వేస్తున్న దశలో కవులతో, రచయితలతో తెలుగు సాహితీ ఉద్యానవనం సంప్రదాయ ప్రగతిశీల రీతులతో గుభాళిస్తున్నది. అలాంటి వాతావరణంలో ఒక సామాన్య రచయిత భరద్వాజ, యుక్త వయస్సులో చలంగారిని అనుసరించి ఆయన శైలిలోనే రచనలు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఆయన మీద చలం ముద్రపడింది. గడచిన 35 సంవత్సరాలుగా పుంఖానుపుంఖాలుగా వెలువడిన కథలలోను, నవలలోనూ, క్రమానుగతమైన ఒక పరిణామం మనకు గోచరిస్తుంది. ఆయన లేఖిని నుండి శృంగార కథలు వెలువడ్డాయి. అయితే ఆ సెక్సు సంబంధాలన నిర్ణయించే సాంఘిక పరిస్థితులు, సామాజిక వాతావరణము ఆ రచనల్లో ఉన్నాయి. ఒక సంఘటనను కళాత్మకంగా చిత్రించడం ముఖ్యమే. అంత కన్నా ఆ సంఘటన వెనుక గల సాంఘీక, ఆర్థిక, రాజకీయ కారణాలను చిత్రించడం కష్టం. అయినా ఈ పనిని నిర్భయంగా నిస్సంకోచంగా చేశారు. అందువల్ల ఆయన సృష్టించిన పాత్రల పట్ల సానుభూతి కలుగుతుందే తప్ప ఈర్ష్య, ద్వేషం, అసహ్యం కలుగవు. ఆ పాత్రలు కూలీలయినా, మాలీలయినా, భ్రష్టులయినా, నికృష్టులయినా, పతితలయినా, పవిత్రులయినా, జారులైనా, చోరులైనా మన హృదయాల్ని కరుణ రస ప్లావితం చేస్తాయి.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

**ఆయన రచనలు :**

1950లో 'రాగిణి' కథాసంపుటి వెలువడింది. 'అల వాటైన ప్రాణం' అనే శృంగార కథను రాసి జైలు జీవితం అనుభవించారు. తర్వాత తన దృష్టి శాస్త్ర విషయాలవైపు మళ్ళించి 'చిత్రగహం' అనే నవల రాశారు. 'జమీను రైతు' అనే పత్రికలో పనిచేశారు. రావూరి జయదేవ్ అనే పేరుతో డిటెక్టివ్ నవలలు రాశారు. అనేక సాహితీ సమావేశాలు నిర్వహించారు. 'దైవ రాజకీయాలు' అనే కథకు స్వర్ణకంకణం బహుమతిగా వచ్చింది. అలాగే కాదంబరి, నాలోని నీవు, అంతరంగిణి, ఐతరేయ, ఒక ఏకాంతం ఇలా అనేక పేర్లతో రాశారు.

సినిమా పత్రికలలో పని చేసిన అనుభవంతో 'పాలపుంత' అనే కథను రాశారు. మల్లంపల్లి సోమశేఖర శర్మగారి సలహాతో 'మాయాజలతారు' నవలగా మార్చారు. దీన్ని శీల వీర్రాజు చదివి 'పాకుడురాళ్ళు' అని పేరు పెట్టారు. భరద్వాజ మద్రాసులో ఉన్న రోజుల్లో సినీ నిర్మాతలు, దర్శకులు, నటీనటులు వారి వారి సమస్యలు అధ్యయనం చేసి సినీరంగంలోని కల్మషాన్ని ఈ రచన ద్వారా తూర్పార బట్టారు. ఇది 50ఏళ్ళ క్రిందట రాశారు. దీనికి 2012లో జ్ఞానపీఠ్ అవార్డు వచ్చింది.

భరద్వాజ జీవితం వడ్డించిన విస్తరి కాదు. బ్రతుకులోని కష్టాలను, కన్నీళ్ళను కడముట్టా చూచినవాడు. చారెడు గంజికోసం, బారెడు గుడ్డ కోసం కలవరించారు. ఆకలి, అవమానం, అవిద్య, దారిద్ర్యం, నిరుద్యోగం, నిరాదరణ అడుగడుగునా అనుభవించాడు. జీవితంలో నిలదొక్కు కోవడం కోసం రకరకాల వృత్తులు చేశాడు. ఆ వృత్తులలోని సాధకబాధకాలను, కష్టనష్టాలను, అమానుషత్వాన్ని గుండెలోతుల్లో దాచుకున్నాడు. అయితే ఈయన అను భవాలు జ్ఞాపకాలు వృధా కాలేదు. భరద్వాజ వాటిని వృధాగా పోనియ్యలేదు. వాటి సారాన్ని వొడిసి పిండి మహారచయితగా ఎదిగాడు. సుమారు 500లకు పైగా కథలను రాశాడు.

"భరద్వాజ రచనల్లో సహజత్వం, లోతు వైవిధ్యం వెల్లి విరియడానికి ఆయన పాత్రలు జీవ చైతన్యంతో స్పందించ డానికి విస్తృతమైన ఆయన జీవితానుభవాలే ముఖ్య కారణాలు".

**ప్రఖ్యాత రచయిత క్వాజా అహమ్మద్ అబ్బాస్**

ఈనాడు దిన పత్రికను ప్రజా జీవనానికి మరింత సన్నిహితంగా తీసుకురావాలనే ప్రయత్నంతో సహస్ర ముఖాలుగా విప్పారిన సామాజిక జీవనాన్ని ఈనాడు ప్రతిబింబించాలన్న ఆశయంతో సువిశాలమయిన మానవ జీవితంలోని ఏ కొద్ది భాగాలనో స్పృశించినంత మాత్రాన సరిపోదు. బతుకు కోసం మానవుడు పడే పాట్లు అసంఖ్యా కంగా ఉన్నాయి. కానీ వీటిలో ఏకొన్నింటినో మనం వృత్తులుగా గుర్తిస్తున్నాము. అయితే మిగిలిన వాటి మాటేమిటి? అవి వృత్తులు కావా? కానీ ఇంకా కొన్ని వృత్తుల్ని అంటిపెట్టుకుని బ్రతుకుల్ని వెళ్ళమారుస్తున్న వారి సంగతేమిటి? వారి జీవితాల వెనుకగల పరిస్థితులు ఎటు వంటివి? పతితులు, భ్రష్టులు బాధా సర్పదష్టులారా అని శ్రీశ్రీ అనట్లు అట్టడుగు వర్గాల దయనీయ యదార్ధ జీవిత గాథలను అక్షరబద్ధం చేసి పాఠకులకు అందజేయాలని ఈ గాథాపరంపరకు **జీవన సమరం** అనే పేరుతో 1978 మే 10 నుండి 1979 ఆగష్టు 23 వరకు ఈనాడులో ధారావాహికంగా వెలువడింది. ఇటువంటి ఉదాత్తమయిన శీర్షికను నిర్వహించడానికి చాలా దక్షత కావాలి. భరద్వాజ వివిధ వృత్తుల వారిని కలుసుకుని వారి బాధల్ని, గాథల్ని ఓర్పుగా విన్నారు. వారు చెప్పని వాటిని కూడా వాటి పూర్వా పరాలను వారి నుండి నేర్పుగా రాబట్టారు. ఆయా వృత్తులకు సంబంధించిన సాంకేతిక సమాచారాన్ని సేకరించారు. వారి అంతరంగాన్ని వారి ఆలోచనల్ని అనుభూతుల్ని రికార్డు చేశారు. వారు అనుభవిస్తున్న ప్రస్తుత స్థితికి వెనుక గల సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాలు వివేచించారు. ఈ పనులన్నీ ఉద్యోగ ధర్మంగా కాకుండా అంతకు మించిన మానవతా దృక్పథంతో చేశారు. ఆయా వృత్తిదారుల పట్ల సానుభూతి, ఆత్మీయత ఉన్నవారు తప్ప ఈ శీర్షికను నడపలేరు. (మచ్చుకి 3 వృత్తుల వారిని గూర్చి తెలియ జేస్తాను)

## కాయకల్ప చికిత్స :

చిన్నతనంలో రజాక్ వేళకింత తిని బలాదూర్‌గా తిరిగేవాడు. ఒకసారి గాంధీ పార్కు దగ్గర గారడీ ఆట కంటపడింది. వాడు కొయ్య బొమ్మల్ని ఆడించడం, ముక్కులో నుండి రూపాయల్ని పిండడం, గ్లాసులో నీళ్ళు మరో గ్లాసులోకి మార్చడం, నీళ్ళ రంగు మార్చడం చేసేవాడు. ఇవన్నీ చూచి రజాక్ చిత్తయిపోయి గారడీ వాడి వెంట పడ్డాడు. నాలుగేళ్ళు అతని వెంట ఉంటూ చాకరీ అంతా చేసినా ఏవో చిన్న ట్రిక్కులు చెప్పాడు తప్ప ముఖ్యమైనవి చెప్పలేదు. ఆ గారడీలో చిన్న పొరపాటు జరిగితే ఆ సాయిబు చావ బాదాడు. దాంతో రజాక్ ఊరి ముఖం పట్టాడు. అప్పుడే తిత్తి ఊదుతూ పాత్ర సామాను ముందు పెట్టుకుని కూర్చున్న ముసలాయన దగ్గర పని నేర్చుకున్నాడు. పనిలో మెలుకువలు తెలుసుకున్నాడు. ప్రతీ పని ఓ ఆర్టు. ఆ పనిలో కష్టమెంతో చెపుతాడు రజాక్. రోజుకెంత సంపాదిస్తావు అంటే పనికి కావలసిన సరంజామా ఖరీదు పోను ఎదో కొంత మిగులుతుంది. పస్తులుండటం లేదు. కానీ కడుపు నిండా తినలేము అన్నాడు రజాక్. రెక్కాడితే గానీ డొక్కాడని బ్రతుకులు బాబు మావి అన్నాడు. (ఇది రజాక్ జీవిత గాథ)

## గడయెక్కినా, గడప గడపెక్కినా :

రాములమ్మ తండ్రి దాసప్ప. ఈనాడు పేరు పొందిన సర్కాసుల్లో ఫీట్సు కంటే కూడ ఆ రోజుల్లో దాసప్ప ఆ ఫీట్సును అవలీలగా చేసేవాడు. ఆ తర్వాత రాములమ్మ గెడ మీద కెక్కేది. గెడమీద ఆడేది. (చేతుల్తో గడను పట్టుకుని తాడు మీద నడవడం చేసేది). మా వాళ్ళందరూ మారు మూల పల్లెల్లో కెళ్ళి ఆటాడి వస్తుంటారు. ఆ రోజుల్లో ధాన్య గింజలు ఇచ్చేవారు. అయినా అది మా కులవృత్తి. ఏం ఆడినా ఏం పాడిన అంతంత మాత్రమే. తిండి విషయంలో గుండె నిబ్బరం ఎప్పుడు లేదు అన్నది రాములమ్మ. అప్పుడు ధర్మ ప్రభువులున్నారు. ఇప్పుడేముంది బిడ్డా? అంది. తన మనవల్ని దగ్గరకి తీసుకుని వీళ్ళకి చుదువుకోవాలని ఉన్నది. కానీ ఎక్కడా స్థిరంగా ఉండక పోవడం చేత బళ్ళోకి పంపే అవకాశం లేదు అన్నది రాములమ్మ. ఏలిన వారు ఈ సంచార జాతుల సంక్షేమం కోసం ఏవేవో చేస్తున్నామంటున్నారు.ఆ చేసేదేమిటో వీరి దాకా వస్తే కాస్త వెసులుబాటు దొరకవచ్చుగానీ ప్రభువులు చేయాలి గదా!

**(ఇది రాములమ్మ జీవితగాథ)**

<u>కేశోపనిషత్తు :</u> ఊరికి దూరంగా మురికి గూడెంలో కూలి పోవడానికి సిద్ధంగా ఉన్న గుడిసె పక్కనే తల తిరిగి పోయేంత దుర్వాసనలు చిమ్ముతున్న మురుక్కాలవ, నడవ డానికి క్కూడా వీలులేనంతటి సన్నని ఇరుకు సందుల మధ్య రాములు బ్రతుకుతున్నాడు. వారానికో పదిరోజులకో వోసారి బజారుకెళ్ళి కావలసిన వెంట్రుకల్ని కొని తెచ్చుకుంటాడు. వాటన్నింటిని చిక్కుతీస్తాడు. తెల్లవెంట్రుకలు, పొట్టి వెంట్రుకలు లేకుండా చూస్తాడు. తరువాత వాటి మొదళ్ళు పట్టుదారంతో బిగగట్టి, కుంకుడు నీళ్ళతో కడిగి ఆరబెట్టి నిగనిగలాడేలా చేస్తాడు. సన్న ఇనుపతీగతో బిగించి, దానిపై పట్టుదారం చుట్టి సవరం నెత్తి మీద నల్ల లక్కతో టోపిలాగ అమర్చుతాడు. సవరం పూర్తయినట్టు లెక్క. ఇంకా కొన్ని రకాల సవరాలుంటాయి. సవరం ధరలు ఒకలా ఉండ వంటూ, ఒక్కో తల్లి సగానికి సగం ధరకు అమ్మమంటుంది. అంతకు తప్పకొననంటుంది. ఏదోకాడికి అమ్ముకుంటే తప్ప నా పొట్టగడవద్దు ఇంకేం చావమంటారు? అన్నాడు రాములు గుడ్లనీరు కక్కుకుంటూ. వెంట్రుకలు ఎక్కువ ధరకు కొనాలి. ఒక్కోసారి తక్కువ ధరకు అమ్మాలి. నా భార్యా పిల్లలు సహాయం చేస్తారని, మా తాత తండ్రుల నుండి ఇదే బతుకు బాబయ్య పెద్ద పెద్దోళ్ళు షాపులు పెట్టారు. మా పొట్ట కూడు పడిపోయింది. ఒక్కో సవరం 4, 5 రూపాయల నుండి 10, 12 రూపాయల దాకా కూలి తీసుకుంటాను. ఒళ్ళు దాచుకోకుండా పనిచేస్తాను గానీ ఎంత విరగబడ్డా మాపటి పూటకి బువ్వ కరువేబాబు అన్నాడు రాములు. అలాగని ఈ పని విడచి పెట్టలేను. చదువు, సంధ్యలు లేవుమాకు! ఈ పని తప్ప మరే వృత్తిరాదు. ఉదయం లేచింది మొదలు వెంట్రుకలు కోసం గొంది గొందీ సందు సందు తిరుగుతా

4-5 గంటలు అన్నాడు. అతని భార్యబిడ్డలు బిక్కచిక్కి కళ్ళలో ప్రాణాలు పెట్టుకొని ఊగిసలాడుతున్నారు.

**(ఇదీ రాములు బ్రతుకు చిత్రం)**

భరద్వాజగారు ఇలాంటి దీనుల గాథలను ఎన్నింటినో 'జీవన సమరం' అనే పేరుతో ప్రచురించారు. ఈ ఫీచర్ అధిక ప్రజాదరణ పొందింది. దీనిని వారానికొకసారి ప్రచురించగా పాఠకులు రోజు విడిచి రోజు ప్రచురించమన్నవారు, ప్రతీరోజు ప్రచురించమన్నవారు చాలా మంది ఉన్నారు. తెలుగుదేశం నాలుగు చెరగుల నుండి మాత్రమే గాక ఆంధ్రేతర ప్రాంతాలలో ఉన్న ఈనాడు ప్రేక్షకుల నుండి కూడా ఈ శీర్షిక నిర్వాహకుడిని అభినందిస్తూ వందలాది లేఖలు ఈనాడు కార్యాలయానికి వచ్చాయి. ఒక్కో 'జీవిత చరిత్ర' ప్రచురింపబడినప్పుడల్లా ఆ దురదృష్టవంతులకు ధన సహాయం అందజేసిన పాఠకులు ఉన్నారు. ఉద్యోగ సదపాయాలు కలుగజేసిన వారు ఉన్నారు. హైదరాబాదు నగర పరిసర ప్రాంతాల నుండి, దూరప్రాంతాల నుండి కూడా ఎందరో ఉదారులు, దయాపరులు ఈనాడు కార్యాలయానికి కొచ్చి వారి వివరాలు తెలుసుకుని వారి బ్రతుకుల్ని మెరుగు పరచిన సందర్భాలున్నాయి. ఈ గౌరవం అంతా భరద్వాజ గారికి లభించింది. ఒక విషయాన్ని ఎన్నుకోవడం, ఆ విషయాన్ని రసగుళికగా రూపొందించడంలోను భరద్వాజ అవలంభించిన విధానం విశిష్టమయినది. రచన ప్రారంభం పఠితలో ఉత్సుకతను రేకెత్తించకపోతే పాఠకుడు పక్క శీర్షికకు వెళతాడు. అతి అనిపించకుండా చూసుకోవాలి. చదవడం పూర్తయ్యాక ఒక గాఢమైన నిట్టూర్పురావాలి. పఠిత కన్నుల్లో కన్నీటి బిందువులు కదలాలి. అమానుషమైన ఈ వ్యవస్థ మీద జుగుప్స కలగాలి. దీన్ని మార్చాలన్న ఆలోచన కలగాలి, ఇందులో ఏ ఒక్కటి లోపించినా ఆ రచనకు తెరపడినట్లే.

జీవన సమరం శీర్షికన వెలువడిన ఈ రచనలన్నీ మన సామాజిక జీవనానికి ప్రతిబింబాలు. ఇందులో వ్యక్తులు మనకు బాగా తెలిసినవారు. మనతో పాటు మన మధ్యనే జీవిస్తున్నారు. వీరిని గురించి మనం ఏనాడు ఆలోచించం! వీరిని చూచి స్పందించం. ఈ అధోజగత్సహోదరుల బతుకుల్లోకి తొంగిచూడాలంటేనే మనకు భయం. భరద్వాజగారు వారి బ్రతుకుల్లోకి తొంగి చూచి స్పందించి అందర్నీ స్పందింపచేశారు. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్య చరిత్రకు అచ్చంగా అట్టడుగు వర్గాల యదార్థ చరిత్రలతో నిండిన మొట్టమొదటి గ్రంథాన్ని చేకూర్చిన ఘనత భరద్వాజగారిది. అందుకే ఆయనకు 1991లో ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. భరద్వాజ గారు భవిష్యత్ తరాల రచయితలకు మార్గదర్శకులు. తెలుగు కథా సాహిత్యానికి రావూరిగారు చిరస్మరణీయులు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. జీవన సమరం - (వ్యథార్థ జీవుల యదార్థగాథలు) - డా॥ రావూరి భరద్వాజ
2. నాలోని నీవు - డా॥ రావూరి భరద్వాజ

# రావూరి భరద్వాజ 'ధన్యవాదాలు' – సామాజికాంశాల పరిశీలన

- డా॥ గోనిపాటి ధర్మారావు
సహాయ ప్రాంతీయ సంచాలకులు,
ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం,
విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం.

డా॥ రావూరి భరద్వాజ రాసిన పాకుడు రాళ్ళు వంటి ప్రముఖ రచనలు, అవార్డు పొందిన రచనలనే ఎక్కువమంది చదివి పరిశీలిస్తుంటారు. అయితే ఆయన చేతి నుండి వచ్చిన ఇంకా ఎన్నో రచనలు అతనిలోని భావుకతని, సమాజం పట్ల నిబద్ధతని, ప్రపంచానికి ఏదో చెప్పాలన్న తన ఆరాటాన్ని చూపిస్తాయి. అలాంటి వాటిల్లో 'కవితానికలు'గా ఆయన చెప్పుకొన్న 'ధన్యవాదాలు' ఒకటి. ఇందులోని రచనలన్నీ కవితాత్మకంగా ఉన్న వచన రచనలు. కవి తనలో తాను మాట్లాడుకుంటున్నట్లుగానో, తన గురించి తాను చెప్పు తున్నట్లు గానో మొత్తానికి ఉత్తమ పురుషలో సాగే రచనలి వన్నీ. రూపం రీత్యా ఇవన్నీ వచన రచనలే. అభివ్యక్తిని తీసుకుంటే వచన కవిత్వంలో ఒక ఉత్తమ స్థాయి కనిపి స్తుంది. ఈ పుస్తకంలో 116 కవితానికలు ఉన్నాయి. ఈ పుస్తకాన్ని ఇనగంటి నరసింహారావుకి అంకితం చేస్తూ ఆయన రాసిన 'ధన్యవాదాలు' తప్ప ఏ ఇతర పరిచయాలు లేవు ఈ రచనలో. ఈ కృతజ్ఞతలే కవితాత్మకంగా ఉండి తన గురించి, తన జీవితం గురించి ఆయన చెప్పుకున్న చిన్న ఆత్మ కథలా ఉంటుంది. ఈ 116 కవితానికల్లో చాలా చోట్ల సమాజాన్ని అతి సూక్ష్మంగా పరిశీలించిన రావూరి నైశిత్యం కన్పిస్తుంది. వివిధ అంశాల పట్ల తన అభి ప్రాయాన్ని, ఆవేదనని భావుకతతో అక్షరాలలో ఇమిడ్చి చేసిన యజ్ఞం ఇది.

మొదటి కవితానికలో ఒక చీమతో సంభాషణని ప్రస్తా విస్తాడు. ఆకలితో ఉన్న ఒక చీమకి రెండు గింజలు వేస్తే ఆ గింజల్ని తినకుండా వాటిని మొలకెత్తడానికి వీలుగా చీమ వదిలేయడం ఈ సంభాషణ అర్థం. చీమ అన్నట్లుగా చివరగా రాసిన వాక్యం సమాజంలో మనిషి బతకాల్సిన విధానాన్ని సూచిస్తుంది. "నేను బ్రతకడం కోసం వంద జీవులు బ్రతికే అవకాశాన్ని తుడిచేయడం నాకు ఇష్టం లేదు" – ఈ వాక్యం ఇప్పటి సమాజ పరిస్థితులకి తగినట్లుగా ఉంది. వేలమంది అనుభవించాల్సిన వనరులు కేవలం ఒకే వ్యక్తి లేదా ఒకే ఒక చిన్న గుంపు మాత్రమే అనుభవిస్తున్న రోజులివి. బలహీనుణ్ణి దోపిడీ చేసి బలవంతుడు రాజ్యమేలు తున్న ఈ సమాజంలో మనిషి ఎలా ఉండాలో చీమ అభి ప్రాయం ద్వారా సున్నితంగా హెచ్చరిస్తున్నాడు కవి. తాను నష్టపోయినా పదిమందికి మేలు కలిగే పని చేయాలన్న ఉ త్తమ సందేశాన్ని మానవాళికి అందిస్తున్నాడు కవి.

మరోచోట 'మనిషి' తన లక్ష్యాన్ని చేరుకోవడానికి చెయ్యాల్సిన కృషిని గురించి చెప్తూ "మన యత్నాలను మాను కొంటే ఎప్పటికీ ఏ చిన్న అంశాన్ని గురించి ఏమీ తెలుసు కోలేం" అంటాడు. లక్ష్యాన్ని చేరుకోవాలనుకొనే అసామా న్యులు స్వయం కృషితోనూ, సామాన్య మానవులు ఇతర జ్ఞాన సంపన్నుల సాయంతోనూ చేరుకోవచ్చని అయితే అది అంత సులభం కాదని, కష్టం అని తెలిసినా ప్రయత్నం మానుకోకుండా ఉంటే క్లిష్టమైన లక్ష్యాలను కూడా చేరుకోవచ్చని ఉద్బోధిస్తున్నాడు.

ప్రస్తుత సమాజంలో బాబాలకు, గురువులకు, గిరాకీ ఎక్కువ, ప్రపంచం ముందుకు వెలుతున్న కొద్దీ, సౌకర్యాలు పెరిగి విలాస జీవితాలు ఎక్కువవుతున్న కొద్దీ భగవంతుని పట్ల భక్తో, భయమో మొత్తానికి స్వామీజీల శిష్యరికం చేయడం ఈ మధ్యకాలంలో ఎక్కువ అవుతుంది. ఈ అంశాన్ని ఎంతో హేతుబద్ధంగా చమత్కారంతో విమర్శిస్తు న్నాడు ఒకచోట.

ధ్యానిస్తే కోరికలు తీరతాయి, సంకల్పాలు నెరవేరతాయి అని అన్ని బోధలూ చెప్తాయి. గురువులు, బాబాలు, స్వాములు అందరూ కోరికలు తీరే మార్గాల గురించి మాత్రమే చెప్తారు. అయితే వాంఛా రాహిత్య స్థితిని చేరుకొనే

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

మార్గం గురించి ఎందుకు చెప్పరు? అని ప్రశ్నిస్తున్నాడు కవి. మోక్షమంటేనే వాంఛా రాహిత్య స్థితి అని మన గ్రంథాలు చెప్తుంటాయి. అటువంటి కోరికలే కలగని, లేని స్థితిని ఎలా పొందాలో చెప్పాలి గాని కోరికలు తీరడానికి ఎలా పూజలు చేయాలో చెప్తే ఆ బోధనలు ఎంతవరకు ఒప్పు అని సునిశితంగా విమర్శిస్తున్నాడు కవి.

**ఇంకో చోట..**

"నా చిన్నతనంలో నేను చాలా వాటికి భయపడ్డాను. ఆకలంటే భయం. దరిద్రమంటే భయం. నిరుద్యోగమంటే భయం. అనారోగ్యమంటే భయం. అవమానమంటే భయం. అజ్ఞానమంటే భయం. ఇంకా చాలా చాలా వాటిని చూసి భయపడ్డాను.... ఇవంటే ఇప్పుడు నాకేమాత్రం భయం లేదు! ప్రత్యక్షంగాను, పరోక్షంగాను వీటన్నింటికీ కారణభూతు డయిన మానవుడంటే భయపడుతున్నాను" అని అంటాడు. ఆకలి, పేదరికం, నిరుద్యోగం, అనారోగ్యం, అవమానం, అజ్ఞానం ఇవన్నీ సమాజంలో అనేక సంవత్సరాలుగా ఎవరు నిర్మూలించలేకపోతున్న సమస్యలు. అయితే సమస్యలు ఎందుకోసం అలా ఉన్నాయో తెలిసిన తరువాత ఆయా సమస్యల్ని చూస్తే కాదు ఆ సమస్యలు పెరగడానికి సజీవంగా ఉండడానికి కారణమైన సమాజం పట్ల ఆ సమాజంలోని మనిషి పట్ల భయంగా ఉంది అంటున్నాడు. సమాజంలోని మనిషిని, మానవ అభివృద్ధిని నిరోధిస్తూ, పట్టి పీడిస్తున్న అనేక రుగ్మతలకి మూల కారణం మనిషి, అతనిలోని వక్ర బుద్దేనని కవి అభిప్రాయం.

వ్యవసాయ రంగంలో వర్షాభావ పరిస్థితులపై ఒక రచన కన్పిస్తుంది. " వాన పంటలు పండాల్సిన పొలాలన్నీ ఎండి పోతున్నాయి. ముత్యాల్లాంటి చినుకులకు బదులుగా, నిప్పుల పూలు పూస్తున్నాయి. మంటల పంటలు పండుతున్నాయి" – ఈ ఖండికలో వ్యవసాయం పూర్తిగా నష్టాలమయం అయిపోయిన పరిస్థితిని సూచ్యంగా చెప్తూ కల్తీ విత్తనాలు, వర్షాభావ పరిస్థితులు ఇవన్నీ కలిసి పొలాలు ఎండిపోవ డానికి, పంటలు అందకపోవడానికి కారణమౌతున్నాయని, పొలాలన్నీ బీడువారిపోతున్నాయని కవి ఆక్రోశిస్తున్నాడు.

దేశ రాజకీయ పరిస్థితుల్ని, సమాజంలో పెద్ద మను షులుగా, నాయకులుగా చలామని అవుతున్న దుర్మార్గుల గురించి సూటిగానే చెప్పే మరో ఖండిక ఇలా ఉంటుంది. "అసత్యవాదులు, అవినీతి పరులు, అసూయ పరులు, దొంగలు, వంచకులు, నమ్మక ద్రోహులు, విశ్వాస ఘాత కులు, రక్త పిపాసులు, హంతకులు, పరమ క్రూరులు – వీరందర్నీ మనం గుర్తు పడతం. వీరి కోసం పోలీసు, న్యాయ వ్యవస్థలు ఉన్నాయి. సంస్కరించడానికి కారాగారా లున్నాయి. అయితే వీరే మనల్ని పాలించే నాయకులుగానే, మనకు బోధించే గురువులగానో దేశ భక్తులగానో మన ముందుకు వస్తే వారికి దాసోహం అనడం తప్ప మనం ఏమీ చేయలేమని కవి అభిప్రాయపడుతున్నాడు.

మనుషులలోని అవగాహన, ఆత్మీయుత, సంస్కారం, సౌమ్యత, సానుభూతి మొదలైన గుణాలే మనిషికి ఎంతో విలువనిస్తాయని, ఇలాంటి ముఖ్యమైన గుణాల ముందు మనిషి సంపాదించే సంపదలు, బంగారం, హోదాలు, అధి కారాలు ఎందుకూ పనికిరానివని కవి ఒకచోట వ్యాఖ్యా నిస్తున్నాడు.

దేవుడికి మనిషికి మధ్య సంబంధాన్ని మనిషికి దేవుడి అవసరాన్ని గురించి చెప్పే కవితానిక ఒకటి ఈ సంపుటిలో కన్పిస్తుంది. మనిషికి ఉండే అనుమానాలు, అవస్థలు, ఎడబాటులు, బాధలు – వీటన్నింటినుండి విముక్తి కావాలి అని తలచుకోవడమే భగవంతుడికి ప్రార్థన అని అలా ఈ బాధలేమీ లేకపోతే విముక్తి కావాల్సిన అవసరమే లేకపోతే దేవుడితో మనిషికి పనేముంటుంది? అని అంటున్నాడు.

"నిన్ను తలుచుకొనవలసిన అవసరమే నాకు లేకపోతే– నీ ఉనికితో నాకేంపని"? అంటూ దేవుడ్నే ప్రశ్నిస్తున్నాడు కవి.

రాజకీయ ఎన్నికలు ప్రజల జీవితాలతో ఎలా ఆడు కొంటాయో ప్రజల ఈతిబాధలే రాజకీయనాయకుల ఉన్న తికి ఎలా కారణమౌతాయో చెప్పే ఖండిక ఒకటి ఉంది. ప్రజల సమస్యల పట్ల ఏ ప్రభుత్వానికీ, ఏ ప్రజా ప్రతినిధికీ చిత్తశుద్ధి ఉండదనీ, సమాజంలో బ్రతకలేక అనేక బాధలు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

పడే అధిక శాతం మంది పేద ప్రజల అవసరాలు అలాగే ఉండడమే వారికి కావలనీ, వీరి అవసరాలమీదే వారి ప్రభుత్వాలు ఏర్పడతాయని కవి అంటున్నాడు.

"రాజకీయం, సంఘసేవ, ప్రజా సేవలు కూడా ఒక రకమైన పరిశ్రమలు గానూ, వ్యాపారాలు గానూ మారి పోయాయి" అని చెప్తూ రాజకీయ పార్టీలు ప్రచారానికి దీన జనుల ఆర్తనాదాలు ఎలా ముడి సరుకులౌతాయో వివరించాడు కవి.

మనిషికి ఏదైనా తెలుసుకోవాల్సిన ఆసక్తి ఉంటేనే వారికి ఇతరులుచెప్పే నీతి బోధలుగానీ, గ్రంథాలు గానీ అర్థమవుతాయని, ఆసక్తి లేని విద్య నిరుపయోగమనీ, అటువంటి వారికి ఏమీ తెలిసే అవకాశం లేదని కవి ఇంకోచోట బావిస్తాడు. ఇలా సమాజం, మనిషి, సమాజంలో మనిషి ప్రవర్తన ఇటువంటి అనేక అంశాలమీద తన అభిప్రాయల్ని సూటిగా స్పష్టంగా, సరళంగా, కవితాత్మకంగా, చక్కటి అభివ్యక్తితో చెప్తున్నాడు రావూరి.

ఈయన స్పృషించిన సామాజిక అంశాలలో ముఖ్యంగా–

- ప్రకృతిని కాపాడుకోవడం గురించి
- దొంగబాబాలు, స్వాముల బోధనల గురించి
- జ్ఞాన సముపార్జన గురించి
- భగవంతునికీ మనిషికీ ఉన్న సంబంధం గురించి
- రాజకీయ నాయకుల, పార్టీల దుర్మార్గాల గురించి
- ప్రజల పేదరిక , ఆకలిదప్పులు, నిరాశా నిస్పృహల గురించి
- మనుషులకుండాల్సిన ఆశావాదం గురించి
- మనుషులలో కనుమరుగవుతున్న పరోపకారం, నిర్మలత్వం వంటి గుణాల గురించి
- ఇలా అనేక అంశాలను తనదైన శైలిలో బావుకతను జోడించి వివరించాడు కవి.

ఈ కవితానికలన్నీ ముందుగానే చెప్పినట్లు వచన పద్ధతి లోనే ఉన్నాయి. కొన్ని ఖండికలు సంభాషణల్లాగా, కొన్ని ఉపదేశాల్లాగా, మరికొన్ని ఉపన్యాసాల్లాగా ఉన్నాయి. వీటిని రాయడానికి ఒకే ప్రత్యేక అమరికను కూడా పెట్టుకోలేదు కవి. రెండే వరుసలున్న ఒకే వాక్య కవితానికలు కూడా ఉన్నాయి. అలాగే రెండు, మూడు పేరాలుగా రాసినవి కూడా ఉన్నాయి.

అయితే ఈ వచనాలని కవిత్వంగా మార్చడానికి ఎన్నో మార్గాల్ని కవి ఎంచుకొన్నాడు. తాను ఈ కవితానికల్ని అంకితం చేస్తూ రాసిన ధన్యవాదాలలోనే కొన్ని వరుసల్లో

**"కొండలు, బండలు/వాగులు, వంకలు/చెట్లు, చేమలు/ గుళ్ళు, గోపురాలు/ఎండలు, వానలు/ఉరుకులు, పరుగులు/ చీమలు, దోమలు/ఎలుకలు, చిలుకలు/దెబ్బలు, బొబ్బలు/**

అవమానాలు, అపవాదాలు..." ఇలా జంట పదాలు వాడి మళ్ళీ ప్రాసయుతంగా ఉండే జంటపదాలు వాడి రచనలో వడిని సాధించాడు. ఈ రకమైన రచనలు ఈ 116 కవితానికల్లో చాలా చోట్ల కనిపిస్తాయి. ఒకే పదాన్ని మళ్ళీ మళ్ళీ వాడుతూ తాను చెప్పే విషయాల్ని గట్టిగా చెప్పడానికి ఉపయోగించుకున్నాడు ఇతను.

**"రోజులకొద్దీ, వారాల కొద్దీ, మాసాల కొద్దీ..."**
**"బండలతో, చెట్లతో, గట్లతో, మెట్లతో..'**
**"చెట్టుతోటి, గట్టుతోటి, చెరువుతోటి, దొరువుతోటి..."**

ఇలా చాలా చోట్ల ఒకే పదాన్ని తిరిగి తిరిగి వాడడం అభిప్రాయాన్ని గట్టిగా చెప్పడానికి వాక్యానికి ఊపుతేవడానికి ఉపయోగపడింది. ప్రతీకలు వాడడం ఈయన కవితానికల్లో చాలా చోట్ల కన్పించింది. అలాగే ఉపమ, రూపకాలంకారాలు వాడాడీయన.

"మబ్బుల పొలాలు, చినుకు విత్తనాలు, వాన పంటలు నిప్పుల పూలు, మంటల పంటలు.... ఇలాంటి పదాలతో అలంకారాన్ని విరివిగా ప్రయోగించి కవితానికలకు బరువు పెంచాడు.

సామాజికాంశాలను గురించి చెప్పేటప్పుడు వ్యంగ్యం ఒక ప్రధానాస్త్రంగా వాడుకున్నాడు కవి. వ్యంగ్యం ద్వారా మనిషిని నిజం తెలుసుకోవడం వైపు ఉన్ముఖుడ్ని చేస్తున్నాడు. పక్షులు, చెట్లు, జంతువులు, ముఖ్య పాత్రులుగా తీసుకొని కొన్ని సంభాషణలు ఇందులో కన్పిస్తాయి. వీటి ద్వారా మనిషి జీవితానికి అవసరమైన ముఖ్యమైన విషయాలను బోధించడం ఈ కవితానికల్లో కన్పిస్తుంది. మొత్తంగా చూస్తే

ఉపదేశాల్లాగా, సూక్తుల్లాగా మాత్రమే కాకుండా అభివ్యక్తి పరంగా ఉన్నతంగా ఉండి, భావుకతతో చదువరిని కట్టి పడేసే సరళమైన రచనతో సాగిపోయే ఈ కవితానికలు సమాజంలోని ప్రతి ఒక్కరూ చదివి అర్థం చేసుకోవడమే ఈ కవికి, ఈ కవితానికలకి అందే నిజమైన బహుమతి. ఈ వ్యాసంలో ఉటంకించిన కవితానికల భాగాలు 2003 వ సం॥లో హైదరాబాద్ నుంచి ప్రచురితమైన ఈ కవితా నికల సంపుటిలోంచి గ్రహించినవి.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# అక్షరాన్ని నమ్ముకొని బ్రతికాననన్న 'రావూరి భరద్వాజ' గారి రెండు నవలల పరిచయం

- డాక్టర్ గుంటుపల్లి గౌరి
తెలుగు అధ్యాపకురాలు,
ప్రభుత్వ మహిళా కళాశాల, (స్వయం ప్రతిపత్తి), గుంటూరు.

డా॥ రావూరి భరద్వాజ 1927 జూలై 5న గుంటూరు జిల్లా, తాడికొండ గ్రామవాస్తవ్యులైన విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన రావూరి కోటయ్య, మల్లికాంబల ముద్దుబిడ్డగా జన్మించాడు. ఈయన భార్య పేరు కాంతం. వీరికి నలుగురు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. రావూరి భరద్వాజగారి బాల్య, యవ్వన దశలు కష్టాలు కడగండ్లే తప్ప ఏ సుఖానికి నోచుకోలేదు. అయితే జీవితం ఒడిలో తాను చవిచూసిన కష్టసుఖాలను తన రచనలకు ముడి సరుకుగా వాడు కున్నాడు. "పాకుడురాళ్ళు" నవలకి మరియు తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన బహుముఖమైన కృషికిగాను 2012వ సంవత్సరంలో 48వ భారతీయ జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్నారు. 86 ఏళ్ళ రావూరి భరద్వాజ జీవితాన్ని చూస్తే ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి ఏడవ తరగితి వరకు చదివి తన 14వ ఏట ఎనిమిదవ తరగతిలో చేరినపుడు చిరిగిన బట్టలతో కనిపించాడని ప్రధానోపాధ్యాయులు చావబాదడంతో చదువు మానేసారు. ఆ తరువాత జీవన పోరాటంలో రోజువారీ కూలీగా, కుమ్మరిగా, వడ్రంగిగా, రంపంలాగే కుర్రాడిలా, పేపర్ బాయ్‌లా, ప్రూఫ్ రీడర్‌లా విభిన్న పత్రికల్లో వివిధ సేవలందించి పిడికెడు మెతుకుల కోసం అక్షరాన్ని నమ్ముకున్న అపర భగీరథుడు భరద్వాజ.

గొప్ప భావుకుడైన తెలుగు కవి మరియు రచయిత. ఈయన సుమారు 150 రచనలు చేశారు. రావూరిభరద్వాజ 37 కథాసంపుటాలు, 17 నవలలు, 6 బాలలమినీనవలలు, 5 బాలలకథా సంపుటాలు, 3 వ్యాస మరియు ఆత్మకథా సంపుటాలు, 8 నాటికలు మరియు 5 రేడియో కథానికలు రచించాడు. ఈయన బాల సాహిత్యంలో కూడా విశేష కృషి చేసారు. రావూరి భరద్వాజకు 1980లో ఆంధ్ర విశ్వ విద్యాలయం, 1991లో నాగార్జున విశ్వవిద్యాలం గౌరవ డాక్టరేట్‌లు ప్రధానం చేసి గౌరవించాయి. ప్రపంచ ప్రసిద్ధి చెందిన కవులని, రచయితల్ని, కళాకారుల్ని, తత్వవేత్తల్ని, శాస్త్రవేత్తల్ని ఇంకా విభిన్న రంగాల్లో రాణించిన వాళ్ళను గమనించినట్లయితే వీళ్ళంతా ప్రధానంగా జీవితమనే బడిలో అనుభవ పాఠాల ద్వారా మహోన్నత శిఖరాలు అధిరోహించినవారే. ఇందుకు భాషలు, సంస్కృతులు, ప్రాంతాలు, దేశాలు అడ్డంకి కాలేదు. రావూరి భరద్వాజ మొదటి రచన 'ప్రజామిత్ర' 1944లో వెలువడింది. 'రాగిణి' కథల సంపుటితో ప్రారంభమైన వీరి రచనా వ్యాసంగం శాఖోపశాఖలుగా విస్తరించింది. మూడుసార్లు పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నుంచి 'గోపీచంద్' అవార్డును కేంద్ర సాహిత్య అకడమీ అవార్డును పొందారు.

భరద్వాజ పేరెత్తగానే పాకుడురాళ్ళు, కాదంబరి, కౌముది, ఇనుపతెర వెనుక, జీవన సమరం వంటి రచనలు వెనువెంటనే గుర్తుకొస్తాయి. రావూరి కథకుడిగా, నవలాకారుడిగా, నాటకకర్తగా, రేడియో ప్రయోక్తగా, కాలమ్ రచయితగా, బాలసాహిత్యం అందించిన వ్యక్తిగా, సైన్స్ ఫిక్షన్ రచయితగా బహుముఖమైన సేవలందించాడు. భరద్వాజ రచనలన్నింటిలో మానవత్వం, సామాజిక చైతన్యం తొణికిసలాడింది. భరద్వాజ ఇజాలమధ్య కట్టుబడలేదు. నిర్భయంగా, నిజాయితీగా రచనలు చేశాడు. బ్రతుకు తెరువు కోసం గోపీచంద్ సహాయంతో ఆకాశవాణిలో స్క్రిప్ట్ రైటర్‌గా అడుగుపెట్టి నూటి ఎనభై ఐదు రూపాయల జీతంతో కుటుంబాన్ని పోషించలేక విస్తృతంగా రచనా వ్యాసంగాన్ని కొనసాగించాడు. తన రచనల మీద ఆధారపడి జీవించాడు.

భరద్వాజ తెనాలిలో ఉన్నప్పుడు ఈయనపై చలం, గోపి చంద్‌ల ప్రభావం ఉండేదని చెబుతారు. తెనాలి పేరెత్తగానే గుడిపాటి వెంకటాచలం, త్రిపురనేని గోపిచంద్, కొడవటి గంటి కుటుంబరావు, శారద పేరుతో రచనలు చేసిన నట రాజన్, ధనికొండ హనుమంతరావు ఇలా ఎందరో గుర్తుకు వస్తారు. అయితే భరద్వాజకు ముందున్న రచయితలు భర ద్వాజకు సమకాలికులు మధ్య తరగితి సంపన్న వర్గంలోని జీవితాలను చిత్రికపట్టి చూస్తే, రావూరు భరద్వాజ అధోజగత్ సహోదరుల కన్నీళ్ళను, కడగండ్లను అక్షర బంధనం చేసారు. దిగువ, క్రింది తరగతుల జీవితాల్లోని సంఘర్షణలను, సవా ళ్ళను, ఈర్ష్యాసూయలను, పట్టింపులనూ, పంతాలను, చిన్న చిన్న సుఖాలను పెద్ద పెద్ద దుఃఖాలను తన రచనలలో చిత్రికపట్టి చూపించారు.

భరద్వాజ ఎన్నో ఉత్తమ నవలలు రాశాడు. 'పాకుడు రాళ్ళు' నవలలో సినీమాయా ప్రపంచంలోని నీతిలేని, మంచిలేని సిగ్గులేని తనాన్ని ఎండగట్టాడు. 'కాదంబరి'లో ధనయోగం పట్టిన ఒక పేదవాడి భంగపాట్లను చిత్రించాడు. జీవిత సమరంలో కథలుగాని కథలు ఎన్నో చెప్పాడు. వీరి రచనలలో హాస్యం ఆకుచాటు పిందెగా ఉంటుందనడానికి 'కరిమింగిన వెలగపండు' అక్షర సాక్ష్యం. వీరి రచనల్లో విలక్షణంగా కనిపించే హాస్య నవల అయిన 'కరిమింగిన వెలగపండు' మరియు సినీ మాయా ప్రపంచంలోని నీతిలేని, మంచిలేని, సిగ్గులేనితనాన్ని ఎండగట్టిన 'పాకుడురాళ్ళు' నవలలను గురించి సూక్ష్మంగా ఈ వ్యాసంలో తెలియ జేయడం జరిగింది.

## కరిమింగిన వెలగపండు :

'కరిమింగిన వెలగపండు' మొదటి నుంచి చివరి వరకు ఎడతెరిపి లేకుండా నవ్వు తెప్పించే హాస్య నవల. ఈ నవల శ్రీ ముళ్ళపూడి తిమ్మరాజు తొందరపెట్టడం వల్ల వెలువడిం దని చెప్పుకున్నారు. కారణం ఏదైనా కానివ్వండి, ఆనాడు ఈనాడు సాంఘిక జీవనం అసంతృప్తితో అల్లకల్లోలంగా తయారైంది. స్త్రీ పురుషుల మధ్య అవగాహన లేకపోవడంవల్ల అపార్థాలు, అపోహలు ఎక్కువైనాయి. మనస్పర్థలు పెరిగి పోయాయి. సుఖశాంతులు కరువైనాయి. వీటిన్నింటికి కారణం ఏమై వుంటుందోనన్న ఆలోచనల్లోంచి 'కరిమింగిన వెలగపండు' నవల పుట్టుకొచ్చిందని భరద్వాజ స్వయంగా చెప్పుకున్నాడు.

కుటుంబంలోని భార్యభర్తల మధ్య ఉండాల్సింది ప్రేమ, అనురాగం, త్యాగం, మోహం వంటివి. చాలామంది భార్యా భర్తల మధ్య ఇవి కరువైపోయి ఈర్ష్యాసూయలు, పంతాలూ పట్టింపులూ, సాధింపులూ, వేధింపులూ ఎక్కువయ్యాయి. వీటి మూలంగా భార్యాభర్తల మధ్య ఉండాల్సిన అవగాహన కొరవడిపోయి మనస్పర్థలు, అపార్థాలు చోటుచేసుకున్నాయి. ఏ సమస్యకైనా పరిష్కారం ఉండనే ఉంటుంది. సమస్యల్ని తెలివిగా పరిష్కరించుకొనే నేర్పు ముఖ్యంగా కుటుంబంలో భార్యాభర్తలకు ఉండాలి. భార్యా భర్తలు ఒకర్నొకరు అర్థం చేసుకొని ఒకరిమీద ఒకరు నమ్మకం, గౌరవం కలిగి ఉంటే వారి జీవనం ఆనందమయమౌతుంది. లేకుంటే లేని పోని అపోహలవల్ల స్పర్థలవల్ల జీవనం నరకమయ మౌతుంది. ఈ సత్యాన్నే రావూరి భరద్వాజ 'కరిమింగిన వెలగపండు' నవల ద్వారా వ్యక్తం చేశారు. నవలలో ప్రధాన పాత్రలు భార్యభర్తలు. వాళ్ళ జీవితంలో తలయెత్తే చిన్న చిన్న సమస్యల చుట్టూ కథ అల్లబడింది. భర్త శంకరం, భార్య సత్యవతి. వీళ్ళ మనస్తత్వం మార్చకుండ శరీరాలు మార్చడం జరిగింది. సెక్స్ మార్పిడి ఫాంటసీ ఎలిమెంట్‌ని జతచేయడమైంది. శివపార్వతులు భూలోక సంచారానికి రావడం, స్త్రీ పురుషుల మధ్య కొరవడిన అవగాహనను గుర్తించడం, ఆలుమగల కోరికమీద ఒకరి రూపం మరొక రికి బదలాయించడం జరుగుతుంది. ఆ విషయం కొంత కృతకమనిపిస్తుంది. ఆ కల్పనవల్లే నవలలో హాస్యం పండింది.

సత్యవతి, శంకరం మొదట్లో ప్రేమికులు. ఆ తర్వాత భార్యభర్తలు. ఇద్దరూ పెళ్లికాక మునుపూ, పెళ్ళయిన తర్వాత జీవితాన్ని గురించి ఎన్నో మధురమైన కలలు కంటారు. కొంతకాలం హాయిగానే కలసి కాపురం చేస్తారు. భౌతిక ప్రపంచం కలల ప్రపంచం వంటిదికాదూ. కలకూ వాస్తవా

నికి ఎంతో వ్యత్యాసం ఉంటుంది. జీవితంలోని రంగు, రుచి, వాసనలు, త్వరలోనే మాయమైపోయినట్లు యిద్దరూ భావిస్తారు. ఒక్కోమారు జీవితం నిస్సారంగా, నిరుపయోగంగా దర్శనమిస్తుంది. ఇద్దరి ప్రవర్తనలోనూ మార్పులొస్తాయి. ప్రతి చిన్న విషయానికి శంకరం, సత్యవతిని విసుక్కోవడం జరుగుతుంది. సత్యవతి కూడా శంకరానికి ఏమాత్రం తీసిపోకుండా అంతకూ, ఇంతకూ సాధించడం నేర్చుకుంటుంది. ఒకరు పడుతున్న కష్టాలకు మరొకరు కారణమనుకుంటారు. మగ పుట్టుకలో సుఖంలేదని ఆడ పుట్టుకలో ఎంతో సుఖముందని శంకరం భావిస్తాడు. ఆడ పుట్టుకలో కష్టం తప్ప సుఖంలేదని సుఖమంతా మగపుట్టుకలోనే ఉందని సత్యవతి వాదిస్తుంది. సమస్యల్ని భూతద్దం లోంచి చూసి జడుసుకుంటారు. చిన్న చిన్న పట్టింపులు పెద్దవై, జటిలమై కూచుంటాయి. సూటిపోటి మాటలతో హృదయాలను గాయపరుచుకుంటారు. ఒకరిపట్ల ఒకరికి ఉండాల్సిన ప్రేమానురాగాలు పోయి, వాటి స్థానంలో ఈర్ష్యాసూయలు చోటుచేసుకుంటాయి.

ఒకరోజు ఆరుబయట వెన్నెల్లో శంకరం, సత్యవతి ఎదురెదురుగదా కూర్చొని "దురదృష్టవశాత్తు మగాణ్ణయి పోయాను. నేనే ఆడదాన్నయి పుట్టివుంటే నా భర్తను అద్భుతంగా సుఖపెట్టివుందు" నని శంకరమూ, "నా ఖర్మకాలి నేను ఆడదాన్నయిపోయాను కాని మగాడుగా పుట్టివుంటే భార్యను నెత్తిమీంచి దించకపోనని" సత్యవతీ నిట్టూరుస్తారు. శంకరం సత్యవతిల మాటల్ని ఆ రాత్రి భూలోక సంచారం చేస్తున్న శివపార్వతులు (కల్పన) వింటారు. పార్వతి కోరిక మేరకు శంకరుడు వాళ్లిద్దరి రూపాలు తారుమారు చేస్తాడు. శరీరాకృతులు మారినా మనస్తత్వాలు మారవు. రూపాలు మార్పిడి విషయం పార్వతి స్వయంగా వాళ్ళకు కలలో కనిపించి చెబుతుంది. మరుసటి రోజు తెల్లవారగానే నిద్ర లేచిన శంకరం సత్యవతి తమలో హఠాత్తుగా కలిగిన మార్పును గమనించి సంతోషిస్తారు. ఆ రూపాల్లో తాము సుఖపడతామనుకుంటారు. అసలు కథ అక్కడే మలుపు తిరుగుతుంది. ఆ తరువాత అంతా తారుమారు వ్యవహారం. శరీరాలు మారినా మనస్తత్వాలు మారవు కాబట్టి పాత అలవాట్లు మారక సత్యవతిగా మారినా మునపటిలాగే శంకరం సిగరెట్లు కాల్చడం, తన ఒంటిమీద ఉన్నది చీర అన్న ధ్యాసకూడా లేకుండా నలుగురి ముందు చీరను లుంగీలాగ ఎగమడచి కట్టడం, శంకరం రూపంలో ఉన్న సత్యవతి పాత అలవాట్లు వదిలి పెట్టుకోకుండా నిద్రలేస్తూనే ఇల్లు వూడ్చడం, అంట్లు తోమడం –ఇవన్నీ గమనించిన పనిమనిషికి అసలు శంకరమే ఆడంగిగా ఇంటి పనులన్నీ చేస్తున్నాడని ఆశ్చర్యపోవడమూ, శంకరంగా మారిన సత్యవతి ఆడంగిగానే మాట్లాడమూ, శంకరం సత్యవతిగా మారినా మగమహారాయుడి ఫోజులే పెట్టడం మహా విడ్డూరంగా కనిపిస్తాయి.

ఆ తర్వాత శంకరం రూపంలో సత్యవతి ఆఫీసుకు వెళ్ళి, మగపుట్టుకలో ఎంత తలనొప్పి ఉందో తెలుసుకుంటుంది. సత్యవతి రూపంలో శంకరం ఇంటి చాకిరీ చేసి ఆడపుట్టుకలో ఎంత విసుగు, చిరాకు ఉందో గ్రహిస్తాడు. ఇద్దరూ ఒకర్కొకరూ సానుభూతితో అర్థం చేసుకొని ఎవరి బాధలు వాళ్ళకు న్యాయనే అభిప్రాయానికొస్తారు. చివరిగా ఇద్దరూ పశ్చాత్తాపపడి మళ్ళా తమకు ముందు రూపాలే కావాలని కోరుకుంటారు. మరుసటి రోజు రాత్రి మళ్ళా వాళ్ళకు శివపార్వతులు వాళ్ళ అసలు రూపాలు ప్రసాదిస్తారు. అక్కడ నుంచీ శంకరం, సత్యవతిల జీవితం హాయిగా సాగుతుంది.

భరద్వాజ ప్రవృత్తిరీత్యా హాస్య రచయిత కాకపోయినా, హాస్యసరచనా సమర్థులని చెప్పడానికి 'కరిమింగిన వెలగపండు' నవల ప్రత్యక్ష నిదర్శనం.

ఈ నవలలో కొంత కథ జరిగాక ప్రధాన పాత్రయిన సత్యవతి, శంకరం రూపాలు మారతాయి. సత్యవతి శంకరంగా, శంకరం సత్యవతిగా దర్శనమిస్తారు. రూపాలు మారినపుడు వాళ్ళ చేష్టలు ఏ విధంగా ఉన్నాయో చెపుతాడు రచయిత – "సత్యవతి బద్ధకంగా లేచింది అంతకన్నా బద్దకంగా వొళ్ళు విరుచుకుంది. గోళ్ళతో జుట్టు సరిచేసుకోవడం ఆవిడ అలవాటు. అదేవిధంగా చేతులు రెండూ వెనక్కు చాపి మెటికలు విరుచుకొని, ఆవలించి జుట్టు సరిచేసుకో

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

బోయింది. పట్టుదారాల్లా ఉండవలసిన వెంట్రుకలు బిరుసెక్కి ఉక్కు తీగల్లా వేళ్ళకు తగిలాయి. సత్యవతి క్షణకాలం దిమ్మర పోయింది. చేతులతో తల తడుముకొంది. పొడవైన జడకు బదులు పొట్టి క్రాపు మాత్రమే తగిలింది. అప్రయత్నంగా గుండెలకేసి చూసుకుంది. నల్లని వెంద్రుకలు చిత్తవత్తుగా వున్నాయి. మామూలుగా తన తొడుక్కున్న తెల్ల జాకెట్టుకు బదులు శాండో బనీనున్నది. రాత్రి తను కట్టుకున్న వాయిల్ చీరకు బదులు గళ్ళలుంగీ వొంటిమీదున్నది." ఈ వర్ణనలో సత్యవతి చేష్టలు, సత్యవతి అలవాట్లు కలిసిపోయాయి.

ఇక శంకరం వర్ణన ఎలా సాగిందంటే – "అతగాడు వెరైటీగా నిద్రపోతున్నాడు. తుమ్మెద రెక్కల్లా ఉండే మీసాలుగాని, బరుకు గడ్డంగాని లేవు. ముమ్మూర్తులా తన లాగ తెల్ల జాకెట్టు వేసుకొని, వాయిల్ చీర కట్టుకుని జడను మెడమీదుగా గడ్డం కిందికి జార్చుకొని, గొంతుదాక దుప్పటి కప్పుకొని పడుకున్నాడు." అని వర్ణిస్తాడు రచయిత. మగ వాళ్ళను ఆడవాళ్ళ దుస్తుల్లో, ఆడవాళ్ళను మగవాళ్ళ దుస్తుల్లో చూస్తే కొంత ఆశ్చర్యం కొంత నవ్వు కలుగకపోదు. వేషం వర్ణించి నవ్వు తెప్పించడమనేది సులువైన పనేమి కాదు. ఈ నవలలో చేష్టల వల్ల ఉత్పన్నమయ్యే హాస్యం – ప్రధాన పాత్రల రూపాలు మారాక వాళ్ళ మనస్తత్వాలు మారక పోవడం వల్ల ఎదురయ్యే సమస్యల వల్ల నవ్వు తెప్పించాడు. దానికి తోడు వాళ్ళ మతిమరిపు చేష్టల వల్ల హాస్యాన్ని పరా కాష్టకు తీసుకుపోయాడు. వాళ్ళ రూపాలు మారక అంతా తారుమారు వ్యవహారం, తలక్రిందుల వ్యవహారం, శంక రంగా మారిన సత్యవతి "ఓ నిమిషం పాటు శంకరం ఎలా లుంగీని కుట్టుకునేది మననం చేసుకుంది. రెండు చెంగులూ పట్టుకొని చేతులు పొడవునా బారజాపి, పిరుదుల మీదుగా క్రిందికి అంచున రానిచ్చి, ముందుభాగాన మెలిక చుట్టింది సత్యవతి, లుంగీ మడతయితే పడింది గాని, మోకాళ్ళ నుండీ కింది భాగమంతా కనబడుతూనే ఉంది. ఇలా మొండి కాళ్ళతో తలుపు తీయడమెలా? ఎవరన్నా చూస్తే యేమను కుంటారు? ఫలానా ఆవిడ లుంగీలు కట్టుకుంటోందని తెలిస్తే, ఇంట్లో సిగరెట్లు కాలుస్తుందని కూడా అనుకుంటారు గదా" అని శంకరంగా మారిన సత్యవతి ఆలోచించడం నవ్వు దాగుంది. శంకరంగా మారిన సత్యవతి – సత్యవతిలా ఆలోచించడంలో నవ్వు దాగుంది. వాళ్ళ ఆలోచనలు నవ్వు పుట్టిస్తాయి. సత్యవతిగా మారిన శంకరం చేష్టలు ఎలా ఉంటాయంటే "నిద్రలేస్తూనే స్టూలుమీదికి చెయ్యి చాపాడు. సిగరెట్టు అగ్గిపెట్టె చేతికందాయి. పూర్తిగా కళ్లు తెరవకుండానే వాటిని అందుకున్నాడు. సిగరెట్టు పెదవుల మధ్య బిగించి అగ్గిపుల్ల గీశాడు. ఆ ఉదుటుకు గాజులు గల్లుమని చప్పుడు చేశాయి. అప్పటికిగాని అతను పూర్తిగా మేలుకోలేదు. పక్కమీదనే బాసీంపట్టు వేసి కూచుని, దిండ్లన్నీ కాళ్ళమీద పేర్చుకొని వాటిమీద చేతులానించి, ఆ చేతుల చివర గడ్డం మోపెట్టి సిగరెట్టు కాలుస్తున్నాడు... అనవసరంగా ఓసారి ఆవలించి చేతులు రెండూ పైకి చాపి వేళ్ళు కలిపి, మెటికలు విరుచుకున్నాడు శంకరం. ఈసారి మళ్ళీ చెవుల పక్కనే గాజుల చప్పుడు వినిపించింది. మంచం మీద నుండి లేచాడు. లుంగీని మోకాళ్ళపైకి ముడుచుకుందుగ్గాను కుడి కాలు వెనగ్గావేసి, లుంగీ అంచుకోసం చెయ్యిచాపాడు. లుంగీకి బదులు నీలిరంగి అంచున్న తెల్లచీర కనిపించింది. కొరడాతో బాదినట్లు ఉలిక్కిపడ్డాడు శంకరం. ఓసారి తనను తాను చూసుకున్నాడు. చేతులకు గాజులున్నాయి. ఎడమచేతి చిటికెన వేలుకు నీలం రాయి ఉంగరం ఉంది. మెళ్ళో సన్నని గోవర్ధన గొలుసు, రెండు పేటల రాళ్ళ నక్లెసూ ఉన్నాయి. అందమైన ఉంగరాల క్రాపు బదులు పిరుదుల దాకా వేళ్ళాడే జడ కనిపించింది. అప్రయత్నంగా అతని చేతులు గుండెల మీదికెళ్ళాయి. సత్యవతి ఎదుర్రొమ్ము జ్ఞాపకం వచ్చింది."

హఠాత్తుగా సంభవించిన మార్పును చూసి శంకరం దిమ్మరపోయాడు. సరదాగా వెన్నెల్లో కూర్చొని అనుకున్న మాటలు నిజమౌతాయని శంకరం భావించలేదు. పైగా తనకు సత్యవతి శరీర సౌష్టవం వచ్చిందే గాని మగ మన స్తత్వం పోలేదు. అందువల్లే సత్యవతిగా మారిన శంకరం, మునపటి మగ మహారాయుడి లాగే సిగరెట్టు కాల్చడం, లుంగీ ఎగ్గట్టడం, పోజులు పెట్టడం చూస్తే ఎవరైనా నవ్వు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

కుంటారు. ఆడవాళ్ళు ఆడవాళ్లుగా, మగవాళ్లు, మగ వాళ్లుగా ప్రవర్తించినా, ఆలోచించినా, మాట్లాడినా నవ్వుకోం. ఆడవాళ్లు మగ వాళ్లుగా, మగవాళ్లు ఆడవాళ్లుగా దర్శన మిచ్చినా, మాట్లాడినా తప్పక నవ్వుకుంటాం.

ఈ రకమైన తారుమారు వ్యవహారం వల్లే భరద్వాజ హాస్యం పండించాలనుకున్నాడు. 'కరిమింగిన వెలగపండు' 1962లో మొట్టమొదటిగా 'కృష్ణా' పత్రికలో సీరియల్‌గా వెలువడింది. 1967లో ఆదర్శ గ్రంథమండలి (విజయవాడ) వారు నవలగా ముద్రించి వెలువరించారు. (ఒకటి రెండు ముద్రణలు ఆదర్శ గ్రంథమండలి వారే వేశారు). మళ్ళీ 1977లో 'విజేత' మాసపత్రికలో ఒకసారి నవలిక రూపంలో వెలువడింది. 'కరిమింగిన వెలగపండు' తమిళ కన్నడాల్లోకి అనువాదమైంది. తమిళంలోకి అనువాదం చేసింది శ్రీ శ్యాంప్రసాద్, శ్రీ. పి. చిరంజీవి, శ్రీమతి గౌరిగారు. తమిళ ప్రతి 1984 మే, జూన్ 'మంజరి' సంచికల్లో ప్రచురించ బడింది.

## పాకుడురాళ్ళు :

రావూరి భరద్వాజను నిలబెట్టే రచనల్లో అతి ముఖ్యమైనది 'పాకుడురాళ్ళు'. భరద్వాజ దీనికి 'మాయజలతారు' అని నామకరణం చేసారు. అయితే దీనికి శీలా వీర్రాజు 'పాకుడు రాళ్ళు' అని పేరు పెట్టారు. మల్లంపల్లి సోమశేఖర శర్మ, ముదిగొండ సుబ్రహ్మణ్య శర్మల ప్రోత్సాహంతో రావూరు భరద్వాజ తాను అంతకు మునుపే రాసిన 'పాలపుంత' అనే ఓ పెద్దకథని పాకుడురాళ్ళు నవలగా రాసారు. 3 సం॥ల పాటు కృష్ణాపత్రికలో ధారావాహికగా వెలువడిన పాకుడురాళ్ళు నవలపై, శ్రీకృష్ణదేవరాయ, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరగడం విశేషం. రావూరి భరద్వాజగారు సినీతారల క్రమానుగత పరిణామాన్ని, వెండి తెర వెను భాగోతాలను, కుట్రలు కుతంత్రాలను విశ్వసనీ యతతో, నిశితదృష్టితో మనకళ్ళ ముందుంచేందుకు చేసిన ప్రయత్నమే ఈ పాకుడు రాళ్ళు నవల. సినిమా రంగం అంటే సిరులుండే స్వర్ణలోకం అనుకుంటారు చాలామంది. కాని వారి తెరవెనుక జీవితాలు పూలపాన్పులు కావు. సముద్రం తన గర్భంలో బడబాగ్నులు దాచుకున్నట్లు వారు తమ జీవితాల్లోనూ ఎన్నో అగ్నిగుండాలను ఇముడ్చుకొని ఉంటారన్నది నిజం. ఎందుకంటే సినిమారంగం మొసళ్ళు, తిమింగలాల వంటి జలచరాలు తిరుగాడే భయా నక సముద్రం. నిత్యకళ్యాణం పచ్చతోరణంగా భాసిస్తూ వేలాదిమందిని తనవైపుకు ఆకర్షించే ఈ రంగంలో పాతుకు పోయిన అవాంఛనీయ శక్తులను గురించి రచయిత మనకు కనువిప్పు కలిగిస్తాడు. ఈ నవలలో చిరునవ్వుల వెనుక దాగిఉండే ఆత్మవేదన, తళుకు చూపుల వెనుక దాగిన కన్నీరు. తియ్యని మాటల మాటున పొంచిఉన్న విష జ్వాలలు మనకు ఈ నవలలో కనపడతాయి.

ఇప్పటికీ సినిమా వేషం దొరకాలంటే ప్రజ్ఞ ఒక్కటే చాలదు సిఫారుసులు కూడా అవసరం. దానికి డొంక తిరు గుడు దోవకే విలువ ఎక్కువ. నాడు నేడు సినిమా పద్మ వ్యూహంలో ప్రవేశించాక అక్కడ ఇమడలేక, బయటపడలేక నశించినవారి సంఖ్య ఎక్కువే. ఇప్పుడు కథానాయికకు, వేంప్‌కు తేడా ఏమీలేదు. జ్యోతిలక్ష్మి, హలం వంటివారు పోషించిన పాత్రలీనాటి తారామణులలో లీనమైపోయాయి. అలాగే హేమమాలిని, వైజయంతిమాల వంటి దక్షిణాది తారలు అప్పటి హిందీ సినిమా రంగంలో వెలిగిపోతే, ఈరోజుల్లో తెలుగు తెరమీద తెలుగురాని ఇతర భాషల తారలు ఇలా వెలిగి అలా మాయమైపోతున్నారు.

50-60 దశకాల్లో తెలుగు సినిమా ప్రపంచమంతా కలుషితమయింది అని చెప్పవచ్చు. ఉదా: రంజిత అనే ఆనాటి హిందీనటి సినిమారంగ ప్రవేశానికి తొలిమెట్టు 'కోచ్' (శయ్య) అంటూ తెగేసి చెప్పి సంచలనం సృష్టించిన ఉదం తం, ఒకనాటి హాలీవుడ్ అందాలరాశి మేరిలిన్ మన్రో జీవితం ఎంత విషాదంగా ముగిసిందో పాతతరం సినీ ప్రేక్షకులకు తెలుసు. అలాగే ఒక తమిళ హీరో గుప్పిట్లో చిక్కుకుని, ఎన్నో ఒడిదుడుకుల్ని ఎదుర్కొని, ఆత్మను చంపు కుని, శరీరాన్ని పణంగా పెట్టి ఉన్నత స్థానాన్ని చేరుకుని చివరకు దయనీయమైన స్థితిలో మరణించిన భగ్నజీవి అయిన ఒక మహానటి జీవితము గురించి తెలియని ప్రేక్షకు

లుండరు. ఇలాంటి దుర్భర వాతావరణంలో తన అంద చందాలను ఫణంగా పెట్టి, తన ప్రజ్ఞ అభినయ చాతుర్యాల ఆసరాతో ఒక్కొక్క మెట్టు ఎక్కి కీర్తి శిఖరారోహణ చేసిన మంజరి అనే అపూర్వ నటి జీవిత చరిత్రే రావూరి భరద్వాజ గారి 'పాకుడురాళ్ళు' నవల. ఈ నవల 1963లో ప్రచురించ బడింది.

మంగమ్మ అనే రంగస్థల నటి అందాల సినీతార మంజరిగా వికాసం పొందిన తీరునూ, ఆ పరిణామక్రమాన్ని కళ్ళకు కట్టినట్లుగా చిత్రించిన నవలను మంజరీ మధుక రీయంగా వర్ణించవచ్చు. యవ్వన దశలో వెలుగొందిన అప్సర మంజరి. అయితే ఆమె చుట్టూ మూగిన మధుకరాల వంటి వ్యక్తులు ఆమె సినీ జీవితం మీదనే కాక ఆమె వ్యక్తిగత జీవితంమీద కూడా బలమైన ప్రభావం చూపారు. ఆ జీవిత ధ్వయానికి రంగులు పులిమి, కాలుష్యాన్ని అంటగట్టారు. అలాంటి వారిలో చలపతి ఒకడు. అలనాడు పక్షీంద్రుడుగా వ్యవహరించబడే వ్యక్తి లాంటివాడు. చలపతి, మంగమ్మ వురఫ్ మంజరిని సినిమా అనే ప్రలోభానికి గురిచేసి ఆమెను మద్రాస్‌కు తరలించి, ఆమె సౌందర్యాన్ని తాకట్టుపెట్టి, తన పబ్బంగూడా గడుపుకొని, ఆమె చరమ దశ వరకూ మంజ రిని అంటిపెట్టుకొని ఉండిపోయిన వ్యక్తి చలపతి. నేస్తంగా, హితోపదేశకుడిగా, మార్గదర్శిగా ప్రియుడుగా వుంటూ క్రమేణా సెక్రటరీగా, కార్యదర్శిగా మారి ఆమె అంచెలంచె లుగా తారాపథం వైపు దూసుకుపోతుంటే, తాను తరుగుతూ వచ్చాడు.

తన జీవితంలో ఎదుర్కొన్న అనేక సమస్యలను బట్టి, అనుభవాలను బట్టి జీవితంలో అడుగడుగునా తిన్న దెబ్బలు, అనుభవించిన నరకయాతన మంజరి జీవితాన్ని తీర్చి దిద్దాయి. ఆ తరువాత మగవాడి బలహీనతేమిటో, ఎప్పుడు వాటిని లాభసాటిగా వాడుకోవాలో మంజరి క్షుణ్ణంగా తెలుసుకుంది. అందుకే సినీ వ్యాపారస్తులను వ్యామోహంలో ముంచి, ప్రతి ఒక్కడికీ తన స్వంతమన్నట్లు నమ్మించి, తన పబ్బం గడుపుకోగల జాణగా మారిపోయింది మంజరి. అనుభవాల నుంచి జీవరసాన్ని పీల్చుకొని, తన వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకున్న నేర్పరి. అంతరాత్మ పెట్టే ఘోషను పలుమార్లు పెడచెవిన పెట్టిన సహనశీలి మంజరి.

విలాస జీవితం, అన్ని సౌకర్యాలు, పేరు ప్రతిష్టలు, రెండూ చేతులూ నిర్విరామంగా ధనార్జన లక్ష్యంగా పెట్టు కొని, దాని సాధనకు మంజరి చెల్లించవలసిన మూల్యాలను గణించక ముందుకు సాగి గమ్యం చేరుకున్నా, చివరికి విధి వక్రిస్తుంది. ఉన్న నాలుగు రోజులూ దయాదాక్షిణ్యాలు, పాపపుణ్యాలకు తావివ్వకుండా జీవితాన్ని పిండుకొని ఆనందాన్ని అనుభవించాలి అన్న సూత్రమే విషాదాంతానికి దారితీసింది. ఒక విధంగా మంజరి శాపగ్రస్తగా మిగిలి పోయింది.

ఆనాటి ఈ నవల సినీజగత్తు సమగ్ర చిత్రాన్ని ప్రప్రథ మంగా మన ముందుంచగలిగిన పరిపూర్ణ నవల. వాస్తవి కతను, కఠోర సత్యాల్ని నింపుకున్న నవల గనుకే తెరవెనుక సినీ జీవితాల్లోని వెలుగు నీడలకు అద్దం పట్టిన ప్రముఖ రచనగా ప్రఖ్యాతి పొంది కాలపరీక్షకు నిలువగలిగిందని చెప్పవచ్చు.

తెలుగు సాహితీ ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియకు శ్రీకారంచుట్టి, ఆడంబరాలు లేని సాధారణ జీవితం జీవించి, కలాన్ని కంఠాన్ని నమ్ముకొని బ్రతికానని చెప్పి, "జయించే వాడికి ప్రపంచం చాలా చిన్నదే" అన్న 'అలగ్జాండర్' మాటల్ని తన జీవితంలో నెరవేర్చి, తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకొని, తెలుగు సాహితీ ప్రపం చంలో ఉద్దండుడై, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతలైన విశ్వనాథ సత్యన్నారాయణ, డా॥ సి. నారాయణరెడ్డి గార్ల సరసన నిలిచిన రావూరి భరద్వాజ 2013 అక్టోబరు 18న తిరిగి రాని లోకాలకు పయనించారు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# జీవన సమరం - సామాజిక దర్పణం పరిశోధనా దక్షత

- డా॥ మన్నెమోని కృష్ణయ్య
సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం,
పాలమూరు విశ్వవిదాలయం, పాలమూరు, తెలంగాణ.

జీవన సమరం అనే ఈ గ్రంథం సామాజిక స్పృహ అనే జీవం పోసుకపుట్టింది. జీవన సమరం యదార్థ గాథల దర్పణం. ఇది ఆద్యంతాలు సామాజిక స్పృహతో నిండిన మహత్ గ్రంథం. "హితేన సహితం సాహిత్యం" అన్నట్లు సాహిత్యం ప్రజల యొక్క హితాన్ని కోరేదై వుండాలి. అటువంటి ప్రజల బ్రతుకుపోరును కథా వస్తువుగా స్వీక రించి, ప్రజల జీవన సమరాన్ని అందించిన రావూరి భర ద్వాజగారు అసలు సిసలైన పరిశోధకులు. శోధించి ప్రజల బ్రతుకుదెరువు బాగుపడే సాధనాపరమైన పరిశోధనలు కావాలి. కాని అభూత కల్పనల రచన వ్యాసంగాలు అక్క ర్లేదు. అందుకు రావూరి రచనలు సామాజిక ప్రయోజనాలను గుర్తు చేసే పరిశోధనా మైలురాళ్ళని చెప్పవచ్చు. సమాజాన్ని అధ్యయనం చేసినప్పుడే మానవాళికి తోడ్పడే మహోపకారం గుండెలోత్తుల్లోనుంచి పుట్టుకొస్తుంది. సామాజిక స్పృహ నిలువెల్ల ప్రసరిస్తుంది. ఒక వ్యక్తి ఏ పదవిలో ఉన్నారన్నది ముఖ్యం కాదు. ఉండి ఏమి చేశారన్నదే ముఖ్యం. తను చేసింది స్వల్పమని, చేయాల్సిందింకా అనంతంగా ఉన్నదనీ భరద్వాజగారంటారు. సృజనాత్మక సాహిత్యం సామాజిక స్థితిగతులకు దర్పణం పట్టినప్పుడే ప్రజల హితాన్ని కాంక్షించి నప్పుడే సాహిత్యం యొక్క లక్ష్యం నెరవేరినట్టవుతుంది. జీవన సమరంలో యాభై రెండు (52) శీర్షికలతో వ్యదార్థ జీవుల యధార్థ గాథలు ఉన్నాయి. ఒక్కోగాథ ఒక పరిశోధనా గ్రంథంగా వెలువడవచ్చు. అటువంటి వ్యధార్త జీవుల గాథ లను రీసెర్చ్ సెనాప్సిస్‌గా స్వీకరించవచ్చు. జీవన సమరం లోని ప్రతి కథా శీర్షిక ఒక ఎంఫిల్ థీసిస్‌కు సరిపోతుందని భావిస్తున్నాను. రేఖామాత్రపు కథలను పూర్తి ఆధారాలతో సేకరించి పరిశోధించి సామాజిక సమస్యలపై జీవుల సమరా నికి బ్రతుకుదెరువును చూపించే ఆధారంగా కావాలి. ఆ విధంగా ప్రభుత్వాలు ప్రజల జీవన విధానాలపై విస్తృతంగా ఉపాధిని కల్పించాలి. అప్పుడే ఈ జీవనన విధానాలపై విస్తృతంగా ఉపాధిని కల్పించాలి. అప్పుడే ఈ జీవన సమరం లక్ష్యం ఛేదనదిశగా పయనిస్తుంది. అందుకే రావూరి భరద్వాజ గారు ఇలా అంటారు. "దేశం సువిశాలమయ్యింది. సమస్యలు అనంతంగా ఉన్నాయి. అవన్నీ పరిష్కారం కావాలి. అందరికీ తిండికావాలి, గుడ్డ కావాలి, నీడ కావాలి, చదువుకునే అవకాశం కావాలి, సాంఘిక న్యాయం, ఆర్థిక న్యాయం కావాలి, అప్పుడే సంఘం సుభిక్షంగా ఉన్నట్లు. దాన్నే సంక్షేమ రాజ్యమంటాం. ఈ సంక్షేమ సాధన కోసం నా కృషి ఏపాటి తోడుపడ్డా నా జన్మ ధన్యమయినట్లు భావి స్తాను" అంటారు ఆయన (జీవన సమరం పుట. 20).

జీవన సమరంలో సామాన్య ఆగర్భ జీవులు వ్యథలను కథలుగా తీర్చిదిద్దిన భరద్వాజగారే జ్ఞానపీఠ పురస్కారం జీవన సమరానికి రావాల్సిందని అభిప్రాయపడ్డారు (జీవన సమరం పుట. 6).

రచయిత యొక్క రచనలను నిశితంగా పరిశీలించి నప్పుడే రచయిత బాహిర స్వభావమే కాకుండా అంతరంగిక స్వభావం కూడా మనకు అవగతమవుతుంది. రచనలలోని సంఘటనల వెనుక గల సాంఘిక, ఆర్థిక, రాజకీయ కారణా లను చిత్రించడంలో భరద్వాజ గారి నిక్కచ్చి తనం తెలు స్తుంది. విస్తృతమైన మానవ జీవితంలోని ఏ కొద్ది భాగాలనో స్పృశించినంత మాత్రాన సరిపోదు. బ్రతుకు కోసం మానవుడు పడే పాట్లు అసంఖ్యాకంగా ఉన్నాయి. చేతి వృత్తులు, కుల వృత్తులు అని నమ్మే కొందరి జీవితాలే కాక బ్రతుకుదెరువు కోసం ఆటలాడించే గంగిరెద్దు, ఎలుగుబంటు కళారూపా లతో బ్రతుకు ఈడుస్తున్న అభాగ్య జీవులు ఎందరో ఉన్నా రు. డక్కలి ఈ నెల, దొమ్మరి, బ్రతుకుల్లో నుంచి ఆలో చించే జీవన సమరం ఒక పరిశోధనా దర్పణంగా యదార్థ గాథలు ఉన్నాయి. వృత్తులను అంటి పెట్టుకొని బతుకుల్ని

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

సాగిస్తున్న, సాధిస్తున్న వాళ్ళ సంగతేంటి? వారు అలా జీవించడం వెనుక గల పరిస్థితులేమిటి? "పతితులూ, భ్రష్టులూ, బాధా సర్పద్రష్టులూ" అయిన వారి జీవిత గాథ లను అక్షర బద్ధం చేసి పాఠకులకు అందించారు భరద్వాజ గారు. పరిశోధనకు కావలసిన క్షేత్ర పర్యటనా పరమైన ప్రాథమిక సమాచారాన్ని సేకరించి పెట్టారు. ఇది పరి శోధనకు ప్రథమ సోపానం. ఈ యదార్థ గాథలలో జీవన విధానంలో మార్పు కోసం ప్రయత్నించారు.

జీవన సమరం శీర్షికతో అందరి జీవిత చిత్రాలు ప్రచురితమైనప్పుడు, ఆ దురదృష్టవంతులకు, ధన సహాయం అందజేసిన పాఠకులు ఉన్నారు. ఉద్యోగ సదుపాయాలు కలుగజేసిన పుణ్యాత్ములున్నారు. సాహిత్యం యొక్క ప్రయో జనం ఒకింత నెరవేరినట్టయ్యింది. పరిశోధన యొక్క ప్రధాన లక్ష్యమిది. జీవిత అనుభావాల్లోంచి వచ్చిన ఈ జీవన సమరం భరద్వాజ రచనల్లో కలికితురాయి వంటిది.

భరద్వాజగారు బతుకులోని కష్టాలను, కన్నీటిని కడ ముట్టా చూసినవాడు. కూడు, గూడు, గుడ్డా కోసం కలత చెందినవాడు. ఆకలి, అవమానం, అవిద్య దారిద్ర్యం, నిరుద్యోగం, నిరాధరణకు గురైనవాడు. జీవితంలో నిలదొక్కు కోవటం కోసం రకరకాల వృత్తుల్ని చేసినవాడు. ఆ వృత్తుల్లోని సాధక బాధకాలను కష్టనష్టాలను అమానుషత్వాన్ని పది లంగా గుండె లోతుల్లో దాచుకున్నాడు. భరద్వాజ అనుభవాలు జ్ఞాపకాలు వృధా కాకుండా వాటి సారాన్ని ఒడిసి, పిండి, పీల్చుకొని మహారచయితగా ఎదిగాడు. భరద్వాజ రచనల్లో సహజత్వం, లోతు వైవిద్యం వెల్లి విరియడానికి, జీవన సమరంలోని పాత్రలు జీవన చైతన్యంతో స్పందించడానికీ, విస్తృతమైన ఆయన జీవితాను భవాలే ముఖ్యకారణాలంటారు రామోజీరావు గారు.

భరద్వాజగారు జీవన సమరం అంశం ఎన్నుకోవటం లోనూ, ఎన్నుకున్న విషయాన్ని 'రసగుళిక'గా రూపొందిం చటంలోనూ వీరు అవలంభించిన విధానం విశిష్టమైనది. జీవన సమరంలోని గాథలన్నీ మన సామాజిక జీవనానికి ప్రతిబింబాలు. భరద్వాజ గారు సామాన్యుల బ్రతుకుల్లోకి తొంగిచూసి స్పందించి, మనల స్పందింపజేసి భావితర పరిశోధకులకు మార్గం సుగమం చేశారు. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్య చరిత్రకు అచ్చంగా అట్టడుగు వర్గాల యదార్థ చరిత్రలతో నిండిన తొట్ట తొలి గ్రంథం ఈ జీవన సమరం అనటంలో అతిశయోక్తి లేదు. బి.ఎస్. రాములు గారి బ్రతుకుపోరు, బరద్వాజ గారి కాదంబరి, పాకుడురాళ్ళు మొదలగు రచనలు ఈ విభాగంలో నే చేరుతాయి. కాని జీవన సమరం అన్నది భవిష్యత్తు కోసం సమరం కాదు బతకటానికి బుక్కెడు బువ్వ గుక్కెడు నీళ్ళ కోసం సమరం ఈ జీవన సమరం.

**"కొందరు గొప్పవారుగా జన్మిస్తారు"**
**అదృష్టవంతులు**
**"ఇంకొందరకు గొప్పదనం ఆపాదించబడుతుంది"**
**వీరూ అదృష్టవంతులే!**
**"మరి కొందరు గొప్పదనాన్ని సాధిస్తారు"**
**మనం చెప్పుకోవాల్సింది వీరిగురించే!**

అంటారు రావూరి భరద్వగారు.

"వీరిలో ఏ కోటికో ఒకరు శక్తివంతులుంటారు. మర్లు భూముల్లోని ఏరాయో, ఏరప్పో వారికి ఆసరగా దొరుకు తుంది. అక్కడ కాస్తా ఆగుతారు. ఆగి ఊపిరి తీసుకుంటారు. మెల్ల మెల్లగా తొలుచుకుంటూ, నేలలోకి వెళ్ళను జొనుపు తారు. ఆ నేలలోని జీవసారాన్ని పీల్చుకుంటారు. ఎండ లోంచీ గాలిలోంచి, ఆహారాన్ని సేకరించుకొంటారు. ప్రతి కూల వాతావరణంలోంచి తమక్కావలసిన శక్తిని పిండు కుంటారు. పిండుకొని నిటారుగా ఎదుగుతారు ఈ పెరుగు దల ఎందుకంటే ఆకాశమే వారికి ఆవలి సరిహద్దుగా! గొప్ప దనాన్ని సాధించటమంటే అదీ! అట్టడుగు నుండి అతి సామా న్యంగా జీవితాన్ని ప్రారంభించి అనంతాకాశంలోదాక'' అంటారు రావూరి భరద్వాజగారు (జీవన సమరం పుట. 12).

'అన్నమో రామచంద్ర' అనే శీర్షికలో స్వరాజ్యమొచ్చిన నాటి స్థితిగతులు హైదరాబాదు సంస్థాన రాజకీయాలు. అంజమ్మ యొక్క బ్రతుకుపోరు మొదలగు విషయాలు ఆలోచనాత్మకమైన కథా ఇతివృత్తంగా నిర్మించాడు రచయిత. రెక్కాడితే గాని డొక్కాడదు అనే కథలో చెమటోడ్చే శ్రమజీవుల

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

బ్రతుకుదెరువును, రాతి యుగాలలో తయారయ్యో పనిముట్ల తయారీ విధానం. దానితో వారి జీవనం గడవడం అనేక అంశాలతో యదార్థ గాథను అక్షరబద్ధం చేశాడు భరద్వాజ. 'ఖరీదు కట్టే షరాబు లేడు', ఛత్రపణి, ఇంతేలే పేదల బతుకులు, ఆర్చేదెవరు తీర్చేదెవరు? తలకుందు విషము ఫణికిని, మనిషికన్న మృగం నయం ఎరుకోయమ్మ ఎరుక! గడమెక్కినా – గడప గడపెక్కినా.., మొదలగు శీర్షికల్లోని వ్యధార్త జీవుల యధార్థ గాథలలో పరిశోధించి పరిష్కరించాల్సిన బ్రతుకుదెరువులు ఎన్నో ఉన్నాయి. ఆ జీవితాల పై గల పరిశోధననే జీవన సమరం సామాజిక దర్పనం.

**ఆధార గ్రంథాలు :**

1) రావూరి భరద్వాజ, జీవన సమరం 2017; నవ చేతన ప్రింటింగ్ ప్రెస్, హైద్రాబాద్.
2) రావూరి భరద్వాజ, కాదంబరి 2013; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, హైద్రాబాద్.
3) బి.ఎస్. రాములు, బతుకుపోరు 2008; విశాల సాహిత్య అకాడమీ, హైద్రాబాద్.
4) గొరేటి వెంకన్న, రేలపూతలు 2002; సాయి స్పందన ప్రింటర్స్, హైద్రాబాద్.
5) బోయి భీమన్న, బోయి భీమన్న సమగ్ర సాహిత్యం సంపుటి 3.2010; తెలుగు విశ్వవిద్యాలయం, హైద్రాబాద్.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# డా॥ రావూరి వారి "జీవన సమరం"లో వ్యథార్త జీవుల యథార్థ గాథలు

- డా॥ చుక్కా యశోద
తెలుగు శాఖాధిపతి
శాతవాహన కళాశాల, విజయవాడ - 2

## డా॥ రావూరి వారి జీవన రేఖ :

అట్టడుగు నుండి అతిసామాన్యంగా జీవితాన్ని ప్రారంభించి, అనంతాకాశమంత ఎత్తు ఎదిగిన అతి కొద్ది మందిలో రావూరిభరద్వాజ ఒకరు. సామాన్య కుటుంబంలో జన్మించి పరమాద్భుతమైన విజయం సాధించిన చరిత్ర పురుషులు.

నవ్యాంధ్ర రాజధాని అమరావతికి కూతవేటు దూరంలో గుంటూరు జిల్లా తాడికొండ గ్రామంలో తన బాల్యాన్ని గడిపిన రావూరి వారు 1927 జూలై 5న కోటయ్య, మల్లి కాంబలకు కృష్ణాజిల్లా, నందిగామ తాలూకా కంచికచర్ల సమీపంలోని మోగులూరు (నాటి హైదరాబాదు సంస్థానం) గ్రామంలో జన్మించారు.

అతి సామాన్య కుటుంబంలో జన్మించిన రావూరి వారు కేవలం ఉన్నత పాఠశాల వరకే చదువుకున్నారు. పొట్టకూటి కోసం వ్యవసాయ కూలీగా, పశువుల కాపరిగా, రంపంలాగే పనివాడిగా, తిత్తులు ఊదే కూలిగా, పేపర్‌బాయ్‌గా పని చేశాడు.

తన జీవిత భాగస్వామి పేరు కాంతం. నలుగురు కుమారులు ఒక కుమార్తెతో ఏ ఆడంబరాలూ లేని సాధారణ జీవితం వీరిది. తరువాత కాయకష్టం చేసే జీవితాన్ని ప్రారంభించాడు.

## రచనలు - అవార్డులు - సత్కారాలు :

తన 17వ యేట నుండి రచనలు ప్రారంభించి దాదాపు 43 కథలు బాలలకు, 17 నవలలు, 11 సాహిత్య గ్రంథాలు, 33 సైన్స్ కథలు, 3 వ్యాస మరియు ఆత్మకథా సంపుటాలు రచించిన గొప్ప భావుకుడైన తెలుగు కవి మరియు రచయిత. తను రచించిన తొలికథ 'విమల' 1946 ఆగష్టు ఆఖరి వారం ప్రజామిత్రలో, తొలిపుస్తకం 'రాగిణి' 1950లో అచ్చయినవి.

తను రాసిన "దైవ రాజకీయాలు" అనే కథకు "స్వర్ణ కంకణం" అందుకున్నారు. 1968, 1983లలో రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1987 లో సోవియెట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు, భారతీయ భాషా పరిషత్‌వారి అవార్డు, లెక్కకు మించి పురస్కారాలు అందుకున్న వీరి రచనలు ఇంగ్లీషు, హిందీ, తమిళం, కన్నడం, మళయాళం భాషల్లోకి అనువాదం పొందాయి. మూడు విశ్వ విద్యాలయాలు గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించాయి. నాలుగు విశ్వవిద్యాలయాలలో వీరి రచనలపై పిహెచ్.డి.స్థాయి పరిశోధనలు జరిగాయి.

హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో 1959లో ప్రూఫ్ రీడింగ్ కళాకారునిగా చేరి చివరికి 1987లో తెలుగు ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా ఉద్యోగ విరమణ చేసిన డా॥రావూరి భరద్వాజ చదువుకున్నది మాత్రం 7వ తరగతి వరకే.

అత్యున్నత జ్ఞాన పీఠ పురస్కారం (2012) పొందిన నవల "పాకుడురాళ్ళు".

రావూరి భరద్వాజ వారి ఉత్కృష్ట రచన ఇది. 1965లో కృష్ణా పత్రికలో సీరియల్‌గా వెలువడి, 1978లో నవలగా తొలి ముద్రణ పొంది, 2012 లో "జ్ఞానపీఠ పురస్కారం" సొంతం చేసుకుని డా॥రావూరి వారికి తెలుగు సాహిత్య జగత్తులో ఎనలేని కీర్తి ప్రతిష్ఠలను తెచ్చిపెట్టిన నవల "పాకుడు రాళ్ళు". తెలుగు భాషా సంస్కృతీ వికాస సంవత్సరంగా మన రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సందర్భంలో ఈ పురస్కారం ఈ నవలకు రావటం తెలుగువారి సౌభాగ్యం.

చిన్నతనంలో పొలాల్లో గడిపిన భరద్వాజ వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితులను గమనించేవాడు. అప్పుడే పల్లె ప్రజల భాష. యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలూ, తాపాలూ గమనించిన భరద్వాజ ఆ అనుభవాలను తర్వాత కాలంలో తన రచనలలో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి ఉపయోగించుకున్నాడు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

సామాజిక స్పృహతో రచనలు సాగించి తన 86వ ఏట 2013 అక్టోబరు 18న హైదరాబాద్ ప్రస్తుత తెలంగాణా రాష్ట్రంలో డా॥ రావూరి భరద్వాజ తిరిగిరాని లోకాలకు తరలి వెళ్ళారు.

### డా॥రావూరి వారి రచనల్లో సామాజిక స్పృహ :

భరద్వాజ జీవితం వడ్డించిన విస్తరికాదు. బతుకులోని కష్టాలను, కన్నీటిని చివరి వరకు చూసినవాడు. చారెడు గంజి కోసం, బారెడు గుడ్డ కోసం కలవరించినవాడు. ఆకలి, అవమానం, అవిద్య, దారిద్ర్యం, నిరుద్యోగం, నిరాదరణ, పుక్కిలింతలుగా అనుభవించినవాడు. జీవనపథంలో కాలూని నిలవడం కోసం రకరకాల వృత్తుల్ని చేసినవాడు. ఆ వృత్తుల్లోని సాధక బాధకాలను, కష్టనష్టాలను, అమానుషత్వాన్ని పదిలంగా గుండెల లోతుల్లో దాచుకున్నాడు. అయితే అతని ఈ అనుభవాలు, జ్ఞాపకాలు వృధాకాలేదు. భరద్వాజ వాటిని వృథా కానివ్వకుండా సామాజిక స్పృహతో వాటి సారాన్ని ఒడిసి, పిండి, పీల్చుకుని మహా రచయితగా ఎదిగాడు.

ప్రఖ్యాత రచయిత క్వాజా అహమ్మద్ అబ్బాస్ అన్నట్లు భరద్వాజ రచనల్లో సహజత్వం, లోతు వైవిధ్యం వెల్లివిరియడానికి ఆయన పాత్రలు జీవ చైతన్యంతో స్పందిచంటానికి విస్తృతమైన ఆయన జీవితానుభవాలే ముఖ్య కారణాలు.

### డా॥ రావూరి వారి "జీవన సమరం" :

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారి ముద్రణ పొందిన 228 పేజీలు గల "జీవన సమరం" సామాజిక స్పృహ నిండిన సామాన్యుల జీవిత చిత్రణా సంపుటం. వారి చీకటి బ్రతుకుల్లో వెలుగురేఖలు ప్రసరించాలని మనసారా కోరుకుంటున్న భరద్వాజగారు ఈ గ్రంధాన్ని తన ప్రాణ మిత్రులు శ్రీ కోట పున్నయ్యగారికి అంకితం ఇచ్చారు.

### వ్యధార్ధ జీవుల యధార్ధ గాధలు – శీర్షికలు :

ఇవి కథలు కావు. యధార్ధ జీవితగాధలు. అసలైన సిసలైన సత్యాన్ని మనం చూడనూలేము. చూచి భరించనూ లేము. కారుచీకట్లో మారుమూలలు పడిఉన్న వాస్తవిక సంఘటనలు ఏర్చి, కూర్చి మన ముందుంచారు డా॥ భరద్వాజగారు.

మనలో చాలామందికి ఆధునిక నాగరికత ప్రసాదిస్తున్న సదుపాయాలను అనుభవించడమే తప్ప వాటి వెనుక గల చరిత్రను తెలుసుకోవడానికి ప్రయత్నం చెయ్యం. రేడియో వాడుతున్న వ్యక్తికి 'మార్కొని' పడిన శ్రమ, తంతీ, వార్తా ప్రసార సాధనాలను ఉపయోగించుకొంటున్న వ్యక్తికి 'గ్రాహమ్‌బెల్' పడినపాట్లు చాలామందికి తెలియదు.

రచయిత నిజాయితీ, బాధ్యతా ఇలాంటి ఘట్టాలలోనే బయటపడుతుంది. సమకాలీన సమాజానికి కోపం వస్తుందని భయపడి చేతులు ముడుచుకు కూర్చున్న రచయిత సంఘం పట్ల తనకున్న బాధ్యతను విస్మరించాడన్నమాట.

వీరేశలింగం పంతులుగారు, గురజాడ అప్పారావుగారు, గిడుగు రామమూర్తి పంతులుగారు త్రిపురనేని రామస్వామి చౌదరిగారు, గుడిపాటి వెంకట చలంగారు సమకాలీన సమాజాన్ని చూసి భయపడి ఉన్నట్లైతే, తెలుగు జాతి ఇప్పుడే స్థితిలో ఉండేది మనం ఊహించలేము.

"జీవన సమరం" వంటి ఉదాత్తమైన శీర్షికను నిర్వహించటానికి చాలా దక్షతలు కావాలి. వివిధ వృత్తుల వారిని కలుసుకోవాలి. వారు చెప్పినవన్నీ ఓపికగా వినాలి. ఆయా వృత్తులకు సంబంధించిన సాంకేతిక పరమైన సమాచారాన్ని సేకరించాలి. వారు అనుభవిస్తున్న ప్రస్తుత స్థితికి వెనుకగల సామాజిక, ఆర్ధిక, రాజకీయ కారణాలను వివేచించుకోవాలి. ఈపనులన్నీ మానవతా దృకృధంతో చేయవలసి ఉంటుంది. ఆవృత్తులపట్ల, వృత్తి దారుల పట్ల సానుభూతి, ఆత్మీయత ఉన్నవారు తప్ప ఈ శీర్షికను నడపలేరు.

జీవన సమరం శీర్షికన వెలువడిన ఈ రచనలన్నీ మన సామాజిక జీవనానికి ప్రతిబింబాలు. ఇందులోని వ్యక్తులు మనకు బాగా తెలిసినవారు. మనతో పాటు మన మధ్యనే జీవిస్తున్నవారు. వీరిని గురించి మనం ఆలోచించం. స్పందించం. భరద్వాజగారు మనం చేయలేని ఈ పనులన్నీ చేశారు. వారి బతుకుల్లోకి తొంగి చూసి, స్పందించి, మనల్ని స్పందింప చేశారు. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్య చరిత్రకు

అచ్చంగా అట్టడుగు వర్గాల యధార్ధ చరిత్రలతో నిండిన తొట్ట తొలి గ్రంధాన్ని చేర్చిన ఘనత భరద్వాజ గారికే దక్కింది.

దేశంలోని ప్రజలందరి సమస్యలూ పరిష్కారం కావాలి. తిండి, గుడ్డ, నీడ కావాలి. చదువుకునే అవకాశం, సాంఘిక, ఆర్థిక న్యాయాలూ కావాలి. దాన్నే సంక్షేమ రాజ్యం అంటాం. ఆ సంక్షేమసాధన కోసం తన పాత్రల ద్వారా విశేషమైన కృషిచేసిన భరద్వాజగారి జన్మ ధన్యము.

"అన్నమో రామచంద్రా"! శీర్షికలో అందరికీ అన్నం అందించే "అంజమ్మ", "రెక్కాడినా డొక్కాడదు" శీర్షికలో ఉక్కుముక్కల్ని కొని వాటితో పనిముట్లు కిందమార్చి అమ్ము కొంటూ జీవనం సాగిస్తున్న "శ్రీరాములు", 'ఖరీదు కట్టే షరాబు లేదు' శీర్షికలో పిడికెడు మెతుకుల కోసం రోడ్డు వారనున్న చింతచెట్టు క్రింద కూచొని రాళ్ళను కంకర కింద కొడుతున్న "ఆగమయ్య".

"గాజు పెంకుల నడుమ బూజు బతుకును చూడు" శీర్షికలో తుక్కు కాగితాలు ఏరుకొని జీవనం సాగిస్తున్న 'ముత్యాలు',– "ఇంతేలే పేదల బతుకులు" శీర్షికలో కొన్నివేల ఇళ్ళకు ఇటుకల్ని తయారుచేసి, సప్లై చేసి, చిన్న పూరి గుడిసెలో ఉంటున్న 34 సం॥ల 'రాములు'. "ఆర్చేదెవరు? తీర్చేదెవరు?" శీర్షికలో ఊరూరా కథలు చెప్పుకొని జీవనం సాగిస్తున్న 'రాంకిష్టయ్య', 'బల రామయ్యలు', 'తాజ్‌మహల్ నిర్మాణానికి' శీర్షికలో తన చేతుల మీదుగా వందల కొద్దీ ఇళ్ళు కట్టి ఇన్నేళ్ళ తరువాత కూడా తనకో సొంత ఇల్లంటూ ఏర్పాటు చేసుకోలేని 'శేషయ్య'. "తలకుండు విషము ఫణికిని" శీర్షికలో రకరకాల పాముల్ని ఆడిస్తూ, దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్న "ఖాజామియా" "గొడ్డు చాకిరి – గుడ్డక్కరువు" శీర్షికలో నేతపని చేస్తూ సంసారసాగరాన్ని కష్టం మీద ఈదుతున్న "రామస్వామి కుటుంబం", "కుడి ఎడమల దగాదగా" శీర్షికలో వడ్రంగి పని చేస్తూ కుటుంబ పోషణ చేస్తున్న 'బ్రహ్మానందం', "చెమ్మగిలు నయనమ్ము లేదు" శీర్షికలో గొడ్డలితో చెట్లను కొట్టి జీవనం సాగిస్తున్న 'పాపయ్య'. "బండ బారిన మొండి బతుకులు" శీర్షికలో రకరకాల ఇనుప పనిముట్లకు సానపట్టి ఎంతశ్రమపడినా పావలా డబ్బులు కూడా రాని దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న 'పండరినాథ్'..... ఇలా ఎంతో మంది వ్యధార్త జీవుల యధార్థ గాధలను సామాజిక స్పృహతో రచించి, చరిత్రకెక్కారు డా॥ భరద్వాజ.

## ముగింపు :

డా॥ రావూరి భరద్వాజగారి రచనల వెనుక సాంఘిక పరిస్థితులు, సామాజిక వాతావరణము ఉన్నాయి. ఒక సంఘటనను కళాత్మకంగా సామాజిక స్పృహతో చిత్రించడం ముఖ్యమే! అంతకన్నాముఖ్యం – ఆ సంఘటన వెనుకగల సాంఘిక, ఆర్థిక, రాజకీయ కారణాలను చిత్రించడం. భరద్వాజ గారు నిర్భయంగానూ, నిస్సంకోచంగాను చేశారు కనుకనే ఆయన సృష్టించిన వందలాది పాత్రలపట్ల మనకు సానుభూతి కలుగుతుందేతప్ప ఈర్ష్య, ద్వేషం, అసహ్యం కలగవు.

పాత్రలు కూలీలయినా, మాలీలయినా భ్రష్టులయినా, నికృష్టులయినా, పతితులైనా పవిత్రులయినా, జారులైనా, చోరులయినా, మన హృదయాన్ని కరుణరస ప్లావితం చేస్తాయి.

## ఆధార గ్రంథాలు :

జీవన సమరం – వ్యధార్ధ జీవుల యధార్ధ గాధలు – డా॥ రావూరి భరద్వాజ
పాకుడు రాళ్ళు – డా॥ రావూరి భరద్వాజ

# రావూరి భరద్వాజ రచనా శిల్పం - పరిశీలన

- ఇ. అనిల్ కుమార్
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

భరద్వాజ రచనలలో వస్తువుకు, శిల్పానికి సమాన ప్రాధాన్యతనే మనం చూడవచ్చు. ఎలాంటి వస్తువును తీసుకొన్నా అది అల్పమైనా, అనల్పమైనా దానిని వర్ణించే, వ్యాఖ్యానించే, చెప్పే విధానంలో, ప్రతిరచనలోనూ ఒక నవ్యత, ఒక నూతన దృక్కోణాన్ని ఆవిష్కరించి పఠితల గుండెల దగ్గరకు తన పదాలను పరుగులు తీయిస్తారు భరద్వాజ.

ఆయన స్మృతి కావ్యాలను పరిశీలిస్తే సంభాషణ శైలి, వర్ణనా శైలి, కథాకథన వ్యాఖ్యాన శైలి మనకు గోచరిస్తాయి. సామాన్యులకు సైతం అర్థమయ్యే సరళమైన భాషలో పాఠకులలో సూటిగా మాట్లాడుతున్నట్లు వుంటాయి ఆయన రచనలు.

భరద్వాజ గారి భాష తేనెలొలికే తీయని వాడుక భాష. పరుషాల జోలికి పోని సరళమైన భాష. ఆడంబరాలు, అలంకారాలు, వేషాలు భేషజాలు, అనుకరణలు లేని తేట తెలుగు భాష. ఈయన రచనలలో వాడిన పలుకులూ, పలుకుబళ్లూ, సామెతలూ, జాతీయాలూ విడిగా ఎత్తి చూప దగినవి. ప్రతి వాక్యం ధాటిగా, సూటిగా గుండెలను తాకుతుంది.

“నీ అక్షరాలు నీ చుట్టూ వున్న వారి బాధామయ గాథలను చిత్రించకపోతే, అగ్నులను విరజిమ్మకపోతే, నీవిక నిశ్చింతగా కలాన్ని ముడిచేయవచ్చు. చీకటిని తిడుతూ ఎంతకాలం కూర్చుంటావు. నీవే భగ్గుమని మండి చీకటిని కాల్చేయరాదా?” అని ఉద్బోధిస్తారు.

ఆయన, నేల కాగితం మీద నాగేటి కలంతో, విత్తనాల అక్షరాలను చల్లుకుంటూ పోతుంటే, అవి సుస్వర సుమధుర సువాసనల పుష్పాలై, ఫలాలై అనేక కావ్యాల రాసులను పండించాయి సాహితీ క్షేత్రంలో.

భరద్వాజ వాక్యాలు కొన్ని పచ్చిగా వుంటాయి. ఇంకొన్ని పచ్చగానూ, వెచ్చగానూ వుంటాయి. అవి తరచూ ఆకలి, దరిద్రం, వాసనలు వేస్తాయి. అయితే ఒక్కొక్కప్పుడు నిప్పు వాసన కూడా వేస్తుంటాయి. ఎల్లప్పుడూ గుండె లోపలికి, లోలోతులకు చొచ్చుకు పోతాయి. వాతలు పెడతాయి. అతను రాసే మాటలు పాతవి, సాధారణమైనవి కావచ్చు గాని – వాటిలోనికి కొత్త కొత్త ఊపిరిలూది, వాడినీ, వేడినీ చొప్పించి కొత్త కొత్త రంగులలో అద్భుతంగా ప్రకాశించేలా చేస్తారు. అతని రచనల్లో జన జీవితంతో పాటు, పసిడి కలలూ, జీవితంలోని కల్లోల ప్రభంజనాలూ కనబడతాయి. వివరణాత్మకంగా, విశ్లేషణాత్మకంగా ఆలోచలనలను రేకెత్తించే విధంగా విషయ వివేచన చేసి ఎదుటి వారికి తెలియజెప్పాలనే తపన ఆయన రచనలలో ద్యోతకమవుతుంది.

ఆత్మీయులు దూరమైనపుడు, బ్రతుకు భారమైనపుడు, దుఃఖం పుక్కిలింతై కన్నీటి కడలిలో స్నానం చేస్తున్న అనేక మంది అభాగ్యులు దర్శనీయమవుతారు ఆయన రచనలలో.

ప్రకృతిలోని అందాలైన వేకువ, వసంతం, వర్షంలను ఎన్నోసార్లు ఎందరెందరో కవులూ, రచయితలూ వర్ణించినప్పటికీ భరద్వాజ వర్ణనలలో ప్రతిసారీ ఒక నవ్యత కనిపిస్తుంది. జీవన గమనంలోనూ, జీవన సమరంలోనూ అన్నం కోసం, అమ్మ కోసం, ఈశ్వరుని కోసం, ఆర్తనాదాలతో అన్వేషిస్తున్న అశేష ప్రజానీకం గుండె చప్పుళ్లు ఆయన రచనల్లో వినిపిస్తాయి.

ఒక వాక్యాన్ని, వివిధ వ్యక్తులు, విభిన్న రకాలుగా అర్థం చేసుకోవడానికి గల కారణం, అందులోని సన్నివేశాలు, దృశ్యాలు, విభిన్న కోణాలు, ముఖ్యంగా పాఠకుని హృదయ సంస్కారం మీద ఆధారపడి ఉంటుందని చెబుతూ –

“ఒక వాక్యంలోని అర్థం నలుగురికీ నాలుగు రకాలుగా ఎందుకు గోచరిస్తుంది? ఒక సన్నివేశం తాలూకూ నేపథ్యం పదిమందికీ, పది రకాలుగా ఎందుకు అనిపిస్తోంది? ఒక దృశ్యంలోని అంశం, ఒక్కొక్కరికి ఒక్కో విధంగా ఎందుకు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

కనిపిస్తోంది? ఆ వాక్యంలోనూ, ఆ సన్నివేశంలోనూ, దృశ్యం లోనూ భిన్నత్వం ఉండటమే అందుకు కారణమా? లేకపోతే ఆ వాక్యాన్ని చదివిన వారి సంస్కారం, ఆ సన్నివేశాన్ని, ఆ దృశ్యాన్ని చూసిన వారి సంస్కారం కారణమా? కాకపోతే వారెన్నుకున్న దృక్కోణాలు కారణమా? కాక ఇవన్నీ కార ణమా?" అని ప్రశ్నిస్తారు "ఏదీ నాది కాదు" అన్న కవితా నికల సంకలనంలో.

పదిమంది ముందు జరిగిన ఒక సంఘటన, ఆ పది మందిని ఒకే రకంగా స్పందింప చేయక పోవడానికి కారణమేమిటి? మిమ్మల్ని చలింప చేసిన ఆ సంఘటన నన్నెందుకు కదిలించ లేకపోయింది? ఒక వాక్యం చదివి మీరు తన్మయత్వం చెందారు. అదే పుస్తకం నాకో తుక్కు చెత్తగా ఎందుకు అనిపించింది?

ఒక వాక్యం – ఒకే ఒక్క వాక్యం – మనకో తులసీదాస్‌ను ప్రసాదించింది. ఇన్ని చట్టాలు, న్యాయస్థానాలు, పోలీసు శాఖలు, కారాగారాలు, మఠాలు, ఆలయాలు, మత బోధ కులు ఉండి కూడా, ఒక నేరస్తుడినైనా మంచి తోవలోకి ఎందుకు మలచలేక పోతున్నాయి?

జతపక్షి చనిపోయిన కారణంగా, విలవిల లాడుతున్న మరో పక్షిని చూసి వాల్మీకి మహాకవి రామాయణం రాశాడు. ఓ మబ్బు తునకను చూసి కాళిదాసు మేఘదూతం కావ్యాన్ని రాశాడు. చనిపోయిన పక్షులనూ, కదులుతున్న మబ్బులనూ చాలా మంది చూశారు, ఎవరూ, ఏమీ ఎందుకని రాయలేక పోయారు? మీరైనా చెప్పగలరా? అని పాఠకులను ప్రశ్ని స్తారు భరద్వాజ (ఏదీ నాది కాదులో)

మీ రచనా శిల్పానికి వస్తువుకు గురువు ఎవరని ప్రశ్నిస్తే "చిన్న చీమ లగాయతు, చిరంతనానంద స్వామి దాకా అందరూ నాకు గురువులే" అని అంటారు వినమ్రంగా.

"ఓ అందమైన ఆలోచన మాత్రమే కాదు, ఓ పసందైన పదమే కాదు ఏదీ ఉత్తుత్తినే రాదు, ఏదీ ఉత్తుత్తినే కాదు. కిరణాల పదును కత్తులను విసిరి, జలాలను ఆవిరి నలుసు లుగా చీరేస్తున్నాడు సూర్యుడు. అంతదాకా, జలోపరి భాగాన్ని మాత్రమే తాక గలిగిన వాయువు, నీటి నలుసుల్ని ఆకాశంలోకి విసిరేస్తోంది. అయినా ఆ జల కణాలు భయపడలేదు. అన్నీ కూడబలుక్కుని మేఘంగా మారాయి. చినుకులు ఏకమయ్యాయి. ధారలుగా మొలుచుకు పోయాయి. ప్రచండమైన శక్తితో తిరిగి భూమిని చేరాయి".

"ఓ విత్తనం మొలకెత్తడం వెనుక, ఎంతటి జీవన సమరం? ఆ మొక్క ఎదగటం వెనుక ఎంత తపన! ఎదిగిన పువ్వును ప్రసవించడం మాటున ఎంత తృష్ణ? అందుకే ఏదీ ఉత్తినే రాదనడం! పుట్టుక మాత్రమే కాదు మరణం కూడా ఉత్తుత్తినే రాదు".

"తపనలోంచి, తపస్సులోంచి, మంటలోంచి, మథనం లోంచి, సంవేదనలోంచి, సంక్షోభంలోంచి, కసిలోంచి, దీక్షలోంచి, వొస్తాయి – ఏవైనా కల్పవృక్షమూ, కాలకూట విషమూ, అమృతమూ, అగ్ని ఈ మథనంలోంచే వొచ్చాయి" అలాగే ఆయన రచనలూనూ!

మనం పైపైనే చూస్తే చాలదు – లోపలకు, లోలోపలకు, లోతులకు, లోలోతులకు, చొచ్చుకొని, చొరుచుకొని పోవాలి. అప్పటికైనా 'కాస్త' తెలుసుననిపిస్తుంది గానీ, సంపూర్ణంగా ఏదీ ఎప్పటికీ తెలియదు, తెలుసుకోలేము, మనం అల్పులం. తెలుసుకొన వలసింది అనల్పం.

ప్రేమ, ఆరాధన, అనురాగం, అభిమానం, మమతాను బంధం, అసూయ, ఈర్ష్య, ద్వేషం, సంయోగం, వియోగం, కాముకత్వం, దీనత్వం ఇలా మానవ జీవితంలోని అనేక పార్శ్వాలను స్పృశించారు భరద్వాజ. జీవన సమరంలోని అంతర మథనంతో అనేక జీవన సత్యాలను వెల్లడించారు తన రచనలలో. మథనం లేకుండా మంచీ చెడూ రాదు. రాతిని గిలకొడితే లోపల జల వస్తుంది. గుండెను గిలకొడితే గుభాళిస్తుంది. ఆలోచనా భావ ఉత్తుంగ తరంగాల జల ధారలతో, గతాన్ని గతంలా కాక వర్తమానానికి జోడించి చెప్పిన మహా రచయిత ఆయన. పదాల శబ్దాల వెనుక ఆత్మ ఉంటుంది. భరద్వాజ రాసిన వాక్యాల పదాల అక్షరాల శబ్దాలలో, ఆయన ఆత్మావిష్కరణ మనకు కనిపిస్తుంది.

ఆలోచనల జన్మ రహస్యాలను చెప్పమంటారా? చద వండి మరి – "ఎక్కడో పుడుతుంది. చుక్కల్లోంచి, మబ్బు ల్లోంచి, కోనల్లోంచి, కానల్లోంచి, నదుల్లోంచి, మైదానా

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

ల్లోంచి, పైరగాలుల్లోంచి, వేకులోంచి, వెలుతురు లోంచి, వెన్నెల్లోంచి, జనపదాల్లోంచి... ఇంకా నాకు తెలియని చాలా వాటిల్లోంచి అందాలను అందుకుంటూ, అద్దుకుంటూ, గుడి సుడులు తిరుగుతూ వొచ్చి వొచ్చి అక్షరాల మీద వాలి, సోలి అలసట తీర్చుకుంటుంది ఓ ఆలోచన".

"అంతదాకా, నిద్రాజడంగా, అక్షరాలలో పడి ఉన్న ప్రాణశక్తి అప్పుడు మేలు కొంటుంది. మేలుకొన్నాక అక్షరాలన్నీ పదాలుగా వాక్యాలుగా జతకడతాయి. రంగు రంగుల మంచు ముత్యాల్లా మెరిసిపోతూన్న, ఈ రంగుల ముత్యాలను ఏర్చడంలో, కూర్చడంలో, అద్భుతమైన హారంగా మార్చడంలోనే రచయిత సంస్కారం, నేర్పరి తనమూ, కళాసక్తి కనబడతాయి. వీటికి తోడుగా ఆ దండకు రెక్కలు కూడా అమరుతాయి. ఆ రెక్కలను గాలిలోకి, నింగిలోకి, నీలోకి, నాలోకి చాచుకుంటూ తాను సంతరించుకున్న అందాలను మనకు అందరకూ పంచి పెడుతూ వుంటుంది ఆ రచన. ఆర్తిని నూర్చుకొంటూ, వచ్చిన రచన మాత్రమే మిగులుతుంది". అలా కలకాలం మిగిలే సాహిత్యాన్ని సృష్టించారు భరద్వాజ తన కలంతో.

## ఉపయుక్త గ్రంథ సూచి :

1. భరద్వాజ జీవితం – సాహిత్యం
2. భరద్వాజ ఇతర కథలు, నవలలు, బాలసాహిత్యం
3. తెలుగులో స్మృతి సాహిత్యం – భరద్వాజ రచనలు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# రావూరి భరద్వాజ కథా సాహిత్యం – పరిశీలన

- డా॥ ఇ. వాసు
తెలుగు అధ్యాపకులు
పి.వి.కె.యన్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి),
చిత్తూరు.

కవి, కథాసాహిత్య స్రష్ట, సుప్రసిద్ధ నవలాకారుడు నాటకకర్త, వ్యాసరచయిత, బాల సాహిత్య, సుగమ విజ్ఞాన శాస్త్ర రచయిత, అనువాదకుడు, రేడియో ప్రయోక్త, వినూత్న సాహితీ ప్రక్రియా నిర్మాత, నిరాడంబరజీవి, స్నేహశీలి, తత్వవేత్త, మానవతామూర్తి, ఈ శతాబ్ది గొప్ప రచయిత డాక్టర్ రావూరి భరద్వాజ గారు.

నిజ జీవిత సమరానికి ఎదురొడ్డి నిలబడి సామాన్యంగా జీవిస్తూనే అసమాన సాహితీకృషి చేసినారు. స్వయంకృషితో సాధికారతను సంతరించుకుని సామాన్యుడి స్థాయి నుండి సమోన్నత స్థాయికి ఎదిగిన అక్షర తపస్వి. చదువుకున్నది కేవలం 7వ తరగతి వరకే అయినా అడుగడుగునా ఎదురయ్యే కష్టాలను అధిగమించి తన 17వ ఏట నుంచి రచనలు చేయడం ప్రారంభించారు. వీరి కృషికి ఫలితంగా ఆనేక అవార్డులు అందుకోవడంతో పాటు, వీరి రచనలు అనేక భాషలలోకి అనువదింపబడ్డాయి. ఒక నిరక్షరాస్యుడిగా విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేటు పొందిన తొలి తెలుగు వ్యక్తి కూడా ఇతనే. జాతీయ స్థాయిలో విశిష్ట సాహితీ పురస్కారమైన జ్ఞానపీఠ్ పొందిన మూర్తిత్రయంలో ఒకరు కావడం గొప్ప విశేషం.

వాన చినుకులలోను, గడ్డిపరకలోని, మబ్బు తునకలోను, పిచ్చి మొక్కలోను, గడ్డిపువ్వులోను, ఆకు, కొమ్మ, రెమ్మ, కొండ, బండ, మండేగుండె, యాచకునిలోను, పక్షిలోను, పతితలోను, సృష్టిని, సృష్టికర్తని, మానవతను, కారుణ్యాన్ని దర్శించి పాఠకులకు దర్శింపచేసిన దార్శనికులు భరద్వాజ. తిండికోసం, పిడికెడు మెతుకులకోసం చేయని ఉద్యోగం లేదు. స్పష్టమైన అవగాహన, ఖచ్చితమైన అంచనా, లక్ష్యశుద్ధి అకుంఠితమైన దీక్ష, పట్టుదల, నిరంతర పఠనా, రచనా వ్యాసంగం, ఓర్పు, నేర్పు ఆయన ఆయుధాలు. వాటి సాయంతో జీవన సమరంలో అఖండమైన విజయాలు సాధించాయి.

## భరద్వాజ కథలు – విశ్లేషణ :

“చూడగల దృష్టి, రాయగల నేర్పు వుండాలేగాని, ఈ జగత్తునిండాకథలే, అసలు ఈ జగత్తే పెద్ద కథ” అని భరద్వాజ నమ్మకం.

భరద్వాజదొక విలక్షణమైన మనస్తత్వం తనకు ఎదురైన ప్రతి చిన్న సన్నివేశాన్ని, ప్రతి చిన్న సంఘటనను నమోదు చేసి దానిలోతుపాతులను ఆకళింపచేసుకుంటారు. అందులోంచి తనకుపయుక్తమైన అంశాలను తన రచనలలో పొందుపరుస్తారు. తాను చూసినవి, విన్నవి, తన అనుభవాలు, అనుభూతులను అక్షరబద్ధం చేస్తారు.

ఎవరికీ పనికిరాని దానిలోంచి కొందరికైనా పనికొచ్చేది వెలికితీయడం, అంతా తెలుసుననుకొన్నదానిలోంచి ఎంతో తెలియనిదాన్ని తెలియజేయడం ఆయనకిష్టం. ఒక సామాన్య సన్నివేశం భరద్వాజస్పర్శతో రసగుళికలుగా మారినదనటంలో సందేహంలేదు. ప్రజలభాషలో పాఠకులతో సూటిగా మాట్లాడ్డం ఆయన కథలు, రచనల్లోని ప్రత్యేకత సుమారు 25పైగా కథాసంపుటాలను ఆయన రచించారు. వాటిలో మచ్చుకు కొన్ని పరిశీలిస్తే ఆయన గొప్పతనం మనకు అవగతమవుతుంది.

## శ్రీరస్తు :

‘శ్రీరస్తు’ కథల సంపుటిలో; అబద్దాల మీద, అసత్యాల మీద, ఆత్మవంచన మీద, పరవంచనమీద, దగా మీద, బతుకొస్తున్న ఈనాటి సమాజం మీద చండ్ర నిప్పులు చెరిగి పోశారు భరద్వాజ. వ్యక్తిలోను, సమాజంలోను యుగయుగాలుగా, తరతరాలుగా పేరుకుపోయిన సమస్యలను, అన్యాయాలను వెలికితీసి, వాటి వాటి సహజరూపాలలో, సహజ

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

వర్ణాలలో మనకు చూపించి, మనలను మనం తేరి పార చూసుకునేలా చేశారాయన.

'ఒక చీమకథ, ఒక దోమ కథ, ఒక ఎలుక కథ, ఒక చిలుక కథ' అన్నవి మన రాజకీయ, ఆర్థిక, సామాజిక, నైతిక విలువల మీద కత్తికోతల వంటివి, బాకుపోట్ల వంటివి. చీమలు, దోమలు, ఎలుకలు, చిలుకలు కూడా మన దోషాల్ని మన ముందుంచేలా చేశారు భరద్వాజ. ఒక మంచి పదం కోసం, ఒక అందమైన శబ్దం కోసం, తాననుకున్న దాన్ని అనుకొన్నంత స్పష్టంగా అవతలి వారికి తెలియజేయ గల సజీవమైన, జీవవంతమైన ఒక ప్రత్యేకత కోసం, ఆయన మదనపడతారు.

గోడల్లేని జైలు కథలో నీతికి, అవినీతికి మధ్య; ధర్మానికి, అధర్మానికి మధ్య; ఒక మతానికి, మరొక మతానికి మధ్య ఒక మతంలోనే ఒక కులానికి, మరొక కులానికి మధ్య; ఒక కులంలోనే ఒక శాఖకు, మరొక శాఖకు మధ్య కనిపిం చని కారాగారాలెన్నో వున్నాయి. వీటి నుండి బయటకు రావడమూ, వీటిల్లోనే సుఖంగా వుండడమూ ఏదీ సాధ్యం కాదు. ఈ కథలోని ఆనందం తాను చేయని తప్పుకు శిక్షను అనుభవిస్తాడు. శిక్షాకాలం పూర్తయిన తర్వాత తన విడుద లను తనే తిరస్కరిస్తాడు. చుట్టూ కనిపించే జైలు అయితే, తాను గోడలను బద్దలుగొట్టుకొని పోగలనని, బయట ప్రపం చంలో కనిపించని జైళ్ళను(అంటరానితనం, కుల తత్వం, మతతత్వం మొదలగునవి) బద్దలుగొట్టడం తనకు సాధ్యం కాదని, కనిపించని జైళ్ళ కన్నా కనిపించే జైలే సుఖంగా వున్నదనీ ఆనందం అంటాడు. మన సాంఘిక వ్యవస్థలోని అంటరానితనమనే అనాగరిక, అమానుషమైన విధానానికి ఆనందం పాత్ర ఒక సజీవ ఉదాహరణ.

'విజయవిలాసం' కథలో జైలు నుండి విడుదలయి తాను "అమితంగా ఇష్టపడే 'విజయ'ను స్వీకరించటం గురించి చెబుతూ" అసలైన ప్రేమ అనంతమైన త్యాగాలను కోరు తుంది. ఆ త్యాగం, ఆర్థిక, సామాజికమైనదేదైనా కావచ్చు. కాని ఆ త్యాగం మాత్రం అక్షరాల త్యాగమే" అంటారు.

## కడుపు తీపి :

తల్లికి తన బిడ్డ మీద వుండే ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలుస్తుంది 'కడుపు తీపి' అన్న కథ.

ఒక తల్లి తన కొడుకును గారం చేయడం వలన, ఆ కొడుకు వ్యసనాలకులోనై వేశ్య అడిగిన తన తల్లి గుండెను ఇవ్వడానికి కూడా సిద్ధపడతాడు. ఆ గుండెను తీసుకొని వెడుతున్నప్పుడు అతనికి రాయి తగిలి బాధపడతాడు. చేతిలో నున్న గుండె నాయనా బాధ కలిగిందా? అని అడుగుతుంది. ఇది మాతృప్రేమకు పరాకాష్ఠ.

## మాతృదేవోభవ :

ఈ కథ చాలా ఆర్ద్రమైనది.

"జీవితంలో ప్రేమ ముఖ్యమా? బిడ్డలు ముఖ్యమా?" అన్న ప్రశ్న ఉదయించినప్పుడు, స్త్రీ సహజంగా బిడ్డలవైపే మొగ్గుతుంది. తన రక్తాన్ని పంచుకొని, తన పేగు త్రెంచుకుని పుట్టిన బిడ్డలపై తల్లికి గల అవ్యాజమైన ప్రేమ కన్పిస్తుందీ కథలో.

## చీమ కథ :

ఈ కథలో – కథానాయకునితో చీమ ఇలా అంటుంది. "మీరెలా బతుకుతున్నదీ నేను చూస్తూనే ఉన్నాను. మీ చుట్టూ ఉన్నవారు తిండిలేక మల మల మాడి చస్తుంటే, మీరు విందులు చేసుకుంటారు. మీ చుట్టూ ఉన్నవారు జానెడు గుడ్డతో మానం దాచుకోలేక సిగ్గుపడుతుంటే, కొనే దిక్కులేక మీ గోదాముల్లో గుడ్డలతానులు మగ్గిపోతుంటాయి. మీలో నూరింట 80వంతుల మంది పశువులకన్నా హీనంగా బతుకుతుంటే, మీరు సిగ్గుపడడం కూడా మరిచిపోతారు. మీ అంత నీచ ప్రాణుల్ని నేనెక్కడా చూడలేదు. మొత్తం విశ్వాన్ని తెచ్చి మీ ముందుంచినా, మీరింకా ఇంకా ఇంకా కోరుకుంటూనే ఉంటారు. ఆ కోర్కెలను తీర్చుకోవడం కోసం మిమ్మల్ని మీరు దోచుకుంటారు. మిమ్మల్ని మీరే పీడించు కుంటారు. మిమ్మల్ని మీరే మోసం చేసుకుంటారు. మిమ్మల్ని మీరే దగా చేసుకుంటారు. మీ మీద మీరే యుద్ధం చేసు కుంటారు. అలా చేసుకుని మీ చేతుల్లో మీరే నాశనమవు తారు. అలా నాశనం కావడానికైనా మీరొప్పుకుంటారు గాని, మరొకరి సొత్తుకు ఆశపడకుండా మాత్రం బతకలేరు" అని దులిపేస్తుంది.

పాకిస్తాన్‌తో కార్గిల్‌లో జరిగిన యుద్ధకాండను స్ఫురణకు తెస్తుందీ చీమ సందేశం. వర్తమాన సామాజిక వాతావర ణాన్ని ఎక్స్‌రే తీసి చూపించారు రచయిత. స్వార్థం, మోసం,

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

దగా, దోపిడీతో అల్లాడిపోతున్న ఆధునిక సమాజాన్ని ఈ చీమ పాత్ర ద్వారా కడిగేశారు.

అల్ప ప్రాణులైన చీమలు తమ శ్రమ ఫలితాన్ని కాపాడు కోవటానికి చావుకు కూడా తెగిస్తున్నాయి. కాని 'విజ్ఞాన వంతుణ్ణి' అనుకుంటున్న మానవుడు దోపిడీ చేస్తున్నాడు, దోపిడీ చేయబడుతున్నాడు కూడా. తమ శ్రమ ఫలితాన్ని తాము కాపాడుకోవడానికి, అల్పజీవులందరూ చైతన్య వంతులై తిరబబడితే తప్ప, ఈ వ్యవస్థ మారదు" అన్న పరమసత్యాన్ని రచయిత ఈ కథలో స్పష్టీకరించారు.

మానవ స్వభావాలకు ప్రతినిధ్యం వహించే ఇతర ప్రాణుల్ని ప్రతీకలుగా తీసుకొని, సమకాలీన ఆర్థిక, రాజకీయ, సామాజిక వ్యాధుల విశ్లేషణ చేశారాయన కథలలో. మానవేతిహాసంలో కామినీ కాంచనాల పట్ల మాన వునిలో పేరుకుపోయిన అతివల మీద ఆశను, అందు కోసం జరిగే భయంకర యుద్ధాలను, ఆ యుద్ధాలు ఎంత ధర్మ సమ్మతమైనవో చాటి చెప్పే ప్రచార విధానాలను, స్వేచ్ఛ పేరు మీదుగా పట్టుబడిదారీ దేశాలలోను, సమాజాలలోను జరిగే అమానుషమైన చర్యలను, ఆయన కథలు ఎండ గడుతున్నాయి. సమాజం పట్ల, సమాజంలోని అత్యధిక సంఖ్యాకులైన అట్టడుగు వర్గాల వారిపట్ల, బడుగు వర్గాల వారిపట్ల, రచయితకున్న సానుభూతిని ఈ కథలు అభివ్యక్తం చేస్తున్నాయి.

## నర(క)లోకం :

భరద్వాజకు అపారంగా కీర్తి ప్రతిష్ఠలను తెచ్చిన కథలలో 'నర(క)లోకం' అన్న కథ ఒకటి. ఓ అడవికి రాజైన సింహ రాజు, నారద మహర్షి ప్రేరణతో మనిషిగా అవతారమెత్తి నరలోకమంతా తిరుగుతాడు.

మనుషుల్లో ఉన్న కులాలు, మతాలు, వర్గాలు, ఈర్ష్యలు, ద్వేషాలు, కుత్సితాలు, పాశవికత్వం, రాక్ష సత్వం, ఆత్మ వంచన, మోసం, దగా, కుళ్ళును చూసి ఏవగించుకొని, జబ్బుపడి, తిరిగి తన అడవికి వచ్చిన సింహం, తన వారితో ఇలా అంటుంది. "మన మీద మానవుడు అభివృద్ధి చెందా డని అనుకుంటున్నాం. కాని, అతణ్ణి చూసి మనమే సిగ్గు పడవలసి వచ్చింది. మనం కలలో కూడా ఊహించని అనేక అన్యాయాలు, అధర్మాలు, దుష్కృత్యాలు, మానవుడు ఇట్టే చేస్తున్నాడు. మనం ఆలోచించడానికి భయపడే అనేక నీచ కార్యాలు, ఘోరకృత్యాలు, మానవుడు ఎంతో సంతోషంగా చేస్తున్నాడు. ఆకలైతే తప్ప మనం ఆహారం కోసం ఆరాట పడడం. పదితరాల వరకూ వున్నా, పదకొండో తరం కోసం మానవుడు తన తోటి మనిషి నోటి కూడు నిర్ధాక్షిణ్ణంగా తోసివేస్తున్నాడు. పరస్పర అంగీకారం లేనిదే స్త్రీ, పురుష సంబంధాలను మనం అంగీకరించడం. మానవులకీ నిబం ధనలేం లేవు. ఒక్క మాట! ఓ కుక్క ఇంకో కుక్కను, ఓ పిల్లి ఇంకో పిల్లిని, ఓ బల్లి ఇంకో బల్లిని తినదు. కాని ఓ మనిషి తన తోటి మనిషిని నిస్సంకోచంగా తినేస్తున్నాడు. బ్రహ్మాండమైన ఇలాంటి భేదాలు వారికీ మనకీ మధ్య ఎన్నో వున్నప్పుడు, వారితో మనల్ని పోల్చుకోవడం కంటే అధమాధమం, అవమానం, సిగ్గుమాలినతనం నేనూహించ లేకుండా ఉన్నాను".

కథ చెప్పిన తీరు, ఎన్నుకున్న సన్నివేశాలు వ్యంగ్యంగా చెప్పినప్పటికీ ; ప్రతి వాక్యంలోను మానవాత్మ పడే మూగ వేదన మనకు గోచరిస్తుంది. రకరకాల ప్రలోభాలాతో, కోరిక లతో, మానవజాతి ఎంతటి అధమాధమ స్థాయికి దిగ జారిందో, ఈ కథలోని ప్రతి సన్నివేశం తేటతెల్లం చేస్తుంది.

తానెంతో నాగరికుడనని విర్రవీగిపోతున్న మానవుడు, కౄరజంతువు కన్నా, ఎంతటి అట్టడుగున బ్రతుకుతున్నదీ కౄరజంతువయిన సింహం చేతనే చెప్పిస్తారు భరద్వాజ.

మానవుడు సర్వ ప్రాణికోటిలోను ఉత్తమ ప్రాణిగా గుర్తించబడడానికి, అతడు విసర్జించాల్సిన దుర్గుణాలను దర్శింపచేస్తారు రచయిత. మానవత్వం పట్ల అపారమైన మమకారాన్ని ఎదలో పదిలపరుచుకున్న భరద్వాజకు, మాన వుణ్ణి కౄరజంతువు కన్నా హీనంగా చిత్రించి, అతను తన లోపాలను సరిదిద్దుకొని సన్మార్గగామి అయ్యేలా చేయడమే ప్రధాన లక్ష్యంగా కన్పిస్తుందీ కథలో.

సునిశితమైన లోక వృత్తాంతాల పరిశీలన, అతి తీవ్రమైన జీవితానుభవం, అభివ్యక్తీకరించడంలోని నిర్భీతి, శిల్పం పట్ల గాఢానురక్తి – ఇవీ భరద్వాజ కథల్లోని ఉత్తమ లక్షణాలు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# వాస్తవ పరిస్థితుల చిత్రీకరణ – "కాదంబరి"

- డా॥ ఇరపని మాధవి
అసిస్టెంట్ ప్రొఫెసర్,
తెలుగు మరియు ప్రాచ్యభాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

కాలాలు మారినా, ప్రాంతాలు మారినా, భాషలు మారినా మనుషుల మనస్తత్వాలు, వారి కష్టసుఖాలు, ఆశ నిరాశలు, స్వార్థబుద్ధి, త్యాగనిరతి, అసూయద్వేషాలు, ప్రేమాభిమానాలు వంటి లక్షణాలు మారవు. భూత భవిష్య ద్వర్తమానాలలో మారని పరిస్థితులు, ఎప్పుడూ కొనసాగుతూ ఉండే స్థితిగతులు ఉంటూనే ఉంటాయి. అయితే వాటి శాతంలో మార్పు ఉండవచ్చుగానీ అసలు లేకుండాపోయే అవకాశమే లేదు. సర్వకాలాలకు అన్వయించే సామాజిక పరిస్థితులను చూపగలిగే రచనలు కలకాలం నిలిచి పోతాయి. కల్పనలకు దూరంగా అలాంటి వాస్తవ పరిస్థితు లను చిత్రించగలిగి, సమాజంలోని వ్యక్తులనే పాత్రలుగా మలిచే నైపుణ్యం ఉన్న రచయితలు కలకాలం పాఠకుల హృదయాలలో నిలిచిపోతారు. అట్టడుగుస్థాయి నుంచి వచ్చిన రచయితలకు అన్ని పరిస్థితులను అవగాహన చేసు కునే సామర్థ్యం ఎక్కువగానే ఉంటుంది. కష్టపడి అంచెలంచె లుగా ఎదిగి, ఎన్నో ఆటుపోట్లను తట్టుకొని, సామాన్య ప్రజా నీకానికి ప్రతినిధిగా గొప్ప రచనలు చేసి తెలుగు సాహితీ వినీలాకాశంలో తళుక్కున మెరిసినతార డా॥ రావూరి భరద్వాజ. వీరి రచనల లక్ష్యమే అట్టడుగున అవతరించి ఆకాశపుటంచులదాకా ఎదిగినవారి జీవిత చిత్రణ చేయ డమే. వీరి రచనలన్నీ నాటి సమాజంలోని వాస్తవ పరిస్థితు లను అద్దంపడతాయి. అయితే చిత్రమేమిటంటే అవే పరిస్థి తులు నేడూ కొనసాగుతుండటమే. 1978లో తొలిసారిగా వెలువడిన "కాదంబరి" నవల నాటి రాజకీయ పరిస్థితులను, సామాజిక అంశాలను ప్రతిబింబించింది. గర్భదరిద్ర్యంలో పుట్టి కోటికి పడగలెత్తిన రామకృష్ణయ్య కథే ఈ "కాదంబరి". రామకృష్ణయ్య లాంటి అనేకమందిని చూసిన అనుభవంతో గర్భదారిద్ర్యాన్ని, అంతులేని ఐశ్వర్యాన్నీ, దాని అనుభవించే మనుషుల భావజాలాలను అద్భుతంగా చిత్రించారీ నవలలో. ఈ "కాదంబరి"ని అక్కినేని నాగేశ్వరరావుగారికి అంకిత మిచ్చారు.

బాణుడు రచించిన "కాదంబరి" సంస్కృతంలో వచ్చిన వచన కథాకావ్యం. కాదంబరి అంటే ఒకానొక కావ్య విశేషం. ఆడకోయిల, గోరువంక, మద్యం, నవల అనే అర్థాలున్నాయి. "ఇందులోని ప్రతిపాత్రా ఒక్కోరకమైన మాదకతతో జోగిసలాడిపోతూ ఉన్నది. పుస్తకానికి "కాదం బరి" అన్న శీర్షిక నుంచండి అని సలహా ఇచ్చినవారు డా॥ రాఘవాచార్య" అని తన కృతజ్ఞతలలో తెలిపారు రావూరి భరద్వాజగారు. జగన్నాథం, రామకృష్ణయ్య, కౌముది, సర స్వతి, శంకరం, వసంత్, చంద్రశేఖరం, బసవపున్నయ్య, నారాయణ స్వామి, నాగరాజు, కోటిలింగం, ముఖ్యమంత్రి, నారాయణ, ఖాదర్ వంటి పాత్రలతో సాగే ఇతివృత్తంలో తను అభిమానించే మల్లంపల్లి సోమశేఖరశర్మగారిని, "శారద" పేరుతో అద్భుతరచనలు చేసి గర్భదరిద్ర్యం, అనారోగ్యం కారణంగా అతి పిన్నవయసులోనే కీర్తిశేషుడైన నటరాజన్‌ను పాత్రలుగా చేశారు భరద్వాజ. ఈ "కాదం బరి"లో కనిపించే రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, కాంట్రాక్టర్లు, దళారీలు, మేస్త్రీలు, ప్రభుత్వ అధికారులు, సామాన్య కూలీజనం భరద్వాజ గారికి తారసపడిన ఎవరో ఒకరికి ప్రతినిధులే అనిపిస్తారు.

వార్తాపత్రికలో వచ్చిన ఒక వార్త ఆధారంగా పాడుబడిన భవనాన్ని అన్వేషిస్తూ అడవి చేరతాడు జగన్నాథం. అక్కడ ఫారెస్ట్‌ఆఫీసర్ నారాయణకు తాను కలప కొనుగోలుకే వచ్చినట్లుగా భావన కలిగించి, అతనికి కమీషన్ బాగానే ముడుతుందని నమ్మకం కలిగించి అతని సహాయంతో అడవి మధ్యలో ఉన్న ఆ పాడుబడిన భవనం దగ్గరికి చేరుకుం టాడు. అక్కడ శిష్యబృందంతో వున్న మల్లంపల్లి సోమశేఖర

శర్మగారిని చూసి ఎంతగానో సంతోషిస్తాడు. రుద్రమదేవి దండనాయకుడైన మాతప్పనాయకుడి కోట అది అని, అక్కడ నది మయూరాక్షి అని, ఇంకా నాటి చారిత్రక విశేషాలను అనేకం పారవశ్యంతో గత వైభవాన్ని దర్శిస్తూ చెబుతారు సోమశేఖరశర్మగారు. ఈ సందర్భంలో అనేక చారిత్రక అంశాలను, మల్లంపల్లి సోమశేఖరశర్మగారి మహోన్నత వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించారు రచయిత. అక్కడే జగన్నాథానికి కౌముది పరిచయం అవుతుంది. మొదటి పరిచయం అయినా ఏమాత్రం బిడియం లేకుండా జగన్నాథం కంటే ముందు తానే చొరవతీసుకొని అతనితో సన్నిహితంగా మెలుగుతుంది. అడవిలోని తమ విడిదికి అతడిని తీసుకు వెళుతుంది. తన తండ్రి రామకృష్ణయ్యను పరిచయం చేసి తండ్రి, జగన్నాథం, నారాయణ వీరందరిని మించి తానే మందు పుచ్చుకుంటుంది. రామకృష్ణయ్య తన జీవితకథను చెప్పటం ప్రారంభిస్తాడు. రామకృష్ణయ్య తండ్రి కళ్ళలో ప్రాణం పెట్టుకుని ఉండేవాడు. కావడితో నీళ్ళు మోసి మోతు బరులకు పోసేవాడు. తల్లి ఇళ్ళల్లో చిల్లరమల్లర పనులుచేసి కొంత సంపాదించేది. తల్లితోపాటు రామకృష్ణయ్య కూలి పనులకు వెళ్ళేవాడు. తల్లి మరణం ఆ తర్వాత చెల్లి మరణం సంభవిస్తుంది. తండ్రి చదివించాలని ప్రయత్నించినా ఆ పంతులుగారు పెట్టే శిక్షలకు భయపడి చదువు అంటేనే ఇష్టం లేకుండా అయిపోతుంది. తండ్రికి చెప్పకుండా పట్నం పారిపోతాడు. బ్రతకడం కోసం అనేక పనులు చేస్తాడు. ప్రెస్‌లో పని చేస్తాడు. హోటల్‌లో వున్న నటరాజన్‌తో పరిచయమైన తర్వాత హోటల్ పనిలో చేరతాడు. ఈ సందర్భంలో భరద్వాజ నటరాజన్ గురించి చెప్పారు. ఆ తర్వాత సినిమాహాల్‌లో పనికి కుదిరాడు. యజమానే కొన్ని టిక్కెట్లు ముందుగానే రామకృష్ణయ్యకిచ్చి వాటిని బ్లాక్‌లో అమ్మిచ్చేవాడు. బ్లాక్ టిక్కెట్లు కొనడానికి వచ్చిన చంద్ర శేఖరం రామకృష్ణయ్య తెలివితేటలు, చురుకుతనం మెచ్చి ముందు అతడిని తన అడితికి ఆ తర్వాత ఇంటికి తీసుకెళ్ళి అన్ని వ్యవహారాలు నేర్పిస్తాడు. తనకు కుడిభుజంగా చేసు కుంటాడు. ఎంతో ధనవంతుడైన చంద్రశేఖరం కాళ్ళు లేని తన కూతురు సరస్వతిని రామకృష్ణయ్యకిచ్చి పెళ్ళి చేస్తాడు. సరస్వతి ఎంతో ఉత్తమురాలు. రామకృష్ణయ్యకు సరస్వతంటే ప్రాణం. రామకృష్ణయ్య అల్లుడైన తర్వాత చంద్రశేఖరంగారి ప్రవర్తనలో మార్పు వస్తుంది. సూటిపోటి మాటలతో బాధిస్తూ, చులకన చేయటం ప్రారంభిస్తాడు. అది సహించ లేని రామకృష్ణయ్య భార్యతోపాటు కలిసి ఆ ఇంటి నుండి బయటకు వచ్చేస్తాడు. సిరిసంపదలతో తులతూగిన సర స్వతి ఎంతో ఇష్టంగా భర్త అభిష్టానికే ప్రాధాన్యతనిచ్చి అతని ఆత్మగౌరవాన్ని కాపాడుతుంది. ఇడ్లీలు అమ్మటంతో ప్రారం భించి, చిన్న కాఫీ హోటల్ నడపటం వరకు ఎదుగుతాడు రామకృష్ణయ్య. తెలిసినవారు కలప వ్యాపారం చేయమన్నా తన మామగారున్నంత వరకు ఆ పని తాను చేయనని కృతజ్ఞత చూపుతాడు. వసంత్, కౌముది సంతానం కలుగు తారు. రైతులకు మేలు కలిగించే విధంగా కమీషన్ వ్యాపారం ప్రారంభిస్తాడు. చంద్రశేఖరం మరణించిన తర్వాత సంక్ర మించిన ఆస్తిని ఏమాత్రం ఆశించకుండా అనాథ శరణా లయాలకు ఇచ్చేస్తారు. తన స్వయంకృషితో, తెలివితేటలతో అంచెలంచెలుగా ఎదిగి అధికారులను, రాజకీయ నాయకు లను, సంపన్న వర్గాలని తన కనుసన్నల్లో ఉండేంత పరపతి సంపాదించుకుంటాడు. వ్యాపారంలో కొంత నీతి, నిజా యితీకి ప్రాధాన్యతనిస్తాడు. పిల్లలు తనలా దరిద్రం అనుభ వించకూడదని వారికి కావలసినంత స్వేచ్ఛనిస్తాడు. వసంత్ కన్నా కౌముది అంటే ఎక్కువ ఇష్టం. కౌముది తెలివైనది. వ్యాపారాన్ని కొడుకుకి అప్పగించి కౌముది సలహామేరకు మంచిపనులు చేయాలనే సంకల్పంతో మయూరాక్షి ప్రాజెక్టు గురించి తెలుసుకొని, అది వస్తే అక్కడి రైతులకు మేలు కలుగుతుందని రాజకీయ నాయకులకు తెలిపి, పెద్దపెద్ద సభలు, ధర్నాలు నిర్వహించి అది రావడానికి కారకుడవు తాడు. చివరికి ముఖ్యమంత్రి ప్రాజెక్టు మంజూరవుతుందనే విషయాన్ని గోప్యంగా ఉంచి తన బంధువర్గంచే అక్కడ భూములన్నీ కొనిపిస్తాడు. అక్కడి పేదప్రజలకు ప్రయోజనం కలగలేదని రామకృష్ణయ్య బాధపడుతుంటే కౌముది నీవు లాభపడలేదనే నీ బాధకానీ, నీకు అక్కడి భూములు

కొనగలిగివుంటే ఈ బాధ నీకుండేది కాదని ఆయన స్వరూపాన్ని అయనకు చూపటం తట్టుకోలేకపోతాడు. జగన్నాథం అక్కడి నుండి తన ఊరికి వెళ్ళిపోతాడు. రామకృష్ణయ్య జగన్నాథాన్ని రమ్మని ఉత్తరం రాసి అతను వచ్చిన తర్వాత రాజకీయ ఎత్తుగడలు ఎలా నడిచింది చెబుతాడు. కౌముది తనకు చెప్పకుండా శంకరంతో వెళ్ళిపోయిందని బాధపడతాడు. ఆ తర్వాత శంకరం, కౌముదిల దగ్గర నుంచి ఉత్తరం వస్తుంది రమ్మని. అక్కడికి వెళ్ళిన తర్వాత శంకరంతో మాట్లాడిన తర్వాత మయూరాక్షి ప్రాజెక్టు గురించి, దాని ప్రయోజనం గురించి పరిశోధించి ఇంజనీరైన శంకరం ఎంతో సమాచారం సేకరించాడని, ఆ ప్రాజెక్టు కోసమే కౌముదితో పరిచయం చేసుకున్నాడని, రామకృష్ణయ్యగారు ప్రత్యక్షంగా చేసిన అన్ని పనులలో ఆయనకే తెలీయకుండా పరోక్ష సహకారం అందించింది శంకరమేనని తెలుసుకుంటాడు. కౌముది తెలివైనదానినని అనుకుంటుంది కానీ అమాయకురాలనీ, ఆమె కష్టపడకుండా ఉండటం కోసమే ఆమెను వివాహం చేసుకున్నానని, రైతులకు మాత్రం ప్రయోజనం చేకూరలేదని, తాను ఆ ప్రాజెక్టు ఇంజనీరైనా ఏమీ చేయలేకపోతున్నానని చెబుతాడు. తర్వాత శంకరం కావాలనే కౌముదిని, జగన్నాథాన్ని ఒంటరిగా వదలివెళతాడు. అప్పుడు కౌముది శంకరం మంచివాడేకానీ తన సుఖం కోసం ఏమైనా చేస్తాడని, నేరుగా తనతో మాట్లాడకుండా తానే అన్నీ తన గురించి అపోహపడతాడని, అయినా ఒక్కమాట అనడని, భార్యాభర్తలంటే గొడవలు కూడా ఉండాలని జగన్నాథంతో చెబుతుంది. అప్పుడు జగన్నాథం ఇలా చెబుతున్న నువ్వే అతడు నిన్ను ఏమైనా అంటే సహించలేవని, మోసగాడంటావని ఇంకా ఆమె స్వభావాన్ని ఆమెకు చెబుతాడు. ఆమె చొరవ చూపినా అతడు ఎంతో మర్యాదగా ప్రవర్తించి శంకరంతో చెప్పి వెళ్ళిపోతాడు.

ఈ కథని ఆధారంగా చేసుకొని మనుషుల మనస్తత్వాలను నాటి పరిస్థితులను పాఠకుల కళ్ళముందుంచారు భరద్వాజ. డబ్బు సంపాదించటం ఒక కళని, అది వ్యసనంగా మారకూడదని చెప్పారు. రామకృష్ణయ్య అలాంటివాడే. డబ్బు సంపాదించటం తెలుసు కానీ దానిని ఎలా సుఖంగా మార్చుకోవాలో తెలీదు. సుఖాన్ని, ఆనందాన్ని ఇవ్వని డబ్బు మనిషి దగ్గరుంటే అది అతడ్ని కుక్కలా ఆడిస్తుందని, అవసరాన్ని మించి తింటే భుక్తాయాసం ఎలానో, అవసరాన్ని మించి డబ్బుంటే ధనాయాసం అలాగేనని, అదీ ఒక జబ్బేనని చెప్పారు. మనిషి అహం గురించి, సత్యం గురించి రామకృష్ణయ్య చేత ఇలా చెప్పించారు. “నేను తెలిసినవాణ్ణనీ, నన్నెవరు మోసం చేయలేరనీ, అవతలివారి ఆంతర్యాన్ని ఇట్టే గ్రహించేయగలననీ నాలో ఒక అహంకారం పొరలమాటునో ఉండి ఉండాలి. కాదనకండి జగన్నాథంగారూ! ఆత్మవిశ్వాసం వేరు, అహంకారం వేరు” అని ఒక సందర్భంలో, మరో సందర్భంలో “నిజంగా మనకు సత్యం అన్నది ఎదురుపడితే, దాన్ని భరించలేం. సత్యమనిపించేటంతటి అసత్యం కావాలి. మనం భరించగలిగేపాటి నిజం మాత్రమే కావాలి అంటాడు రామకృష్ణయ్య. అలాగే తన తండ్రి గురించి కౌముది జగన్నాథంతో “జీవితంలో ఎప్పుడూ అపజయం పొందనివాడికి, ఓటమి ఎదురైతే .. ఆత్మాభిమానంతో బాధపడుతున్నాడని సరిపెట్టుకోవచ్చు. నాన్నగారి విషయంలో అదేమీలేదే? ఎంతటి కాలకూట విషాన్నయినా, ఆయన పుక్కిటపట్టి ఉంచుకోగలడు. అలాంటిది ఈ ప్రాజెక్టు విషయంలోనే ఇలా మొండికెత్తి పోవడానికి, ఆయన అహం దెబ్బతినడమే కారణం” అంటుంది. రామకృష్ణయ్య ఇలాంటి వాడైతే అతని కూతురు కౌముది అటువంటిదే. ఎంతో తెలివైంది, ధైర్యస్థురాలు. తన మాటే సాగాలనుకునే తత్త్వం. దానికితోడు తండ్రి అలవాటు చేసిన మద్యం తాగడం, మనుషులను, వారి తత్త్వాలను ఖచ్చితంగా అంచనా కట్టగలదు. తన అందంతో ఎదుటివాడిని రెచ్చగొట్టగలదు. తన వెంటపడని శంకరాన్ని ఇష్టపడుతుంది, పెళ్ళి చేసుకుంటుంది. అదంతా తన తెలివే అనుకుంటుంది కానీ అదంతా శంకరం పథకం ప్రకారమే జరిగిందని తెలుసుకోలేకపోతుంది. మనస్సులో ఉన్నదే బయటకి మాట్లాడుతుంది. దాపరికం లేనటువంటిది.

పిల్లల పెంపకం గురించి భరద్వాజగారు ఈ సందర్భంలో తెలియజేశారు. రామకృష్ణయ్య పిల్లలను పిల్లలుగా

కాక స్నేహితులుగా చూశాడు. తనుపడిన కష్టాలు తన పిల్లలు పడకూడదని వారికి విపరీతమైన స్వేచ్ఛనిచ్చి వారు దారి తప్పడానికి కారకుడయ్యాడు. "వ్యాపారరంగంలో చేసినన్ని ప్రయోగాలను ఆయన పిల్లల మీద కూడా చేశాడు. ఆయన దృష్టిలో చేసిన ప్రయోగాలన్నీ ఫలించినట్లు లెక్క. ఇతరుల దృష్టిలో రామకృష్ణయ్య పిల్లలు భ్రష్టులయిపోయినట్లు లెక్క" అంటారీ సందర్భంలో రచయిత.

రాజకీయ ఎత్తుగడలన్నీ చిత్రించారు భరద్వాజ. ప్రాజెక్టు వస్తే ఆ ప్రాజెక్టు ప్రాంతం ఎం.ఎల్యేలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు కనుక వారికి పేరురావడం ఇష్టంలేక వారిని ఎలాగోలా తమ పార్టీలో చేరేలా చూడాలనుకున్న సి.యం. కనిపిస్తాడు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పేదరికాన్ని అనుభవిస్తున్న నాగరాజు, కోటిలింగం రామకృష్ణయ్య మధ్య వర్తిత్వంతో పార్టీ మారి పదవులను పొంది, బాగా సంపాదించటం కనిపిస్తుంది. లేని శతృత్వాన్ని పార్టీలలోని వ్యక్తులు నటించి ధర్నాలు చేయటం, కేంద్రం నుండి ప్రాజెక్టు రాబట్టడం కనిపిస్తుంది. ప్రజలదృష్టి ప్రాజెక్టు నుంచి మరల్చటం కోసం భారీపరిశ్రమ ఏర్పాటు అనే ప్రతిపాదనను పత్రికల ద్వారా గుప్పించటం కనిపిస్తుంది. ప్రాజెక్టు రాదనే అపోహాలో ప్రజల నుంచి చౌకగా, తెలివిగా అక్కడి భూములను కొనుగోలు చేయించడం కనిపిస్తుంది. తమ బంధువులు, తమ వర్గంవారు మాత్రమే లాభపడాలనుకోవడం కనిపిస్తుంది. ఎదురుతిరిగి భూములివ్వని రైతులను నానా హింసలు పెట్టడం, వాళ్ళ పైరు పీకేయటం, కుప్పలను తగులబెట్టడం, వాళ్ళ మీద దొంగకేసులు బనాయించి కోర్టులచుట్టూ తిప్పడం, తప్పుడు సాక్ష్యాలతో ఖైదుశిక్షలు వేయించటం కనిపిస్తుంది. కనీసం ప్రాజెక్టు పనులైనా అక్కడి పేదలకిస్తారా అంటే అదీలేదు. దళారీలు పెద్ద మొత్త మిస్తామని దూరప్రాంతాల నుండి కూలీలను తీసుకురావటం, తెల్లవారింది మొదలు రాత్రివరకు వాళ్ళచేత వెట్టి చాకిరీ చేయించటం, పని చేయకపోతే రౌడీలచేత కొట్టించడం, అంత జొన్నగంజి పోయడం, ఇస్తామన్న డబ్బులు ఇవ్వకుండా ఉండటం, ఎవరన్నా పారిపోవాలని ప్రయత్నిస్తే వారికి వెతికిపట్టుకొని అందరినీ పిలిచి, అందరి ముందు వారిని రక్తాలు కారేదాకా కొట్టి, అందరిముందు వాడి భార్యను అవమానించి, బిడ్డలని చంపుతామని బెదిరించి అదుపులో పెట్టడం, అధికారులు అమానుషచర్యలు అరికట్టడానికి బదులు వారు డబ్బుకు ఆశపడి మేస్త్రీలతో కుమ్మక్కవటం, అక్కడ ప్రమాదాల్లో చనిపోయినవారి ఆచూకీ కూడా పైకి పొక్కనివ్వకపోవటం కనిపిస్తుందీ నవలలో. ఈ సందర్భంలోనే ప్రాజెక్టు ఆవశ్యకతనీ, దాని నిర్మాణం ఎలా సాగేదీ వివరంగా తెలిపారు భరద్వాజ.

నేడు ప్రాజెక్టులని, రాజధాని నిర్మాణాలని జరుగుతున్నవన్నీ ఈ నవలలో కనిపిస్తాయి. ఈవిధంగా సర్వకాలాలలో ఉండే పరిస్థితులని సమర్థవంతంగా చిత్రించకగలిగిన రావూరి భరద్వాజగారు సాహిత్యజగత్తులో చిరంజీవులు.

# డా॥ రావూరి భరద్వాజ 'జీవన సమరం' – ఒక పరిశీలన

- డా॥ కసుకుర్తి ఈశ్వరమ్మ
సహాయక ఆచార్యులు,
డి.ఆర్.డబ్ల్యు. కళాశాల,
గూడూరు, నెల్లూరు జిల్లా.

భారతీయ సాహిత్యరంగంలో అత్యున్నత పురస్కారమైన "జ్ఞాన్‌పీఠ్" పురస్కారాన్ని సొంతం చేసుకున్న తొలి తెలుగు వచన రచయిత డా॥ రావూరి భరద్వాజ. ఆయన రాసిన "పాకుడురాళ్లు" గ్రంధానికి మూడున్నర దశాబ్దాల ఆయన సాహిత్య సేవకి గుర్తింపుగా 2012 సంవత్సరానికి ఈ అవార్డు లభించింది. ఏడవ తరగతి వరకే చదివిన భరద్వాజ ఆ తర్వాత ప్రపంచాన్ని విస్తృతంగా చదివారు. జీవితంలో ఆయన అనేక ఒడిదుడుకుల్ని చేశారు. అయినప్పటికీ ఎంతో పట్టుదలతో తన సాహిత్య ప్రస్థానాన్ని కొనసాగించారు. అట్టడుగు జీవితం నేర్పిన పాఠమే. అక్షరాలు రావన్న అవమా నాలే తనలో రచనాశక్తిని పెంచాయంటారు. డా॥రావూరి భరద్వాజ అవమానాలు, ఈసడింపులు, కటిక దారిద్ర్యాలు, ఆకటిచిచ్చులు ఆత్మీయుల చావులు... ఇవన్నీ ఓ ఉలిలా చెక్కిన రచనా శిల్పం రావూరి భరద్వాజ. అందుకే కష్టాల్ని కనగలిగారు. వాటికి హృదయానికి హత్తుకోగలిగారు, అర్థ అక్షరాలుగా అనువదించగలిగారు. ఆ పాకుడురాళ్ళపై పరు గెత్తడం వల్లే ప్రముఖ రచయిత క్వాజా అహమ్మద్ అబ్బాస్ డా॥ రావూరి భరద్వాజను 'తెలుగు వారి గోర్కీ' అని ప్రశం సించారు. సంఘంలోని చీకటి, అథోజగత్తును కళ్లను కట్టించి తెలుగువారికి ప్రముఖ రచయితలైన అలెగ్జాండర్ కుప్రిన్, దస్తావ్‌స్కీని మరిపించారు డా॥ రావూరి భరద్వాజ.

పశువుల కాపరిగా, కూలీగా, పగలంతా పనులు చేస్తూ, చదువుపై ఉన్న ఆపేక్షను వదులుకోక రాత్రుళ్ళు గ్రామంలోని గ్రంథాలయంలో పుస్తకాలు తెచ్చుకొని చదువుకున్నారు.

## కుటుంబ నేపథ్యం :

డా॥ రావూరి భరద్వాజ 1927, జులై 5న రావూరి మల్లికాంబ, కోటయ్య దంపతులు కృష్ణా జిల్లా మొగులూరులో పేదరైతు కుటుంబంలో జన్మించారు. వీరి ప్రాథమిక విద్యాభ్యాసం గుంటూరు జిల్లా తాడికొండలో చదువుకునే సమయంలో సాహిత్యంపై మక్కువ కల్గింది. 1943 లో తొలి కథ రాసినా, 1946లో 'విమల' అనే తొలికథ అచ్చయింది. 1950లో వీరి తొలిపుస్తకం 'రాగిణి' వెలు వడింది. 'చిత్రగ్రహం' వీరి తొలినవల. పొట్టకూటి కోసం 'రావూరి జయదేవ్' పేరుతో డిటెక్టివ్ నవలలు రాశారు. 1986లో భార్య కాంతం మరణం ఆయన్ను కొలిమిలో కాల్చి. కనకంగా పుట్టం పెట్టింది. వీరి "నాలోనినీవు', ఒక విషాద కావ్యం 'అంతరంగిణి భారతీయ సాహిత్యంలో స్మృతి కావ్యాల రచనల్లో ఎన్నదగినవి.

## ఉద్యోగ ప్రస్థానం :

రెండో ప్రపంచయుద్ధ సమయంలో టెక్నీషియన్‌గా, ప్రింటింగ్ ప్రెస్, ఫ్యాక్టరీల్లో ఫీల్డ్ వర్కర్‌గా పని చేశారు. 1946లో 'జమీన్ రైతు' వీక్లీ (నెల్లూరు) లో పాత్రికేయుడిగా, 1948లో 'దీన బంధు వీక్లీ' కి ఇన్‌చార్జ్‌గా, జ్యోతి సమీక్ష, చిత్రసీమ, సినిమా, యువ తదితర పత్రికల్లోనూ, 1957లో ఆలిండియా రేడియాల జూనియర్ స్క్రిప్ట్‌రైటర్‌గానూ పని చేశారు.

## అవార్డులు :

1983లో 'కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు 'రెండు సార్లు' ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు' , ఆంధ్రవిశ్వ విద్యాలయం 'కళాప్రపూర్ణ' అవార్డు, త్రిపురనేని గోపీచంద్ పురస్కారం, సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు, డా॥ బోయి భీమన్న సాహితీ నిధి, భారతీయ భాషా పరిషత్ అవార్డు, తదితర ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. 'జ్ఞాన పీఠ్ అవార్డుతో డా॥ రావూరి భరద్వాజ సాహితీ జీవితానికి పరిపూర్ణత్వం చేకూరినట్లయింది. అందుకే జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా॥ సి.నారాయణ రెడ్డి "వ్యక్తిగా జీవించేందుకు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

కాయకష్టం, రచయితగా దినదినాభివృద్ధి కోసం కలం కష్టం చేసిన అరుదైన రచయిత ఆయన. రాశిలోనూ అన్ని ప్రక్రియ ల్లోనూ కలకాలం నిలిచిపోయే సృజనాత్మక తెలుగు సాహి త్యాన్ని సృజనాత్మకత తెలుగు సాహిత్యాన్ని సృష్టించారని" డా॥ రావూరి భరద్వాజ ను ప్రశంసించారు.

## రచనలు :

వీరు 500కు పైగా కథానికలు, 19 నవలలు, అనేక శృంగార కథలు, బాలలుకోసం 7 నవలికలు, 3 వ్యాస సంపుటాలు, జీవిత కథలు, డిబెక్టివ్ నవలలు, 33వైజ్ఞానిక వ్యాసాలు, 8నాటకాలు మొత్తమ్మీద 150కి పైగా గ్రంథాలు రచించారు. వీరి గ్రంథాలు అనేక విశ్వవిద్యాలయాల్లో పాఠ్య పుస్తకాలవ్వగా, వీరి సాహిత్యంపై పలువురు పరిశోధనలు చేసి పి.హెచ్.డి లు పొందారు. వీరు కాదంబరి,కౌముది, పాకుడురాళ్ళు,జీవన సమరం, ఇనుప తెరవెనుక వంటి పలు గ్రంథాలు ఆంగ్లభాషలోనేగాక, పలు భారతీయ భాష ల్లోకి కూడా అనువథింపబడడం వీరి ప్రతిభకు నిదర్శనం. వీరికి సామాజిక స్పృహ మెండు. అందుకే ప్రతిరచనలోనూ మానవీయవిలువలు ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. కథలు చెప్పడంలోనూ, కథలల్లడంలోనూ వీరికున్న ప్రావీణ్యం అసమానమైన అనన్యసామాన్యమైనది.

'జీవితంలోని సంన్నుడు కాకపోవడం పెద్దవిషాదమేమీ కాదు. ప్రేమించబడక పోవడం, తనను ఎవరూ ప్రేమించే వారు ఎవరూ లేకపోవడం మాత్రం విషాదమే 'అని పాకుడు రాళ్ళు' నవలతో కథానాయికతో పల్కించడం ఆయన వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది.

ప్రఖ్యాత రచయిత కే.ఏ అబ్బాస్ గారన్నట్లు 'భరద్వాజ రచనల్లో సహజత్వం, లోతువైవిధ్యం వెల్లివిరయడానికి ఆయన పాత్రలు జీవచైతన్యంతో స్పందించడానికి, విస్తృత మైన ఆయన జీవితానుభవాలే ముఖ్యకారణాలు'!

సామాజిక జీవన ప్రతిబింబానికి ప్రతీకలు 'జీవన సమరం' శీర్షికను వెలువడిన రచనలు. అట్టడుగు వర్గాల యథార్థగాథలు నిండిన ప్రప్రథమ గ్రంథం వీరి జీవన సమరం. "కొందరు గొప్పవారుగా జన్మిస్తారు" అదృష్ట వంతులు! 'ఇంకొందరకు గొప్పదనం ఆపాదించదుతుంది" వీరు అదృష్టవంతులే! ''మరి కొందరు గొప్పదనాన్ని సాధిస్తారు" మనం చెప్పుకోబోతున్నది అటువంటి వారి గురించే ! జీవన సమరంలోని వ్యథార్థ జీవుల యథార్థగాథలు కొన్నింటిని గమనించగలం.

## 1. సారెసారెకున్ :

మానవ ఇతిహాసంలో మట్టికున్న ప్రాముఖ్యత వేరే దానికి లేదేమో, కోట్లాది జనులు ఈ మట్టికై యుద్ధాలు చేసి చివరికి ఆ మట్టిలోనే కలిసి పోయారు. ఈ మట్టికున్న ప్రాముఖ్యత వేరే దానికి లేదేమో, కోట్లాది జనులు ఈ మట్టికై యుద్ధాలు చేసి చివరికి ఆ మట్టిలోనే కలిసి పోయారు. ఈ మట్టిలో నుంచే మనక్కావలసిన వన్నీ పిండుకొంటున్నాం! మనిషికి ఎన్నోవేల సం॥రాల ముందే మట్టితో పరిచయముంది. దీనితో ఎన్నో పాత్రలను చేయడం, నేర్చుకున్నాడు. విచిత్రమే మంటే అన్ని వృత్తుల రూపురేఖలు కాలంతోపాటూ మారాయి. కానీ మార్పుచెందనిది కుమ్మరి వృత్తి మాత్రమే. ఈ గాథలో గురవయ్య తాతముత్తాతల దగ్గర నుండీ ఈ పనినే చేస్తు ఎంతో నైపుణ్యం సంపాదించాడు. కానీ ఏం ప్రయోజనం యింకా ఎంతోకాలం ఈ పని చేసుకుని బ్రత కలేనంటాడు. ఆరోజుల్లో బానలు, కుండలు, కడవలు, మూకుళ్ళు, ముంతలు తదితరాలు ఎన్నో తయారు చేసేవారు జర్మన్ సిల్వర్ రాకతో మాకుట్లో దుమ్ముపడడం అంటాడు గురవయ్య, పట్నాల్లో అల్యూమినియం, స్టీలు పాత్రలు వాడాతారు డాబు కోసమైన మేం ఇంకేం బతుకుతాం చెప్పండి అంటారు.

తన తండ్రి కుండలు చేసినా, పిడతలు చేసినా, బానలు చేసినా, పైసా తీసుకునే వారు కాదని, తమకు కొన్నిళ్ళు వుండేవని వారికి కావలసిన కుండలు బానలు తామిస్తే తమక్కావలసిన గింజా గిటకా వారిచ్చేవారనీ కుండలిచ్చా మన్న లెక్కమాకుండేది కాదు వారూ అలాగే మాతో వ్యవహరించేవారని, ఈ పనిని వదలలేను మరే పని చేత కాదని అంటారు. సముద్రాలన్నా నిండుతాయోమోగాని ఈ జానెడు పొట్టనిండడం లేదని నిట్టూర్పుతాడు గురవయ్య.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

**2. మరుగునపడిన మానవత :**

సావిత్రి పాడీపంటా బాగా ఉన్న కుటుంబంలో జన్మించిన గారాల అందాల బొమ్మ. పరిస్థితుల ప్రభావం వల్ల ఆ కుటుంబం బాగా చితికిపోయి అమ్మా నాన్నలతో పాటు తానూ కూలి పనులు చేస్తుంటుంది. యుక్తవయసు వచ్చాక వరుసకు మేనమామ అయ్యే అతను సావిత్రి ఇంటికి బస్తీ నుండి రావడం అమ్మ పెళ్ళి ప్రస్తావన తేవడంతో వారం రోజులకల్లా గుంటూరు జూట్ మిల్లులో పనిచేసే ఓ కుర్రాడికిచ్చి పెళ్ళి చేస్తారు. ఆ దౌర్భాగ్యుడు సావిత్రిని కాపురం పేరుతో గుంటూరు తీసుకొనివెళ్ళి రెండు రోజులయ్యాక రాజమండ్రి తీసుకెళ్లి ఓ కంపెనీకి అమ్మేస్తాడు. ఇలా సావిత్రిని ఊరూరా త్రిప్పి వారు ఆమె బ్రతుకును సర్వనాశనం చేస్తారు. చివరకు ఎలాగోలా విజయవాడలో వున్నప్పుడు తప్పించుకుని కదలబోతున్న రైలెక్కి తప్పించుకుంటుంది. వెంకటేశం అనే అతను ఆమెను ఆదరిస్తాడు. అతనికి భారం కాకూడదని సావిత్రి బజ్జీలు జంతికలు బోండాలు, తయారు చేసి అమ్ముకుంటూ జీవిస్తూంటుంది. వెంకటేశానికి భార్య చనిపోవడంతో అతని ముగ్గురు పిల్లలను తన పిల్లలు అనుకొని వాళ్ల కోసమే జీవిస్తుంది సావిత్రి.

**3. ఖరీదు కట్టే షరాబు లేదు :**

ఆగమయ్య ఈ గాథలో నాయకుడు. ఇతని చేతిలో నల్లరాళ్ళు నలువరాణులుగా మారడం, బండరాళ్ళు అందాల బొమ్మలుగా రూపుదాల్చడం సర్వసాధారణం. ఒక రాయిని చూస్తూనే ఆ రాయి శిల్పానికి పనికొస్తుందోలేదో కంటి చూపుతోనే చెప్పేయగలడు ఆగమయ్య ఇతని పూర్వీకులది కర్నూలు మండలం. బనగానపల్లె నవాబుకు ఆగమయ్య నాన్న నులక తప్ప అంతా రాతితో మంచం చేసిచ్చాడని ఇదంతా ఒకేరాయితోనే చేశారని పాత జ్ఞాపకాలను మన కళ్ల ముందుంచుతాడు ఆగమయ్య. శిల్పాలు చెక్కించేవారు లేక అడపాదడపా, ఎక్కడోనూటకో కోటికో ఒక్కడున్నా వారిచ్చేది గిట్టుబాటుగాక ఆగమయ్య ఆ వృత్తిని దాదాపుగా మానేస్తాడు. శతాబ్దాల తరబడి శిలలతో కలిసిమెలిసి పోవడంతో, అతనిప్పుడు రాళ్లకు, కుందులకూ 'కక్కు' కొడుతూ సన్నెకళ్ళు తయారు చేస్తున్నాడు. తన ఉక్కు ఉలితో, శాసనంతో, పొగరుతో, పాత పొడసుత్తెతో రాళ్ళలో నిద్రించే సౌందర్యాన్ని మేల్కొల్పిన ఆగమయ్య, శిలాస్తంభాల నుండి సంగీత ఝరులను ఉరుకులెత్తించగల ఆగమయ్య పిడికెడు మెతుకుల కోసం రోడ్డువార ఉన్నచెట్టుకింద కూచొని, రాళ్ళను కంకర కింద కొడుతున్నాడిప్పుడు దీనంగా ఇలా వ్యధార్థ జీవుల యధార్థ గాథలు ఎన్నో ఎన్నెన్నో డా॥ రావూరి భరద్వాజ జీవన సమరంలో కనిపిస్తాయి.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# రావూరి భరధ్వాజ గారి "తారతమ్యం"లో స్త్రీ సామాజిక స్పృహ

- జి.యం. మల్లీశ్వరి
పరిశోధక విద్యార్థిని, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జున నగర్, గుంటూరు.

**ఉపోద్ఘాతం :**

రావూరి భరధ్వాజ ప్రముఖ కథారచయిత నవలా రచయిత, రేడియో రచయిత మరియు భావుకుడైన తెలుగు కవి. వీరు 1927లో జన్మించి 2013లో పరమపదించారు.

**రచనలు :**

వీరు 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 బాలల మినీ నవలలు, 5 బాలల కథా సంపుటాలు, 3 వ్యాస మరియు ఆత్మకథా సంపుటాలు, 8 నాటికలు, 5 రేడియో కథానికలు రచించారు. వీరు బాల సాహిత్యంలో కూడా విశేష కృషి చేశారు. వీరిది సరళమైన శైలి. పాత్ర చిత్రీ కరణలో సన్నివేశాన్ని పరిచయం చేయడంలో భరధ్వాజ అద్భుతమైన నైపుణ్యం కలవాడు. చలన చిత్ర పరిశ్రమను వస్తువుగా తీసుకొని తెలుగులో మొదటి సారిగా 'పాకుడు రాళ్ళు' అనే నవలను రచించారు. దీనికే మాయాజలతారు పేరు కలదు. 2012లో దీనికి జ్ఞానపీఠ అవార్డు లభించింది.

**బిరుదులు :**

కళా ప్రపూర్ణ, కేంద్ర సాహిత్య అకాడమీ, సోవియట్ భూమి నెహ్రూ పురస్కారం, రాజా లక్ష్మీ ఫౌండేషన్ తెలుగు కళా సమితి కె.వి.రావు, జ్యోతిరావు అవార్డు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళారత్న అవార్డు, లోక్ నాయక్ ఫౌండేషన్ పుర స్కారం, గోపీచంద్ జాతీయ సాహిత్య పురస్కారాలు, జ్ఞానపీఠ అవార్డు మొదలగునవి లభించాయి.

**కథా సాహిత్యం :**

కథా రచయితగా రావూరి భరధ్వాజగారు చాలా రచనలు చేశారు. వీరి రచనల్లో 'తారతమ్యం' అనే కథను తీసుకుంటే ఆయన రచనా తీరు ఎంతో రమణీయంగా హృద్యంగా ఉంటుంది. ఒక భోగం స్త్రీ యొక్క అంతరంగాన్ని అద్భు తంగా చిత్రీకరించారు. ఈ కథలో మీనాక్షి పాత్ర ద్వారా భోగం స్త్రీలు అనుభవంచే మానసిక క్షోభను గూర్చి వివ రించారు.

**తారతమ్యం - స్త్రీ సామాజిక స్పృహ :**

మీనాక్షి అనే స్త్రీ భోగం వృత్తిలో ఉంటూ కావలసినంత డబ్బు సంపాదించి, మేడ, కారు అన్ని రకాల విలాసాలు అనుభవించింది. చివరకి తన వృత్తిపై అసహ్యం కలిగి సంసార జీవితం గడపాలని నిర్ణయించుకుంటుంది. డబ్బు కోసం నటన చూపించే బతుకు తనకొద్దని నిర్ణయించు కుంటుంది. సంసార స్త్రీలా బిడ్డా పాపలతో కళకళలాడాలని కోరుకుంటుంది. తనెంత ప్రేమ చూపినా అది భోగం తళు కు క్రిందే జమ కట్టడం భరించలేక పోతుంది. ఎంత కాలమీ గమ్యం లేని జీవితం అనే విరక్తి కలిగి అంతర్మధనానికి గురవుతుంది. 14వ ఏటనే భోగం వృత్తిలోకి దిగిన తనని ఎవరు వరిస్తారు. ఇప్పుడు హృదయ పరివర్తనం కలిగి పెళ్ళి మీదకు మనసు మళ్ళిన మీనాక్షిని ఎవరు చేసు కుంటారు. కావాలంటే వుంచుకుంటారు లేదా చేరదీస్తారు కానీ మీనాక్షికి ఇవేమీ ఇష్టంలేదు జీవితాంతం ఒక తోడు నీడ కోసం ప్రాకులాడింది. ఆమె కోరిక నెరవేర్చి నాగేంద్రం అనే వ్యక్తి ఆమెను పెళ్ళి చేసుకుంటాడు. తల్లిని సమాజాన్ని ఎదిరించి కట్టు గుడ్డలతో అతని వెంట బయలు దేరుతుంది. స్వచ్ఛమైన మనసుతో అతనికి సేవలు చేస్తుంది. అతను తిన్న కంచంలోనే తానూ తిన్నది. 'మీనూ' అనే అతని పిలు పుకు పరవశించి పోయింది. కానీ, అతని మనస్తత్వం మెల్ల మెల్లగా బయటపడసాగింది. సబ్బు లేకపోతే స్నానం చేయ కూడదా అని అతను ప్రశ్నిస్తే స్నానానికి సబ్బు వాడడం మానేసింది. వంటి మీద చీకి పోయిన చీరలోనే కాలం గడిపింది. ఇస్త్రీ చీర నలగ నీయకుండా కట్టిన మీనాక్షికి చిరిగిన చీరే దిక్కయింది.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

'సుఖ సౌఖ్యాలతో ఉన్నది కులట జీవితం కష్టాలున్నా కూడా ఇది సంసారజీవితం' కాబట్టి ఇదే తన మార్గం అని సర్థుకు పోయింది. ఆ పరిస్థితుల్లోనే మీనాక్షి గర్భవతి కావడంతో ఇంకొన్ని కష్టాలు జతచేరాయి. నెలలు నిండి ఒంట్లో ఓపిక లేక పోయినా ఇంటెడు చాకిరీ చేసేది. కనీసం గర్భవతి అన్న కనికరం కూడా లేకుండా అతని పురుషాహంకారానికి, పశుత్వానికి బలయి పోయింది. కాదని ఎదురు తిరిగితే చావు దెబ్బలు తిన్నది. ఆమె ఏడుపు విన్న ఇరుగు పొరుగు వారు భోగంవగలు, వగలాడి ఏడుపులు అని ఈసడించుకున్నారే గానీ ఒక్కరూ కనికరం చూపలేదు. మొదటిసారి భోగం వృత్తిలో ఉన్నపుడు తలనొప్పిగా ఉందని ఆ వృత్తి చేయనని ఎదురు తిరిగినందుకు తల్లిచేత తన్నులు తింది. ఇప్పుడు రెండోసారి భర్త చేతుల్లో తన్నులు తింది. ఇక అక్కడితో ఆగక ప్రతి నిత్యం ఏదో రకంగా తన్నులు తింటూనే వుంది.

తన కడుపున పుట్టిన బిడ్డకు సరైన పోషణ లేక పాలు లేక చిక్కి శల్యమై పోతుంటే తన కడుపున ఎందుకు పుట్టావురా అని భోరున ఏడ్చింది. పిల్లవాడిని డాక్టరుకు చూపిస్తాను అని మాయ మాటలు చెప్పిన భర్తకు అతని కోరికకు లొంగిపోయింది. చివరికి డాక్టరు వచ్చిందీ లేదు, పిల్లాడు బ్రతికిందీ లేదు. ఆ దిగులుతో మీనాక్షి ఆరోగ్యం క్షీణించి చిక్కి శల్యమై పోయింది. అంతే మొగుడు ఇంకో స్త్రీతో తిరగనారంభించాడు. లేనిపోని రోగాలు తెచ్చుకొని ఆ నింద కూడా మీనాక్షిపై తోసేసి ఛీదరించుకొని ఇంట్లో నుండి గెంటేశాడు. సమాజం కూడా ఆమెను చిన్న చూపు చూసి ఈసడించుకుందే తప్ప ఒక్కరూ అయ్యో పాపం అన్న వారు లేరు. మీనాక్షి తన పాత జీవితానికి ఈ జీవితానికి ఉన్న తారతమ్యాన్ని బేరీజు వేసుకుని చూసుకొంది. ఎంత డబ్బిచ్చినా నచ్చకపోతే తిరస్కరించే ప్రాథమిక హక్కు ఆ జీవితంలో ఉండేది. అదే మొగుడు నచ్చినా నచ్చక పోయినా నచ్చినట్లు నటిస్తూ, ఆరోగ్యం ధ్వంసమైనా అతని చేతుల్లో నలిగి పోవాలి. తిండికోసం, గుడ్డకోసం, గతి లేనట్టు మొగుడు చెప్పినట్టు వినాలి భోగం వృత్తిలో ఉన్నప్పుడే సుఖంగా జీవించింది. ఉత్తమమైనదని అనుకున్న సంసార జీవితం మీనాక్షి జీవితాన్ని ధ్వంసం చేసింది. ఆ విధంగా మీనాక్షి జీవితం దయనీయంగా ముగిసి పోయింది.

## ఉపసంహారం :

'తారతమ్యం' అనే కథ ద్వారా రచయిత స్త్రీ యొక్క మనస్తత్వాన్ని ఆమె అంతర్మథనాన్ని ఎంతో చక్కగా విశ్లేషించారు. అదే ఒక భోగం స్త్రీని కథా వస్తువుగా తీసుకొని కథను నడిపించిన తీరు అద్భుతం. భోగం స్త్రీ అనగానే ఛీదరించుకొనే సమాజానికి ఆమె కూడా ఒక మనిషేనని ఆమెకు కూడా కొన్ని మనో భావాలు, బాధలు, కన్నీళ్ళు, సంతోషాలు, కోరికలు ఉంటాయని విశదీకరించారు. ఈ కథలో పురుషుని అహంకారం, గొప్ప కోసం నలుగురిలో మెప్పుకోసం మీనాక్షిని పెళ్ళి చేసుకున్న నాగేంద్రం సమయమొచ్చినప్పుడు తన నిజ స్వరూపాన్ని బయట పెట్టి ఎంతటి నీచుడో నిరూపించుకున్నాడు.

కొన్ని చోట్ల రచయిత వర్ణించిన వర్ణన ఎంతో హృద్యంగా ఉంది. 'సుఖ సంతోషాలతో ఉన్నది కులట జీవితం – కష్టాలున్నా కూడా ఇది సాంసార జీవితం' అని మీనాక్షి సర్థుకుపోవడం ఎంతో బాధగా మనసుకు హత్తుకునేట్లు చెప్పారు. ఎంతో విలాసవంతమైన జీవితం గడిపిన భోగం స్త్రీ తన వృత్తిని అసహ్యించుకొని సంసార జీవితాన్ని ఎన్నుకోవడమనే స్త్రీ సహజమైన సున్నితమైన మనస్తత్వాన్ని రావూరి భరద్వాజ గారు మీనాక్షి పాత్ర ద్వారా తెలియజేశారు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# చిరువృత్తుల జీవనగాథల సమాహారం 'జీవనసమరం'

- డా. ప్రకాశరావు జి
అసిస్టెంట్ ప్రొఫెసర్
ఏ.పీ.ఐ.ఐ.ఐ.టి. శ్రీకాకుళం,
ఆర్జీయుకేటి.

రావూరి భరద్వాజ 1927 జూలై 5వ తేదీన కృష్ణాజిల్లా నందిగామ తాలూకా కంచికచర్ల సమీపంలోని మొగులూరు గ్రామంలో రావూరి కోటయ్య, మల్లికాంబ దంపతులకు జన్మించారు. 8వ తరగతి వరకే చదువు కొనసాగింది. తరువాత కమ్మరి కొలిమి సమ్మెటలో, కలప అడితిలో, పొగాకు బారన్'లో బొగ్గు వేసే కూలీగా, రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో సైన్యంలో చేరి సంవత్సరం పాటు సేవలందించారు. యుక్తవయసులో తెనాలి చేరుకుని ఒక ప్రెస్'లో పని చేసారు. 1946లో నెల్లూరులోని జమీన్ రైతు వారపత్రిక సంపాదకవర్గంలో చేరాడు. 1948 మే 28వ తేదీన కాంతంగారితో వివాహం జరిగింది. వీరికి ఐదుగురు సంతానం. 1948లోనే దీనబంధు వారపత్రిక, జ్యోతి, సమీక్ష, అభిసారిక, చిత్రసీమ, సినిమా, యువ పత్రికల్లో 1959 వరకు, కొన్నాళ్ళు ఫౌంటెన్ పెన్నుల కంపెనీలో సేల్స్‌మెన్‌గా పనిచేసాడు. 1959లో హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో ప్రూఫ్'రీడర్'గా చేరి 1987లో ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా పదవీ విరమణ చేసారు.

గొప్ప భావుకుడైన భరద్వాజ కవిగా, రచయితగా అనన్యసామాన్యమైన సాహిత్యాన్ని సృష్టించిన అక్షర యోధుడు. రచనా వ్యాసంగం సామాన్యంగా ప్రారంభించినా విశిష్ట రచనలతో పాఠకుల మెదళ్ళకు పదునుపెట్టిన రచనాశిల్పి. జీవితం, సాహిత్యం రెండూ చెరో కన్నుగా భావించి జీవించిన మహాఋషి. జీవితాన్ని చదువుకున్న వ్యక్తి సాహిత్య లోకానికి ఆణిముత్యాల్లాంటి రచనలు అందించాలంటే డిగ్రీలు అవసరం లేదని నిరూపిస్తూ మిథునం, జాలిగుండె, గాలిపటం, అపరచితులు, కొత్త చిగుళ్లు, లోకం కోసం, పాలపుంత, అన్యథా శరణం నాస్తి, పుత్రకామేష్టి, మానవుడు మరణిస్తున్నాడు, మానవుడు దానవుడు, మనోరమ, నిన్ను గురించి నిజం, సౌందర నందం, స్వయంభువు, శ్రీరస్తు, త్రినేత్రుడు, ఆహుతి, ఒక దోమకథ వంటి కథలను 37 కథల సంపుటాలుగా, కాదంబరి, కరిమింగిన వెలగపండు, జలప్రళయం, పాకుడు రాళ్ళు, చంద్రముఖి, చిత్రగ్రహం వంటి 17 నవలలు, 6 బాలల మినీ నవలలు, విచిత్రపుస్తకం, ఉడుతోపదేశం, కీలుగుర్రం, చిలుకతీర్పు, సముద్ర వీరుడు, మాయలోకం వంటి 5 బాలల కథా సంపుటాలు, ఇనుపతెర వెనుక, మహతి, కంచికి వెళ్ళిన కథ, మొగ్గ తొడిగిన గులాబి, శూన్యం నుండి సృష్టికి వంటి 3 వ్యాస, ఆత్మకథా సంపుటాలు, 8 నాటికలు, 5 రేడియో కథానికలు సాహితీ క్షేత్రంలో పండించి అనేక అవార్డులు అందుకున్నారు.

ఆంధ్రవిశ్వవిద్యాలయం, జవహర్'లాల్'నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, నాగార్జున విశ్వవిద్యా లయం గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసాయి. 1980 ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ, 1983లో కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి కళారత్న అవార్డ్, లోక్ నాయక్ ఫౌండేషన్ అవార్డ్, కేంద్రసాహిత్య అకాడమీ, వంగూరి ఫౌండేషన్, గోపీచంద్ జాతీయ సాహిత్య పురస్కారాలు, 2012లో దేశ అత్యున్నత పురస్కారం జ్ఞానపీఠ అవార్డ్'ను సొంతం చేసుకున్నారు. బ్రతికినంత కాలం ఆకలి, దారిద్ర్యం, కన్నీళ్ళతో జీవన పోరాటం చేసి 2003 అక్టోబర్ 18న పరమపదించారు.

సామాన్య జీవుల జీవితాలలో దాగివున్న కన్నీటి వ్యథలను వెలికితీసి పాఠకులలో మానవత్వాన్ని స్పృశించి, వారి ఆలోచనలకే పదును పెట్టే విధంగా చేసిన అద్భుత ప్రయోగం 'జీవన సమరం'. ఇది 1978 మే 10వ తేదీ నుండి 1979 ఆగష్టు 23 వరకు ఈనాడులో వెలువడింది. జీవన సమర మంటే ఏ పని చేసినా పొట్టకూటి కోసమే కదా అని

తెలియజెప్పారు. విభిన్న వృత్తులు చేసి బ్రతుకులు ఈడుస్తూ జీవించేవారి రోజువారీ జీవనపోరాటాలను ఇతివృత్తంగా తీసుకుని వారి ఆవేదనలకు ఒక రూపం ఇచ్చారు. ప్రభుత్వాలు ఊదరగొడుతూ ప్రకటించే ఉచిత పథకాలకు సవాలు విసురుతూ వాటికి ఆశ పడకుండా 'కూటి కోసం కోటి విద్యలన్నట్లు' జీవన సమరంలోని ప్రతి పాత్ర నిజాయితీని వెతుక్కుంటూ జీవిస్తుంది. బ్రతుకుబండిని లాగడానికి చిరువృత్తులను ఆసరాగా చేసుకుని జీవించే వ్యక్తులు పగలనకా, రాత్రనకా, ఎండనకా, వాననకా రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడుతూ దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. దాని వెనుక ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాలను వివేచించుకుని వారిపట్ల సానుభూతి, ఆత్మీయత, మానవతా దృక్పథంతో చేసిన రచనలు.

బడుగు జీవుల బతుకు పోరాటాన్ని వివరిస్తూ, దానికి కారణమైన పరిస్థితులను, నేపథ్యాన్ని కళ్ళకు కట్టినట్లుగా చిత్రించారు. టిఫిన్ క్యారియర్లు మోసే అంజమ్మ, శిలలను శిల్పాలుగా మలచే అగమయ్య, తాళాలు బాగుచేసే జహింగీరు, కొలిమి దగ్గర పనిచేసుకునే శ్రీరాములు, ఆత్మ గౌరవం కోసం బజ్జీలమ్ముకునే సావిత్రమ్మ, సవరాలు కట్టే రాములు, గొడుగులు బాగుచేసే శంకరయ్య, రాట్నం తిప్పుకునే జాఫర్, కత్తులకు పదును పెట్టే పండరి, గాజు పెంకులు ఏరుకునే ముత్యాలు, సైకిళ్ళు బాగుచేసుకుని బతికే మస్తాను... ఇలా రకరకాల వృత్తులు చేసే వ్యక్తుల జీవితాల్లో ఘనీభవించిన కష్టాల కడగళ్ళను యథార్థంగా చూపుతూ పాఠకుల హృదయాలను ద్రవీకరింపజేసారు.

'అన్నమో రామచంద్రా'లో పేగు తెంచుకుని పుట్టిన బిడ్డలకు కడుపునిండా అన్నం పెట్టటం కోసం పడిన అగచాట్లు చిత్రీకరించారు. బాగా బతికిన అంజమ్మ భర్త మరణంతో తల్లడిల్లిపోతుంది. అయినా పిల్లలకు మంచి భవిష్యత్తు కంటే వారి ఆకలి తీర్చడమే తల్లిగా తన బాధ్యతగా భావించి మధ్యాహ్న భోజన క్యారియర్లు అందిస్తూ జీవనం గడుపుతుంది.

'మరుగున పడిన మానవత'లో ముక్కూ ముఖం తెలియని వాడితో మూడు ముళ్ళు వేయించుకున్న పాపానికి అతనిచే దారుణంగా వంచించబడి జీవితాన్ని పోగొట్టుకున్న సావిత్రి దీనగాథను చూపించారు. ఒకరి చేతిలో మోసపోయినా, ఇతరులకు చేయూతనివ్వడంలోనే జన్మకు సార్థకత కలుగు తుందని నమ్ముతుంది. అందుకు తన కాళ్ళమీద తాను నిలబడడానికి దారి చూపిన వెంకటేశం ఋణం తీర్చుకోవడానికి అతని ముగ్గురు పిల్లల్ని తన పిల్లలుగా భావిస్తుంది. అతనికి భారం కాకూడదని బజ్జీల వ్యాపారం చేస్తుంది.

'నేను సైతం ఇంటి పొయ్యికి'లో రాం రెడ్డికి పంటభూమి ఉండీ శిస్తులు కట్టలేక కూలీగా మారిన వైనాన్ని, పాముకాటు వల్ల ప్రాణాలు కోల్పోతే భార్య పోశమ్మను ఆదుకునే దిక్కులేక ఒంటరిదవుతుంది. ముసలితనంలో ఆసరాగా ఉండాల్సిన చెట్టంత కొడుకులు పెళ్ళిళ్ళు చేసుకుని ఎవరిదారిన వాళ్ళు వెళ్ళి పోతే దిక్కుతోచని పరిస్థితులలో పేడముద్దలు, పిడకలు చేసి అమ్ముకుంటూ, ప్రభుత్వం వారు అయినా ఏదైనా సహాయం అందిస్తారేమో అని ఎదురు చూస్తూ జీవనాన్ని వెళ్ళదీస్తున్న దీనగాథను చెప్పారు.

'రెక్కాడినా డొక్కాడదు'లో ఇనుము ఉపయోగించడం మానవ పరిణామక్రమంలో గొప్ప విజయం. ఇనుము చరిత్ర గతిని మార్చినా దానినే నమ్ముకుని జీవనం సాగించే శ్రీరాములు ఆదాయం మాత్రం గొర్రెతోక బెత్తెడులాగే ఉంది. కత్తులు, కొడవళ్ళు, చెరుకు కత్తులు, గీతకత్తులు ఇలా ఎన్ని తయారు చేసినా, వాటికి సానబెట్టినా చాలీచాలని ఆదాయంతో కడుపునిండా తినడానికే కష్టపడుతున్న తీరు కళ్ళకు కట్టినట్లు రచించారు.

'ఛత్రపాణి'లో ఆకలి మనిషి చేత ఏ పనైనా చేయిస్తుంది. ఆ పని అతడు పెరిగిన పరిస్థితులను బట్టి ఉంటుంది. అందుకు శంకరయ్య జీవితం ఒక ఉదాహరణ. తండ్రి బ్రతికినంత కాలం సాఫీగా సాగిన జీవనం ఆ తరువాత బతుకు బండిని లాగడానికి గొడుగుల మరమత్తులు చేస్తుంటే, భార్య ఐదారిళ్ళల్లో పాచి అంట్లపని చేసుకుంటూ మిగిలితే వారిచ్చింది తింటూ పొట్టపోసుకుంటున్నారు. అందరిని ఎండ, వానల నుండి రక్షిస్తూ తాను మాత్రం చూరుల పంచన తలదాచుకుంటున్న తీరును చిత్రించారు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

'కేశోపనిషత్తు'లో మనిషి అందాన్ని ఇనుమడింపజేసేది తల వెంట్రుకలు. ఆ వెంట్రుకలను చక్కని సవరాలుగా చేసి అమ్ముకుంటూ జీవనం సాగించే రాములు గాథను సాక్షాత్కరింపజేసారు. మురికి పట్టినవెంట్రుకల నుండి వెలువడే దుర్భర భేద్యమైన వాసన ఆ ఇంటి వాతావర ణాన్నంతా మార్చేస్తుంది. ఒకవైపు పిల్లల అనారోగ్యం, రోజంతా కష్టపడినా చాలీచాలని ఆదాయం మరోవైపు ఈ రెండు చిక్కు ముడులు విప్పుకోవడానికి వెంట్రుకల చిక్కులు తీసి జీవించే రాములు దీనావస్థను, హృదయ విదారక మైన స్థితిని చూపించారు.

సారె సారెకున్, కుడి ఎడమల దగాదగా, గొడ్డుచాకిరి %--% గుడ్డక్కరువు, వెదురుతో వేయి రకాలు, తప్పెట్లోయ్... తాళాలోయ్, ఖరీదు కట్టే షరాబు లేదు, భ్రమణం-పరిభ్రమణం, వెలుగుల బడి విరిసేప్పుడు, మనిషికన్న మృగం నయం, చచ్చులూ, పుచ్చులూ, గడ యెక్కినా గడప గడపెక్కినా, ఎరుకోయమ్మ ఎరుక, చేదు విషం... జీవ ఫలం, ఆర్చేదెవరు? తీర్చేదెవరు?, ఇంతేలే పేదల బతుకులు, భయం... భయం... బతుకు భయం, గాజు పెంకుల నడుమ బూజు బతుకును చూడు, దూడూ బసవన్న, బండ బారిన మొండి బతుకులు, ఒకటికి 15 లక్షలు, రూపాయిస్తే మెరుపు మెరిస్తే, బోడి పెత్తనం బొమ్మలాట, ఏమున్నది గర్వకారణం, ఊరు ఉండమంటున్నది, కాయకల్ప చికిత్స, బతుకు కోసం బహుకృత వేషాలు, మిలమిల మెరిసే గాజుల గలగల, తలకుండు విషము ఫణికిని అనే శీర్షికలలో సంఘంలోని వివిధ వృత్తులవారి జీవనసమరాన్ని చిత్రించాడు.

'జీవన సమరం' అక్షరీకరించడంలో నిరుపమానమైన శ్రద్ధను చూపి, సాహిత్యంలో సామాన్యులకు స్థానం కల్పించిన ఘనత రావూరికే దక్కుతుంది. నిజానికిది బతుకు బాటలో బడుగుజీవికి దక్కిన అరుదైన గౌరవం. అభాగ్యుల దుర్భర జీవితాలను ఎత్తిచూపుతూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రచయిత పరిష్కారాలు సూచిస్తూ, సామాజిక ఆర్థిక పరిస్థితుల మార్పుతోనే వారి కష్టాలు గట్టెక్కుతాయని స్పష్టం చేసారు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# పలుపార్శ్వాల అంతరంగ విశ్లేషణ – 'కాదంబరి'

- డా॥ గొట్టిముక్కల స్వర్ణలత
ఆంధ్రోపన్యాసకురాలు,
ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), గుంటూరు.

సాహిత్య సృజన ద్వారా సత్యాన్వేషణ ఏకైక లక్ష్యమైన కవి, రచయిత డా॥ రావూరి భరద్వాజ. జీవితపు కఠోర సత్యాలను జీవన సమరంగా వర్ణించినా, మిథ్యాజీవన పరి తృప్తుల్ని పాకుడురాళ్ళపై నిలబెట్టినా, స్వార్థరాజకీయ ఎత్తు గడలను కాదంబరిని చేసినా ప్రాణాధికమైన అర్థాంగి స్మృతు లను ఏకాంతంగా పలవరించినా...అన్నిటా జ్ఞానపీఠాన్ని అధిరోహించిన మహనీయుడు డా॥రావూరి భరద్వాజ.

కథకుడిగా, నవలా రచయితగా ఆయనది చెరగని స్థానం. జీవితపు నగ్న సత్యాలను వాస్తవికంగా ఆవిష్క రించడం ఆయన ప్రత్యేకత. స్వజీవనంలోని పతనోత్థానాలు, విస్తృత జీవితానుభవాలు, తాను పరిశీలించిన సమాజం ఆయన రచనకు సహజత్వాన్ని తెచ్చిపెట్టాయి. కాదంబరి నవల సామాజిక సమస్యలను వాస్తవికంగా చిత్రిస్తుంది. అంచెలంచెలుగా పేరుకు పోయిన కుటిల రాజకీయాలను కళ్ళముందుంచుతుంది. విశృంఖల జీవనం కన్నీళ్ళతో ప్రక్షాళన అయ్యే క్రమాన్ని విశదీకరిస్తుంది. అవధులులేని మనిషి మంచితనాన్ని విస్తరిస్తుంది.

సమాజంలో మూడొంతులు ఉన్న సామాన్యుల అభివృద్ధే నిజమైన సమాజాభివృద్ధి అన్న ఎరుక కలిగిన భరద్వాజ ఆ దిశగా కాదంబరిలో తన ఆలోచనలను విస్తరించారు. ప్రాజె క్టులు, పరిశ్రమల నిర్మాణాల పేరుతో సాగే అక్రమ భూసేక రణలు, దోపిడీలను బహిర్గతం చేశారు. పేదలకు అందాల్సిన ఫలాలు కుటిల రాజకీయాల కారణంగా దారి మళ్ళడాన్ని ఎత్తిచూపారు. బడుగులపై, నిర్మాణ కార్మికులపై దళారీల పెత్తనం ఫలితంగా వారి పరిస్థితి నానాటికీ దిగజారి గుప్పెడు మెతుకులకై అర్రులుచాచే హీనస్థితిని హృదయవిదారకంగా వివరించారు.

అట్టడుగు స్థాయినుంచి అవకాశాలను అందిపుచ్చు కుంటూ అత్యున్నత స్థానాన్ని చేరుకున్న రామకృష్ణయ్య ఈ నవలలో ప్రధాన పాత్ర. వ్యవహారదక్షతతో సాహసోపేతంగా జీవించిన వ్యక్తి. తన మంచితనాన్ని దుర్వినియోగం చేసినా, నమ్మించి మోసం చేసినా చూసీ చూడనట్లుండి వారిని దూరంగా ఉంచడంలో నేర్పరి. కష్టజీవుల, రైతుల కష్టాల్లో పాలుపంచుకుంటూ తన మానవత్వాన్ని నిరూపించు కున్నారు. వారివల్లే తాను ఎదిగిన క్రమాన్ని గుర్తుపెట్టుకొని రైతుల బాగుకోసం మయూరాక్షి ప్రాజెక్ట్ నిర్మాణం జరగాలని తపించాడు. మామగారి ఆస్తిని తృణప్రాయంగా భావించి అనాథాశ్రమానికి ధారాదత్తం చెయ్యడంలో ఆయన ఆత్మాభి మానం కనిపిస్తుంది. అయితే No man is perfect అనే విషయం భరద్వాజకు బాగా తెలుసు. అందుకే పిల్లల పెంపకం విషయంలో అతడు విఫలమైన విషయం, మయూ రాక్షి ప్రాజెక్టును అడ్డంపెట్టుకుని దళారులు సంపాదించు కుంటున్న ఆస్తులపట్ల గూడుకట్టుకుంటున్న అసూయ, అనేక రాజకీయాల నేపథ్యంలో తాను కోల్పోయిన ప్రాధాన్యత పట్ల అసహనం, వదులుకోలేని స్వార్థం లాంటి విషయాలను సందర్భోచితంగా తెరపైకి తెస్తారు రచయిత. బాగా గమనిస్తే ఈ నవలలోని ప్రతిపాత్రా నిజజీవితంలోని మంచి, చెడుల సమాహారమే.

రెండో ప్రధానపాత్ర కౌముది. ఈమె రామకృష్ణయ్య గారాలపట్టి. తన సౌందర్యాన్ని ఎరచూపి మగవాళ్ళను తన చుట్టూ తిప్పుకోవడం ఆమె హాబీ. పాడుబడ్డ భవనంలో పరిచయం అయిన జగన్నాథాన్ని రెచ్చగొట్టి కాసేపట్లోనే అతనికి శరీరాన్నప్పగించిన కౌముది విశృంఖల మనస్తత్వా నికి ప్రతీక. ఈ పాత్ర చిత్రణలో చలం ప్రభావం కనిపిస్తుంది. పురుషుడి సాహసం, ధైర్యం, తెగువ ఆమె సొంతం. "నువ్వు సంపాదించిన డబ్బు ద్వారా, నీకు సుఖమూ, ఆనందమూ రాకపోతే అవి పొందడం నీకు చేతగాకపోతే ఆ డబ్బంతా తగలేయడం మంచిదని నా ఉద్దేశం", అంటూ తండ్రిని

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

వ్యాపార సంబంధమైన లావాదేవీల నుండి వైదొలగి, మయూరాక్షి ప్రాజెక్టుపై మనసు లగ్నం చేసేలా ప్రోత్స హిస్తుంది. రాజకీయ నాయకులతో ఆయనకు ఉన్న అను బంధాన్ని ఆసరాగా చేసుకొని ప్రాజెక్టు కట్టడానికి అను మతులు సాధిస్తుంది. అందరి మనస్సులనూ పుస్తకం చదివి నట్లు చదివేయగల శక్తి ఉన్న కౌముది శంకరం విషయంలో మాత్రం దెబ్బతింటుంది. అతడిని ఆకర్షించాలని ప్రయ త్నించి తనే అతడి ఆకర్షణలో పడిపోతుంది.

మరో పాత్ర శంకరం. పట్టుదల గల యువ ఇంజనీరు. మయూరాక్షి ప్రాజక్టు అవసరాన్ని గుర్తించి కాటన్ దొర ఆలోచనలను, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, శొంఠి రామ్మూర్తి పంతులుగారి నివేదికలు చదివి ఎవరు పూనుకుంటే ప్రాజెక్టు సాధ్యమౌతుందో అంచనా వేసి రామకృష్ణయ్యతో ముందంజ వేయించగల చోదక శక్తి కౌముదిని ఆకర్షిస్తాడు. అతని ప్రణాళిక ప్రకారమే ప్రాజెక్టు సాకారమయ్యే పరిస్థితులు నెలకొంటాయి. అతడు ప్రాజెక్టు ఇంజనీరుగా నియమింప బడతాడు. జగన్నాథంతో అతడు మాట్లాడుతూ "నాకీ ప్రాంతంలో సెంటు భూమి కూడా లేదు. ఇక్కడి జనం తిన్నా, తినకపోయినా, పండినా, ఎండినా ఇంజనీరుగా నా జీతం నాకొస్తుంది. ఒక సత్కార్యం చేసే అవకాశం, అధికారం భగవంతుడు మనకిచ్చినప్పుడు దాన్ని సద్వి నియోగం చేయడం న్యాయమని మాత్రమే నా అభిప్రాయం" అన్న మాటలు అతడి మంచితనాన్నీ, సమాజం పట్ల బాధ్యతనీ వెల్లడిస్తాయి. అనేకస్వార్థ శక్తుల ప్రభావం వల్ల అతడనుకున్న పద్ధతిలో నిర్మాణం జరగకపోవడం పట్ల అతడు పొందిన ఆవేదనలో అతడి నిజాయితీ వ్యక్త మౌతుంది. కౌముదిని ఇతడర్థం చేసుకున్నంత చక్కగా మరె వరూ అర్థం చేసుకోలేరు. "నా దృష్టిలో కౌముది శుద్ధ వెర్రి బాగుల్ది. తెలివిగా బతకడం, సుఖంగా బతకడం ఆవిడకు చేతకాదు చాతనయిందయితే తనకెవరెవరితో ఎలాంటి సంబంధాలున్నాయో, అవన్నీ ఎలా ఏర్పడ్డాయో తనక్కా బోయే మొగుడుతో చెబుతుందా? ఇలాంటి అమాయకురాలు ఇంకెవరి చేతుల్లోనయినా పడితే సర్వనాశనమైపోతుందన్న భయం నాకేర్పడింది. నేను తప్ప ఇంకెవ్వరు పెళ్ళాడినా కౌముది జీవితం నరకప్రాయంగా తయారయి ఉండేది. తప్పో ఒప్పో తను చేసిందేమిటో కుండ బద్దలుకొట్టినట్లు చెప్పగల ధైర్యం, నిజాయితీ కౌముదిలో ఉన్నాయి. ఈ బంధం ఎంతదాకా బిగుసుకుపోయిందంటే ఆవిణ్ను సంతోష పెట్టడంకన్నా, నాకు జీవితంలో మరో లక్ష్యం లేకుండా పోయింది. ఏం చేస్తే ఆవిడ సుఖంగా ఉంటుందో అవన్నీ నిస్సంకోచంగా చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను. అందు వల్ల మానసికంగా నేనొక్కొక్కసారి చాలా క్షోభ పడవలసి వస్తున్నది. అదెక్కడా బయటపడకుండా నేను తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ తీసుకుంటున్నాను అంటూ కౌముదిపై అంతులేని అభిమానాన్ని పెంచుకుంటాడు శంకరం. కౌముది అనాలోచిత పనులవల్ల ఆమె జీవితం ఏమౌతుందో అన్న పాఠకుల బెంగను శంకరం తీర్చేస్తాడు.

ఈ నవలలో చెప్పుకోదగిన మరో పాత్ర జగన్నాథం. ఈ పాత్ర నిడివి తక్కువైనా ప్రభావశీలమైన పాత్ర. జర్న లిస్టుకు కావలసిన ఉత్సాహం, సాహసంతో పాటు మనుష లను చదవగలిగిన నేర్పు, ఎదుటి వ్యక్తిని సరిగా అంచనా వేయగలిగిన నైపుణ్యం ఇతని సొంతం. మొదట్లో కౌముది మాయాజాలంలో చిక్కుకున్నా శంకరంతో వివాహమయ్యాక కూడా ఆమెలో మార్పు రాలేదని, శంకరం నిర్మోహమాట ధోరణి పట్ల ఆమె అసంతృప్తితో ఉందని గ్రహించి అతడన్న మాటలు ఆమె కళ్ళుతెరిపిస్తాయి. "శంకరాన్ని నువ్వు కావాలనే పెళ్ళాడావు లేదా ఆయనతో లేచిపోయావు. ఆపని చేయడానికి ముందునుంచీ అతని స్వభావం నీకు తెలిసిందే. అప్పుడా స్వభావాలు, లక్షణాలు నీకు నచ్చాయి. లేచి పోయావు. ఇప్పుడవి నీకు పనికిరావడం లేదు. అంటే అతను నీ అభిరుచులకను గుణంగా మారలేదని నీ గోల. ఒకవేళ నువ్వు చెప్పినట్లుగా అతను మారాడను కొందాం. శతకోటి మనుషుల్లాగా అతను కూడా సగటువారీ మనిషి అయ్యాడను కొందాం. విసుగు, చిరాకు, కోపం, అసూయ, ఈర్ష్య, చెయ్యి చేసుకోవడం, బతిమిలాడ్డం... ఇంతకు ముందు నువ్వు కోరినవన్నీ అతనిలో ఉన్నాయను కుందాం! అప్పుడు కూడా సుఖపడలేవు. కావాలంటే నేను రాసిస్తా... అప్పుడేమంటావో గూడా చెప్పనా. ఈ శంకరం ఉత్త దొంగవెధవనీ, పెళ్ళయిం

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

దాకా చాలా గొప్పవాడుగా ఫోజులు పెట్టి తనను మోసం చేశాడనీ తీరాచూస్తే శతకోటి సగటువారీ మనుషుల్లో అతనుకూడా వొకడనీ... నువ్వం టావు" అంటాడు. ఈ మాటలు కౌముది అంతరంగాన్ని ఆమెకు అద్దంలో చూపించి ఆమెలో మంచి మార్పుకు కారణ మౌతాయి... "నీలాంటి దానికి అన్నీ ఉన్నా సుఖపడలేక పోతున్నదీ అంటే జీవితం నుండి సుఖాన్ని పిండుకోగలిగిన నైపుణ్యం నువ్వు పోగొట్టుకొని ఉండాలి". అంటూ ఆమెలో ఆలోచనలు రేకెత్తిస్తాడు. కౌముది, శంకరం దాంపత్యం చక్కగా కొనసాగా లని కోరుకుంటాడు. అందుకే శంకరం తామిద్దరినీ ఏకాం తంగా వదిలినా, కౌముది రెచ్చగొట్టినా తన స్థిరత్వాన్ని వీడక కౌముదితో దేవుడనిపించుకుంటాడు. పైగా శంకరంతో "ఆ మాట నాగురించి కాక మీగురిం చయితే నేను పరమా నందభరితుణ్ణయ్యేవాణ్ని" అంటాడు జగన్నాధం. నిజంగానే దేవుడి లాంటి వాడు జగన్నాధం. నవలంతా చదివాకగానీ ఈ నవలకు కాదంబరి నామౌచిత్యం బోధపడదు. ఆడు కోయిల, గోరువంక, మద్యం, నవల అనే వివిధార్థాలున్న కాదంబరి స్వార్థం అనే మత్తులో మనిషి మోసం, దగా, కుళ్ళు, కుతంత్రాలతో మరో మనిషిని దెబ్బతీయడాన్ని, ప్రతి మనిషిలోనూ రెండు ముఖాలు అవసరానికి తగినట్లు ఎలామారతాయో వివరిస్తుంది. అంతే కాకుండా ఎదుటి వ్యక్తి తప్పొప్పులను సైతం మరచిపోయి ఆత్మక్షోభను సైతం పక్కనపెట్టి ఆమె సుఖం కోసం ప్రాకులాడే మంచితనాన్ని, చిత్తచాంచల్యాలను పక్కనపెట్టి నిస్వార్థంగా మనిషిని ఉన్నత పథం వైపు మార్గనిర్దేశం చేసే దైవత్వాన్ని ఎత్తి చూపుతుంది కాదంబరి. ఇన్ని రకాల మనస్తత్వాలను విస్తృతంగా విశ్లేషిం చిన ఈ నవలను గొప్ప మనోవైజ్ఞానిక శాస్త్రంగా పరిగణింప వచ్చు. డా॥ రావూరి భరద్వాజ ప్రతి పాత్రలోనూ పరకాయ ప్రవేశం చేసి ఈ నవలను సజీవ పాత్రలతో, సజీవ సంఘ టనలతో జీవితానుభవాల సమాహారంగా తీర్చిదిద్దారు. తెలుగు నవలా సాహిత్యంలో కలకాలం నిలబడగలిగిన నవల కాదంబరి.

# రావూరి భరద్వాజ నవలా సాహిత్యం - "పాకుడురాళ్ళు"

- పి. హంసమ్మ
పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం,
ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

రావూరి భరద్వాజగారు తెలుగులో లఘు కథా రచయిత, నవలా రచయిత, రేడియో రచయితగా పేరు తెచ్చుకున్నాడు. గొప్ప భావుకుడైన తెలుగు కవి మరియు రచయిత రావూరి భరద్వాజ. తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియలకు శ్రీకారం చుట్టిన ఘనుడు రావూరి భరద్వాజ. ఆడంబరాలు లేని సాధారణ జీవితం ఆయనది. వెయ్యేళ్ల తెలుగు సాహిత్య చరిత్రకు అచ్చంగా, అట్టడుగు వర్గాల యథార్థ చరిత్రలతో నిండిన మొట్టమొదటి గ్రంథాన్ని చేర్చిన ఘనత రావూరి భరద్వాజ గారికి దక్కింది.

రావూరి భరద్వాజగారు అసామాన్య రచయితగా చెప్పవచ్చును. రావూరి భరద్వాజగారు సామాజిక దృక్పదంను వస్తువుగా తీసుకొని రచన చేయడం జరిగింది.

## "నవల సాహిత్యం-పాకుడురాళ్ళు"

రావూరి భరద్వాజ రచనలలో "పాకుడు రాళ్ళు" నవల చాలా విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్నది. చలన చిత్ర పరిశ్రమను వస్తువుగా చేసుకొని తెలుగులో వెలువడిన మొట్టమొదటి నవల "పాకుడు రాళ్ళు". రావూరి భరద్వాజ గారు దీనికి "మాయజలతారు" అనే మరొక పేరును పెట్టారు. రావూరి భరద్వాజగారు రాసిన ఈ నవలకు 2013 లో సాహిత్యంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన "జ్ఞానపీఠ పురస్కారం" లభించింది. తెలుగు సినిమా రంగంలో నటీ నటులు, నిర్మాతలు, దర్శకులు, కవులు, రచయితలు, జూనియర్ ఆర్టిస్టులు, వాళ్ళ సప్లయర్స్, ప్రొడక్షన్ కంట్రోలర్స్, డిస్ట్రిబ్యూటర్లు, ఫైనాన్సర్లు... ఇలా సినిమారంగంలో పనిచేసే సమస్త జీవుల వాస్తవిక జీవన చిత్రణ రావూరివారు రచించిన "పాకుడురాళ్ళు".

సినిమా రంగంలో "సినిమా" అనేది ఒక రంగుల ప్రపంచం. చాలామంది తమని తాము వెండితెర మీద చూసుకోవాలనె కలలు కంటుంటారు. ఆ కలలు నెరవేరటం కోసం ఎంతో కష్టపడుతారు. చివరికి తమని తాము అమ్ముకుంటారు. "పేరు ప్రఖ్యాతులు, డబ్బు, దర్పం, సంఘంలో గౌరవ మర్యాదలు, పలుకుబడి ఇవన్నీ తెచ్చిపెట్టగల శక్తి సినిమా రంగానికి ఉందని నమ్ముతారు. అందుకే కాబోలు సినిమాలన్నా, సినిమా వాళ్ళన్నా ఆశక్తి చూపించని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారు.

ఆ రోజుల్లో సినిమా రంగంలో తెరవెనుక జరిగే రాజకీయాలనీ, ఎత్తుకు పై ఎత్తులనీ, సినిమా రంగంలో తమ పట్టును నిలుపుకోవటం కోసం రకరకాల వ్యక్తులు చేసే ప్రయత్నాలనే  నవలా రూపంలో అక్షరబద్ధం చేశారు. రావూరి భరద్వాజగారు పాకడు రాళ్ళు నవలలో కేవలం మంజరిగా మారిన మంగమ్మ కథ మాత్రమే కాదు, తెలుగు సినిమా నిర్మాణం ఊపందుకున్న రోజుల్లో ఆ పరిశ్రమలో పాలు పంచుకున్న ప్రతి ఒక్కరిదీ ఈ కథ. ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటూ కూడా అవసరార్థపు స్నేహాలు నటించే ఇద్దరు అగ్ర హీరోలు, అగ్రనాయికగా ఎదిగాక, అగ్ర హీరోలతో నటించనని ప్రకటించి కొత్త నాయకులని పరిచయం చేసే నాయిక, సినిమా వాళ్ళను బెదిరించి పబ్బం గడుపుకునే సినీ విలేఖరి, ఇలా సినిమా రంగంలోని అనేకుల జీవన చిత్రణ ఈ పాకుడురాళ్ళు నవలలోని వస్తు వైవిధ్యం.

## నవలా స్వరూపం :

ఈ నవలలోని కథ చూసినట్లైతే కథా స్థలం గుంటూరు సమీపంలో ఓ పల్లెటూరు. కథా కాలం పద్య నాటకాలు అంతరించి సాంఘీక నాటకాలు అంతగా ఊపందుకోని రోజులు, ఆ రోజుల్లోనే నాటకాలంటే ఆసక్తి ఉన్న మాధవ రావు, రామచంద్రం కలిసి నవ్యాంధ్ర కళా మండలి ప్రారంభించి సాంఘీక నాటకాలు ప్రదర్శించాలి అనుకుంటారు. వాళ్ళ నాటకాల్లో స్త్రీ పాత్రలు ధరించడం కోసం వస్తుంది పదిహేనేళ్ళ మంగమ్మ. బళ్ళారి రాఘవ ట్రూపులో పని

చేశానని చెప్పుకునే నాగమణి పోషణలో ఉంటుంది మంగమ్మ. అప్పటికే మంగమ్మ మీద సంపాదన ప్రారంభించిన నాగమణి నాటకాల్లో అయితే ఎక్కువ డబ్బు రాబట్టుకోవచ్చునని ఈ మార్గం ఎంచుకుంటుంది. మాదవరావు – రామచంద్రం తర్ఫీదులో మంచినటిగా పేరు తెచ్చుకుంటుంది మంగమ్మ. కళామండలికి మంచి పేరు రావడంతో నాగమణికి కొంత మొత్తం చెల్లించి మంగమ్మని చెర నుండి విడిపిస్తారు మిత్రులిద్దరూ.

కొంత కాలానికి కళామండలి మూతపడే పరిస్థితి వస్తుంది. మంగమ్మ తిరిగి నాగమణి కంపెనికి వెళ్ళిపోదాం అనుకుంటుండగా మద్రాసు నుండి వచ్చిన పాత మిత్రుడు "చలపతి" తనో సినిమా తీస్తున్నాననీ మంగమ్మ అందులో నాయిక అని చెప్పి ఆమెని మద్రాసు తీసుకెళతాడు. చలపతి సినిమా తీయకపోయినా మంగమ్మకి వేషాల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తాడు. స్వతహాగా తెలివైనదీ, మగవాళ్ళని కాచి వడపోసినదీ అయిన మంగమ్మ సైతం మొదట్లో ఆసక్తి చూపకపోయినా సినిమా హీరోయిన్ల వైభవం, ఐశ్వర్యం చూశాక తను కూడా హీరోయిన్ అవ్వాలని నిర్ణయించుకుని తీవ్రంగా ప్రయత్నాలు మొదలు పెడుతుంది. ఈ క్రమంలో సిద్ధాంతి సూచన మేరకు తన పేరు మంజరిగా మార్చుకుంటుంది. వేషాలు రానప్పుడూ, వచ్చి జారీపోయినప్పుడూ మంజరి నిర్ణయం మరింత పదునెక్కుతుంది. మెల్లగా అవకాశాలు సంపాదించుకుని నాయికగా పేరు తెచ్చుకుని తక్కువ కాలంలోనే అగ్రశ్రేణి నాయికగా ఎదుగుతుంది మంజరి. చలపతిని ఓ సెక్రటరీగా మాత్రమే చూస్తుంది. మాధవరావు – రామచంద్రం మీద, కష్టకాలంలో తనిని ఆదుకున్న వాళ్ళమీద అంతులేని కృతజ్ఞత చూపుతుంది మంజరి.

అగ్రహీరోలతో కయ్యం పెట్టుకొని దానివల్ల తనకి పోటీగా మరో నాయిక తయారవుతున్నప్పుడు కయ్యాన్ని నెయ్యంగా మార్చుకున్న, తనని సినిమా నుంచి తీసేయాలని ప్రయత్నించిన నిర్మాతలకు ఊహించని విధంగా షాక్ ఇస్తుంది. తెలుగులో అగ్ర స్థానంలో ఉండగానే హిందీ అవకాశాల కోసం ప్రయత్నాలు మొదలుపెడుతుంది మంజరి. ఇందుకోసం తన పరిచయాలను తెలివిగా వాడుకుంటుంది. భారతదేశం తరపున సాంస్కృతిక రాయబారిగా అమెరికా వెళ్ళిన మంజరి మార్లిన్ మన్రోని కలుసుకున్న మంజరి సినీ నాయికలందరి జీవితాలూ ఒకేలా ఉంటాయన్న సత్యాన్ని తెలుసుకుంటుంది.

మంజరి ప్రియుడు కిషన్‌దాసును పోలీసులు అరెస్ట్ చేస్తారు. పోలీసుల బారినుండి తప్పించుకోవటానికి ఢిల్లీలో ఒక ప్రముఖ వ్యక్తి అయిన "సక్సేనా" సహాయం కోరింది. సక్సేనా ప్రతిఫలంగా మంజరిని "బ్లూఫిలిమ్"లో నటించమని కోరగా మరో మార్గంలేక సక్సేనా కోరినట్లు "బ్లూఫిలిమ్" లో నటిస్తుంది. సక్సేనా అంతటితో ఊరుకోకుండా ఆ బ్లూఫిలిమ్‌ను బయటపెడతానని భయపెట్టడంతో ఆందోళనను, భయాన్ని తట్టుకోలేక నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకుంటుంది మంజరి. మంజరిని చూడటానికి వచ్చిన ఆమె చిన్ననాటి నేస్తం మాధవరావు ఆమె మరణ వృత్తాంతం తెల్పటంతో "పాకుడురాళ్ళు" నవల పూర్తవుతుంది.

సినిమా రంగంలో ఉండే పరిస్థితులను భరద్వాజగారు పూసగుచ్చినట్లుగా తెలిపారు. నా అనేవాళ్ళు లేని మంజరి దీనస్థితిపై చాలా జాలి కలుగుతుంది. సినిమా నటి అయ్యాక సర్వైవల్ కోసం పైకిపోయ తారగా వెలుగొందటం మంజరి ఎత్తుగడలు, యుక్తులు, ఎంతకైనా తెగించటము, దిగజారటమూ గమనిస్తే జీవిత పోరాటంలో ఆమె గెలుపు, ఓటములు తెలుస్తాయి. మార్లెన్ మన్రో జీవితంలాగే అర్థాంతరంగా ముగిసిపోయిన మంజరి జీవితం కరుణ రసభూరితమైనదని చెప్పవచ్చును. "పాకుడురాళ్ళు" నవల తెలుగు సాహిత్యంలో ఉత్తమ నవలగా స్థానాన్ని సంపాదించుకున్నదని చెప్పవచ్చును.

# 'రావూరి' అంతరంగ మథనం – 'ప్రాస' కథ

- రమేష్ దాసరి
పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

- కె. బలరామ్
పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

## ఉపోద్ఘాతం :

తెలుగు సాహిత్య జగత్తులో విరిసిన కుసుమాల వంటి రచయిత్రులలో అజరామరమైన కీర్తి సంపాదించిన వారు కొద్దిమంది. అందులో రావూరి భరద్వాజ ఒకరు. రచయితగా, లఘుకథలను, నవలలను, వ్యాసాలను, నాటికలను, ఆత్మకథలను, కథానికలను రచించారు. వీరి రచనలు సుమారు 150 వరకు ఉన్నాయి. విస్తారమైన కృతులను రచించి, సాహిత్య చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేకస్థానాన్ని నిలబెట్టుకున్నారు. వీరు రచించిన రచనల్లో 'పాకుడు రాళ్ళు' రచన రచయితగా ఆయనకు గౌరవస్థానాన్ని నిలబెట్టింది. ఈ రచనకుగాను వీరు జ్ఞానపీఠ అవార్డును పొందుకున్నారు.

## 'రావూరి' జీవితం :

రావూరి భరద్వాజ కృష్ణాజిల్లాలోని కంచికచర్ల సమీపంలో మోగులూరు గ్రామంలో కోటయ్య, మల్లికాంబలకు జన్మించారు. తొలినాళ్ళలో రావూరిపై చలం గారి ప్రభావం ఎక్కువగా ఉండేది. మొదటి నుంచి పత్రికల్లో పనిచేయటం వల్ల రచనల మీద ఆసక్తిని పెంచుకున్నారు. అనంతరం ఆకాశవాణిలో ప్రూఫ్‌రీడర్‌గా చేరి, ప్రయోక్తగా పనిచేసి పదవీ విరమణ పొందారు.

రావూరి వారు రాసిన రచనలు చాలావరకు చలం రచనలను అనుకరణగా కనిపిస్తుంది. యుక్త వయస్సులో నాడు రచించిన వాటిలో ఎక్కువగా లైంగిక ప్రాధాన్యత ఉన్నవే ఎక్కువ. అనంతరం తన పరిధి మార్చుకుని వివిధ కోణాలలో బాలలకు సంబంధించినవి, వ్యక్తిత్వ చిత్రణను సూచించే రచనలను చేశారు. వీరు రాసిన అనేక లఘు కథలలో 'ఉన్నది–ఊహించేది' అనే కథాసంపుటి ఒకటి. దానిలోని కథలలో చివరిది, విశిష్టమైనది 'ప్రాస' అనే కథ. దానిలో రావూరి వారి అంతరంగంలో చెలరేగిన ఒక సంఘటన వల్ల ఎదుర్కొన్న మానసిక క్షోభ కనిపిస్తుంది.

## ప్రాస – ఇతివృత్తం :

'ప్రాస' కథ రావూరి వారు రచించిన 'ఉన్నది – ఊహించింది' అనే కథల సంపుటిలోనిది. దీని ఇతివృత్తం విషయానికి వస్తే కథంతా ఉత్తమ పురుష కథనంలో సాగుతుంది. రచయిత తాను బయట విహారానికి, పార్కుకి వెళ్ళినప్పుడు అక్కడ ఒకరి జేబులోంచి పర్సును దొంగిలిస్తాడు. దానిలో 634/– రూపాయలు, మందుల చీటి, కొన్ని చిల్లర నాణేలు, రైల్వే వారిని మోసం చేసి దాచిపెట్టిన టిక్కెట్టు మొదలైనవి ఉన్నాయి. ఆ పర్సు కలిగిన వ్యక్తి తన పర్సు పోయిందనే విషయం గమనించేసరికి ఇతను దూరంగా వెళ్ళాడు. ఆ వ్యక్తి అరచి అందరినీ పిలిచినప్పుడు వారు దగ్గర్లో ఉన్న ఒక పేదవాడిని దొంగ అని తెచ్చి, చితకబాదారు. రచయిత ఈ విషయం గమనిస్తూ పేదవాడిపైన కొంత జాలిని కనబరుస్తున్నాడు. తనకు దక్కవలసిన తన్నులు, అతనికి తగిలినందుకు బాధపడ్డాడు.

అక్కడ నుండి వెళ్ళిపోయిన తరువాత ఆ తన్నులు తిన్న కుర్రాడిని చూసి ప్రేమగా, ఓదార్పుగా రెండు మాటలు మాట్లాడాలని ప్రాసతో కూడిన కొంత పదజాలాన్ని మనస్సులో అనుకున్నాడు. కాని అతను కనిపించలేదు. అప్పటి నుండి ఈ పని చేసినందుకు తనలో తాను కుమిలిపోతున్నాడు. ఎక్కడికి వెళ్ళినా అక్కడ తనలాంటి వారెవరో తనను వెంబడిస్తున్నట్లుగా భావిస్తూ వచ్చాడు. అతడి వలన విసుగు చెంది అతడిని చంపేయాలన్నంత కోపాన్ని పెంచు

కుంటాడు. కాని అతను ఎప్పుడు తనలోనే వుంటూ, ఎక్కడకు వెళ్ళినా వస్తుండడాన్ని, మధ్యాహ్నం వేళ మాత్రం కనిపించకపోవటం అతనికి విసుగును, బాధను కలిగించింది.

అతను ఎవరో కాదు అతని అంతరాత్మ. తప్పు చేసిన తన అంతరాత్మ వేధిస్తుంది, వెంబడిస్తుంది. తాను చేసిన తప్పుకి ఏ పాపం తెలియని ఒక అమాయకుడు చావు దెబ్బలు తిన్నందుకు మనస్సులో అంతర్మథనానికి గురైన తనం కనిపిస్తుంది.

**'ప్రాస' కథ – సమాజ చిత్రణ :**

ఈ కథలో రచయిత సమాజంలోని మనుషుల ప్రవర్తనను, వారి స్వభావాన్ని చిత్రించారు. మనిషి కంటికి అందంగా కనపించే దానికి గౌరవం ఇస్తాడు. ధనవంతులను అందరూ గౌరవిస్తారు. పేదవాడిని మరొక పేదవాడు కూడా గౌరవించడు. మనిషికి పై పై కనిపించే మెరుగులే గౌరవాన్ని ఆపాదిస్తాయి. అందుకే ఈ కథలో రచయిత మంచి వస్త్రాలు ధరించి, మంచి మంచి పదాలను వాడుతూ మాట్లాడటం వల్ల పర్సు దొంగిలించిన తనను ఎవరూ అనుమానించలేదు. ఎవరో రోడ్ల మీద అనాథగా ఉన్న ఒక అమాయకపు యువకుడిని అనుమానించి అతడిని కొట్టారు.

ఇదంతా గమనించిన రచయిత తప్పుచేసింది తానే అయినా ఆ సమయంలో ఒప్పుకోలేదు సరికదా తాను కూడా ఆ యువకుడిపైనే నేరం మోపి, తానూ ఓ చేయి వేశాడు. అలాంటి పరిస్థితులలో ఎవరైనా నిజం ఒప్పుకోవడానికి భయపడతారు. కాని తప్పు చేసినానన్న భావన, తన్నులు తిన్న కుర్రవాడి మీద జాలితో అతడిని కొంత ఓదార్చేందుకు తరువాత వెదుకుతాడు. అతను కనిపిస్తే 'సోదరా! భారతదేశం 'భూతదయ'కు ప్రసిద్ధి వహించింది. మహత్తరమైన మన సాంప్రదాయాన్ని నిలబెట్టావు. భారత యశోలాలమకు ఖండఖండాతరంబుంగల కీర్తి సౌధమునకు నీ వోక వెలలేని మండపంబయితివి. నీ కీర్తి ఆచంద్రతారార్క మీ వసుధతలంబున నిలచుగాక' అంటూ ఆశీర్వదించాలని అనుకోవటం వెనుక పశ్చాత్తాప భావన కనిపిస్తుంది. కాని అతను కనిపించకపోవటం వల్ల తనలో రగులుతున్న వేదన తనను ఎవరో పట్టుకొనేందుకు, దొంగగా నిర్ధారించేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా భావించాడు. అనునిత్యం తన అంతరాత్మ తనను వెంటాడుతుంది. భరించలేని విధంగా అతడిని క్షోభపెడుతుంది.

ఇలా సమాజంలో వ్యక్తుల ప్రవర్తనను, మనస్తత్వాలను చిత్రించాడు. తెలిసి చేసినా, తెలియక చేసినా ఆకతాయిగా చేసినా తప్పుతప్పే కాబట్టి ఆ దోషం అతడిని క్షోభకు గురిచేసింది. తన్నులు తిన్న ఆ కుర్రాడికి క్షమాపణ కాక పోయినా ఓదార్పుగానైన రెండు మాటలు మాట్లాడలేక పోయినందుకు అంతరంగ మథనానికి గురవుతాడు. ఇలాంటి వ్యక్తులను మనం మన సమాజంలో నిత్యం చూస్తూనే ఉంటాం. దానినే రచయిత కథా రూపంలో మలిచాడు.

# డాll రావూరి భరద్వాజ గారి కాదంబరి నవలలో రామకృష్ణ గారి కార్యదీక్ష

- కడియం అజుబా మమతకుమారి
**తెలుగు అధ్యాపకురాలు,**
**సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాల, (స్వయం ప్రతిపత్తి)**
**ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా.**

ఉన్నతాశయం, కార్యదీక్ష, చెక్కు చెదరని పట్టుదల ఇవి మాత్రమే పెట్టుబడులుగా కలవారు తామనుకున్నది ఏదైనా సాధించగలుగుతారు. అడుగడుగునా ఎదురయ్యే కష్టనష్టాలు ఝుమ్మని ముసురుకుని, ఉక్కిరిబిక్కిరి చేసే నిరాశ నిస్పృహలు, వృత్తిరీత్యా ఎదురయ్యే తీవ్రమైన పోటీలు, అడుగు తీసి మరొక అడుగు వేయడానికి వీలుపడని కుట్రలు, కుతంత్రాలు. వీటన్నింటిని అధిగమించి ఓర్పుతో, నేర్పుతో తారాస్థాయినందుకునన వారు ఎంతోమంది ఉన్నారు. ఇదే డాllరావూరి భరద్వాజ గారు కాదంబరి నవలను రచించి అందులో ముఖ్యంగా చెప్పుకోదగ్గ పాత్ర రామకృష్ణయ్య గురించి ఇతను పేదరికం నుండి ఆయన ఉన్నత స్థానాలకు ఏవిధంగా చేరుకున్నారు. ఒక సామాన్యమైన వ్యక్తి అయినప్పటికీ ఏవిధంగా కష్టపడితే పేదరికాన్ని అధిగమించి ఉన్నత స్థాయిలకి చేరుకుని సమాజానికి తోడ్పడతాం అనేది రామకృష్ణయ్య అనే పాత్ర ద్వారా ఈ "కాదంబరి" నవలలో చక్కగా వివరించారు.

డాll రావూరి భరద్వాజ గారు కూడా ఒక పేద కుటుంబంలోనే జన్మించారు. అవిభక్త హైదరాబాద్ సంస్థానానికి చెందిన "పరిటాల జాగీర్"లోని మోగులూరు గ్రామంలో 1927 జూలై 5న జన్మించారు. తండ్రి కోటయ్య, తల్లి మల్లికాంబ. పెరిగింది గుంటూరు జిల్లాలోని తాడికొండ గ్రామంలో. పొట్టకూటి కోసం వ్యవసాయ కూలీగా, పశువుల కాపరిగా, రంపంలాగే పనివాడిగా, పేపరు బాయ్‌గా పనిచేశారు. ఎన్నో రచనలు చేశారు. ఎన్నో అవార్డులు సంపాదించుకున్నారు. ఈయన పెద్దగా కూడా ఏమీ చదువుకోలేదు. ఏడవ తరగతి వరకు మాత్రమే చదివారు.

డాll రావూరి భరద్వాజ గారు పేదరికం నుండి ఏవిధంగా అయితే ఉన్నతస్థాయికి చేరుకున్నారో అదేవిధంగా ఉన్న ఈ రామకృష్ణయ్య గారి పాత్రను ఈ కాదంబరి అనే నవల ద్వారా మనకు తెలియజేశారు. ఈయన చరిత్రను విని దానిని ప్రతీ ఒక్క భారతీయ పౌరులు తమ జీవితానికి దీనిని ఎలా అంకితం చేసుకోవాలి ? అలా ఎదగడం వలన సమాజానికి ఉపయోగపడతామా ? లేదా ? అనేది చూద్దాం.

### కాదంబరి–రామకృష్ణయ్య గారి పాత్ర :

రామకృష్ణయ్య గారి గురించి తెలుసుకోవాలంటే ముందు జగన్నాధం గురించి తెలుసుకోవాలి. జగన్నాధం ఒక పత్రికలో ఒక వార్త వింటాడు. అదేమిటంటే ఒక సాధారణ వ్యక్తి చిరుతపులితో హోరాహోరీగా పోరాడి మరీ పిడికిలితో గుద్ది చంపేశాడని. ఇది పత్రికలో హెడ్డింగ్. ఎడిటర్ ఎవడో కాని మంచి టేస్టున్నాడిలా ఉన్నాడు. హెడ్డింగ్ ఇది పెట్టి దీని గురించిన విషయం మాత్రం ఆఖరున వ్రాశాడు. మొదట మాత్రం పశువులను మేపుకుంటూ ఒకడు అడవిలోకి వెళ్ళి దారి తప్పాడు అని ఏదో పాడుపడిన బిల్డింగ్ గురించి మాత్రం రాశాడు. అది చదివినప్పట్నుంచి జగన్నాధంకు ఎప్పుడెప్పుడు ఆ చిరుతను చంపినవాడిని చూస్తానా ఆ పాడుపడిన బిల్డింగ్ రహస్యాలు చేజిక్కించుకుంటానా అని ఒకవేళ అవి తెలిస్తే నేనే స్వయంగా దీని మీద పూర్తి వివరణ రాసి అక్కడ ఉన్న రహస్యాల గురించి పత్రికలో వేయిస్తాను అని అనుకున్నాడు. అలా అనుకుని ఎడిటర్ వద్దకు వెళ్ళాడు. ఈ విషయం గూర్చి పూర్తి వివరణ ఆ బిల్డింగ్ ఎక్కడ ఉందో దారి ఎటువైపుగా వెళ్ళాలో చెప్పండి అంటూ ఎడిటర్‌ను అడిగాడు. ఎడిటర్ నాకేమీ తెలీదు, ఏదో ఒక చిన్న కాగితం దొరికితే పత్రికలో వేశాను. కానీ

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

దీని గురించి తెలియాలంటే ... అంటూ ఆ అడవికి దారి చెప్తాడు. ఎక్కడ ఉందో అందులోకి వెళ్తే ఆ చిరుతను చంపినవాడు దొరుకుతాడు. కానీ జాగ్రత్త. చాలా దూరం, పాములు ఉంటాయి అని సలహా ఇస్తాడు. ఓస్ ... పాము లేనా, పెద్ద పెద్ద పులులు, సింహాలు ఏం ఉండవా? నాకు అలా లేకపోతే కిక్కే ఉండదు అంటాడు జగన్నాథం. నన్ను విసిగించకుండా ఇక్కడనుండి త్వరగా బయల్దేరు బాబు అంటాడు ఎడిటర్. అలా చివరకు జగన్నాథం చాలా కష్టాలు పడి ఆ చిరుతను చంపిన వాడిని పట్టుకుంటాడు. ఏంటయ్యా బాబు చిరుతను చంపావంటా? ఎలా చంపావు? అని అడు గగా చంపినవాడు (నారాయణ) ఏదో మీద పడింది ఒక్క దెబ్బ వేశా. నేనెక్కడ చంపా? ఆ రోగాలమారిదే చచ్చింది. ఇంటికి ఎలా తిరిగి వచ్చానో కూడా తెలీదు అని బదులి చ్చాడు. ఒక విషయం తెలిసింది కానీ, అసలు జగన్నాథం వచ్చింది ఆ పాడుపడిన బిల్డింగ్ రహస్యాలు తెలుసుకోవ టానికి. అది ఎక్కడ ఉందో చెప్పమంటాడు. నాకు తెలీద న్నానా ? ఏదో దారి తప్పి వెళ్ళాను. విసిగించకుండా వెళ్ళు అంటాడు. అలా జగన్నాథం ముందుకు వెళ్ళగా ఒక ఆఫీసరు జగన్నాథంను చూసి ఎర్రగంధం చెక్కలు కొనడానికి వచ్చాడేమో అని మర్యాదలు చేసి కూర్చోబెడతాడు. జగన్నాథం కూడా తను ఎందుకు వచ్చాడో చెప్పకుండా వీడిని పట్టుకుంటే ఆ రహస్యాలేంటో తెలుస్తాయని నిజం దాచేసి నటిస్తాడు. చివరకు ఆ బిల్డింగ్ వద్దకు వెళ్తాడు. అక్కడ శర్మగారి ద్వారా ఆ బిల్డింగ్ గురించి అక్కడ రాజుగారి గూర్చి, మాతప్ప నాయకుని కోట మరియు "మయురాక్షి" నది గురించి మొత్తం పూర్తి వివరాలు తెలుసుకుంటాడు. ఎలాగైతేనేం చివరకు జగన్నాథానికి కావలసిన సమాచారం రాబట్టుకున్నాడు. ఇప్పుడు తిరిగి ఇంటికి వెళ్ళాలి. కానీ సరిగ్గా ఈ సమయంలోనే జగన్నాథానికి అక్కడ కౌముది కనబడుతుంది. కౌముది రామకృష్ణయ్య కూతురు. ఈవిధంగా జగన్నాథం రామకృష్ణయ్య గారిని కలుసు కుంటాడు. ఇక్కడ నుండి మనం ముందు చెప్పుకున్నటు వంటి కథ అనగా మనకు కావలసిన రామకృష్ణ గారి పాత్ర మొదలవుతుంది. కౌముది రామకృష్ణయ్య గారు ఏం చదువుకోలేదు అని చెప్పింది మరి మీరు చదువుకున్నట్టు న్నారు. ఇంత స్థాయికి ఎలా వచ్చారు అంటే మీ అమ్మాయి నాకు అబద్ధం చెప్పింది కదా ! అని రామకృష్ణతో జగన్నాథం అనగా లేదు బాబు ! మా అమ్మాయి నీకు నిజమే చెప్పింది. నేనేమీ చదువుకోలేదు. కానీ నేను ఇంతస్థాయికి ఎలా ఎదిగానో నీకు చెప్తాను అని ఈవిధంగా వివరిస్తాడు.

నేను చాలా పేదరికం కుటుంబానికి చెందినవాడిని. అప్పట్లో మా నాన్న నీళ్ళుకావిళ్ళు మోయడం నాకింకా జ్ఞాపకముంది అంటూ కొద్దిగా కంటతడి పెట్టుకుంటాడు. అది జగన్నాథం గమనిస్తూనే ఉంటాడు. మా నాన్న మెతక అవడం వలన వాళ్ళ అన్నలు ఒక్కటయ్యి పొలం ఇవ్వకుండా మా నాన్నను దూరం చేశారు. అయినా సరే మా నాన్న అప్పట్లో నీళ్ళు సదుపాయం ఉండేది కాదు కదా ! దానివలన అదే వృత్తిగా చేసుకుని మమ్మల్ని పోషించేవాడు. మా చెల్లికి ఒకరోజు ఆరోగ్యం బాగోలేదు. అందరూ పట్టణం వెళ్ళి చూపిస్తే నయం అవుతుంది అన్నారు. కానీ అంత స్తోమతు లేదు. ఎవరూ ఒక్క రూపాయి కూడా సహాయం చెయ్యలేదు. ఊళ్ళో నాటు వైద్యం చేయించినా సరే ఫలితం లేదు. చివరకు నా కళ్ళముందే మా చెల్లి చనిపోయింది. అప్పుడు నాది ఏమీ చెయ్యలేని వయస్సు. అలా చూస్తూ ఉండేవాడిని. కొన్నాళ్ళకి మా అమ్మ చనిపోయింది. ఆ తరువాత నా భారం మొత్తం మా నాన్నమీదే పడింది. చుట్టాలు అందరూ ఎవరికి వాళ్ళు పట్టించుకోకుండా వెళ్ళిపోయారు. ఆ క్షణం నేను ఒక నిర్ణయం తీసుకున్నా. ఎలాగైనా సరే కష్టపడి పైకి రావాలి. పేదరికం అనే దారిద్ర్యాన్ని పారద్రోలాలి అని. అప్పుడు లాగుడుబళ్ళు పనుల్లోకి చేరదామనుకున్నాడు. మరీ చిన్నవాడు కావటంతో రామకృష్ణయ్యను ఎవరూ పనిలో చేర్పించుకోలేదు. కొంతకాలం ప్రెస్‌లో పనిచేశాడు. కాఫీలు, టీలు అందించడం సరిపోయేది. తరువాత హోటల్‌లో పని చేశాడు. రామకృష్ణయ్యకు చదువు సరిగా ఎక్కలేదు. అందు కనే ఈ డబ్బు లేకపోయినా ఈ విధంగా కష్టపడి పైకి వచ్చాడు. ఆ హోటల్‌లో నటరాజన్ అనే వాడితో పరిచయం

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

ఏర్పడింది. నటరాజన్ రామకృష్ణయ్యకు ఎంతగానో సహాయం చేసేవాడు. ధైర్యం, పట్టుదల ఉంటే ఏ పనైనా సాధించ వచ్చు అని ఎప్పుడు తోడుండేవాడు. ఇలా ఈ పనులన్నీ చేస్తే నెలకు నాలుగు రూపాయల జీతం వచ్చేది. పని బాగా చేస్తున్నానని ఒక సినిమా థియేటర్‌లో పనిచేసే అవకాశం లభించింది. అక్కడ చేరాను అని ఇదంతా రామకృష్ణయ్య జగన్నాథంకు చెప్తున్నాడు. జగన్నాథం వింటున్నాడు. అక్కడికి చంద్రశేఖరం గారు వచ్చారు. నన్ను చూశారు. ఆయన ఎంతో గొప్పవారు. బాగా డబ్బున్నవారు కూడా. నేను బాగా పనిచేయడం చూసి ఆయనతో తీసుకువెళ్ళారు. పనిప్పించారు. ఆయనతో ఇంకా బాగా చనువు ఏర్పడింది. ఆయన మాటంటే నాకు దైవవాక్కు. చివరకు ఆయన కూతుర్ని ఇచ్చి పెళ్ళి చేశారు. బాధ్యతలన్నీ నాకు అప్పగించారు. నాకూ సమాజంలో ఒక గౌరవం ఏర్పడింది. రాజకీయంగా ఎదిగాను. ప్రజలందరూ గౌరవిస్తున్నారు. ఈవిధంగా పేదరికంలో ఉండవలసిన నేను ఎన్నో కష్టాలు, ఒడిదుడుకులు ఎదుర్కొన్నాక ఈ స్థితికి చేరుకోగలిగాను. ఇప్పుడు మంత్రిగారు, ఇంకా పెద్దపెద్ద వాళ్ళు నేనంటే భయపడతారు. నా మాట కాదనరు. కూర్చుని రెండు తరాలు తిన్నా సరే తరగతి ఆస్తిని సంపాదించాను. అదేవిధంగా మనకున్న దానిలో ఎంతోకొంత ప్రజలకు కూడా చెయ్యాలి కదా అన్న ఉద్దేశ్యంతో నగర కార్యకలాపాలలో మిగిలిన వాటిల్లో నావంతు సహాయం చేస్తున్నాను అని ఈయన వృత్తాంతాన్ని అంతా జగన్నాథంకు వినిపించాడు. ఈయనకు నమస్కారం చేసి తరువాత జగన్నాథం కూడా ఊరికి బయల్దేరతాడు.

అంటే దీనిని బట్టి ఏం గ్రహించాలంటే డబ్బు లేక పోయినా, పేదరికం అయినా సరే కష్టపడే తత్త్వం ఉంటే చాలు ఎంతటి శిఖరాన్నైనా అధిరోహించవచ్చు. చదువే ఉండవలసిన అవసరం లేదు. కానీ ఎవరు ఏం రంగంలో అయితే క్రియను కలిగి ఉన్నారో, ఏ రంగంలో అయితే రాణించగలిగే సత్తా ఉందో అది ఉంటే చాలు, అది తెలిస్తే చాలు. ఈ ఒక్క సత్యాన్ని గుర్తెరిగి ప్రజలందరూ ప్రవర్తిస్తే నాది, నీది అని అనకుంటే మనది, మనందరిదీ అని ముందుకు వెళ్తామో ఏదైనా సరే ఒక విషయాన్ని మనది అన్నప్పుడు ఖచ్చితంగా పైకి వస్తాం. గొప్ప ఆలోచన ఉంటే గొప్ప గొప్ప కార్యాలు చేయగలుగుతాం. అందుకు ఈ కథ చాలా మంచి ఉదాహరణ.

ఇప్పుడు మనం చెప్పుకున్న 'కాదంబరి' నవలలోని రామకృష్ణయ్య గారి పాత్ర మానవుల హృదయాలను ఎంతగానో తొలచివేస్తుంది. ఇది నిజంగానే గొప్ప నవల. ఎందుకంటే సమకాలిన సమాజంలోంచి ఒక వ్యక్తిని ఎంత గొప్పగా నడిపించుకుపోయారు. ఎలా నడుచుకుంటూ వెళ్ళి శిఖరాలను అందుకున్నాడు అనేది ముఖ్యాంశం. వ్యక్తిలో, సమాజంలో మంచీ, చెడూ రెండూ ఉంటాయి. కానీ మానవత్వానికి కావలసినది సార్థకత. వ్యక్తి చేష్టల ద్వారా విలువలుంటాయి. ఆ విలువలు ఈ 'కాదంబరి' నవలలో చాలా చక్కగా డా॥ రావూరి భరద్వాజ గారు వివరించారు. ఇది నూటికి నూరుపాళ్ళు తెలుగు నవల. మన సమాజంలో ఉన్న పేదరికాన్ని ఎలా నిర్మూలించాలి, జీవితాన్ని ఎలా ముందుకు కొనసాగించాలి, కష్టపడే తత్త్వం ఎలా ఉంటుంది, ప్రతీ ఒక్కరూ కూడా తమ సొంత కాళ్ళ మీద బ్రతికేలాగా అంటే వేరేవాళ్ళ మీద ఆధారపడి బ్రతికే బ్రతుకు వృధా అని సొంతంగా ఎదగాలి, సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని ఎంతోకొంత దోహదపడాలి అనే భావనతో కలిగి ఉంటారని ఆశిస్తూ ఈ పత్ర సమర్పణ.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# రావూరి భరద్వాజ నవలలు - పరిశీలన

- కడుకుంట్ల లత
స్నాతకోత్సవ విద్యార్థిని, తెలుగు శాఖ
తెలంగాణ విశ్వవిద్యాలయం, డిచ్‌పల్లి, నిజామాబాద్ జిల్లా.

## పాకుడు రాళ్లు :

వీరికి కీర్తి, ప్రతిష్టలను సంపాదించి పెట్టిన నవలలు ప్రధానంగా రెండు ఉన్నాయి. మొదటి పాకుడురాళ్లు. రెండవది కాదంబరి. వీరి నవలన్నింటిలోనికి ఉత్తమ శ్రేణికి చెందిన నవల "పాకుడురాళ్ళు". మద్రాసులో ఉన్న రోజులలో పరిచయమైన నిర్మాతలు, దర్శకులు, నటీనటులు వీరి సమస్యలు అధ్యయనం చేసి, మల్లంపల్లి సోమశేఖరశర్మ గారి ప్రేరణతో ఈ నవల రాశారు. సినీ ప్రపంచాన్ని ఇంత నిశితంగా, స్పష్టంగా చిత్రించిన నవల ఇంత వరకు ఇదొక్కటే. సినీ రంగంలోని సమస్త కల్మషాన్ని తూర్పార బట్టారు. మంజరి సినీరంగంలో ప్రముఖతారగా వెలుగొందాలన్న నిర్ణయంతో నీతి నియమాలకు తిలోదకాలిస్తుంది. సామాన్యస్థితి నుండి ఒక మెట్టు తరుఅత మరో మెట్టును అధిరోహిస్తుంది. అయితే ఆమె ఎక్కిన మెట్లన్నీ పాకుడు రాళ్లు. ఏ క్షణంలోనైనా జర్రున జారి అథఃపాతాళంలో పడిపోక తప్పదని ఆమెకు తెలియదు. చివరికి మంజరి ఆత్మహత్య చేసుకుంటుంది.

ఈ నవలలోని అన్ని పాత్రలు ఆయనకు బాగా తెలిసిన వారి ప్రతిరూపాలే. ఆ నవలలోని అన్ని సంఘటనలు వారికి తెలిసిన వారి జీవితాల్లోంచి ఏరుకొన్నవే. తెలుగులో వెలువడిన ప్రప్రథమ నాచురలిస్టు నవలగా 'పాకుడురాళ్ళు'ను పేర్కొనవచ్చు.

ఆర్థిక సూత్రాల బలీయమైన ప్రభావం వల్ల, నైతిక విలువల పట్ల తృణీకరణ భావం, అమానుషమైన పోటీ, ఒకే వేషం కోసం పదిమంది ప్రయత్నాలు చేస్తున్నప్పుడు మిగిలిన తొమ్మిది మందిని తోసిపుచ్చి, విజయలక్ష్మిని కైవసం చేసుకోవడానికి అవలంబించించే నీతి బాహ్య విధానాలు, నిరంతరం ప్రవహించే మత్తు పానీయాలు, కళ్లకు కట్టినట్లు వర్ణిస్తారు రచయిత, వేలాది, లక్షలాది మంది ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ పీకలదాకా కూరుకుపోయిన, ఈ రంగంలోని తళుకు బెళుకులనే కాకుండా, నీలినీడల్ని, నిట్టూర్పు సెగల్ని, వెచ్చని కన్నీటిని దోసిళ్లకొద్దీ పంచిపెట్టారు. కోట్లాది మంది ప్రేక్షకులలోని ఉద్వేగాలను, ఉద్రేకాలను, సెగలను రగుల్కొలిపే చలనచిత్ర రంగంలోని విషాదమయ గాథలను, కన్నీటి కాసారాలను సజీవంగా చిత్రించారు.

## కాదంబరి :

'కాదంబరి' నవలలో, దారిద్ర్యంలో మగ్గిపోతున్న ఒక వ్యక్తి, పరిస్థితులకు అనుగుణంగా మారుతూ, పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకుంటూ కోటికి పడగలెత్తడం ఇందులోని ప్రధానాంశం. ఆధునిక, సామాజిక వాతావరణాన్ని ఆలంబనంగా చేసుకొని దీనిని చిత్రించారు. వర్తమాన రాజకీయ, ఆర్థిక పరిస్థితలకు దర్పణమిది. ఇందులో వస్తువుకు శిల్పానికి సమపాళ్లలో న్యాయం చేశారు. సామాజికుల మన్నప్రవృత్తులను హేతువాదం ద్వారా ఎండగట్టారు.

## ఇదం జగత్ :

1969లో భరద్వాజ రచించిన మరో ఉత్తమ నవల 'ఇదం జగత్'. ఇందులో కథా నాయకుడు రామకోటి నిరుద్యోగం, ఆకలి, దారిద్ర్యం, కుళ్లు, మోసం, దగా చూస్తాడు, అనుభవిస్తాడు. పెట్టుబడిదారీ విధానం వేసే వెర్రితలలు, నిర్భాగ్యులైన కూలీలు పడే పాట్లు, వారి నాయకులమనే వాళ్లు చేసే అన్యాయాలను, అక్రమాలను విపులంగా చిత్రీకరించారు రచయిత.

## కరిమింగిన వెలగపండు :

జీవితంలోని సుఖదుఃఖాలను, వెలుగు నీడలను, పడుగు పేకలుగా మార్చి 'కరిమింగిన వెలగపండు' అన్న నవలను రాశారు. 1967లో ఇది ప్రచురితమైంది. మనిషిలోని బాహ్య, ఆంతరంగిక జీవిత లక్షణాలను వివరించారు ఇందులో.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

"మనిషి చేస్తున్న మోసాలకు, దగాలకు పెట్టుకున్న ముద్దు పేరు నాగరికత" అంటారు రచయిత.

నవ్వుతూనే, నవ్విస్తూనే, మన అసలు సిసలు రూపాలను మనకు చూపించి మనల్ని చూసి మనమే సిగ్గుపడేలా, కన్నీరు పెట్టుకునేలా చేశారు. ఆనంద్రాశ్రువులు, విషాదాశ్రువులు గంగా యమునల్లా కలిసి వుండడం ఈ నవలలోని ప్రత్యేకత. ఒక స్త్రీ – పురుషునిగాను, ఒక మగవాడు – మహిళగాను మారితే ఎలా ఉంటుందో సరసంగా చిత్రీకరించారు. ఈ కథను ఆధారంగా చేసుకొని చలనచిత్రాలు కూడా వచ్చాయంటే, దీని విలువను గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

## వేకువ :

మరో చిన్న నవల 'వేకువ'. అంటరానితనం, పల్లెల్లో జరిగే దౌర్జన్యాలు, వాటికి తట్టుకోలేక అట్టడుగు వర్గాల వాళ్లు పడే అగచాట్లను కన్నులకు కట్టినట్లుగా హృదయంగమంగా 1963లో ఈ నవలను చిత్రించారు.

## చిత్రగ్రహం :

భరద్వాజ తమ తొలి నవల "వీరగాథ"ను 1943 ప్రాంతంలో రాశారు. నవల మొత్తం సరళ గ్రాంథికంలో ఉంటుంది. 1953లో రచించిన 'చిత్ర గ్రహం' నవల, అంతరిక్ష యాత్ర ఒక తీయని కలగా మానవాళిని ఊరిస్తున్న కాలంలో రాసినది. ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగం, సంపన్నులు, ఆగర్భ దరిద్రులనే భేదంలేని ఆదర్శ ప్రాయమైన సమాజాన్ని 'శశూన్' అన్న కల్పిత గ్రహం మీద కల్పించి, మానవజాతి సాధించవలసిన ఉత్తమ సమాజం, ఎలా ఉండాలో ఆనాడే సూచించారు. జూలై 20, 1969న నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ అమెరికన్ లూనార్ మాడ్యూల్ నుండి దిగి చంద్రమంలం మీద కాలు మోపడం గమనార్హం. ఈ నవలలో భరద్వాజ ఊహించిన అనేక శాస్త్రీయ అంశాలను, ఆ తర్వాత జరిగిన పరిశోధనలు, సత్యమేనని రుజువు చేశాయి. ఆయన దార్శినికతకు అద్దం పట్టాయి.

## జలప్రళయం :

భరద్వాజ శాంతి ప్రియత్వం 'జల ప్రళయం' అనే నవలలో ప్రస్ఫుటంగా ప్రతిబింబిస్తుంది. దోపిడీదారుల మీద, యుద్ధోన్మాదుల మీద, రచయిత విరుచుకుపడతారు. ఈ భూమిని రక్తసిక్తం చేయవద్దని, పరస్పరం దోచుకోవడం ఆపి, మారణహోమం నుండి మానవ జాతి బయట పడవలసిన ఆవశ్యకతను గురించి లోకానికి ఎలుగెత్తి చూపారు.

## ఇనుపతెర వెనుక :

1984లో సోవియట్ రష్యాలో నెల రోజులు పర్యటించి, తాను తిరిగిన ప్రదేశాలు అక్కడి విధానాలు, కొన్ని వందల మందితో చేసిన ఇంటర్వ్యూలలోని విషయాన్ని, 'ఇనుపతెర వెనుక' గల రష్యా దేశపు అసలు సిసలు స్వరూపాన్ని యథాతథంగా మనముందుంచారు భరద్వాజ. రష్యా సమాజంలోని నిజానిజాలను తన యాత్రా గ్రంథంలో నిర్భయంగానూ, నిస్సంకోచంగానూ చెప్పారు.

చాలా సమాజాల్లో ఆర్థిక వ్యత్యాసాలుండడానికి, సంపన్నులూ, గర్భ దరిద్రులూ వుండడానికి కరాణాలేమిటని ప్రశ్నిస్తూ "నా మిత్రులలో చాలా మంది కడుపు నిండుగా భోజనం చేస్తున్న సమయానికే, నాకు పిడికెడు మెతుకులు లేకపోవడానికి నా మిత్రుల్లో చాలా మంది మల్లెపూవుల్లాంటి దుస్తులను వేసుకుంటున్న సమయానికే, నా ఒంటి మీద మురికి పీలికలు వ్రేలాడటానికి సిగ్గు అందరికీ ఉండడానికి, అది దాచుకునే గుడ్డ కొందరికే ఉండడానికి కారణమేమిటి?" అని సమాజాన్ని ప్రశ్నిస్తారు.

## ఉపయుక్త గ్రంథసూచి :


1. డాక్టర్ రావూరి భరద్వాజ పరిశీలనలు, వ్యాససంపుటి
2. స్మృతి సాహిత్యం – భరద్వాజ రచనలు
3. హంసధ్వని

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# పాకుడురాళ్ళు నవల – స్త్రీ పాత్రచిత్రణ

- కత్తి శ్రావణి
పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం
నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియల్లో రచనలు చేసిన ఘనుడు రావూరి భరద్వాజ. హంగూ ఆర్భాటాలు లేని నిరాడంబర జీవితం ఇతనిది. ఈయన ఒక బీద కుటుంబంలో జన్మించి 7వ తరగతి వరకే చదువుకున్నాడు. ఆతర్వాత కాయకష్టం చేసే జీవితాన్ని ప్రారంభించాడు. చారెడు గంజి కోసమూ, బారెడు గుడ్డ కోసము కలవరించాడు. ఆకలి, అవమానం, దారిద్ర్యం, నిరుద్యోగం, నిరాదరణ అనుభవించాడు. జీవన పదంలో కాలు నిలవడం కోసం అనేక రకాల వృత్తిల్ని చేశాడు. ఆవృత్తుల్లో సాధక బాధలను, కష్టాలను, అమానుషత్వాన్ని పదిలుగా గుండె లోతుల్లో దాచుకున్నాడు. అయితే అతని అనుభవాలు – జ్ఞాపకాలు వృధా కాలేదు. వాటి సారాన్ని ఒడిసిపట్టి గొప్ప రచనలు చేసి మహా రచయితగా ఎదిగాడు. పల్లె ప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపతాపాలు గమనించాడు. ఆ అనుభవాలనే తర్వాత కాలులో తన రచనలలో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి ఉపయోగించుకున్నాడు. ప్రఖ్యాత రచయిత "క్వాజ అహమ్మద్ అబ్బాస్" అన్నట్లు – భరద్వాజ రచనల్లో సహజతత్వం లోతు వైవిధ్యం వెల్లివిరియడానికి, ఆయన పాత్రలు జీవ చైతన్యంతో స్పందించడానికి, విస్తృతమైన ఆయన జీవితాను భావాలే ముఖ్య కారణాలు.

ఈయన రచనల్లో ప్రధానంగా సమసమాజ స్థాపనే లక్ష్యంగా కనిపిస్తాయి సమాజంలో జరుగుతున్న దోపిడిని ప్రశ్నిస్తాయి. ప్రజలను ఆలోచింపజేస్తాయి. చైతన్యపరుస్తాయి. అందువలననే తెలుగు సాహితీ క్షేత్రంలో అత్యున్నత పురస్కారం అందుకొని ఎనలేని స్థానం సంపాదించుకున్నాడు.

రావూరి భరద్వాజ రాసిన "పాకుడు రాళ్ళ" సినిమా రంగం తెరవెనుక నటీమణులు ఎదుర్కోనే సమస్యలను, సన్నివేశాలను ఈ నవలలో అభివ్యక్తం చేశాడు. నిత్య కల్యాణం పచ్చతోరణంగా భావిస్తూ వేలాది మందిని ఆకర్షించే సినిమా రంగంలో పాతుకుపోయిన అవాంచనీయమైన సంఘటనలు ఈ నవలలో కలవు. అట్టడుగు నుండి జీవితం ప్రారంభించి, ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన ప్రతిభాశాలి మంజరి(మంగమ్మ) గుంటూరు గుడిసెల్లో వేశ్యగా జీవితాన్ని ప్రారింభించి ఆపైన నాటక కళాకారిణిగా పేరు సంపాదించుకుంది.

తన పూర్వపు కళాకారుడైన చలపతి ద్వారా మద్రాసులో అడుగు పెట్టింది. సినీరంగంలో కెమెరామెన్లు, నిర్మాతలు, దర్శకులు, డిస్ట్రిబ్యూటర్లు పెట్టుబడిదార్లు చివరకు అగ్రశేణి నటులు, చవకబారు జర్నలిస్టులు కూడా నటీమణులను ఏ విధంగా వశ పరుచుకుంటారో ఈ పాత్ర ద్వారా వ్యక్తమౌతుంది. ఈ సినీ ప్రపంచంలో నిలదొక్కుకోవడానికి తారలు మానాభిమానాలను, శరీరాన్ని పణంగా పెట్టి ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ ముందుకు సాగితేనే కానీ భవిష్యత్తు లేదు. అందులో వారి వారి తెలివిని అందాల్ని బట్టి వారి స్థానం నిర్ణయించబడుతుంది. అద్భుత సౌందర్యవతియైన మంజరి కూడా అనేక ఆటుపాట్లలను అధికమించి సినిమా రంగంలో మకుటంలేని మహారాణిగా వెలిగి, విదేశీ పర్యాటనలు చేసి ప్రముఖుల ప్రశంసలు పొంది. " దీపం వుండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి" అన్నట్లు వచ్చిన అవకాశాలను చేజారకుండా అనేక సినిమా లలో నటించి బొంబాయిలోని చలువరాతి మందిరాల దాకా చేరుకుంది. విశాలవంతమైన జీవితం కోసం ధనసమపార్జన మోజులో స్వార్ధపరుల కుట్రలో చిక్కుకొని వారి నుండి బయట పడలేక ఆత్మహత్య చేసుకొని తన జీవితాన్ని ముగించుకుంటుంది. అమె ధనాన్ని సంపాదించగలిగిందే కాని ఆత్మీయతను, మనశాంతిని సంపాదించుకోలేకపోయింది. చివరకి మృత్యువే ఆమె సమస్యలకు పరిష్కార మార్గమయ్యింది.

ఈ నవలలో మరో తార కళ్యాణి. ఈమె గృహిణి. స్త్రీకి కొంత ఓర్పు సహనం వుంటాయని తెలియజేసే పాత్ర ఇది. భర్త వ్యసనాలతో ఆస్తిని హరింప చేసి తనను నానాహింసలు పెడుతూ అవమానాపాలు చేస్తూ, అనరాని మాటలు అంటున్న భర్తే దైవంగా భావించి ఇంటిని అంటి పెట్టుకొని వుంటుంది. భర్త పెట్టే ఇబ్బందులు తారాస్థాయికి పోయి భరించలేక పక్కింటి ఉల్లిపాయల వ్యాపారిని నమ్మి అతనితో మద్రాసు వెళుతుంది. అతను కొన్ని దినాలు తరువాత మోసం చేయ్యటంతో తన సొంత ఊరు రాలేక మద్రాసు వదిలిపోలేక అనేక వృత్తులు చేస్తు చివరికి సినీరంగంలో చిన్న పాత్రలు ద్వారా పరకాయ ప్రవేశం చేసి అగ్రతార జాబితాలలో చేరి ఉన్నత శిఖరాన్నందుకుంటుంది. ఒకే రంగంలో వివిధ వ్యక్తుల మధ్య పోటీ వుండే ఈ సమాజంలో తన తోటి నటి అయిన మంజరినితన చెల్లెలుగా భావించి సినిమా రంగంలో వుండే ఇబ్బందులను తెలియజేసి, వాటికి పరిష్కార మార్గాలు తెలియజేస్తూ మంజరి అభ్యున్నతికి కృషి చేసింది. కల్యాణి ప్రగతి పథంలో ముందుకు పోతున్నంద నుకున్న సమయంలో ఏనాడో వదిలిపోయాడనుకున్న భర్త మళ్ళీ ఆమె జీవితంలో ప్రవేశించి డబ్బుకోసం ఆమెను వేధించడమేకాక చివరకు ఆమెను చంపడానికి సైతం వెనుకాడడు. ఇలా తారల వైవాహింక జీవితంలోని విషాదాన్ని కల్యాణి పాత్ర ద్వారా ఈ నవలలో మనకు వ్యక్త మౌతుంది.

మంచి స్వరంతో నేపధ్యగాయినిగా చలన చిత్ర రంగంలో స్థిరపడాలనే ఆశతో ఎదురుచూసే వ్యక్తి వసంత. ఈమె రాజమణి నడుపుతున్న కంపెనీలో వేశ్యగా జీవిస్తుండేది. ఈ కంపెనీలోనే ఒకనాడు వేశ్య వృత్తి చేసి ప్రస్తుతం సినీ రంగంలో ఉత్తమ నటిగా పేరు తెచ్చుకొన్న మంజరి ఒక రోజు రాజమణిని కలవడానికి కంపెనీకి వెళ్ళినపుడు రాజ మణి వసంతను మంజరికి పరిచయం చేస్తుంది. దినదినానికి కుళ్ళిపోయే వ్యభిచార వృత్తికి దూరంగా వసంతను మంచి గాయినిగా చేయమని చెప్పగా అవకాశం వచ్చినపుడు గాయి నిగా చేస్తానని మంజరి రాజమణికి మాట ఇస్తుంది. ఆమాట ప్రకారమే సినిమా అవకాశాలు ఎక్కువగా ఉన్న సమయంలో మంజరి రాజమణిని వసంతను గుంటూరు నుండి మద్రా సుకు రప్పించి వ్యభిచారి వృత్తికి స్వస్తి చెప్పింది. వసంతను తాను నటించే సినిమాలు ఫ్లా బ్యాక్ గాయినిగా పాడించమని నిర్మాతలపై, మొదలియార్‌పై ఒత్తిడి చేస్తుంది. వసంత స్వరభేదాలు పలకలేక పోతుందని మొదలియార్ ఎంత చెప్పిన వినిపించుకోక మంజరి నటించే చిత్రంలోని పాటలు పాడే అవకాశాన్ని చేజిక్కించుకుంటుంది. ఆతర్వాత వసంత గాయనిగా చక్కని అవకాశాలు సంపాదించుకొని మంచి గాయనిగా పేరు తెచ్చుకోవడానికి అవసరమైనపుడు తన శరీరాన్ని అప్పగించడానికి ఏ మాత్రం వెనుదీయలేదు. ఎప్పటికప్పుడు జాణతనం ప్రదర్శిస్తే తప్ప సినీరంగంలో నిలదొక్కువడం కష్టమని గుర్తించి తదనానుగుణంగానే ప్రవర్తిస్తూ నేపధ్యగాయినిగా స్థిరపడింది. తన లాగే వసంత జీవితం మోదుబారిన చెట్టులాగా వుండకూడదని మంజరి భావించి పత్రిక రంగంలో పనిచేసే శర్మ వసంతలు ఈడు జోడు చూడముచ్చటగా వుంటుందని భావించి వసంతని శర్మకిచ్చి వివాహం చేస్తే ఇద్దరు తన కళ్ళముందే వుంటారని భావించింది. శర్మ వసంతలకు వివాహం చేసి వసంత జీవింతలో ఆనందాల వెలుగును మంజరి వెలిగించింది.

రాజమణి, నాగమణి నడిపే కంపెనీ ఒక వేశ్య, నాగమణి పెట్టే ఇబ్బందులు భరించలేక ఒకనాడు రాజమణి నాగమణి పోలీసులకు అప్పగించి కంపెనీ తానే నడుపుతుంది. రాజ మణి నడిపే వేశ్యగృహాలకు అనేక మంది వ్యక్తులు రావటం వారితో కలవటం వల్ల రాజమణి రోగాలపాలై శరీరం మీద పుండ్లు పడి సంపాదించే డబ్బులు మొత్తం మందులకు ఖర్చు పెడుతూ జీవితాన్ని ముందుకు ఈడుస్తుంది. రాజమణి మంజరి నాగమణి కంపెనీలో స్నేహితులు కావటంతో మంజరి తనగాలా ఈ వృత్తిలో మగ్గిపోవటం ఇష్టం లేక చలపతి ద్వారా మద్రాసు పంపి ఆమె అభ్యున్నతికి కృషి చేసింది. తన దగ్గరున్న వసంతను మంజరి సహాయంతో గాయినిని చేసి మంజరితోపాటే మంద్రాసులో వుంటూ వ్యభిచారి వృత్తిని వదిలేస్తుంది. ఈనాటి సమాజంలో

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

పొగడ్తలకు లొంగపోని వారు ఎవరు వుండరు. అలా పోగడ్తలకు లొంగిపోయి పచ్చని సంసారాన్ని నాశనం చేసుకొని మోసపోయిన వారిలో తాయారు ఒకరు. ఈమె రాజమండ్రిలో సినిమా హాలు ముందు తన భర్తతో కలిసి కిళ్ళీకొట్టు నడుపుతు వుండేది.

ఒకనాడు తమిళ వ్యక్తి తన కొట్టు దగ్గరకు వచ్చి నీవు చాలా అందంగా వున్నావు. నేను చేసే సినిమాలో నిన్ను హీరోయిన్‌గా చేస్తానని నీబోమ్మని, నీనటనని తెరపై చూచుకోపచ్చని పోగడతలతో ఆమె దగ్గర వున్న నగలు డబ్బు తీసుకొని మద్రాసు వెళ్ళింది. కొంతకాలానికి ఆమె దగ్గర వున్న నగలు, డబ్బు అయిపోగానే తాయారును మద్రాసుకు తీసుకొపోయిన వ్యక్తి మాయమైపోయాడు. ఇతని చేతిలో మోస పోయి తాయారు అటు భర్త దగ్గరకు పోలేక, పుట్టింటికి పోలేక ఇటు సినిమా అవకాశాలు లేక మద్రాసులో చలపతి ఇంటిలో పని చేస్తూ జీవనం సాగిస్తుంది.

ఈ నవలలో స్త్రీని ఒక మెసపోయే వ్యక్తిగా, ఒక వ్యభిచారినిగా మనిషిగా, అంగడి బొమ్మగా, ఏదైనా ఒక రంగంలో తన కాళ్ళపై తాను నిలబడాలంటే ఏ విధమైనటు వంటి సమస్యలను ఎదుర్కోవాలో ఈ నవలలో చూడవచ్చు. కేవలం ఈ నవలలో పేర్కోన్న సమస్యలే కాకుండా నేటి సమాజంలో స్త్రీలు అనేక సమస్యలను ఎదుర్కోంటున్నారు. అనేక మంది వ్యక్తుల చేతులలో మోసపోతున్నారు. అందుకే ఈ మోసాలను శావ్వత పరిష్కారం చూపాలంటే "ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు' అన్నట్లుగా ప్రతి స్త్రీ చదువుకొని తన కుటుంబాన్ని సమాజాన్ని జాగృతి పదంలో నడిపిస్తూ ఆడదంటే అబల కాదు, అంగడిబోమ్మకాదని, సమాజానికి సాటిచెప్పే విధంగా అన్ని రంగాల్లో ముందకు సాగాలి. అత్యున్నతమైన శిఖరాలన అధిరోహించాలి.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# రావూరి భరద్వాజ స్త్రీ పాత్ర చిత్రణ – పరిశీలన

- కోయారి నాగరాజు
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ,
పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

భరద్వాజ తన రచనల్లో చిత్రించిన కొన్ని స్త్రీ పాత్రలను మచ్చుకు పరిశీలిద్దాం. ఆయన స్త్రీ పాత్రలను చాలా ఆర్ద్రంగా చిత్రించారు. ఒక వ్యక్తి తాలూకూ, ఆర్థిక పరిస్థితులను, మనాసికమైన వత్తిళ్లు, పుట్టి పెరిగిన వాతావరణం వీట న్నింటిలో నుండి వచ్చిన సంస్కారం కలిసి ఆ వ్యక్తి నైతిక జీవితాన్ని నిర్ధారణ చేస్తాయని "నువ్వేం చేస్తున్నావ్" అనే కథలో రమణి పాత్ర ద్వారా చూపించారు.

'చరమాంకం'లో సుమతి పాత్ర ద్వారా స్వచ్ఛమైన ప్రేమను గురించి సందేశాత్మకంగా చెప్పారు. ఒక వ్యక్తి మరొక వ్యక్తిని ప్రేమించడానికి, ఆస్తులు, అంతస్థులూ కారణం కానవసరం లేదని, అవతలి వారిలో అమాయకత్వం కూడా కారణం కావచ్చునని, ఆ కారణం వెనుక అవ్యాజమైన ప్రేమానురాగాలు తప్ప ఇంకే ప్రయోజనాలు వుండవనీ మనకీ పాత్ర ద్వారా తెలియజేసారు.

'సౌందరనందం'లో తాను చదివిన చదువులూ, తన స్నేహితులూ, సుందరిని ఆధునికత వైపు ఆకర్షించాయి. దీనికి తోడు యవ్వనంలో వయస్సు చేసే అల్లర్లు, తొందరలు, ఒత్తిడిలు ఆమె మనస్సు మీద ప్రగాఢమైన ప్రభావాన్ని చూపాయి. జీవితంలో ఓడిపోయిన దయనీయమైన పాత్ర సుందరి.

మనిషికి దేవునికి మధ్య వారధి మనకు జన్మనిచ్చిన 'అమ్మ'. మాతృహృదయం ఎంత ఉన్నతమైనదో, ఉత్తమోత్తమ మైనదో, ఉదాత్తమైనదో చెప్పడానికి 'కడుపుతీపి' కథలో పార్వతమ్మ పాత్ర పరాకాష్ట. తన రక్తాన్ని పంచుకొని, తన పేగు త్రెంచుకొని పుట్టిన బిడ్డల సంక్షేమం కోసం తన్ను తాను కులటగా చిత్రించుకునే అంశం చాలా ఆర్ద్రమైంది. మాతృప్రేమ కోసం, తల్లి ఆదరాభి మానాల కోసం, ఆప్యాయతతో కూడిన అనునయ పూర్వకమైన ఆమె స్పర్శ కోసం, అనురాగ తప్తమైన ఆమె ఆలింగనం కోసం అలమ టించి పోతున్న బిడ్డకు అమ్మ హృదయావిష్కరణ కనిపిస్తుంది ఇందులో.

'ఆహుతి' కథలో జానకి పాత్ర తనను మోసం చేసిన వాడి ముందు ప్రాధేయ పడదు. ప్రేమించడం పొరపాటయితే ఆ పొరపాటుకు ఇద్దరం బాధ్యులమే అనడంలో, ఆమెలో ఎంతో గుండె నిబ్బరం, ధైర్యం, హృదయ సంస్కారం కని పిస్తుంది. లలిత సున్నిత హృదయురాలే కాక తన మూలంగా ఇతరులు ఇబ్బందులు పాలు కాకూడదు అని కోరు కుంటుంది. తన వృత్తిలోని నిజాయితీకి నిదర్శనంగా నిలు స్తుంది నీలవేణి పాత్ర. ఈ మూడు స్త్రీ పాత్రలలోనూ ఆత్మాభిమానం, ఆత్మగౌరవం తొణికిసలాడుతూ, విషాద భరితమైన జీవిత సత్యానికి, కరుణరస ప్రధానమైన సాహితీ రూపమే ఈ కథ అని చెప్పక తప్పదు.

ఎత్తుగా ఉన్న స్త్రీల గుండెల గురించి కాక, ఆ గుండెల్లో వుండే జ్వాలల గురించి రాశారు. ఆ స్త్రీల మధురాధరాల గురించి కాక, ఆ అధరాల వెనుక వుండే విషాద గాథల్ని గురించి రాశారు. లలనల నల్లని అందమైన కళ్ల గురించి కాక, ఆ కళ్ల వెనుక ఉండే అపార కన్నీటి ధారల గురించి రాశారు. అందుకే భరద్వాజ సాహిత్యం మానవతతో సాంద్రమయింది, ఆర్ద్రమయింది.

బాధితులపట్ల, మోసగింపబడిన, దగాబడిన వారి పట్ల, రచయితలో అశేషమైన సానుభూతి ఉంది. ఆ కారణంగానే నాగరిక ప్రపంచం అసహ్యించుకునే స్త్రీలను గురించి, ఇంత ఆర్ద్రంగా రాయగలిగారు రచయిత. వారి బాధామయ గాథల పట్ల ఆయనకున్న సానుభూతి, ఆయన గారి చాలా కథల్లో వ్యక్తమౌతూ వుంటుంది.

అతని జీవితంలోని చేదు అనుభవాలు, అతని రచనలకు ఒక ఆర్ద్రమైన రూపమిచ్చాయి. భరద్వాజ రచనలలో స్త్రీ పాత్ర చిత్రణం కరుణరస పూరితంగా వుంటుంది.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

యుగయుగాలుగా స్త్రీ హింసింపబడుతూనే ఉంది. అగ్నిప్రవేశం చేసి "నీ శీలాన్ని నిరూపించుకో" మని రాముడు సీతను హింసించాడు. "పధ్నాలుగేళ్ళు నేను లేకుండా నీవూ ఉన్నావు గదా! నీ శీలాన్ని కూడా ఋజువు చేసుకో", అని సీతమ్మ అడగలేక పోయిందేం అంటారు మన భరద్వాజ మహర్షి.

భర్తలను అలా నీలదీసి అడిగిన స్త్రీలు చరిత్రలో కనిపించరు. ఇప్పుడూ కనిపించరు. అందువల్లనే స్త్రీ హింసించబడుతున్నది. సంపన్నమైన ఇళ్లలో ఉంటున్నా సుఖానికి నోచుకోక క్షోబ అనుభవించే స్త్రీలెందరో ఉన్నారంటారు భరద్వాజ.

భర్త విశృంఖల విహారం చేస్తూ భార్యను అనుమానిస్తాడు. ఆమె కదిలినా, మెదిలినా అనుమానే. ఆమె ఇంకొకరిని చూసి నవ్వడం నేరం. మాట్లాడడం నేరం. "ఈ స్థితి నుండి ఆమె బయట పడుతుందని చెప్పలేం" అంటారాయన.

సంఘంలో స్త్రీల పట్ల జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు గురజాడ ఎలా స్పందించారో, భరద్వాజ కూడా అలాగే స్పందించారు. స్త్రీల కన్నీటి గాథలు మనకు తెలుసునన్నాడు గురజాడ. స్త్రీలు మేలుకోవాలి, తిరగబడాలి అని కూడా ఆయన చెప్పాడు. అప్పటికి, ఇప్పటికి స్త్రీల విషయంలో పెద్ద తేడా లేదని భరద్వాజ రచనలు స్పష్టం చేస్తున్నాయి.

"పెళ్లి కాకుండానే అమ్మను కాబోతున్నందుకు నేను సిగ్గుపడడం లేదు. సిగ్గు పడటమే అవసరమైతే, వాడూ పెళ్లి కాకుండానే తండ్రి కాబోతున్నాడు గదా. అతనెందుకు సిగ్గుపడడు?" అంటుందా అమ్మాయి.

"ఈర్ష్యాసూయలతో, ద్వేషాలతో, పరస్పర హననంతో, మానవ జాతి తుడిచిపెట్టుకు పోకుండా, దైన్యాలను, దారిద్ర్యాలను, చిత్రహింసలను, ద్రోహాలను సమస్త అవమానాలను అనుభవిస్తూ, సహిస్తూ, ఈ సృష్టిని అవిచ్ఛిన్నంగా కొనసాగిస్తున్న స్త్రీ జాతికి ఈ సమాజం, ఈశ్వరుడు చాలా ఋణపడి ఉన్నా"రంటారాయన.

నేడు స్త్రీని మారణాగ్ని జ్వాలల్లోకి నెడుతున్న వరకట్న పిశాచి దారుణ స్వరూపాన్ని రచయిత చక్కగా చిత్రించారు.

రోడ్డు ప్రక్కనే ఉన్న మేడ గదిలో – అడిగినంత కట్నం యిచ్చినా ఆశ తీరని అబ్బాయిగారు, అమ్మాయిని సిగరెట్లతో కాల్చడం, పిన్నులతో గుచ్చటం, గాజు పెంకులతో గీరడం, యాసిడ్ చుక్కలు పోయరాని చోట పోయడం చూడలేక గిజగిజ లాడి పోయిందట ఓ దీపం. ఆమె ఆర్తనాదాలు విని కూడా పట్టించుకోని మనుష్యుల మీద బాంబులా బద్ద లవుదామని అనుకున్నదట. కత్తులతో, బాకులతో, సైకిల్ చైనులతో యువత వీధులను ఆక్రమించుకోవడం తనకు తెలుసునట. సినిమా చూసి వస్తున్న భార్యాభర్తలను గూండాలు దోచుకోవడం తనకు తెలుసునట. ఒక పిచ్చి తల్లిని అయిదారు మగ పశువులు మానభంగం చేయడం తనకు తెలుసునట. ఒకే రాత్రి, ఒకే మంచం మీద పది మంది కామ హోమంలో కాలిపోయిన కన్నెపిల్ల గురించి కూడా తనకు తెలుసునట. ఇలాంటి ఘోరాలను చూడలేనప్పుడు కళ్లు మూసుకుంటుందట. ఈ ఘోరాలన్నీ చేస్తున్నది మీ మనుష్యులేనా అని చెప్పి "మీ కసహ్యం వేయదా? మీరెప్పుడూ సిగ్గుపడరా?" అని ఒక దీపం అడగటం కూడా రచయితకు వినిపిస్తుంది. ఈ చేదు నిజాలు మానవతకే సిగ్గు చేటని మరోసారి చెప్పాలా?

యువకులు వరకట్నం కోసం వనితల్ని హింసించటం తప్పని ఆ తప్పుని సమాజంలోని ప్రతి ఒక్కరు సరిదిద్దాలని రచయిత ఉద్బోధిస్తారు.

కవికి ప్రకృతిలోని పరిణామం కూడా, అత్తింటి ఆరళ్లను భరించలేని దుస్థితిగా గోచరిస్తుందంటే వారి మనస్సులో ఎంత క్షోభ ఉందో గమనించవచ్చు. "అత్తింటి ఆరళ్లను భరించలేక, కొత్త కోడళ్లు చేసే ఆక్రందనాలలాగా ఆకాశం నిండా ఉరుముల అరుపులే. ఆత్మ హననం చేసుకుంటున్న అనాథ స్త్రీలలాగా ఆకాశం నిండా మెరుపుల మంటలే" అంటారు ఆయన స్మృతి కావ్యాలలో.

సహృదయులను, కరుణాంతరంగులను, సౌజన్య మూర్తులను చూచినప్పుడు ఈశ్వర భావంతో మెలగడం క్రౌర్యాన్ని, అమానుషత్వాన్ని, రక్తపాతాన్ని, దారిద్ర్యాన్ని చూచినప్పుడు ఈశ్వరునిపై మండిపడడం ఆయన రచనలలో కనిపిస్తుంది.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

మనిషిలోని కుత్సితాన్ని, కుళ్లును, రక్తపిపాసను, పాశవికతను, క్రూరత్వాన్ని, అజ్ఞానాన్ని, పిరికితనాన్ని, స్వార్థాన్ని, సమరోన్మాదాన్ని, ఇంకా సవాలక్ష అవలక్షణాలను... చూసి ఆయన మనసు కార్చే కన్నీరు కనబడుతుంది ఆయన రచనలలో.

జీసస్‌లు, ఫారడేలు, చాప్లిన్‌లు, క్రిజ్లర్‌లు, గోర్కీలు, చెకోవ్‌లను పరామర్శిస్తూ మళ్లీ ఒక బుద్ధుడు, ఒక క్రీస్తు, ఒక మహాత్ముడు ఒకేసారి అవతరించవలసిన అవసరం వుందంటారు. నినాదాలు, వాదాలు ముఖ్యం కాదు. ఎదుటి వారికి సాయపడటం నేర్చుకోవాలి. వాటిని ఆచరణలో పెట్టాలి.

"నువ్వు అమ్మవయినా, అక్కవయినా, ఆలివయినా, చెలివయినా, చెల్లివయినా మాకొక్కటే! నువ్వు ఆడదానివి. నిన్ను హీనంగా చూసే హక్కు, హింసించే హక్కు, అమ్ముకునే హక్కు, కొనుక్కునే హక్కు, అనుభవించే హక్కు, అవమానించే హక్కు మాకున్నాయి. నీ స్తన్యం తాగి పెరిగాం. పెద్దయ్యాక ఆ స్తన్యాలనే సిగరెట్లతో కాలుస్తున్నాం. నీ తొడల మీద స్నానం చేశాం. పెద్దయ్యాక ఆ తొడలనే బ్లేడుతో చీరి పారేస్తున్నాం. నీవు ఆప్యాంగా గుజ్జన్నం తినిపించిన వేళ్లల్లో... గుండు సూదులు గుచ్చుతున్నాం. నువ్వు ఉప్పుప్పుగోనె మోసిన వీపు మీద, గాజు పెంకులతో గీరుతున్నాం. మమ్మల్ని ముద్దాడిన పెదవుల్ని కత్తిరిస్తున్నాం. మమ్మల్ని మెత్తగా హత్తుకున్న నీ చెంపల మీద యాసిడ్ పోస్తున్నాం. నీ వేళ్ల నిండా రక్తం, నీ కళ్ల నిండా రక్తం, నీ చెక్కిళ్ల నిండా రక్తం, పాలిళ్ల నిండా రక్తం, అయినా మా చూపులన్నీ నీ అవయవాల చుట్టూనే తిరుగుతుంటాయి. మా ఆలోచలన్నీ నిన్నాపాద మస్తకం అల్లుకునే ఉంటాయి.

## ఉపయుక్త గ్రంథసూచి :


1. డాక్టర్ రావూరి భరద్వాజ స్మృతి కావ్యాలు
2. రాధ గురించి – నాలుగు మాటలు
3. నాలోని నీవు – ఒక పరిశీలన

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# రావూరి వారి కథల్లో పాత్ర చిత్రణ

- బి.శ్రీ.ఎస్. పద్మశ్రీ
తెలుగు శాఖాధ్యక్షురాలు
శ్రీ పద్మావతి మహిళా హిందూ కళాశాల,
మచిలీపట్నం. కృష్ణాజిల్లా.

తెలుగు సాహిత్యానికి ఎనలేని గౌరవాన్ని కలిపించి తమ రచనలలో అత్యుత్తమ జ్ఞానపీఠ పురస్కారాన్ని సాధించిన తెలుగు సాహితి త్రిమూర్తులలో ఒకరు శ్రీ రావూరి భరద్వాజ గారు. వీరి జీవితం సాహిత్యం రెండు బింబ ప్రతిబింబాలు. సాధారణంగా అభిరుచితో పాటు సాహిత్య సృజన చేసిన వారి సాహిత్యపు రుచి వేరు, కాని జీవితానుభవాలతో కలం పట్టి సాహితి వ్యవసాయం చేసిన వారి సాహిత్య సువాసనలు వేరు. భరద్వాజ గారు సాహిత్యం విలక్షణంగా కనిపిస్తుంది. వారి సాహిత్యానికి ఆనాడు అంతగా గుర్తింపు పొందక పోయిన, భవిష్యత్తు తరాలలో ఆ సాహిత్యానికి మంచి గుర్తింపు లభించటమే కాక ఆదర్శంగా నిలుస్తుంది అన టంలో ఎలాంటి సందేహం లేదు. అందుకు మన సాహిత్య చరిత్రలో ఎన్నో ఉదాహరణలు గమనించవచ్చు.

ఒక సాదారణ రైతు కుటుంబంలో ఎడు, ఎనిమిది తర గతులు చదువుకుని జీవన పోరాటంలో 32 సంవత్సరాలు రోజు వారి కూలిగా, వడ్రంగిగా, కుమ్మరిగా, రంపంలాగే కుర్రాడిగా, పేపర్ బాయ్‌గా, గ్రూప్ లీడర్‌లా పిడికెడు మెతుకుల కోసం ఆకలిని దారిద్ర్యాన్ని తట్టుకుంటు చిన్నా చితక ఉద్యోగాలతో బ్రతుకు నెట్టుకుంటు బాధలు కష్టాలు, అవమానాలు తప్ప ఏ సుఖానికి నోచుకోలేదు. తాను జీవి తంలో ఎదురుకొన్న కష్టాలను, సుఖాలను తన రచనలకు మూలాలుగా వాడుకున్నాడు. తాను వ్రాసిన కథలు, నవల, నాటకం, స్మృతి సాహిత్యం, బాల సాహిత్యం, జీవిత చరిత్ర ఇలా అనేక ప్రక్రియలలో నూతన ప్రయోగాలు చేసి, బాల సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన డా॥ రావూరి భరద్వాజా గారి "పాకుడు రాళ్ళు" నవల "2012" సంవత్సరం అత్యంత ఉన్నతమైన జ్ఞానపీఠ సాహిత్య పురస్కారం రావటం తెలుగు వారందరు గర్వించ తగ్గ విషయం తెలుగు సాహిత్యానికి సంబంధించి ఇంతవరకు ముగ్గురికి జ్ఞానపీఠ అవార్డులు వచ్చాయి. వారిలో మొదటి ఇద్దరు ప్రధానంగా కవులు. రావూరి భరద్వాజ గారి వచన రచనలకు రావటంతో తెలుగు వచన సాహిత్యానికి తొలిసారిగా జ్ఞానపీఠ పురస్కారం వచ్చినది అని ఇది నిజంగా తెలుగు వారు గర్వించ తగిన విషయం.

భరద్వాజ గారు కథా రచనలో ఆరి తేరిన వాడు లోకాన్ని సూక్ష్మ పరిశీలన చేస్తూ తన జీవిత అనుభవాల పట్ల గాడాను భూతితో కథాంశాలను ఎన్నుకొని రచనలు చేసేవారు. భరద్వాజ గారి జీవితమే ఆయనను ఒక రచయితగా తీర్చి దిద్దింది. భరద్వాజ గారి రచన పాఠకునికి సూటిగా విష యాన్ని తెలిసేలా చేస్తాడు. తన నిత్య జీవితంలో తనకు ఎదురైన సంఘటనను ప్రతి వ్యక్తిని తన రచనలో ఎక్కడో ఒక చోట ఎప్పుడో ఒకప్పుడు వినియోగించుకున్నారు. వీరి కథలలో కనిపించే పాత్రలలో ముఖ్యంగా కార్మికులు, కర్ష కులు, కూలీలు, టిఫెన్ క్యారేజిలు మోసేవారు, కొలిమి పని చేసేవారు, సవరాలు కట్టేవారు, రిక్షా కూలీలు, మురుగు కాలవలు, ఊడ్చేవాడు, బిక్షగాడు అందరిని వారి కథలలో పాత్రలుగా మలచుకొనేవారు. రావూరి భరద్వాజ గారు సుమారు ఐదు వందలకు పైగా కథలను రాశారు. ఆయన కథల్లో వేలాది పాత్రలున్నాయి. ఆ పాత్రలో ఏది కల్పితం కాదు. అన్ని పాత్రలు మనకి తెలిసినవే వుంటాయి. అన్ని కథలలో పాత్రలను గురించి తెలుసుకోవడం కష్టం కాని భరద్వాజ అంతర్ బాహ్య జీవితాలను ఆలోచనా విధానాలను ఆ జీవితాల వెనుక గల పరిస్థితులను ఆ కథలలోని పాత్రలను పరిశీలిస్తే రావూరి వారి పాత్ర చిత్రణా నైపుణ్యం తెలుస్తుంది. అందుకే వారి కథలలోని పాత్రలను పరిశీలిస్తే రావూరి వారి పాత్ర చిత్రణా నైపుణ్యం తెలుస్తుంది. అందుకే వారి కథలలోని పాత్రలను వివరిస్తాను.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

**కడుపు తీపి కథలో పార్వతమ్మ :**

భగవంతుడు తనకు ప్రాతినిధ్యం వహించేందుకు గాను మాతృదేవతను సృష్టించాడని ఒక ఆంగ్ల సామెత చెబుతుంది. ఆ సామెతకు సరిపోయే విధంగా ఈ కథలో పార్వతమ్మ అసలీ కథ ప్రారంభమే ఎక్కడో జరుగుతుంది. పువ్వు దగ్గర నుంచి మొదలై విత్తనం దాకా ప్రయాణం చేయడం లాంటిది. ఎక్కడో ఒక ఆశ్రమంలో ఒక శకుంతల ఆ శకుంతల దిక్కు లేనిదిగా అందరు అనుకోవడం చాలా ఏళ్ళ తరువాత ఆమెకొక అన్నగారు ఉన్నట్టు రుజువుకావడం. ఆ అన్నగారు ఈ శకుంతలను మరో అక్కగారి దగ్గరకు తీసుకొని వెళ్ళడం. ఆ సుబద్ర గారు తమ్ముడి శీలాన్ని శంకించడం ఈ సంగతి తెలిసిన శకుంతల తాను పొరపాటు పడ్డానని గ్రహించి పశ్చాతాప పడుతున్నప్పుడు విధి లేని పరిస్థితిలో ఆ అన్న గారు అసలు రహస్యాన్ని బయట పెట్టడంలో కథ. కొత్త మలుపు తిరిగి ముగుస్తుంది. తల్లి హృదయం ఎంత ఉన్నతమైనదో ఈ కథలోని పార్వతమ్మను చూసిం దాకా మనం అంచనా వేయలేము.

ఇద్దరు బిడ్డలు కలిగిన తరువాత భర్తను కోల్పోయిన పార్వతమ్మ ఆ బిడ్డల సంరక్షణ కోసం మరో కలవాడి పంచన చేరుతుంది. ఆ కలవాడికి లొంగి పోతుంది ఈ లోగానే కూతురు సుబద్ర చేసిన ఒక పొరపాటు కారణంగా తల్లి అవుతుంది. ఆ బిడ్డను ఆశ్రమంలో వదిలేస్తుంది. పార్వతమ్మ ఆ బిడ్డ తన బిడ్డగానే తన కొడుక్కి కూడా చెబుతుంది. కూతురు పరువు ప్రతిష్టలను కాపాడడం మాతృ హృదయా నికి పరాకాష్ట. మాతృ హృదయం ఎంత సమున్నతమయినదో చెప్పేందుకు రచయిత ఈ కథను రాశారనిపిస్తుంది. మాతృ ప్రేమ కోసం ఆమె ఆదరాభిమానాల కోసం ఆమె స్పర్శ కోసం అనురాగ తప్తమైన ఆమె ఆలింగనం కోసం అల మటించి పోయిన వ్యక్తిత్వానికి గాని ఈ కథలోని ఆయువు పట్టు అర్థం కాదు. కథలో పార్వతమ్మ వచ్చే సందర్భాలు చాలా తక్కువ కాని ఈ కథకు మూలం పార్వతమ్మ గారు.

**విజయ విలాసం కథ – చలపతి పాత్ర :**

ఈ కథలో చలపతి అన్నకు దేశసేవను గూర్చి ప్రజా సేవను గూర్చి ఏమి తెలియదు. కాని దేశం కోసం ప్రజల కోసం తపించిపోయే “విజయ” అన్న అమ్మాయి అంటే చలపతికి చాలా ఇష్టం. ఆ పరిచయాన్ని పెంచుకోవడం కోసం ఆ పరిచయాన్ని ప్రేమగా మలచుకోవడం కోసం చలపతి కూడా దేశసేవలోకి దిగుతాడు. విప్లవ కార్యక్రమాల్లో పాల్గొంటాడు. దాని ఫలితంగా శిక్షకు గురి అవుతాడు. అతడు జైలుకు వెళ్ళే ముందు విజయను తన మిత్రునికి అప్పగించి పోతాడు. జైలులో ఉన్నప్పుడే విజయకు ఆ మిత్రునకు గల సంబంధాలను గురించి వారు వీరు చెప్పు కోగా వింటాడు. జైలు నుండి విడుదలై వచ్చిన చలపతి ఎలాంటి సంకోచము లేకుండా విజయను మరలా స్వీక రిస్తాడు. దానికి అతడు చెప్పుకున్న సంజాయిషి “ ఈ విజయ కోసం నా కిష్టం లేని పనులు చాలా చేసాను. ఈ విజయం కోసం నేను చాలా త్యాగం చేసాను. ఇప్పుడిదే విజయం కోసం నేను నైతిక సూత్రాలను ఎందుకు త్యాగం చేయకూడదు అని అనుకుంటాడు. చలపతి విజయ పట్ల అతనికున్న గాఢాను రాగాన్ని అతని ద్వారా రచయిత మనకు తెలియజేస్తాడు. అసలైన ప్రేమ అనంతమైన త్యాగాలను కోరుతుంది.

**సామిదేని కథలో కుశాలరావు :**

రచయితలు అనేక రకాల పాత్రలను సృష్టిస్తూ ఉంటారు. ఈ పాత్రలలో రకరకాల వృత్తులవారు ప్రవృత్తుల వారు ఉండవచ్చు. ఒకానొక పాత్ర చిత్రణను బట్టి రచయితకు ఆ పాత్ర తాలూకు వర్గంతోను లేదా సంస్కారంతోను ఎలాంటి సంబంధాలు ఉంటాయో తెలివైన పాఠకుడు సుల భంగానే పోల్చుకుంటాడు. ఒక రచయిత సృష్టించే పాత్రలో రచయిత లక్షణాలు కూడా ఉండవచ్చు సామిదేని కథలోని కుశాలరావు పాత్ర సరిగ్గా అలాంటిదే ఉత్తమ పురుషలలో సాగిన ఈ కథా రచనలో భరద్వాజ కుశాలరావు అన్న రచయిత పాత్రను ప్రవేశ పెట్టారు. ఈ పని చేయడం ద్వారా భరద్వాజ తాను సాధించ తలచుకున్న ప్రయోజనం ద్వారా తాను సాధించిన ప్రయోజనం చెప్పకనే చెప్పారు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

వర్గ సమాజంలో రచయిత కూడా ఏదో ఒక వర్గానికి చెంది ఉండక తప్పదని, ఆయా వర్గాల ప్రభావం రచయిత మీద కూడా ఉంటుంది అని చెప్పడమే భరద్వాజ లక్ష్యం. ఈ కథారచన ద్వారా ఆయన దానిని సాధించారని చెప్ప వచ్చు. ఈ కథలోని కుశాలరావు పాత్ర నిజాయితీతో కూడు కున్నది. పరిస్థితుల ప్రభావానికి అతలకుతమైపోతున్న ఈ పాత్రకి భరద్వాజకి ప్రతిరూపమా అనిపిస్తుంది. భరద్వాజ కూడా తన నిజజీవితంలో చాలా సమస్యలను ఎదుర్కొన్నారు. తన అనుభవాలను పాత్రలకు అన్వయించడం ద్వారా ఆ పాత్రలకు ఒక సమగ్రతను ఆయన సాధించిపెట్టారు. ఈ కథలోని మలుపేంటంటే జైలులో ఉండి కూడా వారందరు చనిపోయినందుకు సంతోషించాడు. అయితే అతను ఇచ్చిన విషం కల్తీకావడం వల్ల అతని భార్యాబిడ్డలు ఆసుపత్రి పాల య్యారే కాని మరణించలేదు. ఈ సత్యాన్ని కుశాలరావు తెలియజేయడం ద్వారా అతనికున్న కొద్దిపాటి తృప్తిని ఆ రహస్యాన్ని తనలో దాచుకుంటుంది.

## మళ్ళీ తెల్లవారింది కథలో తురంగరావు :

మనసును మూడు తరగతులుగా మానసిక శాస్త్రవేత్తలు విభజించారు. ఈ విభజనకు శ్రీకారం చుట్టినవారు సిగ్మండ్ ఫ్రాయిడ్ స్థూలంగా ఈ మూడు తరగతులు ఏమిటంటే చైతన్యం, సుప్తచైతన్యం, అధోచైతన్యం వాస్తవ జీవితంలో తీర్చుకోలేని అనేక కోరికలను మనసులో తీర్చుకోవడం చాలా సహజం. ఈ సహజమైన శాస్త్రీయ సత్యానికి ప్రతీక. కథలో తురంగారావు పాత్ర తురంగమంటే గుర్రమన్న విషయం చెప్పనవసరం లేదు. గుర్రం వేగానికి ప్రతీక. తనలోని తీరని కోరికలను గుర్రం మీద కూర్చోబెట్టి కావలసి నంత వేగంగా తీసుకువెళ్ళడానికి అవకాశాలున్న పాత్ర ఇది.

తురంగరావు బాహ్య జీవితానికి అతని అంతరంగిక జీవితానికి ఎక్కడా సంబంధం లేదు. వాస్తవ ప్రపంచంలో పది పైసలు ఖర్చు చేయలేని తురంగరావు కలల ప్రపంచంలో కోటీశ్వరుడిగా మహా ప్రభువుగా జీవిస్తాడు. తీరని కోరికలు అనేవి వాస్తవ జీవితానికి పరిమితం మనోజీవితానికి సరి హద్దులు లేవు. తురంగారావు నిజానికి మనకు కొత్త పాత్ర కాదు. మనందరిలోను ఏదో ఒక దశలో ఎంతో కొంత మేరకు తురంగారావు జీవించివున్నాడు. ఈ కథ చదువు తుంటే మన గురించి మనమే చదువుతున్నట్టు వుంటుంది. మనలో మాట్లాడుకుంటున్నట్లు అనిపిస్తుంది.

## డబ్బులో జబ్బులో నారాయణ :

కొన్ని ఆశయాలు అపూర్వంగా ఉంటాయి. ఆ ఆశయా లకు అనుగుణంగా అద్భుతంగా ఆలోచిస్తూ వుంటారు. ఆలోచనలని అక్షరాలలో నింపి అందమైన ఆభరణాలుగా మనకు అందజేస్తూ వుంటారు. ఈ కథలోని నారాయణరావు ఈ తరహా మనిషి అతని దగ్గర డబ్బులు పుష్కలంగా ఉన్నప్పుడు అతని ఆలోచనలు మరోరకంగా ఉంటాయి. ఈ ప్రపంచం సుఖమయంగా ఉందో, కష్టమయంగా ఉం దో ప్రపంచ పరిస్థితులను బట్టికాక తన జేబు బరువును బట్టి నారాయణ నిర్ణయిస్తూ వుంటాడు. అందరికి మామూ లుగా కనిపించే చాలా విషయాలు నారాయణకు వింతగాను, విడ్డూరంగాను అనిపిస్తాయి. ప్రపంచం నిండా కష్టాలే ఉన్నప్పుడు సుఖం అనేది లేనప్పుడు భగవంతుడు ఈ ప్రపం చాన్ని సృష్టించడంలో అర్థం లేదనుకుంటాడు. నారాయణ తన చుట్టూ వున్న చాలా మంది ఆకలితో అలమటించి పోతున్నప్పుడు సంపన్నులైన వాళ్ళు అవి తమ చుట్టూ జరగనట్టు తమను తాము వంచించుకొని ఎలా జీవిస్తున్నారో తనకు తెలియదంటాడు నారాయణ. ఇవన్నీ వినడానికి, కనడానికి బాగానే వుంటాయి కాని ఆచరణలోకి వచ్చే టప్పటికి ఏ రూపు ధరిస్తాయన్నది. ఎన్ని కబుర్లు చెప్పినా నారా యణ కూడా తన దగ్గరున్న అణాకాసుతో ఒక బిక్షగాడు రొట్టె ముక్క బీడిలు కొనుక్కుని తాగేస్తాడు. మానవ సహజమైన ఒకానొక బలహీనతకు ఈ కథలోని నారాయణ చిరునవ్వుతో కూడిన వ్యాఖ్యగా మనకు దర్శనమిస్తాడు.

ఈ విధంగా రావూరి భరద్వాజగారు తన కథలలో ఇంతటి వైవిధ్యం వున్న పాత్రలను తీసుకురావడానికి ప్రధాన కారణం వారికి వివిధ రంగాలలో రావూరి వారికి ఉన్న పరిచయమే తాను అనుభవించిన కష్టాలు, సుఖాలు అను

భవిస్తూ వున్నవారు ఇప్పటికి లక్షలాది మంది వున్నారు. వీరందరిని ముఖ్య పాత్రలుగా చేసుకొని నిత్య జీవితంలోని అనుభవాలను, అనుభూతులను, జ్ఞాపకాలను కన్నీళ్ళలను పాత్రల రూపంలో తెలియజేసి తెలుగు కథలకు వన్నె తెచ్చిన డా॥ రావూరి భరద్వాజ గారు తెలుగు సాహితి లోకానికి గర్వకారణమని చెప్పవచ్చును. నేటి భవిష్యత్తు తరాల రచయితలకు మార్గదర్శకులు అని చెప్పవచ్చు. తెలుగు సాహిత్యానికి భరద్వాజగారు చిరస్మరణీయులు.

**ఆధార గ్రంథాలు :**

1. పాకుడురాళ్ళు
2. కాదంబరి
3. జీవనసమరం

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# కథానిక సాహిత్యం వాస్తవికత డా॥ రావూరి భరద్వాజ

- డా॥ బి.వి. లీలారాణి
ప్రధానాచార్యులు, రీడర్ ఇన్ తెలుగు,
వై.వి.ఎన్.ఆర్. గవర్నమెంట్ డిగ్రీ కళాశాల,
కైకలూరు, క్రిష్ణ జిల్లా.

తెలుగు ఆధునిక వచనానికి జ్ఞాన పీఠ పురస్కారాన్ని తెచ్చిన ఘనత రావూరి భరద్వాజకే దక్కుతుంది. తెలుగులో మంచి ఆధునిక వచన సాహిత్యం కథా సాహిత్యం చాలా ఉంది. కాని మనకు వచ్చిన అకాడమీ పురస్కారాలు చాల కవిత్వానికే వచ్చాయి. తెలుగు వచనానికి ఇంతగొప్ప కీర్తిని ఒక జాతీయ స్థాయిని అంతర్జాతీయ స్థాయిని తెచ్చిన ఘనత ఇలా భరద్వాజకు దక్కుతుంది.

మరొక విషయంలో కూడా భరద్వాజ ప్రత్యేకతని చెప్పడానికి వీలుంది. తెలుగులో నవలలు రాసినవారున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు వచ్చిన నవలలు కూడా ఉన్నాయి. కన్నడంలో, మళయాళం తమిళ భాషలలో నవలలకు ఈ అత్యున్నత జ్ఞాన పీఠ పురస్కారాలు వచ్చాయి. కాని తెలుగులో నవలా సాహిత్యానికి జ్ఞాన పీఠ అత్యున్నత పురస్కారాన్ని తెచ్చిన ఘనత కూడా భరద్వాజదే.

జ్ఞానపీఠ పురస్కారాన్ని ప్రకటిస్తూ ఒక పుస్తకం పేరును చెప్పినా, ఒక కవిగాని సాహిత్యకారునికి గాని ఈ పురస్కారం ఇచ్చే సందర్భంలో అతను చేసిన మొత్తం సాహిత్య కృషిని దృష్టిలో పెట్టుకునే ఈ అవార్డు ఇస్తారు. ఆ విధంగా చూచినా భరద్వాజ సాహిత్యం అత్యధికం వచన సాహిత్యం కావడాన్ని కూడా అందరూ గమనించాలి. తెలుగు ఆధునిక వచన సాహిత్యానికి శిఖరప్రాయమైన గౌరవాన్ని తెచ్చిన వ్యక్తిగా ఇలా భరద్వాజ చిరస్థాయిగా నిలిచారు.

రావూరి భరద్వాజ అట్టడుగు జీవితాలకు అద్దం పట్టే ఉద్యమాన్ని తన రచనల్లో 70 సంవత్సరాల పాటు అనవరతంగా సాగించిన రచయిత. చదువుకున్నవాడు కాదు. తన పదమూడవ యేట ఏడో తరగతి చదువుతుండగా, కేవలం లేమి కారణంగా చిరిగిన బట్టలతో బడికి వెళ్ళిన అతన్ని ఉపాధ్యాయుడు పిలిచి పదిమంది ముందు చావ గొట్టాడు. దైన్యత పడగ విప్పింది. బాధతో, నిస్సహాయతతో రెచ్చిపోయి పుస్తకాలు అక్కడే పారేసి క్లాసు రూంలోంచి పారిపోయాడు. ఆ తర్వాత బడికి వెళ్ళలేదు. కాని తన రచనలు కొన్నితరాలు పిల్లలు క్లాసురూములో చదువుకొనే రచనలు కేవలం పరిశ్రమతో, కృషితో సాధించుకున్నాడు.

భారతీయ జ్ఞాన పీఠ పురస్కారం మన దేశస్థాయిలో నోబెల్ బహుమతి లాంటిది. జాతీయస్థాయిలో అన్ని భారతీయ భాషలలోనూ ఉత్తమ రచయితగా నిలిచి జ్ఞానపీఠాన్ని అధిరోహించడం తెలుగు దేశానికి తెలుగు రచయితకి ఇది మూడవసారి.

కథానికలో కళాత్మక వాస్తవికతని ప్రతిబింబించడమనేది ప్రతిభామూర్తుల సొత్తు. అతి సాధారణంగా, టూకీగా, నిరడంబరంగా, కథానికని, గంభీరమైన ఆలోచనీయమైన సంవేదనని చదువరుల బుర్రలో ప్రవేశపెట్టే నేర్పు కథా తపస్వులకి కరతామలమైన విద్య. అది రావూరి వారి కథల్లో కనిపిస్తుంది.

రావూరి వారి అసంఖ్యాకమైన కథానికల్ని చూసినపుడు వస్తువైవిధ్యం గురించి ఎంతో అబ్బురపడిపోతాము. ఆయన బతుకు వెతల లోలోతుల్ని తాకినవాడు మాత్రమే కాదు, ఆ పొరల్లో మడతపెట్టబడిన అనుభవాలు కలిగినవాడు. ఆ కారణాన ఆయనకి జీవితానుభవాలు అనన్యమైనవి. క్షుత్పిపాసల వేధింపు చవిచూసిన మనిషి అందువల్లనే ఆయన మనిషి కాగలిగారు, మహనీయుడు కాగలిగారు.

రావూరి వారి అభ్యుదయవాదం, పీడిత జనపక్షపాతం, మానవీయ విలువల పట్ల ఆచరణాత్మక ఆరాధనా ఇలాంటి వాటి గురించి ఇవాళ చెప్పుకోవటం దీపానికి వెలుగుంటుందని చెప్పటమవుతుంది. ఒక సాధారణమైన వ్యక్తి అసాధారణ వ్యక్తిత్వమూర్తిగా దర్శనమిస్తారు రావూరి. వారిని చూసినా, చదివినా అర్థమైపోతుందీ వాస్తవం.

కథానికా రచయితగా భరద్వాజగారిది ఒక ప్రత్యేకమైన ముద్ర. ఆయన కథానిక ద్వారా మనతో సంభాషిస్తారు. అనితర సాధ్యమైన సంవిధానంతో పఠితని కథానికతోనూ, తనతోనూ కూర్చోపెడతారు. ఆయన కథానికశైలి మిత్ర సమ్మితంగా సాగుతుంది. చిన్న ఉదాహరణ చూద్దాము. అతని పేరు ఆనందం అతని పేరు భయం అతని పేరు నిర్భయం అతని పేరు మోహం అతని పేరు దాహం అతని పేరు కరుణ అతని పేరు కసి అతని పేరు దు:ఖం అతని పేరు దిగులు అని అదేదో దేవుడు గారికి సహస్రనామాల దాకా లేవా? అనే ప్రశ్నని మధ్యలా సంధిస్తారు. ఇలా కథా నాయకుడు మన ముందు నిలుస్తాడు. నివీణ్ణి కేంద్రంగా చేసుకుని, వీడి చుట్టూ ముసురుకునే కథ ఎలా ఉండాలో ఆలోచిస్తున్నాను. మీరు ఆలోచించండి అంటూ కథానికను ముగిస్తారు. మామూలు మనిషి ఆకారవికారాలు స్వభావ స్వరూపాలు, బతుకు దౌర్భాగ్యం, అదృష్టం అన్నీ చెప్పూనే ఏమీ చెప్పనట్లు గంభీరంగా తన కలాన్ని జేబులో పెట్టేసు కుంటారు. అలోచించిన కొద్దీ వెంటాడుతూనే ఉంటుందా పాత్ర, కథానికా ఇదీ రావూరి వారి కథానికా రచనలోని మెరుపు. ఆయన కలమే, మెత్తని పులి. పై ఉదాహరణ నికథానాయకుడు దొరికాడు? ఇక కథ దొరకాలి అనే కథానిక లోనిది.

ప్రజాస్వామ్యం, సామ్యవాదం వంటి మాటల్ని వూదివూది భయంకరమైన ఎరల్ని వెదజల్లి అసంఖ్యాకులైన మామూలు మనుషుల్ని, అల్ప సంఖ్యాకులైన కొద్దిమంది తెలివైనవారు మోసం చేస్తున్న వైనాన్ని వ్యంగ్యస్ఫోరకంగా ఒక ఎలుక కథు లో శిల్పభరితం చేసారు భరద్వాజ.

రావూరి వారి కథానికల్లో "తే-నీరు" అని చాలా చిన్న కథ ఉంది. అందులో నినేను "తే-నీరు" అనే మాటని మూడుసార్లు విని ఉన్నాడు. నితిరుపతమ్మ గారి వసారాల బియ్యం నేను చూసాను కదా? తీసుకురాక పోయావా అమ్మమ్మా అంటే జుట్టు సర్ది "తే-నీరు" బాబూ అన్నది. మెల్లగా తనలో తాను గొణుక్కుంటున్నట్లుగా ఇది మొదటిసారి. రెండోసారి వాళ్ళ తాత ఎండాకాలం పడమటి శాంబరానికి సొమ్మసిల్లి వచ్చి ఆపసోపాలు పడుతూ "తే-నీరు" అన్నప్పుడు నీరసంగా ఆవురావురుమంటూనూ! ఇక మూడవసారి మంచినీటి వనరున్న గ్రామంలో జనం పొట్ట చేత పట్టుకుని వలసపోవలసిందేనా! ఏమిటీ కారణం? అని అడిగితే అసలు విషయం చెప్పుకొచ్చాడాయన.......... అక్కడెక్కడో ఫ్యాక్టరీ కడుతున్నారట. ఈ నీరంతా దానికే కావలిట. అంచేత ఒక్క నీటిబొట్టును కూడా, ఈ పొలాలకు ఫ్యాక్టరీ వారు "తే-నీరు"ట! అయ్యా అదీ విషయం.

## స్మృతి కావ్యాలు :

అనితర సాధ్యమైన మరొక కృషి ఆయన వ్రాసిన స్మృతి కావ్యాలు. మనకు తెలుగులో స్మృతి కావ్యాలు చాలా వచ్చాయి. సతీవియోగంతో మిత్రవియోగంతో చాలా మంది గొప్ప సాహిత్యకారులు స్మృతికావ్యాలు రాశారు. అవి అన్నీ కవితా ప్రక్రియలు కావడం గమనించాలి. కానీ సతీస్మృతిని వచనంగా రాసిన వ్యక్తి భరద్వాజ ఒక్కరే.

ఈయన 1956 నుండి డైరీ రాశాడు. ఈయనను అత్యం తం ప్రేమించి ఒక చిన్న బాలుడిగా పెంచి ప్రేమ కురిపించిన భార్య కాంతం జీవన గమనంలో మధ్యలోనే 1986లో తనను విడిచిపోయింది. ఈ బాధ భరద్వాజ తట్టుకోలేక పోయాడు. ఈ గాయం నేటికి మానలేదు. ఆ గాయపు జ్ఞాపకాలే అయిదు కావ్యాలుగా రచించాడు. నినాలోని నీవు, అంతరంగిణి, ఐతరేయం అయినా ఒక ఏకాంతం, ఒకింత వేకువ కోసం ఇవి అపూర్వమైన స్మృతి రచనలు.

నిజానికి ఆయన రాసిన వచనం పాకుడురాళ్ళు నవలలో పొడిపొడిగా ఉంటుంది. కాని అత్యంత మధురమైన వచనం చక్కటి తియ్యటి తెలైన వచనం. ఈ స్మృతి కావ్యాలను రాశాడు భరద్వాజ. కవితలో లాగా గుండెను తాకేలా చప్పున గుప్పున గుండెను ఆవరించేలా వచనం రాయడం సులువు కాదు. చాలా కష్టం. కాని భరద్వాజ ఈ స్మృతి కావ్యాలను పట్టుకుంటే ఒక్కొక్క శకలం ఇలా గుండెను పట్టుకుంటుంది. సతీస్మృతి ఇంత గాఢంగా ఉంటుందా ఆ ప్రేమ ఇంత హృదయ విదారకంగా ఉంటుందా ఆ బాధ ఇంత తీవ్రంగా ఉంటుందా అని కదిలిపోతాం. కరిగిపోతాం. రెండు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

వాక్యాలు ఇక్కడ చూద్దాం నిప్రభూ ఈ శరీరం నాకు ఇరుకుగా ఉంది. ఈ పరిసరాలు నాకు అననుకూలంగా ఉన్నాయి. వీటిల్లోంచి నన్ను తప్పించు నన్ను విముక్తి చేయండి... ఆకాశం నిండా విషాదం ఆవరించింది వాయుతరంగాలు వెక్కివెక్కి పడుతున్నాయి. గిరి శిఖరాల నుండి శోకగీతికలు జాలువారుతున్నాయి. ఉషస్సుందరి దు:ఖ తప్త హృదయంతో వివశయై పడి ఉంది. తూరుపు తలుపులింకా మూతపడే ఉన్నాయి. నీ గురించి తలచుకొని... భూదేవి శిరస్సున దోసిళ్ళ కొద్దీ వెండి ముత్యాలు తలంబ్రాలు పోస్తున్నాడు చంద్రుడు. ఆ ముత్యాల మెరుపులన్నీ వెన్నెలగా మారి జారిపోతున్నాయి. కొండల మీద బండల మీద గోపురాల మీద తోటల మీద బాటల మీదా మొగ్గల మీద చిన్నారి బుగ్గల మీదా పూల మీద పచ్చని నేల మీదా చివరికి నా మీద కూడా ..... కాంతం స్మృతి ఇలా ఉంటుంది.

ఇలాంటి వచనం మనకు ఆయన పాకుడురాళ్ళు నవలలో కనిపించదు. అక్కడ వచనం చాలా పొడిపొడిగా ఉంటుంది. అక్కడి వచనం ఒక వీడియో కెమేరా లాగా పని చేస్తుంది. పాకుడు రాళ్ళు నవల చదవడం అంటే ఒక సినిమాను చూసిన అనుభూతి పొంది పుస్తకం అనే థియేటర్ నుండి బయటకి రావడమే. కాని స్మృతి కావ్యాలలోని వచనం పాఠకుడిని ఏవేవో తీరాలలోనికి ఏవేవో అంతరంగ ప్రపంచాలలోనికి ఏవేవో ప్రేమ మహళ్ళలోనికి లాక్కుపోతుంది. ఆ వచనం చదవడం ఒక విశేషమైన అనుభూతి.

అయితే వీటన్నింటికన్నా విలక్షణమైన పుస్తకం మరొకటి ఉంది. అది జీవన సమరం. నగరంలో వీధిలోనికి పోయి తోపుడుబండ్ల దగ్గర నుండి ఫుట్‌పాత్ పై చెప్పులు కుట్టుకునే వ్యక్తి దగ్గర నుండి, రిక్షాతొక్కేవారి దగ్గర నుండి రకరకాల వృత్తులు చేస్తూ జీవన పోరాటం చేస్తున్న వ్యక్తుల వ్యథార్త జీవితాలను వారి నుండే సేకరించి రాసిన పుస్తకం జీవన సమరం. తెలుగులో ఇలాంటిది లేదు. కథకుడుగా నవలాకారుడుగా చిరస్థాయిగా తెలుగులో నిలిచే సాహిత్య శిఖరం భరద్వాజ.

48 సంవత్సరాల సుదీర్ఘ జ్ఞాన పీఠ చరిత్రలో రావూరి భరద్వాజ–ఒక సరికొత్త అధ్యాయానికి ప్రతీక. చదువుతో ప్రమేయం లేకుండా తన రచనలకు జీవితాన్నే పెట్టుబడిగా చేసుకుని అట్టడుగు వర్గాల దయనీయ జీవితాలకు అద్దం పట్టే సాహిత్యాన్ని జాతీయస్థాయిలో నిలిపిన ఘనత రావూరి భరద్వాజకు దక్కుతుంది. సాహితీ చరిత్రలో ఒక గణనీయమైన మలుపుకీ, ప్రజాస్వామికమైన ధోరణికీ, నికార్సయిన జీవుని వేదనకీ అభిజ్ఞగా నిలిచిన ఉద్యమకారుడు. కాళ్ళు నేల మీద నిలుపుతూనే సృజనను ఆకాశాన నిలిపిన గొప్ప స్ఫూర్తి దాయకుడు రావూరి భరద్వాజ.

# జిలుగు వెలుగుల మాటున దాగిన నీడలు - పాకుడురాళ్ళు

-డా॥ నల్లపనేని విజయలక్ష్మి
తెలుగు శాఖాధిపతి, తెలుగు విభాగం,
ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి),
గుంటూరు.

ఎనిమిదో తరగతితోనే స్కూలు చదువుకు దూరమైనా జీవితానుభవాల కళాశాలలో పట్టభద్రుడై, అక్షరాల్ని ఆయుధాలుగా చేసుకొని తాను సృజించిన సాహిత్యంతో 'ఇంతింతై వటుడింతై' అన్నట్లుగా ఎదిగిన అసామాన్యుడు రావూరి భరద్వాజ. నీటిలో బ్రతికే చేపకు ప్రత్యేకంగా ఈత నేర్పనవసరం లేనట్లే జీవితాన్ని చదువుకొన్న వ్యక్తికి సాహితీ సముద్రంలో మునకలు వేసి మేలిమి ముత్యాల్లాంటి రచనలు వెలువరించడానికి డిగ్రీలు అవసరం లేదని అయన నిరూపించాడు. కథ, నవల, నాటకం, బాల సాహిత్యం, స్మృతి సాహిత్యం, యాత్రా చరిత్ర, జీవిత చరిత్ర, విజ్ఞాన శాస్త్రం - ఇలా అనేక ప్రక్రియలలో ఆయన చేసిన రచనలు ఆయన బహుముఖ ప్రజ్ఞకు నిదర్శనాలు. భరద్వాజ సాహితీ రంగంలో అత్యున్నత పురస్కారమైన జ్ఞానపీఠ అవార్డును, మరెన్నో పురస్కారాలను అందుకొన్నాడు.

జీవన సమరంలో భాగంగా పలు వృత్తులను చేపట్టిన భరద్వాజ ఆయా వృత్తులను నిర్వహించేటపుడు తనకు పరిచయమైన వ్యక్తుల జీవితాలను నిశితంగా పరిశీలించాడు. ఆయన 'జ్యోతి', 'అభిసారిక' వంటి సినీ పత్రికల్లో పనిచేసినపుడు సినీ రంగాన్ని చాలా దగ్గరగా గమనించాడు. ఆ రంగంలోని నటుల జీవితాల్లోని వెలుగునీడలను ఇతివృత్తంగా తీసుకొని 'పాకుడురాళ్ళు' నవలను వ్రాశాడు. మొదట దీనిని 'పాలపుంత' పేరుతో పెద్ద కథగా వ్రాశాడు. తరువాతి కాలంలో దానిని పెంచి, మరిన్ని పాత్రలను చేర్చి నవలగా తీర్చి దిద్దాడు. మొదట ఈ నవలకు ఆయన పెట్టిన పేరు 'మాయ జలతారు'. తరువాత శీలా వీర్రాజు గారి సూచన ననుసరించి 'పాకుడురాళ్ళు' అనే పేరు పెట్టాడు. 1961 - 63 సంవత్సరాల మధ్య కాలంలో ఈ నవల కృష్ణా పత్రికలో ధారావాహికంగా ప్రచురించబడింది. అనవసరమైన వర్ణనలకు దూరంగా సాగే కథా కథనం, సరళమైన శైలి, హృదయాన్ని ద్రవింపజేసే సన్నివేశ కల్పనల వల్ల ఇది చక్కని పాఠకాదరణను పొందడమే కాక విమర్శకుల ప్రశంసలను సైతం అందుకొన్నది. 2012 లో ఈ నవలకు భారత దేశంలో నోబెల్ బహుమతి అనదగ్గ జ్ఞానపీఠ పురస్కారం లభించింది.

ఈ నవల మాధవరావు కథనంతో ప్రారంభమౌతుంది. నాటక కథానాయికగా నవలా నాయిక మంగమ్మ నిలదొక్కుకోవటం, నాటక సమాజాలు మూతపడటంతో ఆమె నిరాధారంగా మిగిలిపోవటం వివరించటం ఈ కథనం ముఖ్యోద్దేశం. పౌరాణిక నాటకాల నుండి సాంఘిక నాటకాల వైపుకు నాటకరంగం సాగించిన ప్రయాణం, సాంఘిక సమస్యలను, సాంఘిక దురాచారాలను ఇతివృత్తంగా తీసుకొని ప్రదర్శించబడిన తొలిదశ లోని సాంఘిక నాటకాలకు లభించిన ఆదరణ, స్త్రీ పాత్రలను పురుషులే ధరించే స్థితి నుండి క్రమంగా వచ్చిన మార్పు, అత్యంత దుర్భర పరిస్థితులను అనుభవించే దురదృష్టవంతులైన స్త్రీలు మాత్రమే సంపాదనా దృష్టితో నటించడానికి సిద్ధమవటం, క్రమంగా మూతపడిన నాటక సమాజాలు - ఇలా నాటక రంగ ప్రస్థానానికి సంబంధించిన వివిధ అంశాలను రచయిత ఈ కథనంలో స్పృశించాడు. దీనివల్ల ఆయన రెండు ప్రయోజనాలు సాధించాడు. నవలా రచనలో ఒక క్రొత్త టెక్నిక్‌ను పరిచయం చేయటం. తాను ఎంచుకొన్న ఇతివృత్తానికి సంబంధించిన భూమికను పాఠకుల మనసులో స్థిరపరచటం.

మంగమ్మ నాటక సమాజం నుండి బయటకు వచ్చిన తరువాత కథ రచయిత కథనంగా ఉంటుంది. మంజరిగా మారిన మంగమ్మ తన అందాన్ని ఉపయోగించుకొని ఒక్కొక్క మెట్టే అధిరోహిస్తూ స్టార్ హీరోయిన్ హోదా సంపాదించుకోవటం, శిఖరారోహణే లక్ష్యంగా సాగిన

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

ప్రయాణంలో ఆమె అసలైన ఆత్మీయత కోసం అలమటించడం, వెండితెర వెనుక సాగే ఎత్తులు, జిత్తులు, మోసాలు ఈ భాగంలో కనిపిస్తాయి.

మళ్ళీ చివరిలో మంజరి జీవితం ముగిసిన విధం మాధవరావు చేత చెప్పిస్తాడు. ఆ విధంగా నవలను నడపటంలో సాధారణ రచయితలు అనుసరించే ధోరణికి భిన్నమైన టెక్నిక్‌ను ఆయన ఉపయోగించాడు.

భరద్వాజ గారిది చాలా సరళమైన శైలి. వాడుకలో ఉన్న ఆంగ్ల పదాలను ధారాళంగా వాడతాడు. సందర్భోచితంగా "నక్క పుట్టి నాలుగు రోజులు కాలేదట. ఇంత గొప్ప గాలివాన నా జన్మలో ఎరగనన్నదట", "చేతగాని వాడికి మాటలెక్కువ. చెల్లని రూపాయికి గీతలెక్కువ", "సాయిబు సంపాదన బూబమ్మ కుట్టు పూసలక్కూడా చాలకుండా పోతుంది", "ఆడవాళ్ళ నోట్లో నువ్వు గింజలు కూడా నానవు", "తెగించిన వాడికి తెడ్డే లింగమని" మొదలైన సామెతలను ప్రయోగిస్తూ చెప్పదలచుకొన్న విషయాన్ని చాలా సులువుగా పాఠకులకు చేరుస్తాడు. పాత్రోచిత భాషను ప్రయోగించటం వల్ల కూడా శైలీ సారళ్యం సాధించబడి పాఠకుల హృదయాకర్షకంగా కథ సాగుతుంది.

**మచ్చుకు రెండు సంభాషణలు - మంజరి జాతకం చూడటానికి వచ్చిన శాస్త్రి గారి మాటలు -**

"అయ్యయ్యో ఎంత మాట న్నారు? మీరు ఆజ్ఞాపించడం నేను కాదనడమూనా? అమ్మాయి గారి ముఖం చూస్తూనే నేను సమస్త విషయా లున్నూ స్థూలంగా గ్రహించాననుకోండి. ఓహోహో! బ్రహ్మాండమైన భవిష్యత్తు. జగజ్జేగీయమానవైనటువంటి కీర్తి ప్రతిష్ఠలు అమ్మాయిగారికి లభిస్తాయి. దానికి ఢోకాలేదు. అయ్యా! పోతే... చూడమ్మా! మీ చేతులిలా వొక్కసారి చూపండి!" అన్నాడు పరబ్రహ్మశాస్త్రి గారు.

**పనిమనిషి తాయారు, మంజరిల సంభాషణ -**

"అయ్యగారు శానా కోపం మీదున్నారండీ!" అన్నది తాయారు.

"వెళ్ళారా?" అన్నది మంజరి.

"ఆ! పోయినారండీ అమ్మాయిగారూ! ఏటేటో గొనుక్కుంటూ ఉన్నారండీ!"

"ఆ! గొనుక్కోమనవే. ఇప్పుడు పోయిందేమిటి! బంగారం లాంటి ఆఫర్ చేతికొస్తే వొద్దనమంటాడు! ఇదేం గ్రహచారం తాయారూ! తెల్లవారేటప్పటికి లక్షలు సంపాదించాలంటే ఎలా?" అన్నది మంజరి.

"మా పసందుగా అన్నారండీ అమ్మాయిగారూ! అయినా ఈ మధ్యన అయ్యగారికి కోపం జాస్తి అయిపోనాదండీ! చీటికీ మాటికీ అయిందానికీ కాందానికీ ఇలా చిర్రెత్తిపోతా ఉంటే నెగ్గడం కష్టమండీ!" అన్నది తాయారు.

నవలా నాయిక మంజరి పాత్రను తీర్చిదిద్దడంలో భరద్వాజ ప్రత్యేకమైన శ్రద్ధ కనబరిచాడు.

ఎక్కడ పుట్టిందో, తల్లిదండ్రులెవరో తెలియని స్థితిలో మంజరి జీవిత ప్రయాణం ప్రారంభమైంది. ఆ ప్రయాణంలో తనకు పరిచయమైన మనుషుల్లో ఆత్మీయతను వెతుక్కొన్న ప్రతిసారీ అవకాశవాదమే కనిపించడంతో మంజరి విసిగి పోయింది. చలపతి, వెంకటేశ్వర్లు, ప్రసాద్ – ఇలా ప్రతి ఒక్కరి వల్ల ఎదురు దెబ్బలు తిన్నాక ఆమె రాటుతేలి పోయింది. విలువలకు తిలోదకాలిచ్చి ఉన్నత శిఖరారోహణే లక్ష్యంగా బ్రతికింది. అ విధంగా బ్రతకవలసి వచ్చినందుకు తనను తాను అసహ్యించుకున్నది.

మంజరిలో రెండు పార్శ్వాలు కనిపిస్తాయి. అవసరాల కోసమే ఆత్మీయత ప్రదర్శించే లోకంలో నిజమైన ఆప్తుల కోసం అన్వేషించి, తాను ఆప్తులని నమ్మిన వారికి చేతనైనంత సాయం చేయాలని ప్రయత్నించిన ప్రేమమూర్తి ఒక పార్శ్వం. తాను పొందిన అవమానాలు, తిన్న దెబ్బలు, ఈసడింపులు గుర్తు చేసుకొని అందుకు కారణమైన వారిని బాధ పెట్టి కసి తీర్చుకోవడంలో పరమానందాన్ని అనుభవించిన పాషాణమూర్తి మరో పార్శ్వం. ఆమెలోని ఈ రెండు పార్శ్వాల మధ్య ఘర్షణ నవల అంతటా పరచుకొని కనిపిస్తుంది.

"బతికిన నాలుగు రోజులు జాలీగా బతకాలి. ఎడాపెడా సంపాదించాలి. చిల్ల పెంకుల కింద విరజిమ్మాలి. నిర్దాక్షిణ్యంగా డబ్బు పిండి పారెయ్యాలి. పాపం, పుణ్యం, దయా

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

దాక్షిణ్యం – ఇవన్నీ అర్థం లేని మాటలు. హాయిగా తిని ఇష్టం వచ్చింది తాగి నచ్చిన వాడితో గంటల్ని సెకండ్ల కింద మార్చేసుకొని గడిపెయ్యాలి". అంటూ కసిగా జీవితాన్ని అనుభవించడమే ముఖ్యమని భావించే మంజరి ఒకవైపు, "ఒక్కో తరంగం మహోధృతంగా వచ్చి నా కాళ్ళ కింద మట్టిని తవ్వి లాగి పారేస్తుంటే, ఏమీ చెయ్యడానికి తోచక, ఏడ్చినా వినే దిక్కులేక, అల్లాడిపోతున్నాను. నాకెన్నడూ లేని భయమేదో లోలోపల కలుగుతున్నది. అసంతృప్తి జ్వాలలు ప్రతి రక్త బిందువునూ మాడ్చి వేస్తున్నాయి. ఈ మహా సంక్షోభం నుండి రవంత బయటపడేందుకూ, కాస్త చల్లని వాతావరణంలో ప్రశాంతంగా బతికేందుకూ నాకు అవకాశముంటే చాలు" అని తపించిన మంజరి ఒకవైపు కనిపిస్తారు. ఆమెలోని ఈ రెండు రకాల స్వభావాల మధ్య సంఘర్షణను రచయిత వర్ణించడం వల్ల ఆ పాత్ర పాఠకుల సానుభూతిని పొందగలిగింది.

మంజరి జీవిత చిత్రణ ప్రధానంగా సాగిన ఈ నవలలో వెండితెర జిలుగు వెలుగుల మాటున దాగిన నీడల్ని వెలికి తీసి అందరికీ ప్రదర్శించాడు రచయిత.

సినిమా నటి కావాలనే ఆశతో రిప్రజెంటేటివ్ మాటలు నమ్మి సంసారాన్ని వదులుకొని వచ్చింది తాయారు. ఎక్స్ట్రా వేషాల కోసం ప్రయత్నించి చివరికి పనిమనిషిగా స్థిరపడింది. మోసగాళ్ళ మాటలను నమ్మి జీవితాలను నాశనం చేసుకొనే ఆడవారికి కనువిప్పు కలిగేలా రచయిత ఈ పాత్రను చిత్రించాడు. రోజంతా స్టూడియోలో పడిగాపులు పడినా అయిదారు రూపాయలు దొరకని దుస్థితి, ఆ అయిదారు రూపాయల కోసం కంట్రాక్టర్ చుట్టూ నెలల తరబడి తిరగవలసిన పరిస్థితి, ఆ డబ్బులోనూ రూపాయికి పావలా చొప్పున కొట్టేసే కక్కుర్తి, పదిసార్లు అడిగితే ట్రబుల్‌సమ్ ఆర్టిస్టు అనే ముద్ర వేసి వేషాలు దొరకనివ్వకుండా చేసే దుర్మార్గం, సంవత్సరానికి దొరికే అయిదారు ఎక్స్ట్రా వేషాల కోసం కూడా వొళ్ళప్పగించక తప్పని నటీమణుల హీనస్థితి – ఇలా ఎక్స్ట్రా వేషాలు వేసే ఆర్టిస్టుల పాట్లు ఎలా ఉంటాయో ఈ పాత్ర ద్వారా వివరించాడు.

సినీ రంగంలో స్థిరపడాలనుకొనే నటీమణులు అదృష్టాన్ని కోరుకొని పేరు మార్చుకోవడం, పార్టీలు ఇవ్వడం ద్వారా ప్రెస్ రిపోర్టర్లను తృప్తి పరచి ప్రచారం పొందడానికి ప్రయత్నించడం, పెద్ద హీరోల ప్రాపకాన్ని సంపాదించుకోవడానికి, తద్వారా బుకింగ్స్ పొందడానికి ప్రాకులాడడం, ప్రొడ్యూసరో, డిస్ట్రిబ్యూటరో, పలుకుబడి ఉన్న ఆర్టిస్టో సపోర్టు చేయకపోతే క్రొత్తగా పరిశ్రమకు వచ్చినవారికి అవకాశాలు రాకపోవడం వంటి వాస్తవాలను చాలా సహజంగా చిత్రించాడు.

ఒకసారి దశ తిరిగాక ఇండస్ట్రీని చెప్పుచేతల్లో పెట్టుకొని ఇష్టమైన వారికి అవకాశాలిప్పించడం, ఇష్టం లేనివారిని ప్రాజెక్టు నుండి తొలగింపజేయడం చేసే నటుల మనస్థత్వాన్ని మంజరి, నళినీ కుమారి, రావు, మూర్తి మొదలైన పాత్రల ద్వారా తెలియజెప్పాడు.

సినీ రచయితగా అవకాశం కోసం తిరిగేవారి పాట్లు శ్రీకాంత్ పాత్ర ద్వారా వ్యక్తీకరించాడు. కథలు విని అవకాశం ఇవ్వకుండా పంపేయడం, ఆ తరువాత అవే కథల్లోని సంఘటనల్ని పెట్టి సినిమాలు తీయడం, ఆ కథలనే అటూ ఇటూ మార్చి సినిమాలు తీయడం, అవన్నీ పేరున్న రచయితల పేరు మీదుగా చలామణీ కావడం, కనీసం ఘోస్టు రైటర్‌గా కూడా పావలా డబ్బులు గిట్టుబాటు కాని దుర్భర పరిస్థితులు – వీటిని బయటపెట్టడానికి రచయిత ఈ పాత్రను ఉపయోగించుకొన్నాడు. అప్పటికే ఇండస్ట్రీలో పాతుకుపోయిన రచయితలు క్రొత్తవారికి అవకాశాలు రాకుండా చేయడం కోసం ఎటువంటి ఎత్తులు వేస్తారో రఘురామాచార్లు పాత్ర ద్వారా వివరించాడు.

తమని తృప్తి పరచకపోతే ఎంత అందమైన వాళ్ళనైనా అసహ్యంగా ఫోటోగ్రాఫ్ చేసి ఎందుకూ పనికిరారని రిపోర్ట్ ఇచ్చే కెమెరామెన్‌లు, ఎంత మంచి గొంతునైనా ఘోరంగా రికార్డ్ చేసి కంఠం బాగా లేదనిపించే సౌండ్ ఇంజనీర్‌లు, నటీ నటులను బెదిరించి వ్యతిరేక కథనాలు ప్రచురించకుండా ఉండడం కోసం డబ్బులు డిమాండ్ చేసే పాత్రికేయులు – ఇలా క్రొత్తగా సినీ రంగంలో ప్రవేశించినవారిని

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

వశం చేసుకొని బ్రతకనేర్చిన పెద్దమనుషుల వలువలు విప్పి వారి అసలు స్వరూపాన్ని పాఠకులకు వెల్లడించాడు.

సినీ రంగంలోని వ్యక్తుల అనుబంధాల్లోని డొల్లతనాన్ని, మానవ మనస్తత్వంలోని సంక్లిష్టతని రచయిత చక్కగా ఎత్తి చూపాడు. మంజరి–చలపతి, మంజరి–ప్రసాద్, మంజరి – వసంత, మంజరి–కళ్యాణిల అనుబంధాల్ని గమనించి నపుడు ఆ అనుబంధాల్లో ఆత్మీయత కంటే అవసరమే ప్రధాన పాత్ర పోషించిందని తెలుస్తుంది.

మంజరికి సన్నిహితురాలిగా మారిన కళ్యాణి ఆమె ఎంతో ఎత్తుకు ఎదగడానికి సహాయం చేసింది. తన ఆస్తికి ఆమెను వారసురాలిని చేసింది. చలపతి విషయంలో మాత్రం వ్యతిరేకతను ప్రకటించి అతడిని తన్ని తగలేయమని మంజరికి సూచించింది. కళ్యాణి మరణానంతరం చలపతి మాటల్ని బట్టి మాత్రమే కళ్యాణి చలపతిని ద్వేషించడానికి కారణం పాఠకులకు అర్థమౌతుంది. నిజంగా కళ్యాణి చలపతి మీద ఉన్న ద్వేషం కారణంగానే మంజరికి సహాయం చేసిందా? అంత ఆత్మీయంగా ఉన్నా తనకు సంబంధించిన అన్ని విషయాలు మంజరితో ఎందుకు పంచుకోలేదు? కేవలం చలపతి మీద పగ తీర్చుకోవడానికే మంజరికి ఆప్తురాలిగా నటించి ఉంటే తన ఆస్తికి ఆమెను వారసు రాలిగా ఎందుకు ప్రకటించింది? అనే అంశాలకు వివరణ ఇవ్వకుండా వాటిని పాఠకుల ఊహకే రచయిత వదిలి వేశాడు.

చలపతి వల్ల ఎంత సాయం పొందినా మంజరి అతడి పట్ల కృతజ్ఞతతో నడుచుకోలేదు. అందుకు కారణమున్నది. అతడు మంజరిని అనుభవించడమే కాకుండా, తాను డబ్బుకు లోటు లేకుండా బ్రతకడానికి ఆమెను ఒక సాధ నంగా మలుచుకోవడానికి ప్రయత్నించాడు. ఆ విషయం మంజరి గ్రహించింది. కనుక ఆమె ప్రవర్తనలో దోషం లేదు. కానీ మంజరి వల్ల ఎంత సాయం పొందినా వసంత ఆమె పట్ల పూర్తి కృతజ్ఞతతో నడుచుకోలేకపోయింది. అందుకు స్వార్థం తప్ప మరే ఇతర కారణమూ కనిపించదు.

రచయిత కళ్యాణి, వసంత పాత్రల ద్వారా మానవ మనస్తత్వంలోని సంక్లిష్టతను వెల్లడించాడు.

ఆయన సినీ రంగంలోని వెలుగు నీడల్ని మాత్రమే చర్చించలేదు. కథా గమనంలో భాగంగా పురుషులకు స్త్రీల పట్ల ఉండే చులకన భావాన్ని, స్త్రీలు సర్దుకుపోవడానికి గల కారణాల్ని కూడా చర్చించాడు.

"చాలామంది ఆడవాళ్ళకు ఆలోచన చెప్పే తాహత్తు ఉంటుందని నేననుకోను. వాళ్ళు వండటానికీ, పండటానికీ తప్ప మరెందుకూ పనికిరారు", "ఇంతలా అనుభవం ఉన్న ముండాకొడుకులం మనకే దిక్కు మొక్కు లేకుండా పోతుండెనే – ఈ ఆడముండలు సలహా లిచ్చేదేమిటీ చచ్చేదేమిటీ? కాబట్టి మనం ముందుకు పోవడమే ఉత్తమం" అంటూ చలపతి మాట్లాడిన మాటలు సాధారణంగా మగవాళ్లకు ఆడవాళ్ళ పట్ల ఉండే తేలిక భావాన్ని బయట పెట్టాయి.

"ఇప్పుడు నాకేమనిపిస్తుందంటే, స్త్రీ తన సంపూర్ణ వ్యక్తి త్వాన్ని ప్రదర్శించినపుడు పురుషుడు సహించలేడని! మనం ఆడవాళ్ళం– వారికి కావలసిన విధంగా మారుకొంటూ వస్తే తప్ప, మన ఇష్టమంటూ బయటపడిన రోజున, సంఘ ర్షణలు, కీచులాటలు తప్పవు" అంటూ స్త్రీలు ఎందుకు సర్దుకుపోతారో మార్లిన్ మన్రో మాటల్లో వివరించాడు.

సంసార యాత్ర సుఖంగా గడుపుతున్నారు అని ఎవరి గురించైనా చెప్పడం కష్టమే. భార్యా భర్తల్లో ఎవరో ఒకరు వ్యక్తిత్వాన్ని కొంత మేరకైనా కోల్పోతే గానీ సంసార యాత్ర సజావుగా సాగదు అనే అభిప్రాయాల్ని కూడా మన్రో, మంజరిల సంభాషణ ద్వారా ఆయన వ్యక్తీకరించాడు.

సినీ నటుల జీవితాల్లోని ప్రేమ రాహిత్యాన్ని, అభద్రతా భావాన్ని, వారి ఉత్థాన పతనాల్ని విశదంగా, వాస్తవికంగా చిత్రించిన నవల ఇది. వెండితెర జిలుగు వెలుగుల మాటున దాగిన చీకటి కోణాలను వెల్లడి చేసిన విశిష్ట నవల ఇది. అంతకుముందు ఎవరూ స్పృశించని వస్తువుతో, అద్భుతమైన మలుపులకు, కొసమెరుపు ముగింపులకు దూరంగా ఆకర్ష ణీయ ప్రపంచపు అసలు రంగును దర్శింపజేసిన అద్భుత చిత్రరాజమిది. రచయిత నిశిత పరిశీలనాశక్తికి, అవగాహనా పటిమకు, శిల్ప చాతుర్యానికి నిదర్శనంగా నిలిచి ఆయనను జ్ఞానపీఠం పై అధిరోహింపజేసిన ఈ నవల తెలుగు సాహితీ సరానికి మణిపూస.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# రావూరి భరద్వాజ సాహిత్యం – వ్యాసాలు – ఒక పరిశీలన

- డా॥ అల్లంశెట్టి నాగజ్యోతి
తెలుగు శాఖాధ్యక్షులు
శ్రీదుర్గ మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల, విజయవాడ.

"సహితస్య భావ: సాహిత్యం" అన్నారు పెద్దలు. సమాజానికి అద్దం వంటి సాహిత్యంలో సంఘం యొక్క ప్రతిరూపం, ఆచారాలు, వ్యవహారాలు, మానవుని ప్రతి కదలికను చూపించకలదు. వీలైతే భూత, వర్తమాన, భవిష్యత్తుకి చెందిన అపారమైన జ్ఞాన సంపదనిచ్చేదే సాహిత్యం.

మంచి సాహిత్యం ఉపదేశసహితం. ఎందరో కవులు, రచయితల మనోనేత్రాలే ఎల్లలులేని సాహితీ ప్రక్రియలు. మానవుని అభిరుచి, నాగరికత, భాషా వైవిధ్యాలను బట్టి గాని, మానవుడు సంఘజీవి కాబట్టి తన ఆలోచనలు, భావాలు ఇతరులకు చెప్పుకోవాలి, వారివి కూడా వినాలి అన్న పరిస్థితుల్లో కూడా సాహిత్యంలో అనేక రకాలైన ప్రక్రియలు పుట్టుకొచ్చాయి.

సాహిత్యం అంటే మనోవికాసం కల్గించేది కాబట్టి, ఇది ఏ ప్రక్రియలో ఉన్నా దీని ప్రయోజనం చివరకు హితాన్ని. ఆనందాన్ని, మంచి కీర్తిని కల్గిస్తుంది. సాహిత్య పోకడలు ఆధునిక కాలంలో అనేక శాఖలుగా విస్తరించి ప్రజోపయోగాలకు తగినట్టుగా వివిధ రకాలుగా మానవలోకాన్ని ఆనందింపచేస్తుంది, ప్రతిభావంతులను చేస్తుంది.

నేటి పోటి ప్రపంచంలో చదువని వారికి, చదువుకున్న వారికి సైతం సాహిత్యపరంగా సాహిత్యం అర్థమయ్యే రీతిలో, ప్రపంచాన్ని కళ్ళముందుకు తెచ్చే 'ప్రచార సాధనాల' ద్వారా సాహిత్యవైశిష్ట్యం వర్ణనాతీతం.

సాధారణంగా ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తితో తన ఆలోచనలు, వైశిష్ట్యం భావాలను పంచుకోవటాన్ని స్థూలంగా 'సమాచారాల చేరవేత' అని వ్యవహరిస్తున్నా. మాధ్యమాలు లేక మీడియా కోసం సాహిత్యపాత్ర అవిభాజ్యమైనది. మాధ్యమాలైన కొన్నింటిలో పత్రికలు, రేడియాలు, టెలివిజన్లు, కేబుళ్ళు, సినిమాలు వ్యాప్తిలోకి వచ్చాయి.

స్వతహాగా కవి ఒక సన్నివేశాన్ని చూచి స్పందించి, ఊహా, కల్పనలతో వ్రాస్తారు. కాని మీడియా సాహిత్యం ఒక్కోరకంగా శిక్షణ, ప్రావీణ్యం, సృజనాత్మకతలు, శ్రద్ధ లాంటివి అవసరం.

వేయి సంవత్సరాల తెలుగు సాహిత్యంలో ఎనిమిది వందల సంవత్సరాల సాహిత్యం ప్రాచీనసాహిత్యం. మిగిలిన రెండువందల సంవత్సరాల సాహిత్యంపై సంస్కృత ప్రభావం, ఆధునిక సాహిత్యం పై ఆంగ్ల ప్రభావం భాగా కన్పిస్తుంది.

తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు చోటుచేసుకున్నాయి. అందులో ముఖ్యమైనవి. ఇతిహాసం, పురాణం, కావ్యం, ప్రబంధం, పదకవిత, ద్విపద, ఉదాహరణం, శతకం, వచనం, చిత్రకవిత, కథాకావ్యం, దండకం, ద్వర్థికావ్యం, అచ్చుతెలుగు కావ్యం, యక్షగానం, హరికథ, బుర్రకథ, చాటువు, అవధానం, జానపదకవిత్వం, నవల, కథ, గల్పికలు, నాటకం, ఏకాంకిక, పాట, ఖండకావ్యం, గేయం, జీవితచరిత్ర, స్వీయచరిత్ర, మాత్ర చరిత్ర, వ్యాసం, పీఠిక, విమర్శ, లేఖాసాహిత్యం, అనువాదం మొదలైనవి, చాలా వరకు కొన్ని ప్రక్రియలు సర్వజనాదరణ పొందినవి. తెలుగు సాహిత్యంలో విశ్వమానవ సంక్షేమాన్ని కోరే ప్రక్రియలు అసామాన్యమైనవి.

సాహిత్యం సామాజిక ప్రతిబింబం. సమాజం నిరంతరం మార్పునకులోను అవుతుంది. అదే విధంగా సాహిత్యంలో కూడా మార్పులు జరుగుతాయి. సమాజంలో అనేక కట్టుబాట్లు ఉంటాయి. అందరూ ఆ నియమాలకు లోబడి జీవించాలి. నీతి అనేది సంఘానికి సంబంధించినది నైతిక విలువల అంతిమ లక్ష్యం ఆదర్శసమాజం.

నన్నయ యుగం నుండి తెలుగు సాహిత్య ప్రవాహం అనేక విధాలుగా సుడులు తిరుగుతు పెక్కు మార్పులు, ప్రక్రియలుగా విరాజిల్లి చివరికి నేడు ప్రపంచీకరణ వలన విలక్షణమైన మార్పులతో ప్రభవిస్తుంది.

రావూరి భరద్వాజ గారు కలం కార్మికుడు. రైతు కుటుంబంలో జన్మించి, ఎన్నో విధాలుగా కష్టాలను ఎదుర్కొన్నారు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

యుక్తవయసులో భరధ్వాజగారుని చలంగారిని అనుసరించారు. అందరి దృష్టిని ఆకర్షించాడు. సాహితీ సముద్రాన్ని ఈదటంలో నైపుణ్యం సాధించాలి. అన్నింట్లోను కవిగారు పట్టుసాధించి పాపులర్ పుస్తకాలు, కథలు రాశారు. తెలుగు సాహిత్యంలో అరుదైన స్మృతి సాహిత్యాన్ని పాఠకులకు అందించారు. వీరు జ్ఞాన పీఠ అవార్డుని సాధించిన మూడవ తెలుగు కవిగా ప్రశంసలు పొందారు.

భరధ్వాజ కవి జీవితం వడ్డించిన విస్తరి కాదు. 'రెక్కాడితేగాని డొక్కాడదు' అన్న జీవనశైలి గల పేద వారి. జీవన వృత్తులు, వారి పేదరికాన్ని, సాధక బాధకాలను 'జీవన సమరం' అను కావ్యంలో సూచించాడు. ప్రతి 'పాత్ర' కవిగారు వర్ణించిన తీరు సహజంగా ఉంటుంది. వాటికి కారణం జీవితానుభవాలే. 'జీవన సమరం' వ్యాస సంపుటిలో కవిగారి దక్షత నేర్పు, పరిజ్ఞానం మనకు అవగాహనకు వస్తుంది 'ప్రతి వృత్తిని అనుసరించే వారు, వారి ధర్మాలను నిర్వర్తిస్తున్నప్పుడుగాని, వారిని గూర్చి రచించే కవికి మానవతా దృక్పథం కలిగి ఉండాలి. అది సాధించి, చూపిన కవి భరద్వాజ. ఎందుకంటే వృత్తుల పట్ల సానుభూతి, ఆత్మీయత ఉన్నవారే ఈ సాహసం చేయగలరు. జీవన సమరం శీర్షికలోనే వీరి రచనలన్నీ మన సామాజిక జీవనానికి ప్రతిబింబాలు. మనతో పాటే మన మధ్యనే జీవిస్తున్న వారిని గూర్చి, మన చేత ఆలోచింప జేస్తారు. అట్టడుగు వర్గాల యథార్థ చరిత్రలలో నిండిన తొట్టతొలి గ్రంథాన్ని చేర్చిన ఘనత – భరద్వాజకు దక్కుతుంది.

'కొందరు గొప్పవారుగా జన్మిస్తారు అదృష్టవంతులు.

ఇంకొందరకు గొప్పదనం ఆపాదించబడుతుంది" వీరు అదృష్టవంతులే!

మరి కొందరు గొప్పదనాన్ని సాధిస్తారు మూడోవ అంశానికి చెందిన వారు భరద్వాజ అట్టడుగున ఉండి అతి సామాన్యంగా జీవితాన్ని ప్రారంభించి పరమ అద్భుతాల్ని సాధించిన వారి కోవలోకి భరద్వాజ సగర్వంగా నిలిచారు. ప్రస్తుత వ్యాససంపుటి జీవన సమరం సామాన్యుల జీవిత చిత్రణా సంపుటంగా చెప్పవచ్చు.

జీవన సమరం వ్యాససంపుటిలో ఆణిముత్యాల్లాంటి వ్యాసాలు మనకు అవగాహనకు వస్తాయి. ముందుగా 'తాజ్ మహల్ నిర్మాణానికి,,' అను వ్యాసంలో తాజ్‌మహల్ నిర్మాణ సమయంలో ఎంతో మంది కూలీలు శ్రమించారు ఆవిధంగా నగరాలలో వెలసిన రైల్వేబ్రిడ్జ్ విమానాశ్రయాలు, హెుటల్స్, సినిమాహాల్స్ వంటి నిర్మాణంలో పాల్గొన్న కూలీలలో శేషయ్య ఒకరు వారి జీవనశైలి వారి నాన్న నుండి నేర్చిన విద్య. చదువుకోవాలని ఉన్నా విద్యను అభ్యసించే స్థోమత లేక తాపీ వృత్తిని అనుసరించాడు. అతనికి చుట్ట కాల్చటం మాత్రం బలహీనతగా మారింది. చదువుకున్నవారు ఉద్యోగాలు లేక పడేబాధలు వర్ణనాతీతం అని, కాంట్రాక్టర్లు చేసే మోసాలు చదువుకుంటే కష్టపడటం రాదని తన తమ్ముడ్ని చదివించిన తర్వాత ఆ విషయం తెల్సిందని వాపోతాడు. తన నలుగురి సంతానాన్ని చదివిస్తే పని రాదని ఆలోచన ఒక వైపు, ఇన్నేళ్లుగా ఎన్నో ఇళ్లను నిర్మించిన తనకు పొంత ఇల్లుంటూలేదని వ్యధ ఈ వ్యాసంలో సహజంగా వర్ణించాడు.

అలాగే "నేనుసైతం ఇంటి పొయ్యికి" అను వ్యాసంలో కవిగారు మానవ సహజస్వభావాన్ని వర్ణించారు మాటలు కోట, పేటలు దాటిపోతాయిగాని, చేతల్లో ఉండదని, కోతల రాయుళ్లు, బడాయి సన్యాసులు అరచేతిల్లో స్వర్గం, కైలాసం, వైకుఠం చూపెడుతూ ఉంటారు. సమాజంలో. మన నేతలు మనకోసం అభ్యుదయం, ప్రగతి పథం అంటూ కాగితాల పై అనేక విధాలుగా ప్రణాళికలు రచిస్తారు. మన కోసం కాని ఆచరణంలో అవి శూన్యం నాలుగు దశాబ్దాల కింద సామాన్య జీవనం, జనాలు ఎలా జీవించారో, ఈనాడు అలాలేదు. మరింత దిగజారి, దిగజారి అధ్వాన్నంగా తయారయింది. పేదలు నిరుపేదలయ్యారు. ఉన్నవారు మరింత ఉన్నవాళ్ళయ్యారు. కూలీవాడు రైతుగా మారితే నలబై ఎకరాల ఆసామి వ్యవసాయం మానేసి కాంట్రాక్టరుగా మారి లక్షలు సంపాదించాడు. ఈ వ్యాసంలో 'పోశమ్మ' అను పాత్ర ద్వారా తన దీన స్థితికి కారణం దేవుడు అని నమ్ముతుంది కాని మన పరిపాలకులని ఒప్పుకోదు. మన పాలకులు ఆనాడు 'షోషలిజమే' మనలక్ష్యమని సామాన్యుడికి

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

నిలువనీడ లేకుండా చేసాయి. ఆ విష్యయమే 'పోశమ్మ' పాత్రద్వారా వెలికితీసారు కవి. గద్వాల్ సంస్థానంలో ఉన్న భూమికి కాపలాగా ఉంటు, కౌలుదారుగా పని చేస్తున్న కుటుంబం రాను రాను శిస్తు కట్టలేక పొలం వదులుకొనే పరిస్థితి దు:ఖాన్ని కల్గిస్తుంది. తన భర్త రాంరెడ్డి చివరకు కూలీచేసి చని పోయాడని, పిల్లల పెళ్లిళ్లు చేశా కష్టపడి, వారు భార్యల మాట విని నన్ను వదిలేసి పోయారని దు:ఖి స్తుంది. చివరకు హైదరాబాద్ వచ్చి పేడతో చేసిన పిడకలను అమ్మి బ్రతుకును సాగిస్తుంది తనకంటూ ఈ పుణ్య భూమిలో 'నాది' అని చెప్పుకోతగ్గ వేమీలేవు అని చెపుతూ తన వృత్తిలోని సాధక బాధలను విన్నవించిన తీరు ఆర్ధత కల్గించే పదాలతో కవిగారు వర్ణించారు.

ఈ విధంగా 'జీవనసమం' వ్యాస సంపుటిలో వ్యథార్త జీవుల యథార్ధ గాథలను అంకితం, ఆర్థత మానవతా దృష్టితో సాంఘిక, ఆర్థిక న్యాయం కావాలని ప్రజా సంక్షేమ రాజ్యం రావాలని కవి ప్రతి వ్యాసంలో వృత్తివారు అను సరించే నాటి పాలకుల నిర్లక్ష్యాన్ని రచించటం మనం గమనించవచ్చు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# మరుగు పడిన మానవత

- డా॥ పి. నీరజ
లెక్చరర్,
మారిస్ స్టెల్లా కాలేజి, విజయవాడ.

రావూరి భరద్వాజగారు కలం కార్మికుడు. రచయితగా అడుగులు వేస్తున్న దశలో ప్రముఖ, ప్రఖ్యాత, మహా రచయితలు, తెలుగు సాహితీ ఉద్యానవనం పలురంగులతో సాంప్రదాయ, ప్రగతిశీలరీతులతో గుబాళిస్తున్నది. సాహిత్య రంగం కమనీయమైనదేకాదు, కఠోరమైనది కూడా.

కళాప్రపూర్ణ రావూరి భరద్వాజ తెలుగు సాహిత్యాభ్యున్నతికి చేసిన కృషి ఫలితంగా ఆయన రాసిన 'పాకుడు రాళ్ళు' నవలకి (2012) జ్ఞానపీఠ పురస్కారం లభించింది.

భరద్వాజ రచనలలో సాంఘిక పరిస్థితులూ, సామాజిక వాతావరణము కన్పిస్తుంది. ఒక సంఘటనను కళాత్మకంగా చిత్రించడం ముఖ్యమే, అంతకన్నా ముఖ్యం – ఆ సంఘటన వెనుకగల సాంఘిక, ఆర్థిక, రాజకీయ కారణాలను చిత్రించడం, భరద్వాజ ఈ రెండవ పనిని నిర్భయంగానూ, నిస్సంకోచంగానూ చేశారు. అలా చేశారు గనుకనే ఆయన సృష్టించిన వందలాది పాత్రల పట్ల మనలో సానుభూతి, అనుకంప కలుగుతుందే తప్ప, ఈర్ష్య, ద్వేషం, అసహ్యం కలగవు. ఆ పాత్రలు కూలీలయిను, మాలీలయినా, భ్రష్టులయినా, నికృష్టులయినా, పతితలయినా, పవిత్రులయినా, జారులైనా, చోరులైనా మన హృదయాన్ని కరుణరస ప్లావితం చేస్తాయి.

ఊహకు వాస్తవానికి మధ్య, భావనకూ బతుక్కూ మధ్య కొద్ది తేడాలుండడం వేరు, అపారమైన భేదాలుండడం వేరు మొదటి స్థితిని భరిస్తాం. రెండువస్థితినీ భరిస్తాం. కానీ ఈ రెండవ స్థితి అమానుషంగా వుంటుంది. అలా వుంటుందని అనడానికి 'సావిత్రి' జీవిత మొక మచ్చుముక్క.

పాడీపంటా ఉన్న కుటుంబంలో పుట్టిన సావిత్రి, తనకి ఊహ తెలిసే నాటికి వారి కుటుంబం చితికి పోయింది. మొదటి నుంచి బతుకులో కష్టాలను అనుభవించింది. చిన్న వయస్సులోనే సావిత్రికి పెళ్ళయ్యింది. పెళ్ళి చేసుకున్న ఆ దౌర్భాగ్యుడు సావిత్రికి ఏ మాత్రం అనుమానం కలుగకుండా ఓ కంపెనీకి అమ్మేశాడు. ఆ కంపెనీ తన జీవితాన్ని సర్వనాశనం చేసింది. ఒకానొకరోజు తను పారిపోయే అవకాశం రాగానే, అక్కడ నుండి పారిపోయి ఒక ఊరిలో చెట్టు దగ్గర గుడిసెల్లో ఉంది. ఆవిడను ఆదరించిన వ్యక్తి 'వెంకటేశం'. "ఆ మహారాజే నాకింత నీడ చూపించాడయ్యా"[1] అన్నది సావిత్రమ్మ. అక్కడెక్కడోవున్న వెంకటేశానికి చెయ్యెత్తి దణ్ణం పెడుతూ. అతనికి బరువుగా తయారవకూడదన్న ఉద్దేశంతో. వంటల వ్యాపారం ప్రారంభించింది. తన జీవితం ఎలాగూ నాశనం అయిందని వచ్చే జన్మలోనైన సుఖపడితే చాలు అంటుంది సావిత్రి.

జీవితంలో మోసపోయిన సావిత్రి బతుకులోని కష్టాలను కన్నీటినీ కడమట్టూ చూసింది. నైరాశ్యానికి ఏ మాత్రం చోటు ఇవ్వకుండా తన కాళ్ళ మీద నిలబడగలిగింది. మానవత్వం లేని మనుషుల మధ్యలో దగా పడిన సావిత్రి, ఇతరుల పట్ల మాత్రం తన మానవత్వానికి కాపాడుకుంటూ జీవితాన్ని కొనసాగించిన వైనం అద్భుతం.

**"కొందరు గొప్పవారుగా జన్మిస్తారు"**
**అదృష్టవంతుడు**
**"ఇంకొందరకు గొప్పదనం ఆపాదించబడుతుంది"**
**వీరూ అదృష్టవంతులే**
**"మరి కొందరు గొప్పదనాన్ని సాధిస్తారు"**

చెప్పుకోవల్సింది కూడా వీరి గురించే. చెప్పుకోవడానికి కావలసినవన్ని అంశాలు. వీరి జీవితాల్లో లభిస్తాయి.

ఒక విషయాన్ని ఎన్నుకోవడంలోనూ, ఎన్నుకొన్న విషయాన్ని రసగుళికగా రూపొందించడంలోనూ భరద్వాజ అవలంభించిన విధానం విశిష్టమైనది. 'జీవన సమరం' శీర్షికలోని రచనలన్నీ సమాజానికి ప్రతిబింబాలు. ఇందులోని వ్యక్తులు – మనకు బాగా తెలిసినవారు. మనతోబాటు మన మధ్యనే జీవిస్తున్నవారు. భరద్వాజ సామాన్య బతుకుల్లోకి తొంగిచూసి, స్పందించి మనల్ని స్పందింపచేశారు.

# రావూరి భరద్వాజ సౌందర్యనందం - రచన వైశిష్ట్యం

- పేరం అమృతరావు
పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

## ఉపోద్ఘాతం :

కథకుడిగా, నవలాకారునిగా, రేడియో కథలతోపాటు బాలసాహిత్యంలో కూడా విశేష కృషి చేసిన గొప్ప రచయిత రావూరి భరద్వాజ. విశ్వనాథ సత్యనారాయణ, డా॥ సి. నారాయణరెడ్డి గార్ల తర్వాత తెలుగు సాహిత్యానికి జ్ఞానపీఠ అవార్డును అందించిన ఘనత రావూరి వారికే దక్కుతుంది. పాకుడురాళ్ళు అనే నవల ద్వారా సినీ ప్రపంచంలో తెర వెనుక కళాకారులు పడే బాధలను కళ్ళకు కట్టినట్లు చూపారు భరద్వాజ. ఇక ఆ విషయాలను అటుంచితే 'సౌందర్యనందం' అనే ఈ రచనకు ఒక ప్రత్యేక నేపథ్యం ఉంది. సంస్కృతంలో ఇదే పేరుతో గౌతముని సవతి తమ్ముడైన నందునికి, అతని అర్ధాంగి సుందరికి సంబంధించిన ఇతివృత్తాన్ని కావ్య వస్తువుగా తీసుకొని 18 సర్గలతో అశ్వఘోషుడు ఇదే పేరుతో కావ్యాన్ని రాయడం జరిగింది. సౌందర్యనందం కావ్యాన్ని పింగళి – కాటూరి కవులు తెలుగుచేసి, ఆ కావ్యానికీ, తమకూ, తెలుగునాట ఎనలేన గౌరవాన్ని సంతరించారు. రావూరి వారు రాసిన సౌందర్యనందం విషయానికొస్తే 1944 సంవత్సరంలో కథకుడిగా జీవితం ప్రారంభించిన భరద్వాజ గారు మహోన్నత శిఖరాలను అధిరోహించారు. ఆయన 50 యేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మిత్రుడు త్రిపురనేని సుబ్బారావు, నర్రా కోటయ్య గార్లు ఆయన జన్మ దినోత్సవాన్ని ఘనంగా జరపాలనుకొన్నారు. దీనికి మొదట భరద్వాజగారు ఒప్పుకోలేదు. తర్వాత మిత్రుల బలవంతం మేరకు కాదనలేకపోయారు. ఈ సంఘటన 1976 డిసెం బరు నెలలో జరిగింది. ఆ తరువాత భరద్వాజ గారి ఆరోగ్యం క్షీణించడంతో వారు ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఆ జన్మదినోత్సవ సందర్భంగా భరద్వాజ గారి కథల నుండి ఒక మంచి కథను ఎంపిక చేసి ఒక ప్రత్యేక సంచికలో ప్రచురిద్దాం అనుకొన్నారు. అయితే ఐదువందలకు పైగా ఉన్న కథల నుండి ఒక రచనను ఎన్నుకోవడం సులభమైన పని కాదని, భరద్వాజ కథలలో తనకు బాగా నచ్చిన కథలను మూడింటిని సూచించవలసిందిగా కోరారు. మొత్తం 30 కథల పేర్లు సూచించారు. వీటిలో అత్యధికులు నాలుగు కథలను పేర్కొన్నారు. అందులో సౌందర్యనందం, ఆహుతి, నిన్ను గురించి నిజం, స్వయంభువు మొదలైనవి అయితే ఈ నాలుగు కథలలో మొదటిదైన 'సౌందర్యనందం' అన్న కథ శీర్షికనే కథాసంపుటికి పెడితే బాగుంటుందని త్రిపురనేని సుబ్బారావు గారు సూచించారు. దానికి నర్రా కోటయ్య, భరద్వాజ గార్లు అంగీకరించారు.

## వస్తుపరంగా :

ఇతివృత్తం లేదా వస్తువు గురించి చెప్పదలచి వస్తే "ఏ వస్తువు యధాతథంగా కథారూపం పొందదు. ఏదో ఒక రూపంలో దానికి ఇతివృత్తం ఏర్పడి తీరాలి. ఫలానా కథలో 'ఇతివృత్తం' లేదని సామాన్యులు అంటుండడం కద్దు. ఇతి వృత్తం లేదంటే అసలు లేదని కాదు. దాని అర్థం కథకు కావలసినంత రోచకమైన ఇతివృత్తం లేదని భావం. రచ యితలో కాల్పనికమైన ప్రతిభకొరవడినప్పుడు ఎంత గొప్ప వస్తువైనప్పటికీ నిష్ప్రయోజనమై పోతుంది. ఒక వేళ వస్తు వులో లోపమున్నప్పటికీ ఇతివృత్త కల్పనా శిల్పంలో సౌం దర్యం సంతరించుకొంటుంది." (దక్షిణామూర్తి, పోరంకి : 2009;119).

"కథా వస్తువు రచయత జీవితంలో నుంచి కాని లేదా రచయితకు తెలిసిన ఇతరుల జీవితంలో నుంచి కానీ పుట్ట వచ్చు" (వేంకట సుబ్బారావు వల్లంపాటి, 2008, పుట.21).

పై నిర్వచనాలు సౌందర్యనందం కథాసంపుటికి అద్దినట్లున్నాయి. సామాజికాంశాలనే రచయిత కథావస్తువు లుగా తీసుకొని రచనకు పూనుకొన్నాడు. సౌందర్యనందం

కథలోని సుందరి, ఆనందరావుల పాత్రలు సమాజపు కట్టు బాట్లకు నిలువుటద్దాలు. ప్రబంధ కావ్యాలలోని పాత్రలను కథావస్తువుగా స్వీకరించారు రచయిత. వసుచరిత్రలోని గిరిక సుందరి పాత్రకు మనుచరిత్రలోని ప్రవరుని పాత్రను ఆనంద రావుకు ఆపాదించి సమాజ విలువలకు అనుగుణంగా కథను మలచారు. అందుచేతనే సుందరి ఆనందరావు కాస్త సౌందర్యనందం పేరిట ఈ కథ వాసికెక్కింది. అలాగే ఆహుతి కథలో మర్యాదస్థులైన ముగ్గురి వ్యక్తుల వల్ల స్త్రీ జీవితం ఎలా ధ్వంసం అయ్యిందో వివరించారు అడ్వకేట్‌కి, వేశ్యకి పెద్ద వ్యత్యాసం లేదని ఒక రకంగా ఆమెనే ఉన్నతంగా జీవిస్తుందని లాయరుగా ఉంటూ న్యాయదేవత ముందు వాళ్ళు చెప్పించే అబద్దాలు గురించి వివరించారు. అలాగే చలపతిరావు అనే డాక్టర్ దగ్గరకు అభాగ్యురాలైన లలిత అనే గర్భిణి స్త్రీ వస్తుంది. తనకు నా అనుకునే వాళ్ళు లేక పోవడంతో చలపతిరావు వద్దనే ఉంటూ తన బిడ్డను సాకు తుండేది. అయితే సమాజం లలితకు చలపతిరావుకి అక్రమ సంబంధం అంటగడితే లలిత బిడ్డను చలపతిరావుకి అప్ప గించి ఆత్మహత్య చేసుకుంటుంది. ఇలా సమాజంలో ముగ్గురు మర్యాదస్తుల మూలంగా బలైపోయిన స్త్రీ జీవితాన్ని వర్ణించే కథ ఆహుతి. నిన్ను గురించిన నిజం అనే కథలో రామనాథం పెళ్ళైన గృహస్తుడు భార్య రాధ. చాలా రోజుల తర్వాత రామనాధంకీ సుమిత్ర గుర్తొస్తుంది. రామనాథం పెళ్ళి కాకముందు సుమిత్రను ఇష్టపడతాడు. కానీ అతనికి రాధతో పెళ్ళి జరుగుతుంది. రామనాథం ఇంటి పక్కన సుమిత్ర బంధువులు ఉండటంతో సుమిత్ర అక్కడకు వస్తుంది. సుమిత్ర భర్త తనకంటే వయసులో చాలా పెద్ద వాడని రామనాథం భార్య ద్వారా తెలుసుకొని బాధపడే విధానమే ఈ కథలో సారాంశం. స్వయంభువు అనే కథ కపాడియా అనే వ్యక్తి దగ్గర లంచం తీసుకొని తనకు కావ లసిన ఫైలుపై సంతకం చేస్తాడు రామదాసు. అలాచేసి కపాడియా దగ్గర డబ్బు తీసుకున్న రామదాసుకు తన మనః సాక్షికి బదులు చెప్పుకోవలసిన అవసరం ఏర్పడుతుంది. తనను ఎవరో వెంబడిస్తున్నట్లుగా తాను చేస్తుంది ఎవరో గమనిస్తున్నట్లుగా అనిపిస్తుంది అతనికి. దీనితో కపాడియా డబ్బును తిరిగి ఇచ్చేస్తాడు రామదాసు. ఇలా ప్రతి కథలో సామాజిక అంశాలను కథావస్తువులుగా తీసుకొని రాశారు రచయిత.

## రచన శిల్పం :

నేటి మన కథానిక రచన శిల్ప ప్రధానమైన సాహిత్య ప్రక్రియగా చెప్పవచ్చు. అందువల్ల కథానికకు శిల్పమే ప్రధానం శిల్పన్ని బట్టి రచయిత ప్రతిభను అంచన వేయ వచ్చు. ఇది పూర్తిగా వైయుక్తికం కనుక రచయితకు ఎంతో తేడా వుంది. కాబట్టి రచన శిల్పం ద్వారా మాత్రమే రచయిత సొంత ముద్రను ఏర్పరచుకుంటాడు. శిల్పానికి కథానికకు గల సంబంధాన్ని చెప్పదలిస్తే రచయిత ఒక శిల్పివంటివాడు. ఆకారం లేని రాయని తీసుకొని అందమైన రూపంగా తీర్చి దద్దడంలో కళాకారుడు ప్రదర్శించే నైపుణ్యం 'శిల్పం' అదే విధంగా మనసులో ఏర్పడ్డ భావానికి రూపం కల్పించే నైపు ణ్యంలో తీర్చిదిద్దడంలో కథకుడు కనబరిచే నైపుణ్యమే 'కథాశిల్పం' అంటారు. శీలా వీర్రాజు గారి మాటలలో చెప్పా లంటే 'ఒక సంఘటన వార్త కాకుండా కథగా చేసేదే శిల్పం(వీర్రాజు, శీలా:1972.114).

ఇక రావూరి గారి విషయానికొస్తే ఆయన తీసుకొన్న ప్రతి వస్తువులో పైన చెప్పిన విషయాలు ఈ కథాసంపుటిలో మనకు కనిపిస్తాయి. కథను ప్రారంభించే క్రమంలో ఆయన వాడిన ఎత్తుగడలు ఆ కథలపైన ఆసక్తిని కలిగిస్తాయి. అలాగే వాడన భాష, వాక్య నిర్మాణం కథను నడిపించడంలో తోడ్పడ్డాయని చెప్పవచ్చు. కథ సాగిన విధానాన్ని గమనించి నట్లైతే రచయిత కథల్లోని అన్ని సంఘటనలను సాక్షిగా అంటే కథ జరిగే అన్ని స్థలాల్లోను తాను ఉన్నట్లుగా, పాత్రల మాటల్ని వింటున్నట్టుగా ఊహించుకుంటారు. అంతేకాక పాత్రల ఆలోచనల్ని, భావోద్రేకాలను చెప్పుటకై రచనల ప్రథమ పురుషలో రాశారు. వర్ణనల విషయానికొస్తే గ్రామీణ ప్రాంతపు వాతావరణాన్ని తేలికైన ఉపమానాలు కథను పరి పుష్టం చేశాయని చెప్పాలి. కథా శీర్షకకు సంబంధించి సౌందర్యనందం అన్న శీర్షిక సుందరి ఆనందరావుల

పాత్రలు సమాజంలో క్షణికావేశానిక లోనౌతున్న యువతను సన్మార్గంలో పెట్టేందుకు ఎంతో ఆదర్శంగా ఉంటాయి. అందుచేతనే ఈ కథ శీర్షికను సంపుటికి పెట్టడం జరగింది. కథలలో ముగింపు కూడా ఒక వంతు ఆలోచింపచేసేదిగా ఉందని చెప్పక తప్పదు.

**ముగింపు :**

పై కథ సంపుటిలోని కథలను క్షుణ్ణంగా పరిశీలించినట్లైతే రావూరి గారు కథలకు ఎంచుకున్న వస్తువులు, సామాజిక అంశాలపట్ల ఆయనకున్న ఆసక్తి, కథలను మలిచే సందర్భంలో ఆయన వాడిన సులభమైన భాష, వాక్య నిర్మాణం కథలను చదివించేటట్లు చేస్తాయి. అభూత కల్పనలకు తావులేకుండా ఉన్న విషయాన్ని సూటిగా స్పష్టంగా సామాన్య పాఠకులకు సైతం అర్థమయ్యేటట్లు కథలను రచయించి భావితరాల రచయితలకు ఆదర్శకులుగా నిలచారు.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1) దక్షిణామూర్తి, పోరంకి, 1989, కథానక స్వరూప స్వభావాలు, హైదరాబాద్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
2) భరద్వాజ. రావూరి, 1987, సౌందర్యనందం, హైదరాబాద్, ప్రోగ్రెసివ్ ప్రెస్.
3) రాజారం, మధురాంతకం, 1989, తెలుగు కథలు – కథనరీతులు, హైదరాబాద్
4) వెంకట సుబ్బయ్య వల్లంపాటి, 2008, కథాశిల్పం, హైదరాబాద్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# కాదంబరి

- డా॥ శ్రీపాద సీతామహాలక్ష్మి సత్యవతీ పేరమాంబ
పాఠశాల సహాయకురాలు, తెలుగు
శ్రీరామారెడ్డి ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు)
అనపర్తి (మం), తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

'కాదంబరీ రసాస్వాదే ఆహారోపి న రోచతే' అని ఒక మాట జన వ్యవహారంలో ఉంది. కాదంబరి అనే పదానికి కావ్యవిశేషం, ఆడుకోయిల, గోరువంక, మద్యం, నవల మొదలైన నానార్థాలు ఉన్నాయి. సంస్కృతంలో తొలి వచన కథాకావ్యం బాణుడు వ్రాసిన కాదంబరి. ఈ కావ్యం ఎన్నో మలుపులు, ఉపకథలు, కథలో కథలు ఇలా ఎన్నెన్నో వర్ణనా విశేషాలతో మనకు తెలియకుండానే మనల్ని మరోలోకంలోకి తీసుకుపోతుంది. తెలుగులో శ్రీరావూరి భరద్వాజ వ్రాసిన 'కాదంబరి' కూడా ఎన్నో మలుపులు, కథలో కథ, ఉపకథ ఇంకా వర్ణనాత్మకంగా ఆర్థిక రాజకీయ రంగాల్లోని వ్యవహారాలు ఎలా ముందుకు నడుస్తూ ఉంటాయో ప్రయోగాత్మకంగా చూపిస్తుండడం వల్లనేమో మరి మనకు తెలియకుండానే మన మనస్సు కథలో లీనమైపోతుంది.

శ్రీరావూరి భరద్వాజ తమ పదిహేడవ సంవత్సరం నుంచి రచనలు చేయడం మొదలుపెట్టారు. మొత్తంగా నూట ఏభైకి పైగా రచనలు చేశారు. వీటిలో సుమారు పదిహేడు నవలలు వ్రాశారు. వీటిలో బాగా పేరొందిన నవలల్లో కాదంబరి ఒకటి. యథాలాపంగా చదవడం మొదలుపెట్టినా మరి మధ్యలో విడువలేక చివరిదాకా చదివి అంతుచూస్తేగాని మరోపని తోచనియ్యని పుస్తకమిది.

## కాదంబరిలోని కథ :

అడవిలో చిరుతపులితో పోరాడి, చంపిన ఒక పశులకాపరిని గురించి పేపర్లో వేసిన విషయం అందరూ చూశారు. జగన్నాథం ఆవిషయాన్ని కాస్త వివరంగా చదివాడు. పశులకాపరి ఆ అడవిలో తలదాచుకున్న పాడుబడ్డ భవనం గురించిన ఆలోచన అతని మెదడుని కుమ్మరి పురుగులా దొలిచేసింది. ఆభవనాన్ని గురించిన పూర్తి సమాచారాన్ని చరిత్రపరంగా తెలుసుకోవాలనే తలం పుతో ఉత్సుకతతో ఆ అడవికి బందోబస్తుగా బయలుదేరాడు. శ్రీరాములు, సుబ్బిగాడు ఇలా ఎవరెవరినో అడుగుతూ బోగారం అనే కుగ్రామానికి వెళ్ళాడు. అక్కడి ఫారెస్టు ఆఫీసరు నారాయణను కలుసుకున్నాడు. నారాయణ జగన్నాథాన్ని కాంట్రాక్టరు అని ఊహించుకున్నాడు. అతనికి సకల మర్యాదలు చేసి, కలప చూపించడానికి అడవికి తీసుకెళ్తాడు. అలా పోగా పోగా పోగా పాడుబడ్డ భవనం జగన్నాథం కంటపడింది. అదే సమయానికి మల్లంపల్లి చంద్రశేఖరశర్మ తన శిష్యులతో వేంచేసి ఆభవనానికి సంబంధించిన చారిత్రక విశేషాలు, మయూరాక్షి నది, మాతప్ప నాయకుని కోట మొదలైన వన్నీ వారికి చూపిస్తూ చక్కగా వివరిస్తున్నాడు. వాళ్ళంతా వెళ్ళడానికి బయలుదేరినా, కౌముది ఒక్కతే అక్కడ మిగిలిపోయింది. కౌముదితో తానూ ఉండి ఆవిశేషాలన్నీ చూసి వస్తానని నారాయణను వెనక్కి పంపేశాడు జగన్నాథం. అంతే! తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లు అక్కడినుండి కథ లెక్కలేనన్ని మలుపులు తిరిగింది. కథలో కథలు కౌముది, రామకృష్ణయ్య, చంద్రశేఖర్, శంకర్ పాత్రలు ప్రవేశించడాలు, జగన్నాథం కౌముదికి హితోపదేశాలు చేయడాలు... ఇదీ కథ!

ఇక ఈ కాదంబరి నవలలోని ముఖ్య పాత్రల ద్వారా మనకు కొన్ని ఆసక్తికరమైన విషయాలు తెలుస్తాయి. పాత్రల్లోకి పరకాయప్రవేశం చేసి చూద్దాం...

## సరస్వతి :

చంద్రశేఖరం కూతురు సరస్వతి చిన్నతనంలోనే రెండు కాళ్లు పోగొట్టుకుంది. వాటిని బాగుచేయించడం కోసం చంద్రశేఖరం ఎందరెందరో డాక్టర్లకు చూపించినా ఫలితం లేకపోయింది. చంద్రశేఖరం ఎన్ని పుణ్యక్షేత్రాలు దర్శించినా, ఎన్ని తీర్థయాత్రలు చేసినా, చేయవలసిన ప్రయత్నాలు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

చేసానన్న సంతృప్తి తప్ప సరస్వతికి నయం కాలేదు. ఒక్క కాళ్ళు లేకపోవడం అనే చిన్న లోపం తప్ప సరస్వతి అక్షరాలా బంగారుబొమ్మ. ఆమె అవసరాలకు తండ్రి చంద్రశేఖరం ఇద్దరు మనుషుల్ని ఏర్పాటు చేశాడు. ఆమె పేరు సరస్వతి అయినా ఒంటినిండా నగలతో లక్ష్మీదేవిలా ఉంటుంది.

చక్కని వ్యక్తిత్వమున్న రామకృష్ణయ్యను చూసిన చంద్ర శేఖరం అతన్ని ఎన్నో విధాలుగా పరీక్షించి, అతనికి వ్యాపారంలో మెళుకువలన్నీ నేర్పి అతని అంగీకారంతో కూతురు సరస్వతినిచ్చి పెళ్ళిచేశాడు. "సరస్వతి చాలా మంచిది. ఆవిడ మంచితనాన్ని పోల్చడానికి ఆవిడలాంటి ఇంకోమనిషి నాకింతవరకు కనిపించలేదు. ఆవిడ రెండు కాళ్ళు తిన్నగా ఉంటే, నాలాంటి వాడు సరస్వతికి ఆమడ దూరంలో ఉండేందుకు కూడా పనికిరాడు" అని రామకృష్ణయ్య ఒక సందర్భంలో జగన్నాథంతో చెప్పబట్టి మనకు పట్టి చూడ కుండానే ఆమె గురించి తెలిసిపోతుంది.

చంద్రశేఖరం ఇంట్లో ఇమిడే పరిస్థితులు కన్పించక, ఒకరోజు చెప్పాపెట్టకుండా సరస్వతి, రామకృష్ణయ్య కట్టు గుడ్డలతో బయట కొచ్చేస్తారు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉండకుండా రామకృష్ణయ్య ఆట్టే భేషజాలకు పోకుండా పూలమ్మిన చోటే కట్టెలమ్మినట్లు అదే ఊళ్ళో ఇంటింటికీ తిరిగి ఇడ్లీలమ్ముకోవడం మొదలుపెట్టాడు. అలా ఆరంభమైన వ్యాపారం వెనక్కి తిరిగి చూసుకునే పనిలేకుండా ఇంతింతై వటుడింతై... మాదిరి మూడు పువ్వులు – ఆరు కాయలుగా వర్ధిల్లి సరస్వతీ కన్‌స్ట్రక్షన్స్ దాకా ఎదిగింది.

రామకృష్ణయ్య, సరస్వతులకు ఇద్దరు పిల్లలు వసంత్, కౌముది. చిన్నతనంలో తాను అనుభవించిన కష్టాలు పిల్లలు అనుభవించకూడదని రామకృష్ణయ్య పిల్లల్ని అత్తారుబెత్తంగా అల్లారు ముద్దుగా పెంచాడు. ఇది ఎంతమాత్రం ఇష్టంలేదు సరస్వతికి. అంత గారం చెయ్యొద్దని, పిల్లలు కళ్ళముందే చెడిపోతున్నారని చెవినిల్లు కట్టుకుని పోరాడినా రామకృష్ణ మాత్రం చెవిటివాని ముందు శంఖమూదిన చందాన పెడ చెవిన పెట్టాడు. ఆడిపిల్లలకు దుందుడుకుతనం పనికిరాదని సరస్వతి కౌముదికి చెప్పినా కౌముది ఖాతరు చెయ్యలేదు. ఈ విధంగా కళ్ళముందు పిల్లలు చెడిపోవడం చూసినా మింగలేక, కక్కలేక, నిజాన్ని జీర్ణించుకోలేక సతమతమయ్యే పదహారణాల తెలుగింటి ఆడపడుచు సరస్వతి.

## చంద్రశేఖరం :

దుర్భర దారిద్ర్యం నుండి చిన్న చిన్న వ్యాపారాలతో కష్టపడి పైకొచ్చి శ్రీమంతుడైన సజీవపాత్ర చంద్రశేఖరం. ఎదుటి వ్యక్తిని అంచనా వెయ్యడంలో చంద్రశేఖరం గురి ఏనాడూతప్పదు. చంద్రశేఖరానికి మగపిల్లలు లేరు. ఉన్న దల్లా ఒకే ఒక్క సరస్వతి. రామకృష్ణయ్యలోని నిజాయితీ, కష్టపడి పనిచేసే విధానం మొదలుగాగల అనేక సుగుణాలు చూసి, తగిన ఊతమిచ్చి అతను నిలదొక్కుకునేలా చేసి సంఘంలో పేరున్న వ్యక్తిని చేశాడు. అతని అంగీకారం మీద కూతురు సరస్వతికిచ్చి గుట్టుచప్పుడు కాకుండా గుళ్ళో పెళ్ళి చేసి ఇంటల్లుడిగా చేసుకున్నాడు.

ఏమనిషితో ఎలా మాట్లాడాలో, ఎంతవరకు మాట్లాడాలో చంద్రశేఖారానికి తెలిసినంతగా మరెవరికీ తెలియదు. వ్యాపారంలో అచ్చంగా లాభాలే రావాలన్న నిబంధన లేదని, కపాలంలో అదిరిపోయే నష్టాలు రావడం కూడా సర్వసాధారణమనే చేదునిజాన్ని రక్తంలో జీర్ణించుకున్న వ్యక్తి చంద్రశేఖరం.

## శంకరం :

మయూరాక్షి ప్రాజెక్టులో ఇంజనీరు. ఇంజనీరింగ్ చదివాడు కాబట్టి కుతూహం కొద్దీ సుప్రసిద్ధ ఇంజనీర్ల జీవిత చరిత్రలు చదివి ఒంటపట్టించుకున్నాడు. మయూరాక్షి నది నీటిని పొలాలకు పారించడం వల్ల ఆచుట్టుప్రక్కల నిరుపేదల దారిద్ర్యం ఆమడదూరం పారిపోగలదని కాటన్‌దొర వ్రాసిన విషయం అతని మనసుపై బలమైన ముద్రవేసింది. మయూరాక్షి నదీ తీరవాసుల దుర్భర జీవితాలను గురించి కాటన్ దొర వ్రాసిన విషయాలు చదివిన శంకరం నిలువునా నీరయిపోయాడు. మయూరాక్షి ప్రాజెక్టుకు సంబంధించిన విషయాలన్నీ పోగుచేయడం మొదలుపెట్టాడు. సందట్లో సడేమియాగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి నివేదిక, శొంఠి రామ్మూర్తి పంతులు గారి నివేదిక సంపాదించాడు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

మయూరాక్షి ప్రాజెక్టు మీద అద్భుతమైన ఉపన్యాసం తయారుచేసి కౌముది సహాయంతో రామకృష్ణయ్యకు అందేలా చక్రం తిప్పాడు. ఆ ఉపన్యాసం అన్ని పత్రికలకు పంపి, పత్రికలలో పడేటట్లు చేసింది కూడా శంకరమే. కౌముది శంకరంతో ఒక సంవత్సరం సహజీవనం చేసింది. ఆ తర్వాత రిజిస్టరాఫీసులో పెళ్ళిచేసుకున్నారిద్దరూ. కౌముది కోసం శంకరం ఏం చెయ్యడానికయినా సిద్ధమే. అలా అని ఆమెపట్ల ప్రేమ, వ్యామోహం లాంటివి కాగడాపెట్టి వెతికినా కూడా మచ్చుకుకూడా కనిపించవు. శంకరానికి కౌముది మీద కేవలం జాలి మాత్రమే ఉంది. అతనికి స్వార్థంపాలు ఎక్కువ. కౌముది తనకు ఎవరెవరితో ఎలాంటి సంబంధాలు న్నాయో, అవన్నీ ఎలా ఏర్పడ్డాయో శంకరానికి ముందే పూసగుచ్చినట్లు చెప్పింది. నైతిక విలువల పట్ల శంకరానికి ఉన్న అభిప్రాయం వేరు కాబట్టి అవేమీ పట్టించుకోకుండా కౌముదితో కలిసి జీవించడానికి సిద్ధమయ్యాడు.

కౌముదిని శంకరం కాక వేరే ఎవరు చేసుకున్నా ఆమె జీవితం సర్వనాశనం కావడం ఖాయం. కౌముది సుఖంగా, సంతోషంగా ఉండడంకోసం ఏం చెయ్యాలన్నా శంకరం సిద్ధమే. ఇలాంటి వ్యక్తిత్వం ఉన్నవాళ్ళు లోకంలో చాలా అరుదుగా ఉంటారు.

### జగన్నాథం :

నవలలో ప్రధానపాత్రధారి జగన్నాథం. ఆరంభంలో, మధ్యలో, చివర జగన్నాథమే. కాదంబరిలో ప్రతిమలుపు జగన్నాథుని రాకతోనే. కథలో కథలు, ఉపకథలు అన్నీ జగన్నాథంతోనే. పేపర్లో చదివిన వార్తలో చిరుతపులిని చంపిన యువకునికంటె, అడవిలో యువకుడు తలదాచుకున్న పాడుబడ్డ భవనం గురించిన వివరాలు తెలుసుకోవాలనే ఆసక్తి జగన్నాథానికి కలిగింది. లేడికి లేచిందే పరుగు అన్నట్లుగా అడవికి వెళ్ళాడు. అక్కడ నుండి కథ ఎన్నెన్నో మలుపులు తిరిగి ఎన్నెన్నో పాత్రలు కథలోకి ఒక్కసారిగా ఉరికి, పాఠకుల్ని ఉక్కిరి బిక్కిరి చేశాక జగన్నాథం ఎక్కిన రైలుకూతకూసి కదలడంతో కాదంబరి కథ కంచికెళ్తుంది.

కౌముది, రామకృష్ణయ్య, శంకరం తమ తమ ఆంతరంగిక విషయాలన్నీ ఆత్మీయంగా వినే జగన్నాథంతో పంచుకుని స్వాంతన పొందుతారు. 'చక్కగా మాట్లాడాలంటే ముందు శ్రద్ధగా వినడం నేర్చుకోవాలి' అన్నట్లుగా ఎవరు చెప్పినా విన్నాడు, ఆనక కౌముదికి జీవితసత్యాలను అంతపెద్ద కొండను అద్దంలో చూపించినట్లుగా విడమరచి చెప్పాడు.

### రామకృష్ణయ్య :

కటిక దరిద్రం నుంచి కోటీశ్వరుడుగా ఎదిగాడు. వ్యాపారరంగంలో తనదైన వ్యక్తిత్వంతో ఎదిగి రెండుచేతులా కాదు కాదు నాలుగుచేతులా సంపాదించి కోట్లకు పడగలెత్తాడు. రాజకీయరంగంలోకి కూడా ప్రవేశించి నిలదొక్కుకున్నాడు. రామకృష్ణయ్యలో మానవత్వం తాలూకు మంచితనం ఉంది. ఎన్ని వ్యాపారాలు చేసినా రైతులను మోసం చెయ్యలేదు. మయూరాక్షి ప్రాజెక్టుకోసం అతను చేసిన కృషి అంతా రైతులకోసమే. జీవితంలో అన్నిటా విజయపథాన్ని అధిరోహించాడు. 'కష్టేఫలి' అన్నట్లుగా విజయం సాధించాడు. జీవితాన్ని చక్కగా అనుభవించాడు.

రామకృష్ణయ్యకు దగా, అవినీతి, స్వార్థం, వంచన, కల్మషం... వీటిలో ఏవి ఉన్న మనుషులు తటస్థపడినా తాను మాత్రం ఏఒక్కరినీ ద్వేషించకుండా తటస్థంగా ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకుపోయాడు. దొరికిన ప్రతి చిన్న అవకాశాన్ని సద్వినయోగం చేసుకున్నాడు. అవ కాశం లేని చోట, అవసరమున్న చోట కూడా అవకాశాలను తనకు తానే సృష్టించుకున్నాడు. కటిక దరిద్రం రామకృష్ణయ్య వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దింది. వ్యాపారం చేయడం ముఖ్యమే కాని, అంతకన్నా ఇతరులకు సహాయం చేయడం మరీ ముఖ్యమని అనడమే కాదు, తు.చ. తప్పకుండా చేసి చూపించాడు.

వ్యాపారరంగంలో ఎన్ని ప్రయోగాలు చేశాడో అన్ని ప్రయోగాలు తన పిల్లలమీద కూడా చేశాడు. రామకృష్ణయ్య దృష్టిలో ఆ ప్రయోగాలన్నీ ఫలించినట్లు లెఖ్క. జనం దృష్టిలో రామకృష్ణయ్య పిల్లలు భ్రష్టులయినట్లు లెఖ్ఖ. తన ఈ ప్రయోగం వల్ల తన పిల్లలు బాగుపడితే మిగిలిన తండ్రులు

తమ పిల్లల్ని కనిపించని ఖైదులోంచి విడిచిపెట్టి, చక్కని స్వేచ్ఛనిస్తారు. ఒకవేళ మట్టికొట్టుకుపోతే ఏం చెయ్యకూడదో తననుంచి ఇతరులు నేర్చుకుంటారనే ప్రయోగశీలి రామ కృష్ణయ్య.

**కౌముది :**

కౌముది ఒక విచిత్రమైన వ్యక్తిత్వమున్న స్త్రీ సాహసాలు చెయ్యడంలో పురుషులకు ఏమాత్రం తీసిపోదు. ఆమె పుట్టి పెరిగిన వాతావరణాన్ని బట్టి, చుట్టూ ఉన్న మనుష్యుల ప్రవృత్తులను బట్టి పట్టిపట్టి చూడగా కౌముదిది ఒక విల క్షణమైన వ్యక్తిత్వం. ఆమెకు అహంకారం పాలు ఎక్కువ. ఎంతమందిలో ఉన్నా, తనమాటే నెగ్గాలన్న పంతం ఉంది. ఇతరుల పట్ల న్యూనతాభావం, తనే అన్నిటా ఎక్కువ అనే భావం ఆమెది. ఎదుటివాళ్ళు ఎవరైనా సరే, కౌముదితో సర్దుకుపోవాలి తప్ప సర్దుకుపోవడం అనేది ఆమె డిక్షనరీలో లేదు. పట్టుదల, మొండితనం ఎక్కువ. తానునుకున్నది సాధించే వరకు నిద్రపోదు. ఏదో ఒక చిక్కులో పడి, గిల గిల్లాడిపోయి, దాన్లోంచి బయటపడిన తరువాత లభించే ఉద్విగ్నత వంటిది కౌముదికి కావాలి. అందుకోసం ఎన్నెన్నో సాహసాలు చేసింది.

దుందుడుకుతనం పనికిరాదని తల్లి హెచ్చరించినా, కౌముది ఆమె మాటలు లక్ష్యపెట్టక పెడచెవిన పెట్టింది. తండ్రికి కౌముది అంటే పంచప్రాణాలు. కొండమీద కోతి కావాలని కౌముది కోరుకుంటే తండ్రి కొండతో సహా పెకలించి ఆమె ముందుంచుతాడు. శంకరాన్ని కావాలను కుంది. అతన్ని చేసుకోవాలనుందనే విషయం తండ్రికి చెబితే తండ్రి ఆకాశమంత పందిరివేసి అంగరంగవైభవంగా వివాహం చేస్తాడు. భార్యాభర్తలు కాకుండా కొంతకాలం కలిసి ఉంటే ఎలా ఉంటుందో చూడాలని కౌముది సరదా. సహజీవనానికి ముందు శంకరం స్వభావం, లక్షణాలు ఎంతో నచ్చాయి కాని అతనితో జీవనం సాగించడం మొదలుపెట్టాక ఆ లక్షణాలన్నీ రుచించని పాత చింతకాయ పచ్చళ్ళయ్యాయి.

చివరకు జగన్నాథం మాటలద్వారా జీవిత సత్యాన్ని గ్రహించి, కన్నీరు కార్చి, నిర్మలమైన చిరునవ్వు ప్రదర్శించి, తన వ్యక్తిత్వంలోని బలహీనతలను గుర్తించగలిగింది, చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టయింది.

ఈ విధంగా 'కాదంబరి' అట్టడుగున అవతరించిన ఒక మట్టిలో మాణిక్యం స్వయంకృషితో కోటీశ్వరుడిగా ఆకాశపుటంచులదాకా ఎదిగినవైనం పాఠకుల ముందుంచిన ప్రయోగాత్మక నవల. 'గద్యం కవీనాం నికషం వదన్తి' అన్నట్లుగా రావూరి వారి అపారమైన లోకజ్ఞానం తేటతెల్ల మవుతూ ఆయన ప్రతిభకు గీటురాయిగా కాదంబరి దర్శన మిస్తోంది. సమకాలీన సమాజంలో మరీ ముఖ్యంగా ఆర్థిక, వ్యాపార, రాజకీయ రంగాల్లోని వ్యవహారాలు, తెర వెనుక భాగోతాలు వివరించడంలో రావూరి వారి ప్రజ్ఞ బహుముఖా లుగా దర్శనమిస్తోంది. రావూరి వారు ఈ కాదంబరి నవ లను సినీ నటుడు శ్రీ అక్కినేని నాగేశ్వర రావుకు అంకిత మిచ్చారు. కాదంబరిలోని రామకృష్ణయ్య పాత్ర మాదిరిగానే అక్కినేని సామాన్య రైతు కుటుంబంలో జన్మించి, అనితర సాధ్యమైన విజయాలు తన రంగంలో సాధించాడని, అతను అనుకున్న లక్ష్యానికి చేరుకున్నాడని మనం అనుకున్నా, అక్కినేని మాత్రం సాధించిన దానితో సంతృప్తిని చెందక, క్లిష్టమైన లక్ష్యాలు మరిన్ని తనకు తానుగా నిర్ణయించుకుని, వాటి ఫలసిద్ధికోసం నిరంతరం పాటుపడే కష్టజీవి అని రావూరి వారు అక్కినేని గురించి కాదంబరి ముందుమాటలో చెప్పుకున్నారు. ఎన్ని విజయాలు సాధించినా అక్కినేని వారు ఎదిగిన కొద్దీ ఒదిగి ఉన్నారే తప్ప ఏనాడూ వినయాన్ని, వినమ్రతను పోగొట్టుకోలేదు. అలా పోగొట్టుకోని ఆయన వ్యక్తిత్వానికి ఈ కాదంబరి అంకిత మియ్యబడింది.

రావూరి వారి అభిమాన రచయిత చలం. చలం తన నవలల్లో స్త్రీ పాత్రలను మలచినట్లే రావూరి వారు కాదం బరిలోని కౌముదిని చలం భావజాలంలో అద్దిమరీ మలి చారేమో అనిపిస్తుంది. చలం రచనల్లోని స్త్రీపాత్రలకు ఏమాత్రం తీసిపోని పాత్ర కౌముది.

"వ్యక్తుల జీవితాన్ని ప్రధానంగా తీసుకుని సామాజిక జీవితాన్ని స్ఫురింపజేసేది నవల" అని ఆర్.ఎస్. సుదర్శనం తెలుగు నవలా వికాసంలో నిర్వచించారు. దీన్నిబట్టి చూస్తే కాదంబరిలో వ్యక్తుల జీవితాలు ప్రధానంగా తీసుకోబడ్డాయి. సమకాలీన జీవితాలను కూడా ఇందులో చూడవచ్చును. సామాజిక పరిస్థితులకు కాదంబరి నవల అద్దం పడుతోంది.

"యదార్ధ జీవితాల వాస్తవిక చిత్రణ గల గద్యరూపక కథా సాహిత్యం నవల" అని పుల్లాభొట్ల వేంకటేశ్వర్లు తెలుగు నవలా వికాస సాహిత్యంలో నిర్వచించారు. ఇలా చూసినా కాదంబరి వాస్తవానికి దగ్గరగా ఉంది. యదార్ధ విషయాలు కూడా ఉన్నాయి.

"కల్పనలతో కూడిన ఒక ఊహానిర్మిత సుదీర్ఘకథ నవల" అని యండమూరి సత్యనారాయణరావు గారు తెలుగు విజ్ఞాన సరస్వంలో నిర్వచించారు. కాదంబరిలో కల్పనలు, ఊహలు ఉన్నాయి. ఇది 164 పేజీల సుదీర్ఘ కథ. సామాన్య పాఠకుడికి ఇందులోని కొన్ని సన్నివేశాలు, సంఘటనలు కొంత కొత్తగా, కొంత వింతగా అనిపించవచ్చును గాని వాటిని అభివ్యక్తం చేయడంలో రావూరి వారు ప్రదర్శించిన తీరు, చొరవ, ధైర్యం సర్వదా అభినందనీయం.

**"చదువులన్ని ఇమడలేవు పుస్తకాలలో!**
**విద్య దాగి యుంది మానవుల మస్తకాలలో!!"**

అని జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు గారు పాడి నట్లుగా రావూరి వారు చదివింది ఏడవ తరగతి వరకే అని చెప్పుకునేకంటే వారు లోకాన్ని, మనుష్యుల్ని, చుట్టూ ఉన్న వాతావరణాన్ని చదివి జీర్ణించుకుని ఆ జ్ఞానసారమంతటినీ కాదంబరిలో నింపి మనకందించారు. అందుకే 'కాదంబరీ రసాస్వాదే అహారోపి నరోచతే!" అని మనందరిచేత మళ్ళీ మళ్ళీ అనిపించారు.

## ఉపయుక్త గ్రంథసూచి :

1) కాదంబరి – డా. రావూరి భరద్వాజ
2) తెలుగు సాహిత్య చరిత్ర – డా. ద్వా.నా.శాస్త్రి
3) తెలుగు సాహిత్య చరిత్ర – ఆచార్య వెలమల సిమ్మన్న
4) వివిధ వార్తా పత్రికలు
5) అంతర్జాల వ్యాసాలు
6) ఆకాశవాణి విజయవాడ ప్రసంగాలు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# డా॥ రావూరి భరద్వాజ – కథా సాహిత్యం – జీవన సమరం – సామాజిక స్పృహ

- పోటురాజు దుర్గాదేవి
పరిశోధక విద్యార్థిని, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం,
ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

2012లో జ్ఞానపీఠ, పురస్కారాన్ని పొందిన భారతీయ రచయిత డా॥ రావూరి భరద్వాజగారు. వీరు 1927 జూలై 5, గుంటూరు జిల్లా తాడికొండ గ్రామంలో జన్మించారు. ఏడవ తరగతి వరకు చదివివారు. తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనుడు భరద్వాజ గారు. ఒక బీద కుటుంబంలో జన్మించిన భరద్వాజ గారు కేవలం ఉన్నత పాఠశాల స్థాయి వరకే చదువుకున్నారు. ఆ తరువాత కాయకష్టం చేసి జీవితాన్ని ప్రారంభించారు.

భరద్వాజకు దిగువ, మధ్యతరగతి మరియు పేద ప్రజల భాషపై గట్టిపట్టు ఉంది. చిన్న తనంలో పొలాల్లో గడిపిన భరద్వాజ వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితులను గమనించేవారు. అప్పుడే పల్లె ప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలు, తాపాలు గమనించిన భరద్వాజ గారు ఆ అనుభవాలను తర్వాత కాలంలో తన రచనలలో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి ఉపయోగించుకున్నారు.

భరద్వాజగారు సుమారు 150 రచనలు చేశారు. వాటిలో కథాసంకలనాలు, నవలలు, పిల్లల కోసం కథలు, అపరాధ పరిశోధన నవలలు, సాహిత్య వ్యాసాలు రచించారు. అందుకుగాను ఎన్నో అవార్డులు అందుకున్నారు. రావూరి భరద్వాజ గారికి 1980లో ఆంధ్రవిశ్వవిద్యాలయం, 1987లో జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, 1991లో నాగార్జున విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేట్లు ప్రధానం చేసి గౌరవించారు. 1980లో ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు కళాప్రపూర్ణ, 1983లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 1985లో సోవియట్ భూమి నెహ్రూ పురస్కారం ఇనుపతెరవెనకకు లభించింది. 1987 రాజాలక్ష్మీఫౌండేషన్ అవార్డు, 1987లో తెలుగు కళాసమితి కె.వి.రావు, జ్యోతిరావు అవార్డు, 1997లో తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాహిత్యంలో విశిష్టపురస్కారం, 2007లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న అవార్డు, 2011 కేంద్ర సాహిత్య అకాదమి, వంగూరి 'ఫౌండేషన్, గోపిచంద్ జాతీయ పురస్కారం, 2012లో తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన బహుముఖమైన కృషికి జ్ఞానపీఠ అవార్డు దక్కింది.

రావూరి భరద్వాజగారి జీవితం వడ్డించిన విస్తరికాదు. బతుకులోని కష్టాలను కన్నీటిని చవిచూసినవారు. చారెడు గంజికోసమూ, బారెడు గుడ్డ కోసమూ కలవరించినవాడు. ఆకలి, అవమానం, అవిద్య, దారిద్ర్యం, నిరుద్యోగం, నిరాదరణ, పుక్కిలింతలుగా అనుభవించినవాడు. జీవనపథంలో కాలునిలపడం కోసం రకరకాలవృత్తుల్నీ చేసినవాడు. ఆ వృత్తుల్లోని సాధక బాధకాలను కష్టానష్టాలను అమానుషత్వాన్ని పదిలంగా గుండె లోతుల్లో దాచుకున్నవాడు. అయితే వీరి అనుభవాలు జ్ఞాపకాలు వృధాకాలేదు. వృధా కానివ్వలేదు. వాటి సారాన్ని వొడిసి, పిండి, పీల్చుకొని మహా రచయితగా ఎదిగారు. క్వాజా అహమ్మద్ అబ్బాస్ భరద్వాజ రచనల్లో సహజత్వం, లోతువైవిధ్యం వెల్లివిరియడానికి, ఆయన పాత్రలు జీవతానుభవాలే ముఖ్యకారణాలు! అని పేర్కొన్నారు.

'జీవనసమరం' శీర్షికన వెలువడిన ఈ రచనలన్నీ, మన సామాజిక జీవనానికి ప్రతిబించాయి. ఇందులోని వ్యక్తులు – మనకు బాగా తెలిసినవారు మనతో బాటు మన మధ్యనే జీవిస్తున్నవారు. వీరిని గురించి భరద్వాజగారు వారి బతుకుల్లోకి తొంగి చూసి, స్పందించి వేయ్యేళ్ళ తెలుగు సాహిత్య చరిత్రకు వ్యదార్ధ జీవుల యదార్ధగాధలను అందించారు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

"జీవన సమరం" కథా సంపుటిలోని "ఖరీదు కట్టే షరాబు లేదు!" కథలో అంతరించి పోతున్న శిల్పకళను, శిల్పి జీవితాన్ని ఎంతో హృద్యంగా వివరించారు.

భారతీయ సంస్కృతులు, ఏ ప్రాంతానికో, ఏకాలానికో మాత్రమే పరిమితము కాలేదు. అనంత కాలాల నుండి ఆసేతు హిమాచల పర్యంతం. అది విడిగి విప్పారుతూనే ఉన్నది. మన దేవాలయాల నిర్మాణంలో, అక్కడి శిల్పాల్లో, మన ఆభరణాల్లో, సాహిత్యంలో సంగీతంలో, ఆచార్య వ్యవహరాల్లో, నిత్యజీవితంలో, తత్వచింతనలో ఈ సంస్కృతి అంతర్వాహినిగా ప్రవహిస్తూనే ఉన్నది. భారతీయ శిల్పుల ఉక్కు పొగరులను తాకిన గండ శిలలు "అనూహ్యమైన సౌందర్యాలను విరజిమ్ముతున్నాయి. మన ప్రతిభా ప్రాభావాలకు ఈ శిల్ప సంపద ఒక చక్కని ప్రతీక' అన్నారు, సర్వేపల్లి రాథాకృష్ణ పండితులు". ఈ ప్రతిభా ప్రాభావాలకు వారసుడే మన ఆగమయ్య. ఆగమయ్య చేతిలో నల్లరాళ్ళు నలువ రాణులుగా మారడం, బండరాళ్ళు అందాల బొమ్మలుగా రూపెత్తడం చాలా మామూలు. ఒక రాయిని చూస్తూనే దాని చహరాలన్నీ ఇట్టే గ్రహించగలడు ఆగమయ్య. ఆ రాయి ఏ శిల్పాని కన్నా పనికొస్తుందో రాదో కంటి కొసతో చూచి చెబుతాడు. ఒక్కోరాయి పైకి బాగానే వుంటుందిగానీ లోపల దోషం వుంటుంది. అలాంటి రాళ్ళు శిల్పాలు చెక్కడానికి అసలే పనికి రావంటాడు ఆగమయ్య.

అతని పూర్వీకులది కర్నూలు మండలం. అక్కడ కొంత భూవసతి కూడా వుండేది. కానీ ఆ పొలం తొండలు గుడ్లు పెట్టడానికి తప్ప మరెందుకూ పనికిరాదుట.

"బనగానిపల్లె నవాబుకు మా నాన్న రాతితో మంచం చేసియిచ్చాడు. అంతా మామూలుగా మంచంగానే వుంటుం దండీ. నాలుగు కోళ్ళు. రెండు నిలువుపట్టెలు, రెండు అడ్డపట్టెలు పైకి కనపడేలాగా కూసాలు–అంతా మామూలు వేనండీ. కొయ్యకోళ్ళను కూడా ఆ విధంగా తరణి పట్టాలంటే ఇప్పుడు కుదరదు. నులక తప్ప అంతా రాతితో చేసిందే. మళ్ళా ఇదంతా ఒక్క రాయితోనే చేయాలండీ" అన్నాడు ఆగమయ్య పాత జ్ఞాపకాలను కళ్ళముందుకు తెచ్చుకుంటూ.

అసలు అలా మంచాన్ని చేయడానికి పూనుకోవడమే ఆశ్చర్యం. ముందుగా అందుకు పనికొచ్చే రాతిని ఎన్నుకోవాలి. అదో గొప్ప యజ్ఞం చేసినంత పని. ఆ తరువాత దాన్ని పట్టెలుగా మంచం కోళ్ళుగా మలచాలి. ఆ మలచ దంలో కాస్త పొరపాటు జరిగి ఇంత కద్దుబెచ్చిక రాలిపడినా అంతదాకా పడినశ్రమ యావత్తూ బూడిద పాలైపోతుంది. ఒక సందర్భంలో అలా జరిగిందట కూడా.

"అమ్మవారి విగ్రహం చేస్తున్నాను. నాలుగడుగులకు పైగా వుంటుంది. ఎత్తు అంతా శాస్త్రప్రకారం, సంప్రదాయ ప్రకారంగా వుండాలి గదా! కాలివేళ్ళ మట్టెలు చెక్కుతున్నాను. ఏదోషం తగిలిందో, ఏ దిష్టి తగిలిందో తెలియదు. సగానికి సగం పాదం విరిగి ముందుపడింది. నా ఆవజీవాలు కుంగి పోయాయి. సాటి వాళ్ళముందు తల నేలపడినంత పన యింది. రెండు రోజులు గంగ ముట్టలేదంటే నమ్మండి. మా పెద్దన్నయ్య సముదాయించాడు. ఇది పనికాదనుకుని ఈసారి దేవాలయం ముందే కూర్చున్నాను. చుట్టూ గోనె పట్టాలు కట్టించుకొన్నా, ఎవర్నీ లోపలకు రానివ్వలా, నేల మీద ఆర్రోజులకల్లా 'అమ్మ విగ్రహం' తయారయింది. అన్ని రోజులూ వొంటిపూట భోజనం తప్ప సాయంకాలాలు ఫల హారం కూడా ఎరుగనండీ" అన్నాడు ఆగమయ్య.

ఇదెప్పుడో జరిగిన సంగతి. ఒక విశ్వాసంతో, నమ్మకంతో, దీక్షతో, తినడానికి వుండి కూడా ఒక్కపూటనే భోజనం చేశాడు ఆగమయ్య. అప్పుడు అతని నమ్మకాలతో, విశ్వాసాలతో మనకు పనిలేదు. ఇప్పుడు మాత్రం తరచుగా వొక్కపూటే నాలుగు మెతుకులు నంజతున్నాడు ఆగమయ్య. ఇందుక్కారణం దీక్ష, విశ్వాసం కాదు. అక్షరాలా దరిద్రం కారణం.

శాస్త్రాలనూ, సంప్రదాయాలను గురించి, ఇంతగా మాట్లాడే ఆగమయ్య ఏమీ చదువుకోలేదంటే ఆశ్చర్యం వేస్తుంది. ఈ శాస్త్ర రహస్యాలన్నీ వంశపారంపర్యంగా వారికి వస్తున్నాయట. ఈ వివరాలన్నీ తనతోనే నశించిపోతున్నందుకు అతను చాలా బాధపడ్డాడు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

"లాభం లేదండీ. ఈ వృత్తిని నమ్ముకుంటే పొట్టగడవదు. జనంలో దేవుడిమీద నమ్మకం తగ్గిపోతున్నది. ఉన్న గుళ్ళూ గోపురాలే మాగుడేసి పోతుంటే, కొత్తవి కట్టించేదెవరు చెప్పండి? అలా కట్టించే పుణ్యాత్ములు ఉన్నప్పుడుగదా నాలాంటివాళ్ళ అవసరం" అన్నాడు. ఆగమయ్య బాధతో నిండిన ముఖాన్ని చిరునెర్రిలిచ్చిన అరచేతులతో రుద్దు కుంటూ.

శిల్పాలు చెక్కించేవారు లేకా, అడపాదడపా, ఎక్కడో నూటికి, కోటికీవొకరున్నా, వారిచ్చేది గిట్టుబాటు కాక ఆగ మయ్య, ఆ వృత్తిని దాదాపుగా మానేశాడు. శతాబ్దాల తర బడిగా శిలలతో కలసిమెలసి కలగలిసిపోయిన అతని విద్య, తరాల నుండీ రమణీలలామలను ఆవిష్కరించిన అతని ప్రతిభ ఈనాడు పిడికెడు మెతుకుల్ని అతనికి అందించలేక పోతున్నది. అందుకే అతనిప్పుడు, రాళ్ళకూ, కుందులకూ 'కక్కు' కొడుతున్నాడు. పాత్రాలు తయారు చేస్తున్నాడు. సన్నె కళ్ళు తయారు చేస్తున్నాడు. "ఇదీ లాభంలేదు. బాబుగారూ! ఒక రోలు కొంటే రెండుతరాలు గడుస్తుంది ఒక పాత్రంతో పది కుటుంబాలు గడుపుకొంటాయి. ఇందులోనూ బోలె డంత పోటీ. ఇప్పుడు వీటిని అందరూ తయారుచేస్తున్నారు. కారు చవగ్గా అమ్ముతున్నారు. ఒక్కోసారి కూలిగూడా గిట్ట దండీ' అన్నాడు ఆగమయ్య బొంగురుపోయిన గొంతుతో.

అది నిజమేగాని, అంతమాత్రాన కుటుంబపు ఖర్చులేమీ తగ్గవు గదా. బతికున్నంత కాలమూ, ఈ జానెడు పొట్టకూ గంజో గుటకో, ఇంత పొయ్యాల్సిందేగదా. అందుకోసం అతను రాళ్లుకొట్టే పనిక్కూడా తయారయ్యాడు. ఏ అయ్యనో కాళ్ళూ కడుపూ పట్టుకొని నాలుగొందలు తెచ్చుకున్నాడు. ఆ నాలుగొందులూ, నాలుగు ముఠాలకు అడ్వాన్సుగా యిచ్చి, కంకర కొట్టించాడు. తయారయిన కంకరను రోడ్ల కంట్రాక్టరుకు అమ్ముదామని, కూలీల కివ్వాలింది ముద్దర సుద్ధిగా యిచ్చేసి మిగిలిందానితో ముడుచుకుందామని అను కొన్నాట్ట. రెండు విడతలదాకా బాగానే జరిగిందట. పెద్దగా మిగిలి చచ్చిందేమీ లేకపోయినా కటికపస్తులు మాత్రం చేయవలసిన బెడద తప్పిపోయిందనుకొన్నాట్ట. "అంతా నాశనమయి పోయిందండీ. అడ్వాన్సు తీసుకొన్నవాళ్ళు బాకీ తీర్చకుండానే మకాం ఎత్తేశారు. ఎక్కడికెళ్ళారో కూడా తెలియదు. నేను వెతకను కూడాలేదు. వెతికితే కనిపించారే అనుకోండి. ఏం లాభం చెప్పండి? వాళ్ళదగ్గరైనా ఏముం టుంది. గనక వసూలు చేయడానికి" అన్నాడు ఆగమయ్య. మెక్కవోయిన సుత్తెకేసి చూస్తూ. అది కూడా ఆగమయ్య బతుకులాగే బండబారిపోయి వుంది. ఆగమయ్యకి ముగ్గురు పిల్లలు. పెద్దమ్మాయిని మేనల్లుడికే యిచ్చి పెళ్ళిచేశాడు. అతనికి కడపలో ఒక చిన్న సైకిల్ షాపు వున్నదట. "నాకోసం ఎదురు చూడకుండా, వాళ్ళ గంజి వాళ్ళు తాగుతున్నారు" అన్నాడు ఆగమయ్య. బహుశా అదొక్కటేనేమో అతనికి కాస్త తృప్తినిచ్చింది.

తన ఉక్కువులితో, శానంతో, పొగరుతో, పాత పొడ సుత్తెతో రాళ్ళలో నిద్రించే రమణీయతను మేల్కొలిపి అందరి ముందూ వుంచిన ఆగమయ్య, యుగయుగాల భారతీయ సంస్కృతికి అలవాలంగా నిలిచిన దేవతా విగ్రహాలను అలవోకగా మలిచే ఆగమయ్య. శిలాస్తంభాల నుండి సంగీత ఝరులను ఉరుకులెత్తించగల ఆగమయ్య పిడికెడు మెతుకుల కోసం రోడ్డు వారనున్న చింతచెట్టుక్రింద కూచొని, రాళ్ళను కంకరకింద కొడుతున్నాడిప్పుడు.

ప్రతివారూ తమ శ్రమకు తగిన ప్రతిఫలం తమకు లభిం చడం లేదనడం నాకు తెలుసు. ఇలా అంటున్నవారు మిట మిటలాడే ఎండలో, చెమటలు కక్కుకొంటూ, బండరాళ్ళను బద్దలు కొట్టేవారి గురించి మాట్లాడరు. కనీసం ఆలోచించ నన్నా ఆలోచించరు. నిజానికి ఇలాంటి పని చేస్తున్న వారి శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తున్నదా అంటాడు 'మాక్సిం గోర్కి' వొక సందర్భంలో.

## ముగింపు :

ఈ "ఖరీదు కట్టే షరాబులేదు" కథ చదివిన తర్వాత గుళ్ళో దేవుడు ఉన్నడోలేడోగాని, గుళ్ళు కట్టించడానికి దేవుడుండే బాగుండు అన్పిస్తుంది. మిక్సీలు, గ్రైడర్‌లు వచ్చి రోళ్ళమరుగున పడిపోవడంతో అభివృద్ధికి ఆనందించాలో అంతరిస్తున్న కులవృత్తికి బాధపడాలో అర్థంకాని అయో

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

మయంలో ఉన్నాను. ఈ సంకలనం తొలిముద్రణ 1981లో జరిగింది. అంటే 36 సంవత్సరాల కిందటే కులవృత్తిని కాపాడు కోవాలని హెచ్చరించారా రచయిత అన్పిస్తుంది.

**"కొందరు గొప్పవారుగా జన్మిస్తారు."** - అదృష్ట వంతులు.

**"ఇంకొందరకు గొప్పదనం ఆపాదించబడుతుంది"** వీరూ అదృష్టవంతులే.

**"మరికొందరు గొప్పదనాన్ని సాధిస్తారు."** ఇలా సాధించే వారు నూటికో, కోటికో ఒకరుంటారు. ఆ నోటికో కోటికో ఒకరే రావూరి భరద్వాజగారు. వీరి రచనల ద్వారా సామాజిక స్పృహ కల్పించి సమాజాన్ని చైతన్య పరచిన గొప్ప రచయిత డా॥ రావూరి భరద్వాజగారు. వీరు 2013 అక్టోబరు 18న భౌతికంగా దూరమయ్యారు. కాని రచనల ద్వారా ఎప్పటికీ సజీవంగానే ఉంటారు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# రావూరి భరద్వాజ గారి "పాకుడురాళ్ళు" – మహిళా సామాజిక స్పృహ

- కె. పుణ్యవతి
పరిశోధక విద్యార్థిని, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం,
ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, గుంటూరు.

## ఉపోద్ఘాతం :

అవిభక్త హైదరాబాదు సంస్థానానికి చెందిన 'పరిటాల జాగీర్' లోని మోగులూరు గ్రామంలో 1927 జులై 5న జన్మించారు. రావూరి భరద్వాజ తండ్రి పేరు కోటయ్య, తల్లి పేరు మల్లికాంబ, పెరిగింది గుంటూరు జిల్లాలోని తాడికొండ గ్రామంలో.

పొట్ట కూటి కోసం – వ్యవసాయ కూలీగా, పశువుల కాపరిగా రంపంలాగే పనివాడిగా, తిత్తులూదే కూలీగా, పేపరు బాయ్‌గా పనిచేశారు. 17వ ఏట నుండి రచన చేయడం ప్రారంభించారు. అచ్చయిన తొలి కథ 'విమల' 1946 ఆగష్టు ఆఖరి వారం ప్రజామిత్రలో అచ్చయింది. అచ్చయిన పుస్తకం రాగిణి 1950లో. ఆయన రాసిన దైవరాజకీయాలు అప్పట్లో స్వర్ణ కంకణం అందుకొంది. ఆయన ఇప్పటికి దాదాపు 43 కథలు బాలలకు, 17 నవలలు, 11 సాహిత్య గ్రంథాలు, 33 సైన్సు కథలు రాశారు.

1968లోనూ, 1983లోనూ రాష్ట్ర సాహిత్య అకాడమి అవార్డు, 1987లో సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు, అదే సంవత్సరం భారతీయ భాషా పరిషత్ వారి అవార్డు కాక ఇంకా చాలా పురస్కారాలు అందుకున్న వీరి రచనలు అనేకం ఇంగ్లీషు, హిందీ, తమిళం, కన్నడం, మలయాళం, భాషల్లోకి అనువదింపబడ్డాయి. మూడు విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్ యిచ్చి సత్కరించాయి. వీరి రచనల మీద నాలుగు విశ్వవిద్యాలయాల్లో పి.హెచ్.డి. స్థాయి పరిశోధనలు జరిగాయి.

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో తెలుగు ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా ఉద్యోగ విరమణ చేసిన డా॥ భరద్వాజ గారు చదువున్నది ఏడవ తరగతి మాత్రమే.

భరద్వాజా రచన 1965 సంవత్సరంలో 'కృష్ణా పత్రిక' లో సీరియల్‌గా వెలువడిన, ఈ 'పాకుడు రాళ్ళు' నవలకు – 2012 సంవత్సరానికి 'జ్ఞానపీఠ' పురస్కారం లభించింది.

## రావూరి భరద్వాజా – చలన చిత్ర రంగ అనుబంధం :

రావూరి గారు జ్యోతి, అభిసారిక వంటి – సినిమాల గురించి వ్రాసే పత్రికల్లో పనిచేశారు. అప్పుడు ఆయన సినిమా జగత్తులోని లోతు పాతులలను తెలుసుకున్నారు. సినిమా రంగంలో వుండే వెలుగు నీడలను కష్టసుఖాలను ఒడిదుడుకులను గమనించారు. సినిమా రంగాన్ని దగ్గరగా పరిశీలించారు. ఆయన రేడియోలో పనిచేస్తున్నప్పుడు సినిమా రంగాన్ని, నటుల జీవితాలను ఇతివృత్తంగా తీసుకొని "పాకుడురాళ్ళు" నవలను వ్రాశారు. మొదట దీన్ని ఒక కథానికగా వ్రాశారు. అది ప్రచురించబడింది. తర్వాత కథనుపెంచి పాత్రలను ఇంకా చేర్చి నవలగా వ్రాశారు. ఎక్కడా మనకు కథనంలో వస్తువులో ఇతివృత్త నిర్వహణలో పాత్రల చిత్రణలో సంభాషణల్లో, సంఘటనల్లో కృత్రిమత కన్పించదు నవలా శిల్పం ఎక్కడా దెబ్బతినలేదు.

## 'పాకుడు రాళ్ళు' – మహిళా సామాజిక స్పృహ :

నాటకరంగం ప్రజాదరణ కోల్పోతున్న సమయంలో సినిమా కళ వచ్చింది. సినిమాను ఒక కళగా కాక వ్యాపారం గానే భారతీయులు చూశారు. వ్యాపారంగా పెట్టుబడి పెట్టి లాభాలను పొందే మార్కెటుగానే వీళ్ళకు కన్పించింది. ఇక సినిమా తారలు కావాలని వచ్చే స్త్రీల శరీరాలే పురుషులకు కన్పించాయి. స్త్రీలు శరీరాలను అర్పించుకున్నప్పుడే నటించే అవకాశాలు ఇవ్వటం జరిగింది. స్త్రీ పట్ల లైంగిక దోపిడీలు జరిగాయి. ఆమె ఆత్మ హృదయం మనస్సు ఆలోచనలు ఇష్టాలు అయిష్టాలు కన్పించవు. ఎంత అందం, నటనా ప్రావీణ్యం వున్నా లాభం లేదు. తల్లిదండ్రుల దగ్గర్నుంచి

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

భర్త వరకూ అందరూ ఆమెను అంగట్లో బొమ్మగా చేసి డబ్బును సంపాదించాలనే చూస్తారు. అట్లా ఎందరో నటీ మణుల జీవితాలు 'పాకుడు రాళ్ళు'లో మంజరి, తాయారు, కళ్యాణి పాత్రల నిర్మాణంలో కన్పిస్తాయి.

మంజరి పాత్రను రావూరి గారు చాలా యదార్థంగా సజీవపాత్రగా చిత్రించారు. మంజరి అసలు పేరు మంగమ్మ. నాగమణి సహాయంతో నవ్యాంధ్ర కళామండలి నాటక సమాజంలో చేరుతుంది. ఆమె అందాన్ని చూడటానికి జనం విరగబడి వచ్చే వాళ్ళు, ఆమె నటించిన ఏ ప్రదర్శనా ఫెయిల్ కాలేదు. ఆ నాటక సమాజంలోనే ఆరేళ్ళపాటు నాటకా లాడింది. అనేక బహుమతులందుకుంది. ఇంతలో ఊరురా కొత్త నాటక సమాజాలు వెలిశాయి. అఖిలస్థాయి ప్రజా నాట్యమండలి స్థాపించబడింది. దానికి గ్రామ గ్రామాల్లో శాఖలు వెలిసాయి. వాళ్ళు నాటికలు, నాటకాలు ప్రదర్శించ సాగారు. నవ్యాంధ్ర కళామండలిలోని సభ్యుల్లో నాటకాలు వేసే ఉత్సాహం తగ్గిపోయింది. వాళ్ళు మంగమ్మను సాగనం పదలుస్తారు. "ఇంతకాలం పుట్టింల్లో వున్నట్లు వున్నాను" అని మంగమ్మ రాచమంద్రం ఇచ్చిన ఐదువందలు తీసుకుని వెళ్ళిపోయి వేరే నాటక సమాజంలో చేరుతుంది. ఆ నాటక సమాజంలో చలపతి అనే వ్యక్తి పరిచయం ఏర్పడుతుంది. అతని ప్రోత్సాహంతో సినిమాలో వేషం కోసం అతనితో కలసి మద్రాసు నగరం బయలు దేరుతుంది. వేశ్యావృత్తిలో వున్న కూతుళ్ళు, నాటక రంగంలో వేషం వేస్తున్న వాళ్ళు సినిమా రంగం మీదికి దృష్టి సారిస్తున్న సమయం అది. నాటకానుభవం వున్న అందమైన మంగమ్మను ఒకగొప్ప సినిమా తారను చేయాలలనే కలతో చలపతి ఆమెను మద్రా సుకు తీసుకునివస్తాడు. మద్రాసులో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని మంగమ్మను అక్కడ వుంచి తాయారు అనే ఆమెను పని మనిషిగా పెడతాడు.

తాయారుది రాజమండ్రి. భర్త ఓ సినిమా హాలు దగ్గర కిళ్ళీ కొట్టు పెట్టుకుని నడుపుతుంటాడు. అమ్మకాలు బాగానే వుండేది. ఒక్కొక్కసారి తాయారు కొట్టులో కూర్చునేది. తాయారు అందగత్తె కాకపోయినా ఆమె కళ్ళల్లో ఆకర్షణ వుండేది. ఒకసారి ఏదో కొత్త సినిమా ఆ హాల్లోకి వచ్చింది. ఆ సినిమా వెంట ఒక 'రిప్రజెంటేటివ్' వచ్చాడు. అతను మాటకారి, అతని కళ్ళు తాయారు మీద పడ్డాయి. ఆమెను స్టార్‌ను చేస్తానని, తను సొంతగా సినిమా తీస్తున్నానని తాయారుతో చెప్తాడు. తాయారు అతని మాటలు నమ్మి ఇంట్లో వున్న నగానట్రా తీసుకొని అతనితో మద్రాసు వెళ్తుంది. సొమ్మంతా ఖర్చు అయిందాకా తయారుకు ఆశలు పెట్టాడు. ఆ తర్వాత అతను ఎక్కడికి వెళ్ళి పోయాడో కూడా తాయారుకు తెలియదు. తర్వాత తాయారు స్టూడియోల చుట్టూ తిరిగింది. కంపెనీలను వేడుకుంది. అందరూ అదిగో ఇదిగో అని అనటమే గాని వేషాలిచ్చేవారు కాదు. ఆఖరికి ఎక్స్‌ట్రాగా చేరింది. సంవత్సరానికి అయిదారు వేషాలు దొరికితే అదే మహా ఎక్కువ. ఆ డబ్బులోనూ రూపాయికి పావలా కమీషన్ తీసుకునే వాళ్ళు. కాంట్రాక్టర్లు. ఆ వేషాల కైనా ఒళ్ళప్పగించింది. అయినా, దొరికేవి కావు. తర్వాత ఆ ఫీల్డును విడిచిపెట్టి పని మనిషిగా పని చేసుకుంటూ వున్నా వేషాలు వస్తాయని స్టూడియోల చుట్టూ తిరగటం మాత్రం మానలేదు.

చలపతితో సినిమా స్టార్ అవ్వాలనే కోరికతో మద్రాసు వచ్చిన మంగమ్మకు చిన్నగా అవకాశాలు రావడం ప్రారంభ మయ్యాయి. ఆ సినీ పరిశ్రమలో మంగమ్మ పేరు కాస్త మంజరిగా మారింది. చలపతి, మంజరి భార్యాభర్తలుగా చలామణి అవుతున్నా వెంకటేశ్వర్లు, రావు గారి వంటి వారికి లొంగక తప్పలేదు. చలపతి సాయంతోనే ఒక సినిమాలో చిన్న వేషం వేసిన మంజరి క్రమంగా వేల కొద్ది డబ్బు తీసుకునే బిజీ స్టార్ అయింది. గొప్పపేరు సంపాదించు కుంది. పెద్ద ఇల్లు కూడా కొన్నది. తమిళ, హిందీ భాషల్లో అవకాశాల కోసం తమిళ, హిందీ, ఇంగ్లీషు భాషలను కూడా నేర్చుకుంది.

మంజరి పెద్ద స్టార్ అయిన తర్వాత కళ్యాణితో పరిచయ మవుతుంది. కళ్యాణి ఒంటరిదే. ఆమె పరిచయంతో మంజ రికి సిగరెట్లు తాగటం అలవాటవుతుంది. ఏదైనా టెన్షన్‌లోకి వచ్చినా మందు తాగేది. టెన్షన్‌తో నిద్రరాకపోతే తాగేది.

క్రమంగా తాగితే కూడా నిద్ర రాకపోయేసరికి మంజరి నిద్ర మాత్రలు కూడా ఆరంభిస్తుంది. కోటీశ్వరులతో సంబంధం పెట్టుకుంటే కనక వర్షం కురుస్తుంది అని కళ్యాణి మంజరికి సలహా యిస్తుంది. మెహతా, లాలారాం, మొదలి యార్ వంటి వారితో సన్నిహితంగా మెలిగేది. చలపతి సహాయం లేకుండానే తను అనుకున్న దాన్ని నెరవేరేట్లు నేర్చుకుంది.

మద్రాసు కంపెనీలు అయిదారు, బొంబాయి కంపెనీలు మూడు మంజరిని బుకింగుల కోసం ఒత్తిడి చేయసాగారు. చెత్త సినిమాలు పది చేసేదాని కన్నా ఏడాదికి నాలుగ సిని మాలు చేయటం మంచిదని మంజరి అనుకుంది. కాని అది మంచి పద్ధతి కాదని చలపతి వారించాడు. పత్రికా ముఖంగా మంజరి తన నిర్ణయం చెప్పింది. కంపెనీల వాళ్ళు వచ్చి మీ నిర్ణయం ఏమీ బాగా లేదన్నారు. దాంతో ఆమె విరోధులు ఆమెను గురించి చిలువలు పలువలు చేసి ప్రచారం చేయసాగారు. అందరూ ఏకమై మంజరిని అణగ దొక్కాలని చూశారు. అయినా ఆమెకు అవకాశాలు వస్తూనే ఉన్నాయి.

చలపతి, శర్మల ప్రయత్నంలో మంజరికి అమెరికాకు రావాలని ఆహ్వానం వస్తుంది. అమెరికాల మంజరి ఎలిజబెత్ టేలరు, మార్లిన్ మన్రోలను కలుస్తుంది. తర్వాత మంజరి మద్రాసు చేరుకున్నాక సబ్బుల కంపెనీకి అడ్వర్‌టెయిజ్ మెంట్‌కు అవకాశం వచ్చినా ఇష్టంలేని పని చేయలేక తిరస్క రిస్తుంది. ఇక మీదట తన శరీరాన్ని అమ్ముడు పోవటానికి కూడా ఇష్టపడదు. ఆ తర్వాత సక్సేనా ఫోన్ చేసి వేషం ఉందని చెప్తే అలంకరించుకుని వెళ్తుంది. తీరా అక్కడికిని వెళ్తే బ్లూ ఫిలింలో నటించమని కోరగా తనకు ఇష్టం లేక పోయినా వేరే దారి లేక దానికి ఒప్పుకుంటుంది.

మంజరి తన సౌందర్యంతో ఒక వెలుగు వెలిగింది. మంజరికి తన హావ భావాలతో ఎదుటి వాళ్ళను ఆకర్షించి వశం చేసే శక్తి వుంది. సినిమా తారగా ఆమె కీర్తి దేశ విదే శాలకు పాకింది. కాని చివరకు ఆమె ఇష్టంలేని పనిచేసి అది తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటుంది. జీవితంలో ఆమెకెన్నడూ తనను ఆప్యాయతతో అనురాగంతో చూసుకునే నా అన్నవాళ్ళు దొరకలేదు.

### ముగింపు :

రావూరి భరద్వాజ సినిమా రంగంపై ఆకర్షణతో స్టార్ అవుదామన్న ఆశతో మోసపోయి మద్రాసుకు వచ్చి కాంట్రా క్టర్ల చేతిలో లైంగికంగా ఆర్థికంగా, స్త్రీలు ఏవిధంగా పీడింప బడుతున్నారో వివరిస్తూ ఈ పాకుడు రాళ్ళు నవలలో చాలా వాస్తవికమైన విషయాలు చెప్పారు. ఇప్పటికీ ఇటువంటి మోసాలకు అమ్మాయిలు గురవుతూనే వున్నారు. తిండికి లేక మలమల మాడుతూ వేశ్యలుగా, కాల్‌గరల్స్‌గా మారి పోతున్నారు. మ ంజరి వలె సినిమా జగత్తులో పాకుడుపట్టిన రాళ్ళ మీద అడుగడుగునా జారిపడుతూ లేస్తూ జీవితం గడుపుతున్న వారికి మేల్కొలుపు వంటిది ఈ పాకుడు రాళ్ళు. నేటి కాస్టింగ్ కౌచ్ వంటి ఉద్యమాలను బలోపేతం చేయటానికి మహిళలలో సామాజిక స్పృహను కలిగించుటకు ఇటువంటి రచనలు ఎంతో అవసరం.

# సాహితీ ఋషీవలుడు భరద్వాజ

- డాక్టర్. రెంటపల్లి. రవీంద్రభాస్
రీడర్, తెలుగుశాఖాధిపతి
ఆంధ్రా లొయోలా. కళాశాల, విజయవాడ.

జ్ఞానపీఠపురస్కారం అనేది మన దేశంలోని అత్యున్నత పురస్కారం. ప్రపంచస్థాయిలో నోబుల్ బహుమతి ఎటువంటిదో భారతదేశంలో జ్ఞానపీఠపురస్కారం అటువంటిది. తెలుగు రచయితలకు ఆపురస్కారం దక్కటం విశ్వనాథతో మొదలయింది. నారాయణ రెడ్డి దానిని కొనసాగించారు. రావూరి భరద్వాజ దానికి వన్నె తెచ్చారు. విశ్వనాథ వారి 'రామాయణ కల్పవృక్షంతో మొదటిసారి జ్ఞానపీఠ పురస్కార రుచి ఏమిటో తెలుగు వారికి తెలిసివచ్చింది. ఆధునిక కవిత్వానికే అందాలు దిద్దిన సి.నా.రెకు రావటంతో మనలో కూడా అత్యుత్తమ రచయితలు ఉన్నారని సంతృప్తి పడ్డాం. కానీ వీరిద్దరి కన్నా భిన్నమైన నేపథ్యం, రచనా శైలితో రావూరి భరద్వాజ రచించిన 'పాకుడు రాళ్ళు' నవలకు జ్ఞానపీఠ పురస్కారం దక్కగానే ఒక్కసారి తెలుగు వారంతా ఆయన రచనలను సంభ్రమంతో, ఆశ్చర్యంతో, ఆనందంతో తిరిగి మళ్ళీ చదివే ప్రయత్నం చేశారు. అందుకు కారణం 'పాకుడు రాళ్ళు' అనే నవల 'రామాయణ కలవృక్షం'లా పద్యాత్మకమైన ఆర్ష సంప్రదాయ 'ధర్మాన్ని' ప్రతిపాదించే రచన కాదు. అలాగే 'విశ్వంభర'లా గంభీరమైన ఆధునిక కవితకు అద్దం పట్టే రచనాకాదు. అట్టడుగు జీవితాలను తట్టి లేపిన రచన. 70సం॥ల పాటు అట్టడుగు జీవితాలను తన రచనల్లో ప్రతిబింబిప చేయటమే ఉద్యమంగా కొనసాగించినవాడు. అర్థ శతాబ్ది కింద రాసిన 'పాకుడు రాళ్ళు' ఇతివృత్తం నేటికీ నిత్య నూతనం అనిపించటానికి కారణం ఆయన రచనలో సమాజాన్ని ప్రతిబింబించటమే. ఒక టి.వీ. కార్యక్రమంలో తన రచనా వ్యాసంగానికి స్ఫూరి ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానంగా ఆకలి, అవసరం, అవిద్య అని సూటిగా, నిర్ద్వందంగా సమాధానం చెప్పారు. ఇది ఒక జీవిత కాలం రచయితను వెంటాడిన జీవిని వేదన. పొట్ట కూటి కోసం భరద్వాజ వ్యవసాయ కూలీగా, హోటల్ కార్మికుడిగా, ప్రూఫ్ రీడర్‌గా పని చేశారు. కేవలం లేమి కారణంగా చిరిగిన బట్టలతో బడికి వచ్చిన కారణంగా భరద్వాజను ఉపాధ్యాయుడు పదిమందిలో చావకొట్టినప్పుడు బాధతో, నిస్సహాయతతో, దైన్యంతో ఎదురు చెప్పలేక పుస్తకాలు అక్కడ పారేసి క్లాసురూంలోంచి పారిపోయిన భరద్వాజ చదివింది 7వ తరగతి మాత్రమే. ఆతర్వాత బడికి వెళ్ళలేదు. చదివింది లేదు. కానీ జీవితాలను చదివారు. కొన్ని తరాల పిల్లలు క్లాసురూములలో చదువుకునే రచనలు కేవలం పరిశ్రమతో, కృషితో సాధించారు. ఆకలిని తరిమి కొట్టడానికి ఆయన చేయని పనిలేదు. నవలలు, కథలు, వ్యాసాలు, బాలసాహిత్యం, నాటికలు ఆఖరికి సెక్సు కథలు కూడా రాశారు. ఇజాలకు, సిద్ధాంతాలకు ముడి పడలేదు. 185పుస్తకాలు అచ్చయినాయి. కొన్నాళ్ళు 'దీనబంధు' అనే పత్రికను నడిపారు. ఆ తర్వాత ఆలిండియా రేడియోలో స్క్రిప్టు రచయితగా పని చేశారు. ఏ విషయం మీదనయినా అలవోకగా రాసే పనివాడి తనాన్ని, పసనీ సాధించారు. ఆతర్వాతి కాలంలో ఆంధ్ర సాహిత్య అకాడమీ, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారాలతో పాటు వివిధ విశ్వ విద్యాలయాల గౌరవ డాక్టరేట్‌లు కూడా ఆయనను వరించాయి. అందుకున్న పురస్కారాలు ఎన్నో. జ్ఞానపీఠ అవార్డు పొందిన 'పాకుడు రాళ్ళు' ఆయన తన 40ఏట రచించారు. దీనికి మొదటగా 'మాయా జలతారు' అని పేరు పెట్టినా, ఆయన మిత్రులు శీలా వీర్రాజు దానిని 'పాకుడురాళ్ళు'గా మార్చారు. పాకుడు రాళ్ళు అంటే పాకే రాళ్ళు అని చాలా చోట్ల ఆంగ్లాను వాదంలో 'క్రాలింగ్ స్టోన్స్' అని రాస్తున్నారు. కానీ పాకుడు రాళ్ళు అంటే అడుగు వేస్తే జారిపడేలా ఉన్న పాచిపట్టిన రాళ్ళు అని. సినిమారంగం అటువంటిదని అక్కడ అడుగులు జాగ్రత్తగా వేస్తే తప్ప జారిపడకుండా పయనం సాగదని తెలియచెప్పే ఇతివృత్తం. సినీరంగంలోని మెరుపు

జీవితాల వెనక బయట ప్రపంచానికి తెలియని సుడిగుండాలను ఎత్తి చూపే నవల ఇది. ఇటువంటివి ఇంగ్లీషులో అనేకం వచ్చాయి కాని తెలుగులో లేవు. 'సిడ్నీషెల్డన్, ద ఆదర్ సైడ్ ఆఫ్ వుడ్‌నైట్' ఇటువంటివే, ఇంత విశ్లేషణాత్మక రచన ఇటువంటి ఇతివృత్తంతో రాలేదనే చెప్పాలి. మొదట ఈనవలను భరద్వాజ కథగా రాశారు. దానిని మల్లంపల్లి సోమశేఖరశర్మగారు చదివి ఐదారు వందల పేజీల నవలగా రాయవలసిన దానిని 30-40 పేజీలలో రాశావు అని అన్నారు. ఆ తర్వాత దానిని భరద్వాజ సీరియల్‌గా కృష్ణా పత్రికలో ఈకథనే మార్చిరాశారు. తను 'చిత్రసీమ' అనే పత్రికలో పనిచేసేటప్పుడు ఎందరో సినిమా తారలను కలిసి, మాట్లాడి వాటిని రాయడం చేసేవారు. వారితో కలిగిన పరిచయం, వారి అనుభవాలు అన్నిటిని ఇందులో పొందు పరిచారు. ఈసీరియల్ వస్తున్న సమయంలో ఎందరో సినీ ప్రముఖులు దీనిని నిషేధించాలని, ఈసీరియల్ పత్రికలో రాకుండా చేయాలని ప్రయత్నించారు. చంపుతామని కూడా బెదిరించారు. కానీ తాను బెదరలేదని, 'ఎప్పుడో అప్పుడు చావక తప్పదు మీరు కాకపోతే దేవుడు చంపుతాడు' అనుకునే వాడినని ఒక ఇంటర్వ్యూలో రావూరి భరద్వాజ చెప్పారు. దాదాపు 3సం॥ల పాటు కృష్ణాపత్రికలో ధారావాహికగా వెలువడిన ఈసీరియల్ పాఠకులను ఉర్రూతలూగించింది. ఇందులోని ఇతివృత్తం గమనిస్తే సినిమా అనే ఓ రంగుల ప్రపంచం వెనుక దాగిన కుట్రలు, కుతంత్రాలు, కలలు, కన్నీళ్ళు ఒకరిపై ఒకరు వేసుకునే చదరంగపు ఎత్తులు, పైఎత్తులు, తెర వెనక మంత్రాంగాలు, సినిమా రంగంపై తమ పట్టు నిలుపుకోవటం కోసం రకరకాల వ్యక్తులు చేసే ప్రయత్నాలు, ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటూ కూడా పైపై నటనలతో అవసరార్ధపు స్నేహాలు నటించే అగ్రహీరోలు, తారాపథానికి చేరాక అగ్రహీరోలతో నటించనని ప్రకటించి కొత్త హీరోలను తెరకు పరిచయం చేసి తన పట్టు నిలుపుకోవాలనే కథానాయికలు, అవాకులు చెవాకులు రాసి సినిమా వాళ్ళ బండారం బయట పెడతానని బెదిరించి పబ్బం గడుపుకునే సినిమా విలేఖరులు, నిర్మాతలను ముంచి వారిని తొక్కేస్తూ తమ పబ్బం గడుపుకునేందుకు వారు వేసే వేషాలు, చేసే ప్రయత్నాలు, ఉన్న ఆస్తి పాస్తులన్ని అమ్ముకుని దివాలా తీసి చివరకు నడిరోడ్డున పడే నిర్మాతల పాట్లు ఒకటేమిటి సినిమా పరిశ్రమలోని విభిన్న కోణాలను భరద్వాజ తననవల ద్వారా తెలియ చెప్పారు. 14రీళ్ళ సినిమా తెరమీద కనిపించినంత అందంగా తెరవెనక ఉండదని, అది ఒక మాయలోకమని, అందులోకి అడుగు పెట్టిన వారి కాళ్ళు నిరంతరం జారుతూనే ఉంటాయని పట్టుకోసం ప్రయత్నించే లోపే ఇంకెవరో కిందకు లాగుతారని అందుకే ఎందరో సినీనాయకీ నాయకులు తమ జీవితాలను అర్ధాంతరంగా ముగిస్తుంటారనే నిజాన్ని మన కళ్ళ ముందుంచాడు. 50ఏళ్ళ కింద రాసిన నవల అయినా ఇప్పటికీ ఈపరిస్థితి సినిమా రంగంలో ఉందనేది పచ్చినిజం.

ఇక నవలా ఇతి వృత్తాంలోకి వస్తే ఇందులో నాటకాలలో నాయిక పాత్రలు వేసేందుకు మంగమ్మ అనే 15ఏళ్ళ అమ్మాయిని రామచంద్రం, మాధవ రావు అనే ఇద్దరు తాము స్థాపించిన 'నవ్యాంధ్ర కళా మండలి'లోకి తీసుకువస్తారు. ఆమెకు తర్ఫీదు ఇచ్చి మంచి నటిగా తీర్చిదిద్దుతారు. అయితే కొంత కాలానికి కళామండలి మూతపడే పరిస్థితికి వస్తుంది. తిరిగి తన పాతజీవితం అయిన పడుపు వృత్తిలోకి వెళ్ళిపోదాం అని మంగమ్మ అనుకుంటున్న సమయంలో చలపతి అనే పాతమిత్రుడు ఆమెకు సినిమా అవకాశాలు ఇప్పిస్తానని మద్రాసు తీసుకుని వెళతాడు, అతడు చేసిన తీవ్ర ప్రయత్నాల ఫలితంగా ఆమెకు సినిమా అవకాశాలు రావటం మొదలవుతాయి. ఒక జ్యోతిష్యుడి సలహా ప్రకారం మంగమ్మ తన పేరును మంజరిగా మార్చుకుని నెమ్మదిగా సినిమా రంగంలో నిలదొక్కుకుని అతితక్కువ సమయంలో అగ్రశ్రేణి నాయికగా మారుతుంది. తనను సినిమా రంగానికి పరిచయం చేసిన చలపతిని సెక్రటరీగా మాత్రమే చూస్తుంది. నిర్మాతలను ఆడిస్తుంది. అగ్రహీరోలతో తగువులాడి తన ఆధిక్యం చూపిస్తుంది. తన తగువు వల్ల ఇంకో నాయిక లాభపడుతున్నదని గ్రహించి వారితో రాయబారం

నడిపి మళ్ళీ స్నేహం నటిస్తుంది. తెలుగులో అగ్రస్థానంలో ఉన్నప్పుడే హిందీలోకి వెళ్ళే ప్రయత్నం చేస్తుంది. తనకున్న పరిచయాలతో అమెరికాకు భారతదేశ, సాంస్కృతిక రాయబారిగా వెళ్ళి అక్కడి నటులను కలుసుకుంటుంది. ప్రపంచ ఖ్యాతి పొందిన మార్లిన్ మన్రోను కలిసి ఆమె జీవితం కూడా తన జీవితం వంటిదేనని ఎక్కడయినా సినిమా రంగం పరిస్థితి ఒకే విధంగా ఉందని తెలుసుకుంటుంది. ఇండియా తిరిగి వచ్చాక అనుకోని విషమ పరిస్థితులకు చిక్కి అర్ధాంతరంగా తనువు చాలిస్తుంది. ఎందరో నాయికలు తమ జీవితాలను అర్ధాంతరంగా అంతం చేసుకుంటున్న విషయం తెలిసిందే. రచయిత మాధవరావు నోటి నుంచి పలికించిన మాటలు అక్షరసత్యాలు. 'తన సౌందర్య తీవ్రతతో, దేశదేశాలను తపింపచేసిన మంజరి శరీరం, నిర్జీవంగా కాశ్మీరపుతివాచీ మీద పడి ఉండటం ఏదో అపశృతి ఉన్నదనిపించింది. ఆమె సంపాదించిన కీర్తి ప్రతిష్టలు, సిరి సంపదలు ఆమె నీకొనకు తరుము కొచ్చాయి. అనన్య ప్రతిభా సంపదలున్న వ్యక్తి మీద జీవితం ఏదో రూపంలో కసి తీర్చుకుంటుంది'.

సినీ మాయాలోకంలో నా అనుకోనే వారు ఎవరో, కాని వారు ఎవరో తెలియక ప్రేమించే హృదయం కోసం స్త్రీగా మంజరి పడిన ఆవేదన రచయిత ఇలా వర్ణిస్తారు. "జీవితంలో విషాదం డబ్బులేకపోవటం కాదు, మనల్ని ప్రేమించే వాళ్ళు లేకపోవటం మనం ప్రేమించడానికి ఎవరూ దొరక్కపోవడం" ఇటువంటి నగ్న సత్యాలెన్నో రచయిత అక్కడక్కడా నవలలో చురుక్కుమనిపిస్తారు. "నాకప్పుడప్పుడు బ్రతుకు మీద విపరీత ద్వేషం కలుగుతుంటుంది. ఈశరీరంలో జీవుడు గిలగిలలాడుతున్నట్లు అనిపిస్తుంది..... ఉన్నదాంతో బతక లేను క్రొత్తదేంకావాలో తెలీదు. అదే మన విషాదానికి ప్రధాన కారణం.... స్త్రీ సంపూర్ణ వ్యక్తిత్వాన్ని ప్రదర్శించినప్పుడు పురుషుడు సహించలేడు ఆడవాళ్ళం – వారికి కావలసిన విధంగా మారుకుంటూ వస్తే తప్ప మన ఇష్టమంటూ బయట పడిన రోజు సంఘర్షణలు, కీచులాటలు తప్పవు'.

"ఒకప్పుడు ఈపరిశ్రమ నన్నుక్షణం నిలవనీయకుండా తరిమికొట్టింది. నేనెందుకు పనికిరానని తీర్పు చెప్పింది. అపవాదులు, అబద్దాలు కుమ్మరించింది. తట్టుకుని నిలబడ్డాను. అందుకే నాకు మనుషులంటే పరమద్వేషం నన్ను బాధించిన వ్యక్తులమీద, తరిమికొట్టిన ఆటంకాలు కల్పించిన వారన్నా, నన్ను ఇరుకున పెట్టి తమ అవసరాలు గడుపుకునే వారన్నా నాకు మహాద్వేషం.... నేను నా ప్రతిరక్తకణంతోను ద్వేషిస్తాను!

అందుకే మంజరిగా మారిన మంగమ్మ ఉన్న నాలుగు రోజులు ఉన్న దానిలోనే సుఖాన్ని వెతికే ప్రయత్నం చేసింది. తన కోసం పడిగాపులు పడిన జనమే రేపు తను కనిపిస్తే ఛీదరించుకోవచ్చు అంటుంది. ఇంకోజన్మ ఉందో లేదో తెలీదు. ఈజన్మలోనే నేను చేయగలిగినవన్నీ చేయదలుచుకున్నాను అంటుంది. ఉరుకులు పరుగులతో ఉన్నతోన్నత పర్వతాగ్రం నుండి అగాధంలోకి దూకే మహా ప్రవాహం లాంటి బతుకునా క్కావాలి... నిజంగా బ్రతుకు ఒక గమ్యానికి చేరి అక్కడే నిలబడి పోతే ఆనిశ్చలత్వాన్ని భరించగలనా? అంటుంది. ఇది ఆమె ఒక్కరి వ్యథేకాదు ఎందరో నాయికల యదార్ధగాథ. అందుకే ఇప్పటికీ నిత్యనూతనంగా ఉంది.

మంజరి కథతో పాటు సమాంతరంగా సినీరంగపు కుళ్ళుకుతంత్రాలను కూడా ఇందులో రచయిత వర్ణించారు. 'రాజకీయాల వల్ల, కుట్రలు, కుహనాలవల్ల, కుళ్ళు వల్ల, ప్రతిభావంతుడయినవాడు కూడా నెగ్గుకు రాలేకపోతున్నాడు. ప్రతిభావంతులయినా కులం, వారి వృత్తి ప్రతిభను చావుదెబ్బ తీస్తుంది. ఎవరయినా ఎక్కి వస్తారనుకుంటే వారికి రెండో పిక్చర్ దొరక్కుండా చేస్తారు. సినిమా ప్రపంచంలో హీరోగా అడుగు పెట్టిన వాడు హీరోగా ఉండాలి కాని, దిగజారటం ప్రారంభిస్తే ఆ పతనానికి అంతం ఉండదు.

'చిత్రరంగంలో సజావైన మార్గం కన్నా డొంక తిరుగుడు దోవకు ఎక్కువ విలువ ఉంటుంది. నువ్వెంత గొప్పవాడి వయినా నీకిక్కడ మంచినీళ్ళు పుట్టవు. నీ కోప్రొడ్యూసరో, డైరెక్టరో, డిస్ట్రిబ్యూటరో దగ్గర వాడయి ఉంటే చాలు. కనీసం ఒక హీరో గాని, హీరోయిన్ గాని, విలన్గానీ, కమెడియన్ గాని గట్టిగా రికమెండ్ చేసినా చాలు. ఈలగువు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

బిగువులు తెలిసిన వారే ఇక్కడ నిలబడగలరు. సినిమా కథలు కూడా అతుకుల బొంతలా అన్ని సినిమాల్లోంచి కాస్త కాస్త ముక్కలు పోగేసి కలుపుతున్నారని విమర్శిస్తాడు. సక్సెస్ ఫుల్ పిక్చర్‌లోని ఏ ఘట్టాలు జనానికి బాగానచ్చాయో ఓలిస్టు రాసుకుని అవన్నీ వచ్చేలా స్టోరీ కంపోజ్ చేస్తున్నారు. ఆకంపోజింగ్‌లోనూ నావెల్టీ లేదు. కొత్త దనం చూపించలేక పోతున్నారు అంటాడు.

సినిమా రివ్యూలు రాసే విలేఖరులను ఇందులో రచయిత ఎత్తి చూపిస్తాడు. అడిగినంత డబ్బు ఇస్తే ఆమెను ఆకాశానికి ఎత్తుతానని, లేకపోతే ఆమె ఆడరాక్షసి వేషాలకు తప్ప పనికి రాని కర్ణ కఠోరమయిన గొంతుతో శరీర సౌష్టవం, రూపు రేఖలు బొత్తిగా లేని కురూపిలా ప్రజల ముందు నిలబెడతానని బెదిరిస్తాడు. శర్మ పాత్రను ఇందులో అటువంటి విలేఖరుల ప్రతినిధిగా రచయిత వర్ణిస్తాడు. ఇతనే కాదు ఇటువంటివే ఎన్నో పాత్రలు సినిమారంగంలో మనకు తెలియని మాయా ప్రపంచాన్ని కళ్ళముందు భరద్వాజ నిలబెట్టారు. అందుకే 'పాకుడురాళ్ళు' నవల జ్ఞానపీఠ అవార్డుకు అక్షరాల అర్హమయిందని బహుమతి ప్రకటించి, ఎటువంటి ప్రక్రియ అయినా అది సమాజానికి మేలు చేసేది, సర్వ కాలీకమైనది అయితే అత్యున్నత శిఖరాలను అందుకోగలదని రుజువు చేశారు. మామూలు కథలు, నవలలు రాసే వారికి కూడా ఒక భరోసాను అందించారు భరద్వాజ.

**ఆధార గ్రంథాలు :**


* పాకుడు రాళ్ళు – రావూరి భరద్వాజ
* పాకుడు రాళ్ళు – వికీపీడియా
* పాకుడు రాళ్ళు – పుస్తకం సమీక్ష – సిరాశ్రీ gotelugu.com
* మరో తెలుగు పీఠాధిపతి – శ్రీకౌముది – gollapudicolumn
* నెమలి కన్ను – Nemalikannu.blogspot.com
* బతుకు చిత్రమే రచనకు నేపథ్యం – నమస్తే తెలంగాణ

# డా॥ రావూరి భరద్వాజ పాకుడురాళ్ళు నవలలోని – స్త్రీ పాత్ర చిత్రణ

- రావి శ్రీనివాసులు రెడ్డి
పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

డా॥ రావూరి భరద్వాజ 1927 సంవత్సరం జూలై 5న కృష్ణాజిల్లా మొగలూరు లో మల్లికాంబ, కోటయ్య దంపతులకు జన్మించారు. గుంటూరు జిల్లా తాడికొండలో పెరిగారు. 7వ తరగతి వరకు చదువుకున్నారు. కాంతమ్మను వివాహమాడారు. జీవనాధారం కోసం వ్యవసాయ కూలీగా, పశువుల కాపరిగా, పేపరు బాయ్ గా వివిధ పనులను చేశారు. రావూరి భరద్వాజ 17వ ఏట రచనా రంగంలో అడుగిడి కథా రచయితగా, నవలాకారునిగా విమర్శకునిగా ప్రసిద్ధులైనారు.

రచయితలు తమ అన్ని రచనలలోనూ నూతన ఆలోచనా ధోరణులనూ, కళా నైపుణ్యాలను వ్యక్తం చేస్తూనే ఉంటారు. అయితే ఏదో ఒక్క రచనలో మాత్రం అంతటాతానై విశ్వరూపం చూపిస్తారు. అలా రావూరి భరద్వాజ తన జవసత్వాలను, రచనా వైశిష్ట్యాన్నీ, పరిశీలనా నిశితత్వాన్ని, విశ్లేషణా చాతుర్యాన్ని పొందుపరిచిన నవలే పాకుడురాళ్ళు. సాధారణంగా ఏ రచయిత చూపులుకూ అందని సామాజిక కోణాలే భరద్వాజ పాకుడురాళ్ళు నవలా వస్తువు. రచయిత సినీ పత్రికలో పనిచేస్తున్న రోజుల్లో చలన చిత్రరంగంలోని కష్ట సుఖాలను, బయటి ప్రపంచానికి తెలియని అనేక చీకటి కోణాలను చాలా దగ్గరగా గమనించి, ఆ విషయాలన్నింటిని పాకుడురాళ్ళు నవలగా మలిచారు. ఈ నవలకే డా॥ రావూరి భరద్వాజ గారికి 2012వ సంవత్సరానికి జ్ఞాన పీఠ పురస్కారం లభించింది. పాకుడురాళ్ళు నవలలోని స్త్రీ పాత్ర చిత్రణే నా ప్రస్తుత వ్యాసం. ఉద్యోగ నిర్వహణలో భాగంగా సినీ రంగంలో దయనీయ స్థితిని గడుపుతున్న స్త్రీ లను రచయిత కలుస్తారు. తాను కలసిన ఆ స్త్రీ మూర్తుల వేదనను, అనుభవాలను వినడమే కాకుండా కొన్ని సంఘటలను ప్రత్యక్షంగా చూశానని పాకుడు రాళ్ళు నవలకు రాసిన ' నా మాట' లో వారు తెలిపారు. ఆ అనుభవాలసారమే ఆయన పాత్ర చిత్రణలో కనిపిస్తుంది.

## మంజరి :

పాకుడురాళ్ళు నవలలో ప్రధాన స్త్రీ పాత్ర మంజరి. మంజరి ఆసలు పేరు మంగమ్మ. నవల ప్రారంభంలోని మంగమ్మే సినీ రంగ ప్రవేశంతో మంజరిగా మారింది. మంజరి మంగమ్మగా ఉన్నప్పుడు మంచి, చెడు విచక్షణ కలిగి, సంఘ సమ్మతమైన పద్ధతుల పట్ల ఇష్టాన్ని, తద్విరుద్ధమైన పద్ధతుల పట్ల అసహ్యాన్ని వ్యక్తం చేసే మనసత్వం కలదిగా కనిపిస్తుంది.

నాగమణి పరిచయంతో తన జీవితం సుఖంగా ఉంటుందనుకుంటుంది. కానీ నాగమణి నడిపించిన జీవితంలో మంజరి తన మనస్సును చంపుకొని, భరించరానంత వేదనను అనుభవిస్తుంది. రోజుకొకరితో పంచుకొనే జీవితం దుర్భరమైనదిగా భావిస్తుంది. తన మనస్సుకు నచ్చని రీతిలో ప్రవర్తించ వలసి వచ్చినందుకు కుమిలిపోతుంది. ఆ నిస్సహాయ పరిస్థితి నుండి బయట పడే మార్గం కోసం ఎదురు చూస్తుంటుంది. అలాంటి సమయంలోనే నాటక సమాజంలో పరిచయమైన చలపతి మంజరిని, సినిమా రంగానికి పరిచయం చేస్తానని మద్రాసు తీసుకు వెళ్తాడు. మద్రాసులో సినిమా వేషం కోసం చలపతి మంజరిని అసిస్టెంటు డైరెక్టర్ వెంట పంపిస్తాడు. అతనితో వెళ్తున్న సమయంలో మంజరికి తాను ముక్కూమోహం తెలియని వాని వెంట వెళ్తున్నానన్న భావన కలుగుతుంది. అసిస్టెంట్ డైరెక్టరు, ఫోటోగ్రాఫర్, సౌండ్ ఇంజనీరు మొదలగు వారిని కలిసి వచ్చిన తరువాత మంజరి మనస్సు దిగులుతో నిండిపోతుంది.

మంజరి కాలుబెట్టిన సినీరంగం, అక్కడి వాతావరణం, పరిస్థితులు అన్నీ అసాధారణంగానే ఉంటాయి. మంజరిని నీతి, నిజాయితీ లతో బ్రతకాలనుకుంటుంది. కానీ సినీ

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

పరిశ్రమలో అడుగుపెట్టడానికి చలపతి చూపెట్టిన మార్గం మాత్రం అందుకు విరుద్ధంగా ఉంటుంది. సినీ రంగంలో ప్రవేశించిన తరువాత అనేక అపసవ్య పద్ధతులను అనుసరించటం ఆమెకు తప్పనిసరి అవుతుంది. ఈ సందర్భంలో తనంత తాను స్థిమితంగా ఉండలేకపోతుంది.

సినిమా రంగంలో ఆడుగుపెట్టిన దగ్గర నుండి కృత్రిమమైన విలువల కోసం ప్రాకులాడుతున్నప్పటికీ, సాంస్కృతిక వ్యవహారాల పరిచయాన్ని పెంచుకుంటుంది. సినీ పరిశ్రమలో సమయానుకూలంగా మెలగటానికి అవసరమైన మెళకువలను, పరిస్థితులు అర్థం చేసుకొని తనకు ఉపయోగకరంగా మార్చుకునే నైపుణాన్ని పొందుతుంది.

మంజరి తాను నటించిన మొదటి సినిమా ప్రదర్శనకు ఏర్పరచిన సమావేశంలో ఉపన్యసిస్తుంది. తన సినిమాల ప్రదర్శన ఉత్సవ సమయానికి ముందే చలపతి, కళ్యాణిల సలహాతో పట్టుదలగా ఆంగ్లభాషా పరిచయాన్ని అలవర్చుకొంటుంది. ఆ సందర్భంలో తాను నటనలో రాణించటానికి కారణం తన తెలివి తేటలు కాదని, సినీ నిర్మాత ప్రసాదు గారు, కవి గారు, హీరో మూర్తి ఈ విషయంలో తనకు గురువులని, చలపతి దేవుడులాంటి వారని తన కృతజ్ఞతను చాటుకుంటుంది. తన సినీ అవకాశాలను దృష్టిలో పెట్టుకొని తమిళ, హిందీ భాషలను కూడా నేర్చుకుంటుంది. ఆ భాషల నైపుణ్యమంతటిని పత్రికా విలేఖరులకిచ్చిన ఇంటర్వ్యూలలో ప్రదర్శిస్తుంది. తన సినిమా ప్రదర్శన సందర్భంగా తనను ప్రశంసించటానికి వచ్చిన సాటి నటీమణుల పట్ల ఆదరణ చూస్తుంది. తన దగ్గరకి వచ్చిన చిన్న ఆర్టిస్టులను చూచి, తన కన్నా వాళ్ళు అందమైన వారని హృదయ పూర్వకంగా వారిని మెచ్చుకుంటుంది. సహనటీమణులయిన సరోజ, విమల,భారతిలు ఎదుర్కొనే సమస్యలు విని సానుభూతిని వ్యక్తం చేస్తుంది.

మంజరి సినిమా పరిశ్రమలో ప్రవేశించిన తరువాత స్థిరత్వం పొందడం కోసం ఎప్పటికప్పుడు తప్పుడు మార్గాలనే ఆశ్రయిస్తుంది. పరిశ్రమలో స్థానం పొందాలన్న ఆశే ఆమెను ఆ విపరీతపు ఆలోచనల వైపు నడిపిస్తాయి. ఎదుటి వారిపై ప్రేమను చూపిస్తూ, తన పనులను నెరవేర్చుకోవడం మంజరికి వెన్నతో పెట్టిన విద్య కాకపోయినా ఆ విధంగా నడుచుకోవలసిన పరిస్థితులనే ఆమె ఎదుర్కొంటుంది. తను ప్రయాణిస్తున్న మార్గం తప్పని మనస్సు ఒక వైపు గింజుకొంటున్నా, ఆ మార్గాన్ని విడిచిపెట్టదు. తన పని సాధించుకోవటం కోసం అవసరమైన ప్రతి ఒక్కరితో చనువుగా నడుచుకుంటూ, అనుచితమైన వారి కోరికలకు, అమానుషమయిన ప్రవృత్తికి ఆమె ఆహుతైపోతున్నా, ఆ పరిస్థితులన్నింటికి తలవంచి తన పని పూర్తి కావటమే ముఖ్యంగా భావిస్తుంది.

మంజరికి డబ్బు సంపాదన పెరిగిన కొద్దీ క్రొత్త క్రొత్త అభిరుచులు అలవాటు అవుతాయి. గుర్రప్పందాలలో పాల్గొంటుంది. చెడు మార్గాన్ని అనుసరిస్తున్న మంజరి దురలవాట్లకు బానిసవుతుంది. ఒకప్పుడు త్రాగి తన దగ్గరకు వచ్చిన వారిని అసహ్యించుకునే మంజరి తన మనస్సుకు కలిగిన బాధ పోగొట్టుకునే క్రమంలో తనే త్రాగడం అలవాటు చేసుకుంటుంది. సిగరెట్ కాలుస్తుంది. గుర్రప్పందాలలో పూర్తిగా నష్టపోతుంది.తన కంటే ఉన్నత స్థితిలో ఉన్న వారిని చూచి అసూయపడుతుంది. జీవించినంత కాలం డబ్బుతో వచ్చే ఆనందాలను అనుభవించాలనుకొంటుంది. ఆ క్రమంలోనే పాప పుణ్యాలు, దయాదాక్షిణ్యాలు అర్థం లేని మాటలని భావించి నిర్దాక్షిణ్యంగా డబ్బు సంపాదిస్తుంది. ఆ దశలో విరాళాల కోసం వచ్చిన వారికి తన నోటితో లేదనకుండా తెలివిగా తప్పించుకుంటుంది. సినీ కళామతల్లికి చేసిన సేవా ఫలితాన్ని కష్టాలలో ఉన్నవారికి పంచిపెడుతున్నట్లుగా అందరికి భ్రమ కలిగిస్తుంది. ఇప్పుడు చేతిలో డబ్బులేదని, డబ్బు వచ్చినప్పుడు తప్పకుండా సహాయం చేస్తానని, సహాయం కోసం వచ్చిన వారికి చెబుతుంది.

ప్రసాదుకు డబ్బున్నంతవరకు అతని నుండి తను సహాయం పొందటానికి అతనిపై లేని ప్రేమ నటించి, పని సాధించుకొంటుంది. అతని పరిస్థితి దిగజారడంతో అతని పట్ల మర్యాద లేకుండా మాటల్లో దురుసుతనాన్ని ప్రదర్శిస్తుంది. గుర్రపు పందేలలో జరిగిన నష్టాన్ని అధిగమించ

టానికి బొంబాయి ఫైనాన్సియర్ కిషన్‌దాసు కు దగ్గరవుతుంది. కిషన్‌దాసు యొక్క అమానుషమైన చేష్టలను, అతని వింత కోరికలకు తట్టుకోలేక మంజరి భయంకరమైన వేదనను అనుభవిస్తుంది. దొంగనోట్ల కేసులో కిషన్‌దాసు పట్టుబడటంతో, కళ్యాణి మరణించినప్పుడు పోలీసులు పెట్టిన ఇబ్బందులు గుర్తొచ్చి మళ్ళీ పోలీస్ కేసులో ఇరుక్కుంటానన్న భయానికి గురౌవుతుంది. దానితో ఢిల్లీ రాయభార కార్యాలయంలో పనిచేసే సక్సేనాను శరణు వేడుతుంది. సక్సేనా ఈ అవకాశాన్ని వాడుకొని మంజరిని మోసం చేస్తాడు. దానితో తప్పనిసరి పరిస్థితుల్లో మంజరి బ్లూ ఫిల్మ్ లో నటించవలసివస్తుంది.

మంజరి మొదట నుండి తన ఊహల్లో మంచి జీవితాన్ని అల్లుకొంటుంది. కానీ నవలాసాంతం ఆమె కోరిన ఆప్యాయత, ఆదరణలతో నిండిన మంచి జీవితం లభించదు. సన్మార్గంలో నడుచుకోవాలని ప్రయత్నించిన ప్రతిసారీ అశక్తురాలవుతుంది. ఆమె ప్రయాణించిన మార్గాన్ని బట్టే అన్ని అనర్థాలను పొందుతుంది. వాటి ఫలితంగానే దు:ఖాలకు చేరువై, నిస్సహాయరాలౌతుంది. బ్లూఫిల్మ్ బయట పెడతానని సక్సేనా బెదిరించినప్పుడు, సహాయపడతానని తనను మోసం చేయటం ధర్మం కాదంటుంది. ఆ బ్లూ ఫిల్మ్ బయట పెట్టవద్దని తాను అన్యాయార్జన కోసం అవి చేయలేదని, కావాలంటే ఆ డబ్బు తనకు ఇస్తానని వేడుకొంటుంది. అవే మంజరి అఖరి మాటలు ఉదయానికి మరణిస్తుంది.

సినిమా రంగమే కాకుండా ఆమె ప్రయాణించిన మార్గాలు, అనుసరించిన పద్ధతులే ఆమె పతనానికి పాకుడురాళ్ళు అయ్యాయి. ధనవ్యామోహంతో ఎదిగిన మంజరి, తన హృదయ వేదనను మాధవరావుకు, రాజమణికి రాసిన ఉత్తరాలలో తెలియజేస్తుంది. ఆ ఉత్తరాలలో ఆత్మీయుల కోసం, ఆప్తుల కోసం ఆరాటపడుతుంది. తన బాధను పంచుకోవటానికి ఎవరూ లేరని, అదే జీవితంలో అసలైన పెద్ద శిక్షని చివరికి తెలుసుకుంటుంది. జీవితంలో డబ్బు అవసరమే కానీ అదొక్కటే మానవ జీవితాన్ని సుఖవంతం చేయలేదని దాని కంటే ముఖ్యమైనవి అనుబంధాలేనని, అవి లేని బ్రతుకుకు శాంతి లభించదని తెలుసుకునే లోపే మంజరి జీవితాధ్యాయం ముగిసింది. జీవితంలో అనేక ప్రలోభాలు, వ్యామోహాలకు లోనైన మంజరి చివరికి వాటికే అహుతైపోతుంది. అమె తెలివితేటలు, ఆలోచనలు, కుయుక్తులన్నీ విధికి తలవంచక తప్పలేదు. నా అన్న వాళ్ళ అండ దొరకనప్పుడు భవిష్యత్ అగమ్యగోచరమవుతుంది. ఈ స్థితిలో మంజరికి ఆత్మ హత్య కంటే మరో మార్గం కనిపించలేదు.

సరియైన జీవిత విధానాన్ని అవలంభించకపోతే ఫలితాలు ఇలానే ఉంటాయనే నగ్న సత్యాన్ని డా॥ రావూరి భరద్వాజ మంజరి పాత్ర ద్వారా నిరూపించారు.

**కళ్యాణి :**

పాకుడురాళ్ళు నవలలో మరోక ముఖ్యమైన పాత్ర కళ్యాణి. కళ్యాణి అసలు పేరు కన్నమ్మ. సినీ రంగ ప్రవేశంతో కన్నమ్మ కళ్యాణిగా మారుతుంది. కన్నమ్మ భర్త పకీరయ్య. దుర్వ్యసనాలకు బానిసైన పకీరయ్య కన్నమ్మను చిత్రహింసలు పెడతాడు. పకీరయ్య ప్రవర్తనతో విసుగుచెందిన కన్నమ్మ ఎదురింట్లో ఉన్న రామిరెడ్డితో కలసి మద్రాసుకు మకాం మారుస్తుంది. రామిరెడ్డి ఆమెను మద్రాసులో ఉంచి అప్పుడప్పుడు వచ్చివెళ్తుంటాడు. ఒకసారి అలా వచ్చి వెళ్ళిన రామిరెడ్డి తరువాత చాలా రోజుల వరకు మద్రాసు రాడు. తన జీవనాధారం కోసం ఆమె పడుపువృత్తిని ఆశ్రయిస్తుంది. అలా ఆమె దగ్గరకు వచ్చేవారిలో ఒకతను ఆమెకు సినిమా ఛాన్సులు ఇప్పించినా, మంచి పాత్రలు రాలేదు. చాలా రోజుల తరువాత తిరిగి వచ్చిన రామిరెడ్డితో మరి కొందరిని కలిపి సినిమాకు పెట్టుబడి పెట్టిస్తుంది కళ్యాణి. దాని వలన ఆర్థికంగా కొంత లాభాన్ని పొందుతుంది. ఆ రోజులలోనే కళ్యాణి భర్త పకీరయ్య ఆమెను వెతుకుంటూ మద్రాసు వచ్చి, ఆమెను బెదిరించి డబ్బులు తీసుకొని వెళ్తుంటాడు.

ఆ పరిస్థితులలో కళ్యాణికి కొడుకు పుడితే, ఆమె తన పరిచస్తులందరికి ఫోన్ చేసి ఆ బిడ్డకు తండ్రి నీవేనంటూ ప్రతి ఒక్కరికి విడిగా చెప్పి, వారందరి దగ్గర డబ్బు తీసు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

కుంటుంది. కొడుకు పుట్టిన ఐదేళ్ళకు రాజన్ అనే ధనవంతుడు పరిచయమైతే కొడుకును తమ్ముడని చెప్తుంది. కళ్యాణి భర్త పకీరయ్య, తన కొడుకు సునీల్ ను ఇబ్బంది పెట్టడం సహించలేక కుమారుడిని హాస్టల్లో పెట్టి చదివిస్తే, వాడు గూఢచారుల ముఠాలో చేరి చివరకు దేశద్రోహియై తల్లికి దూరమవుతాడు.

ఒక సందర్భంలలో మంజరిని చూచిన కళ్యాణి ఆమెను చనిపోయిన తన చెల్లిలిగా భావిస్తుంది. సినీ పరిశ్రమలో తనకెదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మంజరికి మంచి సలహాలిస్తుంది. రాజన్ ద్వారా మంజరికి ఆర్థికంగా తోడ్పాటునందిస్తుంది. మంజరికి గుర్రప్పందాలు, సిగరెట్లు కాల్చడం అలవాటుచేస్తుంది. కష్టాలలో ఉన్నప్పుడే ఆత్మీయుల అవసరం అధికం. అలా కళ్యాణికి దగ్గరైన ఆత్మీయురాలే మంజరి. కళ్యాణికి కొడుకు, భర్త ఉన్నా వారు దుర్మార్గులై ఆమెను పీడించటమే తప్ప అత్మీయులు కాలేకపోవడం చేతనే కళ్యాణి మంజరిని నమ్ముతుంది. డబ్బు సంపాదనయే వ్యసనంగా మారిన కళ్యాణీ, మంజరిలు ముందు స్నేహితులై, తరువాత ఆత్మీయులై ఒకే మార్గాన ప్రయాణిస్తారు. కళ్యాణి అనుసరించిన మార్గంలో తొటివారితో సత్సంబంధాలు ఏర్పడక, తన జీవితాన్ని మొత్తం డబ్బు సంపాదన కోసమే వినియోగించే క్రమంలో మరణిస్తుంది. జీవిత గమనంలో మంజరి, కళ్యాణిల ఆశయం ఒక్కటే, అందుకే వారి జీవితాలు కూడా ఒకే రకమైన ముగింపును పొందాయి. మంజరి ఆత్మహత్య చేసుకుంటే కళ్యాణిని డబ్బు కోసం ఆమె భర్త పకీరయ్యే చంపేస్తాడు.

## నాగమణి :

పాకుడురాళ్ళు నవలలో మరొక స్త్రీ పాత్ర నాగమణి. మంగమ్మ మంజరిగా మారకముందు వరకు నాగమణి వద్ద ఉంటుంది. నాగమణి తాను మంజరి అమ్మనంటుంది. కానీ మంజరి నాగమణి తనకేమికాదని చెబుతుంది.నాగమణి తాను చాలా నాటకాలు వేశానని, తనకు నటనంటే ఇష్టమని చెబుతుంది. తన నటనానుభవం గురించి చెప్తూ బళ్ళారి రాఘవాచారి నాటక సంఘంలో పనిచేశానంటుంది. తాను చింతామణి నాటకంలో చింతామణి వేషం వేస్తే విజయనగరం మహారాజు గారు నాటకానికి వచ్చారంటుంది. ఆ నాటకంలో తన వేషం చూచి స్థానం నరసింహరావు గారు మెచ్చుకున్నారంటుంది. మంగమ్మ నాటకాలలో నటించాడానికి వెళ్ళినప్పుడు రక్షణగా నాగమణిని వెంట తీసుకెళ్ళేది. పేరుకు మంగమ్మకు తోడుగా వచ్చిన నాగమణి ఊరిలో తనకు చెందిన పనులను చక్కబెట్టుకొనేది. డబ్బు కోసం ఎందరో అమ్మాయిలను పడుపువృత్తిలో దింపుతుంది. డబ్బు కోసం వారిని నానా తిప్పలు పెట్టి, వారితో కఠినంగా వ్యవహరిస్తుంది చేసిన పాపానికి ఫలితంగా చివరకు ఆలనా పాలనా చూచేవారు లేక కటిక పస్తులతో కాలం వెళ్ళదీస్తూ మరణిస్తుంది.

## రాజమణి :

నాగమణి వద్ద మంగమ్మ కలసి ఉండేది. ఒక రకంగా మంగమ్మకు శ్రేయాభిలాషి. మంగమ్మను తనతో పాటు నాగమణి ఇంట్లో ఉన్న వసంతను కూడా ప్రేమగా చూచుకొనేది. తనకు జీవినాధారం ఏమి లేకపోయేసరికి తనను చేరదీసిన నాగమణిని ఇంటి నుండి బయటకు గెంటి నాగమణి నిర్వహించిన వృత్తినే తాను అవలంభిస్తుంది. మంగమ్మకు మంచి సలహాలిచ్చి సినిమా రంగంలోకి వెళ్ళేటట్లు ప్రోత్సహించి, తరువాత మంగమ్మ ద్వారానే వసంతకు కూడా సినిమా రంగంలో అవకాశాలు వచ్చేటట్లు చేస్తుంది.

నాటక సమాజాన్ని వదిలి తనను చూడటానికి వచ్చిన మంజరిని చూచి ఆనందపడుతుంది. మంజరి తాము నివశించే మురికి కూపం నుండి బయటపడి, ఆ దుర్భర జీవితాన్ని వదిలేసినందుకు సంతృప్తి పడుతుంది. మద్రాసు వెళ్ళిన మంజరి ఆక్కడ తనకు అవకాశాలు రాలేదని, తన పరిస్థితి అయోమయంగా ఉందని, అందుకు తను వెనుదిరిగి రావాలనుకుంటున్నానని ఉత్తరం వ్రాస్తుంది. దానికి ప్రత్యుత్తరంగా రాజమణి, అక్కడే ఎలాగైనా నిలదొక్కుకోవాలని, నిదానంగా మంచి అవకాశాలోస్తాయని మంజరికి ధైర్య వచనాలతో కూడిన హితబోధ చేస్తుంది. ఈ ఉత్తరంలో వ్రాసిన మాటలను బట్టి రాజమణి స్వభావం లోని ప్రేమానురాగాలు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

తెలుస్తాయి. తాము ఎలాగో ఇక్కడ నానా పాట్లు పడుతున్నాం. కనీసం ఏదో ఒక చిన్న అవకాశం కలిగి బయటకు వెళ్ళిన మంజరైనా తమలాగా మనస్సును చంపుకొని బ్రతకవలసిన స్థితి ఉండదని భావిస్తుంది. తనకు లేని సుఖం కనీసం తన స్నేహితురాలు మంజరికైనా లభించాలని కోరుకునే ఉదారత ఆమె పాత్రలో కనిపిస్తుంది. మద్రాసులో మంజరి స్థిరపడిన తరువాత వసంతను వెంటబెట్టుకొని మద్రాసు వెళ్తుంది. వసంత సినిమా అవకాశాల కోసం మంజరి సమస్యలు తెచ్చుకుంటుందని తెలిసి బాధపడినా, తన సమస్యను తానే పరిష్కరించుకునే నేర్పు మంజరికి కలదని మంజరిపై తనకు గల విశ్వాసం వమ్ముకాలేదని సంతోషిస్తుంది.

### తాయారు :

తాయారు చలపతి ఇంట్లో పనిమనిషి మధ్య మధ్యచిన్న తప్పులు చేసినా తన తప్పులు తెలుసుకుంటుంది. మంజరికి దగ్గరై తన ప్రవర్తన మార్చుకుంటుంది. తాయారు తన భర్త వేరేపని బయటకు వెళ్ళినప్పుడు తమకు సినిమాహాలు వద్ద గల కిళ్ళీ కొట్లో కూర్చుంటుంది. సినిమా రిప్రజంటేటివ్‌గా వచ్చినతని మాటలకు భ్రమపడి ఇంట్లో నగలన్నీ తీసుకొని అతనితో పాటు పట్నంలో కాపురం పెడుతుంది. విషయం తెలిసి వెదుకుంటూ వచ్చిన తల్లిదండ్రీ ఎంత బ్రతిమిలాడినా ఇంటికి తిరిగి వెళ్ళదు. గుట్టుగా సంసారం చేసుకొంటున్న తాయారుకు అరచేతిలోనే స్వర్గం చూపించి, సినిమా నటిని చేస్తానని తీసుకొచ్చిన ప్రబుద్ధుడు నాలుగైదు నెలల్లో పరారైతే, తాయారు ఒంటరిగా సినిమాలలో వేషాల కోసం ప్రయత్నించి, విఫలమై పనిచేసుకొని జీవించటంలోనే ప్రాణానికి సుఖముందని, పనిమనిషిగానే జీవితాన్ని కొనసాగిస్తుంది. మంజరిని అంటి పెట్టుకొని ఉండి ఆమెపై ఆత్మీయతను చూపిస్తుంది. మంజరి మరణాన్ని చూచి, భోరున ఏడుస్తూ ఏ మాత్రం ముందుగా పసిగట్టినా కడుపులో పెట్టుకొని కాపాడుకునేదానినని విలపిస్తుంది.

### వసంత :

మంజరికి, రాజమణి వద్ద పరిచయమై ఇద్దరిని అక్కలగా భావించి, చెల్లెలి వలే నడుచుకొంటుంది. తన కంటే పెద్ద వాళ్ళయిన రాజమణి, మంజరిల ప్రేమానురాగాలను పొందుతుంది. సినిమా అవకాశాల కోసం మంజరి నేర్పే మాటలు, పద్ధతులననుసరించి, మంచి నటిగా మారడానికి ప్రయత్నిస్తుంది. ఈ నవలలో ఇంకా భారతి, సరోజ, విమల, విజయ లనే సహాయ పాత్రలున్నప్పటికి వాటికి ప్రాముఖ్యత లేదని చెప్పవచ్చు. అందుకే వాటిని నా వ్యాసంలో స్వీకరించ లేదు.

### ముగింపు :

నేటి మానవ సమాజంలో స్త్రీ పురుషులలో తప్పులు ఎవరూ చేసినా దాని దుష్ఫలితాన్ని మాత్రం స్త్రీయే భరించవలసివస్తుంది. పురుషుడు చేసిన తప్పుకు కూడా స్త్రీయే శిక్షను అనుభవిస్తుంది. సినిమా రంగంలోని స్త్రీ పాత్రల మనోవేదనను రచయిత కళాత్మకంగా చిత్రించడమే కాకుండా జరిగిన, జరుగుతున్న, జరగడానికి అవకాశాలున్న వేలాది సంఘటనలను అందంగా తన రచనలో కూర్చడమే కాకుండా, వీటన్నింటిని మించి రచయిత పడిన మనోవేదన, వాటిని మార్చి తీరాలన్న కోరిక నవలలో కనిపిస్తుంది. ఎప్పటికప్పుడు నిత్య నూతనంగా వెలుగొందుతూ, వేలాది మంది ప్రేక్షకులను తన వైపు ఆకర్షింపజేసుకుంటున్న సినీ రంగంలో పాతుకుపోయిన అవాంఛనీయ శక్తులను గురించి రచయిత మనకు కను విప్పు కలిగిస్తున్నారు. చిరునవ్వుల చాటున కనిపించని ఆత్మ ఘోష, తళుకు చూపులలో దాగిన కన్నీరు, తియ్యని మాటల వెనుక దాగి ఉన్న విషజ్వాలలు ఈ నవలతో ప్రత్యక్షం చేశారు రావూరి భరద్వాజ.

### ఆధార గ్రంథాలు :

పాకుడు రాళ్ళు నవల, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, బండ్లగూడ, హైద్రాబాదు -068.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# జీవన పోరాట జీవితాల్ని చిత్రించిన రావూరి 'జీవన సమరం'

- డా. జడా సుబ్బారావు
తెలుగు సహాయ ఆచార్యులు,
రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం,
నూజివీడు, కృష్ణా జిల్లా.

తెలుగుసాహిత్యానిక్జ్ఞానపీఠ సొగసులద్దిన విశిష్టకవి శ్రీ రావూరి భరద్వాజ. సాంఘిక సమస్యల పట్ల, సమాజంలోని దురన్యాయాల పట్ల నిబద్ధతతో రచనలు చేసిన రచయిత. బ్రతుకుతెరువుకోసం చిన్నచిన్న పనుల్ని కూడా జీవ నోపాధిగా కలిగిన దుర్భర జీవితాల్ని రచనల్లో చిత్రించి పీడిత ప్రజలపక్షాన కలాన్ని గళంగా వినిపించిన అక్షర శ్రామికుడు రావూరి. కాదేదీ కవితకనర్హం అన్నట్లు రాయ గలిగే సత్తా వుంటే ఈ ప్రపంచంలోరచనకు పనికిరాని వస్తువు లేదని నిరూపించిన గొప్పకవి. సమసమాజ నిర్మా ణాన్ని బలంగా అపేక్షించాడు రావూరి. జీవితంలోని ఎత్తు పల్లాలనూ, వేదనలనూ, బాధలనూ అన్నిటినీ అనుభవించిన రావూరి కష్టజీవికి ఇరువైపులా నిలబడిన కవిగా మనకు బహుముఖా లుగా దర్శనమిస్తాడు. ఏ ప్రక్రియను చేపట్టినా సమాజంలోని అందరి సంక్షేమాన్ని కోరిన రావూరి దాదాపు 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 నవలలు, 5 పిల్లల కథాసంపుటాలు, 5 స్మృతికావ్యాలు వెలువరించారు.

1981లో జీవనసమరం తొలిముద్రణ వెలువడింది. ఈనాడు దినపత్రికలో 52 వారాల పాటు ధారావాహికంగా వచ్చిన వ్యాససంపుటి 'జీవనసమరం'. ఈ వ్యాసాలు చదివినప్పుడు పాఠకుడిలో ఆవేదన, ఆక్రందన, ఆవేశం కలుగుతాయి. మనిషి ఆలోచనల్లో కూడా తట్టని అనేకమంది జీవితాల వెలుగునీడల్ని నిర్మొహమాటంగా చెప్పి వాళ్లను కూడా మనుషులుగా గుర్తించమనే ఆలోచనకు పాదువేస్తారు రావూరి. ఈ వ్యాసాలకు పేర్లు పెట్టడంలో కూడా ప్రాచీన ఆధునిక కవితల్లోని పలుకుబడులను ఉపయోగించుకున్న తీరు అద్భుతంగా అనిపిస్తుంది. జీవితా సారాన్ని చక్కగా వివరించడం, వ్యాఖ్యానించడం, సందర్భానుసారంగా చమ త్కారంగా, సునిశితంగా విమర్శించడం మనకు కనిపించే మరొక అంశం. ఎవరూ పట్టించుకోని వ్యథాభరిత జీవితాన్ని, వారి ఆవేదనను అందరికీ అవగాహన కలిగేలా రచించారు. నిత్యం మన కళ్ల ముందు కనిపించే కొందరి జీవితాలను జీవనసమరంలో చిత్రించిన తీరును రేఖామాత్రంగా సృజించడం ఈ వ్యాస ఉద్దేశ్యం.

బ్రతుకుతెరువు కోసం వివిధ వృత్తుల్ని చేపట్టిన అనేక మంది జీవితాల్ని ప్రత్యక్షంగా చూసి, వారు చెప్పిన విష యాల్ని ఓపికగా విని వాటిని జీవనసమరం పేరుతో అక్షర బద్ధం చేయడం రావూరి సామాజిక దృష్టికోణాన్ని మన ముందుంచుతుంది. కొడవళ్లను, గొడ్డళ్లను తయారుచేసి పొట్టపోసుకునే కమ్మర్ల జీవితాన్ని 'రెక్కాడినా డొక్కాడని' శీర్షికలో హృద్యంగా చిత్రించాడు. 'కొలిమి వేడికి నెత్తురంతా ఆవిరయిపోయింది. మలాటాతో సరిచి రెక్కలు ముక్కలు చెక్కలయిపోయాయి. ఇన్నేళ్లొచ్చినా తిన్నదంతా అరుగుతుంది గాని బాబూ, తృప్తిగా తినడానికి నాకేమీ వుండదండి' అంటూ వాళ్ల పనిలో వున్న కష్టాన్ని తెలియజేస్తాడు.

మట్టికుండలు తయారుచేసి ఊరూరా అమ్ముకునే వాళ్ల జీవితాన్ని 'సారె సారెకున్' శీర్షిక ద్వారా వెల్లడిచేస్తాడు. మట్టిపాత్రల్ని అపురూపంగా వాడిన రోజుల్నుంచి అల్యూ మినియం, స్టీలు పాత్రల వాడకంలోకి జీవితాలు చొరబడిన విధానాన్ని చెప్తూనే వాటివల్ల కుమ్మరివృత్తి ఎంతగా బతుకు తెరువుని కోల్పోయిందో వివరించిన తీరు మనల్ని ఆలో చనలో పడేస్తుంది. 'అసలీ మాయ వెండి అదే జర్మన్ సిల్వర్ రావడంతో మా కూట్లో దుమ్ము పడ్డది. పట్నాల్లో మా మట్టి సామాన్లు వాడేవాళ్లే లేరుగా బాబయ్యా' అనడం ఆ వృత్తిచేసే వాళ్లజీవితాల్లోని దైన్యాన్ని తెల్పుతుంది.

దేశానికంతా బట్టల్ని నేసే చేనేతలు తమ జీవితాల్ని మాత్రం చిరుగుల గుడ్డల్లోనే ఎందుకు దాచుకుంటారో 'గొడ్డు చాకిరి గుడ్డక్కరువు' శీర్షికలో తేటతెల్లం చేస్తారు. 'ఇప్పుడంటే

మా పని ఎందుకూ కొరగాకుండా పోయింది గానీ, నిజానికి ఇంతకన్నా మంచి వృత్తి ఏముందో మీరే చెప్పండి. అన్నం తర్వాత సిగ్గు దాచుకోవడానికి వస్త్రం ముఖ్యం కదా!' అనడం చేనేత వృత్తి ఆవశ్యకతను తెలియజేస్తుంది. బట్టలు తయారు చేయడమే ఒక పెద్ద పనైతే వాటిని అమ్ముకోవడానికి వాళ్లెంత ఇబ్బందులు పడతారో కూడా ఇందులో చెప్పిన తీరు గుండెల్ని తాకుతుంది.

వడ్రంగం జీవితాన్ని కలంలో నింపి కాగితాల్లో ఒంపిన శీర్షిక 'కుడి ఎడమల దగా దగా'. నాగళ్ళు, గొర్రు, గుంటక, దంటె, జడ్డిగం, ఏడికర్ర, చీలునాగలు మొదలైన వ్యవసాయ పనిముట్లు తయారుచేసి జీవనం సాగించే బ్రహ్మానందం జీవితాన్ని కళ్లముందు చిత్రించి వాళ్ల బతుకుల్లోని వెతల్ని గుర్తుచేస్తాడు.

చేపలు పట్టి జీవించే బెస్తవాళ్ల జీవితంలోని చీకటికోణాల్ని కూడా జీవనసమరంలో చిత్రించాడు. చేపలు పడుతున్నప్పుడు కొన్ని చేపలు గీరతాయి, రక్కుతాయి, కొరుకుతాయి. అలాగని చేపల్ని పట్టడం మానేస్తే వాళ్ల జీవితాలు ఇంకెంత దుర్భరంగా వుంటాయో తెలియజేస్తాడు. వాటినుండి తప్పించుకున్నా వరదలు, తుఫానులు, సునామీలు వచ్చినప్పుడు వేటకు వెళ్లడం ఎంత ప్రమాదకరమో గంగయ్య పాత్ర ద్వారా తెలియజేస్తాడు.

'వెదురుతో వేయిరకాలు' శీర్షికలో వెదురుతో చేటలు, గంపలు, జల్లలు, తడికలు, తయారుచేసి జీవితాన్ని గడుపుకునే మేదరవృత్తి జీవితాన్ని చిత్రించాడు. ఇప్పుడు ప్రపంచమంతా ప్లాస్టిక్ వెంటే పరుగులు తీస్తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో తమ మేదరవృత్తి ఎలా ఛిద్రమయిందో తిరుపతయ్య పాత్ర ద్వారా వ్యక్తపరుస్తాడు. 'ప్లాస్టిక్కులొచ్చాక ఇప్పుడన్నిటికీ అవే గదండీ! ప్లాస్టిక్ బుట్టలు, గంపలు, జల్లెడలు, చేటలు వచ్చాయి. అదేవిధంగా ఒకప్పుడు ఇంటి చూరుకు ఎండ పడకుండా తడికలను వేళ్లాడదీసేవారు. ఇప్పుడంతా ఇటుక గోడలు కడుతున్నారు. ఇట్లా ఈ పనీ మా చేతుల్లో నుంచి పోయినట్టే గదా!' అంటూ వెదురు జీవితాల్లోని వెతల్ని మన కళ్లముందుంచుతాడు.

మన సమాజం అంతరిక్షం స్థాయికి ఎదిగినా, కొన్ని మూఢనమ్మకాల విషయంలో మాత్రం ఇంకా వెనుకబడే వుండడం దురదృష్టకరం. మనిషి భవిష్యత్తు తెలుసుకోవడానికి జ్యోతిషశాస్త్రం, నాడీశాస్త్రం, సంఖ్యాశాస్త్రం, ప్రశ్నాశాస్త్రం, గవ్వలాట మొదలైన ఎన్నో పద్ధతుల్ని అనుసరిస్తాడు. అటువంటివాటిలో 'సోది' కూడా ఒకటి. ఈ విషయాన్ని 'ఎరుకోయమ్మ ఎరుక నరసమ్మ' శీర్షికలో వివరిస్తారు రచయిత. ఊరూరూ తిరిగి సోది చెప్తే వాళ్లకు సోలెడో, గిద్దెడో గింజలు చేటలో పోస్తారు. అదే వాళ్ల సంపాదన. సోది నేర్చుకుంటే వచ్చే విద్యకాదని, దానికి కొంత సంస్కారం కావాలనే విషయం నరసమ్మ ద్వారా తెలుస్తుంది. అడ్డమైన తిండీ తినేవాళ్లూ, తాగేవారికీ, సోది చెప్పడం అనే విద్య అలవడదు. తరతరాలుగా ఒకరి నుండి ఒకరికి సంక్రమించే ఈ సోది చెప్పే విద్య కులవృత్తిగా పరిణమించింది. ఒకవేళ సోది చెప్పకూడదనుకున్నాక సోదిబుట్ట, కర్ర, పీట పాలలో కడిగి తర్వాత వారసులకు ఇవ్వడం ఒక సంప్రదాయంగా స్థిరపడింది. తిండి గింజలకు సరిపోక పోయినా కులవృత్తిని వదులుకోవడం ఇష్టం లేక దానిని కొనసాగిస్తున్నానని చెప్తుంది నరసమ్మ.

మనం రోడ్డుమీద వెళ్తున్నప్పుడు, గెడకర్ర పట్టుకుని దాని సాయంతో ఆకాశంలో సర్కస్ చేసే వాళ్లు మనకు కనిపిస్తారు. రెండు వాసాలకు కట్టిన తాడుమీద గెడకర్రతో బ్యాలెన్స్ చేసుకుంటూ ఆ చివరి నుండి ఈ చివరకు నడుస్తూ మనం వేసే డబ్బులతో జీవితాన్ని గడుపుతుంటారు. వారి జీవితాన్ని రావూరి భరద్వాజ 'గడయెక్కినా గడప గడపెక్కినా' శీర్షికలో అక్షరబద్ధం చేస్తారు. ఇందులోని దాసప్ప గుమ్మడికాయంత జుట్టుముడి, మొలకు బిల్లమొలతాడు, మెళ్లో పూసల పేర్లు, పెద్దపెద్ద మీసాలు, పెద్ద శరీరంతో భయంకరంగా కనిపించినా అతడు అన్ని ఫీట్లను సునాయాసంగా, సులువుగా చేస్తాడు. పధ్నాలుగు కత్తుల్ని పైకి ఎగరేసినా చేతికి గాటుకూడా తగలకుండా చాకచక్యంగా నైపుణ్యంగా పట్టుకోగలడు. తండ్రినుండి వారసత్వంగా ఆ విద్యను అందిపుచ్చుకున్నది రాములమ్మ. గెడపైన అటూఇటూ తిరు

గుతూ ఎన్నో విన్యాసాలు చేసేది రాములమ్మ. కానీ కాలం మారింది. పండగలప్పుడు తప్ప ఇటువంటి విన్యాసాలు ఏర్పాటుచేయడం గగనంలా మారిపోయింది. ఈ వృత్తిని నమ్ముకున్న వాళ్లకు చప్పట్లు వస్తాయి కానీ కడుపునిండడానికి సరిపోయే కాసులు రావడం గగనమే. ఆ విషయాన్ని చాలా హృద్యంగా చిత్రిస్తారు రావూరి.

బస్టాండులోనో, రైల్వేస్టేషనులోనో పూసలమ్ముతూ కనిపించే వారి జీవితాల్ని చిత్రించిన శీర్షిక 'కేశోపనిషత్తు'. ఇందులోని రాముడు వంశపారంపర్యంగా వచ్చిన వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తుంటాడు. అద్దాలు, సవరాలు, కాటుక, రకరకాల కుంకుమ, పసుపు, పట్టుదారాలు, కర్పూర దండలు మొదలైన వాటిని అమ్ముకుంటూ ఇల్లిల్లూ, ఊరూరూ తిరుగుతుంటాడు రాముడు. వెంట్రుకలలోని చిక్కుల్ని తీసి వాటిని సవరాలుగా మార్చి అమ్ముకున్న రాముడు జీవితం లోని చిక్కుముళ్లను విప్పుకోలేడు. సూదులు, పిన్నీసులు అమ్ముతూ వచ్చే చాలీచాలని డబ్బులతో బతుకులు గడిపే వారి జీవితాలు ఎంత దుర్భరంగా వుంటాయో ఇందులో చిత్రిస్తారు రావూరి.

ఎండాకాలంలోనో, వానాకాలంలోనో గొడుగులు వాడడం పరిపాటి. అవసరానికి వస్తువును వాడుకుంటామే గానీ వాటిని తయారుచేసేవాళ్ల జీవితంలోకి తొంగిచూడాలనే ఆలోచన కూడా మనకు రాదు. ఈ విషయాన్ని 'ఛత్రపాణి' శీర్షికలో వివరిస్తాడు రావూరి. వంశపారంపర్యంగా రాక పోయినా ఆకలి బాధకు తట్టుకోలేక అవసరానికి గొడుగులు బాగుచేయడం నేర్చుకుంటాడు శంకరయ్య. అందుకే 'ఇందులో పెద్దగా నేర్చుకోవలసింది కూడా ఏమీ లేదండీ... కాస్త బుర్రను ఉపయో గిస్తే అదెక్కడ చెడిపోయిందో, దాన్నెలా బాగుచేస్తే సరిపోతుందో తెలిసిపోతుంది. మొదట మొదట నాకూ తెలియలేదు, క్రమంగా అన్నీ నేర్చుకున్నాను' అంటూ జీవనతత్వాన్ని తెలియజేస్తాడు శంకరయ్య. అందరికీ గొడుగులు తయారు చేసిచ్చిన శంకరయ్య ఎండొచ్చినా, వానొచ్చినా ఏ చెట్టుకిందనో తలదాచుకోవడం అతని జీవితం లోని చీకటి కోణాల్ని చాలా ఆర్ద్రంగా చూపిస్తుంది.

నిత్యజీవితంలో తాళానికున్న ప్రాధాన్యత మరవలేనిది. ఇంట్లో ఏమీ లేకపోయినా ఇంటికి తాళం వేయడం మాత్రం మరిచిపోము. కానీ చెట్టుకిందో ఇంకెక్కడో తాళాల గుత్తులు తగిలించుకుని వాటిని బాగుచేస్తూ కనిపించే వ్యక్తులు మాత్రం మనకు నిత్యజీవితంలో తారసపడుతుంటారు. ఈ విషయాలనే 'తప్పెట్లోయ్... తాళాలోయ్' శీర్షికలో జహంగీర్ పాత్ర ద్వారా చెప్తారు రచయిత. ఎంత వెలపెట్టి కొన్న తాళమైనా చిన్న మరమ్మత్తు వస్తే వాటిని అవలీలగా బాగుస్తుంటారు తాళాల వాళ్లు. తాళాలు పెద్దపెద్ద కంపెనీ వాళ్లు తయారుచేసినా బాగుచేయడం మాత్రం వీళ్లచేతుల్లోనే వుంది. ఎటువంటి తాళాన్నైనా అవలీలగా బాగుచేసే వీళ్ల జీవితాలు మాత్రం దయనీయంగా వుంటాయి. ఆ విష యాన్ని వివరంగా చెప్పి వాళ్ల జీవితంలోని ఎత్తుపల్లాలను చూడమంటాడు రావూరి.

రచయిత సామాజిక స్పృహ అనంతమైనది. అందరికీ సామాన్యంగా కనిపించే విషయాలు రచయితలకు అసా మాన్యంగా కనిపిస్తాయి. ఎక్కడినుంచో రాళ్లను తీసుకొచ్చి శ్రద్ధతో విగ్రహాలను తయారుచేసే కుటుంబాలు మనకు రోడ్డుపక్కన కనిపిస్తూనే వుంటాయి. దేవతల విగ్రహాలను, అందమైన స్త్రీల విగ్రహాలను చక్కగా ఉలితో చెక్కుతూ అద్భుతమైన శిల్పులు మనకు దర్శనమిస్తారు. జీవన సమరంలో వీరి ప్రస్తావనను కూడా రావూరి మనకు వివరి స్తారు. ఆగమయ్యకు వారసత్వంగా రాకపోయినా రాతిలోనే సజీవశిల్పాల్ని సృష్టించడం ఆగమయ్యకు భగవంతుడిచ్చిన వరం. అమ్మవారి విగ్రహాలే కాకుండా రాతిమంచాలు చేయ డంలో దిట్ట. రాతి రోళ్లు కొట్టి వాటిని కావలసినట్లుగా మలచడానికి ఎంతో శ్రమపడుతుంటాడు. ఇవేవీ అతని కడుపునిండడానికి సహాయం చేయవు. పొద్దస్తమానం విపరీతమైన చాకిరీ చేసినా అతని బతుకులో వెలుగులు ప్రసరించవు. ఈ విషయాన్ని కూడా జీవనసమరంలో అక్షరబద్ధం చేశాడు రావూరి.

ఊరూరా తిరుగుతూ వీరగాథలను ప్రచారం చేయడం వృత్తిగా కలిగిన వారి జీవితాలను 'ఆర్చేదెవరు? తీర్చేదెవరు?'

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

అనే శీర్షికలో వివరిస్తారు రావూరి. రామకృష్ణుడు, బల రాముడు అనే వారిద్దరూ తాము వంశపారం పర్యంగా నేర్చుకున్న వీరగాథలను ప్రచారం చేస్తుంటారు. ఒకప్పుడు బాగా ప్రచారంలో వున్న ఈ వృత్తి ఇప్పుడు ఆదరణ తగ్గిపోయి కనీసం పూటగడపడానికి కూడా పనికిరాని వృత్తిగా మిగిలిపోయింది. వారి జీవితాల్ని సజీవమైన చిత్రణతో ఈ శీర్షికలో పొందుపర్చి వారి గురించి కూడా ఆలోచించ మంటాడు రావూరి.

రావూరి భరధ్వాజ జీవితం పేదరికంతో గడిచింది. బతుకు తెరువు కోసం అనేక ఉద్యోగాలు చేశాడు. అయినా పొట్ట నిండని పస్తులున్న జీవితాన్ని అనుభవించాడు. సమాజం ధనవంతులు, దరిద్రులు అనే కొలమానాలతో నిండిపోయింది. కూలికి వెళ్తూ ఏ పూట తిండి ఆ పూట సంపాదించుకునే వారు ఎన్ని బాధలు పడతారో స్వయంగా చూసిన వ్యక్తి రావూరి. ఆ అనుభవాలనే జీవనసమరంలో పొందుపర్చాడు. కడుపుమంటతో, ఆకలికేకలతో నిత్యం జీవితంతో పోరాడే శ్రామికుల జీవితాన్ని చిత్రించాడు. శ్రామికులను పీడిస్తూ ధనార్జనే ధ్యేయంగా మనుగడ సాగిస్తున్న బూర్జువా, భూస్వామ్య వ్యవస్థ తన రచనల్లో చిత్రించి పేదల పట్ల తన పక్షపాతాన్ని చూపించాడు. ఈ జీవనసమరం గ్రంథానికి 'వ్యథార్థ జీవుల యథార్థ గాథలు' అనే ఉపశీర్షిక పెట్టి దానికి తన మిత్రుడైన కోట పున్నయ్యకు అంకిత మిచ్చాడు. యథార్థ సంఘటనలకు వాస్తవ రూపమిచ్చి సృజనాత్మకంగా వెలువరించిన ఈ పుస్తకం రావూరి లోక్షనానికి, బడుగు బలహీన జీవితాల పట్ల ఆయన కున్న నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది. అందుకే రావూరి గురించి ప్రఖ్యాత రచయిత క్వాజీ అహమ్మద్ "భరధ్వాజ రచనల్లో సహజత్వం, లోతువైవిధ్యం వెల్లివిరియడానికి, ఆయన పాత్రలు జీవచైతన్యంతో స్పందించడానికి విస్తృతమైన ఆయన జీవితానుభవాలే ముఖ్య కారణాలు' అని చెప్పారు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# రావూరి కాదంబరి – సామాజిక కోణం

- డా. కె. సుజాత
ఆంధ్రోపన్యాసకురాలు
ప్రభుత్వ మహిళా కళాశాల(స్వయంప్రతిపత్తి), గుంటూరు.

ఆట్టడుగు స్థాయి నుండి జ్ఞానపీఠ్ వరకు ఎదిగిన రావూరి భరద్వాజ స్కూలుకెళ్ళి చదివింది ఏడో తరగతి వరకే అయినా లోకమనే పాఠశాలకి మాత్రం ఆయన నిరంతర విద్యార్థి. లోకం నేర్పిన పాఠాలు, అనుభవాలు, తను చూసిన, చదివిన వ్యక్తులు, విషయసేకరణ పట్ల శ్రద్ధ, నిశిత పరిశీలనా దృష్టి, ఏ విషయాన్నైనా లోతుగా అర్థం చేసుకునే తత్వం, వీటన్నిటి కన్నా ముఖ్యంగా రాయాలనే తపన రావూరిని మంచి రచయితను చేసాయి. వీరి నవలల్లో కాదంబరి ఒకటి. తన చుట్టూ ఉన్న ప్రపంచంలో ఏం జరుగుతుందో, తమను పాలించే నాయకుల చేతుల్లో, దళారీల చేతుల్లో, జాతి సంపద ఏ విధంగా దోచుకోబడుతోందో సామాన్యులకు అర్థమయ్యేలా తెలియ చెప్పిన నవల. సామాన్యుడి జీవితం ఎందుకు పాము–నిచ్చెన ఆటలాగా మారిపోయిందో, రాజకీయపు ఎత్తుగడల్లో ఏ విధంగా బీదాబిక్కీ అణచివేయబడుతుందో, బడాబాబుల ధనదాహానికి పేదవాళ్ళు ఏవిధంగా బలిపశువులవుతారో తెలియచేసిన నవల కాదంబరి.

సమాజంలోని రకరకాలైన మనుషులు వారిలోని వ్యాపార దృక్పథాలు, భిన్న, భిన్న మనస్తత్వాలు మొదలైన వాటిని ఎన్నో కోణాలలో ఆవిష్కరించిన నవల కాదంబరి. 1989లో మొదటి ముద్రణ పొందిన ఈ నవల ఆనాటికీ, ఈనాటికీ సమాజంలో ఏమీ మార్పు రాలేదనే సత్యాన్ని తెలియచేస్తుంది.

రైతుల దగ్గర చవకగా పంటను కొని అధిక ధరలకు అమ్ముకునే దళారీ వ్యవస్థ దగ్గరనుండి, ప్రాజెక్టులు, పరిశ్రమల పేరుతో ప్రభుత్వాలు చేసే జిమ్మిక్కులు. రాజకీయపు ఎత్తుగడలు, చదువు సంధ్యలు లేని అమాయకులైన కూలీల విషయంలో దళారీలు చేసే మోసాలు, అరాచకాలు, ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో నాణ్యతలేని నాసి రకం పనులవల్ల, నిర్లక్ష్యం వల్ల రాళ్ళ కింద, మట్టికింద కప్పడిపోయిన మనుషులు, పేద రైతుల దగ్గర తక్కువ రేటుకు భూములు కొని తర్వాత అక్కడ పరిశ్రమలు వస్తాయని భ్రమింపచేసి, ప్రచారం చేసి చవగ్గా కొన్న ఆ భూములను ప్లాట్లు చేసి అధిక రేట్లకు అమ్ముకుని సొమ్ము చేసుకుని ప్రజల నెత్తిమీద భస్మాసుర హస్తాన్ని మోపే రాజకీయ నాయకుల అవినీతి, అక్రమాల వంటి విషయాలెన్నిటినోఈ నవల ద్వారా అద్భుతంగా ఆవిష్కరించారు రావూరి. ఆవిష్కరించడమే కాకుండా ఆయా విషయాల పట్ల చాలా లోతైన విశ్లేషణ సైతం చేసారు రచయిత. ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగే అవినీతి, అవకతవకలను గురించి ప్రస్తావిస్తూ 'ఈ కంపెనీకి ఈ పని గురించి ఏమీ తెలియదు, వీళ్ళు పలుకుబడిని ఉపయోగించి ఎక్కువ ఎస్టిమేషన్స్‌ను పైవాళ్ళ చేత ఒప్పించారు. చచ్చేంత లాభం చూసుకుని వేరే కంపెనీకి సబ్ కాంట్రాక్టు ఇచ్చారు. ఈ రెండో కంపెనీ సంగతి గురించి అధికార రీత్యా మాకు తెలియదు. కానీ వీళ్ళయినా పైనుండి కిందకు అందరినీ తడుపుతూ రావాల్సిందే. ఎవళ్ళ పర్సంటేజి వాళ్ళకి ముట్టచెప్పవలసిందే. ఇంతమందికి ఇన్ని సర్దుబాట్లు చేసి అంచనాల ప్రకారం, కొటేషన్ల ప్రకారం పనులు జరిపించాలంటే పెళ్ళాం, బిడ్డల్ని అమ్మి ఎదురుపెట్టినా సరిపోదు. అందుకే వీళ్ళు అస్తుబిస్తుగా పనులు చేస్తుంటారు. అలా చేస్తున్నారని తెలిసి కూడా ఎవ్వరం ఏమీ అనం. అనే నైతిక హక్కు మాకు మాత్రం ఎక్కడ ఏడ్చింది జగన్నాధం గారూ, పైవాళ్ళు వచ్చినప్పుడల్లా అవసర సరఫరాలన్నీ వీళ్ళు చూడవలసిందే. ఒక్కోసారి పార్టీ ఫండ్ వసూలు చేయమంటారు. ఇంకోసారి 'సావనీర్‌లకు అడ్వర్‌టైజ్‌మెంట్స్ వసూలు చేయమంటారు.

భారీఎత్తున ఏమన్నా మహాసభలు జరిగాయనుకోండి పైనుండి మాకు కోటాలు నిర్ణయించి పంపుతారు. ఆ

కోటాలను మేము వీళ్ళ దగ్గరనుండే పూర్తి చేయాలి. ఇన్ని చేస్తూ కూడా వీళ్ళు లాభాలు సంపాదించాలంటే – ఒకటికి ఆరు చొప్పున ఇసుక పోయడానికి బదులు పదమూడు చొప్పునో ఇరవైఆరు చొప్పునో పోస్తారు. ఈ పని కోసం కేటాయించిన ఇనుము ఉక్కు, సిమెంటు ఎక్కువ రేట్లకు ఇంకెక్కడో అమ్ముకుంటారు. ఈ మిక్చరు ఇన్ని నిమిషాల పాటు మెషీన్లో తిప్పాలని రూల్ ఉన్నదనుకోండి అందులో సగం కాలంపాటు తిప్పిన వాడు మహా నిజాయితీపరుడు కింద లెక్క. ఒక్కడు అసలు ఏ తిప్పుడూ లేకుండానే మిక్చరును బొచ్చల్లోకి ఎత్తి పంపిస్తాడు. ఈ పంపిణీ మీద తయారవుతున్న మన ప్రాజెక్టులు నిర్మాణం పూర్తి కాకముందే కూలిపోతున్నాయంటే ఆశ్చర్యపడవలసిందేమీ లేదు' అని జగన్నాధంతో తన ఆవేదన వ్యక్త పరుస్తాడు శంకరం. ఒకవేళ ఎవరైనా పరమ నిజాయితీగా ఉన్నట్లయితే వాళ్ళను ట్రాన్స్ ఫర్ చేయడమో లేదా ఏ జీపు ప్రమాదంలోనో తలపగలకొట్టి చంపడమో జరుగుతుంది తప్ప దేశానికి జరిగే నష్టం గురించి ఎవడికి పట్టింది అంటూ తన గోడు వెళ్ళబోసుకుంటాడు మయూరాక్షి ప్రాజెక్టులో ఇంజనీర్ గా పనిచేసే శంకరం. ఈ నవలలో నాలుగు ప్రధాన పాత్రలున్నాయి. 1.రామకృష్ణయ్య, 2.శంకరం, 3.కౌముది 4.జగన్నాధం.

రామకృష్ణయ్య అట్టడుగు స్థాయినుండి ఆకాశపుటంచుల దాకా ఎదిగినవాడు. వ్యవహార దక్షత ఉన్నవాడు. లౌక్యం తెలిసినవాడు. పసితనంనుండీ అనాధలా తిరుగుతూ పస్తులతో వెళ్ళబుచ్చిన కాలం, క్రమంగా అతనెదిగిన విధానం, మయూరాక్షి ప్రాజెక్టు విషయంలో వ్యవహరించిన తీరు, అపోజిషన్ పార్టీలోని నాగరాజు, కోటిలింగాలను తను అనుకున్నవిధంగా తెలివిగా అధికార పార్టీలోకి మళ్ళించడం, ఇవన్నీ అతని సమర్ధతకు నిదర్శనాలు. రామకృష్ణయ్య వ్యాపారంలో రాటుదేలినవాడే కానీ, రాజకీయ రంగంలోని జిత్తులు అవగాహన చేసుకోవడంలో మాత్రం తలక్రిందులయ్యాడు. వ్యాపారరంగంలో ఎవరి అంచనాలకు అందకుండా ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ ఎదిగిన రామకృష్ణయ్య రాజకీయ రంగంలోని ఎత్తుగడలను అంచనా వేయడంలో కొంత వైఫల్యం చెందాడు. దాంతో అతని అహం దెబ్బతింది. మయూరాక్షి ప్రాజెక్టు రావడంలో కీలక పాత్ర వహించిన రామకృష్ణయ్య ఈ నేపధ్యంలో లాభాలను పొందడంలో పూర్తిగా విఫలమయ్యాడు. కష్టం రామకృష్ణయ్యది, లాభం మంత్రి నారాయణస్వామి మరియు అతని బంధువర్గానిది అయింది.అతని అంచనాలకు అందని విధంగా జరిగిన పరిణామాలు రామకృష్ణయ్య ను మానసికంగా దెబ్బతీశాయి. ఆ తర్వాత మరల స్థైర్యాన్ని పొంది మరో మార్గం ద్వారా లాభం వచ్చే అవకాశం సృష్టించుకుని సరస్వతీ కన్‌స్ట్రక్షన్స్ కార్పొరేషన్ పేరు మీద ప్రాజెక్టు నిర్మాణ కాంట్రాక్టులను చేజిక్కించుకున్నాడు. అయితే మయూరాక్షి ప్రాజెక్టు రావడంలో ప్రధానపాత్ర పోషించిన రామకృష్ణయ్య ఆ ప్రాజెక్టు నాసిరకంగా నిర్మాణం కావడానికి కూడా తనే కారకుడయ్యాడు.

వ్యాపారరంగంలో చేసినన్ని ప్రయోగాలు పిల్లల పెంపకం మీద కూడా చేశాడు రామకృష్ణయ్య. పిల్లల పెంపకం విషయంలోనూ పూర్తిగా కాకపోయినా కొంతవరకూ వైఫల్యం చెందాడనే చెప్పాలి. తను పడిన కష్టం తన సంతానం పడకూడదనే ఆలోచన మంచిదే కానీ తల్లిదండ్రుల ప్రేమ పిల్లల్ని మానసికంగా అవిటివాళ్ళుగా మార్చకూడదనే విషయాన్ని రామకృష్ణయ్య విస్మరించాడు.

మంచి–చెడులతో సంబంధం లేకుండా పిల్లలు ఏది అడిగితే అది తెచ్చిఇచ్చే రామకృష్ణయ్య మనస్తత్వమే కౌముది తండ్రికి చెప్పకుండా శంకరంతో వెళ్ళిపోయేలా చేసింది. పిల్లలు అడిగింది లేదనడం–కాదనడం కూడా అతనికి అలవాటయి ఉంటే కౌముది విషయంలో కన్నీళ్ళు పెట్టుకునే పరిస్థితి తప్పి ఉండేది. ఏది ఏమైనా ఒక విలక్షణమైన వ్యక్తిత్వం కలిగిన పాత్రగా రామకృష్ణయ్యను చెప్పుకోవచ్చు. వ్యాపారంలో ఎదిగే క్రమంలో కొన్ని అవినీతి పనులు చేసినా మానవత్వాన్ని మాత్రం కోల్పోలేదు. తాను ఏ స్థాయినుండి వచ్చాడో ఆ స్థితిని ఎన్నడూ మరచిపోని వ్యక్తి. ఎంత ఎదిగినా డౌన్ టు ఎర్త్ అనే సూత్రం తెలిసిన వాడు.

ఈ నవలలో విశిష్టమైన వ్యక్తిత్వం కలిగిన పాత్ర శంకరం. శంకరం లాంటి వ్యక్తులు లోకంలో అరుదుగా ఉంటారు. లేదా అసలు ఉండకపోవచ్చు. అతను ఇంజనీరింగ్ చదివే రోజుల్లో కాటనుదొరను గురించిన ఒక పుస్త

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

కాన్ని చదివేటప్పుడు మయూరాక్షి నదిని గురించి తెలుసు కుంటాడు. కాటన్‌దొర ఆ ప్రాంతంలో తిరిగినప్పుడు అక్కడి ప్రజల జీవితాన్ని చూసి చలించిపోయి, వారి దరిద్రం తీరా లంటే మయూరాక్షి నది నీటిని పొలాలకు పారించడం కన్నా మరో మార్గం లేదని స్పష్టం చేస్తూ ఆనకట్ట నిర్మించాల్సిన స్థలం, కాలువలు వెళ్ళాల్సిన మార్గాలను ఆయన సూచిం చాడు. మయూరాక్షి నది తీరవాసుల దుర్భర జీవితాలను గూర్చి కాటన్‌దొర రాసిన విషయాలు శంకరాన్ని కదిలించి వేశాయి. శంకరం కొంతకాలం సెలవు పెట్టి ఆ ప్రదేశమంతా తిరిగి అక్కడి పరిస్థితులను అవగాహన చేసుకున్నాడు. మానవత్వం ఉన్న మనిషి కనుక అక్కడి ప్రజల దైన్యావస్థను, హీన బ్రతుకుల్ని తెలుసుకుని జాలిపడి, తాను అనుకున్న విధంగా మయూరాక్షి ప్రాజెక్టుకు ఒక రూపం తెప్పించాలని అనుకున్నాడు. అందుకు రామకృష్ణయ్య లాంటి పలుకుబడి కలిగిన పెద్దమనుషులు పూనుకుంటే తప్ప పని జరగదని గ్రహించి కౌముదిని అడ్డం పెట్టుకుని తాను అనుకున్న పనిని సాధించాడు. పాజెక్టు వచ్చినందుకు చాలా సంతోషిం చాడు. కానీ ప్రాజెక్టు పనులు నాసిరకంగా జరుగుతున్నం దుకు ఏమీ చేయలేని తన నిస్సహాయతను తనే నిందించు కున్నాడు.

శంకరం జగన్నాథంతో కౌముది గురించి చెప్పే ప్రతి మాట అతని వ్యక్తిత్వాన్ని పట్టిస్తుంది. 'కౌముది పట్ల నాకు ప్రేమ గానీ కనీసం వ్యామోహం కానీ లేదు.... నేను కౌము దిని పెళ్ళి చేసుకోవడానికి కారణం ఆవిడ పట్ల నాకున్న జాలి, అనుకంప మాత్రమే. ఈ ముక్క నేను కౌముదితో ఎప్పుడూ అనలేదు. అని ఆవిడని నొప్పించడం నాకిష్టం లేదు.... ప్రాజెక్టుకి ఒక రూపం రావాలంటే పలుకుబడి కలిగి లౌక్యం తెలిసిన వారైనా పూనుకోవాలి. రామ కృష్ణయ్యను గురించి ఎవరో నాకు చెప్పారు. అతను తగిన వాడనుకున్నాను. అతని పరిచయం చేసుకుని ఈ పథకం వివరాలు అతనికి ఇవ్వడం వల్ల ప్రయోజనం ఏమీ ఉం డదు. ఆయనగారు అప్పటికే సవాలక్ష వ్యాపకాలలో మునిగి ఉన్నాడు. అతనికి ఆ బాదరబందీ తప్పాలి. అలా తప్పించగలిగింది కౌముది మాత్రమేనని తోచింది. ఆవిడ మనస్తత్వం–అసలు అలాంటి వాతావరణంలో పెరిగిన వారి మనస్తత్వం చాలా విలక్షణంగా ఉంటుంది. మనం వెంట పడ్డామనుకోండి దూరమయిపోతారు. వాళ్ళు మనకి దగ్గర వ్వాలంటే వాళ్ళని నిర్లక్ష్యంగా చూడడం కన్నా మరో మార్గం లేదు. సరిగ్గా నేనాపనే చేసాను. నా అంచనా నూటికి నూరు పాళ్ళు నిజమని మరోసారి రుజువైంది. నేను తిరస్కరించిన కొద్దీ ఆమె నాకు దగ్గర కావడం ప్రారంభమయింది. నాకు కావాల్సింది కూడా అదే. రామకృష్ణయ్యకి ఎలా చెప్తే నచ్చు తుందో కౌముది బుర్రలో పెట్టిన వాణ్ణి జూడా నేనే.

చివరికి అంతా సవ్యంగానే జరిగిందనుకోండి. అంతా సవ్యంగానే జరిగిందనుకోండి.ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని గురించిన ప్రకటన వెలువడిన తర్వాత – కౌముదితో నాకిక పనేమీ లేదు. ఆవిణ్ణి వదిలేస్తే నన్నడిగేవారు కూడా లేరు. కానీ, నేనాపని చేయలేదు – చెయ్యలేకపోయాను. ఈ బలహీనతకు కారణం ఆవిడ ఆమాయకత్వం పట్ల నాకున్న జాలి, ఆవిడనుకోవడం తాను చాలా తెలివయినదాన్నని. ఆవిడని నొప్పించడం నాకిష్టంలేదు. అందుకని ఆ అభి ప్రాయాన్ని నేను బలపరచాను. నా దృష్టిలో కౌముది శుద్ధ వెర్రిబాగుల్ది. తెలివిగా, సుఖంగా బతకడం ఆవిడకు చేత కాదు. చాతనయిందయితే తనకెవరితో ఎలాంటి సంబంధా లున్నాయో, అవన్నీ ఎలా ఏర్పడ్డాయో తనకు కాబోయే మొగుడితో చెబుతుందా?ఇలాంటి అమాయకురాలు ఇంకెవరి చేతుల్లోనయినా పడితే సర్వనాశనమయిపోతుం దన్న భయం నాకేర్పడింది. ఒక్క సంగతి జగన్నాథం గారూ నేను తప్ప ఇంకెవరు పెళ్ళాడినా కౌముది జీవితం నరక ప్రాయంగా తయారయి ఉండేది. నైతిక విలువల పట్ల నాకున్న అభిప్రాయాలు వేరు కనుక ఇవేవీ నేను లెక్కలోకి తీసుకోలేదు. తప్పో ఒప్పో కుండబద్దలు కొట్టినట్లు తను చేసిందేమిటో చెప్పగల ధైర్యం నిజాయితీ కౌముదిలో ఉన్నాయి. మిగిలిన ఆడవారిలో ఇవి మృగ్యం. లోగడ తామేం చేసినా ఇప్పటికీ చాటుమాటుగా తామేం చేస్తున్నా పైకి మాత్రం పతివ్రతలుగా నటిస్తారు. కనీసం అల్లాగ కనిపిం చేందుకన్నా ప్రయత్నిస్తారు. కౌముది ఛస్తే ఆ పని చేయదు. ఇవిగో ఈ గుణాలే నన్నామెకు కట్టిపడేశాయి. ఈ బంధం ఎంతదాకా బిగుసుకు పోయిందంటే ఆవిడని సంతోష

పెట్టడం కన్నా నాకు జీవితంలో మరోలక్ష్యం లేకుండా పోయింది. ఏం చేస్తే ఆవిడ సుఖంగా ఉంటుందో అవన్నీ చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను. అందువల్ల మానసికంగా నేను ఒక్కోసారి చాలా క్షోభపడవలసి వస్తున్నది. అదెక్కడా బయట పడకుండా నేను తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ తీసుకుంటున్నాను.' అని తన అంతరంగాన్ని జగన్నాధం దగ్గర బైటపెట్టాడు శంకరం. ఇలాంటి విశిష్టమైన వ్యక్తిత్వం కలవాడు కనుకనే జగన్నాధం శంకరాన్ని గురించి 'దేవుడిలాంటి వ్యక్తి' అని కితాబిస్తాడు.

జీవితంలో ఏమి చెయ్యాలో తెలియని వాళ్ళు, చేయడానికి ఏమీ లేనివాళ్ళు నిజంగా దురదృష్టవంతులు. ఇలాంటి వాళ్ళు లేని సమస్యలను లేని దుఖాన్ని కొని తెచ్చుకుంటారు. కౌముది ఈ కోవకు చెందిన అమ్మాయి. కష్టపడి ఏదైనా సాధించడంలో లేదా సంపాదించడంలో ఉన్న ఆనందం, తృప్తి అనుభవంలోకి లేని, రాని వషయం. కారణం తండ్రి, తండ్రి సంపాదించిన డబ్బు, కొండ మీద కోతిని అడిగితే కొండను కూడా తెచ్చి ఇచ్చే తండ్రి. తాను కోరుకున్నదేదైనా ఏ కష్టం లేకుండా సులభంగా లభించడంతో కౌముదికి జీవితం చప్పగా ఏ రుచీ లేకుండా పోయింది.

దాంతో జీవితంలో రుచిని వెతుక్కుంటూ తనకి తోచిన దారిలో పయనించింది. జీవితంలో తండ్రి ద్వారా తీపిని మాత్రమే రుచి చూసిన కౌముదీ కారం, చేదు, వగరు లాంటి మిగతా రుచులు కూడా అనుభవంలోకి తెచ్చుకోవాలనే తహతహకు లోనైంది. ఈ కారణంగానే తన చుట్టూ సమస్యలను తానే సృష్టించుకునే ప్రయత్నం చేస్తుంది. నిజానికి ఏ సమస్యా లేకపోవడమే కౌముదికి ఉన్న పెద్ద సమస్య.

కౌముది జగన్నాధంల మధ్య జరిగే సంభాషణలు కొన్ని చోట్ల అర్ధ రహితంగా అనిపిస్తాయి. ముఖ్యంగా కౌముది మాటల్లో కౌముది తానేదో గడుసుగా మాట్లాడుతున్నానని అనుకుంటుంది, కానీ ఆ మాటల్లో అపరిపక్వత ఎక్కువగా గోచరిస్తుంది. కౌముది తాను చాలా తెలివైనదానినని, ఎదుటి వారి మనసులను పుస్తకం చదివినట్లు చదివేయ గలనని అనుకోవడం కూడా ఆమె అమాయకత్వాన్ని సూచిస్తుంది.

ఎంతో లోకానుభవం ఉన్న రామకృష్ణయ్య కూడా కౌముదిని అంచనా వేయడంలో పొరపాటే చేశాడు. జగన్నాధంతో శంకరంని గురించి కంప్లైంట్ గా చెప్తూ అతనిలో అసూయ, కోపం, చిరాకు, ఈర్ష్య, ద్వేషం, విసుగు, అనుమానం ఇలాంటి లక్షణాలన్నీ ఉండాలి, అప్పుడప్పుడూ అయినా తిట్టాలి, ఆ తిట్లు పడలేక నేను ఎదురు తిరగాలి, అలా ఎదురు తిరిగినందుకు ఆయన చేయి చేసుకోవాలి, అలా చేయి చేసుకున్నందుకు నేను ఏడవాలి, అని అనడం కూడా ఆమె మానసిక స్థితిని తెలియ చేస్తాయి. ఆ సమయంలో జగన్నాధం ఆమెని గురించిన సత్యాన్ని ఆమె ముందు ఆవిష్కరింపచేస్తాడు. తన వ్యక్తిత్వంలోని లోపాలను గుర్తించినప్పుడు కౌముది పసిదానిలాగా వెక్కి, వెక్కి ఏడుస్తుంది. జీవితంలో ఏదీ అతిగా ఉండకూడదు, ఏదీ రొటీన్ కాకూడదు, ఇవి రెండూ సహజంగా ఉండవలసిన రుచిని, ఆసక్తిని చంపేసి బ్రతుకును దుస్సహం చేస్తాయి అన్న జగన్నాధం మాటలు కౌముదికి వర్తిస్తాయి.

దండలో దారంలా ఈ నవలలో మొదలు నుండి చివరి వరకూ ఉన్న పాత్ర జగన్నాధం. సంపాదించుకోవడం, దాచుకోవడం లాంటి రకరకాల తాపత్రయాలు, మోసాలు, కుట్రలు, కుతంత్రాలు మొదలైన వాటన్నిటికీ అతీతమైన మంచి వ్యక్తి. కొత్త విషయాలేవైనా తెలుసుకోవాలనుకునే జిజ్ఞాస ఉన్న వ్యక్తి. మంచి చెడు విచక్షణ జ్ఞానం ఉన్న వ్యక్తి. అట్టి వివేకం ఉన్న వ్యక్తి కనుకనే కౌముదికి ఆవిడంటే ఏమిటో తెలియ చెప్పి, ఆవిడ స్వభావాన్ని , ఆవిడ స్వరూపాన్ని ఆమె ముందు సాక్షాత్కరింపచేశాడు.

జిహ్వకోరుచి, పుర్రెకో బుద్ధి అన్నట్లుగా ఈ నవలలోని ఒక్కొక్క పాత్ర ఒక్కో విలక్షణమైన వ్యక్తిత్వాన్ని కలిగి ఉంటుంది. కథను ఆధారంగా చేసుకుంటనే రిజర్వాయర్లు, ఆనకట్టలు, ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన అనేక అంశాలతోపాటు రకరకాలైన వ్యాపార రంగాలకు సంబంధించిన అనేక విషయాలు పాఠకులకు ఏ మాత్రం విసుగు కలిగించకుండా స్పష్టంగా అర్ధమయ్యే రీతిలో వర్ణించడం ఈ నవల యొక్క ప్రత్యేకత.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# వ్యర్థ జీవుల యథార్థ గాథలు – జీవన సమరం

- సుంకర గోపాలయ్య
ఆంధ్రోపన్యాసకులు,
పి.ఆర్.డిగ్రీ కళాశాల, కాకినాడ, తూ॥గో॥ జిల్లా.

ఒక విషయాన్ని ఎన్నుకోవడంలోనూ, ఎన్నుకొన్న విషయాన్ని రసగుళికగా రూపొందించడం లోనూ భరద్వాజ అవలంభించే విధానం విశిష్టమైనది. 'అతి' అనిపించకుండా రాయాలి. చదవడం పూర్తయ్యాక ఓ గాఢమైన నిట్టూర్పు వెలువడాలి. "కన్నీటి బిందువు" పఠిత కన్నుల్లో కదలాలి. అమానుషమైన వ్యవస్థ మీద జుగుప్స కలగాలి. దీన్ని మార్చాలన్న ఆలోచన మెదడులో మెరవాలి. ఇందులో ఏ ఒక్కొటి లోపించినా ఆ రచన వ్యర్థమైనట్లే

- చెరుకూరి రామోజీరావు

తెలుగు సాహితీ లోకానికి 3వ జ్ఞానపీఠం అందించిన రచయిత రావూరి భరద్వాజ గురించి పరిచయాలు అక్కర్లేదు పొగడ్తల పనిలేదు. ఆయన పొట్టకూటి కోసం చేయని పని లేదు. అన్ని ప్రక్రియల్లోనూ కలం పెట్టి వీర విహారం చేశారు. ఏడోతరగతి చదివిన వ్యక్తి జీవన సమరంలో గెలిచారు. ఆయన జీవితమే గొప్పపాఠం.

ఆయన రచనల్లో ప్రత్యేకమైనది. ఆయనే చెప్పుకున్నట్లుగా అత్యంత విలువైనది "జీవన సమరం". ఈ వ్యాసాలు ఈనాడు పత్రికలో ధారావాహికగా వెలువడ్డాయి. పాఠకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కష్టజీవుల పక్షాన కవి పలికిన కఠిన సత్యాలివి. ఎంతో మంది కష్టజీవుల జీవితాలను వెలిగించిన వ్యాసాలు. ఇవి ఆయన హృదయానికి దగ్గరగా ఉంటాయి. ఇందులో 52 మంది వివిధ వృత్తులకు సంబంధించిన వారి సామాజిక జీవితాలు మన ముందు ఉంచారు.

ఒక గొప్పదేశభక్తుడి కూతురు తోపుడు బండిపై క్యారేజీలు తీసుకెళుతూ కుటుంబాన్ని నెట్టుకొచ్చే కథనంలో ఈ జీవన సమరం మొదలౌతుంది. మనకు కన్నీళ్ళు రాకపోతే మనం మనుషులం కాదు. దృశ్యాలు దృశ్యాలుగా కంటి ముందు కనిపిస్తాయి. జీవితం ఆడే ఆట తెలుస్తుంది.

"అసలీ బీగాలు ఎప్పుడు వెలిశాయో ఖచ్చితంగా చెప్పగల ఆధారలేమీ లేవు. అనాది మానవునకు ఏ పూట తిండి ఆ పూటకే కాక, మరో పూట కూడా సంపాదించడం నేర్చుకొన్నప్పటి నుండే ఈ తాళం అంటే బీగం వాడుకలోకి వచ్చి ఉండాలి" ఈ వాక్యాలలోని ఆంతర్యం చెప్పనక్కఱలేదు. 'జహంగీర్' అనే తాళాలు బాగుచేసే వ్యక్తి యొక్క జీవితం గురించి చెబుతూ రచయిత చేసిన వ్యాఖ్యలు ఇవి.

జహంగీర్ ఇంటికి తాళాలు లేక పోవడం ఇందులో కొసమెరుపు. " మా కొంప కెందుకండీ బాబూ తాళాలు? ఎత్తుకు పోవడానికేముంది దరిద్రం తప్ప" అన్న జహంగీర్ మాటలు గుండెల్ని పిండుతాయి.

కర్నూలు జిల్లాకు చెందిన శిల్పి ఆగమయ్య జీవితం ఎలా ఆగమైందో వివరిస్తారు. "శిల్పిగా ఉన్న ఆగమయ్య చింత చెట్టు క్రింద కూచొని, రాళ్ళను కంకర కింద కొడుతున్నాడిప్పుడు" అని రచయిత అనడంతో గుండెల్ని సుత్తితో మోదినంత బాధగా ఉంటుంది.

గంగిరెద్దు ఆడించే పాపయ్య, ఎలుకల్ని పట్టే నాగలింగం, చెక్కతో బొమ్మలు చేసే కాశీం, పేళ్ళు పగ లేసే పాపయ్య, తేగలు అమ్ముకొనే మొయినుద్దిన్, కత్తులకు సానపట్టే పండరి, బలవంతంగా వేశ్యగా మారి ఆ లంపటం నుండి తప్పించుకొని బజ్జీలమ్ముకునే సావిత్రి, కొలిమివేడికి నెత్తురంతా ఆవిరైన కమ్మరి శ్రీరాములు, గోడుగులు రిపేరు చేసే శంకరయ్య, సవరాలు అమ్ముకునే రాములు, బండిమీద పల్లీలు అమ్ముకునే శేషగిరి, గాజుపెంకులు ఏరుకునే ముత్యాలు, వీర గాథలు చెప్పే రాంకిష్టయ్య! ఇలా ఎంతో మంది శ్రమజీవుల చెమట చుక్కల విలువను మన కంటిముందు ఉంచుతారు.

"స్వరాజ్యం వచ్చేనాటికి ఖాదరు వయస్సు 32 సం॥రాలు తన 63వ ఏట కూడా అతనికింకా పూటబత్తెం కోసం దేవుళ్లాడుతూనే ఉండడం మనం సాధించిన అభ్యుదయాని కొక ఉదాహరణ"

ఈ వాక్యాలు పూసలు దండలు, జడపిన్నులు, బ్లేడ్లు రేజర్లు అమ్ముకొనే ఖాదర్ స్థితిని గురించి తెలిపిన మాటలు. ఈ వ్యాసాలు రాయడం కోసం వివిధ వృత్తుల వారిని కలిశారు. వారు చెప్పినవి ఓపికగా విన్నారు. వారి అంతరంగాన్ని, ఆలోచనల్ని, అనుభూతుల్ని రికార్డు చేశారు. వారు అనుభవిస్తున్న ప్రస్తుత స్థితికి వెనుకగల సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాలను విశ్లేషించి చెప్పారు. ఇందులో మానవత్వమున్న వ్యక్తిగా భరద్వాజ ఎక్కడా ఫెయిల్ కాలేదు. ఆ వృత్తుల పట్ల, వృత్తికారుల పట్ల సానుభూతి, ఆత్మీయత ఉంది. కాబట్టి వారు ఇలాంటి కధనాలు రాయగలిగారు.

"ఎన్నో వేలమందికి ఎండావానల బాధలేకుండా, గొడుగుల్ని బాగుచేసి యిస్తున్న శంకరయ్య మిటమిటలాడే ఎండకూ, జోరున కురిసే వానకు, ఏ పాత చూరు చాటునో తలదాచుకోవడం మన సమసమాజ స్థాపన కొక మచ్చుతునక" ఇలాంటి మాటలు భరద్వాజ గారికి పీడితుల పట్ల ఉన్న అనురాగం, రాజ్యం పట్ల ఉన్న ఆగ్రహం తెలుస్తుంది.

ఇందులో ఒక్కో కధనం ఒక్కో దుఃఖపు పోగు. మనకు తెలియకుండానే కళ్ళూ తడుస్తాయి. ఇప్పటికి భరద్వాజగారు చెప్పిన చాలా వృత్తులు కనుమరుగయ్యాయి. కొన్ని దీన స్థితిలో ఉన్నాయి. ప్రపంచీకరణ వ్యామోహంలో మనం ఎన్నో పోగొట్టుకున్నాం. ఇప్పుడా వృత్తికి సంబంధించిన జ్ఞాపకాలు కూడా మాయం. వృత్తులు కోల్పోయిన వారికి బతుకు తెరువు కనిపించలేదు.

'గొడ్డు చాకిరి – గుడ్డక్కరువు' కథనంలో చేనేత కార్మికుడు రామస్వామి ఆవేదన చూద్దాం.

"గొడ్డు చాకిరీ చేస్తున్నామనీ ముద్దకు కరువే, ఆఖరుకు మేం నేస్తున్న గుడ్డకు కరువే.. బాకీ తీర్చకపోతే మగ్గం పట్టుకెళతారేమో పోనిండి...... నా పీడ విరగడవుతుంది. మాకింత ఆదరువు చూపించడం చేతగాకపోతే పోనిండి గాని – కనీసం మా లాంటి వాళ్ళను జైల్లో పెట్టడం కూడా ఈ గవర్నమెంటుకు చేతకాకపోతే ఎలాగండీ !

చేనేత కార్మికుల పరిస్థితి ఇప్పటికీ అలాగే ఉండటం శోచనీయం. మగ్గాల గదులే ఉరిశాలలు కావడం మనం చూస్తునే ఉన్నాం.

ఈ విధంగా భరద్వాజ ఆ వ్యధార్త జీవుల గాథలను మన ముందు ఉంచారు. ఆయన ఇందులో చెప్పిన కొన్ని వృత్తులు చిరునామా కోల్పోయాయి. ఆ వృత్తులకు వారసులు లేరు.

భరద్వాజ వారి బతుకుల్లోకి తొంగిచూశారు. స్పందించారు. మనల్ని కదిలించారు. సమ సమాజ స్థాపనకు పూనుకోమన్నారు. ప్రభుత్వాలకు ప్రశ్నలు వేశారు. సాక్ష్యాలు చూపారు.

తెలుగు సాహిత్య చరిత్రలో భరద్వాజ గారు చేసిన కొత్త ప్రయత్నం జీవనసమరం. ఇలాంటి గ్రంధాలు గతంలో రాలేదు. భరద్వాజ గారి తరువాత ఇలాంటి గ్రంధం వచ్చిన దాఖలాలు లేవు.

**కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం**
**జాలరి పగ్గం, సాలెల మగ్గం**
**శరీర కష్టం స్ఫురింపజేసే**
**గొడ్డలి,రంపం, కొడవలి, నాగలి**
**సహస్రవృత్తుల సమస్త చిహ్నాల్**

నా నవీన గీతికి, రీతికి ఇదే ప్రాణం, ప్రణవం అని ప్రతిజ్ఞ చేసిన శ్రీశ్రీ శ్రమైక జీవన సౌందర్యాన్ని కోరుకున్నాడు. వృత్తి కార్మికుల వైపు నిలబడ్డాడు.

కానీ నేటికి చాలా వృత్తులు చావుదెబ్బ తిన్నాయి. కొన్ని మరణించాయి. కొన్ని ఆత్మహత్య చేసుకున్నాయి. కొన్నింటిని మనమే హత్య చేశాం.

ఇలాంటి కష్టజీవుల జీవన చిత్రాలను మన ముందుకు తెచ్చిన నిజమైన రచయిత భరద్వాజ 'జీవనసమరం' వ్యధార్థ జీవుల యదార్థగ్రంధం. బతికి ఉన్న కొన్ని వృత్తులైనా మనుగడ సాగించాలని ఆయన ఆశ మనమూ అదే అభిలషిద్దాం.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# కాదేది శిల్పికనర్హం

- సువ్వాడ ఝాన్సీలక్ష్మీ బాయి
**తెలుగు అధ్యాపకురాలు,**
**బాలయోగి గురుకుల పాఠశాల, కాకినాడ. తూ॥గో॥ జిల్లా.**

తెలుగు సాహితీ ప్రపంచంలో రచయితగా తన కంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మహోన్నత వ్యక్తి రావూరి భరద్వాజ. ఈయన 1927జూలై 5న జన్మించారు. పుట్టింది హైదరాబాద్ సంస్థానానికి చెందిన మోగులూరు గ్రామమైన పెరిగింది మాత్రం గుంటూరు జిల్లాలోని తాడికొండ గ్రామం. పొట్టకూటి కోసం ఎన్నో పనులు చేశారు. ఆఖరికి పేపర్ బాయ్‌గా కూడా పనిచేసి, బ్రతుకు పోరాటంలో నిలదొక్కుకున్న గొప్పవ్యక్తి. చదివింది 7వ తరగతి అయినా, తన రచనా వ్యాసాంగాన్ని 17వ ఏట నుండే ప్రారంభించారు. రావూరి భరద్వాజ గారి తొలి కథ 'విమల'. ఆయన రాసిన 'దైవ రాజకీయాలు' కథకు స్వర్ణకంకణం అందుకున్నారు. ఈయన 'రాష్ట్రసాహిత్య అకాడమీ', 'సోవియట్ ల్యాండ్ నెహ్రూ', 'భారతీయ భాషా పరిషత్' మొదలైన వాటి నుండి అవార్డులందుకున్నారు. వీరి రచనలు ఆంగ్లం, హిందీ, తమిళం, కన్నడం, మలయాళం భాషల్లోకి అనువదించబడ్డాయి. ఆయన రచనలు 4 విశ్వవిద్యాలయాలలో పి.హెచ్‌డి., పరిశోధనల కోసం ఎన్నుకోబడ్డాయి.

1965లో కృష్ణా పత్రికలో ధారావాహికంగా వచ్చిన 'పాకుడురాళ్ళు' రచన 1978లో నవలగా తొలి ముద్రణ పొందింది. రావూరిగారు 2012లో 'పాకుడురాళ్ళు' నవలకు 'జ్ఞానపీఠ' అవార్డును అందుకున్నారు. జ్ఞానపీఠ అవార్డు అందుకున్న విశ్వనాథ సత్యనారాయణ, డా॥సి. నారాయణ రెడ్డిలతో పాటు రావూరి భరద్వాజ గారు కూడా స్థానం దక్కించుకున్నారు.

రావూరిగారి 'జీవన సమరం' పుస్తకంలోని కథలు మానవుని నిజ జీవితానికి దర్పణాలుగా పేర్కొనవచ్చు. అంతేకాక వివిధ రకాల వృత్తులను నిర్వహించే వ్యక్తుల జీవితం ఎటువంటి ఒడిదుడుకులను ఎదుర్కొంటుందో ఎంతో చక్కగా చూపించారు. గొడుగులు, తాళాలు, బాగుచేసేవారు, అన్నం క్యారేజీలు మోసేవారు, తేగలు, పువ్వులు అమ్మేవారు ఇలా ఎన్నో బడుగు జీవుల యదార్థ గాథలను రచయిత విశ్లేషించారు.

'ఖరీదు కట్టే షరాబు లేదు' కథలో ఆగమయ్య ఒక శిల్పి. శిల్పాల తయారీకి ఏ రాయి పనికొస్తుందో, ఏ రాయి పనికిరాదో కంటి కొనతో చెప్పగల గొప్ప శిల్పకళాకారుడు. ఇతని తండ్రి బనగాని పల్లె నవాబుకు రాతితో మంచం చేసి యిచ్చాడు. అంతటి గొప్ప కళాకారుల కుటుంబం ఆగమయ్యది.

ఆగమయ్య ఏమీ చదువుకోకపోయినా శిల్పశాస్త్ర రహస్యాలన్నీ తాత, తండ్రుల దగ్గర పుణికి పుచ్చుకున్నాడు. వంశ పారంపర్యంగా వస్తున్న శిల్పశాస్త్ర రహస్యాలన్నీ తనతోనే అంతరించిపోతున్నందుకు ఆగమయ్య ఎంతో బాధపడతాడు. శిల్పాలను చెక్కించేవారు లేకపోవటంతో, ఆ వృత్తిని వదిలేశాడు ఆగమయ్య. ఇతను రాళ్ళకూ, కుందులకూ కక్కుకొడుతూ, పాత్రాలు సన్నికళ్ళు, తయారు చేస్తూ బ్రతుకు బండిని నడుపుతుంటాడు. అయినా కూలీ గిట్టడం లేదనే కారణం చేత రాళ్ళు కొట్టే పనికి కూడా పూనుకుంటాడు. అదీ లాభం లేకపోతుంది.

ఆగమయ్యకి ముగ్గురు పిల్లలు. పెద్దమ్మాయిని మేనల్లుడికే యిచ్చి పెళ్ళిచేస్తాడు. అల్లుడూ, కూతురు ఆగమయ్యపై ఆధారపడకుండా బ్రతుకుతున్నందుకు అతనికి ఎంతో సంతృప్తిగా ఉంటుంది. తన శిల్ప నైపుణ్యంతో రాళ్ళను రమణీయమైన దేవతా విగ్రహాలను తయారు చేసేవాడు. అటువంటి ఆగమయ్య గుప్పెడు మెతుకుల కోసం రోడ్డు ప్రక్కన చెట్టు క్రింద కూర్చుని రాళ్ళను కంకర కింద కొడుతూ, శ్రమకు తగిన ఫలితం లేక బ్రతుకు వెళ్ళదీస్తుంటాడు.

మానవ శరీరానికి అవయవాలు ఎంత అవసరమో సంఘంలో వృత్తులు కూడా అంతే అవసరం. కుమ్మరి, కంసాలి, కమ్మరి, వడ్రంగి, మంగలి, చర్మకారుడు సాలె,

రజకుడు వంటి ఎందరో వృత్తిపనివారున్నారు. ఒకప్పుడు పల్లెలు స్వయం సమృద్ధిగా వుండేవి. పల్లె జీవనానికి అవసర మైన వస్తువులను అన్ని వృత్తులవారు పరస్పర సహకారంతో తయారు చేసుకోనేవారు. ప్రతి వృత్తి పవిత్రమైనదే. ఏ వృత్తినీ మనం చిన్న చూపు చూడకూడదు. అన్ని వృత్తుల వారూ సహకారం అందిస్తేనే, సమాజం సక్రమంగా నడు స్తుంది.

పూర్వం కళాకారులు ఎందరో కళామతల్లిని నమ్ముకొని జీవితాన్ని గడిపారు. అలాంటివారిలో ఆగమయ్య ఒకడు. మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచంలో ఒక ప్రత్యేకతను కలిగి వున్నాయి. అందులోనూ మనదేశం కళలకు పుట్టినిల్లు. అన్ని కళలలో కెల్లా లలిత కళలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. లలిత కళలు అంటే చిత్రలేఖనం, సంగీతం, శిల్పం, నృత్యం, కవిత్వం. లలిత కళలలో శిల్పం ఒకటి. ప్రస్తుత సమాజంలో శిల్ప కళా కారులు ఎంతటి దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారో ఈ కథలో పేర్కొన్నారు. అంతేకాక కనుమరుగవుతున్న శిల్ప విద్య యొక్క గొప్పదనాన్ని కూడా తెలియజెప్పారు.

ఆగమయ్య శిల్పం చెక్కడానికి ఎటువంటి రాళ్ళు పని కొస్తాయో చెప్పగల గొప్ప శిల్ప నైపుణ్యం గలవాడు. రాయి పైకి బాగానే వుండి లోపల దోషం వుంటే, ఆ రాళ్ళు శిల్పం తయారీకి పనికిరావనే విషయం మామూలు వ్యక్తులకు తెలియదు. శిల్పం చెక్కడానికి శిల ఎంపిక కూడా ఎంతో అవసరం. సాధారణ మనిషి దృష్టికి రాళ్ళు, రాళ్ళుగానే కనిపిస్తాయి. ఒక్క శిల్పికి మాత్రమే ఆ బండరాళ్ళల్లో శిల్పాలు కనిపిస్తాయనే విషయం కథలో రావూరి తెలియజేశారు. ఈ సందర్భంగా క్రింది పద్యం శిల్పి యొక్క కళా దృష్టిని తెలియజేస్తుంది.

**"వసుధ గన్పట్టు సర్వపర్వతములందు**
**జిత్రములనెన్ని గతులఁజూచెదవొ నీవు!"**

- జాషువ

పై పద్య పాదాలలో భూమి మీద కనిపించే కొండలలోని రూపాలను శిల్పి ఎన్ని విధాలుగా చూస్తాడో! అని కవి భావన. ఆగమయ్య తండ్రి కూడా గొప్ప శిల్ప నైపుణ్యం కలవాడు. అతడు బనగాని పల్లెకు చెందిన నవాబుకు రాతితో మంచం చేసి, బహుమతిగా ఇచ్చాడు. ఈ మంచం తయారీకి తగిన రాయిని ఎంచుకోవాలి. దాని తయారీలో ఏ మాత్రం అజాగ్రత్త వహించిన, శిల్పిపడ్డ శ్రమంతా ఎలా వృధా అవుతుందో రచయిత ఆగమయ్య మాటల్లోనే పేర్కొన్నారు.

" ఆ మలచడంలో కాస్త పొరపాటు జరిగి ఇంత కద్దు బెచ్చిక రాలిపడినా అంతదాకా పడిన శ్రమ యావత్తు బూడిద పాలైపోతుంది."

తాత, తండ్రుల నుండి వచ్చిన శిల్పకళనే ఆగమయ్య అనుసరించాడు. అతను ఏమీ చదువుకోకపోయినా, శాస్త్ర సంప్రదాయాల ప్రకారం అమ్మవారి విగ్రహాన్ని చెక్కాడు. నిజంగా అమ్మవారికి సంబంధించిన శిల్పాన్ని లేదా విగ్ర హాన్ని చెక్కాలంటే ఎంతో నిష్ఠ అవసరం. నియమాలు సక్ర మంగా పాటించకపోతే ఎలాంటి అనర్థం జరుగుతుందో శిల్పి మాటల్లో చూద్దాం.

"ఏదోషం తగిలిందో, ఏ దిష్టి తగిలిందో తెలియదు. సగానికి సగం పాదం విరిగి ముందు పడింది. నా ఆవ జీవాలు కుంగిపోయాయి................ఇది పనికాదనుకుని ఈ సారి దేవాలయం ముందే కూర్చున్నాను. చుట్టూ గోనె పట్టాలు కట్టించుకొన్నా. ఎవర్నీ లోపలకు రానివ్వలా. నేల మీద ఆరోజులకల్లా 'అమ్మ విగ్రహం' తయారయింది. అన్ని రోజులూ వొంటిపూట భోజనం తప్ప సాయంకాలాలు ఫలహారం కూడా ఎరుగనండీ" అన్నాడు ఆగమయ్య"

పై మాటలను బట్టి అప్పటి ప్రజల్లో దేవుని పట్ల గల నమ్మకం, విశ్వాసం మనకు అర్థమవుతుంది. అంతేకాక ఎన్నో దేవతావిగ్రహాలు మన ఆగమయ్యలాంటి ఎందరో శిల్పుల ఉలి నుండి బయల్పడినవే. శిలలు శిల్పాలుగా మారి, దేవతమూర్తుల రూపం దాల్చి ఇప్పటికీ పూజలందు కుంటున్నాయి. ఈ విషయం క్రింది పద్యంలో తేటతెల్లమవు తుంది.

**"సున్నితంబైన నీ చేతి సుత్తె నుండి**
**బయలుపడె నెన్ని యెన్ని దేవస్థలములు**
**సార్థకము గాని యెన్ని పాషాణములకు**
**గలిగె నీనాడు పసుపు గుంకాల పూజ!"**

**- జాషువ**

పై పద్యంలో మెత్తనైన నీచేతి సుత్తి దెబ్బలతో ఎన్నో దేవాలయాలు బయటపడ్డాయి. ఒకనాడు వ్యర్థంగా పడి యున్న ఎన్నో బండఱాళ్ళకు, నీవల్లనే (శిల్పి) పసుపు కుంకు మలతో పూజలు పొందే భాగ్యం నేడు లభించింది అని కవి భావం. కాని వాటిని చెక్కిన శిల్పి జీవితం ఈనాడు దుర్భరంగా మారింది. ఈ కాలంలో శిల్పాలను చెక్కించే వారు లేరు. అటువంటప్పుడు ఆ వృత్తిని నమ్ముకొని బ్రతికే వారి జీవితం ఏవిధంగా వుంటుందో మనం వేరే చెప్ప నక్కర్లేదు.

శిల్పాలు చెక్కిన చేతితోనే రాళ్ళకూ, కుందులకూ కక్కు కొడుతున్నారు. ఆ ఖరికి కంకర కొట్టటానికి కూడా వెనుకాడటం లేదు. ఈ విషయాన్నే భరద్వాజగారి మాటల్లో–

"తన ఉక్కు వులితో, శానంతో, పొగరుతో, పాత పొడసుత్తెతో రాళ్ళలో నిద్రించే రమణీయతను మేల్కొలిపి అందరి ముందూ వుంచిన ఆగమయ్య, యుగయుగాల భారతీయ సంస్కృతికి ఆలవాలంగా నిలిచిన దేవతా విగ్రహా లను అలవోకగా మలిచి ఆగమయ్య, శిలాస్తంభాల నుండి సంగీత ఝురులను ఉరుకులెత్తించగల ఆగమయ్య పిడికెడు మెతుకులు కోసం రోడ్డువార నున్న చింతచెట్టుక్రింద కూచొని, రాళ్ళను కంకరకింద కొడుతున్నాడిప్పుడు".

రాయితో దేవతా విగ్రహాలనూ, మందిరాలనూ నిర్మించే విద్యశిల్పకళ. అమరావతిలో, హంపీలో, అజంతా గుహల్లో తెలుగు శిల్పుల ఉలిదెబ్బలచే రాళ్ళు పూర్ణకుంభాలుగా, పద్మశాలలుగా, ధర్మ చక్రాలుగా రూపం ధరించాయి. ఎల్లోరా లోని కైలాస దేవాలయం శిల్పుల గొప్పదనానికి నిదర్శనం మధుర మీనాక్షి దేవాలయంలోనూ సప్తస్వరాలు పలికే రాతిస్తంభాలు నిర్మించారు. హనుమకొండలోని వేయిస్థంభాల గుడి శిల్ప నైపుణ్యానికి తార్కాణం. నంది విగ్రహాలను చూసి 'లేపాక్షి బసవన్న లేచి రావన్న' అంటూ అడవి బాపిరాజు గీతం రాశారు. అలాంటి శిల్పకళాకారులు ప్రస్తుత సమాజంలో ఎంతో దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు.

**"తెనుగుందేశము నిన్నువంటి పనివానిం జూచి యుప్పొంగుచుం**
**డును ; నీ లేమి దలంచి కంటఁదడిబెట్టున్; శిల్ప విద్యానిధీ!"**

**- జాషువ**

తెలుగునేల నీ వంటి పనివాళ్ళను చూసి ఉప్పొంగిపోతూ ఉంటుంది. నీ దారిద్ర్యాన్ని చూసి కన్నీరు కారుస్తుందని కవి భావన. ఎంతో వైభవాన్నిచూసిన శిల్పకళాకారులు ఈనాడు కఠిక పేదరికాన్ని అనుభవిస్తున్నారు. గుప్పెడు మెతుకుల కోసం అన్నమో రామచంద్రా! అని ఆకలితో అల్లాడుతున్నారు.

చేతివృత్తులు చేసేవారికి శ్రమకు తగిన ప్రతిఫలం లభించదు. అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ శ్రమదోపిడి అనేది జరుగుతూనే ఉంటుంది. కాని నేటి సమాజంలో చేతివృత్తులు అంతరించిపోతున్నాయి. దీనికి కారణం ప్రజల్లో విద్యపట్ల అవగాహన పెరగటం, అందువల్ల చాలా మంది విద్యనభ్యసించి, ఉద్యోగాలు చేయటానికే ఇష్టపడుతున్నారు. దీని వల్ల తాత,తండ్రుల నుండి సంక్రమించిన చేతి వృత్తులు, వాటిలోని మెళుకువలు కనుమరుగైపోతున్నాయి. ఒకవేళ ఒకరిద్దరు వంశపార్యంగా వచ్చే వృత్తులను లేదా కళలను చేపట్టినప్పటికీ, కష్టానికి తగిన ఫలితం దక్కడం లేదనే విషయం మన అందరికి విధితమే. ఇందువల్ల చేతివృత్తులను చేయటానికి అంతగా ఎవరూ ఆసక్తి చూపటం లేదు. ఏదీ ఏమైనప్పటికీ ఆగమయ్య లాంటి వ్యక్తులతో పాటు వారి కళానైపుణ్యం కూడా అంతరించిపోతుంది. చేతివృత్తులు క్రమేణ కాలగర్భంలో కలిసిపోతున్నాయి. శిల్ప సంపద భారతీయ సంస్కృతికి అద్దం పడుతుంది. కానీ శిల్ప విద్య మాత్రం క్రమక్రమంగా అంతరించిపోతుందనే విషయాన్ని రావూరి భరద్వాజగారు 'ఖరీదు కట్టే షరాబు లేదు' కథ ద్వారా చెప్పకనే చెప్పారు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# రావూరి భరద్వాజ సాహిత్య కథలు – పరిశీలన

- జె. తిరుపతి
పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

"చూడగల దృష్టి, రాయగల నేర్పు వుండాలే గాని, ఈ జగత్తు నిండా కథలే. అసలు ఈ జగత్తే ఒక పెద్ద కథ" అని భరద్వాజ నమ్మకం.

భరద్వాజదొక విలక్షణమైన మనస్తత్వం. తనకు ఎదురైన ప్రతి చిన్న సన్నివేశాన్ని, ప్రతి చిన్న సంఘటనను ఆయన నమోదు చేస్తారు. దాని లోతుపాతులు ఆకళించుకుంటారు. అందులోంచి తనకు ఉపయుక్తమైన అంశాలను తన రచన లలో పొందు పరుస్తారు. తనకు ఎదురైన ఏ అనుభవాన్నీ వృధా కానీయరు. తాను చూసినవి, విన్నవి, తన అనుభ వాలు, అనుభూతులను అక్షరబద్ధం చేస్తారు.

భరద్వాజ రచనలలో ప్రతిభ ఉంది. మెరుపు ఉంది. శిల్పం ఉంది. విశిష్టత ఉంది.

నిత్య జీవితంలో తనకు తారసపడిన ప్రతి వ్యక్తినీ, ఎదురైన ప్రతి సంఘటననూ, తన రచనలలో ఎక్కడో ఒక చోట, ఎప్పుడో ఒకప్పుడు వినియోగించుకుంటూనే ఉంటారు.

ప్రాంతీయ, దేశీయ, కుల, మత, భాషా భేదాలకు అతీతంగా, విశ్వజనీనతను సంతరించు కున్నాయి ఆయన రచనలు.

జంతువులు, పక్షులు, కీటకాలు, మనుషులు, ప్రకృతి ఇలా సృష్టిలోని ప్రతి అణువునూ పలకరిస్తారు, పలకరింప జేస్తారు, పరవశింప జేస్తారు, పఠితలతో సూటిగా మాట్లాడింప జేస్తారు ఆయన.

ఎవరికీ పనికిరాని దానిలోంచి కొందరికైనా పనికొచ్చేది వెలికితీయడం, అంతా తెలుసుననుకొన్న దానిలోంచి, ఎంతో తెలియని దానిని తెలియజేయడం ఆయనకిష్టం. ఒక సామాన్య సన్నివేశం భరద్వాజ స్పర్శతో రసగుళికగా మారు తుంది. ఒకానొక సాధారణ వ్యక్తి. ఆతని రచనలో అసాధా రణ వ్యక్తిగా భాసిస్తారు. ప్రజల భాషలో పాఠకులతో సూటిగా మాట్లాడడం భరద్వాజ రచనల ప్రత్యేకత.

## శ్రీరస్తు :

"శ్రీరస్తు" కథల సంపుటిలో, అబద్ధాల మీద, అసత్యాల మీద, ఆత్మవంచన మీద, పరవంచన మీద, దగామీ, బతుక్కొ స్తున్న ఈనాటి సమాజం మీద చంద్ర నిప్పులు చెరిగి పోశారు భరద్వాజ. వ్యక్తిలోను, సమాజంలోను యుగయుగాలు, తర తరాలుగా పేరుకుపోయిన సమస్యలను, అన్యాయాలను వెలికితీసి, వాటి వాటి సహజ రూపాలలో, సహజ వర్ణాలలో మనకు చూపించి, మనలను మనం తేరిపార చూసుకునేలా చేశారాయన.

'ఒక చీమ కథ, ఒక దోమ కథ, ఒక ఎలుక కథ, ఒక చిలుక కథ' అన్నవి మన రాజకీయ, ఆర్థిక, సామాజిక, నైతిక విలువల మీద కత్తికోతల వంటివి, బాకుపోట్ల వంటివి. చీమలు, దోమలు, ఎలుకలు, చిలుకలు కూడా మన దోషాల్ని మన ముందుంచేలా చేశారు భరద్వాజ. ఒక మంచి పదం కోసం, ఒక అందమైన శబ్దం కోసం, తాను అనుకున్న దానిని, అనుకొన్నంత స్పష్టంగా అవతలి వారికి తెలియ జేయగల సజీవమైన, జీవంతమైన ఒక ప్రత్యేకత కోసం, ఆయన మధన పడతారు. ఈశ్వరుని కోసం తపించినంతగా.

భరద్వాజది వేదనా భరితమైన జీవితం. ఈ వేదన, ఆయన హృదయాన్ని కరుణరస భరితం చేసింది. హరి తమూ, పరిమళమూ, అశ్రుబిందువూ వేణుత్రయంలా కలిసిపోయాయి.

ఒక నైరూప్య భావానికి సారూప్యతను సంతరించడం కోసం, భరద్వాజ మధన పడతారు. ఆ భావాన్ని, పదాల్లోను, వాక్యాల్లోనూ బంధించడం కోసం దహించుకు పోతారు. ఆ మంటల్లోంచి వాక్యాల మీదుగా అతని ఆలోచనలు గ్రహించి, పఠితల అంతరాంతరాల్లో తమ గళాలను విప్పి

నప్పుడు, ఆ బృందగానంలోని తీవ్రస్థాయిని అందుకునేలాగా చేయడం కోసం, అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ఆయన సద్వినియోగం చేసుకుంటారు. భరద్వాజ రచనలు మాతృప్రేమను చూపించి కరుణరసాన్ని ఒలికిస్తారు.

కథా రచనలో భరద్వాజ సిద్ధహస్తులు. ఈ రంగంలో ఎన్నో నూతన ప్రయోగాలు చేశారు. భరద్వాజ తన కథలకు పెట్టిన పేర్లను చూస్తేనే ఆ సత్యం గోచరిస్తుంది. అందుకే భరద్వాజను "కథకుడు" అనడం కంటే "ఉత్తమ టెక్నీషియన్" అనడం మేలనిపిస్తుంది. టూకీగా కొన్ని కథలనిక్కడ పరిశీలించడం అవసరం.

'గోడల్లేని జైలు' కథలో – నీతికి, అవినీతికి మధ్య ధర్మానికి, అధర్మానికి మధ్య ఒక మతానికి, మరొక మతానికి మధ్య ఒక మతంలోనే ఒక కులానికి, వేరొక కులానికి మధ్య ఒక కులంలోనే ఒక శాఖకు, మరొక శాఖకు మధ్య కనిపించని కారాగారాలెన్నో వున్నాయి. వీటి నుండి బయటకు రావడమూ, వీటిల్లోనే సుఖంగా వుండడమూ ఏదీ సాధ్యం కాదు.

ఆ కథలోని ఆనందం తాను చేయని తప్పుకు శిక్షను అనుభవిస్తాడు. శిక్షాకాలం పూర్తి అయిన తరువాత తన విడుదలను తనే తిరస్కరిస్తాడు. చుట్టూ కనిపించే జైలు అయితే, తాను గోడలను బద్దలు గొట్టుకొని పోగలనని, బయట ప్రపంచంలో కనిపించని జైళ్లను (అంటరానితనం, కులతత్త్వం, మతతత్త్వం మొదలగునవి) బద్దలుగొట్టడం తనకు సాధ్యం కాదని, కనిపించని జైళ్ల కన్నా కనిపించే జైలే సుఖంగా వున్నదనీ ఆనందం అంటాడు. మన సాంఘిక వ్యవస్థలోని అంటరాని తనమనే అనాగరిక, అమానుషమైన విధానానికి ఆనందం పాత్ర ఒక సజీవ ఉదాహరణ.

'విజయవిలాసం' కథలో జైలు నుండి విడుదలయి తాను "అమితంగా ఇష్టపడే 'విజయ'ను స్వీకరించటం గురించి చెబుతూ "అసలైన ప్రేమ అనంతమైన త్యాగాలను కోరుతుంది. ఆ త్యాగం ఆర్థిక, సామాజిక, నైతికమైనదేదైనా కావచ్చు. కానీ ఆ త్యాగం మాత్రం అక్షరాల త్యాగమే" అంటారు.

## కడుపు తీపి :

తల్లికి తన బిడ్డ మీద వుండే ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలుస్తుంది 'కడుపు తీపి' అన్న కథ.

ఒక తల్లి తన కొడుకును గారాం చేయడం వలన, ఆ కొడుకు వ్యసనాలకు లోనై వేశ్య అడిగిన తన తల్లి గుండెను ఇవ్వడానికి కూడా సిద్ధపడతారు. ఆ గుండెను తీసుకొని వెళుతున్నప్పుడు అతనికి రాయి తగిలి బాధపడతాడు. చేతిలోనున్న గుండె 'నాయనా బాధ కలిగిందా'? అని అడుగుతుంది. ఇది మాతృప్రేమకు పరాకాష్ట.

## మాతృదేవోభవ :

ఈ కథ చాలా ఆర్ద్రమైనది.

"జీవితంలో ప్రేమ ముఖ్యమా? బిడ్డలు ముఖ్యమా?" అన్న ప్రశ్న ఉదయించినప్పుడు స్త్రీ సహజంగా బిడ్డల వైపే మొగ్గుతుంది. తన రక్తాన్ని పంచుకొని, తన పేగు త్రెంచుకుని పుట్టిన బిడ్డలపై తల్లికి గల అవ్యాజమైన ప్రేమ కనిపిస్తుందీ కథలో.

## చీమకథ :

ఈ కథలో – కథానాయకునితో చీమ ఇలా అంటుంది.

"మీరెలా బతుకుతున్నదీ నేను చూస్తూనే ఉన్నాను. మీ చుట్టూ ఉన్నవారు తిండిలేక మలమల మడి చస్తుంటే, మీరు విందులు చేసుకుంటారు. మీ చుట్టూ వున్నవారు జానెడు గుడ్డతో మానం దాచుకోలేక సిగ్గుపడుతుంటే, కొనే దిక్కులేక మీ గోదాముల్లో గుడ్డల తానులు మగ్గిపోతుంటాయి. మీలో నూరింట 80 వంతుల మంది పశువుల కన్నా హీనంగా బతుకుతుంటే, మీరు సిగ్గుపడటం కూడా మరిచిపోతారు. మీ అంత నీచ ప్రాణుల్ని నేనెక్కడా చూడలేదు. మొత్తం విశ్వాన్ని తెచ్చి మీ ముందుంచినా, మీరింకా ఇంకా ఇంకా కోరుకుంటూనే ఉంటారు. ఆ కోర్కెలను తీర్చుకోవడం కోసం మిమ్మల్ని మీరే మోసం చేసుకుంటారు. మిమ్మల్ని మీరే దగా చేసుకుంటారు. మీ మీద మీరే యుద్ధం చేసుకుంటారు. అలా చేసుకొని మీ చేతుల్లో మీరే నాశనమవుతారు. అలా నాశనం కావడానికైనా మీరొప్పుకుంటారు గానీ, మరొకరి పొత్తుకు ఆశ పడకుండా మాత్రం బతకలేరు" అని దులిపేస్తుంది.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

పాకిస్తాన్‌తో కార్గిల్‌లో జరిగిన యుద్ధకాండను స్ఫురణకు తెస్తుందీ చీమ సందేశం. వర్తమాన సామాజిక వాతావరణాన్ని ఎక్స్‌రే తీసి చూపించారు రచయిత. స్వార్థం, మోసం, దగా, దోపిడీలతో అల్లాడిపోతున్న ఆధునిక సమాజాన్ని ఈ చీమ పాత్ర ద్వారా కడిగేశారు. "అల్ప ప్రాణులైన చీమలు తమ శ్రమ ఫలితాన్ని కాపాడు కోవడానికి చావుకు కూడా తెగిస్తున్నాయి. కానీ 'విజ్ఞాన వంతుణ్ణి' అనుకుంటున్న మానవుడు దోపిడీ చేస్తున్నాడు. దోపిడీ చేయబడుతున్నాడు కూడా. తమ శ్రమ ఫలితాన్ని తాము కాపాడుకోవడానికి, అల్ప జీవులందరూ చైతన్య వంతులై తిరగబడితే తప్ప, ఈ వ్యవస్థ మారదు" అన్న పరమ సత్యాన్ని రచయిత ఈ కథలో స్పష్టీకరించారు.

మానవ స్వభావాలకు ప్రాతినిధ్యం వహించే ఇతర ప్రాణుల్ని ప్రతీకలుగా తీసుకొని, సమకాలీన ఆర్థిక, రాజకీయ, సామాజిక వ్యాధుల విశ్లేషణ చేశారాయన కథలలో, మానవేతిహాసంలో కామినీ కాంచనాల పట్ల మానవునిలో పేరుకుపోయిన అతివల మీద ఆశను, అందుకోసం జరిగే భయంకర యుద్ధాలను, ఆ యుద్ధాలు ఎంత ధర్మ సమ్మతమైనవో చాటి చెప్పే ప్రచార విధానాలను, స్వేచ్ఛ పేరు మీదుగా పెట్టుబడిదారీ దేశాలలోనూ, సమాజాలలోనూ జరిగే అమానుషమైన చర్యలను, ఆయన కథలు ఎండగడుతున్నాయి. సమాజంపట్ల, సమాజంలోని అత్యధిక సంఖ్యాకులైన అట్టడుగు వర్గాల వారి పట్ల, బడుగు వర్గాల వారి పట్ల, రచయితకున్న సానుభూతిని ఈ కథలు అభివ్యక్తం చేస్తున్నాయి.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# పాకుడు రాళ్ళు (నవల) - పరిశీలన

- డా. వి. శ్రీదేవి
రీడర్ ఇన్ తెలుగు, తెలుగు అధ్యయన శాఖ
కె.వి.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాల, కర్నూలు.

## రచయిత పరిచయము :

అనేక అవమానాలు, ఆర్థిక అసమానతలు, మనిషిని ఏ మాత్రం లొంగదీయలేవని నిరూపించిన క్రాంతి దర్శి జ్ఞానపీఠ పురస్కార గ్రహీత అయినటువంటి "రావూరి భరద్వాజ" గారు 1927 జూలై 5వ తేదీన కృష్ణాజిల్లా నంది గామ తాలుకా కంచికర్లకు సమీపంలోని మొగులూరులో జన్మించారు. మల్లికాంబ, చిన్న కోటయ్య వీరి తల్లిదండ్రులు, ఆర్థిక అసమానతల కారణంగా చిన్న వయస్సులోనే చదువుకు దూరమయ్యారు. ఈయన తన బతుకు సమరంలో అలుపెరగని సైనికుడిలా పోరాటం చేసిన వ్యక్తిగా చెప్పవచ్చు. ఈయన ఈయనకు చదువురాదని, పాడిత్యం లేదని వాళ్ళ వూళ్ళో అందరూ హేళన చేయగా ఎక్కడ అవమానింప బడ్డాడో అక్కడే అందరి చేత ప్రశంసలు అందుకోవాలనే తపనతో కఠోరమైనటువంటి దీక్ష బూని పాండిత్యాన్ని నేర్చుకొనినటువంటి గొప్ప తపస్వి. ఈయన ఆకలి బాధలే ఈయన ప్రగతికి పాఠాలు చేర్పించాయి అని చెప్పవచ్చు. ఈయన గొప్ప మానవతావాది. ఈయనకు 1948 మే 28 వ తేదీన 'కాంతమ్మ' అనే ఆమెతో వివాహం అయినది. నిజానికి ఈమె పేరు 'కాంతం' అయితే ఆమెలోని దయా గుణాన్ని మరియు ప్రేమను చూచినటువంటి భరద్వాజ గారు 'అమ్మ' చేర్చి కాంతమ్మ అని ఆమెకు నామసార్థక్యాన్ని చేశారు. ఈ రకంగా తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసి అందరి మనసులో సుస్థిర స్థానాన్ని సంపాదించుకొన్న వ్యక్తిగా డా॥ రావూరి భరద్వాజ గారిని సందేహం లేకుండా చెప్పవచ్చని నా అభిప్రాయం.

## పాకుడు రాళ్ళ (నవల) - ఇతివృత్తం :

తెలుగు నవలా సాహిత్యంలో భారతీయ అత్యుత్తమ సాహిత్య పురస్కారాన్ని పొందిన నవల పాకుడు రాళ్ళు - పద్యకావ్యమైన రామాయణ కల్ప వృక్షానికి, వచన కార్యమైన విశ్వంభరకు సరితూగే ఆధునిక వచన, రచన పాకుడు రాళ్ళు. రావూరి భరద్వాజ రాసిన ఈ నవల ఆనాటి సమాజాన్నే కాదు ఈ నాటి సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. అనడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు. సమాజంలో ధన్. కీర్తి పరంగా ఉన్నతులుగా భావించే వారి జీవితాల్లో మాలిన్యాన్ని చిత్రించిన నవల ఇది. ఎక్కడా ఊహలకు అతిశయోక్తుకు, అవసరమైన వర్ణనలకుతావు లేకుండా వాస్తవ దృశ్యాలకు అక్షర రూపం, రచయిత రచనలు ఎక్కడ నేల విడిచి సాము చేయువు. అదే విధంగా నవలంతా వ్యవహారిక భాషలో పాత్రోచిత భాషలో సాగుతుంది. శిల్ప పరంగా ఈ నవల ముఖ్యపాత్ర అయిన మంజరీ జీవితాలలోని నిచ్చెనమెట్లు సన్నివేశాలు, సంఘటనలు వాటికి తగిన వివరాతో సాగుతుంది. మిగిలిన పాత్రలూ అంతే ఇప్పటి సమాజానికి దర్పనం కనుకనే ఈనవలకు 2012వ సంవత్సరానికి గాను ప్రసిద్ధ జ్ఞానపీఠ పురస్కారం లభించింది.

సినిమా రంగుల ప్రపంచం వ్యామోహంలో పడి ఉన్న ఊరును, అయిన వారందరిని వదలి ఎలాగైనా సరే రాణించాలనే తపన అక్కడ వారందరిది, మిగిలిన వారిని తప్పించి ఆ అవకాశాలను కైవసం చేసుకోవడానికి అవలంభించే నీతి విధానాలు, సినీ తళుకుబెళుకుల వెనుక దాగిన నిట్టూర్పులు, నీతిలేని నీడలు సర్వసాధారణం.

ఇటువంటి సినిమాయ ప్రపంచంలో ఒక్కోమెట్టు ఎక్కడానికి నీతి నియమాలకు తిలోదకాలిచ్చి చివరికి అందని అదఃపాతాళాళంలోకి జారిపోతూ ఉంటారు. చివరకు అన్ని విషయాలు అర్థమయ్యేటప్పటికి జీవితం జబీచరమాంకానికి చేరుకుంటుంది. ఇదే విషయాన్ని పదునైన భాష, సరళమైన శైలిలో భరద్వాజ గారు. "పాకుడు రాళ్ళు" నవలగా మనకు అందించారు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

## పాకుడు రాళ్ళు కథా చిత్రణ :

ఈకథలోని నాయిక మంగమ్మ, మాధవరావు పాత్ర చెప్తున్న కథతో ఈ నవల ఆరంభమౌతుంది. మాధవరావు అతని స్నేహితుడు రామచంద్రం ఒక మంచి నాటకాన్ని ప్రదర్శించాలన్న ఆలోచనతో ఒక నాటక సమాజాన్ని స్థాపిస్తారు. అందులో ఒక స్త్రీ పాత్రదారి కొరకు గుంటూరు నుంచి మంగమ్మను తీసుకువస్తారు. మంగమ్మతో నాగమణి అనే మరో స్త్రీ కూడా వస్తుంది. మొదట అందరూ నాగమణి మంగమ్మ తల్లో, బందువో అనుకుంటారు.

మంగమ్మ చక్కనిది మరియు తెలివైనదీ. కూడా ఆమెలోని అసమామాన్య ప్రతిభ అందరూ ముగ్దులౌతారు. అయితే ఆమెలో మానసిక సంఘర్షణను గమనించిన మాధవరావు మంగమ్మ ద్వారానే ఆమె అసలు విషయం తెలుసుకుంటాడు. నాగమణి ఒక వేశ్యా గృహం, నడుపుతుందని, మంగమ్మ ఆమె చేతిలో కీలుబొమ్మ అని తెలుసుకుంటాడు. ఎంతో భవిష్యత్తు ఉన్న మంగమ్మ జీవితం అలా నాశనం కాకూడదని తన మిత్రుడైన రామచంద్రం సహాయంతో నాగమణి చేతిలో ఐదువేల రూపాయలు పెట్టి మంగమ్మకు విముక్తి కల్పిస్తాడు.

మంగమ్మ తన ప్రతిభతో అందరి మన్ననలు పొందుతుంది కాలక్రమేణ అనేక నాటక సమాజాలు పుట్టగొడుల్లాగా పుట్టుకురావడంతో పోటీ వెరసి వీరి నాటక సమాజం మూతపడుతుంది. కళాశారులంతా తలో దారి అవుతారు మంగమ్మకు ధైర్యం చెప్పి మంచి భవిష్యత్తు ఉందని నచ్చచెప్పి కొంత డబ్బు ఆమెకిచ్చి సాగనంపుతారు మాధవరావు, రామచంద్రం.

భవిష్యత్తు సూన్యంగా మారిన ఈ పరిస్థితిలలో మంగమ్మ ఎట్టి పరిస్థితులలోనూ మళ్ళీ పాత జీవితంలోకి అడుగు పెట్టకూడదు అని అనుకుంటున్న సమయంలో చలపతి కలుస్తాడు. ఒకప్పుడు చలపతి మంగమ్మకు సహనటుడు. మాటల సందర్భలో తాను సినిమా రంగంలో బాగానే నిలదొక్కుకున్నాననీ, ఏదో గొప్ప సినిమాలో మంగమ్మను నటింపజేస్తానని నమ్మకంగా చెబుతాడు తనతో మద్రాసు రమ్మంటాడు. ఇక ఏ దారీలేక అతని వెంట దారిపడుతుంది మంగమ్మ ఇక ఇక్కడ నుండి మార్పులు మొదలవుతాయి.

## మంగమ్మ మంజరీగా మారడం :

ప్రముఖ తారగా వెలుగొందాలన్న లక్ష్యముతో మంజరీ నీతినియాన్‌లకు తిలోదకాలిచ్చి, తన లక్ష్యాన్ని చేరుకోవా డానికి తన ప్రయత్నాలను ప్రారంభిస్తుంది. అందులో భాగంగా మానవులక్ను బలహీజతలతో బలీయమైంది. స్త్రీ బలహీన, దాన్ని అడ్డుపెట్టుకుని రకరకాల మగవాళ్ళ కామ దాహాన్ని సునాయాసంగా తీర్చి తక్కువ వ్యవధిలోనే చలన చిత్ర రంగంలో ఉన్నతమైన స్థాయికి చేరుకుంటుండి. హిందీ రంగంలో అడుగు పెట్టి అక్కడ కూడా శిఖరాగ్రాలు చేరుకుంటుంది.

అతి సామాన్య స్థితినుంచిఒక్కోమెట్టు అధిరోహిస్తూ ఉన్నత  స్థాయికి చేరుకుంటుంది. కానీ తాను ఒకప్పుడు ఏ జీవితం వద్దనుకుందో చివరికి అదే జీవితంలో తేలుతుంది. కీర్తి మోజులో చేయకూడని ఎన్నో పనులు నిర్మొహమాటంగా చేస్తుంది. చివరకు ఒక సేఠ్ చేతిలో దారుణంగా మోసపోతుంది. దొంగనోట్ల కేసులో అతను జైలుపాలవుతాడు. ఆ కేసులో అతనితో సంబంధం ఉ్న వ్యక్తిగా బయట పడే మార్గం వెతికే దిశలో, ఓ బ్లూ ఫిల్మ్‌లో నటించడం వారి నుంచి బ్లాక్ మెయిల్స్, చివరికి ఆత్మహత్య ఇలా మంజరీ కథ సమాస్తమౌతుంది.

నవల మొత్తం మంజరీ పాత్ర చుట్టూ తిరుగుతుంది. మంజరీ పాత్ర ద్వారా పాఠకుడు నవరసాలూ అనుభవిస్తాడు. మంగమ్మ పాత్ర ప్రారంభం నుంచి మంజరీగా మారేంత వరకూ కూడా ఆమె పాత్ర పట్ల పాఠకుడిలో ఏదో తెలియని సానుభూతి ఉంటుంది. పోను పోనూ ఆమె చేష్టలు జుగుప్స అనిపిస్తాయి. మనిషిని అంచనా వేయడంలో కార్యములు సానుకూల పరచడంలో ఆమె చాకచాక్యం ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. ఎంతోమంది చేతుల్లో అయిష్టంగానే ఆమె నలిగిపోతున్నప్పుడు ఓ పక్కజాలి, మరో పక్క కోపం కలుగుతుంది.

రావూరి భరద్వాజ చిన్నతనం నుంచే ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. 8వ తరగతివరకే చదివిన ఆయన మూడు విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్ డిగ్రీ పట్టాను పొందారు. ఇప్పటి కృష్ణాజిల్లా, గతంలో హైదరాబాద్ స్టేట్‌లో

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

భాగమైన పరిటాల జాగీరులోని మొగులూరు గ్రామంలో 1927 జులై 5వ తేదిన రావూరి భరద్వాజ జన్మించారు. తండ్రి, రావూరి కోటయ్య రైతు, స్వాతంత్ర్య సమరయోధుడు, తల్లి మల్లికాంబ. 20 ఎకరాల భూమి హరించుకుపోగా గుంటూరు జిల్లాలోని తాడికొండకు వలసవెళ్ళారు. రెండో ప్రపంచ యుద్ధంలో టెక్నీషియన్‌గా పనిచేశారు. 1946లో జమీన్ రైతుతో సాహిత్యాన్ని మొదలు పెట్టారు. 1948లో నెల్లూరులో దీనబంధు వారపత్రికలో, అనంతరం జ్యోతి, సమీక్షా, అభిసారిక, చిత్రసీమ, సినిమా, యువ తదితర పత్రికల్లో పనిచేశారు. ఆలిండియా రేడియోలో స్క్రిప్ట్ రైటర్‌గా, వివిధ హోదాలలో పనిచేసి 1987లో పదవీ విరమణ పొందారు. 17వ ఏట నుంచే రచనా జీవితాన్ని కొనసాగించి సుమారు 130 రచనలను తెలుగు సాహిత్యానికి అందించారు. సాహిత్యానికి చేస్తున్న సేవను గుర్తించి 1968లో రాజ్యలక్ష్మి అవార్డు, 1993లో భారతీయ భాషా పరిషత్ అవార్డు లభించాయి.

పాకుడురాళ్ళు, కాందబరి, జీవన సమరం, ఇనుప తెరవెనుక, కౌముది ఆయన రచనా సృష్టికి నిదర్శనాలుగా నిలిచిపోతాయి. ఈయన రచించిన పలు రచనలు ఇంగ్లీష్ లోకి, పలు భారతీయ భాషల్లోకి అనువాద మయ్యాయి. కథారచనలో ఆయనదో విశిష్టశైలి. సామాజిక చైతన్యం మానవతా దృక్పథం ఉన్న రచయిత ప్రత్యేకతను ఆయన రచనలు తెలియజేస్తాయి. పాకుడురాళ్ళు నవలను నాడు మాద్రాస్ ఫిలిం ఇండస్ట్రీస్‌లోని వాతావరణం ఆధారంగా రాశారు. భరద్వాజ

రచనలు పలు విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలుగా, పరిశోధకులకు ఆధారాలుగా నిలిచాయి. 1975లో రావూరి రూపొందించిన రేడియో కార్యక్రమం వ్యవహారిక తెలుగు ఉద్యమానికి ఎంతో దోహదపడింది.

'పాకుడురాళ్ళు' దరిదాపు అర్థశతాబ్దం క్రితం వచ్చిన నవల. అప్పటి తెలుగు సినీరంగాన్ని నేపథ్యంగా తీసుకున్న నవల. 824 పేజీల నిడివితో తెలుగులోని అతిపెద్ద నవలల్లో ఒకటిగా నిలిచిన నవల. అప్పటికీ, ఇప్పటికీ రీడబిలిటీలో రచయితలకి ఇది ఒక పాఠ్యపుస్తకం.

స్థూలంగా చెప్పాలంటే మంగమ్మ ఉరఫ్ మంజరి అన్న నటి జీవన ప్రస్థానం ఈ నవల. గుంటూరు సంప్రదాయ నాటకరంగం దగ్గర ఆరంభమైన కథ నవీన నాటకధోరణి, మద్రాసు సినీరంగం, ధన, కీర్తి కాంక్షలు, ప్రలోభాలతో సాగి బొంబాయి మీదుగా హాలీవుడక్‌కి, మార్లిన్ మన్రో జీవితం వరకూ సాగుతుంది. ఇన్ని అంశాలని సృష్టించినా ఈ నవల కేంద్రబిందువు మాత్రం ఓ స్త్రీ మనసే.

ఈ నవలలో ఎవరి ప్రాపకంలోనో ఉన్న మంగమ్మని నాటకాలలోకి తీసుకువస్తారు మాదవరావు, రామచంద్ర. మంగమ్మ వారికి అన్ని రకాలుగా సహకరించి వారికీ, వారి నాటక సమాజానికి తలలో నాలుకైంది. కొద్దిరోజుల పాటు కొద్ది డబ్బు వస్తుంది. మళ్లీ ఏం చెయ్యాలో తోచని పరిస్థితి. అప్పుడే ఆమెకు చలపతి కలిశాడు. మద్రాసులో సినిమాలో హీరోయిన్‌గా అవకావం వచ్చింది రమ్మన్నాడు. మంగమ్మ చలపతికి లొంగింది. ఆ తర్వాత అతని పనుపున మరికొంత మందికి లొంగింది. మద్రాసు సినీరంగపు మోహం, బాధ, కుత్సితం, అవమానం, నక్కలు, తోడేళ్ళతో సహవాసం అన్నీ అనుభవించింది. చివరకు సినీరంగ ప్రవేశం సాధించి మంగమ్మ నుంచి 'మంజరి' అయింది. అంచెలంచెలుగా ఎదిగి అగ్రనటి మంజరి అయింది. ఏ గుంటూరులో పదీ, పరకకి శరీరాన్ని అమ్మిందో, అదే గుంటూరులో వేలకొద్దీ జనం ఆమెని చూడడానికి తహతహలాడిన గ్లామర్ తార అయింది. కాని తన పాత జీవితాన్ని మర్చిపోలేదు. తన పాత స్నేహితురాళ్లని కూడా. వాళ్లని మద్రాసు తీసుకొచ్చి ఆదరించింది.

అయితే మంజరి చేసే చాలా పనులు తార్కికమైనవి కావు. సాఫీగా జీవితం సాగే అన్ని అవకావాలు ఉన్నా, వనరులు కూడినా మంజరి అలా ఉండదు. అనవసరం అనిపించే పట్టుదలలకి, పంతాలకి మంజరి ఉద్యమించిన సందర్భాలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా బొంబాయిలో సముద్రతీరాన ఇల్లు. దాని కోసం తెగించి ఆవిడ చేసిన పనులు ఆమెకి ఉరితాడయ్యాయి. ఎందుకిలా? అంటే.... అదే జీవితం..... అదే అర్థంకాని మనస్తత్వం.... ఈ

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

తత్త్వాన్ని, సినీరంగపు నేపథ్యంలో ఒక కథగా కాక, రక్తమాంసాలు నిండిన జీవితంగా మలచటం వల్లే పాకుడు రాళ్లు ప్రత్యేక నవలైంది.

**ముగింపు :**

మద్రాసు అంతర్జాతీయ చలనచిత్రోత్సవం మంజరి ఆశల్ని దేశ సరిహద్దులు దాటించింది. విదేశాల ఆహ్వానం పొంది, అమెరికా తదితర దేశాలలో పర్యటించాలనుకొంది. అది సాధించటం కోసం ఎన్నో పాట్లు పడింది. తనకి తనే ప్రచారం, తను పూనుకొన్నట్టు తెలియకుండా విదేశీ ప్రతి నిధులతో పరిచయం. వారితో అన్ని రకాలుగా సంబంధం. చివరికి మంజరి అనుకొన్నది సాధించింది. మార్లిన్ మన్రోతో కలిసి సన్నిహితంగా గడిపింది. ఆమె ఉద్వేగ, ఆశనిరాశల భావాలు తనలోనూ ఉన్నాయని గ్రహించింది. ఇంత ప్రస్థానం సాగించినా మంజరికి ఏదో తపన.... నిలవ నీయని జ్వాల. ఆ జ్వాలల అంతరంగికం ఎన్నో తరాలు.... ఎందరో ఒళ్ళమ్ముకున్న స్త్రీల మానసిక హింసల ప్రతిరూపం. అది కేవలం మంగమ్మ శరీరమే కాదు. శారీరకంగా, అంత కన్నా మానసికంగా స్త్రీ శరీరం పడిన బాధ పట్టించి జ్వాల.... దానికి అంతు లేదు.... ఒక్క పక్క జారుతూ, దెబ్బలు తగు లుతూ ఉన్నా ఇంకా ఎగబ్రాకాలనే ప్రయత్నం అనేది ఈ సినిమా ప్రపంచంలో చాలా మంచిది. పాకుడు రాళ్ళ మయమే అనే విషయాన్ని రావూరి భరద్వాజ గారు ఎంతో సున్నితమైన పదజాలంతో ఒక విషాద గాదగా "పాకుడు రాళ్ళు" నవలను మన కందించారు.

**ఆధార గ్రంథాలు :**

1. పాకుడు రాళ్ళు - రావూరి భరద్వాజ
2. పాకుడు రాళ్ళు - సమీక్ష - ప్రో.వెల్దండ నిత్యానందరావు
3. పాకుడు రాళ్ళు - సమీక్ష - డా॥ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# రావూరి భరద్వాజ గారు – రచన సాహిత్యం

- యం. ఆరోగ్యమేరి
పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

సాహిత్యం అనే పదానికి " సహితస్య భావం సాహిత్యమే" హితేన సహితం సాహిత్యమే "అనే నిర్వచనాలున్నాయి. హితముతో కూడుకున్నది సాహిత్యమని అర్థం. సాహిత్యము సమాజానికి మేలు చేసేది మనుష్యులను సన్మర్గంలో నడిపించేది మానవియ విలువలను నేర్పించేది సాహిత్యము. తెలుగు రచనా ప్రపంచములో వినుత్న సాహిత్య ప్రక్రియను శ్రీకారం చుట్టిన ఘనుడు సాహిత్యము విశిష్ట పురస్కారం అందుకున్న ప్రముఖులలో ప్రముఖుడు.

రావూరి భరద్వాజగారు కలం కార్మికుడు పేదరైతు కుటుంబంలో పుట్టి ఎన్నో కష్టాలు ఎదుర్కున్న ఆయన, పొట్ట నింపుకోవడం కోసమే కలం పట్టి రచయితగా మారాడు. ఆ కాలంలో రచయితగా మారటమంటే సులభ సాధ్యమైన వ్యవహారం కాదు. ఆయన రచయితగా అడుగులు వేస్తూన్న దశలో ప్రముఖ, ప్రఖ్యాత, మహా రచయితలు కవులతో తెలుగు సాహితి ఉద్యానవనం పలు రంగులతో సాంప్రదాయ ప్రగతిశీల రాతులతో గుబాళిస్తుంది. అలాంటి వాతావరణంలో ఒక సామాన్య రచయిత ఎవరో ఒకరి ప్రభావంలో చిక్కుకోక తప్పని స్థితి యుక్త వయస్సులో భరద్వాజ గారిని సహజంగానే చలం ఆవహించారు. అందుకే తొలి దశలో ఆయన చలం శైలిలోనే రచన చేశారు. ఆ రచనలతో ఆయన అందరి దృష్టిని ఆకర్షించాడు.

సాహిత్యరంగం కమనీయమైనదే కాదు కఠోరమైనది కూడా ఆయన మీద చాలా ముద్ర పడిపోయింది. ఆ ముద్రని అధిగమించాలంటే సాహితీ సముద్రాన్ని ఈదటంలో నైపుణ్యం సాధించాలి. ఆయన చదువుకున్నది అంతంత మాత్రమే. అసలే తెలియని వారికి ప్రపంచ సాహిత్యరీతులు తెలిసే అవకాశమే లేదు. తన బలహీనతలనన్నింటినీ సవరించుకుని తన సొంత శైలికి సాధించుకున్నాడు భరద్వాజ గారు. అదీ ఇదీ అని కాకుండా తన సాధ్యమైన సాహిత్య ప్రక్రియ పట్టు సాధించారాయన. పిల్లలకి, పెద్దలకి పాపులర్ సైన్స్ పుస్తకాలు, అనేక నవలలు రాశారు. తెలుగు సాహిత్యంలో స్మృతి సాహిత్యాన్ని పారకులకు అందించారు. ఆల్ ఇన్‌డియాలో చేరి ప్రముఖులతో ఇంటర్వ్యులు చేశారు. వివిధ కార్యక్రమములు నిర్వహించారు. ఈయనకు జ్ఞానపీఠ పురస్కారాలు అనేకమైన అవార్డు పొందుకున్నారు.

రావూరి భరద్వాజ గారి రచనల నుండి కొన్నింటిని వివరించుకుందుము.

1) పాకుడురాళ్ళ నవలలోని కొన్ని సంఘటనలు సన్నివేశాలు, సామాన్య మానవునికి చాలా కొత్త కనిపిస్తాయి. వీటిని అభివ్యక్తం చేయడంలో రచయిత ప్రదర్శించిన చొరవ, తెలుగు అభినందనియమైనది. దారుల ఖండల శాస్త్ర తుల్యములైన వాక్యాలతో శ్రీ భరద్వాజ ఆయన ఘట్టలను చిత్రించిన విధానం అపూర్వంగా ఉన్నది. తను చెప్పదలచుకున్నదేదో బలంగా చెప్పగలిగిన అతి కొద్దిమంది రచయితలలో భరద్వాజ గారు ఒకరు. ఆయన విమర్శ వ్యక్తిగతంగా ఉండదు. ఆ వ్యక్తుల తాలుకా సమాజము, అందులోనే వాతావరణమూ, ఆయన విమర్శ గురి అవుతాయి.

అట్టడుగు నుండి జీవితం ప్రారంభించి ఆకాశ మంత ఎత్తుకు ఎదిగిన ప్రతిభశాలిని మంజరి, నాగ్రో బానిసగా జన్మించి, అమెరికా చరిత్రనే మార్చివేసిన 'జార్జ్ వాషింగ్‌టన్ కార్వర్ : మములు కార్మికుడిగా బ్రతుకు ప్రారం భించి కార్ల సామ్రాజ్యాధిపతిగా సంపాధించిన పెర్సీ – క్రిజర్ : మట్టిలో పుట్టి మణి మందిరాలలో నివసించిన మార్లిన్ మన్రో వీరందరూ అనుసరించిన మార్గాలనే మంజరి కూడా అవలంబించి తమ ధ్యేయాన్ని సాధించుకోవడానికి నిరంతర, కృషి, అవకాశాలను సద్వినియోగం చేసుకోవడమూ, వారి విజయాలకు కారణాలు, మంజరి కూడా ఈ రెండు సూత్రాలను అక్షరాలా పాటించింది. గుంటూరు గుడిసెల్లో తిరిగి, బొంబాయిలోని చలువరాతి మందిరంలో చేరిన ఈ మధ్య కాలంలో – మనకొక విచిత్రమైన చలన చిత్ర ప్రపంచాన్ని చూపించింది.

సినిమారంగం ఆధారంగా తెలుగులో చాలా చిన్న కథ లోచ్చాయి గాని పెద్ద నవల రూపంలో రావడం మాత్రం ఇదే ప్రథమం. కదంబరి నవల నిస్సందేహంగా ఇది గొప్ప నవల ఎందుకంటే ఎంతో కశ్మలం ఉన్న సమకాలిన సమాజంలో నుంచి ఒక వ్యక్తిని ఎంత గొప్పగా నడిపించుకు పోయారు. అతను అవినీతి అనబడే పనులు చేసి ఉండవచ్చు కాని ఎలా మానవత్యానికి కావలసింది. సార్ధకత, వ్యక్తి తన చేష్టల ద్వారా కొన్ని కొన్ని విలువల్ని పరిపోషించడము. ఈ నవలలో చూపించారు.

2) నాకు దేవుని చూడాలని ఉంది, ఈ కథ సాహిత్యంలో దేవుడికి ఒక వ్యక్తితో సంభాషణ జరిగింది ఆ వ్యక్తి దేవున్ని చూడాలనుకుంటాడు అప్పుడు దేవుడు స్వరైన దోవకివచ్చావు. నన్ను అన్ని చోట్ల అన్నివేళల చూస్తునే నా కోసం అన్వేషిస్తున్నావు అంటావేం! సరే ఇంతకి నన్నెందుకు చూడాలనుకుంటున్నావ్? నానుంచి నీకేంకావాలి.

"నీవు దేవుడివో కాదో నాకు తెలియదు "అని అడిగి, పరకాయంచి చూవాను" ఇది వరకు నిన్నెప్పుడూ చూడలేదు కూడా కాని అన్ని చోట్ల నిన్ను నేను చూస్తూనే ఉన్నట్లుగా నువ్వు నొక్కి చెబుతున్నావ్? ఒకవేళ చూస్తున్నా నేమో మరి నిజంగా దేవుడివే అయితే నా కేంకావాలి. నీకీ ఈ పాటికి గ్రహించి ఉండాలి. ఒకవేళ నీవు దేవుడివి కాకపోయినా నాక్కావలసినది ఏమిటో చెప్పడం వల్లనష్టమేమి లేదు. నాకు కావలసినదిగా పుణ్యం పురుషులు చక్రవర్తులై అనుభవించ అష్ట ఐశ్వర్యాలను కోరను మోక్షం నాకు అక్కర లేదు. నా కోరిక అంతమాత్రమే లోకంలోని దుఃఖపీడతల అందరి హృదయాలలో నేను ఉండాలి వారి బాధలు అన్ని నేను అనుభవించాలి వారి దుఃఖాన్ని నేను పోగొట్టాలి. అందుకే ఇలా చేసేందుకు శక్తిని పొందేందుకు నేను దేవున్ని చూడాలని అనుకుంటున్నాను.

3) ఐతరేయం స్మృతి రచనలో తెలుగు సాహిత్యంలో స్మృతి రచనలు చాలా వచ్చాయి కాని దిన చర్యరూపంలో ఐతరేయం కాంతమ్మ మరణించిన నాటి నుండి ఆ సంవత్సరం దాక భరద్వాజ డైరీలో కాంతమ్మను గురించి ఉన్న విషయాలను తేదీల వారిగా ఆ సంపుటీకరించారు. నాలోన నీవు అన్న రచన ప్రచురించబడింది. 1987 సంగలో డైరీలో అంశాలపై "అంతరంగిణిగి" అన్న పేరున రెండో పుస్తకం వెలువడింది. ఈ మూడవది ఐతరేయం ఇది 1988 సంగలో డైరీలోని అంశాలతో కూర్చిన రచన చేతనావరణానికి అవలగా భాసిస్తున్న నిత్య చైతన్య శక్తిని దర్శించాలని తహ తహ, ఒకానొక గుప్తస్మృతిని ఆవిష్కరించాలన్న సాంద్రమై జిజ్ఞాస ఈ మూడు రచనలో స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది.

ఐతరేయం కేవలం కాంతమ్మ గారి కథకాదు భరద్వాజ గారి కథకాదు అదోక అంతర్మధనం సృష్టిలోని వైచిత్రికా స్పందించిన ఒక అర్ష కథనం క్రౌంచ మిధనం పొందిన ఆవేదనతో స్పందించింది. నిమిత్తంతో స్పందించిన ఒక(రస) అర్ధహృదయం నుంచి జాలువారి అక్షర ప్రవంతి ఎక్కడ కాంతమ్మ తల్లి, చెల్లి భార్య, బంధువు, దైవం, అనంత విశ్వం కాంతమ్మ కేవలం ఒక సంకేతం ఇది అర్ధం కాకపోతే కేవలం భార్య వియోగం కావ్యం గానే చాలా మంది భ్రమించ వచ్చు. భరద్వాజ గారి కాంతమ్మ లౌకిక పాటకులకు ఒక స్త్రీ పెద్ద మనిషి గారి ఉత్తమ ఇల్లాలు కాని ఐతరేయంలోని ఆంతర్యం ఇంకా లోతైనది అనంత శక్తి స్వరూపానికి తన అన్వేషణలో పెట్టుకున్న పేరు కాంతమ్మ.

ఇలా ఎన్నో భరద్వాజ గారి జీవితం వడ్డించిన ఇస్తరాకు కాదు. బ్రతుకులోని కష్టాలను కన్నీటికి కడముట్ట చూసినవారు చారడు గంజి కోసం చూసిన, బారెడు గుడ్డ కోసం కలవరించిన వారు ఆకలి అవమానం ఆవిద్య, దారిద్ర్యం, నిరుద్యోగం, నిరాధారణ, పుక్కిలింతలుగా అనుభవించిన వారు జీవన పథంలో కాలూని నిలవడం కోసం రక రకాలుగా వృత్తులు చేసిన వారు ఆ వృత్తులోని సాధక బాధ కాలను కష్టనష్టాలను అమానుషత్వానికి పథిలంగా గుండెల లోతుల్లో దాచుకున్న వారు అయితే అతని అనుభావాలు జ్ఞాపకాలు వృధ్ధా కాలేదు. భరద్వాజ గారు వాటిని వృధా కానివ్వలేదు. కూడా వాటి సారాన్ని వడ్డించి, పిండి, పీల్చుకొని మహా రచయితగా ఎదిగాడు ప్రఖ్యాత రచయిత క్వాజ్ అహమ్మద్ అబ్బాస్ అన్నట్లు భరద్వాజ రచనలో సహజత్వం, లోతు వైవిద్యం వెల్లివిరియడానికి, ఆయన పాత్రలు కాని రచనలు జీవ, చైతన్యంతో స్పందించడానికి విస్తృతమైన ఆయన జీవితానుభవాలు ముఖ్యకారణాలు.

కళాప్రపూర్ణ, కళారత్న, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా॥ రావూరి భరద్వాజ కథా సాహిత్యం

# పిరికివాడు కథానిక – ఇతివృత్త పరిశీలనం

- డా॥ జి.బి.ఆనంద కుమార్
రీడర్, తెలుగుశాఖ,
నోబుల్ కళాశాల, మచిలీపట్నం, కృష్ణా జిల్లా.

తెలుగు సాహితీ ప్రపంచంలో వినూత్నమైన ప్రక్రియలకు శ్రీకారం చుట్టిన ఘనుడు రావూరి భరద్వాజ. సాహిత్యంలో మహోన్నతమైన జ్ఞానపీఠ పురస్కారం పొందినప్పటికీ, ఎంత ఎదిగినా అంతే ఒదిగిన మహాశయుడు యితడు. జీవితంలో కష్టం, నష్టం, బాధ, వేదన, రోదన, ఆకలి, ఆర్తి.. అన్నీ అనుభవించి, దాని నుండి రంగరించిన వాస్తవాలనే తన కలం నుండి జాలువారించాడు. ఆడంబరాలు లేని సాధారణ జీవితమే గడిపాడు. అందుకే – మధ్య తరగతి, పేద ప్రజల భాషపై ఈ కవికి మంచి పట్టు ఉంటుంది. సాధారణమైన బీద కుటుంబంలోనే జన్మించాడు. తెలుగు సాహితీలోకాన విభిన్న ప్రక్రియల్లో రచనలు చేసి, ఎన్నో బిరుదులు, మరెన్నో సత్కారాలు పొందిన ఈ కవి వరేణ్యుడు చదివింది కవలం 7వ తరగతి అంటే ఆశ్చర్యమనిపిస్తుంది. తన జీవిత ప్రస్తానాన్ని కాయకష్టంతోనే ప్రారంబించాడు. బాల్యంలో తన జీవితంలో పొలాల మధ్యే గడించిపోయింది. వ్యవసాయ కూలీగానే జీవితంలో ఆటుపోట్లు ఎదుర్కొన్నాడు. బీడుబారిన పల్లెల్లో ఆకలితో అలమటించే అభాగ్యుల మద్యే ఎదిగాడు, దానితో పాటు వారి కఠినమైన జీవన పరిస్థితుల్ని గమనించాడు. పల్లె ప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపతాపాలు యివన్నీ కవి జీవితంలో మమేకమైపోయాయి. ఈ అనుభవాలు తర్వాత కాలంలో నిజమైన పల్లెటూరి వాతావరణాన్ని సృష్టించుకోవడానికి ఉపయోగించుకున్నాడు.

## రావూరి భరధ్వజ రచనలు :

| | |
|---|---|
| పుస్తకాలు | – 187 |
| కథలు | – 500 |
| సంకలనాలు | – 37 |
| నవలలు | – 19 |
| నాటకాలు | – 10 |

రావూరి భరద్వాజపై పరిశోధనలు చేసిన శ్రీనివాస్ గారి వివరణ మేరకు పై సూచిక యిప్పించుట జరిగింది. రావూరి భరద్వాజ తొలికథ 16 సం॥ వయస్సులో రచించాడు. **ఈ కవిపై చలం ప్రభావం చాలా ఎక్కువగా వుంది. ఆయన్ని అనుసరిస్తూనే అనేక సెక్సు కథలు వ్రాశాడు.** ఏ మాత్రం జంకూ, గొంకూ లేకుండా రాయడం ఈయన ప్రత్యేకత. తెలుగుదేశాన అనేక పత్రికలు ఆయన వ్యాసాంగాన్ని ప్రోత్సహించాయి.

## రావూరి భరద్వాజ రచనలు – అంశములు :

భరద్వాజ గారి రచనల్లో ప్రముఖంగా ఈ అంశములు కనిపిస్తాయి.

1. విచిత్రమైన మానవ భావోద్వేగాలు.
2. పాత చిత్రణ.
3. సరళమైన భాష.
4. సన్నివేశాన్ని పరిచయం చేయుడంలో ఒడుపు.
5. మానవ సంబంధాలు.
6. నాటకీయత.
7. హృద్యమైన రచన.

## డా॥ రావూరి భరద్వాజ 'పిరికివాడు' కథానిక – ఇతివృత్త పరిశీలనం :

ఈ కథల సంపుటి ప్రథమముద్రణ 1956లో జరిగింది. భగవంతుడు ఈ జీవన పరిణామక్రమంలో అందంగా, ఆనందంగా, బ్రతకడానికి, అజరామరమైన ఆనందాన్ని ఆస్వాదిస్తూ, అనుభవస్తూ, సరస సంభాషణం చేస్తూ, అమృత పానం చేస్తూ, హాయిగా విహరించడానికి సృష్టించిబడినదే మానవ జీవితం. ఉదాత్తమైన ఈ మానవ జీవితంలో ఆదర్శంగా బ్రతుకుతూ, మరొకరికి మాదిరిగా వుండటం సశ్చీలుని లక్షణం కూడా.

ఈ మానవ జీవితంలో అత్యంత మధురమైనది దాంపత్య జీవనం. ఒకరికి ఒకరు తోడుగా, నీడగా, హాయిగా, ఆనం దంగా అల్లుకుపోతూ, జీవితాల్ని యిద్దరిగా కాకుండా 'ఒక్కటి'గా కలిసిపోయి, సాగిపోయే ఆనందలహరి దాంపత్య జీవనం.

ఒకరికి ఒకరుగా –
ఆ ఒకరే ప్రేమగా –
ఆ ప్రేమే మృధు మధురంగా –
ఆ మధురమే అమృతపానంగా –
ఆ పానమే అజరామరంగా –
అల్లుకుపోయే అజరామరంగా –
అల్లుకుపోయేది, ఒదిగిపోయేది దాంపత్య జీవనం.

డా॥ రావూరి భరద్వాజ కలం నుండి జాలువారిని మహ త్తరమైన కథ 'పిరికివాడు'.

ఈ కథలలోని పాత్రలు ప్రధానంగా రెండు.

1. వెంకటేశ్వర్లు.
2. అనసూయ.

సీతాపతి అనసూయ దంపతులు. పేరుకు మాత్రం దంప తులు గానీ, చాలా సంగతులు ఈ కథలో రచయిత వ్యక్తం చేశారు. సీతాపతి సాధారణమైన భర్త. ఆఫీసుకు వెళ్ళతూ, పని చెయ్యటం, తలొంచుకొని యింటికి రావటం, భార్య వడ్డించింది మారు మాట్లాడకుండా తినటం, పడక గదికి చేరటం. భార్యను దగ్గరగా తీసుకోవటం, ఏదో... ఏదో... ఏదో... అంతే జీవితం! మంచి భర్తే కానీ.

అనసూయ సంగతి వేరు. ఈమె కాంక్షంచిన జీవితం వేరు. భర్తతో నవ్వూతూ ఉండాలి, చలాకీగా ఉండాలి, నవ్వాలి, నవ్వించాలి, సరస సంభాషణ ఉండాలి. స్వర్గధామా నికి తీసుకెళ్ళాలి. కానీ, సంతోషానికి విచారానికి కూడా తారతమ్యం తెలియని ఒక ముఖాన్ని చూసింది., ఊసు లాడాలి. కబుర్లు చెప్పాలి, దగ్గరకు తీసుకోవాలి. గుండెల్లో హత్తుకోవాలి. అతని చేతుల తంత్రులతో తన శరీరం నుండి ఎంతో సంగీతం వినిపించాలి. తాను తమకంతో అతడ్ని అల్లుకుపోవాలి. ప్రతిరాత్రీ వసంత రాత్రిలా, అతనితో మమేక మైపోతూ స్వర్గపుటంచుల్లో తేలిపోవాలి. యిది కేవలం అనసూయకు స్వప్నంగానే మిగిలి పోయింది. పెళ్ళి అయిన మరునాటి నుండే – తన ఆశల సౌధం కూలిపోయింది. స్వర్గానికి పయనమవ్వాలనే తన రెక్కలు కత్తిరించబడ్డాయి. అనసూయ ఊహించింది ఒకటి, జరుగుతున్నది మరొకటి. ఏదో తెలియని అగాధం – ఏదోశూన్యత – ఏదో నిర్లిప్తత – జీవితంలో అనసూయకు లోటేమి లేదు. లోటు మనస్సుకు మాత్రమే! అలా నిస్సారంగా సాగిపోతున్న తరుణంలోనే – వెంకటేశ్వర్లు పరిచమయ్యాడు. ఆమెను ప్రత్యేకంగా చూడటం మొదలు పెట్టాడు. వెంకటేశ్వర్లు బ్రహ్మచారే. అనసూయకు యితని మొదటి పరిచయంలోనే అతడు పలికిన మొదటి మాట. **"నువ్వు దేవకన్యవు".** ఈ మాటలో అనసూయకు కొత్త మొగ్గలు తొడిగింది. పెళ్లయిన 2 సం॥గా తన భర్త ఈ మాట ఎన్నడూ అనలేదు. అనసూయ అంద గత్తే! ముమ్మాటికి వాస్తవం. కళ్ళు తిప్పుకోలేని అందం ఆమెది. అందమైన ముఖం. ముఖానికి తగ్గ కళ్ళు, చిలిపి కళ్ళు. ఒంపులు తిరిగిన శరీరం బాపు బొమ్మలాగే ఉంది. ఆనాటి నుండి వెంకటేశ్వర్లు తరచూ అనసూయ యింటికి వస్తూనే వున్నాడు. యితను రాక పూర్వం అనసూయ జీవితం వేరు. యితని పరిచయం తర్వాత ఏదో క్రొత్తగా ఉంది. వెంకటేశ్వర్లు ప్రతి విషయంలో అనసూయను అభినం దిస్తాడు, అనందింపచేస్తాడు, నవ్విస్తాడు, యింతకు పూర్వం జీవితం అనసూయలో కొత్త ఆలోచనలు పుట్టించాయి. ఏదో వెలితి, అసంతృప్తి. వెంకటేశ్వర్లులో ఏదో ఆకర్షణ ఉంది. అతను రాకపోతే, కనిపించకపోతే అనసూయకు ఏదో పోగొట్టుకున్నట్లు, భూమి గుండ్రంగా తిరుగకుండా మానేసి నట్లు అనిపించింది. అతని మాటలో, చేతలో, తన మీద ఏదో 'ప్రత్యేక శ్రద్ధ' కనపరుస్తున్నట్లు అనసూయకు అనిపిం చింది. అనసూయే వెంకటేశ్వర్లుగా అతను భావించాడు. ఆమెను ఆకాశానికి పొగిడాడు. ఎంతో అందమైన కవి త్వంతో ఆమెను యిరుకున పెట్టాడు. అనసూయకు అర్థమై పోయింది. వెంకటేశ్వర్లు తన మనస్సులో తిష్టవేసాడని. ఈ కథలో ఆమెలోని అంతర్మథనాన్ని రావూరి భరద్వాజ చక్కగా అభివర్ణిస్తారు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

చివరకు ఒకానొక నిశిరాత్రి, అనసూయతో వెంకటేశ్వర్లు లేచిపోయాడు. ఒక గృహిణి హఠాత్తుగా బ్రహ్మచారితో వెళ్ళి పోవడానికి ఎన్నో బలమైన కారణాలుండాలి. ఈ కారణాన్ని రావూరి భరద్వాజ తన కథలో సహేతుకంగా విశ్లేషించాడు. వెంకటేశ్వర్లు అనసూయకు చెప్పే మాటలు కొత్తగా ఉన్నాయి. ఆమె పట్ల అతను చేసే చేతలు కొత్తగా ఉన్నాయి. అతని స్పర్శ ఆమెను ఎన్నెన్నో లోకాలకు తీసుకెళ్ళిపోయింది. అతని లాలన స్వర్గంలా అనిపించింది. ఇన్ని మాటలేల? వెంక టేశ్వర్లు సాన్నిధ్యంలో ఆమె కర్పూరంలా ఒదిగిపోయింది, అనసూయకు ఇవేవి ఇంతక్రితం జీవితంలో లభించలేదు. ఏది నిజమైన ప్రేమో తెలుసుకునే పరిస్థితులలో ఇక్కడ అనసూయ లేదు. ముచ్చటగా మూడు మాసాలు పగలే వెన్నెల లాగా, జగమే ఊయలలాగా స్వర్గపుటంచులలో తేలి యాడారు. కొత్త కొత్త భంగిమలలో, ఆమెకు కొత్త జీవితాన్ని గ్రోలింపచేసాడు. తరువాత – వెంకటేశ్వర్లులో మార్పు వచ్చింది క్రమేణా. ఇది గమనించింది అనసూయ. ఏదో పరధ్యానం, ఏదో ఆలోచన. ఆ ఆత్రం లేదు, ఆనందం లేదు, అభిరుచి లేదు. ఏదో యాంత్రికంగా.... అదే అడిగింది అనసూయ. ఏం లేదని కొట్టిపారేశాడు వెంకటేశ్వర్లు. అతనిలో మార్పును గమనిస్తూనే ఉంది అనసూయ. ఇది తట్టుకోలేకపోయింది. హఠాత్తుగా ఒకరోజు వెంకటేశ్వర్లు ఆమెను అడిగాడు –

"నీకు నేనంటే ప్రేమేనా"?

'అవును'

'మరి ఆయనంటే'

'ప్రేమే'

'మరి ఎందుకు వదిలి నాతోవచ్చావు'?

'నువ్వంటే మరీ ప్రేమ'

'రేపు మరొకరు వస్తే'!

'వస్తే'?

'యిదేమాటంటావా'! అప్పుడు కూడా నన్ను వదిలేసి వాడితో వెళ్ళిపోతావుగా!

హృదయాలను పిండి పిండి చేసే మాటల తూటాలు భరద్వాజ పలికించాడు. కథకు ముగింపు చెప్పటం బహుశా రచయితకే చెల్లింది. అతను కొట్టాడు, తన్నాడు, గోడకేసి తలను బాదాడు, మరీ రాక్షసుడయ్యాడు.

**"అనసూయ ఏడ్చి ఏడ్చి ఓపికలేక అలసి నిద్రపోయింది. ఉదయం లేచే సరికి వెంకటేశ్వర్లు పక్క ఖాళీగా ఉంది. అంతే! ఆ తరువాత కూడా అనసూయకు ఎప్పుడు కనిపించ లేదు".**

## ముగింపు :

సముద్రంలో అలలు ఒకదానికి ఒకటి కొట్టుకుంటూ సాగరానికి చేరతాయి. అందులో పయనించే నావ మాత్రం.. అలాగే ..

అనసూయ జీవితంలో ఆటుపోట్లని, నిజానిజాలను తెలుసుకోలేని సందిగ్ధంలో, అసలు భర్తకు దూరమై, సిసలు వెంకటేశ్వర్లు మాటలు నమ్మి, వెళ్ళి, విలువైనవి పోగొట్టుకొని, కాని ప్రాంతంలో చిరునామా లేనిదానిగా మిగిలిపోయింది. మాటలు, చేతలు, మాయచేష్టలు.. అన్నింటితో ఆమెను లోబర్చుకొని, ఆమెపట్లే శాడిస్టుగా మారి, అనుమాన పెను భూతంతో 'పిరికివాడు'గా మిగిలిపోయాడు వెంకటేశ్వర్లు. విచిత్రమైన మానవ సంబంధాలకు, మనసు మమతల ఆత్మ సంఘర్షణకు, ప్రేమ – కామం మధ్యనున్న సన్నని, నున్నటి రేఖకు భాష్యం చెబుతూ ఆద్యంతం, అద్భుతంగా డా॥ రావూరి భరద్వాజ కలం నుండి జాలువారిన కథే ఈ 'పిరికివాడు'.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# "బీడువారిన మెదళ్ళను దున్నే నాగలి – రావూరి భరద్వాజ సాహిత్యం"

## ('లోకం కోసం' నుండి కొన్ని కథల సమాహారం)

- దాసరి విజయలక్ష్మి
తెలుగు అధ్యాపకులు,
జె.యం.జె మహిళా కళాశాల(స్వయం ప్రతిపత్తి), తెనాలి.

**శర్వరీ దీపకోశ్చంద్ర:**
**ప్రభాతో దీపకో రవి:**
**త్రైలోక్య దీపకో ధర్మ:**
**సుపుత్ర కుల దీపక:**

అని పండితుల మాట...! అంటే రాత్రికి చంద్రుడు వెలుగునిస్తే, పగటికి సూర్యుడు వెలుగునిస్తాడు, ముల్లో కాలనూ ధర్మమే వెలిగిస్తుంది, (భూమిమీద వున్న మనం, ఉందో లేదో తెలియని స్వర్గ, నరకాన్ని విశ్వసిస్తున్న కర్మ భూమి మనది. ఈ నేలపై యేనాటికైనా అంతిమంగా వర్ధి ల్లాల్సినది ధర్మమే కాబట్టి) వంశాన్ని నిలబెట్టేవాడు మరియు వెలిగించేవాడు కొడుకే అని అర్థం.

నిజమే...! వాస్తవానికి ఈ సమాజపు ఆలోచనల ధోరణి కూడా, గచ్చపొదలతో దట్టంగా నిండి బీడువారినట్లుంది. అటువంటి ఈ మానవ సమాజాల యొక్క మెదళ్ళను దున్ని, నూతన సమాజానికి దారులు వేసేది, ఈ సమాజాల్ని సస్య శ్యామలభరితం చేయగలిగేది ఒక నిబద్ధుడైన సాహిత్య కారుడు మాత్రమే. అటువంటి బలమైన నిబద్ధ సాహిత్య కారుడు రావూరి భరద్వాజ. శ్రీశ్రీ అన్నట్లు 'నాలో కదిలే నవ్య కవిత్వం, కార్మిక లోకపు కళ్యాణానికి, శ్రామిక లోకపు సౌభాగ్యానికి, సమర్పణంగా, సమర్చనంగా త్రికాలాలలో, త్రిలోకాలలో, బావి వేదముల జీవనాదముల జగత్తుకంగా చవులిస్తానోయ్'. అన్నట్లు రావూరి భరద్వాజ గారి సాహిత్యం కూడా సామాజిక హితమైనదే.రావూరి భరద్వాజ సామాజిక పరిస్థితులకు వాస్తవ రూపాన్నిస్తూ, మానవ వ్యక్తిత్వాలను సమున్నతంగా తీర్చిదిద్దే ప్రయత్నాన్ని బలంగా చేసిన అక్షర సేద్యగాడు.

గతించిన చరిత్ర తాలూకూ అనుభవాలు, వర్తమాన సమాజానికే కాక, కాక భవిష్యత్తు సమాజాలకూ ఒక ప్రేరణ. అలాంటి ప్రేరణను అనునిత్యం కలిగిస్తూ, ఈ సమాజాన్ని ఉన్నచోటునుండి ఉన్నతమైన చోటుకి నడిపించే ఒక అద్భుతమైన ప్రక్రియ సాహిత్య ప్రక్రియ. మంచి సాహిత్యం సమాజాన్ని నిరంతరం ప్రేరేపిస్తుంది. అలాంటి ప్రేరణను కలిగించే సాహిత్యాన్ని, సాహిత్యకారులను స్మరించుకోవట మనేది నేటి సమాజానికి చాలా అవసరం. అటువంటి సాహిత్యకారుల్లో డాక్టర్ రావూరి భరద్వాజ ఒకరు. వీరి రచనల్లోని కలానికున్న బలం, బీడువారిన మానవ మెదళ్ళను దున్నే బలమైన నాగలి కర్రుకున్నట్టి పదునైనతత్వం, అదే మానవత్వం. "చిన్న తనంలో లేమికారణంగానే నేను చదువు కోలేక పోయాననే భావం, నా ప్రతీ రక్త కణాన్ని ఎంత సంక్షోభానికి గురిచేసిందో నాకు తెలుసు. లేమి కారణంగా ఎవ్వరూ చదువుకోకుండా వుండరాదనేది నా నిశ్చితాభి ప్రాయం, అదే నా జీవితేచ్ఛ". అని తన వ్యక్తిత్వాన్ని ప్రక టించుకున్న రావూరి భరద్వాజ, అట్టడుగు మనుష్యుల ఇతి బాధల్ని కథలుగా అల్లి ఒక ఉద్యమంలా తీసుకువచ్చారు. అందుకే భరద్వాజ సాహిత్య రంగంలో ఏదిరాసినా.... ఏదిచేసినా ' రావూరి వారిది – రతనాల వారధి,' అంటూ సాహిత్య విమర్శకులు పేర్కొం టారు. అటువంటి వారధిని నిర్మించారు కాబట్టే రావూరికి జ్ఞానపీఠ్ అవార్డు వెతుక్కుంటూ వచ్చింది.

పేదరికంలో పుట్టినతనని యెన్నో అష్టకష్టాలు కోరి వరిం చేవి. కానీ వాటన్నిటినీ భరద్వాజ నిజాయతీతో అధిగ మించిన అభ్యుదయవాది. చిన్న వయసునుండే రచనా వ్యాసాంగ మార్గాన పయనిస్తూ, మానవీయ బంధాలను, సంబంధాలను అనునిత్యం పరిశీలించిన స్వీయ అభ్యా సకుడు. తన జీవితంలో అనునిత్యం యెదురైన అనేకానేక పరిస్థితులను, అనుభవాలను, పుస్తకాల కళ్ళజోడుతోగాక అనుభవ నేపథ్యంతో గ్రహించి, లోకమనే విశ్వవిద్యా

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

లయంలో తాను గ్రహించిన విషయాలనే సాహిత్య వస్తువుగా స్వీకరించి వాటికి అద్భుతమైన మానవీయ కోణాన్ని జోడించి రచనలు చేసిన సహజ కవి రావూరి భరద్వాజ. భారతీయ సాహిత్యరంగంలోనే అత్యున్నత పురస్కారమైన జ్ఞానపీఠ అవార్డును సొంతం చేసుకున్న తెలుగు సాహితీ మూర్తులలో ఒకరైన రావూరి భరద్వాజ సాహితీ సేద్యానికి లభించిన విశిష్ఠ పురస్కారమే ఈ జ్ఞానపీఠ్. ఈ అద్భుతమైన ఘట్టం తాను పుట్టి పెరిగిన ప్రాంత వాసులకే కాక, యావత్ తెలుగు నేలకు గర్వకారణం. అంతటి ఘన కీర్తిని సాధించించిన సాహితీసూర్యుడే ఈ భరద్వాజుడు.

రావూరి భరద్వాజ రచనలు అధిక భాగం సామాన్య మానవుని, సాంఘీక జీవన చిత్రాన్ని పెనవేసుకుని కొన సాగేవిగానే కనిపిస్తాయి. అందుకు కారణం భరధ్వాజ బాల్యం నుండి పెరిగిన నేపథ్యమే. యే రచయితకైనా ఒక రచన ప్రారంభించేటప్పుడు, సమాజంలో అతనికి వుండే సంబంధం, సగటు వ్యక్తిగానే తప్ప ప్రత్యేకంగా ఏమీ వుండదు.కాకపోతే అతనిచే సృష్టించబడే సాహిత్యం ద్వారానే ఆ రచయితకు ఈ సమాజంలో ప్రత్యేకమైనవిశిష్టత అనేది లభిస్తుంది. అటువంటి విశిష్టత సాధించిన అతికొద్దిమంది (ముగ్గురిలో) తెలుగు సాహిత్యకారులలో రావూరి భరద్వాజ ఒకరు. రావూరి భరద్వాజ తన సాహిత్యంలో సహజత్వం ఉట్టిపడేట్టు రచనలు చేసే ఒక సహజకవి.

రావూరి భరద్వాజ ప్రస్థానాన్ని ఒకసారి క్లుప్తంగా అవ లోకన చేస్తే బొగ్గుల శ్రీనివాస్(రావూరి రచనలపై పరిశోధ కుడు) ప్రకారం భరద్వాజ సుమారు 187 పైగా పుస్తకాలను, 500 పైగా కథలను 37 సంకలనాలుగా, 19 నవలలు, 10 నాటకాలు రాశారు.ప్రస్తుతం వీటిలో చాలా దొరకడం లేదు. ఇంకా ప్రచురించాల్సినవీ కొన్ని ఉన్నాయి. మట్టి వాసనతో ప్రవేశించిన మనిషి మన భరద్వాజుడు 2013 అక్టోబరు18న భౌతికంగా మన ముందు నుండి మౌనంగా నిష్క్రమించినా పాఠకుడి మనసులో ఎప్పటికీ నిలిచే ఉం టాడు. మట్టిలో మాణిక్యాల గురించి జాషువా ఇలా అంటాడు... "ఎంతకోయిలపాట వృథయయ్యెనో కదా... చిక్కు చీకటి వనసీమలందు..ఎన్ని వెన్నెలవాగు లింకి పోయెనొ కదా కటిక కొండలమీద మిటికరించి...ఎన్ని కస్తురిజింక లీడేరెనో కదా మురికి తెన్నెలమీద పరిమళించి... ఎన్ని ముత్తెపురాలు భిన్నమయ్యెని కదా పండిన వెదురు జొంపముల లోన... ఎంత గంధవహన మెంత తంగెటి జున్ను యెంత రత్న కాంతి యెంత శాంతి ప్రకృతి గర్భ మందు! భగ్నమైపోయెనో పుట్టరానిచోట బుట్టకతన". భర ద్వాజ పీడిత ప్రజల, శ్రామిక వర్గపు రచయిత. రావూరి చాలా చిన్నవయసునుంచే రాయడం కూడా ఒక విశేషం. అలా రాయడం వలన సాహిత్యంలో రావూరి పరిధిని, బాధ్య తను పెంచింది. ప్రతి రచన పాఠకున్ని చదివింపచేస్తుంది తప్ప, శ్రమింపచేయవు. ఎందుకంటే రావూరి ప్రజల సమస్య లను దూరంనుంచి చూడటంకాదు, దగ్గరుండి వారి జీవి తాల్ని గమనించినట్టి అనుభవ పూర్వక వాస్తవ జీవనచిత్రణ, కనిపిస్తుంది. మార్పు అనేది మనిషి రచనలోకాదు, మనిషి మనస్సులోంచి రావాలి. ఇలా రావూరి భరద్వాజ ప్రతి రచన లోనూ పాఠకుడి గుండెను పట్టి కుదిపే తత్వం కనిపిస్తుంది.

రావూరి భరద్వాజ ఎన్నో ఒడిదుడుకులతో ఏడవ తరగతి వరకు మాత్రమే చదివి మానేసినా, ఆయన రచనలే రావూరికి మూడు విశ్వవిద్యాలయాలనుంచి (ఆంధ్ర, నాగార్జున, హైదరాబాదు) గౌరవ డాక్టరేట్ డిగ్రీ పట్టాలను పొందారు. రావూరి దాదాపు 150దాకా రచనలను తెలుగు సాహిత్యానికి అందించారు. సాహిత్యానికి చేసిన సేవనే రావూరికి కళా ప్రపూర్ణ బిరుదు, 1968లో రాష్ట్ర సాహిత్య అకాడమి అవార్డు, 1983లో కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు, 1986లో సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు, 1987లో రాజ్యలక్ష్మి అవార్డు, 1993లో భారతీయ భాషాపరిషత్ అవార్డులూ లభించాయి. ఆ తరువాత 2012 సంవత్సరానికిగాను, 2013 ఏప్రిల్ 17న 'జ్ఞానపీఠ్' అవార్డుకు ఎన్నికయ్యాడు. తెలుగు నవలా సాహిత్యంలో జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందిన తొలి వ్యక్తిగా కీర్తి గడించాడు.

పేదరికం, ఈసడింపులు, కటిక దరిద్రాలు, ఆకలి రావూరికి మిత్రులు. అందుకే ప్రతి రచనలో తన హృదయం

ద్రవీభవిస్తుంది. మానవీయ విలువలు హృదయాలలో విత్తే సాహిత్యాన్నే రావూరి అక్షరరూపంలో పట్టంకట్టాడు. సమాజంలో జరిగిన, జరుగుతున్న లోపాలను, జరగబోయే కాలంలో చేసుకోవాల్సిన మార్పులను సరైన రీతిలో అక్షర రూపంలో సమాజానికి అందించే సాహితీకారుడు సృజన శీలుడు మన రావూరి. ఈ కోవలో ప్రథమవరుసలో చెప్పు కోదగ్గ అక్షరశిల్పి. అందుకే ఆయన సాహిత్యం మానవీయ విలులు విత్తే సాహిత్యం.

1959లో రావూరి 'పాకుడురాళ్ళు' నవలను మొదట కృష్ణా పత్రికలో సీరియల్‌గా రాశారు. అది 1965నాటికి తొలి ముద్రణలోకి వచ్చింది. ఇప్పటి వరకూ ఆరు ముద్రణలు పొందింది. (1959లో పాకుడురాళ్ళు నవల పేరు 'మాయా జలతారు' తరువాత 1965లో శీలా వీర్రాజు ఈ నవలకు 'పాకుడురాళ్ళు' అనే పేరును సూచించారు)

86 సంవత్సారాల అక్షరకృషి దాదాపు 150పైకి పుస్తకాలు (రచనలు) రచించారు. అందులో దాదాపు 600 దాకా కథానికలు, 19 నవలలు, బాలలకోసం 7 నవలికలు, 3 వ్యాససంపుటాలు, 33వైజ్ఞానిక వ్యాసాలు, 8 నాటకాలు మొ॥వి ఇంతటి విస్తృతమైన సాహితీ సేద్యంలో భరద్వాజ రచనా శిల్పం విశిష్టమైనది. గుడిపాటి వెంకటచలం నుండి ఎంతో ప్రేరణపొందిన భరద్వాజ రచనల్లోని శిల్పం చదివే పాఠకుడికి యే రచన భరద్వాజదో యే రచన చలం ది అని పోల్చుకునేందుకు కొంచెం కష్టంగా అనిపించక తప్పదు. దీనిని బట్టి రావూరిపై చలం ప్రభావం చెప్పకనే కనిపిస్తుంది. అంతటి ప్రతిభామూర్తి రావూరి భరద్వాజ కథానికల సంపుటాలలో మనం వెతికితే దొరకని అంశమంటూ కన్పించదు. అందుకే భరద్వాజది చూడగలిగిన దృష్టి, రాయగలిగిన నేర్పుతో కూడుకున్నది. వారి రచనా శైలి చాలా విలక్షన మైనది, యే చిన్న సన్నివేశాన్ని చూసినా దానిలోని లోతు పాతులను అవగాహనతో కూడిన ఆకళింపు చేసేకునిఆ అఉభూతులను అనుభవాలను తన రచనల్లో పొందు పరుస్తాడు. ' భరద్వాజ ప్రత్యేకత యేమిటంటే ఎవరికీ పనికి రాని దానిలో నుండి కొందరికైనా పనికొచ్చే అంశాన్ని ప్రస్థావిస్తూ రచనలు చేయటం రావూరి ప్రత్యేకత. ఈయన కథానికలలో ఒక్కోక్క దానికి ఒక్కోక్క ప్రత్యేకత వుంది. అందులో లోకం కోసం అనే కథానికల సంపుటిలో మొత్తం పదకొండు కథలున్నాయి. దీనిని 1956లో రచించారు. అవి 1) లోకంకోసం,2) ఆహిరి, 3) నీతిస్తంభం, 4)అనుమానం, 5) కన్నకడుపు, 6) సంతానం, 7)పల్లెపటు, 8) అభ్యుదయం, 9)కడుపుతీపి, 10) ప్రవృత్తులు, 11) అద్దెకొంప – ఈ కథానికల్లో కొన్ని కథలను సంక్షిప్తంగా విశ్లేషిస్తే

## లోకంకోసం :

మొదటి కథ "లోకం కోసం" నరసమ్మ పెళ్ళైన స్త్రీ. భర్త ముసలివాడు, బలం లేనివాడు కాదు. కానీ మరొకరితో రహస్యంగా సంబంధం పెట్టుకుంది. ఆ విషయం నరసమ్మ భర్తకు తెలిసినప్పటికీ ఏమీ అనడు కారణమేమిటో తెలీదు. నరసమ్మ ఈ విషయం తన ప్రేమికునికి చెప్తుంది. అప్పటి నుండి ఇద్దరూ సంబంధాన్ని బహిరంగంగానే కొనసాగిస్తారు. తన కళ్ళ ముందే వాళ్ళ వ్యవహారాలను సహించలేక నరసమ్మ భర్త అతన్ని కొడతాడు. దీనంతటికి కారణం మన సంబంధం బహిరంగం కావడమేనని అందుకే అతడు ఇలా ప్రవర్తించాల్సి వచ్చిందని నరసమ్మతో చెప్తాడు తాను సంబంధం పెట్టుకున్న వ్యక్తి. ఇది కథా సారాంశం.

లోకం సహించలేని, అంగీకరించలేని ఏ సంబంధానైనా రహస్యంగానే కొనసాగించాలి. ఎందుకంటే సమాజం కోసం అని రచయిత చెప్పుకొస్తాడు. ఏ పనికైనా కష్టపడాల్సిందే లేకపోతే సుఖం వరించదని హితబోధ చేస్తాడు రచయిత "సుఖం అనే లాభానికి ఈ కష్టం పెట్టుబడి లాంటిది".

(పేజి. నెం.3 లోకం కోసం)

"అందులో ఇది మాములు సుఖం కాదు అన్నింటి కంటే గొప్పది". అన్నింటి కంటే లోకంలో లైంగిక సుఖం గొప్పది అంటాడు రచయిత. కనుకనే నరసమ్మ మొగుడు అంగీ కరించాడు. కానీ ఎందుకు ఇలా ప్రవర్తించాడంటే "లోకం దృష్టిలో తన విలువ నిలబెట్టుకోలేని దాని కోసం కనీసం నిలబెట్టుకొన్నాడనే ఆత్మ తృప్తి కోసం, అతనీపని చేశాడే

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

తప్పా నరసమ్మ చేసిన పనిని, నరసమ్మను సహించలేక మాత్రం కాదు.

"ఒక పని ఎంత నీచమైనదయినా నువ్వు రహస్యంగా చెయ్యి, అవి రహస్యంగా వున్నంత కాలం నిన్నేవ్వరూ ఏమీ అనరు కాని దాని గురించి బహిరంగంగా మాట్లాడబోకు దాన్ని వెల్లడి చెయ్యబోకు లోకం సహించదు. తమ కోసం తాము బ్రతికే వాళ్ళ కన్నా తమని తాము చంపుకోని సమాజం కోసం బతికే వాళ్ళే ఎక్కువగా వున్న ఈ సమాజంలో ఈ కథ చాలా అవసరమనిపిస్తోంది. ఓ వ్యక్తి తన వ్యక్తిగత జీవితంలోని లోపాల్ని లేదా తప్పుల్ని సరిదిద్దు కోకపోతే జరిగే అనర్థాలను తెలిపేదే ఈ లోకంకోసం కథ. ఇందులో నరసమ్మ ప్రధానపాత్ర. ఆమె కాపురానికి వచ్చిన తొలిరోజునుంచీ ఆమె ప్రవర్తనను గమనిస్తున్నాడు. ఆమెచేసే తప్పులను సున్నితంగా వారించినా, గదిలో పెట్టి తాళంవేసి, తిండినీళ్ళు లేకుండా మాడ్చినా ఆమె తన పద్ధతి మార్చు కోలేదు. అది ఆమె బలహీనత అని గ్రహించి చూసీచూడ నట్టు పోతున్నాడు.

రోజూలాగే గోడదూకి వచ్చాడు అపరిచితవ్యక్తి. గడ్డి వాముచాటునచేరి నరసమ్మకోసం ఎదురుచూస్తున్నాడు. వీరి వ్యవహారం రెండునెలలగా సాగుతోంది. ఇది ఆమె భర్త గమనించినా, తెలియనట్టే ఊరుకున్నాడు. ఇన్నాళ్ళూ నర సమ్మ భర్తకు ఈ విషయం తెలియదని భావించాడు అపరిచిత వ్యక్తి. తీరా ఆమె భర్తకు విషయం తెలుసునని తెలిశాక, నేరుగా ఇంటికే రావడం ప్రారంభించాడు. వారం రోజులు బాగానే సాగింది. రోజూలాగే ఇంటికి వచ్చాడు. ఆమె భర్త ఒక బడిత తీసుకొని గుమ్మంలో భీకరంగా నిలబడి ఉన్నాడు. లోపలి నుండి నరసమ్మ ఏడుపు వినిపిస్తోంది. ఇంటిలోకి వెళ్తుండగా 'ఈ రోజునుండి ఈ ఇంటి గడప తొక్కావంటే డొక్కచీల్చి ఎండేస్తాను. నాలుగు కాలాల పాటు బతకదలచుకొంటే వెంటనే తిరిగి వెళ్ళిపో' అని గద్దించాడు.

ఇన్నాళ్లుగా భార్య చేసే తప్పుల్ని, బలహీనతల్ని సహించ డానికి కారణం భర్తకు ఆమెపై ఉన్న ప్రేమ. ఆ ప్రేమను అర్థం చేసుకోకుండా, దాన్ని అలుసుగా తీసుకొని అజ్ఞానంతో విచ్చలవిడిగా ప్రవర్తించి, తన సంసారాన్ని తానే నాశనం చేసుకుంటున్న భార్యకు తగిన బుద్ధిచెప్పాడు ఆ భర్త. ఇలా గతితప్పి ప్రవర్తించే భార్యలకు ఓ మేల్కొలుపు ఈ కథ.

**ఆహిరి :**

ఇందులో లలిత–శంకర్రావు ఒక జంట. శారద – రామ్మూర్తి మరొక జంట. వీరు పక్క పక్క ఇళ్ళలోనే ఉంటూ, సన్నిహితంగా మెలిగేవారు. శారద పుట్టింటికి వెళ్ళింది. శారద తిరిగి వచ్చేవరకు లలితే రామ్మూర్తికి భోజనం తయారు చేసి ఇవ్వసాగింది. రానురాను అతని ప్రవర్తనలో మార్పు కన్పించసాగింది. లలిత ఈ బాధనుండి తప్పించు కోవడానికి పుట్టింటికి వెళ్ళింది. నాలుగైదు రోజులపాటు స్నేహితురాళ్ళందరితో కులాసాగా గడిపింది.తర్వాత కాలక్షేపానికి కనీసం రేడియో కూడా లేదు. ఆమెకు వారానికే పిచ్చెక్కినట్లైంది. తిరిగి వెళ్ళిపోదామనుకునేలోపు రాజారావు వచ్చాడు. రాజారావు, లలిత ఒకప్పుడు ప్రేమికులు. లలిత తల్లి ఒప్పుకొనివుంటే వాళ్ల పెళ్ళి జరిగివుండేది. కానీ లలితకు శంకర్రావుతో, రాజారావుకు మరొకరితో పెళ్ళిళ్ళు జరిగిపోయాయి. ఇంతకాలం తర్వాత మళ్ళీ రాజారావు వచ్చాడు. మళ్ళీ పాత జ్ఞాపకాలన్నీ గుర్తుచేసి లలితకు దగ్గరయ్యాడు. చాలారోజులు ఉందామని వచ్చిన ఆమెకు రాజారావు స్వభావం అర్థమైంది. దీంతో అప్పటికప్పుడు బయలుదేరి భర్త దగ్గరకు చేరుకుంది. ఇంటికి రాగానే ఇంట్లోంచి గాజుల చప్పుడు వినిపించింది. అక్కడ ఉన్నది శారదేనేమో అన్న ఆమె అనుమానం నిజమైంది. ఇదీ స్థూలంగా కథ. ఇందులో ప్రధాన అంశం సామాజిక సంబంధాలు. అన్నయ్య అని పిలిచే వ్యక్తి తనతో అసభ్యంగా ప్రవర్తించడాన్ని సహించలేకపోయింది లలిత. ఈ విషయం భర్తకు చెప్పినా అర్థంచేసుకోడు సరికదా లేనిపోని అనుమానాలతో తనను వేధిస్తాడని, భయపడి, ఈ సమస్యనుండి తప్పించు కోవడానికి పుట్టింటికి వెళ్ళింది. అక్కడ పెళ్ళికి ముందు ప్రేమించిన రాజారావు పెళ్ళి చేసుకుంటానని నమ్మించి ఒకసారి లలితకు దగ్గరయ్యాడు. ఇప్పుడు పూర్వపరిచయాన్ని అడ్డంపెట్టుకొని మరొకసారి నాశనం చేశాడు. లలితకు

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

మొదట ఇది తప్పుగా అన్పించలేదు. కారణం లలిత రాజా రావును ప్రేమించింది. అతని భార్య కావాలనుకొంది. ఆమె ప్రేమలో నిజాయితీ ఉంది. కానీ పరిస్థితులు అనుకూలించ లేదు. ఇప్పుడు మాత్రం రాజారావు ఉద్దేశ్యం వేరు. లలితకు దగ్గరవ్వడానికి కారణం భార్య పుట్టింటికి వెళ్లడం. తన అవసరంకోసం లలితను వాడుకున్నాడు. అది గ్రహించిన లలితకు, తన భర్త కూడా తను పుట్టింటికి వెళ్తానంటే ఎందుకు సరే అన్నాడో అర్థమైంది. తనకాపురాన్ని నిలబెట్టు కోవాలనుకొని వెంటనే భర్త దగ్గరకు చేరుకుంది. ఈ కథ సమాజంలో దిగజారుతున్న నైతిక విలువలకు, సంబంధ బాంధవ్యాలను కాపాడుకోవాల్సిన అవసరం ఏమేరకు ఉం దనే విషయాన్ని తెలియజేస్తుంది. .

'భార్యలు పుట్టింటికి పోయినప్పుడు భర్తలు మరొక స్త్రీలను ఆశ్రయించడం అన్న అంశాన్ని తీసుకోని కథ నడిపిం చిన రచయిత ఈ కథకి ఆహిరి అని పేరు పెట్టడం లో స్త్రీరాగ విశేషంగాను, రెండు శరీరాలు మనస్ఫూర్తిగా దగ్గరయ్యినపుంపడు వారిరువురి హృదిలో అవతరించే సుసంగీత రాగవిశేషంగా వర్ణించటమే . ఈ కథలో లలిత రాజారావును ప్రేమించినప్పటికీ తల్లిదండ్రులు అంగీకరిం చకపోవటంతో శంకరం ను పెండ్లి చేసుకుంటుంది, ఈ శంకరం మాత్రం అన్నయ్య అని పిలిచే రాంమూర్తి భార్య శారద పై కన్నెస్తాడు. అలాగే రాంమూర్తి లలితపై వ్యామో హంతో ప్రవర్తిస్తాడు. పైకి మాత్రం అమ్మాయ్ అంటూనే లోపల మరో బుద్ధి పెట్టుకోని పైకి నటిస్తాడు. ఈ విషయాన్ని రచయిత "వీడు తనను అమ్మాయ్" అంటున్నాడు తను వీణ్ణి అన్నగారు అంటుంది. అటువంటి వాడు ఈ పని చేశాడంటే ఎవ్వరూ నమ్మరు. పైగా తనే రద్ది పడాలసోస్తుంది. (లోకం కోసం, ఆహిరి, పేజి. నెం.17) మగవాడు ఏం చేసినా నాటి నుండి నేటి వరకు అతడు సమాజంలో చెలా మణి అవుతాడు. ఈ విషయాన్ని చాలా సున్నితంగా చెప్ప గలిగాడు రచయిత.

శరీరేచ్ఛలను తీర్చుకోవడానికి వావీవరుసలు అడ్డు రావని, అక్కడ ఆడ, మగ అన్న భావన తప్పా మరేమీ పని చేయవని చెప్పడానికి మంచి ఉదాహరణ ఈ కథలో నుండే "ఆ శాస్తుర్లు గారి కూతుర్ని 'అక్కాయ్ అక్కాయ్' అంటూనే వారాల కుర్రాడు లేపుకెళ్ళలేదూ? అప్పుడే వరసలు అడ్డొచ్చాయ్ గనుక?" అని ప్రశ్నిస్తాడు. "స్త్రీ, పురుష సంబం ధాలలో మొట్టమొదటి మార్పు వావి ఏర్పడటం, తరాల భేదం లేకుండా ఏరర్పరుచుకొనే సంబంధాల నుండి మార్పు". ఇలా వావి వరుసలు ఏర్పరుచుకోవడం వల్లే ఆనాటి గుంపులు, మెరుగైన సంతానాన్ని పొంది అభివృద్ధి చెందగలిగాయి. ఆ మార్పుని నేడు తిరిగి మార్చాలనే ప్రయత్నం జరుగుతోందని రచయిత ఆనాడే హెచ్చరిం చాడు. వావి వరుసల్ని కూడా సమాజంలో గౌరవాన్ని పోగొట్టుకోకూడదనే ఒక నెపంతో ఉపయోగించుకుంటు న్నారు ఈ జనాలు. దీనితోపాటు వూర్లకెళ్తేనే మరో స్త్రీ పంచన చేరే మగవాళ్ళను దృష్టిలో పెట్టుకొని "ఈ మగాళ్ళకున్న అహంకారానికి పెళ్ళాలే గనుక లేకపోతే లోకం మగ్గుమండి పోదూ...? అంటాడు లలితలాగా ఎంతమంది పారిపోవల్సి వస్తుందోనన్న సందేహాన్ని వ్యక్తం చేశాడు. రచయిత.

## నీతిస్తంభం :

ఈ కథలో రచయిత మానవసంబంధాల ప్రాధాన్యతను తెలియజేశాడు. ప్రతివ్యక్తీ వారివారి వ్యక్తిగత జీవితం కోసం కొంత సమయం కేటాయించాలి. సమాజ సేవతో పాటు వ్యక్తిగత జీవితం కూడా ప్రధానమైనదే. అప్పుడే సంబంధాలు నిలబడతాయని, పెళ్ళైన తొలిరోజుల్లో ప్రేమగా అన్పించినది తర్వాత నీచంగానూ, తుచ్ఛంగానూ అన్పించకూడదంటారు రచయిత. దీనికి ఉదాహరణ పార్వతి పాత్ర. ఆమె పూజలు, నోములు, వ్రతాలు అంటూ గడుపుతున్నప్పటికీ, భర్తనుంచి ప్రేమాభిమానాలు ఆశించింది. అవి దొరక్కపోయేసరికి మరొకరితో వెళ్ళిపోయింది. ఇది తప్పైనా, వ్యక్తి తన కుటుంబ సభ్యులను నిర్లక్ష్యం చేస్తే కలిగే అనర్థాలను తెలిపాడు. ఇది ఆవ్యక్తి గుణపాఠంగా, హెచ్చరికగా భావిం చాలి.

"నీతిస్తంభం" కథలో ఇద్దరు వ్యక్తుల మధ్య వాదన జరుగు తుంది. నాగభూషణం చలాన్ని సమర్థిస్తాడు. సుబ్బారావు

విమర్శిస్తాడు. సుబ్బారావు వృత్తిరీత్య రచయిత. వీరిద్దరి మధ్య లైంగికత పైన వాదన బలపడుతుంది.

ప్రజలు బరిదెగించి పోవడానికి కారణం చలం అంటాడు సుబ్బారావు "ఎంతరాసినా వొకటే! కామం, ప్రేమ శృంగారం, నరాలతీపు, తియ్యని బాధ, లేచిపోవటం – అంతేగా! లేచిపోయిన వాళ్ళ చరిత్రలు తప్ప అతగాడికి మరొకటి కుదరదు రాయటానికి! ఇంతేనా జీవితం అంటే! ఒక్కచోటైనా తిండి గురించి రాశాడా? అతను తిట్టె విమర్శించే వ్యవస్థ అసలు ఎందుకొచ్చినయ్యో ఆలోచించాడ? రోగ చరిత్ర తెలియకుండా మందులు వాడే డాక్టరుకీ, చలానికీ ఎక్కడుంది భేదం? అని సుబ్బారావు వాపోతాడు. (పేజి. నెం. 24)

స్త్రీ లైంగికతను ఆకలింపుకాని విషయంగా ప్రవర్తిస్తాడు సుబ్బారావు. అందుకు నాగభూషం "బూతులు గురించి రాయడం మానుకోవమని ఒక రచయితని బ్రతిమాలుకోవడం కన్నా అసలు బూతు జరుగకుండా, ఎవ్వరూ లేచి పోకుండా, లేచిపోయేవాళ్ళకు మీరంతా వెళ్ళి అడ్డుపడరాదు? ఇట్లా ఇట్లా ఈ కారణాల వలన లేచిపోతున్నారని రాయటం చలం తప్పు! జరుగుతున్నాయ్ గనుక రాస్తున్నాడు" అని వాస్తవాన్ని బలపరుస్తూ వాదిస్తాడు. పితృస్వామ్య భావజాలం స్త్రీకి పతివ్రతా ధర్మాల్ని ఆపాదించి తనని తానే కుంచించుకుపోయేలా చేసింది. ఒక రాజకీయ కుట్ర స్త్రీని బలితీసుకొనేలా చేసింది. ఈ విషయాన్ని ఈ కథలో రచయిత చాలా పకడ్బందీగా పార్వతమ్మ (రచయిత సుబ్బారావు భార్య) పాత్ర ద్వారా చిత్రించాడు. "మీరు మంచి తిండి పెడుతున్నారు. విలువగల గుడ్డలు, సొమ్ములు తగిలించారు. పది మంది చేత గౌరవం చేయించారు. కానీ మన జీవితం యింతటితో ఆగిపోతుందని భ్రమింశారు. ఈ పదార్థాలన్ని ఇచ్చే ఉద్రేకాల సంగతి మీరు వదిలేశారు. తిండిదిని నిశ్చేతన వస్తువులకు మల్లే మనుషులు పడివుంటారని మనిషిని మీరు ఎట్లా వూహించారో నాకు తెలియటం లేదు. ఒకసారి అనుభవాన్ని రుచి చూసిన తర్వాత మానుకోవటం ఎంత కష్టమో మీకు తెలీదనుకుంటాను. ఒకవేళ తెలిసినా, తెలీనట్లు నటిస్తున్నారేమో మరి నాకు తెలియదు" అని కవి పార్వతమ్మ పాత్ర ద్వారా అనిపిస్తాడు

ఇలా స్త్రీ తనకు కలిగిన కోరికల్ని పురుషుని కంటే ముందుగా తెలియజేయడం అంటే సమాజం తనని తప్పుగా అర్థం చేసుకుంటుందేమోనని తమలోనే దాచుకుంటారు. అలాంటి సమాజంలో పార్వతమ్మ తనకు కలిగిన కామాన్ని యదేచ్ఛగా తెలియజేస్తుంది. అందుకు ఈ మాటలే సాక్షం "హాయిగా కాయితాల మీద స్త్రీ మాన రక్షణ చేస్తూ బతకండి. అయినా మీ కథల ప్రకారం మీకు స్త్రీ పనికి రాదు కదా, కామం వుండకూడదుగా మరి చిక్కులేదు నీతి రచనలు కార్చుకొంటో సంతోషించండి – మృగప్రాయమైనా, పశుప్రాయమైనా అనాగరికమైనా, ఆ కామంలో పడే కొట్టుకుపోతాను" (పేజి. నెం.32 లోకం కోసం) అని ఏమాత్రం జంకు స్త్రీకి అవసరం లేదనే విధంగా తెలియజేశాడు పార్వతమ్మ పాత్ర ద్వారా రచయిత.

### సంతానం :

పిల్లలకోసం తపించే ఓ స్త్రీ వేదనను ఆసరాగా తీసుకొని స్వామీజీల రూపం వేసుకొని, దొంగ స్వాములు చేసే అరాచకాలను తెలియజేయడం రచయిత ఉద్దేశ్యం. లక్ష్మికి పెళ్ళై రెండు సంవత్సరాలైంది. ఇంకా పిల్లలు లేరు. ఈ విషయమై భర్తను అడిగి అడిగి విసిగిపోయింది. కనిపించిన గుళ్ళు గోపురాలకు వెళ్లేది. తాయెత్తులన్నీ కట్టించుకుంది. పక్కింటి పిల్లలను తెచ్చుకొని ఆడించుకొనేది. ఆ గ్రామానికి మహాయోగి ఒకడు వచ్చాడు. 150సంవత్సరాలు హిమాలయాల్లో తపస్సుచేసి, ఇప్పుడు భూలోక సంచారానికై వచ్చాడట. ఏ సమస్యనైనా చిటికెలో తీర్చేస్తాడని అందరూ చెప్పుకుంటున్నారు. అందరితో పాటు లక్ష్మికూడా ఆయన దగ్గరకు వెళ్ళింది. పూర్వజన్మలో శిశుఘాతకురాలని, అందుకే సంతానం కలగలేదని, ఏడు రాత్రిళ్ళు ఏకాంతోపదేశం చేయాలని చెప్పాడు. అది నమ్మిన లక్ష్మి ఏడు రోజులపాటు వెళ్ళి వచ్చింది. చివరిరోజు స్వామిని, అతని శిష్యగణాన్ని పిలిచి భోజనాలు పెట్టి 100 రూపాయలు కూడా సమర్పించింది. తర్వాత స్వామి మరొక ఊరుకు మకాం మార్చాడు. తర్వాత స్వామివారిదగ్గరకు వెళ్ళివచ్చిన వారందరికీ పిల్లలు పుట్టారు.

కానీ పిల్లలందరూ అచ్చుగుద్దినట్లు స్వామివారిపోలికే. ఈ కథ ద్వారా దొంగస్వాములు ప్రజల నమ్మకాలను ఆసరా చేసుకొని వారిని ఏవిధంగా మభ్యపెడుతున్నదీ కళ్లకు కట్టి నట్టు చూపించాడు రచయిత. ఇటువంటివి అరికట్టా లంటే ప్రజలు మూఢనమ్మకాలు వదలి వాస్తవికతతో ఆలోచిం చాలని సూచిస్తున్నాడు.

ఈ విధంగా రావూరి భరద్వాజ సమాజంలో అను నిత్యం మన కళ్ళముందు జరిగే అనుకానేక సంఘటనలనే వస్తువు లుగా స్వీకరించి సామాజాన్ని మానసిక, పరివర్తనలో నడిపే ప్రయత్నం తన రచనల ద్వారా బలంగా చేసినది స్పష్ట మైతుంది. ఒక రచయిత కేవలం వాస్తవాన్ని అందించడం వేరు, సామాజిక దృక్పథంతో కూడిన వాస్తవ చిత్రీకరణ చేయడడం వేరు. అయితే నవలలో సామాజిక దృక్పథంతో కూడిన వాస్తవ చిత్రీకరణ జరగాలంటే ఆ రచయితకు భౌతికవాదం, వర్గ చైతన్యం, వర్గదృక్పథాల పట్ల అవగా హనతో పాటు, పరిచయం కూడా అవసరం. వీటన్నిటితో పరిచయమున్న రచయిత యొక్క రచనల్లో సామాజిక చైతన్యం మరింత స్పష్టంగా ,మరింత బలంగా వుంటుంది. రావూరి భరద్వాజ రచనలలో వర్గదృక్పధం, వర్గచైతన్యం, భౌతికవాద ధోరణి కూడిన లక్షణాలు చాలా స్పష్టంగా కనిపిస్తాయి. సామాన్య జీవితాలకు పట్టంకడుతూ అధ్భుత మైన సాహిత్యాన్ని సృజించిన రావూరి అనేకానేక రచనల్లో ఒకటైన పాకుడురాళ్ళు కు జ్ఞానపీఠ్ పురస్కారం లభించట మనేది, 'సహితస్యభావం సాహిత్యం' అనే లోకోక్తికి పట్టాభి షేకం జరగటమే. అందుకే ముందు చెప్పినట్లుగా రావూరి భరద్వాజ రచనల్లోని కలానికున్న బలం, బీడువారిన మానవ మెదళ్ళను దున్నే బలమైన నాగలి కర్రుకున్నట్టి పదునైన తత్వం, అదే మానవత్వంతో నిండిన యదార్ధత్వం.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# రావూరి 'జీవన సమరం' X 'పాకుడు రాళ్ళు' = స్థిర వ్యక్తిత్వం

- డా. జె. సీతాపతి రావు
సహాయకాచార్యులు,
రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం,
ఏ.పి.ఐ.ఐ.ఐ.టి., నూజివీడు, కృష్ణా జిల్లా,

## సాహిత్యావిష్కారం - పరిధి :

మనిషికి భాషే ప్రతిబింబం. దీన్ని ఇమేజ్ అంటాం. %Reflection, Refraction% ఈ రెండూ దర్పణాలను చెప్పేటప్పుడు భౌతిక శాస్త్రంలో ప్రాథమిక అవసరాలు. దీని కోణాలను అనుసరించి ఆ వస్తువు కనిపిస్తుంది. సాహిత్యా

నిజ ప్రతిబింబం




Object At Infinity

మిథ్యా ప్రతిబింబం




నికి సంబంధించి చూసే వారి ప్రతిభను శాస్త్రీయ కోణాలను అనుసరించి గుర్తించగలుగుతారు. కొన్ని నిజ ప్రతిబింబాలైతే, కొన్ని మిథ్యా ప్రతిబింబాలు.

"అందాన్ని ప్రతిబింబించలేక అద్దమే చతికిల పడింది" అనే కవితా పంక్తిని తీసుకుంటే ఆమె అందాన్ని పూర్తిగా అద్దం చూపించలేదని భావన. అంటే శాస్త్రీయ కోణాలను మించిన ప్రతిపాదన సాహిత్య కోణం నిరూపిస్తుంది. సామాజిక అంశాలు దీనికి కొలమానాలు. సమాజం, సాహిత్యం ఒక కాలం నాటికి ఒకేలా ఉండాలనే నియమం లేదు. సాహిత్యం సమాజానికి ప్రతిబింబం కాదు- ప్రతిఫలనం (not reflection but refraction). రచయిత సమాజంలో ఉన్నది ఉన్నట్టు చిత్రించడు. అది చిత్రకారుడి పని. ప్రతిభావంతుడైన కవి తన అనుభవంలోంచి సమాజ స్వరూపాన్ని అవగతం చేసుకొని భవిష్యత్తుని కూడా సూచనా మాత్రంగా ప్రతిఫలింపచేస్తాడు. రచయిత అభ్యుదయ భావాలు కలిగిన వాడైతే అతని దర్శనం ముందు కాలాలకు అనుసరిస్తుంది (కవులు కూడా అనుసరిస్తారు). సాహిత్యం ప్రత్యేక వ్యక్తుల జీవిత అనుభవాలను చిత్రిస్తూనే ఆ వ్యక్తి జీవిస్తున్న సమాజాన్ని ప్రతిఫలింపజేస్తుంది. దాని ద్వారా సార్వజనీనత సార్వకాలీకత సిద్ధిస్తుంది. రచయితల మాటలకు విలువ పెరుగుతుంది. ఈ నేపథ్యాలన్నీ రావూరి జీవన సమరం, పాకుడు రాళ్ళని తులనాత్మక కోణాల్లో పరిశీలించి చూడటం ఈ వ్యాస పరిధి.

## మనిషి - అవసరాలు :

కూడు, గుడ్డ, గూడు, మనిషి ప్రాథమిక అవసరాలు. అవి తీరాక సౌకర్యాలు, ఆ తర్వాత విలాసాలకు వెళతాడు. ప్రాథమిక అవసరాల్లోనే ఆగిపోయేవాడు పేదవాడు. డార్విన్ జీవ పరిణామ క్రమ సిద్ధాంతంలో 'పోరాటాల్లో సహజంగా ఎదుర్కొనే స్థితిని కలిగి ఉన్నవారే జీవించగలుగుతారు'. కొన్నిమార్లు బలంతో పాటు మేధోశక్తిని కూడా పెంచుకోవాలి. ఆదర్శవంతమైన నియమాల్ని అలవాటు చేసుకోవాలి. అలాంటి వాళ్ళే కష్టాలు వచ్చినపుడు మనోధైర్యాన్ని కలిగి వాటిని అధిగమిస్తారు. సత్యాన్ని నమ్ముకొంటారు.

సత్యం కోసమే జీవితం ముళ్ళ బాటల పయనంగా మారినా మానసిక ధైర్యాన్ని వీడలేరు. సత్యాన్ని వదలలేరు. అతడే ఆదర్శనీయుడైన సత్య హరిశ్చంద్రుడు. వీరు పౌరాణిక పాత్రలు లేదా వ్యక్తులు. ఈ సమాజంలో అలాంటివారు ఉన్నారా? అలాంటి కష్టాలని ఎదుర్కొనే గుణాలున్నాయా వారికి? జీవితంలో పోరాడుతూ ఆదర్శవంతమైన జీవనం కోసం అడ్డదారులు తొక్కకుండ నిలబడగలిగే వ్యక్తులు శక్తులుగా మారడం నేటి సామాజిక అవసరం. సాహిత్య ప్రయోజనం.

చెప్పడంలో, చేతల్లో ఆలోచనలో మంచి మనస్తత్వాలని కలిగి ఉండటం, హృదయాన్ని ద్రవింపజేసేలా, పాత్రల్ని దృశ్యీకరించడం రావూరి సొంతం. మనిషికి చదువుకన్నా ముఖ్యం ఉత్తమ గుణాలు, సంస్కారాలు. అది భారతీయతకు ఒక బాధ్యత అవ్వాలి. వారే విజేతలవ్వాలి. మనిషి అంటే మానవత్వం కలవాడు. సాటి మనిషికి సాయం చేయడం మనిషిగా మన ధర్మం. ఆ ధర్మాన్ని అందరూ నిర్వర్తించాలి. అదే విశ్వశ్రేయస్సుకి మార్గం. దాని కోసం ఏ సమరానికైనా సిద్ధపడాలి.

## వ్యక్తిత్వ ప్రభావం :

ఆడంబరాలులేని సాధారణ జీవితం రావూరిది. అక్షయ శక్తున్న అక్షర కృషీవలుడు అపర భరద్వాజుడు. రావూరి రచన వెంట భాష భావమై పరుగులు తీస్తుంది. బీద కుటుంబంలో పుట్టి బరువైన బాధను భాష ద్వారా భావింపజేస్తూ కళ్ళనీరు తెప్పించగలడు, ఆలోచనల్ని అందివ్వనూ గలడు. అతని చదువా పాఠశాల స్థాయి వరకే. కాయకష్టంతోనే కూలీనాలి చేస్తూ, చేసిన వారిని, పల్లెప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపతాపాలు, అవసర అవకాశాలను ఔపోసన పట్టాడు రావూరి. నిజమైన పల్లె నాగరికతా ఉచ్చులో నవ చైతన్య దిశలో సాగడానికి పడిన వేదన అవకాశమై అందలాన్ని అందుకుంటుంది.

పేద రైతు కుటుంబంలో పుట్టి, పొట్ట కూటి కోసం కలమనే హలాన్ని పట్టాడు. అతని జీవితం వడ్డించిన విస్తరి కాదు. పల్లేరు పై నడక. బ్రతుకులో కష్టాలని, కన్నీటిని కరువుదీరా చూసాడు. ఆకలి, అవమానం, అవిద్య, దారిద్ర్యం, నిరుద్యోగం, నిరాదరణ అనుభవించాడు. జీవన పథంలో నిలవడం కోసం రకరకాల వృత్తులను వరించాడు. సాధక బాధకాలను, కష్ట నష్టాలను, అవమానాలని అందుకున్నాడు. వాటి సారాన్ని పిండి, 2012 సం. నాటికి జ్ఞాన పీఠాన్ని అధిరోహించారు. చిన్న చిన్న వృత్తులు చేసే వారి పట్ల సానుభూతి, ఆత్మీయతలు, సహజత్వం ఆ పాత్రలకి జీవం పోశాయి.

### భరద్వాజుని బతుకు సమరం :

అరణ్యాలకు వెళ్ళిన రాముడిని పిలవడానికి వెళ్ళిన సేనతో కూడిన భరతుడికి భరద్వాజుడు ఆశ్రమిచ్చాడు. దేవతలను ప్రార్థించి అన్నీ రకాల పదార్థాలని సమృద్ధిగా అందేలా భరద్వాజ విందును ఏర్పాటు చేశాడు.

బృహస్పతి పుత్రుడిగా భాగవతం పేర్కొంటుంది. సప్త ఋషుల్లో ఒకడు భరద్వాజుడు. భారతంలో దుష్యంతుడి కొడుకైన భరతుడిని పెంచినవాడు భరద్వాజుడే. భారతం ప్రకారం సత్యా సంశయుల కొడుకు. ఇంకో సందర్భంలో అవక్రీతుని తండ్రిగా కనిపిస్తాడు. పుత్ర శోకంతో ప్రాణ త్యాగం చేసుకుంటాడు. ఆర్యా వసుడు చేసిన హోమం వల్ల దేవతలు మెచ్చుకొంటారు. వారి వరంగా భరద్వాజుడు మళ్ళీ బ్రతుకుతాడు. ఇలా భారతంలో కూడా కష్టాలను అధిగమించగలిగిన వ్యక్తిత్వం కలవాడు భరద్వాజుడు. రావూరి భరద్వాజ విషయంలో సార్థక నామధేయుడు.

సమాజం విచిత్రమైనది. కొన్నిసార్లు ఊహకి వాస్తవానికి పొంతన ఉండదు. అన్నమయ్య చెప్పిన 'పరబ్రహ్మం'లో కులమత భేదాలు వాటి పర్యవసానాలను అర్థం చేసుకోవాలి. ప్రతి మనిషిలోనూ రక్తం ఎర్రగానే ఉంటుంది. ఆకలిదప్పులు సహజం. కూటికోసం కోటి విద్యలు అన్నారు పెద్దలు. ఆ కోటి విద్యలలో 52 విద్యలని పరిచయం చేశారు భరద్వాజ. జీవితంలో 90% సాధారణంగా కష్టాలే ఉంటాయి. అంత మాత్రంచేత క్రుంగి పోకూడదు. వ్యధనే అర్థం చేసుకొని యధార్థాన్ని తెలుసుకొని జీవనం లోకి ప్రవేశించాలి. అలాంటి వ్యధార్త జీవుల యధార్థ గాథే 'జీవన సమరం' అనే కథల సంపుటి. అచ్చంగా ఇది నిజ జీవిత దృశ్యీకరణ.

**జీవన సమరం – పాకుడు రాళ్ళు :**

భరద్వాజ పొట్టకూటి కోసం వ్యవసాయ కూలిగా, పశువుల కాపరిగా, రంపం లాగే పనివాడిగా, తిత్తులూదే కూలీగా, పేపర్ బాయ్ గా పనిచేశారు. ఈయన నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనం. సాధుజీవి. సంఘంలో కష్టాలను అనుభవించి, చూసి చలించిన వ్యక్తి. ఈ జీవన సమరంలో రచయితే యోధుడు. సేనా నాయకుడు. ఆయన కష్టాల కలం నుంచి వచ్చిన కన్నీటి అలల ఝరులు రెండు. రకరకాల వ్యక్తుల కష్టాలను చూపిస్తే 'జీవన సమరం'. ఒకే వ్యక్తి పడ్డ కష్టాలను వేరు వేరుగా చూపిస్తే 'పాకుడు రాళ్ళు'.

## జీవన సమరం కర్తవ్య నిష్ఠ :

'జీవన సమరం' నిజ జీవితంతో మనుషులు చేసే యుద్ధం. గెలుపోటములు మధ్య పేదరికమే వారిధి. దాన్ని జయించిన వాడు తీరాన్ని చేరుతాడు. లేనివాడు నిత్యం యుద్ధం చేస్తూనే ఉంటాడు. కొందరు గొప్పవారిగా జన్మిస్తారు. ఇంకొందరికి గొప్పదనం ఆపాదించగా వస్తుంది. వీరిద్దరూ అదృష్టవంతులే. మరికొందరు గొప్పదనాన్ని సాధిస్తారు. వీరే క ృషీవలులు. కార్య సాధకులు. కర్తవ్య నిష్ఠ లేనిదే కార్యం సిద్ధించదు. అలా నిజ జీవితంలో కర్తవ్య నిష్ఠతో కార్యసాధకులైన పాత్రలు సావిత్రి, ఆగమయ్య, రాములు, శేషగిరి, జాఫర్, శామ్యూల్ ఆనందరావు మొదలైన వారు. వీరందరికీ పేదరికం సుపరిచితం. ఆకలికి నీరు త్రాగి నిద్ర పోయేంత. కష్టాలను కన్నీళ్లతో సరిపెట్టుకునేంత.

**మానవతా దృక్పథం :**

పురాణాల్లో సావిత్రి పతివ్రతా శిరోమణి. సత్యవంతుడిని (సావిత్రి భర్త) తిరిగి బ్రతికించడంలో ఆమె పాత్ర అనన్యం. మరుగున పడిన మానవతా కథలో సావిత్రి తద్భిన్నం. (జీవన సమరంలో 3 వ కథ మరుగున పడిన మానవతా) కట్టుకున్న భర్త కాలయముడయ్యాడు. కాల్ గర్ల్‌గా సావిత్రిని అమ్మేశాడు. పడుపు వ ృత్తిలో పనికి చేర్చాడు. ఆ వృత్తిలో తన బ్రతుకిని ఊహించలేక తప్పించుకోవాలని చాలా సార్లు ప్రయత్నించింది. చివరికి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపర్చుకుంది. అక్కడ నుండి తప్పించుకున్నాక వెంకటేశం అనే మానవతావాది అక్కున చేర్చుకొని ఆశ్రయమిచ్చాడు. ఉపాధి కల్పించాడు. బజ్జీలు, ఫలహారాలు, టీలు చేసుకుంటూ సావిత్రి ఇప్పుడు దర్జాగా బ్రతుకుతుంది. మార్గం వేరైనా ఈ కోవలోకే వచ్చే కథ 'పప్పులోని ఉప్పు కలిపి కుప్పలు పోస్తాడు'. ఈ కథలో శేషగిరి, నాయర్ పాత్రలు మానవత్వపు విలువలని చాటి చెప్తారు.

**ప్రపంచీకరణ – చేతి వృత్తులు :**

భారతీయుల ప్రతిభా పాటవాలకు శిల్ప సంపదే చక్కని ఉదాహరణ. ఈ ప్రతిభా పాటవాలకు వారసుడే ఖరీదు కట్టే షరాబు లేడోయ్ కథలోని ఆగమయ్య. ఆగమయ్య చేతిలో నల్ల రాళ్ళు నాజూకుగా మారడం, బండ రాళ్ళు అందాల బొమ్మలగా రూపెత్తడం మామూలే. ఇతనో శిల్పి. కష్టాల రాళ్ళను కృషితో ఆనందంగా మార్చిన ఘనుడు. కానీ శ్రమకి తగిన ఫలితం దక్కదు. ఎండలో ఎండి, వానలో తడిచి ముద్దైనా కనికరించే నాథుడే లేడు. ఇలాంటి వారు నేటి సమాజంలో కోకొల్లలు. చేనేత కార్మికులు, కుండలు, ఇటుకుల పనివారు ఒకరేమిటి అంతరించడానికి సిద్ధంగా ఉన్న వృత్తులవారందరిదీ ఈ కోవే. పారిశ్రామిక విప్లవంతో చేతి వృత్తులు కనుమరుగయ్యాయి. ఆ అభివ ృద్ధిలో వీరి ఉపాధి కొట్టుకుపోయింది. వీరికి పని కల్పించేదెవరు? అనే ప్రశ్నకు ఆలోచింపజేస్తున్నాడు రచయిత.

**నీతి – నిజాయితీ – పేదరికం వ్యక్తిత్వం :**

ఆమె కురులు నయాగరా ఝరులు. ప్రేమ జలపాతంలో ప్రవహించే నెచ్చెలి చెక్కిళ్లు. ప్రేమ పరవళ్ళు. ఇది ఒక శైలి. ఆమె కురులు నల్లని మబ్బులు. పరిగెడుతున్నాయి పదిలంగా. ఇది మరో శైలి. బోడు గుండమ్మ జుత్తుని వర్ణించడం ఎలా సాధ్యం?. ఆ నేపథ్యంగా కొంత జుట్టున్న ఆమెకు సవరం ద్వార అందాన్ని సరిచేస్తాడు. అతడే 'కేశోపనిషత్తులు' కథ లో రాముడు. అంటే సవరాలు తయారు చేసి అమ్మేవాడన్నమాట.

బజారులో వెంట్రుకలు కొని సవరాలుగా తయారు చేస్తాడు రాముడు. ఈ వెంట్రుకల ధర ఒక్కోసారి ఒక్కో

విధంగా ఉంటుంది. ఒకసారి 16 రూపాయలు మొదలు 30, 40, 50 రూపాయల వరకూ చెల్లిస్తాడు. కానీ సవరం ధర మాత్రం ఎప్పుడూ స్థిరమే. దీనికి కారణం ఆయనిచ్చిన మాట. వెంట్రుకల ధర మారినపుడు నీ సవరం ధర కూడా మార్చు అని ఎవరైనా సలహా ఇస్తే అది కుదరదంటాడు. నేను పది రూపాయలకే సవరం అమ్ముతా అని వారం ముందుమాట ఇచ్చి ఇప్పుడు మారిస్తే సరి కాదు. అందుకే పేదరికంలో పస్తులైన ఉంటాను కానీ మాట మాత్రం తప్పను అంటాడు రాముడు. ఇలా చూస్తే రాముడి పాత్రని ఒక ఫార్ములాగా రాయవచ్చు. నీతి ం నిజాయితీ %--% పేదరికం వ్యక్తిత్వం.

**వలస కూలీల వ్యధార్త గాథ :**

బుట్ట చేత పట్టుకొని పొట్ట కూటి కోసం పరుగులెడతారు. దానికి కారణం స్వంత ఊరిలో ఉపాధి లేకపోవడమే. ఆస్తులు ఉన్నా పంటలు పండించడానికి నీరు లేక వలస పోతారు. ఇలాంటి వలస కుటుంబమే 'గాజు పెంకుల నడుమ బూజు బాటుకును చూడు' కథలో నాగయ్య ఆదెమ్మల పాత్రలు. నాగయ్య పేదరికంలో ఉన్నా తన భార్యని పనికి వెళ్లడానికి ఒప్పుకునేవాడు కాదు. అయిన ఆదెమ్మ ఏదో ఒక పని చేస్తూ భర్తకి సహకరించేది. బహుశా ఇదేనేమో దాంపత్యం జీవనం. కొన్ని రోజులు ఓటి (over time) లు చేసి కూడా డబ్బులు సంపాదించేవారు. అలా ఒక రోజు చేస్తున్న పని ఇంకా వేగంగా అవ్వాలని నాగయ్యని పనికి తీసుకువెళ్ళాడు మేస్త్రి. అదే అదెమ్మకు ఆఖరి చూపు అయింది. నాగయ్య పనిలో ఉన్నప్పుడు పెద్ద దూలం పైన పడి చనిపోయాడు. ఆదెమ్మ దిక్కులేనిదైపోయింది. తర్వాత ప్లాస్టిక్ వస్తువులు, బూరలు (balloon) అమ్ముకొని జీవనాన్ని సాగించింది.

నేటి కాలంలో శ్రీకాకుళం, విజయనగరం, రాయలసీమ ప్రాంతాల ప్రజలు ఎక్కువగా చెన్నై, ముంబాయ్, గుజరాత్ ప్రాంతాలకు వలస పోతున్నారు. ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి వారిది. డబ్బులు సంపాదిద్దాం అని వెళ్ళి జబ్బుల పాలౌతున్నారు. కొంతమంది తిరిగిరాని లోకాలకు వెళ్లిపోతున్నారు. ఈ పరిస్థితి మారాలి. సొంత ప్రాంతాలలోనే ఉపాధిని ప్రభుత్వాలు కల్పించాలి అని రచయిత భావన.

**నిరుద్యోగి – ఉపాధి :**

చదువు కొనుక్కుంటున్న ఈ రోజులలో చదువుకున్న వారికి ఉద్యోగాలే కరువయ్యాయి. నిరుద్యోగ భూతమై విశ్వ వ్యాప్తమైంది. దానిని అడ్డుకోవడం కష్టం. చదివిన చదువు ఒకటి, చేసే పని వేరొకటి. ఈ రెండింటికీ పొంతన ఉండదు. దానికి కారణాలు ఏమైనా బలౌతోంది నేటి యువత. అందులో ఒకరు 'భ్రమణం : పరిభ్రమణం' కథలో జాఫర్. చదుకున్నది బి.కాం. చేస్తున్నది రంగుల రాట్నాలు తిప్పించే పని. కానీ ఏనాడు నేను నిరుద్యోగిని అని బాధ పడలేదు. అసలు ఉద్యోగం అంటే ఉపాధి అని నిర్వచనాలు ఇస్తుంటాడు.

అలాంటి కోవకు చెందిన కథే 'రూపాయిస్తే మెరుపు మెరిస్తే' లోని శామ్యూల్ ఆనంద రావుది. పాడైన గడియారాలు, చేతి వాచీలను బాగుచేస్తుంటాడు. ఇతని చదివింది బి. ఎ. వీళ్ళిద్దరే కాదు ఎంతో మంది నిరుద్యోగుల గాథే జీవన సమరం. కొంత మంది ఉపాధి కల్పించుకుంటుంటే, మరికొందరు ఊపిరి తీసుకుంటున్నారు. చదువు ఒక అర్హత మాత్రమే. ఉపాధికి అడ్డంకి కాదు. ధర్మ మార్గంలో పొట్ట కూటి కోసం ఏ పనినైనా చెయ్యొచ్చు. తద్భిన్నం నిరుద్యోగి.

ఇలా ఎన్నో జీవిత గాథలు. అన్నీ త ృప్తిగానే సాగుతున్నాయి. కారణం పేదరికం వారికి అడ్డంకి కాదు అని భావించడమే. నిజాయితీగా పనిచేయడం, పోటీ ప్రపంచంతో పరిగెత్తడం, న్యాయంగా జీవించడం, నిరంతర అన్వేషకులు ఈ 'జీవన సమరం'లో ఉన్న పాత్రలు. అభాగ్యులు నిరుపేదలు నిబ్బరంగా పేదరికం, కష్టాలను అధిగమించే సంయమనమే జీవన సమరపు నాడి.

**పరువు – పాకుడు రాళ్ళు :**

పాకుడు రాళ్ళు అంటే నాచు పట్టి, జారుడు స్వభావం కలిగినవి అని అర్థం. మరి పాకుడు రాళ్లకు నాచు పట్టడం అంటే ఏమిటి? అదే పాకుడు రాళ్ళు కథ. ఈ కథలో ఎన్నో

పాత్రలు ఉన్నాయి. అన్నీ అందంగా కనిపించే రంగుల రాళ్ళే. కానీ లోపలకి పోయి చూస్తే కనిపిస్తుంది వాటికి పట్టిన నాచు. అందులో ప్రధాన పాత్ర మంజరి అలియాస్ మంగమ్మ. ఈ పాత్ర చుట్టూ తిరిగిన కథే ఈ నవల. మంగమ్మ అనే వ్యక్తి మంజరిగా మారి ఉన్నత స్థానాలకు చేరుతుంది. ఈ క్రమంలో విలువలను వదిలేస్తుంది. మనుషుల్ని మరచిపోతుంది. సినిమా అందాల వల. అవసరం, అవకాశం గాలం. ఆ ఆకర్షణకి చిక్కిన చేప పిల్లే మంజరి.

సమాజం ఒక రంగుల వల. ఆ వలలో చిక్కనంత వరకు మనం నీటిలో చేపలమే. చిక్కితేనే తెలుస్తుంది మనం మరొకరికి బానిసలమని. సినీ జగత్తులో చీకటి తెరలను చీల్చిన నవల ఇది. మనిషికి కుటుంబం మూలం. ఆ కుటుంబమే విలువలు నేర్పాలనడం అంతర్లయ. నాథుడు లేని స్త్రీ నైతికంగా ఉండాల్సిన ధర్మాలను వదిలేసి పేరు కోసం పడిన అగచాట్లకు మణిహారం మంజరి. సక్సేనా లాంటి విలువలు లేని వాడి సాయం, డబ్బు కోసం దొంగ నోట్లకు వెళ్లాల్సిన దౌర్భాగ్యం ఈమె జీవితానికి విలువ లేకుండా చేసాయి. బ్లూ ఫిల్మ్ లో కూడా నటించాల్సిన స్థితికి దిగజారింది. ఆఖరికి ఆత్మహత్యే శరణం అనుకుంది. ఇలా అన్యాయాలకు, అక్రమాలకు, నమ్మక ద్రోహాలకు, హంగులు, ఆర్భాటాలకు లోనైన ఒక స్త్రీ జీవిత వ్యధే ఈ నవలలోని కథ. ఈ సమస్యల సుడిగుండంలో చిక్కి, తనువు చాలించింది మంజరి.

## జీవన సమరం' తో పాకుడు రాళ్ళు :

'జీవన సమరం' కథా సంపుటిలో కథలు కన్నీటి సముద్రంలా కనిపిస్తాయి. ఆ సముద్రపు అలలే అందులోని పాత్రలు. కెరటం నా ఆదర్శం. పడినందుకు కాదు. పడి లేచినందుకు అన్నమాటలకు అక్షర సత్యం 'జీవన సమరం'. 'పాకుడు రాళ్ళు' ఒక ప్రాధాన పాత్రతో చుట్టూ అల్లిన నాచు లాంటి పాత్రలు మిగిలినవి. 'పాకుడు రాళ్ళు' ఒక దిగుడు బావిగా భావిస్తే. ఆ బావిని కప్పేయాలనుకునే పాత్రే మంజరి. 'జీవన సమరం'లో చాలా పాత్రలు సాగరాన్ని ఈదాలని చూశాయి. కానీ ఎప్పుడూ అన్యాయ, అక్రమాలలో బయటకి గెంతి రావాలనుకోలేదు. వర్షాకాలంలో బావి నిండినపుడు కప్ప ఎలా బయటకు గెంతుతుందో, మంజరి కూడా అలానే అన్నీ సాధించాక సమాజాన్ని వదిలి చీకటి ప్రపంచంలోకి దూకింది. మోసాలకు, అన్యాయాలకు, అక్రమాలకు బలైంది. ఒకే నాణేనికి రెండు వైపులు ఈ రెండు రచనలు.

ఎలా ఉండాలో చెప్తుంది 'జీవన సమరం'. కష్టాలను కడలని ఈదడం నేర్పిస్తుంది. ఎలా ఉండకూడదో నేర్పిస్తుంది 'పాకుడు రాళ్ళ'. ఉంటే ఎలా బలి అవుతామో చూపిస్తుంది. రెండు రచనల స్వరం వేరైనా గళం మాత్రం 'స్వయం కృషే'. కృషి తో నాస్తి దుర్భిక్షం. పేదరికాన్ని జయించడం వరకే చూపిస్తుంది జీవన సమరం. ఆ తర్వాత ప్రపంచాన్ని చూపిస్తుంది పాకుడు రాళ్ళు. డబ్బు వచ్చాక అన్నీ అక్కున చేరుతాయి. అందులో మోసాలు ఉంటాయి. అన్యాయాలు ఉంటాయి. వాటన్నింటిని ఎదుర్కోవడమే నిజమైన జీవితం. మనిషి నిజమైన వ్యక్తిత్వం అన్నీ ఉన్నప్పుడే (ప్రధానంగా డబ్బు) బయటపడుతుంది. అది సరైనది అయితే సమాజం కీర్తిస్తుంది. లేకపోతే ద్వేషిస్తుంది. వెరసి సారంగా 'జీవన సమరం' X 'పాకుడు రాళ్ళు' = స్థిర వ్యక్తిత్వం అనే ఫార్ములాగా చెప్పవచ్చు.

# నేలమీద ఎదురీత

- సురేంద్ర సాడి
పరిశోధక విద్యార్థి, హిందీ శాఖ
ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ, హైదరాబాద్.

జీవన సమరం అనేది ఎప్పటికీ ఒక ఆగని ప్రక్రియ. ఈ సృష్టిలో ప్రతి జీవి తన జీవిక కోసం పోరాటం చేయడం అనేది అనివార్యం, ఈ అనివార్యమైన ప్రక్రియ నుండి మనిషి కూడా తప్పించుకోలేడు. ఇలాంటి మానవజీవితంలో ముఖ్యంగా సమాజంలో ఉండే బడుగు బలహీనవర్గాల జీవితాన్ని, వారి జీవిత గమనాన్ని మనకు అక్షర రూపంలో ప్రతిబింబించేవే రావూరి భరద్వాజగారు రచించిన ఈ జీవన సమరంలోని జీవిత చిత్రాలు. ఇవి "1978 మే నెల పదవ తేదీన బుధవారం ఈనాడు సంచికలో మొదలై 1979 ఆగస్టు 23వ తేదీ గురువారం సంచికతో 'జీవన సమరం' పూర్తి అయింది" (రావూరి భరద్వాజ సాహితీప్రస్తావన పుట 14) తర్వాత ఇది 1981 ఫిబ్రవరి 5వ తేదీన పుస్తక రూపంలో వెలువడింది.

## ఓ జీవన గమనం :

**'కొందరు గొప్పవారుగా జన్మిస్తారు"**
**అదృష్టవంతులు**
**'ఇంకొందరకు గొప్పదనం ఆపాదించబడుతుంది"**
**వీరు అదృష్టవంతుల**
**"మరికొందరు గొప్పదనాన్ని సాధిస్తారు"**
**మనం చెప్పుకోవలసింది వీరిని గురించే!"**

అని చెబుతూ, ఈ జీవన సమరం అనే గ్రంథంలో దినసరి కూలీలు, కుల వృత్తులు, రాళ్లు కొట్టేవారు, డప్పులు కొట్టేవారు, చేనేత కార్మికులు, చెప్పులు కుట్టేవారు, పూలు అమ్ముకునేవారు, పాములు పట్టి ఆడించేవారు, జానపద కళారూపం అయిన గంగిరెద్దుల వారు, రోడ్లపై చేత్తనేరుకొనే చిన్నారులు ఇలా సమాజంలోని అన్ని కోణాలకు చెందిన 52 మంది అట్టడుగు మానవుల జీవితాలను ప్రత్యక్షంగా చూసి వాటిని ఈ పుస్తకంలో ప్రతిబింబించేలా చేశారు.

ఇన్ని వందల సంవత్సరాల తెలుగు సాహిత్యంలో ఎంతో మంది సమాజంలోని బలహీన వర్గాల సమస్యల్ని సాహిత్యీకరించారు కాని తెలుగు సాహిత్య చరిత్రకు ఇప్పటివరకు అచ్చంగా, అట్టడుగు వర్గాల యదార్ధ సంఘటనలతో నిండిన మొట్టమొదటి గ్రంథాన్ని రచించిన వారిలో భరద్వాజగారే ముందుంటారు.

సమాజంలో కొందరి జీవితాలు ఎంతగా మొండి బారి పోతాయో "బండబారిన మొండి బతుకులు" అనే ఈ చిత్రంలో పందరి జీవితం ద్వారా తెలియజెప్పాడు రచయిత. పందరి జీవితం పూర్వకాలంలో రాజుల కాలంలో ఎలా ఉండేది, ఎంత గౌరవంగా ఉండేది, ప్రస్తుతం నాగరిక యుగంలో వారి జీవితం ఇంత దుర్భరంగా తయారయ్యింది అనే విషయాన్ని పందరి చెప్పిన మాటలను బట్టి తెలుస్తుంది. తన కుటుంబం నడుస్తున్న తీరు, ఒక సైకిల్ కొనుక్కోగలిగే స్థితిలో లేక తన పని వస్తువులను మూసుకుపోతూ, దాన్ని తన మాటల్లో "దీన్ని మోసినంత సేపు నా పిల్లల్ని కూడా మోయలేం అండి నా బ్రతుకంతా దీని మీద ఆధారపడి ఉంది అందుకే నా బిడ్డ లాగా చూసుకుంటా"(పుట183) అని చెప్పడంలో లోనే మనకు వారి దుస్థితి కనిపిస్తుంది. "గుర్రం గుడ్డిదైనా దాణాకు కొదవ లేదు", "సంస్థానం చిన్నదైనా సరదాకు లోపం లేదు" (పుట177) అని ఒక సామెతను మరో సామెతతో రావూరి అన్వయించడం మనకు ఊరు ఉండమంటుంది కథలో చూడవచ్చు. 78 ఏళ్ల మొయినుద్దీన్ బనగానపల్లె ప్రభువుల కాలంలో గుర్రానికి మసాజ్ చేయడానికి వచ్చి, తర్వాత కాలంలో జీవితంలో ఎంత కష్టపడ్డాడో చివరకు వృద్ధాప్యంలో తీగలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న ఆ కథ వింటే ఎవరు కూడా కన్నీటిపర్యంతం అవ్వకమానరు!

ఒక మనిషి జీవన గమనంలో ఎన్నో ఆటుపోట్లు కష్టసుఖాలు ఉంటాయని ఎప్పుడు ఎవరి జీవితంలో ఓడలు

బంధ్లు, బంధ్లు ఓడలు అవుతాయె చెప్పలేని ఒక విచిత్ర పరిస్థితి "నేను సైతం ఇంటి పొయ్యికి..(పుట 136)" అనే గాథలో పోశమ్మ జీవితం ద్వారా మనకు కనిపిస్తుంది. పోచమ్మ తన మొదటి దశలో పది ఎకరాల భూమి ఉండి కూడా వృద్ధాప్యంలో వచ్చేసరికి కన్న కొడుకులు తరిమి పేడతో కొన్ని ఉండలు చేసుకుని పెట్టుకుని అమ్ముకునే స్థితి మనకు దీనిలో చూపించారు రావూరి.

"గాజుపెంకుల నడుమ బుజు బతుకును చూడు" అనే దానిలో స్వాతంత్రం వచ్చిన తరువాత ఎన్నో ఆశయాలతో రాజ్యంగా రచన చేసుకొని అనేక ఆశయాలతో ముందుకు వెళుతున్న మనదేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధిస్తుందని అందరు అనుకుంటారు కాని ఇంకా మన దేశంలో బాల కార్మికులు ఉన్నారంటే నమ్ముతార? ఈ స్కెచ్‌లో ముత్యాలు కూడా ఒక బాల కార్మికుడే అప్పటికే బాల కార్మిక చట్టాలు అందరికి విద్య అనే మాటలు వినిపిస్తున్నాయి కాని తండ్రి మరణం తరువాత పట్టణానికి వచ్చిన ముత్యాలు అతని తల్లి, నాయినమ్మ పట్టణ వాతావరణానికి ఇమడ లేకపోయారు. ఎలాగైనా బతకాలనే తాపత్రయంతో అతని తల్లి ఇళ్ళల్లో పాచి పని చేసేది, ముత్యాలు చెత్త కుప్పల్లో గాజుపెంకులను, పాల డబ్బాలపైన ముతలను, రిబ్బన్ ముక్కలను, పుస్తకాలపై అట్టలను, ప్లాస్టిక్ వస్తువులను ఎరుకొని వచ్చి వాటిని అమ్మేవాడు.వారికి ఉన్న కటిక పేదరికం అతన్ని బడికి వెళ్ళకుండా చేసింది అని ముత్యాలు (పుట 36) వ్యధని తెలియజేశాడు భరద్వాజ. "వెదురుతో వేయి రకాలు "లో ప్లాస్టిక్ వచ్చిన తరువాత చేతివృత్తుల వారు జీవన శైలి ఎలా మారిందో వెదురు బుట్టలు, చేటలు, నిచ్చెనలు, ఇంటి పైకప్పు కోసం వాడె తడకలు తాయారు చేసుకొనే కిష్టయ్య, అతని కుమారుడు తిరుపతయ్యల జీవిత చిత్రానల ద్వారా మనముందుంచారు రావూరి. కొమ్ముతో బొమ్మలు చేసుకొనే ఖాసీం జీవిత గాధను కూడా మనకళ్ళకు కట్టినట్టు చూపించారు. 'కాదేది శిల్పికనర్హం' అన్నట్లు జీవన సమరంలోని ప్రతి కథకు వైవిధ్యభరితమైన శీర్షికలనిస్తూ ఈ కథలను చెక్కారు. ఆ కథలు చదవగానే ఆ పాత్రలు ఇప్పటికి మనమున్న సమాజంలో మన చుట్టూనే రోజూ ప్రతి ప్రతిబింబించేలా చేశారు

కల ప్రతి వ్యక్తి తన జీవితంలో ఏదో ఒక కలలు కంటూనే ఉంటారు. కానీ ఎంతమంది జీవితంలో ఆ కల కలగానే మిగిలిపోతుందో కదా! అలాగే ఓ కల కని దాన్ని చెబుతున్న ముని కన్నయ్య మాటల్లో... ప్రస్తుతం పాఠశాల దగ్గర చిన్నపిల్లలకు పీచు మిఠాయిలు అమ్ముకుంటున్న ముని కన్నయ్య మాటల్లో (పుట 107) భరద్వాజగారు వర్ణించారు. ఈ గాథలో మునికన్నయ్య కాళ్ళు లేకపోయినా తన కాళ్ళ మీద తాను నిలవాలనే ఆత్మస్థైర్యంతో సాగిస్తున్న జీవనాన్ని ఇందులో చూపించారు.

అలాగే సైకిల్ బాగు చేయడం వల్ల ఎందరో గమనానికి కారణం అవుతున్నాడు గానీ తన జీవితంలో ఎలాంటి గమనం లేని మస్తాన్ జీవితాన్ని "చేదు విషం జీవ ఫలం పుట 88" అనే దానిలో సైకిల్ రిపేర్ చేసే మస్తాన్ జీవితాన్ని చూపిస్తూ, భవిష్యత్తుని చెబుతూ తన భవిష్యత్తును మాత్రం తేల్చుకోలేని చిలక జోస్యం చెప్పే యశ్వంతరావు :ముందు గతి కానవే చిలుకా..." ఇలా ఎంతోమంది అట్టడుగు వర్గాల జీవిత వ్యధల్ని రావూరి భరద్వాజ గారు చిత్రించారు.

ఈ పుస్తకంలోని ఈ కథల ద్వారా 1980 ఆ ప్రాంతంలో ఉండే ఆనాటి సామాజిక ఆర్థిక పరిస్థితులు తెలుసుకోవచ్చు. ఈ కథల ద్వారా ఆయనలోని భాష శైలి, ఆయన ఉపయోగించిన సామెతలు, జాతీయాలు అప్పట్లో తెలంగాణ ప్రాంతంలోని ముఖ్యంగా హైదరాబాద్ లోని మాండలికాలు ఎన్నో కనిపిస్తున్నాయి. ఈ జీవన సమరంలోని ప్రతి కథను నిశితంగా పరిశీలిస్తే రావూరి భరద్వాజగారు ఒక క్రమ పద్ధతిలో ఈ కథల్ని చిత్రించిన విధానం, మొదట ఆ కథను సంబంధించి కొంత వర్ణన చేసి దానితో పాఠకునిలో ఆసక్తి రేపిలా చేసి తర్వాత నిదానంగా ఆ వ్యక్తి జీవితంలోని వేదనను అద్భుతంగా తీర్చిదిద్ది, చివరిలో ఒక ప్రశ్నను పాఠకునిలో మదిలో మెదిలేలా చేసిన విధానం మనకు ఈ స్కెచెస్‌లో కనిపిస్తుంది. ఇలా ఇంతమంది జీవితాన్ని దగ్గర నుండి చూసిన అనుభవం, తన తర్వాత ఇతర రచనల్లో ప్రతిఫలించినట్లు కూడా చెప్పవచ్చు. అందుకే భారత ప్రభుత్వం ఆయన రచనలకు జ్ఞానపీఠ్ అవార్డుతో సత్కరిం

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

చగా, అయన ఆ అవార్డుతో తెలుగు సాహిత్యాన్ని మరింత సుసంపన్నం చేశారు.

### ముగింపు :

రావూరి భరద్వాజ అట్టడుగు స్థాయి నుంచి అందలానికి ఎదిగినవాడు. ఆయన రాసిన పుస్తకం 'జీవన సమరం' ఆయన జీవితానికి ప్రతీక. అది ఆయన లాంటి లక్షలాది జన జీవితాల జీవన సమర సారం మనకు దీనిలో కనిపిస్తుంది. వారి జీవన సమరంలో అనేక వృత్తుల వారిని ఇంటర్వ్యూ చేసిన తీరు చాలా విలక్షణమైనది. దీని గురించి 'నిఖిలేశ్వర్' ఇంగ్లిషులో ఒక వ్యాసం కూడా రాశారు. అలాగే జీవన సమరం పుస్తకాన్ని "జీవనసంగ్రామ్" అనే పేరుతో శ్రీ వి. హరినారాయణగారు హిందీలోకి అనువాదం చేశారు. 1940లో తెనాలి జీవితంలో ఆలూరి భుజంగరావు, శారదలతో పాటు దారుణమైన దారిద్ర్యం అనుభవించి, ఆ జీవితం నుంచి అక్షరాలలోకి ఎదిగిన రచయితగా ఆయన జీవన సమరంలో మళ్లీ అటువంటి జీవితాలనే రూపుకట్టాడు. అందుకే జీవన సమరం పుస్తకానికి 1983వ సంవత్సరంలో "అంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి", "కేంద్ర సాహిత్య అకాడమి అవార్డులు" లభించాయి. ఆయన 'జీవనసమరం' సామాన్యుడి కష్టసుఖాల్ని అత్యంత సహజంగా ఆవిష్కరించిన రచన. నిరంతరంగా సాహిత్య సృజన చేస్తూ, సమాజంలో ఆదర్శవాదాన్ని నెలకొల్పడానికి కృషి చేశారాయన. ఆ విధంగా భరద్వాజ గారు తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో జీవితాంతం రచనలో జీవించారు.

### ఉపయుక్త గ్రంథసూచి :

- భరద్వాజ రావూరి. జీవన సమరం (వ్యధార్త జీవుల యదార్థ గాథలు) విజయవాడ: శ్రీ కమలా పబ్లిషింగ్ హౌస్ 1981.
- భరద్వాజ, రావూరి. కాదంబరి. హైదరాబాద్ :విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ 1989.
- మధుకర్ ఎస్(సంపా). రావూరి భరద్వాజ రచనలు ఒక పరిశీలన. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ 2013.
- లక్ష్మి, రావూరి. డా. రావూరి భరద్వాజ సాహితీప్రస్తావన. హైదరాబాద్ :విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ జూలై 2014.

# డా॥ రావూరి భరద్వాజ – జీవన సమరం

## వ్యధార్తజీవుల యధార్థ గాథలు

- సోనబోయిన సతీష్
తెలుగు అధ్యాపకులు
శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ & పి.జి. కళాశాల, వరంగల్.

రావూరి భరద్వాజ గారు హైదరాబాద్ సంస్థానానికి చెందిన "పరిటాల జాగీర్" లోని మోగులూరు గ్రామంలో, 1927 జూలై 5న జన్మించారు. తండ్రి పేరు కోటయ్య, తల్లి పేరు మల్లికాంబ. పెరిగింది గుంటూరు జిల్లాలోని తాడికొండ గ్రామంలో.

పొట్టకూటి కోసం – వ్యవసాయ కూలీగా, పశువుల కాపరిగా, రంపంలాగే పనివాడిగా, తిత్తులూదే కూలీగా, పేపరు బాయ్‌గా పని చేశారు.

17వ ఏటనుండి రచన చేయడం ప్రారంభించారు. అచ్చయిన తొలికథ – 'విమల'. 1946 ఆగష్టు ఆఖరి వారం ప్రజామిత్రలో అచ్చయింది. అచ్చయిన తొలి పుస్తకం – 'రాగిణి' 1950లో. ఆయన రాసిన "దేవరాజకీయాలు" కథ అప్పట్లో స్వర్ణకంకణం అందుకొంది. ఆయన ఇప్పటికి దాదాపు 43 కథలు బాలలకు, 17 నవలలు, 11 సాహిత్య గ్రంథాలు, 33 సైన్సు కథలు రాశారు.

1968 లోనూ, 1983 లోనూ రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1987లో సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు, అదే సంవత్సరం భారతీయ భాషాపరిషత్ వారి అవార్డు కాక ఇంకా చాలా పురస్కారాలు అందుకున్నారు. వీరి రచనలు అనేకం ఇంగ్లీష్, హిందీ, తమిళం, కన్నడం, మలయాళం భాషల్లోకి అనువదింపబడ్డాయి.

మూడు విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్ యిచ్చి సత్కరించాయి. వీరి రచనల మీద నాలుగు విశ్వవిద్యాలయాలలో పి.హెచ్.డి. స్థాయి పరిశోధనలు జరిగాయి.

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో తెలుగు ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా ఉద్యోగ విరమణ చేసిన డా॥ భరద్వాజ గారు చదువుకున్నది ఏడవ తరగతి వరకు మాత్రమే!

భరద్వాజ రచన 1965 సంవత్సరంలో "కృష్ణా పత్రిక"లో సీరియల్‌గా వెలువడిన, ఈ "పాకుడు రాళ్లు" నవలకు – 2012 సంవత్సరానికి 'జ్ఞానపీఠ' పురస్కారం లభించింది.

**భరద్వాజ గారి రచనలు :**

పాకుడురాళ్లు, ఉడుతమ్మ ఉపదేశం, కథా సంపుటి దాదాపుగా 500లకు పైగా కథలు, 150కి పైగా పుస్తకాలు రాయడం జరిగింది.

రావూరి భరద్వాజ గారు కలం కార్మికుడు. పేద రైతు కుటుంబంలో పుట్టి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న ఆయన, పొట్ట నింపుకోవటం కోసమే కలం పట్టి రచయితగా మారాడు. ఆ కాలంలో రచన చేయటమంటే సులభసాధ్యమైన వ్యవహారం కాదు. ఆయన రచయితగా అడుగులు వేస్తున్న దశలో ప్రముఖ, ప్రఖ్యాత, మహా రచయితలూ, కవులతో తెలుగు సాహితీ ఉద్యానవనం పలు రంగులతో (రంగులకు అర్థాలుంటాయి) అలాంటి వాతావరణంలో ఒక సామాన్య రచయిత ఎవరో ఒకరి ప్రభావంలో చిక్కుకోక తప్పని స్థితి. యుక్త వయస్సులో భరద్వాజ గారిని సహజంగానే చలం ఆవహించాడు. అందుకే తొలి దశలో ఆయన చలం శైలిలోనే రచనలు చేశారు. ఆ రచనలతోనే ఆయన అందరి దృష్టిని ఆకర్షించాడు.

సాహిత్య రంగం కమనీయమైనదే కాదు, కఠోరమైనది కూడా. ఆయన మీద చలం ముద్ర పడి పోయింది. ఆ ముద్రని అధిగమించాలంటే సాహితీ సముద్రాన్ని ఈదటంలో నైపుణ్యం సాధించాలి. ఆయన చదువుకున్నది అంతంత మాత్రమే. ఆంగ్లం అసలే తెలియని వాడికి ప్రపంచ సాహిత్య రీతులు తెలిసే అవకాశమే లేదు. తన బలహీనతలనన్నింటినీ సవరించుకుని తనదైన స్వంత శైలిని సృష్టించుకున్నారు.....

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

భరద్వాజ గారు జీవన సమరం వ్యథార్తజీవుల యధార్థగాథలు ఒక సంఘటనను కళాత్మకంగా చిత్రించడం ముఖ్యమే! అంతకన్నా ముఖ్యం – ఆ సంఘటన వెనుక గల సాంఘిక, ఆర్థిక, రాజకీయ కారణాలను చిత్రించడం! భరద్వాజ గారు ఈ రెండవ పనిని నిర్భయంగానూ, నిస్సంకోచంగానూ చేశారు. అలా చేశారు గనుకనే, ఆయన సృష్టించిన వందలాది పాత్రల పట్ల మనకు సానుభూతి, అనుకంప కలుగుతుందే తప్ప, ఈర్ష్య, ద్వేషం, అసహ్యం కలగవు. ఆ పాత్రలు కూలీలయినా, మాలీలయినా ; భ్రష్టులయినా, నికృష్టులయినా; పతితలయినా, పవిత్రులయినా ; జారులైనా, చోరులైనా, మన హృదయాన్ని కరుణరస ప్లావితం చేస్తున్నాయి ఆయన గారి రచనలు.

భరద్వాజ గారు బతుకు కోసం మానవుడు పడే పాట్లు – అసంఖ్యాకంగా ఉన్నాయి. వీటిలో ఏ కొన్నింటినో మనం వృత్తులుగా గుర్తిస్తున్నాం సరే – మరి మిగిలిన వాటి మాటేమిటి? అవి వృత్తులు కానే కావా? మాటవరసకు 'కావు' అని అనుకున్నా, ఆ కాని వృత్తులనే అంటిపెట్టుకుని బతుకుల్ని వెళ్లమారుస్తున్న వారి సంగతేమిటి? వారు అల్లానే జీవించడం వెనుకగల పరిస్థితులేమిటి? "పతితులూ, భ్రష్టులూ, భాధా సర్పదష్టులూ" అయిన – ఈ సోదరీ సోదరుల జీవితగాధలను అక్షరబద్ధం చేసి పాఠకులకు అంద జేయాలనీ, ఈ బాధామయ గాధా పరంపరకు 'జీవన సమరం' అన్న శీర్షికను ఉంచాలనీ సంకల్పించినప్పుడు, 'ఈ శీర్షికా నిర్వాహకులెవ'రన్న ప్రశ్న ఉదయించనే లేదు.

**ఎందుకో మనవి చేస్తాను –**

భరద్వాజ జీవితం వడ్డించిన విస్తరికాదు. బతుకులోని కష్టాలనూ కన్నీటినీ కడముట్టా చూసినవాడు. చారెడు గంజి కోసమూ బారెడు గుడ్డ కోసమూ కలవరించిన వాడు. ఆకలి, అవమానం ఆవిద్య, దారిద్ర్యం, నిరుద్యోగం, నిరాదరణ, పుక్కిలింతలుగా అనుభవించిన వాడు. జీవనపథంలో కాలూని నిలవడం కోసం రకరకాల వృత్తుల్నీ చేసినవాడు. ఆ వృత్తుల్లోని సాధక బాధకాలను కష్టనష్టాలను అమానుషత్వాన్ని పదిలంగా గుండెల లోతుల్లో దాచుకున్నవాడు. అయితే అతని ఈ అనుభవాలు – జ్ఞాపకాలు, వృథాకాలేదు. భరద్వాజ వాటిని వృథా కానివ్వలేరు కూడా. వాటి సారాన్ని వొడిసి, పిండి, పీల్చుకొని మహా రచయితగా ఎదిగాడు. ప్రఖ్యాత రచయిత, క్వాజా అహమ్మద్ అబ్బాస్ అన్నట్లు – 'భరద్వాజ రచనల్లో సహజత్వం, లోతువైవిధ్యం వెల్లి విరియ డానికి, ఆయన పాత్రలు జీవ చైతన్యంతో స్పందించడానికీ, విస్తృతమైన ఆయన జీవితానుభవాలే ముఖ్యకారణాలు!"

"జీవన సమరం" వంటి ఉదాత్తమైన శీర్షికను నిర్వహించ డానికి చాలా దక్షతలు కావాలి. వివిధ వృత్తుల వారిని కలుసుకోవాలి. వారు చెప్పినవన్నీ ఓపికగా వినాలి. వారు చెప్పని వాటినీ, వాటి పూర్వాపరాలను, వారి నుండి నేర్పుగా రాబట్టాలి. ఆయా వృత్తులకు సంబంధించిన సాంకేతిక పరమయిన సమాచారాన్ని సేకరించాలి. వారి అంత రంగాన్ని, వారి ఆలోచనల్ని, అనుభూతుల్ని, "రికార్డు" చేయడం జరిగింది. వారనుభవిస్తున్న ప్రస్తుత స్థితికి వెనుక గల సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాలను వివేచించు కోవాలి. ఈ పనులన్నీ 'ఉద్యోగ ధర్మం'గా కాకుండా, అంతకు మించిన మానవతా దృక్పథంతో చేయవలసి ఉంటుంది. ఆ వృత్తిపట్ల, వృత్తిదారుల పట్ల, సానుభూతి, అనుకంప, ఆత్మీయత, ఉన్నవారు తప్ప – ఈ శీర్షికను నడపలేరు.

**తప్పెట్లోయ్... తాళాలోయ్!**

కథలో రచయిత "తాళంచెవి గురించి చెప్పిన సంద ర్భంలో" 'తాళం' అన్న మాటకు చాలా అర్థాలున్నాయి. ఇద్దరు మల్లయోధులు హోరాహోరీగా పోరాడుతున్నప్పుడు ఎదుటి వారిని చిత్తు చేసేందుకు ఒక యోధుడు ఉపయోగించే బంధవిశేషం అని ఒక అర్థం వున్నట్టు మహాభారతం చెబుతున్నది. తాడిచెట్టు అనీ, పాట పాడేటప్పుడు లయ కోసం చేతితో చేసేటప్పుడు అనీ, కాల పరిమాణం తెలియ జేసే విధానమనీ, 'బీగం' అనీ ఇల్లాగా చాలా వున్నాయి.

అసలీ బీగాలు ఎప్పుడు వెలిశాయో ఖచ్చితంగా చెప్పగల ఆధారాలేమీ లేవు. అనాది మానవునకు ఏ పూట తిండి ఆ పూటకే కాక, మరో పూటక్కూడా సంపదించటం నేర్చు కొన్నప్పటి నుండీ ఈ తాళం అంటే బీగం వాడుకలోకి వచ్చి ఉండాలి.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

తన సంపాదనను మరొకరు కాజేయకుండా దాచుకోవడానికి అతను అనుసరించిన విధానాలన్నీ తాళం తయారు కావడానికి తోడ్పడ్డాయి. తన ఆర్జనను కొండ సెరియల్లోనో, గుహల్లోనో దాచిపెట్టి అది మరొకరికి కన పడకుండా ఏ రాతిపలకనో అడ్డం పెట్టి వుంటాడు అనుకొంటే అదే మొదటి తాళమని మనం చెప్పుకుందాం.

వ్యక్తిగత ఆస్తులు పెరిగినకొద్దీ అవి మరొకరు దోచుకుపోకుండా దాచుకోవలసిన అవసరాలు కూడా పెరుగుతూనే వున్నాయి. ఇలా పెరుగుతున్న అవసరాలే రకరకాల తాళాలు వెలియడానికి కారణాలవుతున్నాయి అని చెప్పడం జరిగింది.

రచయిత గారు "ఛత్రపాణి – గొడుగు కథ " గూర్చి "పాల సముద్రంలో శేషుడి మీద పడుకొన్న శ్రీమన్మహావిష్ణువుల వారికి ఆ శేషుడే గారే, తన పడగలు విప్పి, గొడుగు పట్టిన బొమ్మను, మీరంతా చూసే వుంటారు. ఆ విష్ణువుగారే వామనావతారమెత్తి, బలిచక్రవర్తిని మూడడుగుల నేల దానమడిగినప్పుడు, ఓ చేత బుడ్డిచెంబు, మరోచేత ఆతపత్రమూ ధరించిన అవటువును చూచిన బలి చక్రవర్తి గారు – ఆ వచ్చినవాడు సాక్షాత్తూ, విష్ణుమూర్తి అవతారమేనని గ్రహించినటువంటి వాడయి, వెంటనే వొప్పుకుని, పాతతలోకానికి వెళ్ళిపోయాడు.

ఇటు ప్రాచ్యదేశాలనూ, అటు పాశ్చాత్యదేశాలనూ పరిపాలించిన వొకనాటి చక్రవర్తులూ, మహాప్రభువులు, మహారాజులు, ఇంట్లో వున్నా, వీదిలోకొచ్చినా, గొడుగుల్ని వదలలేదు.

ఈ అలవాటు మంచిచెడ్డల మాటనలా వుంచితే, ఇది మనకు దేవతలనుంచి సంక్రమించిందని చెప్పుకోవచ్చు. మన గర్భగుళ్ళలోని దేవతా విగ్రహాలను వోసారి చూడండి. వివిధాలంకారాలతోపాటు చిన్న గొడుగు కూడా వారి నెత్తిమీద మెరుస్తూ వుంటుంది.

కటిక పేదలు, ఎండా వానల నుండి రక్షణ కోసం ఏ తాటియాకునో నెత్తినే వేసుకుంటే, కాస్త కలిగిన వారు తాటాకు గొడుగును వేసుకొనే వారు. అదే మహారాజులయితే, ముత్యాల గొడుగులు పట్టించుకొనేవారు కాదు అని భరద్వాజ గారు గొడుగు కథలో చెప్పడం జరిగింది.

శ్రీ భరద్వాజ గారు "జీవన సమరం" శీర్షికన వెలువడిన ఈ రచనలన్నీ, మన సామాజిక జీవనానికి ప్రతిబింబాలు. ఇందులోని వ్యక్తులు – మనకు బాగా తెలిసినవారు. మనతో బాటు మన మధ్యనే జీవిస్తున్నవారు. వీరిని గురించి మనం ఆలోచించం! వీరిని చూసి మనం స్పందించం. ఈ "అధో జగత్స హోదరు"ల బతుకుల్లోకి తొంగి చూడాలంటేనే మనకు భయం.

శ్రీ భరద్వాజ – మనం చేయలేని ఈ పనులన్నీ చేశారు. వారి బతుకుల్లోకి తొంగిచూసి, స్పందించి, మనల్ని స్పందింపచేశారు. వేయ్యేళ్ల తెలుగు సాహిత్య చరిత్రకు – అచ్చంగా, అట్టడుగు వర్గాల యథార్థ చరిత్రలలో నిండిన తొట్టతొలి గ్రంథాన్ని చేర్చిన ఘనత – భరద్వాజకే సొంతం.

డా॥ రావూరి భరద్వాజ గారికి నా నమో...వాకాలు...

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# రావూరి భరద్వాజ గారి "జీవనసమరం" – శ్రామిక జీవన స్పృహ

- డా॥ యం. విజయశ్రీ
తెలుగు లెక్చరర్,
జె.కె.సి. కాలేజి, గుంటూరు.

ఒక కుగ్రామంలో మామూలు మధ్య తరగతి కుటుం బంలో పుట్టి, బాల్యంలోనే బతుకు బరువు నెత్తుకుని, అక్షర ప్రపంచంలో కాలుమోపి, అక్షర సాహిత్య నిధులను విశ్వ మానవాళికి అందించిన అక్షర భగీరథుడు డా॥ రావూరి భరద్వాజ.

రావురి భరద్వాజ పుట్టి బుద్దెరిగాక ముప్పై రెండు సంవత్సరాలు ఆకలినీ, దరిద్రాన్నీ తట్టుకుంటూ చిన్నా చితకా ఉద్యోగాలతో బతుకుబండి నెట్టుకుంటూ, బాధలు, కష్టాలు, అవమానాలు, ఈసడింపులే మూలకందంగా – రచయితగా తనను తాను తీర్చిదిద్దుకుంటూ కథ, నవల, నాటకం, బాలసాహిత్యం, స్మృతి సాహిత్యం, జీవిత చరిత్ర, విజ్ఞాన శాస్త్ర రచన – ఇలా అనేక ప్రక్రియలలో ఎన్నో వినూత్న ప్రయోగాలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

## శ్రామికునిగా రావూరి సాహితీ ప్రస్థానం :

తెలుగు సాహిత్యానికి ముచ్చటగా మూడో సారి జ్ఞాన పీఠం వేసిన రావూరి భరద్వాజ బతుకు సమరంలో పిడికెడు మెతుకులు కోసం అలమటించారు. చిరిగిన చొక్కా, నిక్క రుతో బడికి వెళ్ళినందుకు చితకబాదిన మాస్టరు పుణ్యమా అని ఎనిమిదో తరగతిలో చదువుకు దూరమయ్యారు. ఆ ఘటనతో బడినుంచే కాదు, ఇంటి నుంచి పారిపోయారు. పొగాకు బ్యారన్‌లో బొగ్గువేసే కూలీగా, కలప అడతిలో, కమ్మరి కొలిమిలో సహాయకుడిగా, గొర్రెల కాపరిగా, పేపర్ బాయ్‌గా, కంపోజిటర్‌గా, ఫౌంటెన్ పెన్నుల కంపెనీలో సేల్స్‌మెన్‌గా పనిచేశారు. కన్నీటితో దాహం తీర్చుకొని, ఆకలినే ఆహారంగా మార్చుకొని, అవమానాలను దుస్తులుగా ధరించి నరకయాతన లాంటి బతుకు అనుభవించారు. చివరకు జర్నలిస్టుగా, రేడియో రచయితగా వివిధ వృత్తులు చేపట్టారు. రచనల్లో జీవనోపాధిని వెతుక్కున్నారు. తనకు గాఢంగా తెలిసిన పేద, దిగువ మధ్యతరగతి జీవితాలను తన రచనా ప్రతిభతో అక్షరబద్ధంచేశారు. 'చిన్నప్పటినుంచీ కష్టాలే. ఊహ తెలిసినప్పటి నుంచీ చాలాసార్లు ఏడ్చా... పస్తుల రాత్రులు ఎన్నో గడిపా... జీవితమంతా దారిద్రమే' అని ఆయన తన జీవితాన్ని గురించి వివరించారు. ఆ ఆకలి తీర్చుకోవడానికి రాయడం మొదలుపెట్టానని చెప్పారు. ఆ రాయండలో మాత్రం పిరికితనం ప్రదర్శించలేదు. కసిగా రాశారు. తాను చూసిందీ, భరించిందీ, అనుభవించిందీ శక్తిమంతమైన అక్షరంగా మార్చారు. ఆకలి, అన్యాయం, పేదరికానికి విధివశులైన ఎందరో అభ్యాగుల కన్నీటి గాథ లకు అక్షరాస్త్రాలు అందించి బతుకు సమరంలో సావజిక చేతనను పురిగొల్పారు. 'దారిద్ర్యం చాలా మందికి పిరికి పాలు పోస్తోంది. నాకూ పోసింది. కానీ, ఆ పాలు తాగి నేను రాటుతేలాను. నా చిన్నతనంలో అన్ని బాధలు, కష్టాలు, అవమానాలు, ఈసడింపులు అనుభవించకపోతే నేనసలు రచయితను అయి ఉండేవాడినే కాదు'. అంటూ రచయితగా తన ప్రస్థానం ఎలా మొదలైందో ఆయన స్పష్టం చేశారు.

## జీనవ సమరం – శ్రామిక జీవన స్పృహ :

ఈ జీవన సమరం ఎన్నో ప్రత్యేకతలు సంతరించుకొంది. పత్రికా రచనకు సాహిత్య పరిమళాన్ని అద్దింది. సాధారణ పాత్రికేయులు సేకరించిన సమాచారాన్ని అందంగా మలచి సమగ్రజీవన కావ్యంగా తీర్చిదద్దారాయన. వ్యాపార పత్రికా రంగంలో సాహిత్యాభిరుచి, సామాజిక దృష్టికి పెద్దపేట వేసేలా ఈ రచనలు చేశారు. వెయ్యేళ్ల తెలుగు సాహిత్య చరిత్రలో అచ్చంగా అట్టడగువర్గాల యథార్థ చరిత్రలను అక్షరబద్ధం చేసిన తొలి రచనగా ఇది నిలిచింది. బహుశా ప్రపంచ సాహిత్యంలోనే ఈ తరహా రచన ఇదే మొదటిది కావచ్చు. 'సహస్ర సహస్రాబ్దాలుగా, ఈ లోకంలోని కోట్లాది సామాన్యుల గొంతుక మూగబోయింది. తమకేం కావాలో చెప్పుకో లేకుండా ఉన్నారు. నేను శబ్దంగా మారి వారి

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

గొంతుకుల తలుపులు తెరుద్దామని ఉంది. వారిని తట్టి, కొట్టి, తిట్టి, అరిచి నిద్రేలుపదామని ఉంది. అలాంటి శక్తిని నాకు ప్రసాదించు ప్రభూ!" అంటూ భరద్వాజ తన రచనలు సుస్పష్టం చేశారు. ఆ ప్రయత్నంలో పుట్టుకొచ్చిందే జీవన సమరం.

ఒక పత్రికలో శీర్షికలా వచ్చిన ఈ కథనాలు అమూల్య సాహిత్య చిత్రాలుగా రూపు కట్టాయంటే భరద్వాజ రచనా శిల్పం విశిష్టతే కారణం. చారిత్రక క్రమగతుల అవగాహన, మానవజాతి భవిష్యత్తు గురించి స్పష్టమైన అభిప్రాయమూ, సామాజిక మూలాలేమిటో గుర్తించడం వల్లే ఆంతరదృష్టితో సజీవ రచనగా వాటిని మలచగలిగారు. పాత్రికేయ రచయితగా తనకున్న పరిమితుల్లోనే అనేక జీవితాల లోతు పాతుల్ని పట్టిచూపగలిగారు. మనిషి ఆకార వికారాలు, స్వభావ స్వరూపాలు, బతుకు దౌర్భాగ్యం, అదృష్టం అన్ని చెబుతూనే ఏమీ చెప్పనట్లు గంభీరంగా తన రచన ముగిస్తారు. అయితే పాఠకుడు ఆలోచించే కొద్దీ వెంటాడుతూనే ఉంటాయి ఆ పాత్రలు ఆ కథానికా. అదే ఆయన రచనలో మెరుపు. అనితరసాధ్యమైన సంవిదానంతో కథనం నడుపుతూ పఠితను కథానికతోనూ, తనతోనూ కూర్చోపెడతారు. ఆయన కథనం, శైలి ప్రత్యేకత అది. ఆయన జీవతపు మిట్టపల్లాలు చవిచూడడం వల్లే ఈ విజయం సాధించగలిగారు. డేవిడ్ కాపర్‌ఫీల్డు, ఆలివర్ ట్విస్ట్, లిటిల్ డారిట్ అనే గ్రంథాలు రాసిన డికెన్సు బాల్యంలో చాలా కష్టాలు అనుభవించాడు. చేదు జీవితం రుచిచూశాడు. ఆ అనుభవాలే ఆయనను గొప్ప రచయితగా నిలిపాయి. ఎంతో భావనా సంపత్తును అనుభవంలో సంపాదించుకోవడం వల్లే గోర్కి బాల్జాక్, డోస్ట్‌వస్కీ తదితరుల మాదిరిగా భరద్వాజ కూడా ఈ గొప్ప గ్రంథాన్ని అందించగలిగారు.

బాధామయ జీవితాన్ని అనుభవించిన వ్యక్తిగా రావూరి భరద్వాజ అట్టడుగు వర్గాల బతుకు పోరాటాన్ని అక్షరీకరించారు. ఆయన రచించిన జీవన సమరం, అనే కథా సంపుటిలో బతుకు భారంగా జీవనం సాగిస్తున్న తాడిత, పీడిత ప్రజల వ్యథార్త జీవుల యథార్థ గాథలను ఆవిష్కరించారు. సాధారణ పాత్రికేయ వృత్తిలో భాగంగా సేకరించిన సమాచారాన్ని అందంగా మలచి సమగ్ర జీవన కావ్యంగా తీర్చిదిద్దిన మహాశిల్పి రావూరి. ఇది ప్రపంచ సాహిత్య చరిత్రలోనే, సరికొత్త ప్రక్రియకు నాంది. ఆకలితో అనేక వృత్తుల్లో అలమటిస్తున్న అభాగ్యుల కన్నీళ్లకు భరద్వాజ ఇచ్చిన అక్షర నివాళి ఇది.

టిఫిన్ క్యారియర్లు మోసే అంజమ్మ, తాళాలు బాగు చేసుకునే జహంగీరు, మిరపకాయ బజ్జీలు అమ్ముకునే సావిత్రమ్మ, కొలిమి దగ్గర సమ్మెట శ్రీరాములు, సవరాలు కట్టే రాములు, రిక్షా తొక్కే పుల్లయ్య, రైలు డబ్బాల్లో చెత్తాచెదారం ఊడుస్తూ వచ్చే బాలిగాడు, బట్టలు ఇస్త్రీ చేసే సలీం, మురుగు క్వాలలో మట్టిని జల్లించే పెంటయ్య, ఇలా చెబుతూ పోతే ఎన్నని... ఎంతని చెప్పినా అవి కొన్నే. కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం, సాలెలల మగ్గం, శరీర కష్టం స్ఫురింపజేసే గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి... ఇట్లా ఎన్నని పేర్కొనడం? ఒక్కమాటగా చెప్పాలంటే సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలకు విశ్వరూపమే ఈ జీవన సమరం. ఆయన చేసిన సాహితీ సేవ ఒక ఎత్తు, జీవన సమరం ఒక ఎత్తు. సమాజంలో అట్టడుగు వర్గాలకు కావ్యగౌరవం కల్పించి సహస్ర ముఖాలుగా ఉన్న జీవన సమరాన్ని ఆయన ఆవిష్కరించిన తీరు అనితర సాధ్యం.

'ఛత్రపాణిలో గొడుగుల కుట్టేవాడ్ని గురించి చెప్పడానికి పాలసముద్రం, శేషుడు, మహావిష్ణువు, పడగ విప్పి గొడుగు పట్టడం గుర్తుచేస్తారు. గొడుగులు కుట్టేవాని జీవన చిత్రం చెప్పడంతో సరిపెట్టుకోకుండా పురాణ ఘట్టాలను కళ్ల ముందు ఉంచుతూ మన సంస్కృతీ సంప్రదాయాల్లో గొడుగు ఎంతగా పెనవేసుకొని పోయిందో తెలియజేస్తారు. 'కాయ కల్ప చికిత్స' చేసే రజాక్ గురించి చెప్పడానికి మొక్కలకు జీవం ఉందని రుజువు చేసిన జగదీశ్ చంద్రబోసు, లోహాలు అలసిపోతాయని చెప్పిన హెర్బర్‌మిల్లర్ గురించి గుర్తు చేస్తారు. 'దూడూ బసవన్న'లో 'ఈ విద్య నాతో ఆఖరు సార్' అని గంగడోలును ఆప్యాయంగా నిమురుతూ చెప్పినప్పుడు తనకు బతుకుదెరువు పోతుందన్న భయం కన్నా

తన వృత్తి కనుమరుగైపోతుందన్న బాధ బసవయ్య మాటల్లో ధ్వనించింది. ఇది వృత్తుల పట్ల భరద్వాజకు ఉన్న ప్రేమను తెలియజేస్తాంది. ఇలా ఈ పుస్తకంలో శ్రామిక వృత్తులవారిని గురించి, వారి జీవన క్లేశాల గురించి వివరించడమే గాకుండా తత్వశాస్త్రం, సైన్సు, సాహిత్యం, స్వాతంత్ర్యం, సమరం, తెలంగాణ సాయుధ పోరాటం. ఇలా ఎన్నెన్నో అంశాలను అంతర్లీనంగా ప్రస్తావిస్తూ, వివరిస్తూ, విశ్లేషిస్తూ ఈ కథనాలను నడిపిన తీరు అమోఘం. అది ఆయనకే సాధ్యం. అట్టడుగు వర్గమంటే సాంఘిక అసమానతలకు గుర్తు. అణచివేత, అవమానాలకు ఆలవాలం. ఆకలి దహిస్తుంటే ఆక్రోశం, అణచివేస్తుంటే ఆందోళన సహజం... ఆ రెండూ అక్షరరూపం దాల్చినప్పుడు వాటిలోంచి మాడుతున్న పేగు వాసన ఉబికివస్తుంది. ఈ పుస్తకంలోని ప్రతి కథనంలో శ్రమజీవుల స్వేద పరిమళమే కాదు, మలమల మాడుతున్న పేగు వాసలు మన ముక్కుపుటాలను తాకుతాయి. మన గుండెను స్పృశిస్తాయి. సమాజంలోని అభాగ్యుల జీవితాలను ఎత్తి చూపుతూ పరోక్షంగానో, ప్రత్యక్షంగానో ఆయన పరిష్కారాలను సూచించారు. సామాజిక, ఆర్థిక పరిస్థితుల మార్పుతోనే వారి కష్టాలు గట్టెక్కుతాయని స్పష్టంచేశారు.

**ముగింపు :**

భరద్వాజ జీవన సమరంలోని పాత్రలన్నీ మన కళ్లెదుట ఉన్నవే, మనకు పరిచయం ఉన్నవే.. కల్పనలు కావు.. అయితే మన మనసులను కదిలించేలా, హృదయాలనను కరిగించేలా, మేధను రగిలించేలా, లోకంలోని కుళ్లును కడిగేసేలా వాటిని తీర్చి దిద్దారు. అంతేకాదు 'తలందుకోకు నేస్తం. నీ చూపు భూమిని గుద్దుకుని ఆగిపోతుంది. శిరమెత్తి పైకిచూడు. అది అనంతంలోకి దూసుకు పోతుంది' అంటూ ఆ శ్రమ జీవులకు మార్గనిర్దేశం చేసిన మహనీయుడు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# "సామాజిక చైతన్య ప్రబోధం – రావూరి భరద్వాజ సాహిత్యం"

- దాసరి శారద
తెలుగు అధ్యాపకురాలు,
సి. హెచ్. యస్. డి. సెయింట్ థెరిస్సాస్
మహిళా కళాశాల(స్వయం ప్రతిపత్తి), ఏలూరు.

సమాజాన్ని సమాజ పోకడలను, వ్యక్తుల స్వభావాన్ని సునిశితంగా పరిశీలించిన రచయిత భరద్వాజ. తెలుగు సాహిత్యంలో పాతికేళ్ళ జ్ఞానపీఠ అవార్డ్ దాహానికి తెరదించిన అక్షరశిల్పకారుడు రావూరి భరద్వాజ. అవమానాలను, ఆకలిని, దారిద్ర్యాన్ని, ఈసడింపులను కలగలిపి ఆకళింపు చేసుకుని, సాహితీ శిఖరమై ఉలితో రాతి అక్షరాలను గొప్ప కథలుగా, నవలలుగా మలిచి మనముందుంచిన రచయిత రావూరి భరద్వాజ. ఎనిమిదవ తరగతి కూడా పూర్తి చేయ కుండా మధ్యలోనే ఆపేసిన రావూరి లోకానుభవంతో పది హేడేళ్ళకే కలాన్ని చేతపట్టి సాహిత్యరంగంలోకి అడుగు పెట్టాడు. ప్రారంభంలో పద్యాలు రాశాడు. శుద్ధగ్రాంథికాన్ని రాశాడు. తర్వాత కాలంలో చలం రచనలు అతని సాహిత్య జీవితాన్ని గొప్ప మలుపు తిప్పాయి. పేరు పెట్టకుండా ఒక రచనను రావూరిదా? చలందా? అని కనుక్కోలేక పోయేంతగా చలం రావూరిని ప్రభావితం చేశాడు. చలం ప్రభావం నుండి బయటపడ్డానికి రావూరికి చాలా రోజులే పట్టింది. నిజానికి ప్రాణం ఉందా? ఉంటే సమాజం ఇంత నీచంగా దిగజారుతుందా? 'నిజం' అనే మాటకు ప్రజల్లో 'విలువ' ఉందా? మొదలైన ఎన్నో ప్రశ్నలను 'పేదనిజం కథ' ద్వారా రావూరి భరద్వాజ మన ముందుంచాడు. సమాజం నిజాన్ని సమాధి చేస్తూ డబ్బు, స్వార్థం, అన్యాయం రాజ్యమేలేటట్లు చేస్తుందని రావూరి భరద్వాజ 'పేదనిజం కథ' ద్వారా మనకు తెలిపాడు.

కవిత్వం, నవలా సాహిత్యంలోలాగానే కథాసాహిత్యంలో కూడా రావూరి భరద్వాజ సిద్ధహస్తుడు. ఆయన తొలికథ 'విమల'. అమ్మానాన్నలు, అమ్మమ్మ చిన్నప్పుడు చెప్పిన కథలు ఆయన రాసిన చాలా కథలకు నేపథ్యంగా ఉంటాయి. ఇంట్లోనుండి బయటకు వచ్చి లోకంలో ఎన్నిరకాల కష్టాలున్నాయో అన్నీ రావూరి పడ్డాడు. ఆకలి బాధను చూశాడు. దారిద్ర్యం ఎలా ఉంటుందో అనుభవించాడు. తన చుట్టూ ఉన్న సమాజం ఎలా ఉందో తీక్షణంగా పరిశీలించాడు. పేదరికం, వర్గ దోపిడీ, సమాజంలో స్త్రీ జీవితం, అట్టడుగు ప్రజల జీవితాలు ఇలా తన మనసును తాకిన ప్రతీది రావూరి కథలా మలిచే ప్రయత్నం చేశాడు.

రావూరి భరద్వాజ సుమారు 44 కథా సంపుటాలను రచించాడు. వాటిలో 19 కథా సంపుటాలు పుస్తక రూపం పొందాయి. మిగిలినవి అచ్చు కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అచ్చయిన వాటిలో 'శ్రీరస్తు' కథా సంపుటి ఒకటి. ఈ సంపుటిలో 5 కథలు ఉన్నాయి. వీటిలో మొదటి కథ మిగిలిన వాటి కంటే కొంత భిన్నంగా ఉంది. నాలుగు కథల్లో జంతుపాత్రలను ప్రతీకంగా తీసుకున్నాడు. వర్గ స్వభావాన్ని, చైతన్యాన్ని, పోరాటాన్ని తెలిపే కథలవి. మొదటి కథలో కూడా కొంత వర్గ స్పృహ ఉంది. అయితే ఈ కథకు, మిగిలిన వాటికి తేడా ఉంది.

## కథా సారాంశం :

శ్రీరస్తు కథాసంపుటి 1987లో అచ్చయింది. ఇందులో మొత్తం ఐదు కథలున్నాయి. వీటిని రెండుభాగాలుగా వర్గీకరించుకుంటే మొదటికథ మొదటిభాగంలోకి వస్తుంది. పరిమాణంలో కూడా ఇది మిగతా నాలుగు కథలకంటే పెద్దదిగానే ఉంది. వస్తుపరంగా కూడా మిగతా కథలకంటే మొదటికథ భిన్నమైనదే. 'ఒక పేదనిజం కథ' ఇందులో మొదటిది. శ్రీరస్తు అన్ని కథల్లో 'నేను' కథానాయకుడు. ఇక్కడ 'నేను' అంటే రచయిత. రచయిత అంటే రచయిత మాత్రమేకాదు, అతను మనుషులకు ప్రతినిధిగా మనకు కన్పిస్తాడు. ఈ విషయం కథలను చదివే క్రమంలో బోధపడుతుంది.

మొదటికథలో 'నిజం' అనే అమూర్త భావనకు ఒక రూపాన్ని కల్పించాడు రచయిత. అది ఒక వయోవృద్ధునిలా మారి చిక్కిపోయి, కథానాయకుని ఇంటి దగ్గరికి రావడం ఈ కథలోని వైవిధ్యమైన అంశం. ఇది రచయిత ఎత్తుగడలోనే చెప్తాడు. చెప్పేక్రమంలో ఆరోజు రాత్రి కథానాయకుడి ఇంట్లోకి ఒక అపరిచిత వ్యక్తి వచ్చినట్లుగా, కుర్చీలో కూర్చున్నట్లుగా సన్నివేశాన్ని కల్పించి పాఠకునికి కొత్త అనుభూతిని రచయిత ఇచ్చాడు.

నిజం, అబద్ధం అనేవాటిని కూడా వర్గదృష్టితో చూసినట్లు అర్థమౌతుంది. నిజమనేది పేదరికానికి ప్రతీక, అబద్ధం అనేది దోపిడీ వర్గానికి ప్రతీక. పాతరోజుల్లో నిజానికి ఉండే ప్రాధాన్యం రానురానూ తగ్గిపోయి వర్తమానానికి వచ్చేసరికి పూర్తిగా అబద్ధమే రాజ్యమేలుతోంది. ఈ విషయాన్నే 'నిజం' 'కథానాయకుడికి' చెప్తూ తన బాధనంతా వెల్లగక్కుతుంది. కథానాయకుడు మూడు సంఘటనలు చెప్పి, ఈ మూడుచోట్లా నిజం లేదని, ఒకవేళ అక్కడ నిజం ఉన్నట్లయితే మనిషికి నష్టమేనని, నిజం వల్ల మనిషి ఇప్పటికే చాలా సుఖాలను కోల్పోయాడని, అందుకే తనక్కాడ 'నిజం' పట్ల సరియైన అభిప్రాయం లేదనే విషయాన్ని చెప్తాడు.

రెండోభాగంలోని నాలుగు కథలు వరుసగా 'ఒక చీమ కథ', 'ఒక దోమ కథ', 'ఒక ఎలుక కథ', 'ఒక చిలుక కథ'లు ఉన్నాయి. అల్పప్రాణులైన చీమ, దోమ, ఎలుక, చిలుకలు వివిధ సందర్భాల్లో మనిషి చేసే స్వార్థాన్ని, మోసాలను, కుట్రలను వీటితోపాటు సామాన్య జీవితాలను, దోపిడీవర్గ సమాజాన్ని గురించి అనేక విషయాలను కథానాయకుడి ముందు చర్చకు పెడతాయి. సమాజంలోని ఆర్థిక, సామాజిక, రాజకీయ విషయాలకు సంబంధించిన అనేక విషయాలను అల్పప్రాణులచేత రచయిత చెప్పించడం ఈ కథల్లోని ముఖ్య విశేషాంశం.

'రాజు–ఏడు చేపలు' కథలోని చీమ 'ఒక చీమ కథ'లోని ప్రధాన పాత్ర. రాజు కథకు వివరణ ఇస్తూ, ఆకథలోని ఒక్కొక్క అంశాన్ని పూసగుచ్చినట్లు నేటి సమాజానికి అన్వయిస్తున్నట్లు కథ సాగిపోతుంది. రాజుగారి ఏడుగురు కొడుకులు ఏటికెళ్ళి ఏడు చేపలు తెస్తారు. ఇందులో రాజుగారి కొడుకులకు ఏటికెళ్ళి చేపలు తేవాల్సినంత అవసరం ఏముంటుందనే అనుమానాన్ని చీమ వ్యక్తపరుస్తుంది. మధ్యకాలపు రాజులు పాలకులుగా మారి ప్రజల శ్రమను దోచుకొని వారు సుఖాలను అనుభవించేవారు. కాని ఆదిమ సమాజంలోని పాలకులను ప్రజలు ఎన్నుకొనేవారు. ప్రజలతోపాటు రాజుకూడ ఏదోఒక పని చేసి తన పొట్ట నింపుకొనేవాడు తప్ప దోపిడీకి పాల్పడేవాడుకాదు. అలాంటి రాజు కొడుకులు ఏటికెళ్ళి చేపలుపట్టడం అనే విషయంలో ఎలాంటి అనుమానం లేదని చీమ అనుమానాన్ని కథానాయకుడు నివృత్తి చేస్తాడు. ఇలాంటి అంశాలతో కథ చమత్కారంతో సాగిపోతుంది. చివర్లో పిల్లవాన్ని కుట్టడానికి కారణం, తన బంగారు కన్నం దగ్గర చేయి పెట్టడమేనని చీమ చెబుతుంది. నీకు బంగారు కన్నం ఎక్కడిదని అడిగిన కథానాయకుడితో చీమ "నా శ్రమ ఫలితం నాకు బంగారమే! మీరైతే మరొకరి శ్రమఫలితాన్ని బంగారంగా మార్చుకుంటారు..మనుషులు గనుక! నేను చీమనుగదా! నా శ్రమఫలితాన్ని నేను బంగారంగా మార్చుకున్నాను. అదెలాంటిదికానివ్వు.. నా శ్రమ నాకు బంగారమే! దాన్ని దోచుకోవడానికి ఎవరొచ్చినా సరే, నేను తిరగబడతాను" అంటూ చీమ శ్రామికపక్షం నిలచి, శ్రమను దోచుకొనేవాళ్ళు బలవంతులైనా వారిపై తిరగబడమని పరోక్షంగా మనిషికి సూచిస్తుంది.

'ఒక దోమ కథ'లో బంగారు దోమ ప్రధాన పాత్ర. "అతి తక్కువమంది చేతుల్లో అతి ఎక్కువ సంపదలు పేరుకుపోయినప్పుడు, అధిక సంఖ్యాకుల చేతుల్లో అసలు ఎలాంటి సంపదలు లేనప్పుడు మాత్రమే ఒకడు దానమివ్వడానికీ, ఎక్కువమంది దానం పుచ్చుకోవడానికీ వీలుపడుతుంది". అన్ని అందరికీ సమానంగా ఉంటే ఈ వర్గాలు, ఎక్కువ తక్కువలు లేని సామాజిక జీవనం ఉంటుందని ఒక ఉప కథ ద్వారా దోమ కథానాయకుడికి చెబుతుంది. ఉదయగిరి రాజ్యం సిరిసంపదలతో, బంగారంతో విలసిల్లుతోందని దోమ చెప్పగానే, ఆ రాజ్యం ఎక్కడుంది? ఎలా

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

వెళ్ళాలి? అనే ప్రశ్నలు వేసి ఆతురతను కనబరుస్తాడు కథానాయకుడు. ఎంతటి మంచివారైనా సరే డబ్బు, బంగారాన్ని మనిషి ఎలా ఆశకు, అత్యాశకు లోనయ్యి తన బుద్ధిని ఎలా అదుపులో ఉంచుకోలేడో కూడా ఈ కథలో మనకు కన్పిస్తుంది.

ఒక ఎలుక కథ'లో ఎలుక ప్రాణాల్ని కాపాడ్డానికి కథానాయకుడు ఉత్సుకత చూపిస్తాడు. అప్పుడు ఎలుక 'మీరు ఆహారాన్ని ఎరగా వేసి, నన్ను పట్టుకోవాలనుకుంటున్నారు. నా గురించి కాకుండా బయట సమాజంలో అనేక మంది అనేక రకాల ఎరలు వేసి ప్రజల్ని దోపిడీ చేస్తున్నారు, వాడుకుంటున్నారు. దాన్నే సామ్యవాదం, అభ్యుదయం, ప్రజాస్వామ్యం అంటూ మాట్లాడుతున్నారు. అలాంటివారి ఎరల నుండి సామాన్య ప్రజలను రక్షించాల్సింది'గా ఎలుక కథానాయకుడికి హితబోధ చేస్తుంది. చివరి వరకూ మంచిని నటించిన కథానాయకుడు ఆఖర్లో ఎలుకను నయవంచన చేసి బోనులో బంధించేస్తాడు.

'ఒక చిలుక కథ'లో స్వేచ్ఛ కోసం ఒక సంపన్న దేశానికి వెళ్ళచ్చిన చిలుక అక్కడ ఎలాంటి స్వేచ్ఛ ఉందో కథానాయకుడికి వివరిస్తుంది. "అక్కడి ప్రజలకు గుడిసెల్లో ఉండే స్వేచ్ఛబీ చెట్ల కిందా, రోడ్ల పక్కనా తల దాచుకొనే స్వేచ్ఛబీ నిరుద్యోగులుగా ఉండే స్వేచ్ఛబీ రౌడీలుగా గూండాలుగా బతికే స్వేచ్ఛబీ బ్యాంకులు కొల్లగొట్టే స్వేచ్ఛబీ దార్లు దోచుకొనే స్వేచ్ఛబీ" అంటూ చెప్పుకుంటూ పోతుంది. ఈ కథలో ప్రపంచీకరణ ఛాయలు కన్పిస్తాయి. ఆర్థికంగా బాగున్న దేశాలు, మిగిలిన దేశాలన్నింటినీ తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు చేసే ప్రయత్నాలను ఈ కథలో చిలుక విశదపరస్తుంది.

**శిల్పం** కథకు లేదా ఏ సాహిత్య ప్రక్రియకైనా వస్తువు ఎంత ప్రాధాన్యమైనదో, శిల్పం కూడా అంతే ప్రాధాన్యతను కలిగి ఉంటుంది. ముఖ్యంగా కథ, నవలల్లో సుదీర్ఘంగా పాఠకుల్ని చదివింపచేయాలంటే దానికి తగిన రచనా విధానం తప్పనిసరిగా వైవిధ్యమైనదిగానూ, ప్రత్యేకమైనదిగానూ ఉండాలి. వస్తువుతోపాటు శిల్ప విషయంలో కూడా శ్రీపాద, చలం మొ॥ వారు తమ ప్రత్యేకతను చాటుకున్నారు. అదేకోవలోకి రావూరి భరద్వాజ కూడా కథారచన నిర్మాణంలో తనదైన ముద్ర వేసుకొన్నాడు. కథకు లేదా ఏ సాహిత్య ప్రక్రియకైనా వస్తువు ఎంత ప్రాధాన్యమైనదో, శిల్పం కూడా అంతే ప్రాధాన్యతను కలిగి ఉంటుంది. ముఖ్యంగా కథ, నవలల్లో సుదీర్ఘంగా పాఠకుల్ని చదివింపచేయాలంటే దానికి తగిన రచనా విధానం తప్పనిసరిగా వైవిధ్యమైనదిగానూ, ప్రత్యేకమైనదిగానూ ఉండాలి. వస్తువుతోపాటు శిల్ప విషయంలో కూడా శ్రీపాద, చలం మొ॥ వారు తమ ప్రత్యేకతను చాటుకున్నారు. అదేకోవలోకి రావూరి భరద్వాజ కూడా కథారచన నిర్మాణంలో తనదైన ముద్ర వేసుకొన్నాడు.

**పాత్రచిత్రణ** మనుషుల పాత్రల్ని చిత్రించడం, వారి స్వభావాల్ని, లక్షణాల్ని పాత్రోచితంగా మలచడం అందరికీ తెలిసిన విషయమే. చాలామంది రచయతలు పాత్రచిత్రణలో రాటుదేలినవారూ ఉన్నారు. అయితే, శ్రీరస్తు కథల్లో ప్రధాన పాత్రలు అల్పప్రాణులు. 'ఒక పేదనిజం కథ'లోని పాత్ర కనీసం ప్రాణి కూడ కాదు. 'నిజం' అనే రూపంలేని భావన మాత్రమే. దీనిక్కూడ రూపాన్ని ఆపాదించి చిత్రించిన తీరు నిజంగా ప్రశంసనీయం.

"నన్ను చూస్తూనే అతను బలహీనంగా నవ్వి, అంతకన్నా బలహీనంగా నమస్కారం చేసి, లేచి నిలబడటానికి ప్రయత్నించి అందుక్కూడ వోపికలేక కుర్చీలో జారగిలా పడ్డాడు". ఇలాంటి రచనాశిల్పం పాఠకులను ఒప్పించడం, మెప్పించడం అనేది నిజంగా ప్రయోగమే. ఆ ప్రయోగం చేసి రావూరి సఫలం అయ్యాడు కూడా.

'ఒక చీమ కథ'లో "ఈసారి చీమ, నన్ను ఎగాదిగా చూసింది. ఒక్కక్షణం ఆలోచిస్తున్న దానిలా అటుఇటు తిరిగింది. తల గోక్కున్నది. ఒళ్ళు విరుచుకున్నది. సన్నగా నిట్టూర్చింది". రచయిత చెప్పిన ఈ చేష్టల్ని చీమ చేసిందని ఊహించుకుంటే చాలా గమ్మత్తుగానూ, తెలీని అనుభూతిని పాఠకుడు పొందుతాడు.

'ఒక దోమ కథ'లో "ఏమనుకున్నదో ఏమోగని, దోమ కాస్త ముందుకు వచ్చింది. ఎదుర్రొమ్ము మీదున్న పుస్తకం అంచున వాలింది. ఒకసారి ముందుకాళ్ళు అలాఇలా

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

కదిపింది. కదిపి కథ చెప్పడం ప్రారంభించింది". 'ఒక ఎలుక కథ'లో "ఎలుక ఫక్కుమని నవ్వి, ఒక్కదూకులో లోపలికి వచ్చి, ఎదురుగా ఉన్న దిండుమీద కూర్చున్నది. 'ఒక చిలుక కథ'లో "చిలుక ఒకసారి తల విదిలించుకొంది. ముక్కుతో ముందున్న ఖాళీ గిన్నెను అటుఇటు నెమరింది". మొదలైన శ్రీరస్తు కథల్లోని ఉదాహరణలను గమనిస్తే ఆయా పాత్రల సజీవ సృష్టి రావూరి ఎలా చేశారో తెలుస్తూ ఉంది.

## ప్రాచీన ఉపఖ్యానాలలో ఆధునికత్వం :

రామాయణ, మహాభారతాల్లోని ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలులాగానే శ్రీరస్తు కథల్లో కథలు, ఉపకథలు ఉన్నాయి. 'ఒక పేదనిజం కథ'లో 'కథానాయకుడు నిజం ఎక్కడెక్కడ ఓడిపోయిందో చెప్తూ, ఓ మూడు కథల్ని నిజం ముందు ఉంచుతాడు. ఒక చీమ కథలోని 'రాజు కథ', 'ఒక దోమ కథ'లోని 'రత్నగిరి, ఉదయగిరి రాజుల కథ', 'ఒక చిలుక కథ'లో 'మేక పులి కథ'లు ఉన్నాయి. ఇవి ఒకదానిలో ఒకటివున్నా ఏ కథా దేనికీ అడ్డురాదు. అలా మధ్యలో వచ్చిన కథ ప్రధానకథకు బలాన్ని చేకూర్చేదేగాని, బలహీనపర్చేది కాదు. చక్కటి సరళశైలిని ఉపయోగించిన రావూరి గొప్ప శిల్ప చాతుర్యంతో ఈ కథలన్నింటినీ నడిపించాడు.

"సునిశితమైన లోకవృత్త పరిశీలన, అతి తీవ్రమైన జీవితానుభవం, అభివ్యక్తీకరించడంలోని నిర్భీకత, శిల్పం పట్ల గాఢానురక్తి ఇవీ భరద్వాజ కథల్లోని ఉత్తమ లక్షణాలు"గా మనం గుర్తించవచ్చు. "కథారచనలో, భరద్వాజ అద్భుతమైన ప్రయోగాలు చేశాడు. భరద్వాజ చేసిన ఈ ప్రయోగాలు విషయానికి సంబంధించినవీ, అభివ్యక్తికి సంబంధించినవీ కూడా. ఇవన్నీ విజయవంతంమయ్యాయి. కథకు ఏం కావాలో, ఎంతవరకు కావాలో అంతవరకే చేసి కథల్ని రక్తి కట్టించాడు రావూరి. అనవసరపు వర్ణనలు భూతద్దంతో చూసి వెతికినా దొరకవు. చెప్పదల్చుకున్న విషయాన్ని స్పష్టంగా, సరళంగా, నేర్పుగా, శిల్పచాతుర్యంతో నిర్వహించడం రావూరి భరద్వాజకు వెన్నతో పెట్టినవిద్య. "కథాశిల్ప రహస్యాలు కరతాలమలకం చేసుకొని, గుండెలు కదిలించి ఆలోచనలను రేకెత్తించే అనుభవాలను సన్నివేశ సుందరంగా మలచి పఠితలను ఆకట్టుకోగల రచనాశక్తి రావూరి భరద్వాజ కథలలో చేయి వేసిన చోటల్లా స్పష్టమౌతుంది' అన్నారు వి. వి. ఎల్. నరసింహారావుగారు.

## ముగింపు :

రావూరి భరద్వాజ కథల్లో వస్తువుకీ, అభివ్యక్తికీ సమ ప్రాధాన్యం ఇచ్చాడు కాబట్టి అవి మంచి కథలుగా నేటికీ మనగలుగుతున్నాయి. భరద్వాజ కాలక్షేపంకోసం రాసినట్లు ఏ ఒక్క కథా కనిపించదు. ప్రతి రచనలో ఒక సామాజిక బాధ్యత దాగి ఉంటుంది. ప్రతి అక్షరంలో ఒక ఆవేదన కన్పిస్తుంది. జ్ఞానపీఠ పురస్కారానికి అన్నిరకాల యోగ్యుడు, అర్హుడుగా రావూరి భరద్వాజను చెప్పుకోవాలి. 17వ ఏటనే రచనా జీవితాన్ని కొనసాగించిన భరద్వాజ ఇప్పటివరకు 130 రచనలు తెలుగు సాహిత్యానికి అందించారు. 1968లో రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1983లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను కూడ సగౌరవంగా అందుకున్నాడు. దుర్భర జీవితంలోనుంచి వచ్చి తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేసిన రావూరి భరద్వాజ 'జీవితం – సాహిత్యం' మొత్తాన్ని అక్షరబద్ధంచేసి రాబోయే తరాలకు అందించ వలసిన బృహత్కార్యాన్ని చేపట్టవలసిన అవసరం తెలుగు సాహితీలోకం, ప్రభుత్వంపైన ఎంతైనా ఉంది.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

# సమున్నత సాహితీ శిఖరం – జ్ఞానపీఠ్ రావూరి భరద్వాజ

- డా॥ పెందుర్తి మేరిపద్మావతి
**గణిత శాస్త్ర విభాగాధిపతి,**
**జె.యం.జె మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), తెనాలి.**

తెలుగు సాసిత్యలో తన వంతు పాత్రను చాలా చక్కగా పోషించిన వారితో డా. రావూరి భరద్వాజ ప్రథమ వర్గానికి చెందిన వారిగా చెప్పవచ్చు. డా.రావూరి భరద్వాజ అత్యంత సామాన్య జీవితాన్ని తానే స్వయంగా అనుభవించి, ఆ విషయాలనే తన సాహిత్య విషయ వస్తువులుగా నెంచి వాటకి జీవం పోసి కఠిన హృదయులను సైతం మృదువు తరం గలగా మార్చిన నిగర్వి, డా.రావూరి భరద్వాజ గారు.

అందరికీ బహుమతులు బహువిధాలుగా కీర్తిని తెస్తాయి. కాని భరద్వాజ గారికి అది సరిపోల్చదు. బహుమానానికే బహుమానం వంటి వారు వీరు. తెలుగు సాసిత్యాన్ని తపనతో తడిమిన తపశ్వి, తేజశ్వి డా.రావూరి భరద్వాజ గారు. కథ, నవల, నాటకం బాలసాహిత్యం, జీవిత చరిత్ర. ఇలా అనేక ప్రక్రియల్లో వినూత్న ప్రయోగాలు చేసి తెలుగు సాహిత్యాన్ని సునంపన్నం చేసిన కళాప్రపూర్ణ డా.రావూరి భరద్వాజను 2012 సంవత్సరానికి జ్ఞానపీఠ పురష్కారం వరించడం తెలుగు వారికే గర్వకారణం.

భరద్వాజ గారు ఉన్నత పాఠశాల, కళాశాల, విశ్వ విద్యాలయం, వీటి మెట్లు ఏనాడూ చూడని వాడు. చితికి పోయిన కుటుంబ పరిస్థితుల వల్ల, దారిద్ర్యం వల్ల ఏ దశలో కూడా చదువుల అవకాశం దొరకక శ్రామిక జీవితమే దిక్క యింది. జీవితంలోని ఒడిదుడుకులే, రకరకాల అనుభవాలే, సంఘర్షణలే ఆయన సాహిత్య సృజనకు మూలాలయ్యాయి. అకలి, అవసరం, అవమానం నుంచి పాఠాలు నేర్చుకున్నా నని అయనే ఒక సందర్భంలో చెప్పాడు. వ్యక్తిగత జీవితానికి, సాహిత్య జీవితానికి ఎలాంటి అన్యాన్య సంబంధాలు ఏర్పడ తాయో, ఎంతటి విషమంగా వృంటాయో తెలసి తాను పోట్టకూడ కోసం రచనలు ఒకప్పుడు చేశానని ఒప్పుకొన్న నిజాయితీ పరుడు భరధ్వాజ.

రావూరి భరద్వాజ తన 86 యేళ్ళ జీవితంలో దాదాపు 7 దశాబ్ధాలు రచనలు చేశారు. శాతాధిక గ్రంధాల కర్తగా తెలుగు సాహిత్యలోకానికి దగ్గరయ్యారు. కథా రచయితగా, నవాలా కారుడుగా, బాలసాహిత్య స్రష్టగా, మాత్రా చరిత్ర కారుడిగా, నాటక రచయితగా, వ్యాసరచయితగా, పత్రికా రచయితగా, రేడియో కార్యక్రమాల ప్రయోక్తగా, స్మృతికావ్య కర్తగా చేపట్టిన మాటల ప్రపంచంలో ఆయన సాహిత్య అంతరంగం ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. భరధ్వాజ 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 నవలికలు, 5 పిల్లల కథా సంపుటాలు ఇవన్నీ నేటి జీవితాన్ని ప్రతిభింబిస్తాయి.

భరధ్వాజ రచనలు వెనకు ప్రేరణలను, ఆయన సాహిత్య జీవితాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అంతో, ఇంతో ప్రభా వితం చేసిన అలనాటి సాహిత్య మిత్రులుకు ఆలూరి భుజంగ రావు, ఆలపాటి రవీంద్రనాథ్ చౌదరి, ధనికొండ హను మంతరావు, త్రిపురనేని గోపిచంధ్ మొదలైన వారు అత్మీయస్నేహాలు.

వేదాలు పుట్టక క్రీ.పూ. 15000 సంవత్సరాల నుండి క్రీ.పూ. 1500 సంవత్సరాల మధ్యకాలంలో ఉండవచ్చునని పండితులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈనాడు బహిరంగంగంగా చెప్పుకోవడానికి కొంచెం విడ్డూరంగా అన్పించినా, ఆదిమ సమాజం స్త్రీని ఉత్పత్తి సాధనంగానే పరిగణించింది. ఒక నూతన సృష్టి జరగడానికి ఆధారభూత మైన గొప్పశక్తిగ స్త్రీ అని ఆనాటి వారు భావించారు. దానికి ఉదాహరణంగా పంటలు, చెట్టు, అడవులు ఇచ్చే భూమిని భూదేవిగా చిత్రించడం. నదులను కూడా స్త్రీ పరంగానే పిలవడం అంటే సృష్టి కొనసాగింపుకు ఏవి ఆధారభూతాలో అవన్నీ గొప్పవే, అందుచేత వాటన్నింటి పట్లా ఆనాటి పురుషులు గౌరవభావంతో ఉండేవారు.

ఆ తరువాత తరాల గడిచినా స్త్రీ తలరాతలు మారలేదు. భూమి పరిపాలకుల స్వాధీనంలో ఉన్నట్లే స్త్రీ కూడా

పురుషుని స్వాధీనంలోని వచ్చింది. ఆమె తన స్వేచ్ఛను, వ్యక్తిత్వాన్ని పూర్తిగా కోల్పోయింది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ఆక్కొడొకరు, ఉజ్జ్వలంగా మెరిసిపోతూ ఉన్నప్పటికీ, వారిని ఉదాహరణలుగా చెప్పుకోవడానికే తప్ప సాధారణీక రించడానికి వీలుపడదు.

స్త్రీకి ఆకలి అంటుందని, ఆలోచన ఉంటుందని అను కంపించే హృదయం వుంటుందని, ప్రతిస్పందించగల మనస్సు వుంటుందని గుర్తించడమే మానివేసింది పురుష ప్రపంచం. స్త్రీ స్వతంత్రంగా ఆలోచించడం మానివేసింది. స్వతంత్రంగా జీవించడం మరిచిపోయింది. తానెలా జీవిం చాలో, ఎలా ఆలోచించాలో, ఎవరిని పెళ్ళాడాలో, ఎలా తన్ను తాను దిద్దుకోవాలో ఆవిడ మరిచి పోయింది. పురు షుని ఇష్టాలు తన ఇష్టాలుగా, అతని ఆలోచనలు తన ఆలోచనలుగా మాత్రమే జీవించడానికి స్త్రీ ఆలవాటు పడి పోయింది.

భరద్వాజ కథల్లోని అన్ని స్త్రీ పాత్రలు కాకపోవచ్చు గాని, కొన్ని కొన్ని పాత్రలలో ముఖ్యంగా 1960 కి ముందు చిత్రం చిన పాత్రల్లో ఈ లక్షణాలు కన్పిస్తాయి. ఆకర్షణ ఆనేది ప్రకృతి సిద్ధమైనది. ఒక అద్భుతమైన సంగీతాన్ని విని ఒక అద్భుతమైన చిత్రాన్ని చూసి, ఒక అద్భుతమైన వాక్యాన్ని చదివి. స్పందించకుండా వుండడం మానవస్వభావానికే విరుద్ధం. ఈ ప్రతి స్పందనలలో సామాజికమైన సరిహద్దు లను ఉల్లంగిచినపుడు మనం దోషమంటున్నాం. సరిహద్దు లకు లోబడి ఉన్నపుడు వాటిని గురించి మనం పట్టించుకోం. కోరిక కలగడమే నేరమైతే ఈ ప్రపంచంలో ఆపాటి నేరం చేయని పురుషుల్ని గాని స్త్రీని గాని కలుసుకోవడం దాదాపు అసంభవమే అందుకే ఆనాటి నా కథల్లో అటువంటి స్త్రీ లను చిత్రించి వుంటాను. కేవలం బాహిరమైన లక్షణాలను మాత్రమే గణనలోకి తీసుకొని మంచి చెడ్డలను నిర్ణయిం చడం సరికాదు. ఆ లక్షణాలు వెనుకు గల నేపధ్యాన్ని కూడా మనం పరిగణనలోనికి తీసుకోవాలి. అలా తీసుకొన్నప్పుడు. స్త్రీలలో మాత్రమే చపలత్వం వుంటుందన్న చాదవ పూర్తిగా నిరాధారమౌతుంది. అని అన్నారు. ఒక సందర్భంలో రావూరి భరధ్వాజగారు.

## వేశ్యలపై సానుభూతి :

ప్రతి ప్రాణికి సహజమైన లక్షణాలు కొన్ని వున్నాయి. ఒకటి ఆకలి, రెండు ఆత్మరక్షణ, మూడు స్వజాతి అభివృద్ధి ఈ మూడింటిని చుట్టుకొని చిన్నవీ, పెద్దవీ అనేక కారణా లుంటాయి. తన్నుతాను రక్షించడం కోసం ఎదుటి వారిని నిర్మూలించడానికి, సాధారణ మానవుడు ఎప్పుడూ వెను దీయడు. అత్మరక్షణ కోసం ఆకలిని, కోరికల ను వాయిదా వేసినట్లుకానే వాంఛా సాఫల్యం కోసం ప్రాణాన్ని బలియిచ్చిన వారు కూడా వున్నారు.

ఒక సందర్భంలో విశ్వకవి రవీంద్రుడు ఇలా అంటారు. “అధిభౌతిక ప్రపంచం ‘ఓం’, అన్న ఒకే అక్షరం చుట్టూ పరిభ్రమిస్తున్నది. భౌతిక ప్రపంచం తృష్ణ అన్న రెండు అక్షరాల చుట్టు పరిభ్రమిస్తున్నది. ఈ తృష్ణను మన సదుపాయం కోసం మళ్ళీ రెండు భాగాలుగా చేయవచ్చు ఒక రకం దైహిక మైనది, రెండవ రకం అత్మపరమైనది. ఏతృష్ణ శరీరానికి అతీతంగా ఎదిగి ఆత్మదాక వెళుతుందో దాన్ని ప్రేమ అంటారు.

ప్రపంచ సాహిత్యాన్ని ఒక సారి పరిశీలిస్తే ఎన్నో ప్రేమ కావ్యాలు, నాటకాలు, కథలు, కవితలు, ఆవాపనులు పుంఖా నుపుంఖంగా కన్పిస్తాయి. వీటిల్లో కొన్ని ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి. లైలా మజ్నుల ప్రణయగాధ, అనార్కలీ సలీమ్‌ల ప్రణయగాధ, పార్వతీ, దేవదాసుల ప్రణయగాధ, అక్షరాలా అభూతకల్పనలే అని మనం కొట్టి పారేయలేం. వీటి ప్రాతలు, సన్నివేశాలు కల్పనలే కావచ్చు కాని వాటిలో వున్న వాస్తవికచ్ఛాయలను మనం త్రోసివుచ్చలేం. కాల్పనిక కథలనలా ప్రక్కనుంచుదాం. వాస్తవంగా ఇటువంటి సంఘటనలు జరగలేదా జరిగినట్లుగానే చరిత్ర మనకు చెప్తోంది. తనకు ప్రియాతి ప్రియమైన ముంతాజ్ బేగమ్ కొసం షాజహాన్ పరమాద్భుతమైన తాజ్ మహల్ నిర్మించాడు తాను ప్రేమించిన లేడి సింప్సన్ కోసం బ్రిటీష్ సింహాసనం త్యాగం చేశాడు వార్డ్ విండర్స్, రాణి సంయుక్తకోసం పృధ్వీరాజ్ యుద్దాలు చేశాడు. సువిశాలమైన భూఖండానికి పాలకురాలైన రజియా సుల్తానా ఒక అబిసీనియా బానిసను

ప్రేమించింది.అతని పేరు జమాలుద్దీన్ యాకూబ్ అలాగే బ్రిటిష్ సింహాసనానికి వారసురాలైన ఎలిజిబెత్ రాణి ఒక మామూలు ఫోటోగ్రాఫర్‌ను ప్రేమించింది ఇలాంటి గాథలు లోక విధితం.

మన సాహిత్యాన్ని చూసే ఎవో కోరికల సాఫల్యం కోసం మహారణ్యాలను చేరి గోరమైన తపస్సుసచేస్తున్న ఋషుల తపస్సును భగ్నంచేసేందకు దేవేంద్రుడు దేవవేశ్యలను పంపించిన సందర్భాలు చాలా కనిపిస్తాయి. రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ అపురూప సుందరీమణులు స్వర్గ లోకంలో ఉండేవారు. స్వర్గానికి వచ్చిన వారిని సుఖసంతోషాలలో ఓలలాడించడంవారి వృత్తి,అదొక నేరంగాగాని దోషంగా గాని ఆనాటి వారు భావించలేదు.భారత దేశాన్ని పాలించిన అందరి పాలకుల అంత:పురాల్లోనూ రాణులసంఖ్య అధికం గానే ఉండేది సంస్థనాధీశులు సైతం ఇందులోని మంచిచెడు లని గురించి చర్చించబొయే ముందు ఇటువంటి వ్యవస్థ ఒకటి చిరకాలంగా ఉన్నసత్యాన్ని మనం గుర్తించుకోవాలి. దేవుని కూడా సేవచేయవలసింది స్త్రీలే అయినపుడు ఆ దేవునిలోను తన లక్షణాలను మానవుడు ప్రవేశ పెట్టాడు.తన అభిరుచులని ఆయన కంటగట్టాడు. తనకు ఆనందం కలిగించేవన్నీ దేవునికి ఆనందంకలిగిస్తాయని భావించాడు, అందుకనే దేవదాసిలంటూ ఒకప్రత్యేక వర్గానికి తయారు చేసి వారికీ మిగతా సమాజానికి మధ్య ఆగడ్తను ఏర్పాటు చేసాడు.

ఆనాటి కాలంలో దేవదాసి వ్యవస్థ ఏ ఉద్దేశంతో ప్రారంభం అయినప్పటికి రానురాను ఆ ఉద్దేశాలన్నీ రూపు మాసిపోయి, వారు వెలయాండ్రగా తయారయ్యారు. ఇలాంటి తయారు కావడానికి వెనుక ఆర్థిక పరిస్థితులే ప్రధాన కారణం, డబ్బు ప్రవేశించిన ప్రతి రంగంలోను చోటు చేసుకోవడం చాలా సహజం, ఈ వృత్తికూడా ఒక వ్యాపారం అయిపోయింది. పెట్టుబడిదారి సమాజానికి లాభాలే ముఖ్యంగానీ లాభార్జాన విధానాలు ఎంత మాత్రం ముఖ్యం కావు. చాలామంది తల్లిదండ్రులు భయంకరమైన పేదతనాన్ని భరించలేక తమ కుమార్తెలను మధ్య దళారీలకి అమ్ముకుంటున్నారు. వస్తువులతోవ్యాపారం చేసినట్లుగానే ఈ దళారీలు ఆడపిల్లలను చౌకగా కొని, ఎక్కువఖరీదుకు వేశ్య గృహాలకు అమ్ముకుంటున్నారు, ప్రేమించినవారు మోసం చేయడంవల్ల కొంతమంది,అత్తారింటి ఆరళ్ళను భరించలేక మరికొంతమంది, అద్భుతమైన కలలుగంటూ,ఆ స్వాప్నిక ప్రపంచంలో జీవించాలని పేరాసలకు పోయి దగా బడిన కొంతమంది, విధిలేక ఈ వ్యభిచార గృహాలకు చేరు తుంటారు.

ఈ నేపథ్యంలో భరద్వాజ కథలను ఒకసారి పరిశీలిద్దాం. 1948 చివరి మాసాలలో భరద్వాజ తెనాలి చేరుకున్నారు, అంతకుముందు ఆయన నెల్లూరులో "జమీన్ రైతు", 'దీన బంధు' అనే రెండు వార ప్రతికలలో పనిచేశాడు. దీన బంధులో పనిచేస్తున్నప్పుడే ఆయన మొదటి సారిగా నాగ రత్నం అన్న ఒక వేశ్యను చూశాడు. ఆమె పెంపుడు కూతురు పేరు రోహిణి. అక్కడే ఆయనకు పడుపువృత్తి చేసుకొని బ్రతుకుతున్న కొందరు స్త్రీలతో పరిచయం అయ్యింది. విషయ సేకరణకు గాను వారిని తరుచూ కలుసుకుంటుండే వారు. భరద్వాజ వారిలో విశ్వాసాన్ని కల్గించాడు. తన వ్యక్తి త్వానికి ఎక్కడా భంగం కలగకుండానే వారికి ఆత్మీయులై నారు. ఆ కారణంగా దయనీయమైన తమ గాథలను స్వయంగా చెప్పారు.

భరద్వాజ గారు ఆ స్త్రీల గాథల్లో నుండి తన కథలకు పనికి వచ్చేసన్నివేశాలను ఎన్నుకొని వాస్తవికతను బయట పెట్టారు. నిజానికి ఈ కథలను చదివినప్పుడు మనకళ్ళు చెమర్చాలి, మనగుండెలు బితుకు బితుకుమనాలి. దురదృష్ట వంతులైన ఈ స్త్రీ పట్ల మన మనస్సుల్లో కరుణాతరంగాలు పెల్లుబకాలి. కాని ఈ కథలు ఆయా పనులను ఎంతో కొంత చేశాయి, కాని పూర్తీగ చేయలేక పోయాయి.ఈ సందర్భన్నే ప్రస్తావిస్తూ భరద్వాజ జీవిత సాహిత్యాలను చాలా లోతుగా, విపులంగా అధ్యయనం చేసిన త్రిపురనేని సుబ్బా రావు గారు అందుకు కారణాలు తెలిపారు. ఉండవలసినంత అనుభవం లేకపోవడం, రచయిత వయస్సు ప్రధానకారణం

అంటారు సుబ్బురావు గారు. ఈ రెండింటినీ భరద్వాజగారు అంగీకరించారు కూడా. ఈ లోపాలను తరువాత రచనలలో సరిదిద్దుకొన్నారు.వేశ్యల పట్లే కాదు ప్రతిభాదితుని పట్ల ఆయన సానుభూతిని చూపిస్తూనే వచ్చారు. బడుగు వర్గాల పట్ల, అట్టడుగు వర్గాల పట్ల, రచయితకున్న అభిమానానికి ప్రత్యేక ఆయన "జీవనసమరం", అనే పుస్తకం. అందులోనూ ఒక వ్యభిచారిణి దయనీయ గాధను కురుణామయంగా ఆయన చిత్రించారు. పాకుడు రాళ్ళు అనే జ్ఞానపీఠ పురష్కారం పొందిన నవలలోని మంగమ్మ అనే పాత్ర కూడా మురికి వాడల్లో నుండి వచ్చిందే. రోహిణి అనే అనాథ బాలికను నెల్లూరులోని నాగరత్నం కొన్నట్లే, గుంటూరులో ఉన్న ఒక వేశ్య మంగమ్మను కూడా కొన్నది. ఆమెను వృత్తి లోనికి దింపింది.

వీటన్నింటినీ నిశితంగా పరిశీలించినప్పుడు మనుకొక విషయం సృష్టంగా గోచరిస్తుంది. బాధితుల పట్ల, మోసగింపడిన వారి పట్ల, దగాపడిన వారి పట్ల రచయితలో అశేషమైన సానుభూతి వుంది. ఆ కారణంకానే నాగరిక ప్రపంచం అసంహ్యంచుకొనే స్త్రీలను గురించి ఇంత ఆర్ధ్రంగా రాయ గలిగారు రచయిత. వారి బాధామయగాధల పట్ల, ఆయన కున్న సానుభూతి ఆయన గారి ప్రతికథలోనూ వ్యక్తమౌతూ వుంటుంది. "చీమతల్లి విశ్వాసం" అనే కథలో ఆడచీమ, సీతాకోక చిలుకల సంభాషణ, నేటి సమాజ పరిస్థితి, రౌడీయిజం, గూండాయిజం, దోపిడీతనం ప్రస్తుత సమాజానికి స్త్రీ త్యాగానికి, ఓర్పుకీ, మమకారానికి నిదర్శనంగా డా.రావూరి భరద్వాజ గారు వివరించారు, స్త్రీల స్వేచ్ఛను ఆకాంక్షిస్తూ.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# 'లోకం కోసం' సాహితీ సేద్యం చేసిన – 'జ్ఞానపీఠ్' రావూరి భరద్వాజ

- పిల్లి వాసు
పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు ప్రాచ్యభాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

రావూరి భరద్వాజ రచనా శైలి సరళంగా, సుందరంగా ఉండి అన్ని వర్గాలవారిని చదివింపచేస్తుంది. సమసమాజ స్థాపన లక్ష్యంగా ఇతని రచనలు కనిపిస్తాయి. "నీ అక్షరాలు నీ చుట్టూవున్నవారి బాధామయ గాథలను చిత్రించకపోతే, అగ్నులను విరజిమ్మకపోతే నీవిక నిశ్చంతగా కలాన్ని ముడిచేయవచ్చు. చీకటిని తిడుతూ ఎంతకాలం కూర్చుంటావు? నీవే భగ్గుమని మండి చీకటిని కాల్చేయరాదా?" అంటూ అక్షరాలనే ఆయుధంగా చేసుకొని రకరకాలైన రచనలు చేసారు మన రావూరి భరద్వాజ.

ఇతని రచనలలో వస్తువుకు, శిల్పానికి సమాన ప్రాధాన్యతని మనం చూడవచ్చు. ఎలాంటి వస్తువు తీసుకున్నా, అది అల్పమైన, అనల్పమైన దానిని వర్ణించి, వ్యాఖ్యానించే విధానంలో ప్రతి రచనలోను ఒక నవ్యత, నూతన దృక్కోణాన్ని ఆవిష్కరించి పఠితల గుండెల దగ్గరకు తన పదాలను పరుగు తీయిస్తారు రావూరి భరద్వాజ. తెలుగు సాహిత్యంలో తన వంతు పాత్రను చాలా చక్కగా పోషించిన వారిలో డా. రావూరి భరద్వాజ ప్రథమ వర్గానికి చెందిన వారిగా చెప్పవచ్చు. డా.రావూరి భరద్వాజ అత్యంత సామాన్య జీవితాన్ని తాను స్వయంగా అనుభవించి, ఆ విషయాలనే తన సాహిత్య వస్తువులుగా స్వీకరించి, వాటకి జీవం పోసి సామాన్యుడిని మాన్యుడిగా ఈ సమాజాన నిలిపే ప్రయత్నాన్నితన సాహిత్యంలో బలంగా చేసిన వ్యక్తి డా.రావూరి భరద్వాజ.

తెలుగు సాసిత్యాన్ని తపనతో తడిమిన తపశ్వి, తేజశ్వి డా.రావూరి భరద్వాజ గారు. కథ, నవల, నాటకం బాల సాహిత్యం, జీవిత చరిత్ర. ఇలా అనేక ప్రక్రియల్లో వినూత్న ప్రయోగాలు చేసి తెలుగు సాహిత్యాన్ని సునంపన్నం చేసిన కళాప్రపూర్ణ డా.రావూరి భరద్వాజను 2012 సంవత్సరానికి జ్ఞానపీఠ పురస్కారం వరించడం తెలుగు వారికే గర్వకారణం.

భరద్వాజ గారు ఉన్నత పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయం, వీటి మెట్లు ఏనాడూ చూడని వాడు. చితికిపోయిన కుటుంబ పరిస్థితుల వల్ల, దారిద్ర్యం వల్ల ఏ దశలో కూడా చదువుల అవకాశం దోరకక శ్రామిక జీవితమే దిక్కయింది. జీవితంలోని ఒడిదుడుకులతో మధ్య రకరకాల అనుభవాలు, సంఘర్షణలే ఆయన సాహిత్య సృజనకు మూలాలయ్యాయి.

అకలి, అవసరం, అవమానం నుంచి పాఠాలు నేర్చుకున్నానని అయనే ఒక సందర్భంలో చెప్పాడు. వ్యక్తిగత జీవితానికి, సాహిత్య జీవితానికి ఎలాంటి అన్యోన్య సంబంధాలు ఏర్పడతాయో, ఈ విషయాలన్నీ హృదయాన్ని యెంతగా భాదిస్తాయో తెలిసీ, తాను పొట్టుకూటి కోసం రచనలు ఒకప్పుడు చేశానని ఒప్పుకొన్న నిజాయితీ పరుడు భరధ్వాజ.

రావూరి భరద్వాజ తన 86 యేళ్ళ జీవితంలో దాదాపు 7 దశాబ్దాలు రచనలు చేశారు. శాతాధిక గ్రంధ కర్తగా తెలుగు సాహిత్యలోకానికి దగ్గరయ్యారు. కథా రచయితగా, నవాలా కారుడుగా, బాలసాహిత్య స్రష్టగా, మాత్రా చరిత్ర కారుడిగా, నాటక రచయితగా, వ్యాసరచయితగా, పత్రికా రచయితగా, రేడియో కార్యక్రమాల ప్రయోక్తగా, స్మృతికావ్య కర్తగా చేపట్టిన మాటల ప్రపంచంలో ఆయన సాహిత్య అంతరంగం ప్రస్పుటంగా కన్పిస్తుంది. భరధ్వాజ 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 నవలికలు, 5 పిల్లల కథా సంపుటాలు ఇవన్నీ నేటి జీవితాన్ని ప్రతిభింబిస్తాయి.

భరధ్వాజ రచనలు వెనకు ప్రేరణలను, ఆయన సాహిత్య జీవితాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అంతో, ఇంతో ప్రభావితం చేశాయనే చెప్పాలి. అలనాటి సాహిత్య మిత్రులైన ఆలూరి భుజంగరావు, ఆలపాటి రవీంద్రనాథ్ చౌదరి, ధనికొండ హనుమంతరావు, త్రిపురనేని గోపిచంద్ మొదలైన వారు అత్మీయ కలం స్నేహితులు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

కాయకష్టము చేసి, కూలిబతుకుల కష్టనష్టాలను కను లారా చూసిన భరద్వాజ చిన్నతనం నుండి పొలాలల మధ్య తిరిగుతూ, మధ్యతరగతి, పేద ప్రజల జీవనశైలిపైన, భాషపైన, యాసపైన మంచి పట్టు సాధించి, తద్వారా పల్లె వాతావరణాన్ని చక్కగా అవగాహన చేసుకోవటంతో పాటు, ఆ భావ సంపదను తన రచనలలో చొప్పించాడు భరద్వాజ.

చలంగా పేరుగాంచిన గుడిపాటి వెంకటచలం ప్రభా వంతో శృంగార కథలు కూడా రచించారు. ఈ కథలలో ఆయన పనిగట్టుకుని నీతినియమాల బోధనలుచెయ్యలేదు. శృంగారం విషయంలో స్త్రీపురుష ప్రవృత్తి ఎలా ఉంటుందో దానిని సాధ్యమైనంత వాస్తవంగా వెల్లడించడానికి ఆయన ప్రయత్నించారు. అందులోఆయన కష్టపడినట్టుగానో, లేక కృతకంగా చెప్పినట్టుగానో పాఠకులకు అనిపించదు. సరళంగా, అతి సులభంగా, అలవోకగా రాసుకుంటూ పోయి నట్టు అనిపిస్తుంది. ఈ వ్యాసంలో భరాద్వాజ **"లోకం కోసం"** అనే కథాసంపుటిలో ఆయన వ్యక్తం చేసిన స్త్రీపురుషుల శృంగార ప్రవృత్తులను వెతికి వివరించే ప్రయత్నం చేశాను.

## లోకం కోసంలోని కథలు :

భరద్వాజ గారి "లోకం కోసం" కథా సంపుటాన్ని ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ వారు1956లో ప్రథమ ముద్రణగా అచ్చువేశారు. అప్పటి ఆ పుస్తకం వెల ఒక్క రూపాయి. ఈ సంపుటంలో "లోకం కోసం"అనే కథతోబాటు ఆహిరి, నీతిస్తంభం, అనుమానం, కన్నకడుపు, సంతానం, పల్లెపట్టు, ప్రవృత్తులు, అభ్యుదయం, కడుపుతీపి, అద్దెకొంప అనే కథలు ఉన్నాయి. మొత్తం మీద 11 కథలతో ఈ సంపుటి వెలువడింది.

### మనిషి కట్టుబడేది – లోకం కోసం :

ఈ కథలో కథకుడు, నరసమ్మ, నరసమ్మభర్త, కథకుని స్నేహితుడైన వెంకటేశ్వర్లు పాత్రలు. కథానాయిక నరసమ్మ ఇంకాఆధునికత ఎరుగని ఇల్లాలు. ఆమె భర్త చాలా బలిష్ఠ మైనవాడు. అయినప్పటికీ ఆమె గుట్టుచప్పుడు కాకుండా చాలామందితో రంకు నడుపుతుంటుంది. చివరకు కథ కునితో సంబంధం పెట్టుకుని ఇంటివెనుక పశుల కొట్టం లో కలుస్తుంటుంది. తాను పెళ్లికాక ముందు, తర్వాత ప్రియు లతో, భర్తతో సాగించే శృంగార విషయాలు కథకునికి సిగ్గు లేకుండా చెబుతుంది. ఆమె వ్యవహారం తెలిసి కూడా ఆమె భర్త చూసీ చూడనట్టు పోతుంటాడు. అతనిని చచ్చిన పాముగా లెక్క కట్టిన కథానాయకుడు తాను అంత కష్టపడి ఇంటివెనుక కొట్టములోకి రాలేనని, యెంచక్కా ఇంట్లోకే వస్తానని నరసమ్మను ఒప్పిస్తాడు. దానిని చూస్తూ కూడా ఒకవారం పాటు సహించిన నరసమ్మ భర్త ఆమెకు బడిత పూజ చేసి, ఆమె కోసం వచ్చేవాడిని వసారాలోకి రాగానే దుడ్డు కర్ర పట్టుకుని ఎదురై ఆపుతాడు. ఇక మీదట తమ ఇంటి ఛాయలకు వస్తే అంతుతేలుస్తానని బెదరగొట్టి తరిమి వేస్తాడు. తర్వాత తన మిత్రుడు వెంకటేశ్వర్లుతో కలసి కథా నాయకుడు చేసిన చర్చలో ఏ మనిషి అయినా లోకానికి తెలియనంత వరకూ తనకు జరుగుతున్న అన్యాయాన్ని సహిస్తాడని, అదికాస్తా లోకానికి కూడా తెలిసిపోయి తన పరువు మంట కలసిపోతుందంటే సహించలేడని ఈ కథ ద్వారా తేలుతుంది. నరసమ్మ భర్త పెళ్లి అయిన కొత్తలో ఆమె ఆటలు కొనసాగకుండా కొట్టి రాచిరంపాన పెట్టే వాడని, ఐనా ఆమె మారకపోయినా లోకానికి తెలియలేదు కదా! అని మిన్నకుండిపోయినాడని నరసమ్మ ప్రియునితో ఆమె వ్యవహారం శృతిమించి లోకులకు తెలిసి, తన పరు వంతా మంటకలవడం సహించలేకే అంటే లోకం కోసమే ఆ రోజు అలాగ ప్రవర్తించాడన్న లోకరీతిని వారి ప్రసంగం ద్వారా తెలియజేస్తాడు రచయిత.

దీన్ని బట్టి ఒక రహస్యం ఆ ఘటన జరిగిన వ్యక్తుల మధ్యన వుంటేనే తప్ప, అది పొరపాటున బయటికి తెలిసి పదిమంది దృష్టి ఆ విషయం మీదకు యెప్పుడైతే లగ్న మౌతుందో, అది కాస్త ఆ క్షణం నుండీ యజమానుని వలే ప్రవర్తించటంతో పాటు, అతనిని పూర్తిగా బానిసలాగా వశ పర్చుకునే ప్రయత్నం చేస్తుందనేది ఈ కథ ద్వారా రచయిత స్పష్టం చేశాడు.

చలం ప్రభావం వున్న రచయిత స్త్రీ లైంగిక స్వేచ్ఛకు ప్రాముఖ్యతనిస్తూ ఈ కథలో నరసమ్మ పాత్రను తీర్చిద్దిన

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

విధం కనిపిస్తుంది. స్త్రీకి శారీరక, మానసిక పరమైన ఆకల నేది ఒకటుంటుందని, ఆమెలోనూ అణువణువూ అను కంపించే హృదయం వుంటుందని, ప్రతిస్పందించగల మనస్సు వుంటుందని గుర్తించడమే మానివేసింది పురుష ప్రపంచం. స్త్రీ స్వతంత్రంగా ఆలోచించడం మానివేసింది. స్వతంత్రంగా జీవించడం మరిచిపోయింది. తానెలా జీవిం చాలో, ఎలా ఆలోచించాలో, ఎవరిని పెళ్ళాడాలో, ఎలా తనను తాను దిద్దుకోవాలో ఆవిడ మరిచి పోయింది. పురు షుని ఇష్టాలు తన ఇష్టాలుగా, అతని ఆలోచనలు తన ఆలోచనలుగా మాత్రమే జీవించడానికి స్త్రీ ఆలవాటు పడి పోయింది.

భరద్వాజ కథల్లోని అన్ని స్త్రీ పాత్రలు కాకపోవచ్చు గాని, కొన్ని కొన్ని పాత్రలలో ముఖ్యంగా 1960కి ముందు చిత్రించిన పాత్రల్లో ఈ లక్షణాలు కన్పిస్తాయి. ఆకర్షణ ఆనేది ప్రకృతి సిద్ధమైనది. ఒక అద్భుతమైన సంగీతాన్ని విని ఒక అద్భుతమైన చిత్రాన్ని చూసి, ఒక అద్భుతమైన వాక్యాన్ని చదివి. స్పందించకుండా వుండడం మానవ స్వభా వానికే విరుద్ధం. ఈ ప్రతి స్పందనలలో సామాజికమైన సరిహద్దులను ఉల్లంగిచినపుడు మనం దోషమంటున్నాం. సరిహద్దులకు లోబడి ఉన్నపుడు వాటిని గురించి మనం పట్టించుకోం. కోరిక కలగడమే నేరమైతే ఈ ప్రపంచంలో ఆపాటి నేరం చేయని పురుషుల్ని గాని స్త్రీని గాని కలుసు కోవడం దాదాపు అసంభవమే అందుకే ఆనాటి నా కథల్లో అటువంటి స్త్రీ లను చిత్రించి వుంటాను. కేవలం బాహిరమైన లక్షణాలను మాత్రమే గణనలోకి తీసుకొని మంచి చెడ్డలను నిర్ణయించడం సరికాదు. ఆ లక్షణాలు వెనుకు గల నేపథ్యాన్ని కూడా మనం పరిగణనలోనికి తీసుకోవాలి. అలా తీసుకొన్న పుడు. స్త్రీలలో మాత్రమే చపలత్వం వుంటుందన్న వాదన పూర్తిగా నిరాధారమౌతుంది అనేది పాఠకుడు గ్రహించ గలుగుతాడు. ఇది భరద్వాజ యొక్క బలమైన అభిప్రాయంగా విస్తృతఅధ్యయనం చేసినవారెవరికైనా అనిపిస్తుంది.

### వేశ్యలపై సానుభూతి :

ప్రతి ప్రాణికి సహజమైన లక్షణాలు కొన్ని వున్నాయి. ఒకటి ఆకలి, రెండు ఆత్మరక్షణ, మూడు స్వజాతి అభివృద్ధి ఈ మూడింటిని చుట్టుకొని చిన్నవీ, పెద్దవీ అనేక కారణా లుంటాయి. తన్నుతాను రక్షించడం కోసం ఎదుటి వారిని నిర్మూలించడానికి, సాధారణ మానవుడు ఎప్పుడూ వెను దీయడు. ఆత్మరక్షణ కోసం ఆకలిని, కోరికల ను వాయిదా వేసినట్లుగానే వాంఛా సాఫల్యం కోసం ప్రాణాన్ని బలియిచ్చిన వారు కూడా వున్నారు.

ఒక సందర్భంలో విశ్వకవి రవీంద్రుడు ఇలా అంటారు. “ఆధిభౌతిక ప్రపంచం ‘ఓం’, అన్న ఒకే అక్షరం చుట్టూ పరిభ్రమిస్తున్నది. భౌతిక ప్రపంచం తృష్ణ అన్న రెండు అక్షరాల చుట్టు పరిభ్రమిస్తున్నది. ఈ తృష్ణను మన సదు పాయం కోసం మళ్ళీ రెండు భాగాలుగా చేయవచ్చు ఒక రకం దైహిక మైనది, రెండవ రకం ఆత్మపరమైనది. ఏతృష్ణ శరీరానికి అతీతంగా యెదిగి ఆత్మదాక వెళుతుందో దాన్ని ప్రేమ అంటారు.

ప్రపంచ సాహిత్యాన్ని ఒక సారి పరిశీలిస్తే ఎన్నో ప్రేమ కావ్యాలు, నాటకాలు, కథలు, కవితలు, ఆవాపనులు పుంఖానుపుంఖంగా కన్పిస్తాయి. వీటిల్లో కొన్ని ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి. లైలా మజ్నుల ప్రణయగాధ, సలీమ్ అనార్కలీల ప్రణయగాధ, పార్వతీ, దేవదాసుల ప్రణయగాధ, అక్షరాలా అభూతకల్పనలే అని మనం కొట్టి పారేయలేం. వీటి ప్రాతలు, సన్నివేశాలు కల్పనలే కావచ్చు కాని వాటిలో వున్న వాస్తవికచ్ఛాయలను మనం త్రోసివుచ్చలేం. కాల్పనిక కథలనలా ప్రక్కనుంచుదాం. వాస్తవంగా ఇటువంటి సంఘ టనలు జరగలేదా జరిగినట్లుగానే చరిత్ర మనకు చెప్తోంది. తనకు ప్రియాతి ప్రియమైన ముంతాజ్ బేగమ్ కొసం షాజహాన్ పరమాద్భుతమైన తాజ్ మహల్ నిర్మించాడు తాను ప్రేమించిన లేడి సింప్సన్ కోసం బ్రిటీష్ సింహాసనం త్యాగం చేశాడు వార్డ్ విండర్స్, రాణి సంయుక్తకోసం పృధ్వీరాజ్ యుద్ధాలు చేశాడు. సువిశాలమైన భూఖండానికి పాలకు రాలైన రజియా సుల్తానా ఒక అబీసీనియా బానిసను ప్రేమిం చింది. అతని పేరు జమాలుద్దీన్ యాకూబ్ అలాగే బ్రిటిష్ సింహాసనానికి వారసురాలైన ఎలిజిబెత్ రాణి ఒక

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

మామూలు ఫోటోగ్రాఫర్‌ను ప్రేమించింది ఇలాంటి గాథలులోక విధితం.

మన సాహిత్యాన్ని చూసే ఎవో కోరికల సాఫల్యం కోసం మహారణ్యాలను చేరి గోరమైన తపస్సులు చేస్తున్న ఋషుల తపస్సును భగ్నంచేసేందకు దేవేంద్రుడు దేవవేశ్యలను పంపించిన సందర్భాలు చాలా కనిపిస్తాయి. రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ అపురూప సుందరీమణులు స్వర్గ లోకంలో ఉండేవారు. స్వర్గానికి వచ్చిన వారిని సుఖసంతోషాలలో ఓలలాడించడంవారి వృత్తి,అదొక నేరంగాగాని దోషంగా గాని ఆనాటి వారు భావించలేదు. భారత దేశాన్ని పాలించిన అందరి పాలకుల అంత:పురాల్లోనూ రాణుల సంఖ్య అధికం గానే ఉండేది సంస్థనాధీశులు సైతం ఇందులోని మంచి చెడులని గురించి చర్చించబోయే ముందు ఇటువంటి వ్యవస్థ ఒకటి చిరకాలంగా ఉన్నసత్యాన్ని మనం గుర్తించుకోవాలి. దేవునికి కూడా సేవచేయవలసింది స్త్రీలే అయినపుడు ఆ దేవునిలోను తన లక్షణాలను మానవుడు ప్రవేశ పెట్టాడు. తన అభిరుచులని ఆయన కంటగట్టాడు. తనకు ఆనందం కలిగించేవన్నీ దేవునికి ఆనందం కలిగిస్తాయని భావించాడు, అందుకనే దేవదాసిలంటూ ఒకప్రత్యేక వర్గాన్ని తయారు చేసి వారికీ మిగతా సమాజానికి మధ్య పెద్ద అగాదాన్ని ఏర్పాటు చేసాడు.

ఆనాటి కాలంలో దేవదాసి వ్యవస్థ ఏ ఉద్దేశంతో ప్రారంభం అయినప్పటికి రానురాను ఆ ఉద్దేశాలన్నీ రూపు మాసిపోయి, వారు వెలయాండ్రగా తయారయ్యారు. ఇలాంటి వ్యవస్థ తయారు కావడానికి వెనుక ఆర్థిక పరి స్థితులే ప్రధాన కారణం,డబ్బు ప్రవేశించిన ప్రతి రంగంలోను ఇటువంటి విధానం చోటు చేసుకోవడం చాలా సహజం, ఈ వృత్తికూడా ఒక వ్యాపారం అయిపోయింది. పెట్టుబడి దారి సమాజానికి లాభాలే ముఖ్యంగానీ లాభార్జాన విధానాలు ఎంత మాత్రం ముఖ్యంకావు. చాలామంది తల్లిదండ్రులు భయంకరమైన తమ పేదరికాన్ని భరించలేక, తమ కుమార్తెలను మధ్య దళారీలకి అమ్ముకుంటున్నారు. వస్తువు లతోవ్యాపారం చేసినట్లుగానే ఈ దళారీలు ఆడపిల్లలను చౌకగా కొని, ఎక్కువఖరీదుకు వేశ్య గృహాలకు అమ్ముకుంటు న్నారు, ప్రేమించినవారు మోసం చేయడంవల్ల కొంతమంది, అత్తారింటి ఆరళ్ళను భరించలేక మరికొంతమంది, అద్భుత మైన కలలుగంటూ, ఆ స్వాప్నిక ప్రపంచంలో జీవించాలని పేరాసలకు పోయి దగాబడిన కొంతమంది, విధిలేక ఈ వ్యభిచార గృహాలకు చేరుతుంటారు.

ఈ నేపధ్యాంశాలను దృష్టిలో వుంచుకొని భరద్వాజ కథలను ఒకసారి పరిశీలిస్తే. 1948 చివరి మాసాలలో భరద్వాజ తెనాలి చేరుకున్నారు, అంతకుముందు ఆయన నెల్లూరులో "జమీన్ రైతు", 'దీనబంధు' అనే రెండు వార ప్రతికలలో పనిచేశాడు. దీనబంధులో పనిచేస్తున్నప్పుడే ఆయన మొదటి సారిగా నాగరత్నం అన్న ఒక వేశ్యను చూశాడు. ఆమె పెంపుడు కూతురు పేరు రోహిణి. అక్కడే ఆయనకు పడుపువృత్తి చేసుకొని బ్రతుకుతున్న కొందరు స్త్రీలతో పరిచయం అయ్యింది. విషయ సేకరణకు గాను వారిని తరుచూ కలుసుకుంటుండే వారు. భరద్వాజ వారిలో విశ్వాసాన్ని కల్గించాడు. తన వ్యక్తిత్వానికి ఎక్కడా భంగం కలగకుండానే వారికి ఆత్మీయులైనారు. ఆ కారణంగా దయనీయమైన తమ గాథలను స్వయంగా చెప్పారు.

భరద్వాజ గారు ఆ స్త్రీల గాథల్లో నుండి తన కథలకు పనికి వచ్చేసన్నివేశాలను ఎన్నుకొని వాస్తవికతను బయట పెట్టారు. నిజానికి ఈ కథలను చదివినప్పుడు మనకళ్ళు చెమర్చాలి, మనగుండెలు బితుకు బితుకుమనాలి. దుర దృష్టవంతులైన ఈ స్త్రీ పట్ల మన మనస్సుల్లో కరుణా తరం గాల వలే పెల్లుబకాలి. కాని ఈ కథలు ఆయా పనులను ఎంతో కొంత చేశాయి, కాని పూర్తిగ చేయలేక పోయాయి. ఈ సందర్భన్నే ప్రస్తావిస్తూ భరద్వాజ జీవిత సాహిత్యాలను చాలా లోతుగా, విపులంగా అధ్యయనం చేసిన త్రిపురనేని సుబ్బారావు గారు అందుకు కారణాలు తెలిపారు. ఉండ వలసినంత అనుభవం లేకపోవడం, రచయిత వయస్సు ప్రధానకారణం అంటారు సుబ్బురావు గారు. ఈ రెండింటినీ భరద్వాజ౹ అంగీకరించారు కూడా. ఈ లోపాలను తరువాత రచనలలో సరిదిద్దుకొన్నారు.వేశ్యల పట్లే కాదు ప్రతిభాదితుని పట్ల ఆయన సానుభూతిని చూపిస్తూనే వచ్చారు.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

బడుగు వర్గాల పట్ల, అట్టడుగు వర్గాల పట్ల, రచయిత కున్న అభిమానానికి ప్రత్యేకమైన "జీవనసమరం", అనే పుస్తకం. అందులోనూ ఒక వ్యభిచారిణి దయనీయగాధను కురుణామయంగా ఆయన చిత్రించారు. పాకుడు రాళ్ళు అనే జ్ఞానపీఠ పురస్కారం పొందిన నవలలోని మంగమ్మ అనే పాత్ర కూడా మురికి వాడల్లో నుండి వచ్చిందే. రోహిణి అనే అనాథ బాలికను నెల్లూరులోని నాగరత్నం కొన్నట్లే, గుంటూరులో ఉన్న ఒక వేశ్య మంగమ్మను కూడా కొన్నది. ఆమెను వృత్తిలోనికి దింపింది. వీటన్నింటినీ నిశితంగా పరిశీలించినప్పుడు మనుకొక విషయం స్పష్టంగా గోచరి స్తుంది. బాధితుల పట్ల, మోసగిం పడిన వారి పట్ల, దగా పడిన వారి పట్ల రచయితలో అశేష మైన సానుభూతి వుంది. ఆ కారణంకానే నాగరిక ప్రపంచం అసహ్యించుకొనే స్త్రీలను గురించి ఇంత ఆర్ధ్రంగా రాయగలి గారు రచయిత. వారి బాధామయగాధల పట్ల, ఆయనకున్న సానుభూతి ఆయన ప్రతికథలోనూ వ్యక్తమౌతూ వుంటుంది.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# రావూరి భరద్వాజగారి చిన్నకథలలో – పేదరికం

- షేమాటి ఇస్మాయేల్
పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు ప్రాచ్యభాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

తెలుగు సాహితీ స్రవంతిలో విరిసిన కుసుమాలలో అగ్రగణ్యులయిన కవులు, రచయితలు ఎందరో ఉన్నారు. వారి వారి కృషికి పాఠకలోకం మెచ్చియిచ్చిన పురస్కారాలు కూడా ఉన్నాయి. అలాంటి వాటిలో అత్యుత్తమ పురస్కారంగా పేర్కొనదగిన వానిలో జ్ఞానపీఠ అవార్డు కూడా ఒకటి. దీనిని ఇప్పటివరకు తెలుగు వారిలో అందుకున్న ప్రముఖులు ముగ్గురు. వారిలో ఎంతో రచనా వైశిష్ట్యం కలిగిన రావూరి భరద్వాజ కూడా ఒకరు. ఈయన రచించిన వచన రచనకు రావడం ఒక ప్రత్యేకత. ఇతని రచనలను గురించి పరిశోధించడమంటే మన జ్ఞాన పిపాసను మననం పెంచుకొనడమనే అర్థం. సహజత్వానికి, సమాజానికి దగ్గరి సంబంధం కలిగి రచనలు చేసినవారు అరుదు. అంటే మన తెలుగు సాహితి జగత్తులో మేలు మకుటంగా, పతాకగా రెపరెపలాడే వారిలో భరద్వాజ ముందంజలో వుంటారని చెప్పవచ్చు. కనుకనే వీరికి జ్ఞానపీఠ అవార్డు లభించింది. వారి రచనలన్ని ఒక దానికొకటి దేనికదే ప్రత్యేకతను సంతరించుకుని వుంటాయి.

భారతదేశంలో అత్యున్నతమైన సాహితీ పురస్కారమైన జ్ఞానపీఠ బహుమతి 2012 సంవత్సరమునకుగాను ఒక తెలుగు రచయితకు వచ్చినందుకు, అందునా డాక్టర్ రావూరి భరద్వాజకు వచ్చినందుకు తెలుగు వారందరూ హర్షము ప్రకటించారు. దాదాపు ఏడు దశాబ్దాలకు పైగా ప్రతి క్షణమూ తాను కష్టాల కడలిలో పయనిస్తూన్నా ప్రతి క్షణమూ కథా రచనే శ్వాసగా, నవలా రచనలే మాతృభాషగా, నవల తన చిరునామాగా బ్రతికి చైతన్య దీప్తి అయిన ఈ మహనీయుడికి జ్ఞానపీఠం అవార్డు రావడం లోనే ఆశ్చర్యమేమీ లేదు. భరద్వాజ గారు సాగించిన అవిశ్రాంత రచనా కృషిని ఒక సారి పరిశీలిస్తే తన రచనలలో ఎల్లప్పుడూ తాను చిన్ననాడు అనుభవించిన పేదరికాన్ని ప్రధానంగా పేర్కొంటూ కథలు రాసినట్లు తెలుస్తుంది.

భరద్వాజ గారు తనకథలలో పేదరికం ద్వారా ఎదురయ్యే సమస్యల ప్రభావాన్ని చూపిస్తూ ఈ బీదరికం అన్ని జాతులలో, వర్గాలలో, పేదరికం కారణంగా ఎదురయ్యే సమస్యల వైపు సమాజం యొక్క దృష్టిని మళ్ళించడమే వీరి లక్ష్యమని భావించవచ్చును. కొందరు రచయితలు, సాహిత్యకారులు, ఉన్నతవర్గాల వారు అనుభవిస్తున్న భోగ భాగ్యాలను, విలాస వినోదాలను కథా వసువులుగా చేసుకుని అనేక కథలు రాస్తున్నారు. నేటి యువతను చెడు మార్గంలో ప్రయాణింప చేసే సాహిత్యాన్ని కొంతమంది సమాజం మీద వదలుతున్నారు. చాలా కొద్దిమంది రచయితలే బీదరికాన్ని ఎదుర్కొన్న వ్యక్తుల గూర్చి సమాజిక అభివృద్ధి కోసం రచనలు చేస్తున్న వారిలో రావూరి భరద్వాజ గారు ముఖ్యులు.

భరద్వాజ గారు బడుగువర్గాల వారి జీవితాలనే తన కథావస్తువుగా తీసుకుని కథలను రాసేవారు. వీరి రచనలలో తినడానికి, ఉండడానికి నీడలేక, కట్టుకోవడానికి బట్టలు లేక బాధపడే వ్యక్తుల గాథలను వారి సమాజిక పరిస్థితులనే ఆధారం చేసుకుని కథలు రాసేవారు. వీరి కథలలో ఎక్కడా కులాన్ని గాని, జాతిని గూర్చి కాని, కథలను రాయడానికి ఇష్టపడరు వీరు. బీదరికంలో అనేది అన్ని జాతులలో కన్పిస్తుంది. బీదరికం మరణం రెండింటిలో బీదరికం ఎక్కువ బాధ కనిపిస్తుంది. ఎందుకంటే మరణం ఒకసారి బాధ కలిగిస్తే బీదరికం ఆజన్మాంతం బాధ కలిగిస్తుంది. సామజిక స్పృహకలిగిన భరద్వాజగారు తన జీవితంలోని దారిద్ర్యాన్ని అనుభవిస్తూ అన్నో ఆటుపోటులను అసమానతలను ఎదుర్కొన్నారు. తన జీవితంలో ప్రేరణ పొంది కథలను రచించారు.

భరద్వాజ గారి కథలలో వర్ణించబడ్డ వారంతా పేద వాళ్ళు, పీడితులు, తాడితులు, దేశంలోని కనిపించని నియంతృత్వానికి బానిసలైవారు, ప్రవృత్తుల్ని పరమ రమణీయంగా

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

చిత్రించారు భరద్వాజ గారు కూలి వాడు, ఆఫీసులో పనిచేసే నౌకరు, గుమస్తా, అధ్యాపకుడు, రచయిత, ఇంజనీరు లాంటి వారు కూడా బీదరికపు చీకటిలోచిక్కిన్నట్లు భరద్వాజ గారు పూట భోజనం సంపాదించుకోవడం కష్టం. ఇంటిలో ఎవరి కైనా అనారోగ్యం వచ్చిన, పండుగలు వచ్చినా లేదా కరువు సంభవించినా వారు బీదరికంలోకి కూరుకుపోతారు. ఇలాంటి పాత్రలను భరద్వాజగారు తన చుట్టూ ఉన్న సమాజం నుండే తీసుకుని తన కథలతో మన ముందు ఉంచేవారు. అలాంటికథలను కొన్నింటిని పరిశీలిద్దాం.....

మానవుడు మరణిస్తున్నాడు అనే కథలో భరద్వాజ గారు సాధారణ ఆవసరాలు పూర్తిచేస్తుకోలేక బ్రతికే వ్యక్తులను దృష్టిలో ఉంచుకుని ఇలా అంటారు. కొందఇలా దుర్భర దారిద్ర్యం అనుభవించడానికి, మరికొందరు సుఖపడ డానికి, కర్మకారణం కానేకాదు. కోట్లనిండా గుడ్డల తానులు మూలుగుతున్నాయి. కానీ అర్ధనగ్నంగా కోట్లాది మానవులు బాధపడుతున్నారు. ఆహారధాన్యాలు గోదాముల్లో ముగ్గి పోతుంటే, కేవలం తిండి లేక లక్షలాది ప్రజలు నకనక లాడుతున్నారు. బీరువాల నిండా మందులు వున్నాయి. కానీ మందుల్లేక మనుషులు చస్తున్నారు. ప్రజలు ఎందుకిలా వుండాలి అని రచయిత ఎదురై ప్రశ్న వేస్తారు. మానవుడు తన రక్షణ కోసం ఇంటిని ఏర్పాటు చేసుకుంటాడు ఎండా, వాన మొదలైన వాటి నుండి తప్పించుకోవడానికి ఇల్లు కట్టుకుంటారు. పెద్దమేడ లేకపోయినా పూరిల్లు అయినా ఉంటే చాలు అదికూడా లేక రోడ్డు ప్రక్కన, చెట్టునీడన తలదాచుకోనే అభాగ్యులను తన కథలలో చిత్రించారు డాక్టర్ భరద్వాజ గారు.

“నాకు దేవుని చూడాలని ఉంది కథలో తిండి బట్టల కొరతకు లోనై ఇతరుల దగ్గర పనిచేసి జీవితం గడిపే ఒక బాలుడి గూర్చి చెబుతూ” పదేళ్ళ కుర్రోడి పేరు బ్రహ్మజి అతనికి ఒంటిమీద చొక్కాలేదు, జుత్తుకు నూనె లేదు, మంచి నిక్కరు కూడా లేదు, చేతులు నిండా మసి, మరో కుర్రాడికి చిరిగిన బన్నీను ఉంది చేతు నిండా, ముఖం నిండా, ఒంటి నిండా మసి, ఇద్దరికి అమ్మ, నాన్నల ఉన్నారు. వారి చీరలు కప్పుకోవడానికి చొక్కాలు కూడా లేవని కనీసం తలకు రాసుకోవడానికి నూనె కూడా లేదని వర్ణించారు.

అధిక సంతానం వలన కలిగే అనర్ధాలను గూర్చి “మూడనిద్ర” అనే కథ ద్వారా ఇలా వివరించారు. ఈ కథలో శివరామయ్య భార్య వరుసగా ముగ్గురు ఆడపిల్లల్ని, ఇద్దరు మగపిల్లల్ని ప్రసవించింది. అసలే అంతంత మాత్రంగా ఉన్న సంసారం. పిల్లలు ఎక్కువ వుండటం వలన శివరామయ్య సంపాదన ఎక్కడకి సరిపోవడం లేదు, ఆదాయాన్ని పెంచుకోవడం కోసం అతను అనేక ప్రయత్నాలు చేశాడు, రాత్రింబవళ్ళు ఒళ్ళు దాచుకోకుండా శ్రమించేవాడు కానీ ఎంతశ్రమించినా ఎంత కష్టపడ్డా కనుబొమ్మల మీది వెంట్రుకలులాగా శివరామయ్య ఆదాయం మాత్రం పెరగలేదు, కూటికి, గుడ్డకూ నానా అగచాట్లు పడుతున్నాడు శివరామయ్య అంటూ ఈ కథ ద్వారా అధిక సంతానం వలన పేద వారు పడే ఇబ్బందులను వివరించాడు.

బీదరికం కారణంగా తన ఆత్మభిమానాన్ని చంపుకుని, ఇతరుల పీడనకు లోబడి జీవించే స్థితిని మళ్ళీ తెల్లవారింది. అనేక కథలో ఇలా వివరించారు. సంవత్సరాల కొద్ది తాలుకా ఆఫీసులో పనిచేశాడు తురంగరావు, తన జీవితాన్నాంతా ఆఫీసుకే అంకితం చేశాడు. తన స్వీయాభిరుచుల్ని కట్టిపెట్టి అందరికి దాసోహమవడం అలావాటైపోయింది. పై అధికారి అభిరుచులే తురంగరావు అభిరుచువయ్యాయి. అతగాడి ఇష్టాలే మనవాడి ఇష్టాలైనాయి. ఇలా బీదవారికి సొంత కోరికలు ఏమీ ఉండవని, వున్నా వాటిని తీర్చుకునే స్థోమత ఉండరాదని ఈ కథలో వివరించారు.“ఒక చీమకథ” లో సమాజంలో వ్యాపించి వున్న అవ్యవస్థను ఈవిధంగా చిత్రిస్తాడు రచయిత. మీరు ఎలా బతుకుతున్నది నేను చూస్తూనే ఉన్నాను మీ చుట్టూ ఉన్నవారు తిండిలేక మలమలా మాడి చస్తుంటే, మీరు విందులు చేసుకొంటు ఉండే మీ చుట్టు వున్న వారికి జౌనెడు గడ్డతో మానం దాచుకోలేక సిగ్గు పడుతుంటే, మీ గోదాముల నుండా, కొనేదిక్కులేక గుడ్డలు తానులు మగ్గిపోతున్నాయి. మీ అంత నీచమైన ప్రాణులను నేను ఎక్కడా చూడలేదు మీ ఆశకు అంతులేదు. ప్రపంచం

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

లోని ధనం మొత్తం తెచ్చి ఇచ్చినా మీకు అప్పటికి సంతృప్తి ఉండదు అప్పుడు కూడా దోచుకోవడానికి ప్రయత్నిస్తూ ఒకరికి ఒకరు మోసంచేస్తూ, దోచుకుంటా దగా చేసు కొంటారు. మరొకరి సొత్తుకు ఆశపడకుండా మీరు బ్రతక లేరు. మీది కాని దానికోసం, అల్లాడి పోవడమన్నది మీ జీవలక్షణమయిపోయింది అంటూ ఈ సమాజంలో వున్న కుళ్ళును చీమల మాటల ద్వారా మనకు తెలియజేశారు.

భరద్వాజ గారి రచనల్లో ఎల్లప్పుడు పేదరికం, దరిద్రం, ఆకలి కేకలు కనిపిస్తాయి వారి వాక్యాలు కొన్ని పచ్చిగా ఉంటాయి. వాతలు పెడతాయి, అతను వాడే మాటల పాతవే కావచ్చు కానీ, వాటిలోకి కొత్త ఊపిరులు నింపి, వేడిని, వాడిని చొప్పించి సరికొత్త రంగులో వెలిగేలా చూస్తాడు. అతని రచనల్లో జనజీవితం కనబడుతుంది. అతని రచన లలో జీవితం కనబడుతుంది, ఆ జీవితంలోని కల్లోల ప్రభం జనం కనబడుతుంది. భరద్వాజ గారి కలానికి పదునుకంటే మొత్తదనం ఉంది. క్లిష్టత కంటే సారళ్యం ఉంది. వివరణాత్మ కంగా తెలియని వారికి తెలియజెప్పాలనే తపనలో భరద్వాజ గారి రచనలు సాగుతాయి. కావున రావూరి భరద్వాజ గారి రచనలు మన అందరికి ఆదర్శం వారు చూపిన దారిలో మన మందరం ముందుకు వెళ్ళాలని ఆశిస్తాను.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

2. Account Name,
PRINCIPAL, J.M.J. COLLEGE
FOR WOMEN, TENALI



జాతీయ సదస్సు






# జె.యం.జె. మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), తెనాలి.

అనుబంధం : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 522 201.